# వాల్మీకి రామాయణము

పుల్లెల శ్రీరామచంద్రుడు

## ఉత్తర కాండము



# వాల్మీకి రామాయణము

## యథామూలానువాదము

# ఉత్తరకాండము

పద్మశ్రీ పురస్కృత, మహామహోపాధ్యాయ

**ఆచార్య డా. పుల్లెల శ్రీరామచంద్రుడు**

# వాల్మీకి రామాయణము

యథామూలానువాదము

ప్రథమముద్రణ 2013

ప్రతులు 10,000

**మూల్యం**
**(ఏడు కాండల సెట్)రూ. 495/- (US $ 15)**



రచన : **ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు**

చిత్రకారుడు : బాపు

9788192771519

ప్రకాశకులు:

**T.L.P Publishers**
**A Division of Excellent Enterprises**
క్విన్‌హౌస్, సాగర్‌సొసైటీ రోడ్,
బంజారాహిల్స్, రోడ్ నెం. 2, హైదరాబాదు - **500034.**
ఫోన్: +91 040 23542515

ముద్రణ:
**కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్.

# ఉత్తరకాండ విషయసూచిక

శ్రీః

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

# శ్రీమద్రామాయణము

# ఉత్తరకాండము

## మొదటి సర్గము

**రాముని సభకు మహర్షులు వచ్చుట. వారితో రాముడు సంభాషించుట.**

రాక్షసులను సంహరించిన పిమ్మట రాముడు రాజ్యమును పొంది యుండగా అతనిని అభినందించుటకై మును లందరూ వచ్చిరి. తూర్పుదిక్కునందు నివసించుచున్న కౌశికుడు, యవక్రీతుడు, గార్గ్యుడు, గాలవుడు, మేధాతిథి పుత్రుడైన కణ్వుడు ఆ ప్రాంతమునుండి వచ్చిరి. దక్షిణదిక్కునందు నివసించు ఆత్రేయుడు, నముచి, ప్రముచి, అగస్త్యుడు, అత్రి, సుముఖుడు, విముఖుడు, అగస్త్యుని ముందు ఉంచుకొని వచ్చిరి. పశ్చిమదిక్కునందు నివసించు నృషంగుడు, కవషి, ధౌమ్యుడు, కౌషేయు డను మహర్షి – ఈ ఋషులు శిష్యులతో వచ్చిరి. నిత్యమూ ఉత్తరదిక్కునందు నివసించు వసిష్ఠుడు, కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, భరద్వాజుడు అను ఏడుగురు ఋషులు కూడా వచ్చిరి. అగ్నితో సమానమైన కాంతి గల, వేదవేదాంగములందు పండితులు, వివిధశాస్త్రములలో సమర్థులు అయిన ఈ మహాత్ములు రాముని గృహము చేరి, ద్వారపాలకుని ద్వారా రామునకు తెలుపుటకై నిలచిరి. ధర్మాత్ముడైన అగస్త్యమహాముని ద్వారపాలకునితో "ఋషులమైన మేము వచ్చినట్లు రామునకు చెప్పుము" అని పలికెను. (1–8)

ద్వారపాలకుడు అగస్త్యుని మాట విని, శీఘ్రముగా పరుగెత్తుచున్నట్లుగా వెంటనే, మహాత్ముడైన రాముని సమీపమునకు వెళ్ళెను. నీతిని, ఇతరుల మనోభావమును ఎరిగినవాడు, మంచి నడవడిక కలవాడు, సమర్థుడు, ధైర్యవంతుడు అయిన ఆ ద్వారపాలకుడు చంద్రునితో సమానమైన కాంతిగల ఆ రాముణ్ణి చూచి అగస్త్యమహాముని వచ్చినట్లు చెప్పెను. బాలసూర్యుని వంటి కాంతిగల మునులు వచ్చినట్లు విని రాముడు ద్వారపాలకునితో "వారిని సుఖముగా ప్రవేశపెట్టుము" అని పలికెను. రాముడు, వచ్చిన ఆ మునులను చూచి, ప్రత్యుత్థానము చేసి, అంజలి ఘటించి, నమస్కరించి, ఆదరపూర్వకముగా ఎద్దును సమర్పించి, పాద్యార్ఘ్యాదులతో



అర్చించి, వారికి ఆసనములను చూపెను. ఆ ఋషిపుంగవులు బంగారముచేత చిత్రములైన, అడుగున కుశలు పరచిన, మృగచర్మముతో కూడిన శ్రేష్ఠములైన ఆ గొప్ప ఆసనములమీద తగు విధముగా కూర్చుండిరి.(9-15)

రాముడు కుశలప్రశ్న చేయగా, శిష్యులతోను, ముందు నడచు పరివారముతోను కూడిన ఆ వేదవేత్తలైన మహర్షులు రామునితో - రామా! మేము అన్నివిషయములయందు క్షేమముగా ఉన్నాము. శత్రువులను చంపి క్షేమముగా ఉన్న నిన్ను అదృష్టవశముచేత చూచుచున్నాము. రాజా! రావణుణ్ణి అదృష్టవశముచేత నీవు చంపినావు. రామా! పుత్రపౌత్రసహితుడైన ఆ రావణుడు నీకొక పెద్ద బరువు కాదుకదా! ధనుస్సు చేతపట్టిన నీవు మూడు లోకములనూ కూడ జయించగలవు; సందేహము లేదు. నీవు భాగ్యవశముచేత పుత్రపౌత్రవంతుడైన రావణుణ్ణి చంపినావు. విజయవంతుడవై సీతాసమేతుడవై ఉన్న నిన్ను భాగ్యవశముచేత ఈనాడు చూడగల్గుచున్నాము. ధర్మాత్ముడవైన రాజా! నీకు హితమును చేయువాడైన సోదరుడు లక్ష్మణునితోను, తల్లులతోను, ఇతర సోదరులతోను కూడిన నిన్ను అదృష్టవశముచేత ఇప్పుడు చూడగల్గుచున్నాము. అదృష్టవశముచేత నీవు ప్రహస్తుడు, వికటుడు, విరూపాక్షుడు, మహోదరుడు, ఎదిరింపశక్యముకాని అకంపనుడు - ఈ రాక్షసులను సంహరించినావు. ఎవని ప్రమాణమును మించిన ప్రమాణము ఈ ప్రపంచకములో లేదో అట్టి కుంభకర్ణుని, మహాపరాక్రమము గల రాక్షసులైన త్రిశిరస్సును, అతికాయుణ్ణి, దేవాంతక నరాంతకులను చూచువారికి భయంకరులుగా ఉండు రాక్షసులైన, కుంభకర్ణుని పుత్రులైన, కుంభ-నికుంభులను అదృష్టవశముచేత నీవు యుద్ధములో చంపితివి."(16-24)

"ప్రళయకాలమునందు సంహారము చేయు యమునితో సమానులైన యుద్ధోన్మత్త-మత్తులు, బలవంతుడైన యజ్ఞకోపుడు, ధూమ్రాక్షుడు, ఘోరమైన యుద్ధముచేయు శస్త్రాస్త్రములయందు నిపుణులైన ఈ రాక్షసు లందరినీ, యముని వంటి బాణాలచేత సంహరించినావు. దేవతలు కూడ చంపజాలని, రాక్షసరాజైన రావణునితో ద్వంద్వ యుద్ధములో పాల్గొని అదృష్టవశముచేత విజయమును పొందినావు. యుద్ధములో (ప్రత్యక్షముగా కనబడే) రావణుని చంపుట అంత గొప్ప పనికాదు. కాని ద్వంద్వయుద్ధములో నిలచిన ఇంద్రజిత్తును నీవు(నీ సోదరుడు) అదృష్టవశముచేత చంపినావు. ఓ! వీరుడా! యముడువలె శీఘ్రముగా మీదికి వచ్చుచున్న ఆ ఇంద్రజిత్తునుండి తప్పించుకొని అదృష్టవశముచే నీవు విజయమును పొందినావు. నీవు ఇంద్రజిత్తును చంపినవార్త విని మేమందరము అభినందించుచున్నాము. యుద్ధములో అతనిని ఎవ్వరూ కూడ చంపజాలరు. అందుచేత అతడు సంహరింపబడినట్లు విని మాకు చాలా ఆశ్చర్యము కలిగినది. రఘువంశీయుల కులమును వృద్ధిపొందించిన ఓ! రామా! నీవు అదృష్టవశముచేత ఈ రాక్షసులను, స్వేచ్ఛారూపధారులైన చాలమంది ఇతరరాక్షసులను చంపినావు. వీరుడవు, శత్రుసంహారకుడవు అయిన ఓ! రామా! పుణ్యమైన, సౌమ్యమైన ఈ అభయదక్షిణను ఇచ్చి జయముతో వృద్ధి పొందుచున్నావు"అని పలికిరి.(25-32)

పవిత్రమైన మనస్సు గల ఆ మునుల వచనమును విని రాముడు ఆశ్చర్యపడుచు, చేతులు జోడించి నమస్కరించుచు- "గొప్ప పరాక్రమము గల కుంభకర్ణుణ్ణి, రావణుణ్ణి, కాదని మీరు ఇంద్రజిత్తును ఎందుకు ఇంతగా ప్రశంసించుచున్నారు? గొప్ప పరాక్రమము గల మహోదర-ప్రహస్త-విరూపాక్షులను, మత్తోన్మత్తులను, ఎదిరింపశక్యముకాని దేవాంతక నరాంతకులను కాదని ఇంద్రజిత్తును ఎందుకు ప్రశంసించుచున్నారు? అతికాయుణ్ణి, త్రిశిరస్సును, ధూమ్రాక్షుణ్ణి, మహాబలవంతులైన వీళ్లనందరినీ కాదని ఇంద్రజిత్తును ఎందుకు ప్రశంసించుచున్నారు? అతని ప్రభావము ఎట్టిది? బలము ఎట్టిది? పరాక్రమము ఎట్టిది? అతడు ఏ కారణముచేత రావణునికంటె గొప్పవాడు? నేను వినుటకు యోగ్యమైనచో, చెప్పుటకు అది రహస్యముకానిచో, నేను వినవలెనని కోరుచున్నాను; చెప్పుడు; కాని మిమ్ములను ఆజ్ఞాపింపజాలను. అతడు దేవేంద్రుణ్ణి కూడ ఎట్లు జయించినాడు? వరములు ఎట్లు పొందినాడు? కుమారుడే ఎట్లు అధికబలవంతుడు? తండ్రి ఎందువలన కాడు? ఓ మునీంద్రా! అడుగుచున్న నాకు ఇతనికి సంబంధించిన ఈ విషయములన్నీ చెప్పుము" అని ప్రశ్నించెను.(33-40)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని మొదటి సర్గము సమాప్తము.**

# రెండవ సర్గము

**అగస్త్యుడు పులస్త్యుని తపస్సును వర్ణించి చెప్పి అతనికి విశ్రవస్సు పుట్టుటను చెప్పుట.**

మహాత్ముడైన రాముని మాటలు విని గొప్ప తేజస్సు గల అగస్త్యు డిట్లు పలికెను – "రామా! ఏ తేజోబలాదులచేత ఈ ఇంద్రజిత్తు శత్రువులను వధించెనో, తాను వధింపశక్యముకానివాడై ఉండెనో అట్టి వాని చరితమును, తేజస్సును, గొప్ప బలమును వినుము. ముందుగా రావణుని కులమును, జన్మను, అతడు సంపాదించిన వరములను గూర్చి నీకు చెప్పెదను. పూర్వము కృతయుగమునందు బ్రహ్మదేవుని కుమారుడు, సాక్షాత్తు బ్రహ్మదేవుని వంటివాడు అయిన, సమర్థుడైన పులస్త్యు డను బ్రహ్మర్షి ఉండేవాడు. అతని ధర్మమునకు, శీలమునకు సంబంధించిన గుణములు వర్ణింప శక్యములు కానివి. అతనిని పేరుచేత ప్రజాపతిపుత్రు డనియే చెప్పవలెను. ఆ పులస్త్యుడు ప్రజాపతిపుత్రు డగుటచేత దేవతలకు ఇష్టుడు. గొప్ప బుద్ధిగల అతడు పరిశుద్ధములైన గుణములచేత సమస్తలోకమునకు ఇష్టుడు. ఆ మహాముని ధర్మాచరణమునందు ఆసక్తిచేత మేరుమహాపర్వత పార్శ్వమునం దున్న తృణబింద్వాశ్రమమునకు వెళ్ళి అక్కడ నివసించెను. (1-7)

అతడు స్వాధ్యాయమునందు ఇంద్రియములను ఏకాగ్రము చేసి తపస్సు చేసెను. కన్యకలు అతని ఆశ్రమమునకు వెళ్ళి విఘ్నము చేయుచుండిరి. ఋషికన్యలు, నాగకన్యలు, రాజర్షికన్యలు, అప్సరఃస్త్రీలు క్రీడించుచు ఆ ప్రదేశమునకు వచ్చుచుండిరి. ఆ వనము అన్ని ఋతువులలోను అనుభవించుటకు యోగ్యమై అందముగా ఉండుటచేత ఆ కన్యకలు నిత్యము ఆ వనమునకు వెళ్ళి క్రీడించుచుండిరి. ఆ ప్రదేశము సుందరమగుటచేత దోషరహితలైన ఆ కన్యలు అక్కడ గానము చేయుచు, వాద్యములు వాయించుచు, నాట్యమాడుచు తపఃశాలియైన ఆ మునికి విఘ్నము చేసిరి. అప్పుడు మహాతేజఃశాలియైన ఆ మహాముని కోపించి "నా కంట బడిన స్త్రీ గర్భము ధరించును" అని పలికెను. ఆ కన్యకలందరూ ఆ పులస్త్యుని మాట విని, బ్రాహ్మణశాపమునకు భయపడి ఆ ప్రదేశమునకు వెళ్ళుట మానివేసిరి. (8-13)

కాని రాజర్షియైన తృణబిందువు పుత్రిక ఆ విషయము వినకపోవుటచే ఆ ఆశ్రమమునకు వెళ్ళి అక్కడ నిర్భయముగా సంచరించెను. అక్కడ ఆమెకు ఏ సఖురాలూ కూడ వచ్చి నట్లు కనబడలేదు. ఆ సమయమునందు, అక్కడ గొప్ప తేజస్సు గల, తపస్సుచేత పవిత్రుడైన, ప్రజాపతిపుత్రుడైన మహర్షి స్వయముగా స్వాధ్యాయాధ్యయనము చేయుచుండెను. ఆమె ఆ వేదధ్వనిని విని, ఆ మహర్షిని

చూడగానే స్పష్టమైన గర్భముతో తెల్లని దేహము గలదిగా అయెను. ఆమె తనలో గలిగిన ఆ దోషమును చూచి, దిగులుచెందెను. నాకు ఇదేమి, ఇట్లు జరిగినది? అని ఆలోచించుకొనుచు తిరిగి వెళ్ళి తండ్రి ఆశ్రమములో ఉండెను. అప్పుడు తృణబిందువు ఆ విధముగా ఉన్న ఆమెను చూచి "నీ శరీరము ఉండవలసిన విధముగా లేదు; ఇది ఏమి?" అని ప్రశ్నించెను. ఆ కన్య దీనురాలై, అంజలి ఘటించి – "తండ్రీ! నా రూపము ఇట్లు ఎందుచేత అయినదో నాకు తెలియదు. కాని పూర్వమొకనాడు నా సఖురాళ్ళను వెదకుచు పవిత్రమైన మనస్సుగల పులస్త్యమహర్షి ఆశ్రమమునకు ఒంటరిగా వెళ్ళి ఉన్నాను. అక్కడకి ఏ సఖురాలూ కూడ వచ్చినట్లు కనబడలేదు. కాని నా రూపములో మార్పు కలుగుట చూచి, భయముతో ఇక్కడికి వచ్చినాను" అని చెప్పెను. (14–22)

తపస్సుతో ప్రకాశించుచున్న రాజర్షియైన తృణబిందువు ధ్యానములో ప్రవేశించి అది ఋషిశాపమువలన కలిగినదని గ్రహించెను. అతడు పవిత్రమైన మనసుగల ఆ మహర్షి శాపమును తెలిసికొని, కుమార్తెను తీసికొని వెళ్ళి పులస్త్యునితో– "పూజ్యుడవైన ఓ! మహర్షీ! ఈమె నా కుమార్తె. తన గుణములచేతనే అలంకరించబడినది. ఈమెను తనంతట తానుగా వచ్చిన భిక్షనుగా స్వీకరింపుము. తపస్సు చేయుచు శ్రమపడుచున్న, ఇంద్రియములు గల నీకు నిత్యమూ శుశ్రూష చేయుటయందే ఈమె ఆసక్తి గలదై ఉండగలదు; సందేహము లేదు" అని ప్రార్థించెను. ధార్మికుడైన ఆ రాజర్షి పలికిన పలుకులు విని ఆ బ్రాహ్మణుడు ఆ కన్యను స్వీకరించుటకు నిశ్చయించుకొని, "అట్లే అగుగాక" అని పలికెను. రాజు కుమార్తెను అతనికి ఇచ్చి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. ఆ కన్య కూడ తన గుణములచేత భర్తను సంతోషపెట్టుచు అక్కడ నివసించెను. (23–28)

ఆ మునిశ్రేష్ఠుడు ఆమె శీలముచేతను, నడవడికచేతను చాల సంతోషించి "ఓ! సుందరీ! నీ గుణసంపదకు చాలా సంతోషించినాను. అందువలన నీకు, ఇప్పుడు ఉభయవంశములను ఉద్ధరించు పౌలస్త్యు డను కుమారుణ్ణి ఇచ్చెదను. నేను ఇక్కడ వేదాధ్యయనము చేయుచుండగా నీవు విని ఉన్నావు కదా? అందుచేతనే వానికి "విశ్రవసుడు" అను పేరు వచ్చును; సందేహము లేదు." ఆ దేవి ఆ మాటలు విని చాలా సంతోషించెను. ఆమె అచిరకాలమునందే మూడు లోకములలో ప్రసిద్ధుడు. యశోధర్మములతో ప్రకాశించువాడు అయిన విశ్రవసుడు అను పుత్రుణ్ణి కనెను. మునియైన విశ్రవస్సు తండ్రివలె వేదపారంగతుడు, సమదృష్టి కలవాడు. వ్రతములందు, ఆచారములయందు ఆసక్తుడు, తపఃశాలి అయి ఉండెను. (29–33)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని రెండవ సర్గము సమాప్తము.**

# మూడవ సర్గము

## విశ్రవసుని పుత్రుడైన వైశ్రవణుడు తపస్సుచే వరములు పొంది లంకలో నివసించుట.

పులస్త్యుని కుమారుడైన మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు అల్పకాలమందే తండ్రివలె తపోనిష్ఠాగరిష్ఠు డాయెను. స్వాధ్యాయాధ్యయనమునందు ఆసక్తుడై, ఇంద్రియనిగ్రహముతో పవిత్రుడుగా ఉన్న అతడు సత్యసచ్ఛీలములతో ఏ భోగములయందును ఆసక్తి లేనివాడై నిత్యము ధర్మము నాచరించుచుండెను. భరద్వాజమహాముని ఆ విశ్రవసుని మంచి చరిత్రను గూర్చి విని, దేవతవంటి సౌందర్యము గల తన కుమార్తెను అతనికి భార్యగా ఇచ్చెను. సకలధర్మములు తెలిసిన మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు, చాల సంతోషించుచు, సంతానము కనవలె నను ఆలోచనతో, పుట్టబోవు పుత్రుని శ్రేయస్సు కోరుచు ఆ భరద్వాజుని కుమార్తెను ధర్మానుసారముగా స్వీకరించి ఆమెయందు పరాక్రమవంతుడు, చాల ఆశ్చర్యమును కల్గించువాడు, సమస్తమైన బ్రాహ్మణగుణములతో కూడినవాడు అయిన పుత్రుణ్ణి జనింపచేసెను. అతడు పుట్టుటచే పితామహుడైన పులస్త్యుడు సంతోషించెను. అతని శ్రేయస్కరమైన బుద్ధిని గుర్తించి "ఇతడు ధనాధ్యక్షుడు కాగలడు"అని పలికెను. అప్పుడు దేవర్షులతో కూడి సంతోషపూర్వకముగా ఇతనికి నామధేయము చేసెను. విశ్రవసుని పుత్రుడైన ఇతడు విశ్రవసుని పోలికలో ఉన్నాడు. అందుచేత ఇతడు వైశ్రవణుడని ప్రసిద్ధిపొందగలడు.(1-8)

తపోవనమునందున్న వైశ్రవణుడు ఆహుతులు హోమము చేసిన అగ్నివలె గొప్ప తేజస్సుతో పెరిగెను. ఆశ్రమములో నివసించుచున్న మహాత్ముడైన ఆ వైశ్రవణునకు - "ధర్మమే అత్యుత్తమగతి గాన ధర్మమును ఆచరించెదను" అను బుద్ధి కలిగెను. అతడు వేలకొలది సంవత్సరములు మహావనమునందు తపస్సుచేసి, ఉగ్రములైన నియమములు పాటించుచు చాల గొప్ప తపస్సు చేసెను. వేయి సంవత్సరముల కాలము పూర్తి అయిన పిమ్మట అతడు జలము మాత్రమే త్రాగుట, వాయువు మాత్రమే ఆహారముగా తీసుకొనుట, ఇతర అహారమేమీ తీసుకొనకపోవుట మొదలైన ఆ యా నియమములు పాటించెను. ఈ విధముగా వేలకొలది సంవత్సరములు ఒక్క సంవత్సరముగా గడిచిపోయెను. బ్రహ్మదేవుడు సంతోషించి, ఇంద్రునితో కూడిన దేవతాగణములతో కూడ అతని ఆశ్రమమునకు వెళ్ళి- "నాయనా! మంచి నియమములు కలవాడా! ఈ నీ తపస్సుకు సంతోషించినాను.

గొప్ప బుద్ధికలవాడా! నీవు వరములకు తగినవాడవు; వరము కోరుకొనుము. నీకు క్షేమమగుగాక" అని పలికెను. అప్పుడు వైశ్రవణుడు వచ్చిన బ్రహ్మదేవునితో ఇట్లనెను. - "పూజ్యుడా! లోకపాలత్వమును, ధనాధిపత్యమును కోరుచున్నాను" అనెను. (9-15)

దేవతాగణములతో కూడిన బ్రహ్మదేవుడు సంతోషించిన మనస్సుతో, ఆనందపూర్వకముగా వైశ్రవణునితో - "తప్పక అట్లు అగుగాక. ధర్మములు తెలిసిన ఓ! వైశ్రవణుడా! ప్రస్తుతము లోకపాలురుగా ఉన్న యమ-ఇంద్ర-వరుణులు కాక మరొక నాల్గవ లోకపాలుణ్ణి సృష్టించవలె నని అనుకొనుచున్నాను. అందుచేత నీ కిష్టమైన లోకపాలత్వమును పొందుము. నిధులకు అధిపతివిగా కూడ అగుము; నీవు ఇటుపై ఇంద్ర-వరుణ-యములకు నాల్గవవాడవు కాగలవు. నీవు సంచారము చేయుటకై సూర్యునితో సమానమైన ఈ పుష్పకవిమానమును స్వీకరించుము; దేవతలతో సమానుడవు అగుము. నాయనా! నీకు క్షేమ మగుగాక. మేమందరము వచ్చినట్టే తిరిగి వెళ్ళెదము. నీకు రెండు వరములు ఇచ్చి మేము కృతకృత్యులము అయినాము" అని పలికెను. (16-20)

బ్రహ్మదేవుడు ఈ విధముగా పలికి దేవతలతో కూడ స్వస్థానమునకు వెళ్ళెను. బ్రహ్మాదిదేవతలందరు ఆకాశమార్గమున వెళ్ళిపోయిన పిమ్మట, మనోనిగ్రహము గల ఆ వైశ్రవణుడు తండ్రితో - "పూజ్యుడా! బ్రహ్మదేవునినుండి ఇష్టమైన వరమును పొందినాను. కాని ఆ బ్రహ్మదేవుడు నాకు నివాసస్థానమును ఏర్పరుపలేదు. సర్వసమర్థుడవైన ఓ! పూజ్యుడా! నాకొరకై ఏ ప్రాణికీ కూడ పీడకలగని నివాసస్థానమును చూడుము" అని ప్రార్థించెను. విశ్రవసుడు పుత్రుని మాటలు విని "ఓ! సత్పురుషుడా! వినుము. దక్షిణసముద్రతీరమునందు త్రికూట మను పర్వత మున్నది. దాని పైభాగమున మహేంద్రుని నగరమువంటి విశాలమైన నగరమున్నది. లంక అను, రమ్యమైన ఇంద్రుని అమరావతి వంటి ఆ నగరమును రాక్షసుల నివాసార్థమై విశ్వకర్మ నిర్మించెను. నీవు ఆ లంకలో నివసించుము. నీకు క్షేమ మగుగాక; సంశయము లేదు. బంగారు ప్రాకారము, గడియలూ, యంత్రములూ, ఆయుధములూ, బంగారువికారమైన, వైడూర్యమాణిక్యములు పొదిగిన ముఖద్వారములూ గల రమ్యమైన ఆ నగరమును పూర్వము విష్ణువునుండి భయముచేత పీడితులైన రాక్షసులు విడిచి వెళ్ళిపోయిరి. రాక్షసు లందరూ రసాతలముక్రిందికి వెళ్ళిపోయినారు. అక్కడ ఎవ్వరూ లేరు. ఈ విధముగా ఇప్పుడు లంక శూన్యముగా ఉన్నది. దానికి ప్రభువు ఎవ్వడూ లేదు. పుత్రా! నీవు అక్కడ నివసించుటకు

సుఖముగా వెళ్ళుము. అక్కడ నీవు నివసించుటలో దోషమూ ఉండదు. ఎవరి బాధా కూడా ఉండదు" అని చెప్పెను.(21-30)

ధర్మాత్ముడైన ఆ వైశ్రవణుడు తండ్రి పలికిన ధర్మసంమతమైన ఆ వాక్యము విని పర్వతశిఖరముమీద ఉన్న లంకను నివాసముగా ఏర్పరుచుకొనెను. ఆ లంక వైశ్రవణుని ఆజ్ఞచేత కొద్దికాలములోనే సంతోషానందములతో కూడిన వేలకొలది నైరృతులతో ఎల్లప్పుడూ నిండియుండెను. ధర్మాత్ముడైన నైరృతశ్రేష్ఠుడైన ఆ వైశ్రవణుడు సముద్రము పరిఖగా ఉన్న ఆ లంకాపట్టణములో సంతోషముతో నివసించెను. అతడు పుష్పకము నెక్కి అప్పుడప్పుడు వినయపూర్వకముగా తల్లిదండ్రుల దగ్గరకు వచ్చుచుండెడివాడు. దేవతాగణములచేతను, గంధర్వగణములచేతను స్తుతింపబడినవాడు, అప్సరస్త్రీల నృత్యములచేత అలంకరించబడిన గృహముగలవాడు అయిన ఆ వైశ్రవణుడు కిరణములచేత సూర్యుడు వలె ప్రకాశించెను."(31-35)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని మూడవ సర్గము సమాప్తము**

# నాల్గవ సర్గము

## రాక్షసవంశవర్ణనము. హేతి-విద్యుత్కేశ-సుకేశుల ఉత్పత్తి.

రాముడు అగస్త్యుని మాటలు విని, పూర్వము లంకలో రాక్షసుల పుట్టుక ఎట్లు జరిగినదా అని ఆశ్చర్యపడెను. అతడు శిరస్సు కదల్చుచు, మాటిమాటికి ఆశ్చర్యము చెందుచు గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణాగ్ని అను మూడు అగ్నులతో సమానమైన శరీరము గల అగస్త్యుని చూచి- "పూజ్యుడా! ఈ లంక పూర్వము కూడ రాక్షసుల నివాసముగా ఉండేదని నీ మాటలు విని నాకు చాలా అధికమైన ఆశ్చర్యము కలుగుచున్నది. రాక్షసులు పులస్త్యవంశమునందే పుట్టినారని మేము విని ఉన్నాము. కాని ఇప్పుడు నీవు, ఇతరవంశీయులందు పుట్టిన రాక్షసులు కూడ ఉండెడివారని చెప్పుచున్నావు. ఆ రాక్షసులు రావణ-కుంభకర్ణ-ప్రహస్త-వికటులకంటెను, రావణపుత్రులకంటెను అధికబలవంతులా? ఓ! మహామునీ! ఆ రాక్షసుల ప్రథమపురుషుడు ఎవరు? బలముచేత మదించిన అతని పేరు ఏమి? వాళ్ళు ఏ అపరాధముచేయుటచేత విష్ణువు వాళ్ళను లంకనుండి తరిమివేసినాడు? నాకు దీనినంతను సవిస్తరముగా చెప్పి సూర్యుడు తమస్సును తొలగించినట్లు నాకు కలిగిన ఈ వేడుకను తొలగించుము" అని కోరెను.(1-7)

అగస్త్యుడు రాముడు పలికిన, సంస్కారముచేత శోభించుచున్న మంగళప్రదమైన వచనమును విని ఆశ్చర్యపడుచు అతనితో ఇట్లనెను– “జలములో పద్మమునుండి పుట్టిన బ్రహ్మదేవుడు పగలు గడిచిన పిమ్మట భూమిక్రింద ఉన్న సముద్రరూపమైన జలమును సృష్టించి రాత్ర్యంతమునందు ఆ ఉదకమునందే విష్ణునాభికమలములో ఉండి, ఆ ఉదకమును రక్షించుటకై జంతువులను సృజించెను. ఆ ప్రాణులు ఆకలిచేత, దప్పికచేత, భయముచేత పీడితులై, “మేము ఏమి చేయవలెను?” అని పలుకుచు, తమను సృష్టించిన ఆ బ్రహ్మదేవుని వద్దకు వినయపూర్వకముగా వెళ్ళిరి. బ్రహ్మదేవుడు వారి నందరినీ మంచి మాటలతో పలకరించి, నవ్వుచు “మీరు ప్రయత్నపూర్వకముగా ఈ జలమును రక్షింపుడు” అని పలికెను. వాళ్ళలో ఆకలిగొన్న కొందరు రక్షించెద మని, ఆకలిగొనని మరికొందరు పూజించెద మని పలుకగా ఆ బ్రహ్మదేవుడు వాళ్ళతో– “మీలో రక్షించెద మని చెప్పినవాళ్ళు రాక్షసులుగాను, పూజించెదమని చెప్పినవాళ్ళు యక్షులుగాను అగుదురుగాక” అనెను. ఆ రాక్షసులలో మధుకైటభులతో సమానులైన, శత్రుసంహారకులైన హేతి, ప్రహేతి అను రాక్షసనాయకులైన సోదరు లుండిరి. వారిలో ప్రహేతి చాల ధార్మికుడు. అతడు తపోవనమునకు వెళ్ళిపోయెను. హేతిమాత్రము వివాహము చేసికొనవలెనని గొప్ప ప్రయత్నము చేసెను. గొప్ప బుద్ధిపరాక్రమములు గల ఆ హేతి తానే స్వయముగా వెళ్లి కోరి, యముని సోదరియైన, చాల భయంకరురాలైన భయ అను కన్యను వివాహమాడెను. (8–16)

పుత్రవంతులలో శ్రేష్ఠుడైన, రాక్షసనాయకుడైన ఆ హేతికి ఆమె యందు విద్యుత్కేశు డను ప్రసిద్ధుడైన పుత్రుడు జనించెను. మహాతేజఃశాలియైన విద్యుత్కేశుడు నీటి మధ్య తామరపువ్వువలె పెరిగెను. ఆ విద్యుత్కేశునకు శుభకరమైన యౌవనము రాగానే అతని తండ్రి వివాహము చేయవలెనని నిశ్చయించెను. వానినిమిత్తమై సంధ్యతో సమానురాలైన సంధ్యాపుత్రికను వరించెను. తప్పక పరునకు ఇవ్వవలసినదే కదా అని ఆలోచించి సంధ్య పుత్రికను విద్యుత్కేశునకు ఇచ్చెను. విద్యుత్కేశుడు సంధ్య కుమార్తెను పొంది, దేవేంద్రుడు శచీదేవితో క్రీడించినట్లు ఆమెతో క్రీడించెను. రామా! సంధ్యాపుత్రియైన సాలంకటంకట కొంత కాలానికి, మేఘపంక్తి సముద్రమునుండి వలె, విద్యుత్కేశునినుండి గర్భమును ధరించెను. ఆ రాక్షసస్త్రీ మందరపర్వతముమీదికి వెళ్ళి అక్కడ, గంగ అగ్నిదేవునినుండి తనకు సంక్రమించిన రుద్రతేజోరూపమైన గర్భమును విడచినట్లు, పిడుగుతో సమానమైన తన గర్భమును ప్రసవించెను. విద్యుత్కేశునితో రమించవలెనను కోరికతో ఆమె ఆ గర్భమును

విడచి, తన ఔరసపుత్రుణ్ణే మరచి భర్తతో కూడ రమించెను. మేఘధ్వనివంటి ధ్వని గల ఆ గర్భము అక్కడనే విడువబడెను.(17-25)

ఆమె ఇట్లు విడచివేయగా శరత్కాలసూర్యునివంటి కాంతిగల ఆ శిశువు తానే నోట్లో పిడికిలి పెట్టుకొని మెల్లగా ఏడ్చెను. అప్పుడు నందిని ఎక్కి వాయుమార్గములో వెళ్ళుచున్న పార్వతీసమేతుడైన పరమేశ్వరుడు ఆ ఏడ్పును వినెను. త్రిపురసంహారకుడైన ఈశ్వరుడు ఏడ్చుచున్న ఆ రాక్షసపుత్రుణ్ణి జాలితో చూచెను. రామా! మహేశ్వరుడు ఆ రాక్షసపుత్రునకు తల్లి వయస్సుతో సమానమైన వయస్సును ఇచ్చెను. (అంతగా పెరుగునట్లు చేసెను). పార్వతికి ప్రియము చేకూర్చుటకై ఆకాశమునందు సంచరించు పురమును కల్పించి ఇచ్చెను. పార్వతి కూడ రాక్షసస్త్రీలకు వెంటనే గర్భము, గర్భము ధరించిన వెంటనే ప్రసవించుట, పుట్టిన వెంటనే శిశు వు తల్లి వయస్సుతో సమానమైన వయస్సు పొందుట - వీటిని వరములుగా ఇచ్చెను. గొప్పవాడు, గొప్ప తేజస్సు కలవాడు అయిన సుకేశుడు ప్రభువైన మహేశ్వరునినుండి ఐశ్వర్యమును పొంది, ఆకాశమునందు సంచరించు నగరమును పొంది దేవేంద్రుడు వలె అంతటా సంచరించెను.(26-32)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నాల్గవ సర్గము సమాప్తము.**

# ఐదవ సర్గము

## సుకేశుని సంతానమైన మాల్యవత్ - సుమాలి - మాలుల సంతానము వర్ణనము.

విశ్వావసువుతో సమానుడైన గ్రామణి అను గంధర్వుడు ధార్మికుడైన, వరములు పొందిన సుకేశుణ్ణి చూచి తన కన్యను ఇచ్చెను. ఆ గ్రామణికి మూడులోకాలలో ప్రసిద్ధురాలైన, రూపయౌవనములతో ప్రకాశించుచున్న రెండవ లక్ష్మీదేవియా అన్నట్లున్న దేవవతి అను కుమార్తె ఉండెను. ధర్మాత్ముడైన అతడు ఆమెను, రాక్షసరాజ్యలక్ష్మిని వలె, సుకేశునకు ఇచ్చెను. వరదానముచేత ఐశ్వర్యవంతుడైన, ప్రియుడైన అతనిని భర్తగా పొంది దేవవతి, ధనమును పొందిన నిర్ధనుడు వలె, చాల సంతోషించెను. ఆమెతో కూడిన ఆ రాక్షసుడు అంజన మను దిగ్గజమునకు పుట్టిన మహాగజము ఆడఏనుగుతో కలసి ప్రకాశించి నట్లు ప్రకాశించెను. రామా! పిమ్మట, సుకేశుడు తగిన సమయమునందు గార్హపత్య-దక్షిణాగ్ని-ఆహవనీయము లను

మూడు అగ్నులతో సమానమైన దేహములు గల, శివునితో సమానులైన, మాల్యవంతుడు, సుమాలి, మాలి అను ముగ్గురు పుత్రులను కనెను. నిర్భయములైన మూడు లోకముల వలె, మూడు అగ్నులవలె, ఉగ్రములైన మూడు మంత్రముల వలె, ఘోరములైన వాతపిత్తశ్లేష్మము లను మూడు దోషములు వలె ఉన్న, త్రేతాగ్నితో సమానమైన తేజస్సు గల సుకేశుని ముగ్గురు పుత్రులు ఉపేక్షించబడిన వ్యాధులు వలె అక్కడ వృద్ధి పొందిరి. (1-8)

తమ తండ్రికి వరములు లభించిన విషయము, తపోబలముచేత ఐశ్వర్యము లభించినట్లు తెలిసికొని ఆ సోదరులు తపస్సు చేయవలెనని నిశ్చయించుకొని, మేరుపర్వతమునకు వెళ్ళిరి. రామా! ఆ రాక్షసులు కఠినములైన నియమములను అవలంబించి, సకల ప్రాణులకు భయమును కలిగించు ఘోరమైన తపస్సు చేసిరి. భూలోకములో దుర్లభములైనవి, సత్య-ఋజుత్వ-శమములతో కూడినవి అయిన తపస్సులచేత, దేవ-అసుర-మానవులతో కూడిన లోకములకు సంతాపము కలిగించుచు తపస్సు చేసిరి. లోకప్రభువైన బ్రహ్మదేవుడు శ్రేష్ఠమైన విమానము నెక్కి వచ్చి సుకేశుని పుత్రులను పిలచి "మీకు వరము లిచ్చెదను" అనెను. ఇంద్రాదిదేవగణములతో కలిసి వచ్చిన బ్రహ్మదేవుడు వరముల నిచ్చు నని తెలిసికొని ఆ రాక్షసులు అంజలులు ఘటించి, చెట్లవలె వణుకుచు- "ప్రభూ! మా తపస్సుచేత సంతోషించినవాడవై మాకు వరములు ఇవ్వదలచినచో, మేము శత్రువులను నశింపచేసేవారము గాను, జయింపశక్యముకానివారముగాను, చిరకాలము జీవించువారముగాను, అత్యధికసామర్థ్యము ఉన్నవారముగాను, పరస్పరము స్నేహము కలవారముగాను అగునట్లు వరమిమ్ము" అని కోరిరి. బ్రహ్మదేవుడు సుకేశుని కుమారులతో "అట్లే అయ్యెదరు" అని పలికి బ్రహ్మలోకానికి వెళ్ళెను. (9-15)

రామా! ఆ రాక్షసు లందరు వరములు పొంది, వరములు పొందుటచేత ఏ మాత్రము భయములేనివారై సురులను, అసురులను బాధించిరి. వాళ్ళచే బాధింపబడిన దేవతలకు, ఋషులకు, చారణులకు, నరకములో ఉన్న నరులకు వలె రక్షకు డెవ్వడూ దొరకలేదు. రామా! పిమ్మట ఆ రాక్షసులు సంతోషించుచు శిల్పులలో శ్రేష్ఠుడు, నాశరహితుడూ అయిన విశ్వకర్మ వద్దకు వెళ్ళి- "ఓజస్సు, తేజస్సు, బలము గలవారు, తమ తేజస్సుచేత గొప్పవారు అయిన దేవతలకు వారి హృదయములకు ఇష్టమగునట్లుగా గృహములు నిర్మించువాడవు నీవే కదా! గొప్ప బుద్ధి గలవాడా! హిమవత్పర్వతము మీద గాని, మేరుపర్వతముమీదగాని, మందరపర్వతముమీదగాని మాకు కూడా గృహమును నిర్మింపుము. మాకు

మహేశ్వరుని గృహమువంటి గృహమును నిర్మింపుము" అని పలికిరి.(16-20)

విశ్వకర్మ దేవేంద్రుని అమరావతితో సమానమైన నివాసమును గూర్చి ఆ రాక్షసులకు చెప్పెను- "రాక్షసప్రభువులారా, దక్షిణసముద్రతీరమునందు త్రికూటము, సువేలము అను రెండు పర్వతము లున్నవి. దేవేంద్రుడు ఆజ్ఞాపించగా నేను నల్లని మేఘములతో సమానమైన టంకములచేత నాలుగువైపులా చెక్కబడిన ఆ త్రికూట పర్వతము శిఖరముమీద ముప్పై యోజనాల వెడల్పు, నూరు యోజనాల పొడవు ఉన్న లంకాపురమును నిర్మించి ఉంటిని. దాని చుట్టూ బంగారు ప్రాకారము ఉన్నది. దాని ముఖద్వారములు బంగారముతో నిర్మింపబడినవి. రాక్షసశ్రేష్ఠులారా! మీరు ఆ నగరములో, అమరావతిని పొంది ఇంద్రాదిదేవతలు వలె, ఎదిరింపశక్యముకాని వారై నివసించండి. లంకాదుర్గము చేరి, అనేకరాక్షసులతో కూడిన మిమ్ములను శత్రువులెవ్వరూ ఎదిరింపజాలరు" అని చెప్పెను.(21-27)

రాక్షసశ్రేష్ఠులైన ఆ ముగ్గురూ విశ్వకర్మ మాటలు విని వేలకొలది అనుచరులతో కూడినవారై ఆ పురమునకు వెళ్ళి నివసించిరి. ఆ రాక్షసులు ధృఢమైన ప్రాకారము, పరిఖా గల వందలకొలది బంగారు గృహములతో కూడిన, లంకను చేరి సంతోషముతో నివసించిరి. రామా! ఆ కాలమునందే స్వేచ్ఛగా సంచరించు నర్మద అను గంధర్వస్త్రీ ఒకతె ఉండెను. ఆ నర్మదకు హ్రీదేవి, శ్రీదేవి, కీర్తిదేవి వంటి ముగ్గురు కుమార్తెలు ఉండిరి. రాక్షసజాతికి చెందని ఆ నర్మద పూర్ణచంద్రుని వంటి ముఖము గల ఆ కన్యలను జ్యేష్ఠక్రమమున, అనగా పెద్దవానికి పెద్ద కుమార్తెను, రెండవవానికి రెండవకుమార్తెను, మూడవవానిని మూడవ కుమార్తెను, సంతోషపూర్వకముగా ఆ సోదరులకు ఇచ్చెను. మహాభాగ్యవతులైన ఆ ముగ్గురు గంధర్వకన్యలను తల్లి ఆ రాక్షసశ్రేష్ఠులకు భగుడు దేవతగా గల ఉత్తరఫల్గునీ నక్షత్రముతో కూడిన దివసము నందు ఇచ్చెను. రామా! అప్పుడు వివాహము చేసికొనిన పిమ్మట సుకేశుని పుత్రులు, దేవతలు అప్సరఃస్త్రీలతో క్రీడించినట్లు క్రీడించిరి.(28-33)

సుందరి అను పేరు గల సౌందర్యవతి మాల్యవంతుని భార్య. అతడు అమెయందు ఏ సంతానమును పుట్టించెనో వినుము. రామా! సుందరియందు మాల్యవంతునకు విరూపాక్షుడు,దుర్ముఖుడు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు, మత్తోన్మత్తులు, సౌందర్యవతియైన అనల అను కన్యా పుట్టిరి. పూర్ణచంద్రుని వంటి ముఖముగల కేతుమతి అను భార్య సుమాలికి ప్రాణములకంటె కూడ గొప్పదిగా

ఉండెను. మహారాజా! రాక్షసుడైన సుమాలి కేతుమతియందు పుట్టించిన సంతానమును గూర్చి వరుసగా వినుము. ప్రహస్తుడు, అకంపనుడు, కాలికాముఖుడు, ధూమ్రాక్షుడు, దంతుడు, సుపార్శ్వుడు, సంహ్రాది, ప్రఘసుడు, భాసకర్ణుడు అను పుత్రులు, తెల్లని చిరునవ్వు గల రాక, పుష్పోత్కట, కైకసి, కుంభీనసి అను కుమార్తెలు సుమాలి సంతానము. సౌందర్యముతో ప్రకాశించునది, పద్మపత్రములవంటి నేత్రములు గలది, శ్రేష్ఠురాలైన యక్షస్త్రీతో సమానురాలు అయిన వసుద అను గంధర్వస్త్రీ మాలికి భార్య అయ్యెను. మాలివలన అమెయందు కలిగిన సంతానము గూర్చి చెప్పెదను; వినుము. అనలుడు, అనిలుడు, హరుడు, సంపాతి అను ప్రసిద్ధులైన విభీషణామాత్యులు మాలి పుత్రులు.(34-43)

ఆ ముగ్గురు రాక్షసులు ఇతర రాక్షసులతోను, చాలామంది పుత్రులతోను కూడినవారై, అధికమైన పరాక్రమముచేత గర్వించినవారై ఇంద్రసహితులైన దేవతలను, ఋషులను, నాగులను, యక్షులను బాధించిరి. యుద్ధములందు మృత్యువుతో సమానమైన తేజస్సు గలవారు, ఎదిరింపశక్యముకానివారు, బ్రహ్మ వరములు ఇచ్చుటచేత మిక్కిలి గర్వితులు అయిన ఆ రాక్షసులు ఎల్లప్పుడు యజ్ఞములకు విఘాతము చేయుచు, వాయువు వలె జగత్తునందు అంతటా తిరుగుచు అందరినీ బాధించిరి.(44, 45)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఐదవ సర్గము సమాప్తము.**

# ఆరవ సర్గము

## రాక్షసులు దేవతలతో యుద్ధము చేయుట. వాళ్ళకు విష్ణువు సాహాయ్యము చేయుట.

ఆ రాక్షసులచేత పీడింపబడిన దేవతలు, తపస్సే ధనముగా గల ఋషులు భయపీడితులై దేవదేవుడైన మహేశ్వరుణ్ణి శరణు జొచ్చిరి. జగత్సృష్టిలయములు చేయువాడు, పుట్టుక లేనివాడు, వ్యక్తము కాని రూపము గలవాడు, సకలలోకములకు ఆధారమైన వాడు, అందరూ ఆరాధించదగిన పరమగురువు, మన్మథశత్రువు, మూడు పురముల శత్రువు, మూడు నేత్రములు గలవాడు అయిన మహేశ్వరునివద్దకు వెళ్ళి, దేవతలు అంజలి ఘటించి, భయముచేత డగ్గుత్తిక పొందిన కంఠస్వరములతో– "ప్రజల ప్రభువైన ఓ! పూజ్యుడా! బ్రహ్మ ఇచ్చిన వరములచేత గర్వించి ఉన్న,

సుకేశుని పుత్రులు ప్రజల నందరినీ బాధించుచున్నారు. ఆ రాక్షసులు మా గృహములను ఆశ్రమములను రక్షణ ఇవ్వని ప్రదేశములుగా చేసివేసినారు. స్వర్గమునుండి దేవతలను వెడలగొట్టి స్వర్గములో దేవతలవలె క్రీడించుచున్నారు. మాలి, సుమాలి, మాల్యవంతుడు వారి ముందు నడచు రాక్షసులు కూడ యుద్ధములో దృప్తులై, నేనే విష్ణువును; నేనే రుద్రుడను; నేనే బ్రహ్మదేవుడను; నేనే దేవేంద్రుడను; నేనే యముడను; నేనే వరుణుడను; నేనే చంద్రుడను; నేనే సూర్యుడను అని చెప్పుచు బాధించుచున్నారు. మహాదేవా! ఆ కారణమువలన భయపీడితులమైన మాకు అభయము ఇమ్ము. భయంకరమైన రూపము ధరించి దేవతల శత్రువులను చంపుము" అని ప్రార్థించిరి. (1-8)

దేవతలందరూ ఈ విధముగా ప్రార్థింపగా జటాధారి, ప్రభువు అయిన శివుడు తనను ఆశ్రయించిన సుకేశుని విషయమున పక్షపాతము గలవా డగుటచేత, దేవగణములతో- "దేవతలారా! వాళ్ళు నేను చంపదగినవారు కాదు. అందుచేత నేను వాళ్ళను చంపను. కాని ఎవడు వాళ్ళను చంపగలడో దానిని గూర్చిన ఆలోచన చెప్పెదను. మహర్షులారా! ఈ ప్రయత్నమునే పురస్కరించుకొని విష్ణువును శరణు పొందుడు. సమర్థుడైన అతడు వాళ్ళను చంపగలడు" అని చెప్పెను. (9-11)

రాక్షసభయముచేత పీడింపబడిన ఆ దేవాదులు మహేశ్వరుణ్ణి "జయ విజయీభవ" అని అభినందించి విష్ణువు దగ్గరకు వెళ్ళిరి. శంఖచక్రధారియైన ఆ శ్రీమహావిష్ణువును నమస్కరించి, స్తుతించి అతనితో, సుకేశుని పుత్రులను గూర్చి భయముతో- "ప్రభూ! అగ్నిత్రయమువంటి సుకేశుని పుత్రులు ముగ్గురు వరదానముచేత మా స్థానములను ఆక్రమించి అపహరించినారు. త్రికూటపర్వతశిఖరముమీద లంక అను ఇతరులు ప్రవేశింపశక్యము కాని పట్టణమున్నది. రాక్షసులు దానియందు నివసించుచు మమ్ముల నందరినీ బాధించుచున్నారు. దేవతల ప్రభువైన ఓ! మధుసూదనా! అట్టి నీవు మా హితము కొరకై ఆ రాక్షసులను చంపుము. నిన్ను శరణుజొచ్చినాము. మాకు గతివి అగుము. ఆ రాక్షసుల ముఖపద్మములు చక్రములచేత ఛేదించి వాళ్ళను యమలోకమునకు పంపుము. భయములు కలిగినప్పుడు అభయమిచ్చువాడు నీవు తప్ప మాకు మరెవ్వరూ లేరు. దేవా! మదముచేత మితిమీరిన ఆ దుష్టరాక్షసులను పరివారసహితముగా యుద్ధములో చంపుము. సూర్యుడు మంచును తొలగించినట్లు మా భయమును తొలగింపుము" అని మొరపెట్టుకొనిరి. (12-18)

దేవదేవుడు, శత్రుభయంకరుడు అయిన మహావిష్ణువు దేవతల మాటలు

విని, వాళ్ళకు అభయమిచ్చి - "దేవతలారా! ఈశ్వరు డిచ్చిన వరములచేత గర్వితుడైన రాక్షసుడైన సుకేశుణ్ణి, మాల్యవంతుడు జ్యేష్ఠుడుగా గల అతని పుత్రులను నేను ఎరుగుదును. కట్టుబాట్లు అతిక్రమించిన ఆ రాక్షసులను నేను కోపావిష్టుడనై సంహరించెదను. మనస్తాపమును విడిచిపెట్టుడు" అని వాళ్లకు అభయమిచ్చెను. సమర్థుడైన విష్ణువు మాటలు విని ఆ దేవత లందరు సంతోషించి, విష్ణువును ప్రశంసించుచు తమ తమ గృహములకు వెళ్ళిరి.(19-22)

రాక్షసుడైన మాల్యవంతుడు దేవతల ప్రయత్నమును గూర్చి విని, వీరులైన తన సోదరులతో - "దేవతలు, ఋషులు మన వధను కోరుచు, శివుని దగ్గరకు వెళ్ళి - 'ప్రభూ! భయంకరరూపములు గల సుకేశపుత్రులు వరదానబలముచేత బరితెగించినవారై, చాల గర్వితులై, అడుగడుగునా మమ్ములను బాధించుచున్నారు. ప్రజల ప్రభువైన ఓ! మహేశ్వరా! మమ్ములను రాక్షసులు ఓడించినారు. వాళ్ళ భయమువలన మా ఇండ్లలో నివసించజాలకున్నాము. అందువలన మా హితముకొరకై వాళ్ళను చంపివేయుము. దహించువారిలో శ్రేష్ఠుడా! ఆ రాక్షసులను హుంకారము చేతనే కాల్చివేయుము.' అని ప్రార్థించినారట. దేవతల మాటలు విని మహేశ్వరుడు శిరస్సు హస్తములు కదల్చుచు - 'దేవతలారా! నేను యుద్ధములో సుకేశుని పుత్రులను చంపుటకు వీలులేదు. వాళ్ళను ఎవడు చంపగలడో ఆ ఉపాయము మీకు చెప్పెదను. చక్రము, గద హస్తములం దున్నవాడు, పీతాంబరుడు, శత్రుజనపీడకుడు, పాపహరుడు, శ్రీమంతుడు అయిన నారాయణుణ్ణి శరణు పొందుడు' అని చెప్పెనట. దేవతలు మహేశ్వరుని ఆలోచనను గ్రహించి అతనికి నమస్కరించి మహావిష్ణువు దగ్గరకి వెళ్ళి అతనికి అంతా తెలిపిరి. అప్పుడు శ్రీమహావిష్ణువు ఇంద్రాదిదేవతలతో "దేవతలారా! ఆ రాక్షసులను చంపెదను. నిర్భయముగా ఉండుడు" అని చెప్పెను. ఓ! రాక్షసశ్రేష్ఠులారా! మనలను చంపెద నని విష్ణువు భయార్తులైన దేవతలకు ప్రతిజ్ఞచేసి చెప్పినాడు. ఈ విషయమునందు ఏమి చేయుట యుక్తమో ఆలోచించుడు."(23-33)

"విష్ణువుచేతిలో హిరణ్యకశిపుడు, ఇతరరాక్షసులు మరణించినారు. ఈతనితో యుద్ధముచేయుటకై వెళ్ళిన నముచి, కాలనేమి, ఉత్తమవీరుడైన సంహ్లాదుడు, అనేక మాయలు గల రాధేయుడు, ధార్మికుడైన లోకపాలకుడు, యమలార్జునులు, హార్దిక్యుడు, శుంభుడు, నిశుంభుడు, గొప్ప ధైర్యపరాక్రమములు గల అసురులు, దానవులు వీరందరు పరాజయము పొందక తిరిగి వెళ్ళినట్లు మనము వినలేదు. ఈ అసురు లందరు వందలకొలది యాగములు చేసినవారే. అందరూ మాయలు

తెలిసినవారే. అందరూ అన్ని అస్త్రాలయందూ నేర్పు గలవారే. అందరూ శత్రువులకు భయంకరులే. అట్టి వందలకొలది, వేలకొలది అసురులను నారాయణుడు చంపివేసినాడు. ఈ విషయమును తెలిసికొని మన అందరికీ తగిన కార్యము చేయుడు. మనలను చంపుటకై నిర్ణయించుకొన్న నారాయణుణ్ణి జయించుట కష్టము" అని పలికెను. (34-38)

అన్నగారి మాటలు విన్న సుమాలి, మాలీ కూడ అశ్వినీదేవతలు దేవేంద్రునితో పలికినట్లు అన్నగారితో- "మనము బాగా అధ్యయనము చేసినాము. దానములు ఇచ్చినాము. యాగాలు చేసినాము. ఐశ్వర్యము పాలించినాము. రోగములు లేని ఆయుర్దాయమును పొందినాము. మంచి ధర్మమార్గమును నిలిపినాము. క్షోభింపశక్యముకాని దేవతాసైన్యసముద్రములోనికి శస్త్రముల సహాయ్యముతో ప్రవేశించి సాటిలేని శత్రువులను జయించినాము. అందువలన మనకు మృత్యువువలన కలుగు భయము లేదు. నారాయణుడు, రుద్రుడు, ఇంద్రుడు, యముడు, అందరూ కూడ మన ఎదుట నిలచుటకు ఎల్లప్పుడూ భయపడుచుందురు. రాక్షసరాజా! మనతో విష్ణువుకు ద్వేషము ఉండుటకు కారణము ఏమీ లేదు. దేవతల చెప్పుడు మాటలచేతనే విష్ణువు మనస్సు చలించినది. అందువలన ఇప్పుడే కలిసి వెళ్ళి ఒకరినొకరు రక్షించుకొనుచు, ఈ దోషమునకు కారణభూతులైన దేవతలను చంపెదము" అని పలికిరి. (39-44)

బలవంతులైన ఆ రాక్షసశ్రేష్ఠులు ఈ విధముగా ఆలోచించి సకలసైన్యములతో కూడినవారై తమ ప్రయత్నమును చాటించి, జంభ-వృత్రాసురాదులువలె, కోపముతో యుద్ధానికి బయలుదేరిరి. రామా! పెద్ద శరీరములు గల, మహాబలశాలులైన ఆ రాక్షసులందరూ ఈ విధముగా ఆలోచించి అన్ని విధముల ప్రయత్నములు చేసి యుద్ధమునకై బయలుదేరిరి. బలముచేత గర్వించిన రాక్షసులందరు లంకను విడచి రథములు, ఏనుగులు, ఏనుగులవంటి గుఱ్ఱములు, గాడిదలు, ఎద్దులు, ఒంటెలు, శింశుమారములు, సర్పములు, మొసళ్ళు, తాబేళ్ళు, చేపలు, గరుత్మంతునివంటి పక్షులు, సింహములు, వ్యాఘ్రములు, వరాహములు, సృమరములు, చమరమృగములు ఎక్కి యుద్ధము చేయుటకై దేవలోకమునకు వెళ్ళిరి. పిమ్మట లంకలో నివసించు ప్రాణు లన్నీ లంకలో కనబడుచున్న లోకవిరుద్ధములైన విషయములను చూచి, భయము రానున్న దని భావించుచు, మనస్సులో దిగులు చెందినవి. వందలకొలది, వేలకొలది రాక్షసులు శ్రేష్ఠములైన రథముల నెక్కి శీఘ్రముగా, ప్రయత్నపూర్వకముగా స్వర్గలోకమునకు వెళ్ళిరి.

వాళ్ళు అటు బయలుదేరగానే దేవతలు ఇటు పారిపోయిరి. (45-52)

కాలప్రేరణచేత భయంకరములైన అపశకునములు రాక్షసుల వినాశమును సూచించుచు భూమియందు, అంతరిక్షమునందు కనబడినవి. మేఘములు ఎముకలను, వేడియైన రక్తమును వర్షించినవి. సముద్రములు తీరములు దాటినవి. పర్వతములు చలించినవి. కొన్ని భూతములు అట్టహాసములు(పెద్దనవ్వులు) చేయుచు ఉరుములవలె అరచుచుండెను. చూచుటకు భయంకరముగా ఉన్న ఆడ నక్కలు భయంకరముగా అరచుచుండెను. పృథివ్యాదిమహాభూతములు(లేదా ప్రాణులు) క్రమానుసారముగా పడిపోవుచున్నట్లు కనబడెను. గ్రద్దల పెద్ద గుంపు జ్వాలలు కక్కుచున్న ముఖాలతో యముడు వలె రాక్షసులపైన తిరుగుచుండెను. ఎఱ్ఱని పాదాలు గల పావురములు, గోరింకలు పరుగెత్తుచు అక్కడికి వచ్చెను. కాకులు, పిల్లులు, ద్విపాదికలు కూయుచుండెను. (53-57)

బలముచేత గర్వించిన ఆ రాక్షసులు ఆ ఉత్పాతాలను లెక్కచేయక, కాలపాశముచేత బద్ధులై యుద్ధమునకు వెళ్ళిరే కాని, వెనుకకు మరలలేదు. ఆ రాక్షసుల ముందు వెళ్ళుచున్న మాల్యవంతుడు, సుమాలి, మహాబలశాలి అయిన మాలి మండుచున్న అగ్నివలె ఉండిరి. ఆ రాక్షసు లందరూ మాల్యవంతుణ్ణి మాల్యవత్పర్వతమునువలె, దేవతలు బ్రహ్మదేవునివలె ఆశ్రయించి ఉండిరి. మహామేఘములవలె అధికముగా గర్జించుచున్న ఆ రాక్షససైన్యము మాలి నాయకత్వములో, జయమును కోరుచు దేవలోకమునకు వెళ్ళెను. అప్పుడు ప్రభువైన శ్రీమహావిష్ణువు దేవదూతద్వారా రాక్షసుల ప్రయత్నమును గూర్చి విని యుద్ధమును చేయవలెనని సంకల్పించెను. (58-62)

ఆ శ్రీమహావిష్ణువు ఆయుధములను, అంబులపొదులను సిద్ధము చేసుకొని, వేయి సూర్యులతో సమానమైన దివ్యమైన కవచమును ధరించి, బాణములతో నిండిన నిర్మలమమైన అంబులపొదులు కట్టుకొని, నడుముత్రాడును, నిర్మలమైన ఖడ్గమును కట్టుకొని, శంఖ-చక్ర-గదా, శార్ఙ్గము లను శ్రేష్ఠములైన ఆయుధములు ధరించి, మంచి రెక్కలు గల, పర్వతము వలె ఉన్న గరుత్మంతునిపై ఎక్కి రాక్షసవినాశమునకై అతిశీఘ్రముగా వెళ్ళెను. పచ్చని వస్త్రమును ధరించి, గరుత్మంతుని వీపుమీద ఉన్న నల్లని దేహచ్ఛాయగల ఆ శ్రీమహావిష్ణువు, బంగారుకొండ శిఖరముమీద ఉన్న మెరుపుతో కూడిన మేఘమువలె ప్రకాశించెను. ఆ శ్రీమహావిష్ణువు, సిద్ధులు, దేవర్షులు, మహోరగులు, గంధర్వులు, యక్షులు స్తుతించుచుండగా, చక్ర-ఖడ్గ-శార్ఙ్గ- శంఖములను హస్తములందు ధరించి, రాక్షస సైన్యసంహారము

చేయువాడై ఆ సైన్యమును సమీపించెను.(63-68)

గరుత్మంతుని రెక్కల గాలికి ఆ రాక్షససైన్యము ఎగిరిపోవుచుండెను. పతాకలు తిరిగిపోవుచుండెను. ఆయుధములు చెల్లాచెదరగుచుండెను. ఆ విధముగా ఆ రాక్షససైన్యము ఎగురుచున్న రాళ్ళు గల నల్లని పర్వతశిఖరము వలె కదలిపోయెను. అప్పుడు వేలకొలది రాక్షసులు శ్రీమహావిష్ణువును చుట్టుముట్టి, రక్తమాంసములచేత పూయబడిన, ప్రళయకాలాగ్ని వలె ఉన్న వాడియైన శ్రేష్ఠములైన ఆయుధాలతో అతనిని కొట్టిరి.(69, 70)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఆరవ సర్గము సమాప్తము.**

# ఏడవ సర్గము

**శ్రీమహావిష్ణువు రాక్షసులను సంహరించుట. రాక్షసులు పారిపోవుట.**

రాక్షసు లనే మేఘములు, గర్జించుచు, మేఘములు పర్వతముమీద వర్షించినట్లు నారాయణు డనే పర్వతముమీద బాణవర్షము కురిపించిరి. నల్లని రాక్షసు లందరూ చుట్టుముట్టగా, నల్లగా శుభ్రముగా ఉన్న విష్ణువు వర్షించుచున్న మేఘములచేత కప్పబడిన అంజనగిరి వలె ఉండెను. రాక్షసుల ధనుస్సులనుండి బయలుదేరి వజ్ర-వాయు-మనస్సుల వేగమువంటి వేగముతో వచ్చిన బాణములు, మిడతలు పంటచేనును వలె, దోమలు అగ్నిని వలె, ఈగలు అమృతకలశమును వలె, ప్రళయకాలమునందు లోకములు వలె, విష్ణువు శరీరములో ప్రవేశించినవి. రథముల నెక్కి వచ్చిన రథికులు, గజముల నెక్కి వచ్చిన గజారూఢులు, అశ్వముల నెక్కివచ్చిన అశ్వికులు, ఆకాశముమీద నిలచిన కాలిబంట్లు, పర్వతములవంటి రాక్షసశ్రేష్ఠులు బాణములచేతను, శక్తులచేతను, ఋష్టులచేతను, తోమరములచేతను, విష్ణుమూర్తిని, ప్రాణాయామములు బ్రాహ్మణునివలె ఊపిరి లేనివానినిగా (ఊపిరి సలపకుండా) చేసిరి.(1-6)

మీనములు మహాసముద్రమును కొట్టినట్లు రాక్షసులు కొట్టుచుండగా, ఎదురింపశక్యముకాని ఆ మహావిష్ణువు శార్ఙ్గధనుస్సును ఎక్కుపెట్టి రాక్షసులపై బాణములు ప్రయోగించెను. పిమ్మట శ్రీమహావిష్ణువు వజ్రముతో సమానములైన, మనోవేగమువంటి వేగము గల వందలకొలది, వేలకొలది బాణములను పూర్తిగా లాగి రాక్షసులను ఛేదించెను. శ్రీమహావిష్ణువు, ప్రారంభమైన వర్షమును వాయువువలె,

ఆ రాక్షసులను బాణవర్షముచేత తరిమివేసి పాంచజన్య మను మహాశంఖమును పూరించెను. ప్రాణబలమునంతను ఉపయోగించి శ్రీమహావిష్ణువు పూరించిన శంఖములలో శ్రేష్ఠమైన ఆ పాంచజన్యము మూడు లోకములను భయపెట్టుచున్నదా అన్నట్లు భయంకరశబ్దముతో ధ్వనిచేసెను. అప్పుడు శంఖములలో శ్రేష్ఠమైన ఆ పాంచజన్యము ధ్వని, అరణ్యములో సింహగర్జనము మదించిన ఏనుగులకు వలె రాక్షసులకు భయము కలిగించెను. శంఖధ్వని వినగానే బలము ఉడిగిపోయి అశ్వములు నిలవలేక పోయినవి. ఏనుగుల మదము అణగిపోయెను. వీరులు రథములనుండి జారిపడిపోయిరి.(7-12)

శార్ఙ్గధనుస్సునుండి బయలుదేరిన, వజ్రమువంటి అగ్రభాగములు, అందమైన పొన్నులు గల బాణములు ఆ రాక్షసులను చీల్చివేసి నేలలో ప్రవేశించినవి. శ్రీమహావిష్ణువు ప్రయోగించిన బాణములచేత యుద్ధమునందు బ్రద్దలు కొట్టబడిన రాక్షసులు వజ్రముచేత కొట్టబడిన పర్వతములు వలె నేలమీద పడిరి. శత్రువుల శరీరములపై విష్ణుచక్రముచేత చేయబడిన వ్రణములు పర్వతములు సువర్ణధారలను వలె, రక్తధారలను స్రవించెను. శ్రేష్ఠమైన శంఖముయొక్క ధ్వని, శార్ఙ్గమను ధనుస్సుయొక్క ధ్వని, విష్ణుమూర్తి చేయు ధ్వని రాక్షసుల ధ్వనిని మ్రింగివేసెను. శ్రీమహావిష్ణువు బాణాలచేత ఆ రాక్షసుల కదల్చబడుచున్న కంఠములను, బాణములను,ధ్వజములను, ధనుస్సులను, రథములను, పతాకలను, అంబులపొదులను ఛేదించెను. విష్ణువు ప్రయోగింపగా శార్ఙ్గమునుండి బయల్వెడలిన, శత్రువులను హింసించు, వందలకొలది వేలకొలది బాణములు సూర్యునినుండి భయంకరములైన కిరణములవలె, సముద్రమునుండి జలప్రవాహము వలె, పర్వతములనుండి గజేంద్రములవలె, మేఘమునుండి జలప్రవాహమువలె శీఘ్రముగా వచ్చినవి.(13-19)

సమర్థుడైన శ్రీమహావిష్ణువు ఆ రాక్షసులను, శరభమృగము సింహములను వలె, సింహము ఏనుగులను వలె, ఏనుగు పెద్దపులిని వలె, పెద్దపులి చిరుతపులినివలె, చిరుతపులి కుక్కలనువలె, కుక్క పిల్లులను వలె, పిల్లి సర్పములను వలె, సర్పము ఎలుకలను వలె తరిమివేయగా వాళ్ళందరు పారిపోయిరి. మరి కొందరు నేలపై పడిపోయిరి. శ్రీమహావిష్ణువు వేలకొలది రాక్షసులను చంపి దేవేంద్రుడు మేఘమును పూరించినట్లు శంఖమును పూరించెను.(20-23)

ఆ రాక్షససైన్యము నారాయణుని బాణాలకు భయపడి, శంఖధ్వనిచేత



వ్యాకులత చెంది, ఓడిపోయి లంకవైపు పారిపోయెను. ఆ రాక్షససైన్యము నారాయణుని బాణములచేత కొట్టబడి ఓడిపోవుట చూచి సుమాలి బాణవర్షముచేత విష్ణువును నివారించెను. ఆతడు విష్ణువును, పొగమంచు సూర్యుణ్ణి కప్పివేసినట్లు బాణాలతో కప్పివేసెను. అప్పుడు బలవంతులైన రాక్షసులకు మరల ధైర్యము కలిగెను. బలముచేత గర్వించిన ఆ రాక్షసుడు రాక్షసులను జీవింపచేయుచున్నాడా అన్నట్లు గొప్ప ధ్వనిచేయుచు విష్ణువుమీదకు శీఘ్రముగా వెళ్ళి ఏనుగువలె, అలంకారములు వ్రేలాడుచున్న హస్తమును ఎత్తి కదల్చుచు, సంతోషముతో మెరుపుతో కూడిన మేఘము వలె ధ్వని చేసెను.(24-28)

అతడు అరచుచుండగా విష్ణువు అతని సారథియొక్క ప్రకాశించుచున్న కుండలములు గల శిరస్సును ఖండించెను. అప్పుడా రాక్షసుని గుఱ్ఱములు అటు ఇటు తిరిగినవి. సారథి లేని గుఱ్ఱాలు స్వేచ్ఛగా తిరుగుటతో, ఇంద్రియములు అనే గుఱ్ఱములు స్వేచ్ఛగా తిరుగుచుండగా నిలకడలేని మానవులు వలె, రాక్షసప్రభువైన సుమాలి తిరిగిపోయెను.(29, 30)

వాని రథమును గుఱ్ఱములు దూరముగా తీసికొని పోయెను. అప్పుడు మాలి యుద్ధసన్నద్ధుడై ధనుస్సు ధరించి, యుద్ధభూమిలో వచ్చుచున్న మహాబాహువైన విష్ణువు మీదికి, అతని రథముమీదికి శీఘ్రముగా వెళ్ళెను. మాలి ధనుస్సునుండి బయల్వెడలిన, బంగారముచేత అలంకరింపబడిన బాణములు పక్షులు

క్రౌంచపర్వతమును వలె విష్ణుమూర్తిని సమీపించి అతని దేహములో ప్రవేశించినవి. మాలి వేలకొలది బాణములు ప్రయోగించి బాధించుచున్నను, శ్రీమహావిష్ణువు, ఇంద్రియములను జయించినవాడు మనోవ్యథలచేత ఎట్లు క్షోభ చెందడో అట్లే రణరంగమునందు క్షోభ చెందలేదు. పిమ్మట ఖడ్గగదాధారియైన, లోకరక్షకుడైన మహావిష్ణువు ధనుష్టంకారము చేసి మాలిపై బాణసముదాయమును విడచెను. వజ్రాయుధమువలె, మెరపులవలె ప్రకాశించుచున్న ఆ బాణములు మాలి దేహమును సమీపించి, సర్పములు అమృతమును త్రాగినట్లు అతని రక్తమును త్రాగినవి. శంఖ-చక్ర-గదలు ధరించిన శ్రీమహావిష్ణువు మాలిని యుద్ధవిముఖునిగా చేసి అతని కిరీటమును, ధ్వజమును, ధనుస్సును, గుఱ్ఱములను పడగొట్టెను. (31-36)

రథము లేని మాలి గద ధరించి, పర్వతాగ్రమునుండి సింహమువలె, క్రిందికి దుమికెను. మాలి గదతో, యముడు ఈశ్వరుణ్ణి వలె, ఇంద్రుడు వజ్రాయుధముచేత పర్వతమును వలె గరుత్మంతుని లలాటప్రదేశముమీద కొట్టెను. మాలి గదతో గట్టిగా కొట్టగా గరుత్మంతుడు దెబ్బకు బాధపడుచు మహావిష్ణువు యుద్ధమునుండి వెనుకకు మరలిపోవునట్లు చేసెను. మాలి గరుత్మంతుని కొట్టుటద్వారా విష్ణువును పరాఙ్ముఖుని చేయగా రాక్షసులు బిగ్గరగా గర్జించిరి.(37-40)

ఇంద్రుని తమ్ముడైన భగవంతుడైన శ్రీమహావిష్ణువు అరచుచున్న ఆ రాక్షసుల అరుపులు విని, గరుత్మంతునిమీద అడ్డముగా కూర్చుండి, మాలిని చంపుటకై, వెనుకకు తిరిగి ఉండియే చక్రమును ప్రయోగించెను. కాలచక్రమువలె తిరుగుచున్న, సూర్యమండలమువంటి కాంతిగల ఆ చక్రము తన కాంతిచేత ఆకాశమును ప్రకాశింపచేయుచు మాలి శిరస్సును పడగొట్టెను. చక్రముచేత ఛేదించబడిన ఆ రాక్షసుని భయంకరమైన శిరస్సు, పూర్వము రాహువు శిరస్సువలె, రక్తము కార్చుచు క్రిందపడెను. పిమ్మట సంతోషించిన దేవతలు, "దేవా! బాగు బాగు" అని అనుచు చాల బిగ్గరగా సింహనాదము చేసిరి. మాలి చంపబడినట్లు చూడగానే సుమాలి-మాల్యవంతులు దుఃఖముచే పీడింపబడినవారై, సైన్యముతో లంకకు పారిపోయిరి.(41-45)

గరుత్మంతుడు తెప్పరిల్లి, వెనుకకు మరలివచ్చి, పూర్వమునందు వలె చాల కోపముతో రెక్కల గాలిచేత రాక్షసులను ఎగురగొట్టెను. కొందరు రాక్షసుల ముఖపద్మములు చక్రముచేత ఛేదింపబడెను. కొందరి వక్షఃస్థలములు గదచేత చూర్ణము చేయబడెను. కొందరి కంఠములు నాగలి దెబ్బకు వాడిపోవునట్లు

చేయబడెను. కొందరి తలలు ముసలముచేత బద్దలుకొట్టబడెను. కొందరు ఖడ్గముచేత ఛేదించబడిరి. మరికొందరు బాణములచేత కొట్టబడిరి. ఈ విధముగా ఆ రాక్షసులు ఆకాశమునుండి వెంటనే సముద్రములో పడిపోయిరి.(46-48)

నారాయణుడు, జుట్టుముడులు విడిపోయిన ఆ రాక్షసులను, ధనుస్సు నుండి విడివడిన పిడుగువంటి బాణాలచేత, మెరుపులతో కూడిన పెద్ద మేఘము పిడుగులచేత వలె చీల్చివేసెను. ఆ సైన్యములోని గొడుగులు విరిగిపోయెను. ఆయుధములు జారి పోవుచుండెను. బాణాలచేత రాక్షసుల వస్త్రములు చినిగి తొలగిపోయెను. వాళ్ళ ప్రేగులు బైటకు వచ్చుచుండెను. నేత్రములు భయముచేత చలించుచుండెను. ఈ విధముగా ఆ సైన్యము మిక్కిలి ఉన్మాదము చెందెను. శ్రీ మహావిష్ణువు మర్దించగా ఏనుగులతో సహా రాక్షసుల ధ్వనుల వేగము, సింహముచేత ఆక్రమించబడిన ఏనుగుల ధ్వనివేగము వలె ఉండెను. విష్ణువు ప్రయోగించిన బాణములచేత నివారింపబడుచు, తమ బాణములను విడచుచున్న, కాలమేఘములవంటి ఆ రాక్షసులు వాయువుచేత ఎగురగొట్టబడిన నల్లని మేఘములు వలె పారిపోయిరి. ఆ రాక్షసవీరు లందరు చక్రము దెబ్బలచేత శిరస్సులు తెగి, గద దెబ్బలకు శరీరములు చూర్ణమై, ఖడ్గప్రహారములచేత రెండేసి ముక్కలై పర్వతములవలె నేలమీద కూలిరి. మణిహారములు, కుండలములు వ్రేలాడగా, ఎడతెరిపి లేకుండగా పడగొట్టబడుచున్న నల్లని మేఘముల వంటి ఆ రాక్షసులతో ఆకాశము పగలగొట్టబడుచున్న నల్లని పర్వతములతో వలె దట్టముగా కనబడెను.(49-54)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏడవ సర్గము సమాప్తము.**

# ఎనిమిదవ సర్గము

## మాల్యవంతుడు యుద్ధముచేసి పరాజితు డగుట, సుమాలి మొదలైన రాక్షసులు రసాతలములో ప్రవేశించుట.

విష్ణువు సైన్యమును వెనుకనుండి చంపివేయుచుండగా మాల్యవంతుడు, తీరమును దాటి సముద్రము వచ్చినట్లు వెనుకకు వచ్చెను. మాల్యవంతుడు కోపముతో ఎఱ్ఱనైన నేత్రములతో, శిరస్సు కదలుచుండగా పురుషోత్తముడైన పద్మనాభునితో– "ఓ! నారాయణా! సామాన్యుడు వలె నీవు, యుద్ధమునందు మనస్సులేనివారమై భయపడి ఉన్న మమ్ములను చంపుచున్నావు; ప్రాచీనమైన క్షత్రియధర్మమును ఎరుగవా?

పాపమైన యుద్ధపరాఙ్ముఖుల వధను చేయువాడు పుణ్యకర్మలు చేయువానికి లభించు స్వర్గమును పొందజాలడు. నీకు యుద్ధమునందు ఆసక్తి ఉన్నచో, నేనిక్కడ నిలచి ఉన్నాను. నీకెంత బలమున్నదో చూపుము. చూచెదను" అనెను.(1-5)

శ్రీమహావిష్ణువు మాల్యవత్పర్వతము వలె నిలచిన రాక్షసరాజైన ఆ మాల్యవంతుణ్ణి చూచి-(6)

"మీవలన వచ్చిన అపాయమునుండి భయపడిన దేవతలకు నేను, రాక్షససంహారము చేయుదు నని అభయ మిచ్చి ఉన్నాను. ఆ ప్రతిజ్ఞనే పాలించుచున్నాను. నేను నా ప్రాణములైన ఇచ్చి ఎల్లప్పుడు దేవతలకు ప్రియము చేయవలసి ఉన్నది. అట్టి నేను మీరు రసాతలమునకు వెళ్ళినను మిమ్ములను చంపెదను" అని పలికెను.(7, 8)

శ్రీమహావిష్ణువు ఇట్లు పలుకుచుండగా మాల్యవంతుడు కోపించి, శక్తితో అతని వక్షఃస్థలముమీద కొట్టెను. ఘంటాధ్వని చేయుచున్న ఆ శక్తి విష్ణువక్షఃస్థలముపై మేఘముమీద ఉన్న మెరుపువలె ప్రకాశించెను. కుమారస్వామికి ఇష్టుడైన ఆ విష్ణువు ఆ శక్తినే పైకి లాగి మాల్యవంతునిపై విసరెను. విష్ణువు హస్తమునుండి బయల్వెడలిన ఆ శక్తి కుమారస్వామి ప్రయోగించిన శక్తివలె, ఆ రాక్షసుని మీదకు, కొరవి అంజనపర్వతముమీదికి వెళ్ళినట్లు వెళ్ళెను. ఆ శక్తి హారముల సముదాయముతో ప్రకాశించుచున్న, విశాలమైన ఆ రాక్షసరాజు వక్షఃస్థలముమీద, పర్వతశిఖరముమీద పిడుగు పడినట్లు, పడెను. ఆ శక్తి దెబ్బకు కవచము బ్రద్దలైపోగా మాల్యవంతుడు మూర్ఛపోయెను. మరల తెప్పరిల్లి పర్వతము వలె కదలకుండ నిలబడి చాల ముండ్లతో నిండిన ఇనుప శూలమును గ్రహించి దానితో విష్ణువు వక్షఃస్థలమునందు గట్టిగా కొట్టెను.(9-15)

యుద్ధమునందు చాలా ఆసక్తి గల ఆ మాల్యవంతుడు మహావిష్ణువును పిడికిలితో గ్రుద్ది ధనుస్సంత దూరము వైదొలగెను. అప్పుడు "బాగు బాగు" అని గొప్ప శబ్దము ఆకాశమునందు వ్యాపించెను. ఆ రాక్షసుడు విష్ణువును కొట్టిన పిమ్మట గరుత్మంతుని కూడా కొట్టెను. గరుత్మంతుడు కోపించి, బలము గల వాయువు ఎండుటాకుల ప్రోగును ఎగురగొట్టినట్లు, ఆ రాక్షసుణ్ణి రెక్కలగాలిచేత ఎగురగొట్టెను. తన అన్నయైన మాల్యవంతుడు గరుత్మంతుని రెక్కలగాలికి ఎగిరి పోవుటచూచి సుమాలి సైన్యముతో లంకవైపు వెళ్ళిపోయెను. బలమైన గరుత్మంతుని రెక్కలగాలి ఎగురగొట్టివేయగా మాల్యవంతుడు కూడ సిగ్గుపడుచు సైన్యముతో

లంకలో ప్రవేశించెను.(16-20)

రామా! శ్రీమహావిష్ణువు ఈ విధముగా ఆ రాక్షసులను యుద్ధమునందు అనేక పర్యాయములు, వారి ప్రధానులైన నాయకులను చంపివేసి ఓడించెను. ఆ రాక్షసులు విష్ణువును ఎదిరించి యుద్ధము చేయజాలక, భయపీడితులై, లంకను విడచి, భార్యాసహితులై నివాసార్థమై పాతాళమునకు వెళ్ళిపోయిరి. సాలకటంకట వంశమునందు ప్రసిద్ధమైన పరాక్రమము గల ఆ రాక్షసులు సుమాలి పాలనలో ఉండిరి.(సాలకటంకట మాల్యవంతుడు మొదలైనవాళ్ళ పితామహి, విద్యుత్కేశుని భార్య).(21-23)

నీవు చంపిన రాక్షసులు పులస్త్యవంశమునకు చెందినవారు. సుమాలి, మాల్యవంతుడు, మాలి, వాళ్ల పూర్వులు, వాళ్ళందరూ చాల గొప్పవాళ్ళు. రావణునికంటే కూడ అధికబలవంతులు. నారాయణుడు తప్ప మరెవ్వడు దేవతాశత్రువులు, దేవతలకు బాధకలిగించువారు అయిన రాక్షసులను చంపగలవాడే లేదు. నీవు నాలుగు బాహువులు గల ప్రాచీనుడైన దేవుడవైన నారాయణుడవు. జయింపశక్యముకానివాడవు. సర్వసమర్థుడవు, వినాశరహితుడవు. నీవు రాక్షసులను చంపుటకు పుట్టినావు. నష్టమైన ధర్మమును నిలుపువాడు, శరణుజొచ్చినవారియందు జాలి గలవాడు, ప్రజలను సృజించువాడు అయిన శ్రీమహావిష్ణువు దుష్టులను వధించుటకై ఆ యా కాలములందు జనించును.(24-27)

మహారాజా! రామా! రాక్షసుల జన్మవృత్తాంతమును గూర్చి నీకింత వరకు నివేదించితిని. ఇప్పుడు రావణునియొక్క అతని పుత్రులయొక్క జన్మవృత్తాంతమును, సాటిలేని వాళ్ళ ప్రభావము నంతనూ గూర్చి చెప్పెదను; వినుము. అప్పుడు సుమాలి, విష్ణువుకు భయపడి, రాక్షసులతో కూడి చాల కాలము రసాతలములో సంచరించెను. బలశాలియైన కుబేరుడు పుత్రపౌత్రులతో కలసి లంకలో నివసించెను.(28, 29)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# తొమ్మిదవ సర్గము

**రావణాదుల జన్మ, వారు తపస్సుకై గోకర్ణాశ్రమమునకు వెళ్ళుట.**

కొంత కాలము పిదప సుమాలి రసాతలమునుండి వచ్చి భూలోకమునందు అంతటా సంచరించెను. అప్పుడు పద్మములు ధరించిన లక్ష్మివలె ఉన్న, అవివాహితయైన కుమార్తెను వెంటబెట్టుకొని భూలోకమునందు సంచరించుచున్న, నీలమేఘసమానుడు, పరిశుద్ధమైన బంగరు కుండలములు ధరించువాడు అయిన ఆ సుమాలి, పుష్పకవిమానము మీద ఎక్కి వెళ్ళుచున్న కుబేరుణ్ణి చూచెను. పులస్త్యుని కుమారుడైన ఆ కుబేరుడు తండ్రిని చూచుటకు వెళ్ళుచుండెను. సర్వసమర్థుడైన, స్వేచ్ఛగా సంచరించుచున్న, అతడు దేవతుల్యుడై, అగ్నివలె ప్రకాశించుచుండెను. మహాబుద్ధిశాలియైన సుమాలి అతనిని చూచి, ఆశ్చర్యచకితుడై, భూలోకమునుండి రసాతలమునకు తిరిగి వెళ్ళి రాక్షసులను గూర్చి – "మనము ఏ మంచి పనులు చేసినచో ఎట్లు ఈ కుబేరుడు వలె వృద్ధిపొందెదము?" అని ఆలోచించెను.(1-5)

పిమ్మట ఆ రాక్షసుడు కైకసి అను తన కుమార్తెతో – "పుత్రీ! ఇది నీకు వివాహము చేయవలసిన కాలము. నీ యౌవనము దాటిపోవుచున్నది. అడిగిన ఎక్కడ ప్రత్యాఖ్యానము చేయుదురో అని భయపడి మేము నిన్ను వరులకు ఈయ చూపుటలేదు. ధర్మమునందు ఆసక్తి గల మేము అందరము నీ నిమిత్తమై చాల ప్రయాసపడుచున్నాము. ఓ! పుత్రీ! సమస్త సద్గుణములతో నీవు సాక్షాత్తు లక్ష్మివలె ఉన్నావు. ఆత్మాభిమానవంతు లందరికీ కన్యకు తల్లిదండ్రులై ఉండుట దుఃఖకారణము. ఎట్టి వాడు వచ్చి కన్యను వరించునో తెలియదు కదా? కన్య తల్లి వంశము, తండ్రి వంశము, ఏ వంశమునకు వెళ్ళునో ఆ వంశము ఈ మూడు వంశములను సర్వదా సంశయములో ఉంచును. పుత్రీ! నీవు మునులలో గొప్పవాడు, శ్రేష్ఠుడు, ప్రజాపతివంశములో పుట్టినవాడు అయిన విశ్రవసుణ్ణి సేవించుము. నీవు స్వయముగా ఆ పులస్త్యకుమారుణ్ణి వరించుము. పుత్రీ! నీకు తేజస్సుచేత సూర్యుడు వలె ఉన్న ఈ కుబేరుడు ఎట్లున్నాడో అట్టి పుత్రులు పుట్టగలరు; సందేహములేదు" అని చెప్పెను.(6-12)

ఆ కన్యక తండ్రి మాటలు విని, తండ్రియందున్న గౌరవముచేత, విశ్రవస్సు తపస్సు చేయుచున్నచోటికి వెళ్ళి అక్కడ నిలచెను. ఆమె వెళ్ళు సమయానికి విశ్రవస్సు నాల్గవ అగ్నివలె సాయంకాలాగ్నిహోత్రము చేయుచుండెను. కైకసి తండ్రియందున్న గౌరవముచేత, ఆ సమయము దారుణమైనదని కూడ ఆలోచించక,

ఆ ముని పాదముల వైపు చూచుచు, కాలి బొటనవ్రేలిచేత మాటిమాటికి నేల వ్రాయుచు, అతని ఎదుట నిలచెను.(13-15)

చాల ఉత్తమమైన స్వభావము గల ఆ విశ్రవస్సు, అందమైన కటిప్రదేశము, పూర్ణచంద్రుని వంటి ముఖమూ గల, సహజతేజస్సుతో ప్రకాశించుచున్న ఆ కైకసిని చూచి- "మంగళప్రదురాలా! నీవు ఎవరి కుమార్తెవు? ఎక్కడినుండి, ఎందుకు ఇక్కడికి వచ్చినావు? ఓ! సుందరీ! నీవు ఏ పనిమీద ఇక్కడికి వచ్చినావు?" అని అడిగెను.(16, 17)

ఆ కన్యక ఆ ముని మాటలు విని అంజలి ఘటించి - "ఓ! మునీ! నా అభిప్రాయమేమో నీ తపఃప్రభావముచేత తెలుసుకొనుము. ఓ! బ్రహ్మర్షీ! నేను నా తండ్రి ఆజ్ఞవలన వచ్చినా నను విషయము మాత్రము తెలిసికొనుము. నా పేరు కైకసి. మిగిలిన విషయ మంతా నీవే గ్రహించుము" అనెను.(18, 19)

ఆ ముని ధ్యానము చేసి తెలిసికొని - "ఓ! మంగళప్రదురాలా! నీ మనస్సులో ఉన్న కారణమేదో నాకు తెలిసినది. ఓ! మత్తగజగమనా! నీకు నావలన పుత్రులు కలగవలెనను కోరిక ఉన్నది. కాని నీవు నా వద్దకు దారుణమైన సంధ్యాసమయమునందు వచ్చినావు. అందుచే నీకు ఎట్టి పుత్రులు కలిగెదరో వినుము. నీకు భయంకరులు, భయంకరమైన ఆకారము కలవారు, క్రూరులైన బంధువులయందు ప్రీతి కలవారు, క్రూరములైన పనులు చేయువారు అయిన రాక్షసులు పుత్రులుగా పుట్టెదరు" అని పలికెను.(20-22)

కైకసి విశ్రవసుని మాటలు విని అంజలి ఘటించి - "పూజ్యుడా! బ్రహ్మవాదివైన నీనుండి నాకు ఇట్టి దురాచారులైన పుత్రులు కలుగుట నాకు ఇష్టముకాదు; అనుగ్రహింపుము." అనెను.(23, 24)

మునిశ్రేష్ఠుడైన విశ్రవసుడు కైకసి మాటలు విని, పూర్ణచంద్రుడు రోహిణితో వలె ఆమెతో- "మంగళకరమైన ముఖముగలదానా! నీ చివరి పుత్రుడు ధర్మాత్ముడై నా వంశానికి తగినవాడు అగును. సందేహము లేదు" అని చెప్పెను.(25, 26)

రామా! విశ్రవసుడు ఇట్లు చెప్పిన కొంతకాలానికి ఆ కన్య, భయంకరుడు, చాల క్రూరుడు అయిన రాక్షసరూపము గల పుత్రుని కనెను. ఆ పిల్లవానికి పది కంఠములు, పెద్ద కోరలు , ఎఱ్ఱని పెదవులు, ఇరవై చేతులు, పెద్దనోళ్ళు, ప్రకాశించుచున్న జుట్టు ఉండెను. అతడు నల్లని కాటుక కుప్పవలె ఉండెను. అతడు

పుట్టగానే నిప్పు ముద్దలు నోళ్ళలో ఉన్న ఆడనక్కలు, మాంసము తిను మృగాలు, అపసవ్యముగా, గుండ్రముగా తిరిగినవి. దేవుడు రక్తము కురిపించెను. మేఘములు కటువుగా ఉరిమెను. సూర్యుడు ప్రకాశించలేదు. భూమిపై పెద్ద ఉల్కలు పడెను. భూమి అదిరెను. దారుణములైన గాలులు వీచెను. క్షోభింపశక్యముకాని నదీపతియైన సముద్రము క్షోభ చెందెను.(27-31)

బ్రహ్మదేవునితో సమానుడైన తండ్రి ఆ పిల్లవానికి "ఇతడు పది కంఠములతో పుట్టినాడు గాక ఇతని పేరు దశగ్రీవుడు" అని పేరు పెట్టెను. దశగ్రీవుని తరువాత మహాబలవంతుడైన కుంభకర్ణుడు పుట్టెను. అతని శరీర ప్రమాణమును మించిన ప్రమాణము ఈ లోకములో లేదు. పిమ్మట వికృతమైన ముఖము గల శూర్పణఖ పుట్టెను. ధర్మాత్ముడైన విభీషణుడు కైకసి చివరి పుత్రుడుగా జనించెను. మహాబుద్ధిశాలియైన విభీషణుడు పుట్టినప్పుడు పుష్పవర్షము కురిసెను. ఆకాశమునందు దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునందు "బాగు బాగు" అను మాటలు వినబడెను.(32-35)

గొప్ప తేజస్సు గలవారు, లోకమునకు ఉపద్రవము కలిగించువారు అయిన ఆ కుంభకర్ణదశగ్రీవులు ఆ మహారణ్యములో పెరిగిరి. కుంభకర్ణుడు మిక్కిలి మదించి ధర్మాత్ములైన మహర్షులను నిత్యము భక్షించుచు తృప్తి చెందక మూడు లోకాలలో సంచరించెను. ధర్మాత్ముడైన విభీషణుడు మాత్రము నిత్యము ధర్మమునందే స్థిరుడై, స్వాధ్యాయము చేయుచు, ఆహారనియమము పాటించుచు, ఇంద్రియములను వశములో ఉంచుకొని ఉండెను.(36-38)

పిమ్మట కొంత కాలమునకు, ధనాధిపతియైన కుబేరుడు తండ్రి దర్శనమునకై పుష్పకముమీద అక్కడికి వచ్చెను. అపుడు రాక్షసియైన కైకసి అక్కడ తేజస్సుతో మండుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ కుబేరుణ్ణి చూచి దశగ్రీవుని వద్దకు వచ్చి- "పుత్రా! నీ సోదరుడైన కుబేరుడు తేజస్సుతో ఎట్లు ప్రకాశించుచున్నాడో చూడుము. సోదరత్వము సమానమే అయినను ఈవిధముగా ఉన్న నిన్ను చూచుకొనుము. నాయనా! దశగ్రీవా! సాటిలేని పరాక్రమముగలవాడా! నీవు కూడ కుబేరు డంతటివాడవు అగుటకు ప్రయత్నము చేయుము" అనెను.(39-42)

ప్రతాపవంతు డైన దశగ్రీవుడు తల్లి మాటలు విని కుబేరుని విషయమునందు చాల అమర్షము చెంది అప్పుడు తల్లితో- "తల్లీ! నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను. తేజస్సుచేత నా సోదరునితో సమానుడను గాని, అధికుడను గాని, కాగలను.

మనస్సులో ఉన్న సంతాపమును విడువుము." అనెను. పిమ్మట సోదరసహితుడైన దశగ్రీవుడు ఆ కోపావేశముతోనే, ఎవ్వరూ చేయజాలని పని చేయదలచినవాడై తపస్సు చేయుటకు నిశ్చయించుకొనెను. తనస్సుచేత కోరికను సాధించవలె నను దృఢసంకల్పముతో అతడు తన కార్యము సిద్ధించుటకై పవిత్రమైన గోకర్ణ క్షేత్రమును చేరెను. ఉగ్రమైన పరాక్రమము గల ఆ దశగ్రీవుడు తమ్ములతో కలసి ఆ గోకర్ణ క్షేత్రములో సాటిలేని తపస్సు చేసి బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టెను. బ్రహ్మదేవుడు అతనికి జయమును కలిగించు వరములు ఇచ్చెను.(43-47)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# పదవ సర్గము

## రావణాదులు తపస్సు చేసి వరములు పొందుట.

**"ఓ!** బ్రాహ్మణోత్తమా! అపుడు మహాబలశాలులైన ఆ సోదరులు ఎట్లు తపస్సు చేసిరి?" అని రాముడు ప్రశ్నించెను. చాల ఆసక్తితో కూడిన మనస్సు గల రామునితో అగస్త్యుడు ఇట్లు చెప్పెను - "ఆ సోదరులు ఆ యా ధర్మవిధానములను ఆచరించిరి. కుంభకర్ణుడు ప్రయత్నశీలుడై, నిత్యము ధర్మమార్గమునందు ఉన్నవాడై, గ్రీష్మకాలమునందు చుట్టూ ఐదు అగ్నులను(నాలుగు ప్రక్కల నాలుగు అగ్నులు, పైన సూర్యుడు, పంచాగ్నులు) ఉంచుకొని తపస్సు చేసెను. వర్షాకాలములో మేఘోదకమునకు తడియుచు వీరాసనముమీద కూర్చుండెను. శిశిరర్తువునందు నిత్యము జలమధ్యమునందు నిలచి తపస్సు చేసెను. ఈ విధముగా అతడు ధర్మము విషయమున ప్రయత్నము చేయుచు, సన్మార్గమునందు స్థిరుడుగా ఉండి తపస్సు చేయుచుండగా పదివేల సంవత్సరములు గడిచినవి.(1-5)

ధర్మాత్ముడైన విభీషణుడు నిత్యము ధర్మపరుడై, పవిత్రుడై ఐదు వేల సంవత్సరములు ఒక్క పాదముపై నిలబడెను. అతని నియమము పూర్తి అయినప్పుడు అప్సరఃస్త్రీలు నృత్యము చేసిరి. పుష్పవర్షము కురిసెను. దేవతలు కూడ స్తుతించిరి. స్వాధ్యాయమునందు మనస్సును స్థిరముగా నిలిపి, ముఖము బాహువులు పైకి ఎత్తి నిలచి ఐదువేల సంవత్సరములు సూర్యుణ్ణి అనుసరించెను. (సూర్యుడు ఏ దిక్కున ఉండునో ఆ దిక్కుకు ముఖము త్రిప్పి సూర్యుని చూచుచు నిలచెను. ) ఈ విధముగానే మనోనిగ్రహవంతుడైన విభీషణుడు కూడ తపస్సు చేయుచుండగా స్వర్గములో

ఉన్న వానికి నందనవనమునందు వలె, పదివేల సంవత్సరములు గడిచినవి. (6-9)

దశాననుడు పూర్తి పదివేల సంవత్సరములు ఆహార మేమీ లేక తపస్సు చేయుచు వేయి సంవత్సరములు పూర్తియైనపుడల్లా తన శిరస్సును అగ్నిలో హోమము చేసెను. ఈ విధముగా ఆ దశకంఠుడు తపస్సు చేయుచుండగా తొమ్మిదివేల సంవత్సరములు గడచినవి. అతని తొమ్మిది శిరస్సులు అగ్నిలో హోమము చేయబడినవి. పదివేల సంవత్సరములు పూర్తి అయిన పిమ్మట దశగ్రీవుడు పదవ శిరస్సు ఛేదించుటకు ఉద్యుక్తు డగుచుండగా బ్రహ్మదేవుడు అక్కడికి దేవతలతో కలసి వచ్చి - "దశగ్రీవా! నీ విషయమున సంతోషించినాను; ధర్మములు తెలిసినవాడా! నీ కిష్టమైన వరము కోరుకొనుము. నీకు ఇప్పుడు నేను ఏ వరము ఇవ్వవలెను? నీకు చేసిన ఈ తపస్సు వ్యర్థము కాకూడదు" అని పలికెను. (10-14)

అప్పుడు దశగ్రీవుడు సంతోషించిన మనస్సుతో తల వంచి బ్రహ్మదేవునకు నమస్కరించి, సంతోషముచే డగ్గుత్తిక చెందిన వాక్కుతో- "పూజ్యుడా! ప్రాణులకు మరణము తప్ప మరిదేనినుండీ భయము లేదు. మృత్యువువంటి శత్రువు లేదు. మృత్యువు లేకుండుటను కోరుచున్నాను" అనెను. ఆ మాటలు విని బ్రహ్మదేవుడు దశగ్రీవునితో "నీకు పూర్తిగా మరణము లేకుండుట అనునది లేదు. మరొక వరమేదైనను కోరుకొనుము" అనెను. రామా! బ్రహ్మదేవుడు పలికిన మాటలు విని దశగ్రీవుడు అంజలి ఘటించి ఎదుట నిలచి- "నిత్యుడవైన ఓ! ప్రజాపతీ! నన్ను పక్షులు, నాగులు, యక్షులు, దైత్యులు, దానవులు, రాక్షసులు, దేవతలు చంపజాలకుండునట్లు వరమిమ్ము. నాకు ఇతర ప్రాణుల విషయమున చింత ఏదీ లేదు. మనుష్యులు మొదలైన ప్రాణులందరూ తృణములవంటి వారని తలచెదను" అనెను. (15-20)

బ్రహ్మదేవుడు రాక్షసుడైన దశగ్రీవుని మాటలు విని(21)

"ఓ! రాక్షసశ్రేష్ఠా! నీవు కోరినట్లే కాగలదు." అని పలికి మరల ఇట్లనెను. "నీ విషయమున సంతోషించిన నేను మరొక వరము ఇచ్చుచున్నాను; వినుము. పూర్వము నీవు అగ్నిలో హోమము చేసిన శిరస్సులు నీకు మరల పూర్వములాగనే రాగలవు. ఓ! సౌమ్యుడా! చాల దుర్లభమైన మరొక వరము కూడ నీ కిచ్చుచున్నాను. నీ మనస్సుకు ఏ రూపము, ఎట్లు ఇష్టమో అది నీ ఇచ్ఛానుసారముగా నా వరముచే లభించగలదు; సందేహము లేదు." బ్రహ్మదేవుడు చెప్పిన ప్రకారము, పూర్వము దశగ్రీవుడు హోమము చేసిన శిరస్సు లన్నీ మరల మొలచెను. (21-26)

రామా! సమస్తలోకములకు పితామహుడైన ఆ బ్రహ్మదేవుడు, రావణునితో ఇట్లు పలికి, పిదప విభీషణునితో- "నాయనా! ధర్మాత్ముడవు, మంచి వ్రతము కలవాడవు అయిన విభీషణా! నీ విషయమున సంతోషించితిని. వరము కోరుకొనుము" అనెను. కిరణములతో చంద్రుడువలె ఎల్లప్పుడు సర్వసద్గుణములతో కూడిన ధర్మాత్ముడైన విభీషణుడు చేతులు జోడించి నమస్కరించుచు - "భగవంతుడా! లోకమున కంతకు పూజ్యుడవైన నీవు స్వయముగా నా విషయమునందు సంతోషించినందుకు నేను కృతకృత్యుడను. ఆనందించిన నీవు నాకు వరము ఇవ్వదలచినచో, ఎట్టి ఆపదలలో ఉన్నను నా బుద్ధి ధర్మమునందు స్థిరముగా ఉండుగాక. ఉపదేశము లేకున్నను నాకు బ్రహ్మాస్త్రము స్ఫురించుగాక. బ్రహ్మచర్యాద్యాశ్రమములలో ఏ ఆశ్రమములో ఉన్నను నాకు ధర్మసంమతమైన బుద్ధియే కలుగుగాక. నేను ఆ ధర్మమును పాలింతునుగాక. ఇదే నాకు చాలా గొప్ప వరముగా ఇష్టమైనది. ధర్మాసక్తులకు లోకములో దుర్లభమైనది ఏదీ లేదు కదా?" అని కోరెను. బ్రహ్మదేవుడు సంతోషించి విభీషణునితో - "ధర్మాత్ముడవైన ఓ! విభీషణా! నీవు కోరినట్లే కాగలదు. నీవు రాక్షసవంశములో పుట్టినను నీ బుద్ధి అధర్మమునందు ప్రసరించుటలేదు. అందుచేత నీకు మరణము లేకపోవుటను కూడ వరముగా ఇచ్చుచున్నాను" అని పలికెను.(27-35)

విభీషణునితో ఇట్లు పలికి కుంభకర్ణునికి వరములిచ్చుటకై నిలచిన బ్రహ్మదేవుని దేవతలందరు అంజలులు ఘటించి - "బ్రహ్మదేవా! కుంభకర్ణునకు వరము ఇవ్వవద్దు. దుర్మతియైన ఇతడు లోకములను ఎట్లు బాధించుచున్నాడో నీకు తెలియును కదా? ఇతడు నందనవనములో ఏడుగురు అప్సరఃస్త్రీలను, పదిమంది మహేంద్రుని అనుచరులను, ఋషులను, మనుష్యులను భక్షించినాడు. ఈ రాక్షసుడు వరము పొందుటకు పూర్వమే ఇట్లు చేసినాడు. వరమును పొందినచో మూడు లోకములను భక్షించివేయును. వర మను మిషచేత ఇతనికి మోహము నిమ్ము. ఇట్లు చేసినచో లోకములకు క్షేమమగును. వీని కోరిక కూడ తీరును" ప్రార్థించిరి.(36-40)

దేవతల మాట విని, బ్రహ్మ సరస్వతిని తలచెను. అతడు తలచిన వెంటనే సరస్వతీదేవి వచ్చి పార్శ్వమునందు నిలచి, అంజలి ఘటించి - "ఓ! దేవా! ఇదిగో నేను వచ్చినాను. నేను ఏమి చేయవలెను?" అనెను. బ్రహ్మదేవుడు ఆ సరస్వతితో - "ఓ! వాణీ! నీవు కుంభకర్ణునియందు, దేవతలకు ఇష్టమైన వాక్కుగా అగుము" అనెను. "అట్లే చేసెదను" అని పలికి ఆ సరస్వతి వాని నోట ప్రవేశించెను. పిమ్మట బ్రహ్మదేవుడు - "మహాబాహువైన కుంభకర్ణా! నీ కే వరము ఇష్టమో కోరుకొనుము"

అని పలికెను. కుంభకర్ణుడు ఆ వాక్యము విని – "దేవదేవా! అనేక సంవత్సరములపాటు నిద్రించవలె నని కోరుచున్నాను." అని కోరెను. "అట్లే అగుగాక" అన పలికి బ్రహ్మ దేవతలతో కలిసి వెళ్ళి పోయెను. సరస్వతీదేవి కూడ ఆ రాక్షసుని విడిచెను. దేవత లందరు బ్రహ్మదేవునితో ఆకాశమార్గమున వెళ్ళిపోయిన పిమ్మట, సరస్వతీదేవి కూడ విడిచివేయగా ఆ రాక్షసునకు తన స్పృహ కలిగెను. దుష్టాత్ముడైన కుంభకర్ణుడు దుఃఖించుచు – "నా నోటినుండి ఇప్పుడు ఇట్టి మాట జారినది; ఇది ఏమి? ఇక్కడికి వచ్చిన ఆ దేవతలు నా కిట్లు మోహము కలిగించి ఉందురు" అనుకొనెను. ఆ సోదరులందరు ఈ విధముగ వరములు పొంది శ్లేష్మాతకవనమునకు వెళ్ళి అక్కడ సుఖముగా నివసించిరి. (41-49)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదవ సర్గము సమాప్తము.**

# పదకొండవ సర్గము

## రావణుడు లంకను ఆక్రమించుట.

ఈ రాక్షసులు వరములు పొందినట్లు తెలిసికొని సుమాలి భయము విడచి అనుచరులతో కూడ రసాతలమునుండి బైటకు వచ్చెను. సుమాలి మంత్రులైన మారీచుడు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, మహోదరుడు కూడ మంచి ఉత్సాహముతో పైకి వచ్చిరి. (1, 2)

సుమాలి మంత్రులైన రాక్షసశ్రేష్ఠులతో కలిసివచ్చి దశగ్రీవుణ్ణి కౌగిలించుకొని– "నాయనా! నీవు బ్రహ్మదేవునినుండి ఉత్తమమైన వరమును పొందినావు. అదృష్టవశముచేత నీవు కోరిన కోరిక సిద్ధించినది. విష్ణువువలన కలిగిన ఏ మహాభయముచేత మేము లంకను విడచి రసాతలమునకు వెళ్ళితిమో ఆ భయము తొలగినది. మేమందరము ఆ విష్ణువునకు భయపడి, మా నివాసము విడచి, కలసి పారిపోయి, రసాతలములో ప్రవేశించితిమి. ఈ లంకానగరము మనది. రాక్షసులు నివసించిన నగరము. దీనిని నీ సోదరుడు బుద్ధిమంతుడైన కుబేరుడు నివాసముగా చేసుకొనినాడు. మహాబాహూ! మనము సామోపాయముచేత గాని, దానముచేతగాని, బలప్రయోగముచేత గాని దీనిని మరల సంపాదించగలిగినచో మంచి పని చేసినట్లు అగును. నాయనా! నీవు ఈ లంకకు అధిపతివి కాగలవు. మునిగిపోయిన ఈ రాక్షసవంశమును నీవు ఉద్ధరించినావు. గొప్ప బలము గల నీవు మాకందరికీ

ప్రభువు కాగలవు" అని పలికెను.(3-9)

అపుడు దశగ్రీవుడు దగ్గరకు వచ్చిన మాతామహునితో - "కుబేరుడు మాకు పూజ్యుడు; నీవు ఇట్లు పలుకుట తగదు" అనెను. రావణుడు మృదువుగానే తాను చెప్పిన మాటను తిరస్కరించగా సుమాలి ఆ సమయమునందు అతని అభిప్రాయమును తెలుసుకొని ఇంక ఏమీ మాటలాడలేదు.(10, 11)

పిమ్మట కొంత కాలానికి అక్కడనే నివసించుచున్న రావణునితో ప్రహస్తుడు, హేతుగర్భితమైన వాక్యమును సవినయముగా ఇట్లు పలికెను- "మహాబాహువైన దశగ్రీవా! నీవు ఇట్లు పలుకుట తగదు. శూరులకు భ్రాతృప్రేమ అనునది ఉండ కూడదు. నేను చెప్పు ఈ మాట కూడ వినుము. పరమసౌందర్యవతులు, తోబుట్టువులూ అయిన అదితీ, దితీ ఇద్దరూ కూడ కశ్యపప్రజాపతి భార్యలు. అదితి మూడు లోకాలకు ప్రభువులైన దేవతలను కనెను. దితి కశ్యపునివలన దైత్యులను కనెను. సముద్రము వస్త్రముగా గల, పర్వతములతో కూడిన ఈ భూమి పూర్వము దైత్యులకు చెందినదై ఉండెను. ఈ దైత్యులు దీనిపై అధికారము కలవారై ఉండిరి. సామర్థ్యశాలియైన విష్ణువు దైత్యులను యుద్ధములో చంపి అనంతములైన ఈ మూడు లోకాలను దేవతల వశము చేసెను. సోదరునితో విరోధము పెట్టుకొనుట అనే విపరీతకృత్యమును నీవు ఒక్కడవే చేయుటలేదు. పూర్వము సురాసురులే చేసి ఉన్నారు. అందుచేత నేను చెప్పినట్లు చేయుము"(12-18)

దశగ్రీవుడు ఆ మాటలు విని, మనస్సులో సంతోషించి, క్షణకాలము ఆలోచించి, "సరే అట్లే చేసెదను" అని పలికి, ఆ ఉత్సాహముతోనే ఆ రోజునందే ఆ రాక్షసులందరితో కలసి వనమునకు వెళ్ళెను. త్రికూట పర్వతముపై ఉండి, మాటలలో నేర్పరియైన ప్రహస్తుణ్ణి దౌత్యము చేయుటకై పంపుచు - "ప్రహస్తా! నీవు శీఘ్రముగా వెళ్ళి ధనాధిపతియైన కుబేరునితో నా మాటగా ఇట్లు, సామపూర్వకముగా (బ్రతిమాలుకొనుచున్నట్లు)- "సౌమ్యుడవైన ఓ! కుబేరా! మహాత్ములైన రాక్షసులకు చెందిన ఈ లంకాపురములో నీవు నివాసమేర్పరచుకొన్నావు; ఇది నీకు తగదు. అందువలన నీవు ఇపుడు ఈ లంకను మాకు ఇచ్చివేసినచో నాకు సంతోషము కలిగించినవాడవు, ధర్మమును పాలించినవాడవు అగుదువు అని చెప్పుము" అని ఆదేశించెను.(19-24)

ప్రహస్తుడు కుబేరునిచే రక్షింపబడుచున్న లంకానగరమునకు వెళ్ళి అతనితో చాల ఉదారమైన వాక్యమును ఇట్లు పలికెను- "మంచి నియమములు గలవాడా,



నీ సోదరుడైన దశగ్రీవుడు నన్ను నీవద్దకు పంపినాడు. దశాననుని ఆజ్ఞచేత నేను చెప్పుచున్న వాక్యము వినుము. "పూర్వము, రమ్యమైన ఈ లంకానగరమును భయంకరమైన పరాక్రమము గల సుమాలి మొదలైన రాక్షసులు ముందుగా అనుభవించినారు. అందువలన నాయనా! కుబేరా! సామముచేత యాచించుచున్న దశగ్రీవునకు ఈ నగరమును ఇచ్చివేయుము. ఇప్పుడు నేను ఈ విషయమునే నీకు తెలుపుచున్నాను."(25-29)

కుబేరుడు ప్రహస్తుని మాటలు విని అతనికి ఇట్లు బదులుచెప్పెను - "ప్రహస్తా! రాక్షసు లెవ్వరూ లేని ఈ లంకను నాకు నా తండ్రి ఇచ్చినాడు. దీనిని నేను ప్రజలకు తగు దానగౌరవాదులు చేయుటద్వారా నివాసయోగ్యము చేసితిని. నీవు వెళ్ళి దశగ్రీవునితో చెప్పుము - "ఓ! మహాబాహూ! ఈ పట్టణము, నా ఈ రాజ్యము నీకు కూడ సంబంధించినవే. ఏ బాధలూ లేని రాజ్యమును అనుభవింపుము. నా రాజ్యము, ధనమూ కూడ నీతో నేను పంచుకొనవలసిన పనిలేదు. ఇవి మనమిద్దరము కలసి అనుభవించవలసినవి".(30-33)

కుబేరుడు ఇట్లు పలికి తండ్రి దగ్గరకు వెళ్ళి అయనకు అభివాదము చేసి, రావణుని మనస్సులోని కోరికను చెప్పెను - "తండ్రీ! ఈ దశగ్రీవుడు - "పూర్వము రాక్షసులు నివసించిన లంకను నాకు ఇచ్చివేయుము" అని కోరుచు నావద్దకు దూతను పంపినాడు. ఈ విషయమున నేనేమి చేయవలెనో చెప్పుము" మునిశ్రేష్ఠుడు,

బ్రహ్మర్షి అయిన ఆ విశ్రవసుడు ఆ మాటలు విని, తన ఎదుట అంజలి ఘటించి నిలచి ఉన్న కుబేరునితో- "కుమారా! నేను చెప్పుచున్న మాట వినుము. ఆ దశగ్రీవుడు ఈ విషయమును నాదగ్గర కూడ చెప్పినాడు. నేను చాల దుష్టబుద్ధిగల వానిని మందలించి అనేక విధాల చెప్పితిని. నేను కోపముతో - "ఇట్లు చేసినచో నీవు నశించెదవు" అని అనేక పర్యాయములు చెప్పినాను. కుమారా! శ్రేయస్కరము, ధర్మసంమతమూ అయిన నేను చెప్పుచున్న మాట వినుము. వరప్రదానముచేత ఏమీ తెలియని స్థితిలో ఉన్న, చాల దుర్మతియైన ఆ రావణుడు నా శాపముచేత కూడ దారుణమైన స్వభావము పొందినాడు. వానికేమీ మంచిచెడ్డలు తెలియుటలేదు. కుబేరా! అందుచేత నీవు లంకను విడచి, నీ అనుచరులతో కూడ కలసి కైలాసపర్వతమునకు వెళ్ళి అక్కడ నివాసార్థమై నగరము ఏర్పరుచుకొనుము. ఆ కైలాసప్రాంతమునందు నదులలో ఉత్తమమైన మందాకినీనది ఉన్నది. దాని జలము సూర్యునితో సమానములైన బంగారు పద్మములతోను, తెల్లకలవలతోను, నల్లకలవలతోను సుగంధము గల ఇతర వృక్షములతోను నిండి ఉండును. ఎల్లప్పుడూ విహరించే స్వభావము గల దేవతలు, గంధర్వులు, అప్సరఃస్త్రీలు, ఉరగులు, కింనరులు, సర్వదా ఆ ప్రాంతమునందు నివసించుచు క్రీడించుచుందురు. కుబేరా! నీవు ఈ రాక్షసునితో వైరము పెట్టుకొనుట మంచిదికాదు. ఇతడు గొప్ప వరము సంపాదించిన విషయము నీకు తెలియునుకదా"(34-44)

కుబేరుడు ఆ మాటలను తండ్రియందున్న గౌరవముచే అంగీకరించి, భార్యాపుత్రులతోను, ఆమాత్యులతోను కలసి, వాహనములు, రథములు వెంట తీసికొనిపోయెను. పిమ్మట ప్రహస్తుడు మనస్సులో సంతోషించుచు, మంత్రులతోను, తమ్ములతోను కూడి ఉన్న దశగ్రీవుని వద్దకు వెళ్ళి- "లంకానగరము శూన్యముగా ఉన్నది. కుబేరుడు దానిని విడచి వెళ్ళిపోయినాడు. నీవు మాతో కలసి దానిలో ప్రవేశించి అక్కడ నీ స్వధర్మమును పాలింపుము" అని చెప్పెను. మహాబలశాలియైన దశగ్రీవుడు ప్రహస్తుని మాటలు విని సోదరులతోను, సైన్యములతోను, అనుచరులతోను కలసి లంకానగరములో ప్రవేశించెను. దేవతల శత్రువైన ఆ రావణుడు కుబేరుడు విడచిపెట్టివేసిన, బాగుగా విభజింపబడిన విశాలమార్గములు గల ఆ లంకలో, దేవేంద్రుడు స్వర్గములో ప్రవేశించినట్లు ప్రవేశించెను. అక్కడ దశాననుడు రాక్షసులచేత రాజ్యమునందు అభిషిక్తుడై ఆ నగరమును నివాసముగా ఏర్పరుచుకొనెను. ఆ నగరము నల్లని మేఘముల వలె ఉన్న రాక్షసులతో పూర్తిగా నిండిపోయెను.(45-50)

కుబేరుడు తండ్రి మాటలపై గౌరవముచేత, చంద్రుడువలె తెల్లగానున్న కైలాసపర్వతముమీద, దేవేంద్రుడు స్వర్గమునందు అమరావతిని నిర్మించినట్లు, బాగా అలంకరింపబడిన శ్రేష్ఠములైన భవనాలతో ప్రకాశించుచున్న నగరమును నిర్మించుకొనెను.(51)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదకొండవ సర్గము సమాప్తము.**

# పన్నెండవ సర్గము

## శూర్పణఖ వివాహము; రావణాదుల వివాహములు, ఇంద్రజిత్తు పుట్టుట.

రాజ్యాభిషిక్తుడైన రావణుడు సోదరులతో కలసి సోదరియైన శూర్పణఖ వివాహమును గూర్చి ఆలోచించి, ఆమెను కాలకుని పుత్రుడైన, దానవనాయకుడైన విద్యుజ్జిహ్వునకు ఇచ్చి వివాహము చేసెను. రామా! రావణుడు శూర్పణఖకు వివాహము చేసిన పిమ్మట వేటకై వెళ్ళగా అక్కడ అతనికి దితి కుమారుడైన మయుడు కనబడెను. కన్యతో కూడిన అతనిని చూచి - "నీవు ఎవ్వరవు? మనుష్యులుగాని, మృగములుగాని లేని ఈ వనములో లేడికన్నులవంటి కన్నులు గల ఈమెతో ఒంటరిగా ఎందుకున్నావు?" అని ప్రశ్నించెను.(1-4)

ఆ విధముగా ప్రశ్నించుచున్న రావణునితో మయుడు - "ఇది ఎట్లు జరిగినదో దానిని అంతనూ నీకు చెప్పెదను; వినుము. నాయనా! హేమ అను అప్సరఃస్త్రీ ఉన్నది. నీవు విని ఉండవచ్చును. దేవతలు ఆమెను నాకు, దేవేంద్రునకు శచీదేవిని ఇచ్చినట్లు ఇచ్చినారు. నేను పదివేల సంవత్సరముల కాలము ఆమెయందు లగ్నమైన మనస్సుతో గడిపితిని. ఆమె దేవతల పనిమీద వెళ్ళినది. పదమూడు సంవత్సరములు గడిచినవి. పదునాల్గవ సంవత్సరము కూడా గడిచిపోయినది. అప్పుడు నేను వజ్రవైదూర్యములచేత చిత్రమైన బంగారు నగరమును మాయాశక్తిచేత నిర్మించితిని. ఆ హేమ దగ్గర లేకపోవుటచేత చాలా దుఃఖించుచు, దీనుడనై ఆ నగరమునందు నివసించితిని. ఈ కుమార్తెను తీసికొని ఆ పట్టణమునుండి వనమునకు వచ్చితిని. ఆ హేమ కుక్షిలో పెరిగిన ఈమె నా కుమార్తె. ఈమెకు భర్తను వెదకుచు ఈమెను కూడ తీసికొని వచ్చినాను. గౌరవమును కోరు ప్రతివారికీ కన్యకు తండ్రి అయి ఉండుట దుఃఖానికి కారణము కదా? కన్య తల్లితండ్రుల రెండు వంశాలను,

నిత్యము సంశయస్థితిలో ఉంచునుకదా? నాకు ఈ భార్యయందు ఇద్దరు పుత్రులు పుట్టినారు. మాయావి మొదటివాడు, రెండవవాడు దుందుభి. నీవు ప్రశ్నించినావు గాన నేను విషయ మంతా యథార్థముగా చెప్పినాను. ఇప్పుడు నీవు ఎవరివో, ఇక్కడికి ఎందుకు వచ్చినావో తెలిసికొన గోరుచున్నాను" అని చెప్పెను. (5-13)

ఆ మాటలు విని రావణుడు వినయపూర్వకముగా - "నేను పులస్త్యుని పుత్రుడను. నా పేరు దశగ్రీవుడు. నా తండ్రియైన విశ్రవస్సు బ్రహ్మనుండి మూడవవాడు" అని చెప్పెను. రామా! దశగ్రీవుని మాటలు విని దానవుడైన మయుడు, అతడు మహర్షి కుమారుడని తెలుసుకొని సంతోషించెను. అక్కడనే అతనికి తన కుమార్తెను ఇచ్చుటకు నిశ్చయించెను. అప్పుడు దైత్యేంద్రుడైన మయుడు రావణుని హస్తముచేత తన కుమార్తె హస్తమును గ్రహింపచేసి, నవ్వుచు అతనితో- "రాజా! ఈమె అప్సరయైన హేమ గర్భమునందు పుట్టిన మండోదరి అను నాకుమార్తెయైన కన్యక. ఈమెను పత్నిగా స్వీకరింపుము" అని పలికెను. రామా! దశగ్రీవుడు మయునితో "తప్పక అట్లే చేసెదను" అని చెప్పి, అక్కడ అగ్నిని ప్రజ్వలింపచేసి ఆమెను వివాహమాడెను. "ఇతడు దారుణస్వభావుడు కాగలడు"అని విశ్రవసుడు రావణునికి శాపమిచ్చి నట్లు మయునకు తెలియును. అయినను తాను కులమును చూచి కూతురును ఇచ్చెను. వ్యర్థము కానిది, చాలా ఆశ్చర్యకరము, గొప్ప తపస్సుచేత పొందబడినదీ అయిన శక్తిని కూడ రావణునకు మయు డిచ్చెను. ఆ శక్తినే రావణుడు లక్ష్మణునిమీద ప్రయోగించినాడు. (14-21)

సమర్థుడైన ఆ రావణుడు తాను ఈవిధముగా వివాహము చేసుకొని, నగరమునకు తిరిగి వెళ్ళి సోదరు లిద్దరికీ కూడ భార్యలను తీసుకుని వచ్చెను. రావణుడు వైరోచనుని దౌహిత్రి అయిన వజ్రజ్వాల అను కన్యను కుంభకర్ణునకు భార్యగా చేసెను. విభీషణుడు మహాత్ముడైన గంధర్వరాజైన శైలూషుని కుమార్తెయైన ధర్మము లన్నీ తెలిసిన సరమను వివాహమాడెను. ఆ కన్య మానససరోవరమునందు పుట్టెను. అప్పుడు వర్షాకాలమునందు ఆ మానససరస్సు వృద్ధి పొందెను. అప్పుడు ఆ శిశువు తల్లి స్నేహముతో - "ఓ! సరస్సా! పెరగకుము" అని పలికినది. అందువలన ఆ కన్యకు 'సరమ' అను పేరు వచ్చినది. ఆ రాక్షసులు ఈవిధముగా వివాహములు చేసుకొని, తమ భార్యలతో, గంధర్వులు నందనవనమునందు క్రీడించునట్లు, ఆ లంకలో క్రీడించిరి. (22-27)

కొంతకాలానికి మండోదరి మేఘనాదుడను పుత్రుణ్ణి కనెను. అతనినే మీరందరు ఇంద్రజిత్తు అని అనుచున్నారు. పూర్వము ఆ రావణకుమారుడు పుట్టీ

పుట్టగానే ఏడ్చుచు మేఘధ్వనివంటి ధ్వని చేసెను. రామా! అతడు చేసిన ధ్వనికి లంకాపట్టణమంతా జడమైపోయెను. తండ్రి అతనికి "మేఘనాదుడు" అని స్వయముగా నామకరణము చేసెను. రామా! అప్పుడా రావణపుత్రుడైన మేఘనాదుడు తల్లిదండ్రులకు సంతోషము కలిగించుచు, ఉత్తమలైన స్త్రీల సంరక్షణమునందు, కర్రలు కప్పిన నిప్పువలె, రమ్యమైన రావణాంతఃపురములో పెరిగెను.(28-32)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పన్నెండవ సర్గము సమాప్తము.**

# పదమూడవ సర్గము

## రావణుడు నిర్మింపచేసిన శయనగృహములో కుంభకర్ణుడు శయనించుట. రావణుని దురాగతాలు.

కొంత కాలానికి బ్రహ్మదేవుడు పంపిన తీవ్రమైన నిద్ర, ఆవులింతలు మొదలైన రూపములతో వచ్చి కుంభకర్ణుని ఆవహించెను. కుంభకర్ణుడు కూర్చొని ఉన్న సోదరునితో - "రాజా! నన్ను నిద్ర బాధించుచున్నది. నాకు గృహమును నిర్మింపచేయుము" అనెను. అప్పుడు రావణుడు ఆజ్ఞాపించగా విశ్వకర్మ వంటి శిల్పులు ఒక యోజనము (ఎనిమిది లేదా పది మైళ్ళు) వెడల్పు, దానికి రెండు రెట్లు (మూడు యోజనములు) పొడవు ఉన్న, చూచుటకు అందముగా ఉన్న విశాలమైన గృహమును కుంభకర్ణునికై నిర్మించిరి. రావణుడు నిర్మింపజేసిన ఆ మనోహరమైన గృహము అన్ని సుఖములతో నిండి ఉండెను. స్ఫటికమణులు పొదిగిన చిత్రవర్ణములైన బంగారు స్తంభములు అన్ని వైపులా ప్రకాశించుచుండెను. మెట్లు వైడూర్యమాణిక్యములు పొదిగి కట్టబడెను. అక్కడక్కడ చిరుగంటలు వ్రేలాడుచుండెను. దాని ముఖద్వారమునందు దంతముతో చేసిన శిల్పము లుండెను. అరుగులు వజ్రములతోను, స్ఫటికమణులతోను కట్టబడెను. పుణ్యమైన మేరుపర్వతగుహ వలె ఉన్న, అంతటా సుఖకరమైన ఆ గృహములో ప్రవేశించిన మహాబలశాలియైన కుంభకర్ణుడు కొన్నివేల సంవత్సరములు అట్లే శయనించి మేల్కొనలేదు.(1-7)

కుంభకర్ణుడు ఆ విధముగా నిద్రాపరవశుడై పడియుండగా రావణుడు, అడ్డులేనివాడై దేవతలను, ఋషులను, యక్షులను, గంధర్వులను పీడించెను. చాలా కోపించిన రావణుడు నందనము మొదలైన విచిత్రములైన ఉద్యానములకు వెళ్ళి వాటిని నశింపచేసెను. క్రీడించుచున్న ఏనుగు నదినివలె, ఎగురగొట్టుచున్న

వాయువు వృక్షములను వలె, ప్రయోగించిన వజ్రాయుధము పర్వతములను వలె, రావణుడు ఉద్యానాదులను ధ్వంసము చేసెను.(8–10)

రావణుడు ఆ విధముగా ప్రవర్తించుచున్నాడని తెలిసిన ధనాధిపతియైన, ధర్మవేత్తయైన కుబేరుడు తన వంశమునకు తగిన ప్రవృత్తిని దృష్టిలో ఉంచుకొని దశగ్రీవునకు హితమును ఉపదేశించుటకై ఒక దూతను లంకకు పంపెను. ఆ దూత లంకానగరము చేరి విభీషణుని వద్దకు వెళ్ళెను. విభీషణుడు అతనిని తగు విధముగా సత్కరించి వచ్చిన పనిని గూర్చి అడిగెను. విభీషణుడు కుబేరుడు మొదలైన బంధువుల కుశలవృత్తాంతము అడిగి, ఆ దూతకు సభలో కూర్చొని ఉన్న రావణుని చూపించెను. ఆ దూత, అక్కడ తన సహజతేజస్సుతో ప్రజ్వలించుచున్న ఆ రాక్షసరాజును చూచి "జయ విజయీ భవ" అని పలికి క్షణకాలము ఊరకుండెను.(11-15)

పిమ్మట ఆ దూత, శ్రేష్ఠమైన ఆస్తరణముతో ప్రకాశించుచున్న ఉత్తమమైన పర్యంకముపై కూర్చొని ఉన్న రావణునితో– "వీరుడవైన రాజా! మీ ఇద్దరి చరిత్రకు, కులమునకు తగు విధముగా నీ సోదరుడు చెప్పిన దంతా చెప్పెదను. మంచి నడవడికతో ఉన్నచో అదే చాలును. అందుచేత శక్యమైనచో నీవు ధర్మమార్గమును అవలంబించుము. రాక్షసరాజా! నీవు భగ్నము చేసిన నందనవనమును నేను చూచితిని. నీవు ఋషులను చంపినట్లుగా విన్నాను. నీ మూలమున దేవతలు నీ సంహారముకొరకై ప్రయత్నించుచున్నట్లు నేను విన్నాను. రాక్షసరాజా! నీవు నన్ను కూడ అనేకపర్యాయములు నిరాకరించినావు. బాలుడు అపరాధము చేసినను అతనిని బంధువులు రక్షించవలెను కదా? నేను రుద్రుని అనుగ్రహమును సంపాదించు వ్రతమును అవలంబించి నియమవంతుడనై, ఇంద్రియములను నిగ్రహించుకొని ధర్మమును ఉపాసించుటకై హిమవత్పర్వతముపైకి వెళ్ళితిని. అక్కడ నేను పార్వతితో కూడి ఉన్న సర్వసమర్థుడైన పరమేశ్వరుణ్ణి చూచితిని. దైవవశముచేత నా ఎడమకన్ను అక్కడ ఉన్న పార్వతిదేవి పై ప్రసరించినది. రాక్షసరాజా! ఈమె ఎవరై ఉండునా అను ఉద్దేశముతోనే నేను అట్లు చూచినాను. కాని మరోకారణముచేత కాదు. పార్వతి సాటిలేని రూపము ధరించి అక్కడ ఉండెను. దేవి దివ్యప్రభావముచేత నా ఎడమకన్ను మాడిపోయినది. దాని కాంతి బూడిద చల్లినట్లు పచ్చగా అయిపోయినది. (16–24)

పిమ్మట నేను ఆ పర్వతముమీదనే మరియొక విశాలమైన చరియకు వెళ్ళి

ఎనిమిదివందల సంవత్సరములు మౌనముతో ఆ మహావ్రతమును ఆచరించితిని. ఆ నియమము పూర్తియైన పిమ్మట అక్కడ, సమర్థుడైన మహేశ్వరుడు సంతోషించిన మనస్సుతో, నాతో- "ధర్మములు తెలిసిన, మంచి నియమములు గల ఓ! కుబేరా! నీ విషయమునందు సంతోషించితిని. ఈ వ్రతమును పూర్వము నేను చేసితిని; ఇప్పుడు నీవు చేసినావు. ఇట్టి వ్రతము చేయగల మూడవవాడు ఎవ్వడూ లేదు. చేయుటకు చాలా కష్టమైన వ్రతమును పూర్వము నేనే కనుగొన్నాను. అందువలన ఓ! కుబేరా! నీవు నాతో స్నేహమును అంగీకరించుము. తపస్సుచేత జయింపబడిన మిత్రుడవు అగుము. దేవి ప్రభావముచేత నీ ఎడమకన్ను కాలిపోయినది. దేవి రూపమును చూచుటవలన ఆ కన్ను పచ్చగా కూడ అయినది. అందువలన నీకు "ఏకాక్షిపింగలి" అను పేరు స్థిరముగా ఉండగలదు." ఈ విధముగా శంకరునితో స్నేహమును పొంది, అతని అనుజ్ఞ తీసికొని వచ్చిన నేను నీవు చేయుచున్న పాపకార్యములను గూర్చి వింటిని. అందువలన కులమునకు అపకీర్తిని తెచ్చు అధర్మకార్యములనుండి దూరముగా ఉండుము. ఋషులు, దేవతలు కలసి నిన్ను చంపుటకు ఉపాయము ఆలోచించుచున్నారు" అని పలికెను.(25-32)

ఆ మాటలు విన్న రావణుడు కోపముచేత కళ్ళు ఎఱ్ఱబడగా, చేతులు చరచి, పళ్ళు కొరకుచు- "ఓ! దూతా! నీవు పలికిన మాటలు విన్నాను. నీవు గాని, నిన్ను పంపిన నా సోదరుడు గాని ఇంక ఉండరు. ఆ కుబేరుడు చెప్పుచున్నది నాకు హితముకాదు. ఆ మూఢుడు తనకు మహేశ్వరునితో మైత్రి ఏర్పడినట్లు చెప్పుకొనుచున్నాడు కదా! ఓ! దూతా! నీవింతవరకు మాటలాడినది క్షమింపదగినది కాదు. నేనింతవరకు ఆ కుబేరుణ్ణి సహించుటచే "అన్న అగుటచే పూజ్యుడనైన నన్ను చంపడు" అని నన్ను గూర్చి అతడు అనుకొనుచున్నాడు. కాని, ఇప్పుడు వాని మాటలు విన్న పిమ్మట బాహుపరాక్రమముచేత మూడులోకములను జయింపవలెనని నిశ్చయించుకొన్నాను. ఆ కుబేరుడు ఇట్లు పలికినందుకు నేను ఈ క్షణమునందే ఆ నలుగురు లోకపాలకులను యమలోకమునకు పంపివేసెదను" అని పలికి, ఖడ్గముతో ఆ దూతను చంపి వానిని దుష్టులైన రాక్షసులకు భక్షించుటకై ఇచ్చెను. పిమ్మట రావణుడు స్వస్త్యయనము చేయించుకొని రథమునెక్కి మూడులోకములు జయించవలె నను కోరికతో కుబేరు డున్నచోటికి వెళ్ళెను.(33-41)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదమూడవ సర్గము సమాప్తము.**

# పదునాలుగవ సర్గము

## రావణుడు మంత్రులతో కలిసి వెళ్ళి యక్షులపై ఆక్రమణము చేయుట; యక్షులు ఓడిపోవుట.

బలముచేత ఉద్ధతుడైన శ్రీమంతుడైన ఆ రావణుడు, మహోదర-ప్రహస్త-మారీచ-సారణులతోను, నిత్యము యుద్ధమును కోరు వీరుడైన ధూమ్రాక్షునితోను, ఈ ఆరుగురు సచివులతో కలిసి, కోపమువలన లోకములను కాల్చివేయుచున్నాడా అన్నట్లు బయలుదేరి వెళ్ళెను. అతడు అత్యల్పకాలములో పట్టణములు, నదులు, పర్వతములు, వనములు, ఉద్యానములు దాటి కైలాసపర్వతమును చేరెను. ఆ పర్వతముమీద విడిసి ఉన్న, మంత్రులతో కూడిన, ఉత్సాహవంతుడైన, దురాత్ముడైన ఆ రాక్షసరాజు యుద్ధాభిలాషతో ఉన్నట్లు విని యక్షులు ఆ రాక్షసుని ఎదుట నిలబడజాలకపోయిరి. అతడు కుబేరుని సోదరు డని తెలిసికొని ఆ యక్షులు కుబేరుని వద్దకు వెళ్ళి అతని సోదరుడైన రావణుడు చేయదలచినదంతా తెలిపి, కుబేరుని అనుమతి పొంది సంతోషించుచు యుద్ధమునకు వెళ్ళిరి. అప్పుడు ఆ కుబేరుని సైన్యముల సంక్షోభము సముద్రసంక్షోభమువలె ఆ పర్వతమును కదల్చి వేయుచున్నదా అన్నట్లు వృద్ధిపొందెను.(1-7)

అప్పుడు యక్షరాక్షసుల మధ్య సంకులమైన యుద్ధము జరిగెను. రావణుని మంత్రులు వ్యథ చెందిరి. రావణుడు ఆ సైన్యమును చూచి, సంతోషముతో బిగ్గరగా అరచుచు, కోపముతో వెంటనే దాని కెదురుగా వెళ్ళెను. రావణుని భయంకరమైన పరాక్రమముగల మంత్రులలో ఒక్కొక్కడు వేయిమంది యక్షులతో యుద్ధము చేసెను. అప్పుడు ఆ యక్షులు గదలతోను, ముసలములతోను, ఖడ్గములతోను, శక్తులతోను, తోమరములతోను కొట్టుచుండగా రావణుడు ఆసైన్యములోనికి చొరబడెను. వర్షించుచున్న మేఘములువలె ఆ యక్షులు బాణాదుల ధారలతో ఊపిరి ఆడకుండేటట్లు కొట్టుచు ఆ రావణుని అడ్డుకొనిరి. యక్షులు ఆయుధములతో కొట్టుచున్నను రావణుడు, మేఘములచేత, జలధారలతో కొట్టబడిన పర్వతమువలె, ఏ మాత్రము వ్యథ చెందలేదు. అతడు యమదండముతో సమానమైన గదను గ్రహించి యక్షులను యమలోకమునకు పంపుచు ఆ సైన్యములో ప్రవేశించెను. వాయువుచే మండింపచేయబడిన అగ్ని ఎండిన కట్టెలతో చిందరవందరగా ఉన్న విశాలమైన దొంకను కాల్చివేసినట్లు ఆ యక్షులసైన్యమును కాల్చివేసెను.(8-15)

అక్కడ మహోదరుడు, శుకుడు మొదలైన మహామాత్యులు, వాయువులు

మేఘములను వలె, ఆ యక్షులను కొందరే మిగులునట్లు చేసిరి. ఆ యుద్ధములో కొందరు దెబ్బలు తిని, పరాజితులై నేలమీద పడిపోయిరి. మరికొందరు కోపముతో వాడియైన పండ్లతో పెదవులు కొరికిరి. కొందరు యక్షులు అలసిపోయి, శస్త్రములు జారవిడచి, ఒకరినొకరు కౌగిలించుకొనుచు, నీటిచేత నదుల ఒడ్డువలె కూలిపోయిరి. చంపబడిన యక్షు లందరు స్వర్గమునకు పోవుచుండిరి. యుద్ధముచేయుచున్న కొందరు పారిపోవుచుండిరి. అందుచే అక్కడ చూచుటకై వచ్చిన ఋషులకు ఆకాశమున నిలుచుటకు చోటు లేకపోయెను. కుబేరుడు ఆ యక్షనాయకులు ఓడిపోవుట చూచి మరికొందరు యక్షులను పంపెను. రామా! ఈలోపుగా అధికమైన సైన్యముతోను, వాహనములతోను సంయోధకంటకుడను యక్షుడు కుబేరుడు పంపగా శీఘ్రముగా రణరంగమునకు వచ్చెను. ఆ యక్షుడు విష్ణువువలె, యుద్ధమునందు చక్రముతో కొట్టగా మారీచుడు, పుణ్యము క్షీణించిన నక్షత్రమువలె పర్వతము నుండి నేలమీద పడెను. ఆ మారీచుడు ముహూర్తకాలములో స్పృహచెంది, కొంచెము విశ్రమించి ఆ యక్షునితో యుద్ధముచేసెను. అతడు పరాజితుడై పారిపోయెను.(16-23)

పిమ్మట రావణుడు ద్వారపాలకులు నిలచు సరిహద్దు అయిన ముఖద్వార మధ్యభాగములో ప్రవేశించెను. దాని భాగములు బంగారముచేత విచిత్రములుగా ఉండెను. ఆ ప్రాంతములందు వైడూర్యమాణిక్యముల పొడి చల్లబడెను. రామా! నిశాచరుడైన రావణుడు ప్రవేశించుచుండగా అతనిని సూర్యపాలు డను ద్వారపాలుడు అడ్డుకొనెను. ఆ విధముగా యక్షునిచేత నివారింపబడుచున్నను రావణుడు ప్రవేశించెను. రామా! నివారించినను ఆగని ఆ రాక్షసుడ్ని యక్షుడు ఆ తోరణమును పెకలించి కొట్టెను. వీరుడైన రావణుడు పర్వతశిఖరమువంటి ఆ తోరణముచేత కొట్టబడి రక్తము కార్చుచు గైరికాదిధాతుస్రావములతో (పర్వతాలమీద వేరువేరు రంగురాళ్ళు కరిగి కారుచుండును. వాటిలో గైరికాధాతువు ఎఱ్ఱగా ఉండును. ఆ రంగులకు ధాతువులని పేరు) పర్వతమువలె ప్రకాశించెను. కాని బ్రహ్మ వరము లిచ్చి ఉండుటచే మరణించలేదు. పిమ్మట రావణుడు ఆ తోరణముతోనే ఆ యక్షుడ్ని కొట్టగా అతని శరీరము చూర్ణమైపోగా అతడు కనబడలేదు. యక్షు లందరూ ఆ రాక్షసుని పరాక్రమమును చూచి పారిపోయిరి. భయపీడితులై, అలసి, ఆయుధములు విడచి, రంగు మారిపోయిన ముఖాలతో నదులలోను, గుహలలోను ప్రవేశించిరి.(24-30)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదునాలుగవ సర్గము సమాప్తము.**

# పదిహేనవ సర్గము

**మణిభద్రకుబేరులు ఓడిపోవుట. రావణుడు పుష్పకమును అపహరించుట.**

పిమ్మట కుబేరుడు భయపడి పారిపోవుచున్న వేలకొలది యక్షనాయకులను చూచి మహాయక్షుడైన మణిభద్రునితో – "ఓ! యక్షనాయకా! దుష్టప్రవృత్తీ, పాపమైన మనస్సూ గల రావణుణ్ణి చంపుము. యుద్ధములో ప్రకాశించు వీరులైన యక్షులకు శరణము అగుము" అని పలికెను. మణిభద్రుడు ఆ మాటలు విని, నాలుగువేలమంది యక్షులతో కలిసి వెళ్ళి యుద్ధము చేసెను. అప్పుడు ఆ యక్షులు రాక్షసులను గదలతోను, ముసలములతోను, ప్రాసలతోను, శక్తులతోను, తోమరములతోను, ముద్గరములతోను కొట్టుచు, శీఘ్రముగా వాళ్ళమీదకు పరుగెత్తి వెళ్ళిరి. యక్షులు చాలా వ్యాకులమైన యుద్ధము చేయుచు, డేగలవలె శీఘ్రముగా సంచరించుచు, "తప్పక (యుద్ధమును) ఇమ్ము; (వెనుకకు మరలుటకు) ఇచ్ఛయించను. (వాని ఆయుధాదికము) ఖండించుము." అని పలుకుచు వెళ్ళిరి. అప్పుడు దేవతలు, గంధర్వులు, వేదాధ్యయనము చేయు ఋషులు వ్యాకులమైన ఆ యుద్ధమును చూచి ఆశ్చర్యపడిరి. యుద్ధములో ప్రహస్తుడు వెయ్యిమంది యక్షులను చంపెను. మహోదరుడు నిందింపదగని వెయ్యిమంది యక్షులను చంపెను. రాజా! అప్పుడు కోపించిన, యుద్ధోత్సాహవంతుడైన మారీచుడు నిమేషము కాలములో రెండువేలమంది యక్షులను చంపెను. కపటము లేని యక్షుల యుద్ధమెక్కడ; మాయాబలముమీద ఆధారపడు రాక్షసుల యుద్ధము ఎక్కడ; ఆ కారణముచేతనే రాక్షసులు యుద్ధములో అధికులు. (1-9)

ఆ మహాయుద్ధములో ధూమ్రాక్షుడు మణిభద్రుని సమీపించి ముసలముతో అతని వక్షఃస్థలముమీద కొట్టెను; కాని అతడు కంపించలేదు. పిమ్మట మణిభద్రుడు గదను వేగముగా ఊపి ధూమ్రాక్షుని వక్షఃస్థలముమీద కొట్టగా అతడు వ్యాకులుడై పడిపోయెను. ధూమ్రాక్షుడు కొట్టబడి రక్తము స్రవించుచు పడిపోవుట చూచి రావణుడు యుద్ధరంగములో మణిభద్రునిమీదికి పరుగెత్తెను. కోపముతో తనమీదికి వచ్చుచున్న ఆ రావణుణ్ణి యక్షులలో శ్రేష్ఠుడైన మణిభద్రుడు మూడుశక్తులతో కొట్టెను. ఆ విధముగా యుద్ధములో కొట్టబడిన రావణుడు మాణిభద్రుని కిరీటముమీద కొట్టగా ఆ దెబ్బకు అతని కిరీటము ప్రక్కకు తిరిగిపోయెను. పిమ్మట ఆ మణిభద్రుడు యుద్ధముచేయుచు ఎదిరించినను రావణుడు కంపించలేదు. అది మొదలు మణిభద్రుడు 'పార్శ్వమౌళి'గా ప్రసిద్ధి చెందెను. రాజా! మహాత్ముడైన ఆ మణిభద్రుడు విముఖుడై వెళ్ళిపోగా ఆ పర్వతముమీద చాలా అధికమైన శబ్దము

వృద్ధిపొందెను.(10-16)

కుబేరుడు శుక్రుడు, ప్రోష్ఠపదుడు అను మంత్రులతోను, పద్మము, శంఖము అను నిధుల అధిష్ఠానదేవతలతోను కూడి, గద ధరించి దూరమునుండి కనబడెను. బుద్ధిమంతుడైన ఆ కుబేరుడు శాపవశముచేత గౌరవమును పోగొట్టుకొనిన ఆ రావణుణ్ణి యుద్ధములో చూచి, బ్రహ్మదేవుని కులములో పుట్టినవాడు పలకదగిన మాట పలికెను- ఓ! దుర్బుద్ధీ! నేను నివారించుచున్నను నీవు తెలుసుకొనుటలేదు. కొంతకాలము తరువాత నరకములో పడి నీవు దీనిఫలమును తెలిసికొనగలవు. తెలివితక్కువతనముచేత విషము త్రాగిన బుద్ధివిహీనుడు అది జీర్ణించినప్పుడు తాను చేసిన కర్మఫలమును తెలిసికొనును. నీవు ఏదైన ధర్మసంమతమైన పనిచేసినను దేవతలు అభినందించరు. నీకు ఇట్టి దుష్టబుద్ధి ఎందుకు కలిగినదో ఆ విషయమును తెలిసికొనజాలకున్నావు. తల్లిని, తండ్రిని, బ్రాహ్మణుని, గురువును అవమానించినవాడు మరణానంతరము తాను చేసిన పనికి ఫలము అనుభవించగలడు. ఈ శరీరము అస్థిరము. అట్టి ఈ శరీరమున్నప్పుడే తపస్సంపాదన చేయని మూఢుడు మరణానంతరము తాను పొందవలసిన దుర్గతిని పొంది పశ్చాత్తాపపడును. ధర్మమువలన రాజ్యము, ధనము, సౌఖ్యమూ కలుగును, అధర్మమువలన దుఃఖము కలుగును. అందువలన సుఖము కావలె నన్నచో ధర్మము ఆచరించవలెను. పాపమును విడువవలెను. పాపమునకు ఫలము దుఃఖము. ఆ దుఃఖమును ఇక్కడ, చేసినవాడే అనుభవించవలసి ఉండును. అందుచేత మూఢుడు మాత్రమే తన వినాశము కొరకై పాపము చేయును. బుద్ధివిహీనుడైన ఎవ్వనికీ కూడ మాతృపిత్రాదుల సేవ చేయకుండగా తనంతట తానుగా సద్బుద్ధి పుట్టదు. మానవుడు ఎట్టి కర్మ చేయునో అట్టి ఫలమునే పొందును. లోకములో నరులు పుణ్యకర్మలచేత జయించి బుద్ధిరూపమైన ఫలమును, పుత్రులను, ధనమును, శూరత్వమును పొందుదురు. ఇట్టి దుర్బుద్ధి గల నీవు నరకమునకే వెళ్ళుచున్నావు. నేను నీతో మాటలాడను. చెడ్డ నడవడిక గల వారి విషయమునందు ఇదే నిర్ణయము. (17-28)

మారీచుడు మొదలైన రావణుని అమాత్యు లందరితోను కూడ కుబేరుడు ఇట్లు పలికి వాళ్ళను కొట్టగా వాళ్ళు యుద్ధవిముఖులై పారిపోయిరి. పిమ్మట మహాత్ముడైన ఆ కుబేరుడు దశగ్రీవుని శిరస్సుమీద గదతో కొట్టెను. అయినను అతడు ఉన్న చోటునుండి చలించలేదు. రామా! అప్పుడా మహాయుద్ధమునందు కోపముతో ఒకరినొకరు కొట్టుకొనుచున్న ఆ కుబేరరావణులు వ్యాకులత చెందలేదు; అలసట పొందలేదు. అప్పుడు కుబేరుడు రావణునిపై ఆగ్నేయాస్త్రమును

ప్రయోగించగా అతడు వారుణాస్త్రముచేత నివారించెను. అపుడు రావణుడు రాక్షసమాయలో ప్రవేశించి కుబేరుని నశింపజేయుటకై ఎన్నో వేల రూపములు సృజించెను. రావణుడు పెద్దపులిగాను, వరాహముగాను, మేఘముగాను, పర్వతముగాను, సముద్రముగాను, వృక్షముగాను, యక్షుడుగాను, దైత్యుడుగాను కనబడెను. రామా! రావణుడు ఇంకా అనేకరూపములు కూడా సృజించెను. తాను మాత్రము కనబడలేదు. పిమ్మట గొప్ప గద అను ఆయుధమును తీసికొని దానిని గట్టిగా ఊపి కుబేరుని శిరస్సు మీద కొట్టెను. ఈ విధముగా అతడు కొట్టగా కుబేరుడు వ్యాకులుడై, రక్తముచేత తడిసి, మొదలు ఛేదించిన అశోకవృక్షమువలె పడిపోయెను. అపుడు పద్మము మొదలైన నిధులు(పద్మాదినిధ్యధిష్ఠానదేవతలు) ఆ కుబేరుని చుట్టూ చేరి, అతనిని నందనవనముచేర్చి సేదదీర్చిరి.(29-37)

రావణుడు కుబేరుని జయించి, మనస్సులో సంతోషించుచు, అతని పుష్పకవిమానమును విజయచిహ్నముగా అపహరించెను. ఆ పుష్పకవిమానమునందు బంగారు స్తంభములు, వైడూర్యమణులతో నిర్మించిన ముఖద్వారము ఉండెను. అది ముత్యముల సముదాయము చేత కప్పబడి ఉండెను. మనస్సుతో సమానమైన వేగముతో ఇష్టమైన రూపము ధరించి ఇష్టానుసారము ఆకాశములో ఎగురు ఆ విమానములో అన్ని కాలములందు పండ్లు ఇచ్చు వృక్షము లుండెను. మణులు పొదిగిన బంగారపుమెట్లు, శుద్ధమైన బంగారముతో కట్టిన అరుగులు గల ఆ విమానము దేవతల వాహనము. నాశము లేనిది. ఎల్లప్పుడు చూచుటకు మనస్సుకు సుఖకరముగా ఉండునది. నగిషీలతో చిత్రమై చాల ఆశ్చర్యకరమైన ఆ విమానమును బ్రహ్మ నిర్మించెను. అన్ని భోగ్యపదార్థాలతో నిర్మించిన ఆ విమానము మనోహరముగా ఉండెను. చాల ఉత్తమమైన ఆ విమానము చల్లగా కాక, వేడి లేక అన్ని ఋతువులలోను సుఖకరముగా ఉండెను. దుర్బుద్ధియైన ఆ రావణుడు తన పరాక్రమముచేత జయింపబడిన ఇచ్ఛానుసారము ప్రయాణము చేయు ఆ విమానమును ఎక్కి గర్వాతిశయముచేత మూడులోకాలను జయించినట్లు భావించెను. ఈ విధముగా కుబేరుణ్ణి జయించి కైలాసమునుండి క్రిందికి దిగెను.(38-44)

నిర్మలములైన కిరీటము, హారములు ధరించిన ప్రతాపవంతుడైన ఆ రావణుడు తేజస్సుచేత గొప్ప విజయమును పొంది, ఆ గొప్ప విమానమును అధిష్ఠించి, యజ్ఞశాలలో ఉన్న అగ్నివలె ప్రకాశించెను.(45)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదిహేనవ సర్గము సమాప్తము.**

# పదహారవ సర్గము

## నందీశ్వరుడు రావణుని శపించుట. పరమేశ్వరుడు రావణుని గర్వమును అణచుట.

రామా! ఆ రావణుడు సోదరుడైన కుబేరుణ్ణి జయించి మహాసేనుడు జనించిన స్థానమైన ఆ శరవణమునకు వెళ్ళి, గొప్ప బంగారు శరవణమును చూచెను. కిరణములచేత కప్పబడిన ఆ శరవణము రెండవ సూర్యుడువలె ఉండెను. అతడు రమ్యములైన వనమధ్యప్రదేశములు గల ఒక పర్వతము నెక్కెను. అప్పుడు తన పుష్పకము అక్కడ కదలకుండా నిలచిపోవుట చూచెను. స్వేచ్ఛగా సంచరించు ఆ పుష్పకము ముందుకు వెళ్ళకుండ చేయబడినదై కదలకుండా నిలచిపోవుటను చూచి రావణుడు మంత్రులతో ఆలోచించెను – "ఈ పుష్పకము నా ఇచ్ఛ ప్రకారము నడుచుటలేదు.కారణము ఏమై ఉండును? ఇది పర్వతముమీద ఉన్న ఎవని పనియో అయి ఉండును." అప్పుడు బుద్ధిశాలియైన మారీచుడు ఇట్లు పలికెను. "రాజా! ఈ పుష్పకము కదలుటలేదనగా దీనికి ఏదియో కారణము ఉండి ఉండవలెను. లేదా ఈ పుష్పకము కుబేరుడు తప్ప ఇతరులకు వాహనముగా ఉపయోగించదు. అందుచేతనే అతనికి దూరమగుటచేత ఇది ఆగిపోయినది."(1-7)

మారీచుని మాట పూర్తికాకుండగానే, ఇంతలో శివుని అనుచరుడు, నిత్యానందవంతుడు అయిన నందీశ్వరుడు నిర్భయముగా రావణుని వద్దకు వచ్చి ఇట్లు చెప్పెను. ధూసరవర్ణములో ఉన్న అతడు ముండితశిరస్కుడై పొట్టిగా, వికృతముగా, భయంకరుడుగా ఉండెను. బలవంతుడైన అతని భుజములు పొట్టిగా ఉండెను. "రావణా! వెనుకకు మరలిపొమ్ము. పర్వతముమీద శంకరుడు క్రీడించుచున్నాడు. పక్షులు, నాగులు, యక్షులు, దేవతలు, గంధర్వులు, రాక్షసులు, ఏ ఇతర భూతములూ, (ప్రాణులు) కూడ ఈ పర్వతముమీదికి రాకూడ దని శాసింపబడినది. అందువలన, ఓ! దుర్బుద్ధీ! వెనుకకు మరలుము. లేకున్నచో నశించగలవు." రావణుడు నందిమాటలు విని, కోపముచేత కుండలములు కదలగా, పుష్పకమునుండి దిగి, ఎఱ్ఱనైన నేత్రాలతో "ఈ శంకరుడు ఎవడు?" అని అనుచు పర్వతమూలమునకు వచ్చెను. అతడు అక్కడ శివుని సమీపమునందున్న నందీశ్వరుణ్ణి చూచెను. ప్రకాశించుచున్న శూలమును ఆనుకొని ఉన్న అతడు రెండవ శంకరుని వలె ఉండెను. ఆ రావణుడు అక్కడ వానరుని ముఖమువంటి ముఖము గల ఆ నందీశ్వరుణ్ణి చూచి, అవమానించుచు, నీటితో నిండిన మేఘమువలె బిగ్గరగా

నవ్వెను. (8-14)



శంకరుని రెండవ రూపమువంటి వాడైన పూజ్యుడైన ఆ నందీశ్వరుడు కోపించి, అక్కడకు వచ్చిన ఆ రావణునితో- "ఓ రావణా! నా వానరరూపము వంటి రూపమును చూచి, నన్ను అవమానించుచు పిడుగువలె ధ్వనిచేయుచు నవ్వినావు. అందుచేత నావంటి రూపము, నాతో సమానమైన పరాక్రమము గల వానరులు నీ కులమును నశింపజేయుటకై పుట్టగలరు. ఓ! క్రూరుడా! గోళ్ళు, కోరలు ఆయుధములుగా ఉపయోగించువారు, మనోవేగమువంటి వేగము గలవారు, యుద్ధమునందు బాగుగా మదించినవారు, బలముతో విజృంభించువారు, నడచే పర్వతములవలె ఉండువారు అయిన ఆ వానరు లందరు కలసి అమాత్యపుత్రసహితుడ వైన నీ బలమును, దర్పమును, అనేకవిధములైన ఔన్నత్యమును తొలగించగలరు. ఓ! రాక్షసుడా! నేను నిన్ను ఇప్పుడే చంపగలను కాని నీ పాపకర్మచేత పూర్వమే చచ్చిఉన్న నిన్ను చంపుట యుక్తము కాదు" అని శపించెను. (15-20)

మహాత్ముడైన ఆ నందీశ్వరుడు ఇట్లు పలకగానే దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్పవర్షము కూడ పడినది. అపుడు గొప్పబలము గల దశాననుడు నంది మాటలు లెక్కచేయక పర్వతమును సమీపించి- "ఈశ్వరుడా! నేను వెళ్ళుచుండగా దేని మూలమున నా పుష్పకము నడక ఆగిపోయినదో అట్టి ఈ నీ పర్వతమును పెకలించివేసెదను. ఈశ్వరుడు ఏ ప్రభావము చూచుకొని రాజువలె నిత్యము క్రీడించుచున్నాడు? భయపడవలసిన పరిస్థితి వచ్చినట్లు తెలిసికొనవలసి ఉన్నా తెలిసికొనుటలేదు" అని పలుకుచు, పర్వతముమీద భుజములను వేసి శీఘ్రముగా దానిని కదల్చెను. ఆ పర్వతము కంపించెను. పర్వతము కదల్చగానే ఈశ్వరుడు, ప్రమథ గణాలు చలించెను. పార్వతికూడ చలించెను. అమె అప్పుడు ఈశ్వరుణ్ణి కౌగిలించుకొనెను. రామా! అప్పుడు దేవతలలో శ్రేష్ఠుడు, సకలపాపహారుడు అయిన మహేశ్వరుడు కాలి బొటనవ్రేలితో, ఆనాయాసముగా ఆ పర్వతమును నొక్కెను. అపుడు ఆ పర్వతము క్రింద పడి రావణుని చేతులు నలిగిపోయినవి. అక్కడ ఉన్న అతని సచివులు ఆశ్చర్యపడిరి. అపుడు ఆ రాక్షసుడు రోషమువలన,

భుజములు నగిలిపోవుటవలన వెంటనే బిగ్గరగా అరచెను. దానితో మూడు లోకములు అదరిపోయెను. అతని అమాత్యులు, ఆ శబ్దమును ప్రళయకాలమునందు వజ్రములు నలిగిపోవుటనుగా లేదా ఉరుములనుగా తలచిరి. మార్గములలో సంచరించుచున్న ఇంద్రుడు మొదలైన దేవతలు ఉలికిపడిరి. సముద్రములు క్షోభ చెందెను. పర్వతములు కదలెను. యక్షులు, విద్యాధరులు, సిద్ధులు "ఇది ఏమి?" అని పలికిరి.(21-31)

అతని మంత్రులు అరచుచున్న అతనితో - "దశాననా! నల్లని కంఠముగలవాడు, ఉమాపతీ అయిన మహాదేవుణ్ణి సంతోషపెట్టుము. ఈ విషయమున రక్షించగలవాడు అతడు తప్ప మరెవ్వడూ మాకు కనబడుటలేదు. నీవు స్తుతించుచు నమస్కరించి ఆ మహాదేవుణ్ణి శరణుపొందుము. దయాశాలియైన ఆ శంకరుడు సంతోషించి నిన్ను అనుగ్రహించగలడు" అని చెప్పిరి. అమాత్యుల మాటలు విని దశాననుడు శివునకు నమస్కరించి సామలచేతను, అనేకవిధములైన స్తోత్రములచేతను ఆయనను స్తుతించెను. ఆ రాక్షసుడు ఏడ్చుచుండగా వేయి సంవత్సరములు గడచెను. రామా! పిమ్మట పర్వతాగ్రమునం దున్న సర్వసమర్థుడైన మహాదేవుడు సంతోషించి ఆ దశాననుని భుజములను విడచి(పైకి వచ్చునట్లు చేసి)- "ఓ! దశాననా! వీరుడవైన నీ దర్పానికి సంతోషించినాను, ఓ! రాక్షసరాజా! శైలము క్రింద నలిగిపోవుచు నీవు చాల భయంకరమైన ధ్వనిచేసినావు. ఆ ధ్వని విని ఈ మూడు లోకములు భయపడి ఏడ్చినవి. అందువలన నీకు "రావణుడు" అను పేరు ప్రసిద్ధిలోనికి రాగలదు. దేవతలు, మానవులు, యక్షులు, భూమిమీద ఉన్న ఇతరులు నిన్ను ఈ విధముగా లోకమును ఏడ్పించిన రావణుడని చెప్పుచుందురు. రావణా! నీవు ఏ మార్గమున వెళ్ళవలెనని కోరుచున్నావో ఆ మార్గమున నిర్భయముగా వెళ్ళుము. రాక్షసరాజా! నేను అనుజ్ఞ ఇచ్చుచున్నాను, వెళ్ళుము" అని పలికెను.(32-40)

మహేశ్వరుడు స్వయముగా పలికిన మాటలు విని రావణుడు - "మహాదేవా! నీవు అనుగ్రహించినట్లయితే యాచించుచున్న నాకు ఒక వరము ఇమ్ము. దేవతలు గాని, గంధర్వులు గాని, దానవులు గాని, రాక్షసులుగాని, యక్షులుగాని, నాగులుగాని, బలవంతులైన ఏ ఇతరులుగాని చంపజాలకుండేటట్లు నేను వరమును పొందితిని. దేవా! నేను మానవులను లెక్కచేయను. వాళ్ళు చాల తక్కువవాళ్ళని నా అభిప్రాయము. మహేశ్వరా! బ్రహ్మనుండి నేను దీర్ఘాయుర్దాయమును కూడా పొందితిని. నీవు కూడా నాకు గడిచిపోగా మిగిలిన ఆయుర్దాయమును, ఆయుధమును ఇమ్ము" అని కోరెను. రావణుడు అట్లు కోరగా శంకరుడు అతనికి చంద్రహాస మని ప్రసిద్ధి పొందిన గొప్ప కాంతిగల ఖడ్గమును, ఆయుర్దాయశేషమును, అనగా అతడు చేయు

పాపకృత్యములకు ఫలితముగా అకాలమృత్యువు రాకుండునట్లు వరమును ఇచ్చెను. శివుడు ఆ ఖడ్గమును ఇచ్చి - "నీవు దీనిని అవమానించకూడదు. అవమానించినట్లయితే ఇది మరల నాదగ్గరకు వచ్చివేయును; సందేహము లేదు" అని పలికెను.(41-46)

ఈ విధముగా మహేశ్వరుడు పేరుపెట్టిన ఆ రావణుడు మహాదేవునకు నమస్కరించి పిమ్మట పుష్పకవిమానము ఎక్కెను. రామా! పిమ్మట ఆ రావణుడు అక్కడక్కడ ఉన్న గొప్ప పరాక్రమము గల క్షత్రియులను బాధించుచు భూలోకమునందు సంచరించెను. తేజశ్శాలులు, శూరులు, యుద్ధమునందు మదించినవారు(యుద్ధానికి వెనుదీయనివారు) అయిన కొందరు క్షత్రియులు ఆ రావణుని ఆజ్ఞ ప్రకారము చేయకపోవుటచేత పరివారములతో నశించిరి. బుద్ధిమంతులైన మరికొందరు క్షత్రియులు ఈ రాక్షసుణ్ణి జయించుట కష్టమని గ్రహించి, బలముచేత దృప్తుడై ఉన్న అతనితో "మేము ఓడిపోయినాము" అని పలికిరి.(47-50)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదహారవ సర్గము సమాప్తము.**

# పదిహేడవ సర్గము

## రావణుడు అవమానించుటచే వేదవతి శపించి అగ్నిలో ప్రవేశించి జన్మాంతరమునందు సీతగా జన్మించుట.

రామా! అటుపిమ్మట మహాభుజములు గల ఆ రావణుడు భూమిమీద సంచరించుచు హిమవత్పర్వత ప్రాంతారణ్యమునకు వెళ్ళి అక్కడ సంచరించెను. అక్కడ రావణుడు దేవతాకన్యవలె ప్రకాశించుచున్న ఒక కన్యకను చూచెను. ఆమె వేదప్రోక్తములైన నియమములు పాటించుచు కృష్ణాజినమును, జటలను ధరించి ఉండెను. ఆ రావణుడు గొప్ప నియమమును అవలంబించి ఉన్న మంచి సౌందర్యముగల, ఆ కన్యను చూడగానే కామమోహములతో నిండిన మనస్సుతో నవ్వుచు- "మంగళప్రదురాలా! ఏమిది! నీవు నీ యౌవనమునకు విరుద్ధముగా ప్రవర్తించుచున్నావు? నీ ఈ సౌందర్యమునకు విరుద్ధముగా ఇట్టి ప్రవర్తన యుక్తము కాదు కదా! సాటిలేని నీ రూపము పురుషులకు కామోన్మాదమును కలిగించునది. తపస్సు చేయుటకు తగినది కాదు. ఇది లోకప్రసిద్ధమైన నిర్ణయము కదా? ఓ! భద్రురాలా! నీవు ఎవరిదానవు. నీ భర్త ఎవరు? నిన్ను అనుభవించు పురుషుడు ఈ

లోకములో పుణ్యాత్ముడు. నీ వీ తపస్సు ఎందుకు చేయుచున్నావు? అడుగుచున్న నాకు అంతా చెప్పుము" అని అడిగెను.(1-7)

తపోధనురాలైన ఆ కన్య రావణుని మాటలు విని, వానికి యథాశాస్త్రముగా ఆతిథ్యమిచ్చి- "గొప్ప తేజస్సు గలవాడు, బృహస్పతి కుమారుడు, బుద్ధిచేత బృహస్పతితో సమానుడు, శోభావంతుడు అయిన కుశధ్వజు డనే బ్రహ్మర్షి నాతండ్రి. నిత్యమూ వేదాభ్యాసము చేయు ఆ మహాత్మునకు వేదవాఙ్మయస్వరూపిణినైన నేను కన్యగా పుట్టినాను. నాపేరు వేదవతి. అపుడు దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు నా తండ్రి దగ్గరకు వెళ్ళి తమకు నన్ను ఇమ్మని కోరిరి. నాతండ్రి నన్ను వాళ్ళకి ఇవ్వలేదు. అందుకు కారణము చెప్పుచున్నాను; వినుము. దేవతల ప్రభువు, మూడులోకాలకు అధిపతి అయిన విష్ణువు తన అల్లుడు కావలెనని నా తండ్రికి కోరిక ఉండెను. అందుచే అతడు నన్ను మరెవ్వరికీ ఇచ్చుటకు అంగీకరించలేదు. శంభువు అనే దైత్యరాజు ఇందుకు కోపించెను. ఆ పాపాత్ముడు నా తండ్రిని రాత్రి నిద్రించుచుండగా చంపివేసెను. పిమ్మట మహాభాగ్యవంతురాలైన నా తల్లి దీనురాలై నా తండ్రి శరీరమును కౌగిలించుకొని అగ్నిలో ప్రవేశించినది. నారాయణుణ్ణి గూర్చి మాతండ్రికి ఉన్న మనోరథమును సత్యమైన దానిని చేయవలెనని నిశ్చయించుకొని నేను ఆ నారాయణుణ్ణే హృదయములో ఉంచుకొని ఉన్నాను. ఈవిధముగా ప్రతిజ్ఞ చేసి గొప్ప తపస్సు చేయుచున్నాను. ఈ విషయమంతా నీకు చెప్పినాను. నాకు నారాయణుడే భర్త. అతడు తప్ప మరొకడెవ్వడూ కాదు. ఆ నారాయణుణ్ణి పొందవలె నను కోరికచేతనే భయంకరమైన నియమమును అవలంబించి ఉన్నాను. రావణా! నిన్ను గూర్చి నాకు తెలియును. ఇంక వెళ్ళుము. మూడు లోకములలో ఉన్నది అంతా నాకు తపోబలముచేత తెలియును" అని చెప్పెను.(8-18)

మన్మథశరములచేత పీడింపబడిన ఆ రావణుడు విమానాగ్రభాగమునుండి దిగి, గొప్ప తపస్సు చేయుచున్న ఆ కన్యతో మరల- "ఓ! సుశ్రోణీ! ఇట్టి ఆలోచన గల నీవు గర్వముతో ఉన్నావు. ఈ విధముగా తపస్సు చేయుట అనునది ముసలివాళ్ళకు మాత్రమే తగిన పని. సమస్తసద్గుణములు ఉన్నదానవు. మూడు లోకములలో సుందరివి అయిన నువ్వు ఇట్లు పలుకుట తగదు. నీ యౌవనము దాటి పోవుచున్నది. ఓ! మంగళప్రదురాలా! నేను లంకాధిపతిని. దశగ్రీవుడు అని ప్రసిద్ధి చెందినవాడను. అట్టి నాకు భార్యవై నీవు సుఖముగా భోగములు అనుభవింపుము. నీవు విష్ణువని అనుచున్నవాడు ఎంతటివాడు! నీవు కోరుచున్న ఆ విష్ణువు వీర్యముచేత గాని,



తపస్సుచేత గాని, భోగముచేత గాని, బలముచేత గాని నాతో సమానుడు కాదు" అనెను.(19-23)

వాని మాటలు విని వేదవతి "అట్లనకుము, అట్లనకుము" అని పలికెను. ఆ కన్య ఆ రాక్షసునితో మరల- "రాక్షసరాజా! నీవు తప్ప బుద్ధిమంతుడైన మరెవ్వడైనా మూడులోకముల అధిపతీ, సర్వలోకములచేత నమస్కరింపబడువాడూ అయిన విష్ణువును అవమానించునా?" అనెను. ఆ వేదవతి అట్లు చెప్పుచుండగా రావణుడు హస్తాగ్రముతో ఆమె శిరోజములను పట్టుకొనెను. అప్పుడు వేదవతి కోపించినదై హస్తముచేత కేశములను ఛేదించెను. అప్పుడు ఆమె హస్తము కత్తిగా అయి కేశములను ఛేదించెను. రోషముతో మండుచున్నదా అన్నట్లున్న ఆమె రావణుణ్ణి కాల్చివేయుచున్నదా అన్నట్లు చూచుచు, అగ్నిని ఏర్పరచుకొని, మరణించుటకు తొందరపడుచు రావణునితో- "ఓ! చెడ్డ రాక్షసుడా! నీనుండి అవమానము పొందిన పిమ్మట నేను జీవించుటకు ఇచ్ఛయించను. నీవు చూచుచుండగానే అగ్నిలో ప్రవేశించెదను. పాపాత్ముడవైన నీవు నన్ను వనములో అవమానించినావు. అందువలన నిన్ను చంపుటకై నేను మరల జన్మించెదను. పాపనిశ్చయము గల పురుషుణ్ణి స్త్రీ చంపజాలదు కదా? నీకు శాపమిచ్చినచో నా తపస్సు వ్యయమైపోవును. నేను ఏదైన మంచిపనికాని, దానముకాని, హోమము కాని చేసి ఉన్నచో దానికి ఫలితముగా రాబోవు జన్మలో ఒక ధర్మాత్ముని అయోనిజయైన కుమార్తెగా, పతివ్రతగా పుట్టగలను" అని పలికి ప్రజ్వలించుచున్న అగ్నిలో ప్రవేశించెను. అపుడు అంతటా దివ్యమైన పుష్పవృష్టి కురిసెను.(24-33)

పద్మమువంటి కాంతి గల ఆమె మరల పద్మములో జనించెను. ఆ రాక్షసుడు మరల ఆమెను గ్రహించెను. పద్మమధ్యభాగము వంటి కాంతి గల ఆ కన్యను గ్రహించి ఆ రావణుడు తన ఇంటికి వెళ్ళెను. ఈమెను తీసుకొని వెళ్ళి మంత్రికి చూపెను. సాముద్రికలక్షణములు తెలిసిన ఆ మంత్రి ఆ శిశువును చూడగానే రావణునితో "ఈమె నీ వధకొరకే గృహము చేరినది" అని పలికెను. రామా! ఆ మాట విని రావణుడు ఆమెను సముద్రములోనికి విసిరివేసెను. ఉత్తమురాలైన ఆమె భూమిని చేరి, జనకుని నాగలి అగ్రభాగముచేత గీయబడినదై మరల పైకి

వచ్చినది. ఓ! ప్రభూ! జనకుని కుమార్తెగా పుట్టిన ఈమెయే నీ భార్య. ఓ! మహాబాహూ! నీవు సనాతనుడవైన విష్ణుమూర్తివే కదా! పర్వతమువంటి ఈ శత్రువును పూర్వమే వేదవతి తన కోపముచేత పరాక్రమవిహీనునిగా చేసినది. ఆమెయే శ్రేష్ఠమైన నీ పరాక్రమము సాహాయ్యముతో వీనిని సంహరించినది. వేదికలోని అగ్నిశిఖతో సమానురాలైన ఈ మహాభాగ్యవంతురాలైన వేదవతి, నాగలిచేత దున్నిన క్షేత్రమునందు, మరల మానవులలో పుట్టినది. పూర్వము కృతయుగమునందు వేదవతి అను పేరుతో ఉన్న ఈమె త్రేతాయుగమునందు రావణుని సంహరించుటకు మహాత్ముడైన జనకుని కులమునందు జనించినది. సీతనుండి(నాగలిచాలునుండి) జనించుటచే ఈమెను మానవులు 'సీత' అని అనుచున్నారు.(34-42)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదిహేడవ సర్గము సమాప్తము.**

# పద్దెనిమిదవ సర్గము

## రావణుడు మరుత్తుని జయించుట, దేవతలు నెమళ్ళు మొదలైనవాటికి వరము లిచ్చుట.

వేదవతి అగ్నిలో ప్రవేశించిన పిమ్మట ఆ రావణుడు పుష్పకమును ఎక్కి భూలోకమునందు సంచరించెను. అతడు ఉశీరబీజ మను క్షేత్రమునకు వెళ్ళి అక్కడ యాగముచేయుచున్న మరుత్తమహారాజును, హవిర్భాగములకొరకు వచ్చి ఉన్న దేవతలను చూచెను. సాక్షాత్తు బృహస్పతి సోదరుడు, ధర్మములు ఎరిగినవాడూ అయిన సంవర్తు డను బ్రహ్మర్షి సమస్తదేవగణములతో కూడినవాడై యాగము చేయించెను. వరదానముచేత జయింపశక్యము కాని ఆ రాక్షసుణ్ణి చూచి, దేవతలు అతడు ఎదిరించునని భయపడి తిర్యగ్జంతువులలో ప్రవేశించిరి. ఇంద్రుడు నెమలిగాను, యముడు కాకిగాను, కుబేరుడు తొండగాను, వరుణుడు హంసగాను అయ్యెను. శత్రుసంహారకుడవైన రామా! ఇతరదేవతలు కూడా ఈ విధముగా ఆ యా తిర్యగ్జంతువుల రూపములు ధరించిరి. అప్పుడు రావణుడు అశుచియైన కుక్కవలె యజ్ఞశాలలో ప్రవేశించి ఆ రాజువద్దకు వెళ్ళి "నాతో యుద్ధమైన చేయుము; లేదా ఓడిపోయినానని అంగీకరించుము" అని పలికెను.(1-7)

అప్పుడు మరుత్తమహారాజు "నీవు ఎవ్వడవు?" అని అతనిని అడిగెను. అది విని రావణుడు బిగ్గరగా నవ్వి- "రాజా! కుబేరుని తమ్ముడను, రావణుడను అయిన

నన్ను కూడ నీవు గుర్తించలేదన్నచో నీతో ఉన్న ఆశ్చర్యపడకపోవుట(తెలియవలసిన విషయములు కూడ తెలిసికొనకపోవుట) అనే గుణమును చూచి నేను సంతోషించుచున్నాను. సోదరుణ్ణి జయించి ఈ విమానమును హరించిన నా బలమును గూర్చి తెలియనివాడు ఈ మూడు లోకాలలో నీవు తప్ప మరొకడు ఎవ డున్నాడు?" అని పలికెను. అప్పుడు మరుత్తమహారాజు రావణునితో "యుద్ధములో అన్నగారిని జయించిన నీవు ఎంత ధన్యుడవు! – నీవంటి శ్లాఘ్యుడు (పొగడతగినవాడు) ఈ మూడు లోకాలలోను లేడు! లోకవిరుద్ధమైన, అధర్మరూపమైన కర్మను ఎవరూ శ్లాఘించరు. నీవు దురాత్ములు చేయు పని చేసి సోదరుణ్ణి జయించినా నని బడాయి చెప్పుకొనుచున్నావు. నీవు ఏ ధర్మమును మాత్రము ఆచరించి వరమును పొందినావు? నీవు స్వయముగా చెప్పుకొనుచున్న ఆ విషయమును నేను పూర్వము వినలేదు. ఓ! దుర్మతీ! నిలబడుము; నీవు ప్రాణాలతో తిరిగి వెళ్ళవు. ఇపుడు వాడియైన బాణాలచేత నిన్ను యమలోకమునకు పంపెదను" అనుచు కోపించి, ధనుస్సును, బాణములను గ్రహించి యుద్ధమునకై బయలుదేరగా సంవర్తుడు అతనిని అడ్డగించెను. (8–15)

మహాఋషియైన సంవర్తుడు మరుత్తునితో స్నేహపూర్వకముగా "నీవు నా మాట విన్నచో ఇప్పుడు యుద్ధము చేయుట తగదు. మహేశ్వరుని ఉద్దేశించి చేయుచున్న ఈ యజ్ఞము సమాప్తము కానిచో కులమును దహించివేయును. దీక్షలో ఉన్నవాడు కోపము చెందకూడదు, యుద్ధము చేయగూడదు కదా? జయము ఎల్లప్పుడూ సంశయాస్పదమే. ఈ రాక్షసుడు జయింప శక్యము కానివాడు" అని బోధించెను. మరుత్తుడు గురువు పలికిన మాటలు విని ధనుర్బాణములను విడచి, స్వస్థచిత్తుడై యజ్ఞశాలాభిముఖుడయ్యెను. పిమ్మట శుకుడు అతడు జయింపబడినట్లు గ్రహించి ఆ విధముగా చాటించెను. "రావణుడు సర్వోత్కర్షగా ఉన్నాడు" అని బిగ్గరగా అరచెను. యజ్ఞము నిమిత్తమై వచ్చి అక్కడ ఉన్న ఋషులను భక్షించి, వాళ్ళ రక్తముచేత బాగా తృప్తిచెంది రావణుడు మరల భూలోకమునకు వెళ్ళెను. (16–21)

రావణుడు వెళ్ళిపోయిన పిమ్మట ఇంద్రుడు మొదలైన ఆ దేవతలు తమ తమ రూపములు దాల్చి ఆ జంతువులతో ఇట్లు పలికిరి. ఇంద్రుడు నల్లని పింఛము గల నెమలితో సంతోష పూర్వకముగా – "ధర్మములు తెలిసినదానా! నీ విషయమున సంతోషించినాను. నీకు సర్పములవలన భయము ఉండదు, నాకున్న ఈవేయి కళ్ళు నీ పింఛముమీద ఉండగలవు. నేను వర్షములు కురిపించినప్పుడు నీకు ఆనందసంతోషములు కలుగగలవు" అని పలుకుచు, నెమలికి వర మిచ్చెను. రాజా! పూర్వము నెమళ్ళ పింఛములు నల్లగా(నీలముగా) ఉండెడి వట. నెమళ్ళన్నీ

ఇంద్రునివలన వరము పొంది వెళ్ళిపోయినవి. యజ్ఞశాలలోని కఱ్ఱమీద ఉన్న కాకితో యముడు "ఓ! పక్షీ! నీ విషయమున సంతోషించితిని. సంతోషించుచున్న నా మాట వినుము. ఇతర ప్రాణులను నేను వివిధరోగాలచే పీడించుచుందును. కాని నీ విషయమున సంతోషించినాను గాన నీకు ఆ రోగాలబాధ ఉండదు. సందేహములేదు. ఓ! పక్షీ! నేను వరము ఇచ్చుచున్నాను; నీకు మృత్యుభయము లేదు. నరులు నిన్ను చంపేవరకు నీవు జీవించి ఉందువు. నీవు భుజించినచో నా లోకములో ఆకలితో బాధపడుచున్న మానవులు, వారి బంధువులు తృప్తిపొందెదరు" అని పలికెను. (22-29)

పిమ్మట వరుణుడు గంగాజలమునందు సంచరించు, పక్షిరాజైన హంసతో ప్రేమపూర్వకముగా - "నీ రంగు మనోహరము, సుందరము, చంద్రమండలముతో సమానము. ఉత్తమము, పరిశుద్ధమైన నురుగువంటి కాంతి గలది అయి ఉండగలదు. నీవు నా శరీరమైన జలముమీద ఎల్లప్పుడు విహరించుచు, మనోహరముగా ఉందువు; అధికమైన సంతోషము పొందెదవు. ఇది నాకు నీవిషయమున కలిగిన సంతోషమునకు లక్షణము(గుర్తు)" అని పలికెను. రామా! పూర్వము హంసలు పూర్తిగా తెల్లగా ఉండెడివికాదు. వాటి రెక్కలు చివరి భాగములు నీలవర్ణముతోను, వక్షఃస్థలము పచ్చగడ్డి చిగుళ్ళ రంగులోను ఉండెడివి. పిమ్మట కుబేరుడు పర్వతముమీద ఉన్న తొండతో - "నీ విషయమున నాకు సంతోషము కలిగినది. నీకు బంగారు రంగు ఇచ్చుచున్నాను. నీ శిరస్సు అక్షయముగా ద్రవ్యముతో (పదార్థముతో) నిండి ఉండును. నేను సంతోషించుచున్నాను గాన నీ వర్ణము బంగారు వర్ణము కాగలదు" అని పలికెను. ఆ యజ్ఞమహోత్సవమునందు ఆ దేవతలు వాటికి ఈవిధముగా వరములు ఇచ్చి ఆ రాజుతో కలసి వెళ్ళి మరల తమ ఇండ్లకు వెళ్ళిపోయిరి. (30-36)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పద్దెనిమిదవ సర్గము సమాప్తము.**

# పందొమ్మిదవ సర్గము

**రావణుడు అనరణ్యుణ్ణి వధించుట. మరణానికి ముందు అతడు రావణుని శపించుట.**

రాక్షసరాజైన ఆ రావణుడు మరుత్తుని జయించి, యుద్ధమును కోరుచు, రాజుల నగరములకు వెళ్ళెను. అతడు మహేంద్రవరుణుల వంటి ఉత్తములైన రాజులవద్దకు వెళ్ళి "నాకు యుద్ధమును ఇవ్వండి (నాతో యుద్ధానికి రండి) లేదా ఓడిపోయినా మని ఒప్పుకొనండి. ఇదే నా ధృఢమైన నిశ్చయము. మరొక విధముగా చేసినచో మీకు మోక్షము(విడుదల) లేదు" అని పలికెను. అప్పుడు భయములేనివారు, బుద్ధిమంతులు, భూమికి ప్రభువులు, ధర్మసంమతమైన నిశ్చయము గలవారు, సైన్యములతో కూడినవారు అయిన రాజులు ఒకరితో ఒకరు ఆలోచించుకొని, శత్రువునకున్న వరబలమును తెలిసికొని "ఓడిపోయినాము" అని ఒప్పుకొనిరి. రామా! దుష్యంతుడు, సురథుడు, గాధి, గయుడు, పురూరవుడు, ఈ రాజు లందరూ ఓడిపోయినామని అంగీకరించిరి. రాక్షసరాజు, లోకములను ఏడ్పించినవాడూ, ప్రసిద్ధుడూ అయిన ఆ రావణుడు దేవేంద్రునిచేత అమరావతి వలె అనరణ్యమహారాజుచేత రక్షింపబడుచున్న అయోధ్యకు వెళ్ళి, దేవేంద్రునివంటి బలము గల ఆ రాజును సమీపించి, "నీవు నాతో యుద్ధమైనా చేయుము; లేదా ఓడిపోయినానని పలుకుము, ఇది నా శాసనము" అని పలికెను.(1-8)

అయోధ్యాప్రభువైన ఆ అనరణ్యుడు పాపాత్ముడైన అతని మాటలు విని, మిక్కిలి కోపించి- "రాక్షసరాజా! నీకు నేను యుద్ధము నిచ్చెదను. నిలువుము. వెంటనే సన్నద్ధుడవు అగుము; నేనుకూడా సిద్ధమగుచున్నాను" అనెను. రావణుని గూర్చి విని ఉన్న అనరణ్యుడు ముందుగానే నిశ్చయించిన చాలా పెద్ద సైన్యము, ఆ రాజూ కూడ రావణుని చంపుటకు శీఘ్రముగా బయలుదేరిరి. రామా! పదివేల ఏనుగులు, లక్ష గుఱ్ఱాలు, ఎన్నో వేల రథాలు, కాలిబంట్లు వెడలెను. కాలిబంటుల, రథములు ఉన్న ఆ సైన్యము భూమిని కప్పివేసి యుద్ధమునకు బయలుదేరెను. రాజా! పిమ్మట అనరణ్యమహారాజునకు, రావణునకు మధ్య ఆశ్చర్యకరమైన గొప్ప యుద్ధము జరిగినది. ఆ రాజు సైన్యమంతా రావణసైన్యమును చేరి, అగ్నిలో హోమముచేసిన హోమద్రవ్యము వలె నశించెను. మిగిలిన సైన్యము చాలా చేపు యుద్ధముచేసి, గొప్ప పరాక్రమము చూపి, ప్రజ్వలించుచున్న ఆ రావణుని సమీపించి, వ్యాకులమై, అగ్నిలో మిడతలు ప్రవేశించినట్లు అతనిలో ప్రవేశించినది. మహాసముద్రమును చేరి అదృశ్యమైపోవుచున్న వందలకొలది నదులవలె

నశించిపోవుచున్న ఆ మహాసైన్యమును రాజు చూచెను.(9-17)

అప్పుడు ఆ రాజు కోపావేశముతో ఇంద్రధనుస్సు వంటి ధనుస్సును చరచుచు స్వయముగా రావణుని మీదకు యుద్ధమునకు వెళ్ళెను. రావణుని అమాత్యులైన ప్రహస్త-మారీచ-శుక-సారణులు అనరణ్యునిచేత ఓడింపబడినవారై పారిపోయిరి. అప్పుడు అనరణ్యుడు ఎనిమిదివందల బాణములను ఆ రావణుని శిరస్సుపై వర్షించెను. రావణుని మీద పడుచున్న ఆ బాణములు, మేఘములనుండి పర్వతశిఖరముమీద పడుచున్న జలధారలవలె అతనికి ఏమాత్రము పీడ కలిగించలేదు. అపుడు కోపించిన రావణుడు అరచేతితో శిరస్సుమీద కొట్టగా ఆ రాజు రథమునుండి పడిపోయెను. ఆ రాజు వ్యాకులుడై, వణకుచు, అరణ్యములో పిడుగుపాటుకు కాలి పడిపోయిన సాలవృక్షము వలె నేలపై కూలెను. రావణుడు నవ్వి ఇక్ష్వాకువంశమునందు పుట్టిన ఆ రాజుతో - "నన్ను ఎదిరించి యుద్ధము చేసిన నీవు ఇప్పుడు ఏమి ఫలమును పొందినావు? రాజా! నాతో ద్వంద్వయుద్ధము చేయగలవాడు మూడులోకములలోనూ లేడు. నీవు భోగాసక్తుడవై నా బలమును గూర్చి విని ఉండ వని తలచెదను" అనెను.(18-25)

అతని మాటలు విని ప్రాణబలము తగ్గిపోవుచున్న ఆ రాజు- "ఈ విషయమున ఏమి చేయగలను? కాలమును అతిక్రమింపజాలము కదా? ఓ! రాక్షసరాజా! వీరుడ నని చెప్పుకొనుచున్న నీవు నన్ను జయించలేదు. కాలమే నాకీ ఆపద కలిగించినది. నీవు కేవలము నిమిత్తమాత్రమైనావు. రాక్షసుడా! కాలప్రభావముచేత ప్రాణాపాయము వచ్చినపుడు నేను ఏమి చేయగలుగుదును? నేను యుద్ధమునుండి పారిపోలేదు కదా? యుద్ధముచేయుచుండగానే నన్ను నీవు చంపినావు(మరణించేటట్లు కొట్టినావు). రాక్షసుడా! నీవు ఇక్ష్వాకువంశమును అవమానించితివి. అందుచేత చెప్పుచున్నాను - నేను దానములు చేసినట్లయితే, హోమములు చేసినట్లయితే, గొప్ప తపస్సు చేసి ఉన్నట్లయితే, ప్రజలను బాగుగా రక్షించినట్లయితే నా వాక్యము సత్యము అగుగాక. మహాత్ములైన ఇక్ష్వాకురాజుల ఈ వంశమునందు దశరథుని కుమారుడు రాముడు పుట్టి నీ ప్రాణములను తీయగలడు" అని పలికెను. అనరణ్యుడు ఆ శాపవాక్యమును పలుకుచున్నప్పుడు గంభీరముగా దేవదుందుభి మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవర్షము కురిసెను. రామా! అటుపిమ్మట అనరణ్యుడు స్వర్గస్థుడయ్యెను. అతడు స్వర్గస్థుడైన పిమ్మట రావణుడు అచటినుండి వెళ్ళిపోయెను.(26-32)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పందొమ్మిదవ సర్గము సమాప్తము.**

# ఇరువదవ సర్గము

**నారదుని ప్రేరణచేత రావణుడు యుద్ధమునకై యమలోకమునకు వెళ్ళుట.**

పిమ్మట భూలోకమునందున్న మానవులను భయపెట్టుచు సంచరించుచున్న రావణుడు మేఘమండల సమీపమునందు మునిశ్రేష్ఠుడైన నారదుని చూచెను. నిశాచరుడైన ఆ రావణుడు నారదునకు నమస్కరించి, కుశలమును ప్రశ్నించి, అతని రాకకు కారణము అడిగెను. గొప్పతేజస్సు, అధికమైన కాంతి గల, దేవర్షియైన నారదుడు మేఘముపైన ఉండి, పుష్పకములో ఉన్న రావణునితో- "విశ్రవసుని కమారుడవు, సౌమ్యుడవు అయిన ఓ! రాక్షసరాజా! ఆగుము. నీ గొప్ప పరాక్రమములకు సంతోషించితిని. విష్ణువు చేసిన దైత్యసంహారములు, గంధర్వ - ఉరగుల మధ్య జరిగిన యుద్ధాలు నీవు చేసిన యుద్ధాలు చూచి సంతోషించితిని. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! ఒక విషయము చెప్పెదను. వినుటకు ఇష్టమైనచో వినుము. విన్న పిమ్మట చేయవలసిన కార్యము చేయుము. తండ్రీ! అందువలన నేను చెప్పు మాటలు సావధానముగా వినుము."(1-6)

"నాయనా! దేవతలు కూడ చంపుటకు శక్యముకాని నీవు ఈ మర్త్యలోకమును ఎందుకు చంపెదవు? మర్త్యలోకము మృత్యువునకు వశమైనది. అందుచేత ఇది చంపబడినట్లే. నిన్ను దేవ-దానవ-దైత్యులు గాని, యక్ష-గంధర్వ-రాక్షసులుగాని చంపజాలరు కదా. అట్టి నీవు మనుష్యలోకమును బాధించుట యుక్తము కాదు. ఈ మనుష్యలోకము ఏది తనకు శ్రేయస్కరమో తెలియని స్థితిలో ఉన్నది. అనేకములైన గొప్ప ఆపదలలో చిక్కుకొనుచుండును. ముసలితనముచేత, వందలకొలది రోగములతోను బాధపడుచున్నది. అట్టి ఈ భూలోకమును ఎవరు చంపుదురు? ఎల్లప్పుడూ ఆ యా అనిష్టములు ప్రాప్తించుటచేత బాధపడుచు ఉండు ఎవడైనా మనుష్యలోకములో, ఎక్కడైనా, యుద్ధమునందు ఆసక్తి కలిగి యుండునా? క్షీణించుచున్నది, దైవముచేతనే పీడింపబడుచున్నదీ, ఆకలి, దప్పిక, ముసలితనము మొదలైనవాటితో దిగులు చెంది దుఃఖాక్రాంతమూ అయిన మనుష్యలోకమును నశింపచేయకుము. (7-11)

రాక్షసరాజా! ఏమి చేయవలెనో తోచని, విచిత్రప్రయోజనవంతుడైన ఈ మానవసృష్టి చూడుము! వీని గమ్యమేదో తెలియదు. కొన్నిచోట్ల సంతోషముతో కొందరు నృత్యవాద్యాదులు సేవించుచుందురు. మరికొన్ని చోట్ల కొందరు దుఃఖితులై కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, ముఖములతో ఏడ్చుచుందురు. మనుష్యలోకములోని



జనులు తల్లి, తండ్రి, పుత్రులు, భార్య, బంధువులు మొదలైనవారిపై ప్రేమచేత మోహముచెంది దానితో బాధపడుచున్నను తమ క్షేమమును గుర్తించజాలకున్నారు. ఓ! సౌమ్యుడా! ఈ విధముగా మోహముతో కొట్టుమిట్టాడుచున్న ఈ లోకాన్ని ఇంకా బాధపెట్టి ఏమి ప్రయోజనము? దీనిని నీవు జయించినట్లే; సందేహము లేదు. రావణా! మానవు లందరూ ఏనాటికైనా యమలోకమునకు వెళ్ళవలసినవారే, అందువలన యముణ్ణి ఓడించుము. నీవు ఆ యముణ్ణి జయించినచో అందరినీ జయించినట్లే" అని పలికెను. ఈ మాటలు విని రావణుడు, అక్కడ తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ నారదునకు నమస్కరించి, నవ్వుచు- "దేవగంధర్వలోకములలో విహరించు యుద్ధప్రియుడవైన ఓ! మహర్షీ! నేను ఇప్పుడు విజయముకొరకై రసాతలమునకు వెళ్ళుటకు సిద్ధముగా ఉన్నాను. పిమ్మట మూడు లోకములను జయించి, నాగులను, దేవతలను వశముచేసుకొని, అమృతముకొరకై సముద్రమును మథించెదను" అనెను. (12-20)

అప్పుడు భగవంతుడైన నారదమహర్షి రావణునితో- "నీవు ఇప్పుడు మరొక మార్గముచేత ఎక్కడికి వెళ్ళుచున్నావు?" రసాతలమునకు వెళ్ళదలచిన నీవు మరొక మార్గమున వెళ్ళుచున్నావేమి? వెళ్ళుటకు చాల కష్టమైన ఈ మార్గము యమలోకమునకు వెళ్ళును." రావణుడు బిగ్గరగా నవ్వి నారదునితో "నీవు చెప్పినపని పూర్తి అయినట్లే"అని పలికి మరల ఇట్లు అనెను- "ఓ! మహాబ్రహ్మర్షీ! అందువలననే యముణ్ణి చంపుటకై అతడున్న దక్షిణదిక్కునకు వెళ్ళుచున్నాను. పూజ్యుడవూ, సమర్థుడవూ అయిన నారదా! యుద్ధమునందు అభిలాష గల నేను కోపించి "నలుగురు లోకపాలకులను జయించెదను" అని ప్రతిజ్ఞ చేసితిని కదా? అందువలన నేనిప్పుడు యమలోకమునకు వెళ్ళి ప్రాణులకు క్లేశము కలిగించు ఆ యముణ్ణి చంపివేసెదను."(21-26)

రావణుడు ఇట్లు పలికి, నారదునకు అభివాదనము చేసి, దక్షిణపు దిక్కువైపు వెళ్ళి మంత్రులతో కూడ ఆ దక్షిణదిగ్భాగమును ప్రవేశించెను. గొప్ప తేజస్సు

గలవాడు, ధూమము లేని అగ్నివలె ఉన్నవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అయిన నారదుడు క్షణకాలము ధ్యానములో ఉండి ఇట్లు ఆలోచించెను- "ఏ యముడు ఆయుర్దాయము క్షీణించిన జంగమస్థావరరూపమైన మూడు లోకాలను, ఇంద్రునితో సహా, ధర్మానుసారముగా నిగ్రహించునో అట్టి యముణ్ణి ఇతడు ఎట్లు జయించగలడు? రెండవ అగ్నివలె ఉండు యముడు లోకులు చేసిన దానాలకు, ఆ యా కర్మలకు సాక్షి. ఆ మహాత్ముని అనుగ్రహముచేతనే సంజ్ఞతో ఉండి ప్రాణులు తమ తమ వ్యవహారములు చేసుకొనుచుండును. అతనికి భయపడి మూడు లోకాలు కూడా పారిపోవుచుండును. అట్టి యమునితో యుద్ధము చేయుటకు ఈ రావణుడు ఎట్లు వెళ్ళగలడు? లోకమును సామాన్యరూపమున, విశేషరూపమున సృష్టించినవాడు యముడు. పుణ్యపాపఫలములను ఇచ్చువాడు; మూడు లోకములను జయించినవాడు. అట్టి యముణ్ణి మరేదైనా ఉపాయము అవలంబించి ఇతడు జయించునా? ఈ యమ-రావణ యుద్ధమును స్వయముగా చూడవలె నని నాకు కుతూహలముగా ఉన్నది. అందుచేత యమలోకమునకే వెళ్ళెదను."(27-34)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువదవ సర్గము సమాప్తము.**

# ఇరువది ఒకటవ సర్గము

## రావణుడు యమలోకముపై ఆక్రమణము చేసి యముని సైన్యములను సంహరించుట.

నారదుడు ఈ విధముగా ఆలోచించి, జరిగిన విషయమును యథాతథముగా యమునికి చెప్పుటకై యమలోకమునకు శీఘ్రముగా వెళ్ళెను. అక్కడ యముడు ఏ ప్రాణులకు ఎట్టి ఫలమును ఇవ్వవలెనో అట్టి ఫలమును, అగ్నిదేవుడు సాక్షిగా ముందు ఉంచుకొని, ఇచ్చుచుండెను. అట్టి యముణ్ణి నారదుడు చూచెను. యముడు అక్కడికి వచ్చిన నారదమహర్షిని చూచి, ధర్మానుసారము అర్ఘ్యము సమర్పించి, సుఖముగా కూర్చున్న అతనిని- "దేవర్షీ! అంతా క్షేమమే కద! ధర్మము నశించుటలేదు కద! దేవతలచేతను, గంధర్వులచేతను సేవించబడే ఓ! మునీ! నీవు వచ్చిన పని ఏమి?" అని ప్రశ్నించెను.(1-4)

నాదరమహర్షి ఆ వాక్యము విని ఇట్లు పలికెను - "చెప్పెదను. వినుము. తగు ఉపాయము కూడా చేయుము. పితృరాజా! దశగ్రీవుడనే ఈ రాక్షసుడు జయింప

శక్యముకాని నిన్ను పరాక్రమములచేత జయించుటకు వచ్చుచున్నాడు. ప్రభూ! ఈ కారణముచేత, దండము ఆయుధముగా ధరించిన నీకు ఇప్పుడు ఏమగునో చూచుటకై నేను తొందరగా వచ్చినాను."(5-7)

ఇంతలో వారికి ఈ రాక్షసుని విమానము దూరమునుండి కనబడెను. అది ఉదయించిన సూర్యునివలె ప్రకాశించెను. అతడు ఆ విమానము కాంతిచేత ఆ ప్రదేశమునంతనూ చీకటి లేనిదానినిగా చేయుచు సమీపించెను. మహాబాహువైన ఆ రావణుడు అక్క డక్కడ పుణ్యఫలమును, పాపఫలమునూ అనుభవించుచున్న ప్రాణులను చూచెను. అక్కడ అతడు యముని అనుచరులను, సైనికులను చూచెను. క్రూరులు, ఘోరములైన రూపములు గలవారు, భయంకరులు అయిన యమభటులు కొట్టుచు బాధించుచుండగా బిగ్గరగా గొప్పధ్వనితో అరచుచున్న ప్రాణులను కూడా చూచెను. కొందరు ప్రాణులను కృములు(పురుగులు), భయంకరములైన కుక్కలు తినివేయుచుండెను. కొందరు చెవులకు చాలా పరుషముగా ఉన్న భయంకరములైన మాటలు పలుకుచుండిరి. కొందరిని అనేకవిధములుగా రక్తమే ఉదకముగా గల వైతరిణీనదిని దాటించుచుండిరి. మరికొందరిని బాగా వేడిచేసిన ఇసుకమీద పడవేసి మాటిమాటికి కాల్చుచుండిరి. కొందరు పాపాత్ములను అసిపత్రవనములో నడిపించి వారి దేహములు తెగిపోవునట్లు చేయుచుండిరి. కొందరిని రౌరవనరకములోని క్షారనదిలోను, కత్తుల అగ్రభాగములమీద పడవేయుచుండిరి. అక్కడ ఆకలితో, దప్పికలతో బాధపడుచున్న కొందరు జలమును యాచించుచుండిరి. కొందరు కృశించి, దీనులై, రంగుమారి, జుట్టు విరబోసికొని శవముల వలె ఉండిరి. రావణుడు మార్గములో మలముతోను, పంకముతోను నిండిన దేహాలు కల దీనులను, మొరటుగా ఉన్నవారిని, ఇటు అటు పరుగెత్తుచున్న వాళ్ళను, వందలకొలది, వేలకొలది ప్రాణులను చూచెను.(8-17)

కొందరు తాము చేసిన పుణ్యములకు ఫలముగా ఉత్తమములైన గృహములలో సంగీతవాద్యధ్వనులతో సంతోషించుచుండిరి. వారిని కూడ రావణుడు చూచెను. గోదానములు చేసినవాళ్ళు గోరసమును, అన్నదానము చేసినవాళ్ళు అన్నమును, గృహదానము చేసినవారు గృహాలను ఈ విధముగా ఆ పుణ్యాత్ములు తమ తమ పుణ్యముల ఫలములను అనుభవించుచుండిరి. రాక్షసరాజైన ఆ రావణుడు అక్కడ తమ తేజస్సుతో ప్రకాశించుచున్న మరికొందరు ధార్మికులను కూడ చూచెను. వారు బంగారము, మణులు, ముత్యములు అలంకరించుకొని స్త్రీలతో విహరించుచుండిరి.(18-20)

బలవంతుడైన రావణుడు తమ పాపమునకు ఫలితముగా చీల్చివేయబడుచున్న ఆ పాపాత్ములను బలాత్కారముగా, పరాక్రమముచేత విడిపించెను. రావణునిచేత విడిపింపబడిన ఆ ప్రాణులు క్షణకాలముపాటు తలవని విధముగా, ఊహింపశక్యము కాకుండగా వచ్చిన సుఖమును పొందిరి. మహాబలశాలియైన ఆ రావణుడు ప్రేతలను (మరణించి యమలోకములో ఉన్నవారిని) విడిపించుచుండగా, ఆ ప్రేతలకు కాపలాగా ఉన్నవాళ్ళు చాల కోపముతో ఆ రావణుని మీదికి శీఘ్రముగా యుద్ధానికి వెళ్ళిరి. అప్పుడు యముని యోధులు పరుగెత్తి వచ్చుచుండగా అన్ని దిక్కులనుండీ కోలాహలము వినబడెను. వందలకొలది, వేలకొలది ఉన్న ఆ శూరులైన యోధులు ప్రాసలు, పరిఘలు, శూలములు, ముసలములు, శక్తులు, తోమరములు పుష్పకముమీద వర్షించిరి. ఆ యోధులు తేనెటీగల వలె శీఘ్రముగా ముసురుకొని ఆ పుష్పకములోని ఆసనాలను, ప్రాసాదములను, వేదికలను, తోరణాలను విరుగగొట్టిరి. దేవతలు ఎక్కే ఆ పుష్పకవిమానము యుద్ధములో యోధులు పగలగొట్టుచున్నను బ్రహ్మదేవుని తేజస్సుచేత నశించకుండా పూర్వమువలెనే ఉండెను. మహాత్ముడైన ఆ యముని గొప్ప సేన లెక్కలేకుండా ఉండెను. వందలకొలది, వేలకొలది శూరులు ముందుకు వచ్చుచుండిరి.(21-28)

పిమ్మట మహావీరులైన ఆ రావణుని మంత్రులు, రావణుడు కూడ వృక్షములతోను, పర్వతములతోను, వందలకొలది ప్రాసాదులతోను యథేష్టముగా, బలానుసారముగా యుద్ధము చేసిరి. అన్ని ఆయుధముల దెబ్బలు తిని రక్తముతో నిండిన దేహములు గల వారైన ఆ రావణుని అమాత్యులు గొప్ప యుద్ధముచేసిరి. రామా! యముని యోధులు రావణుని మంత్రులను ఆయుధములతో అధికముగా కొట్టిరి. గొప్పబలము గల ఆ యమయోధులు ఆ మంత్రులను విడచి, శూలములు వర్షించుచు ఆ రావణునిమీదకు శీఘ్రముగా వెళ్ళిరి. ఆయుధములచేత తూట్లు పడిన శరీరముపై రక్తముతో నిండి ఆ రావణుడు పుష్పకవిమానమునందు వికసించిన అశోకవనమువలె ఉండెను. బలవంతుడైన ఆ రావణుడైతే అస్త్రబలమువలన శూల-గదా-ప్రాస-శక్తి-తోమర-బాణములను, శిలలను వృక్షములను ప్రయోగించెను. రావణుడు కురిపించిన చాల భయంకరమై ఆ వృక్ష-శిలా-శస్త్రముల వర్షము యముని సైన్యములమీద నేలమీద పడెను. వందలకొలది వేలకొలది ఉన్న ఆ యోధులు వాటిని అన్నింటిని బ్రద్దలుకొట్టి, రావణుని అస్త్రమును కొట్టివేసి భయంకరుడైన ఆ ఒక్క రాక్షసుణ్ణి కొట్టిరి.(29-37)

ఆ యోధు లందరు, మేఘముల సముదాయము పర్వతమును వలె రావణుని

చుట్టుముట్టి భిందిపాలములచేత, శూలములచేత అతనిని ఊపిరి సలపకుండా కుమ్మివేసిరి. అప్పుడు కవచము జారిపోగా, రక్తప్రవాహములచేత తడిసిన రావణుడు కోపించి, పుష్పకమును వదలి నేలమీద నిలచెను. ధనుర్బాణములను ధరించిన అతడు యుద్ధమునందు ఉత్సాహవంతుడయ్యెను. ముహూర్తకాలములో సంజ్ఞ పొందిన అతడు కోపించి యముడు వలె నిలచెను. పిమ్మట అతడు పాశుపతాస్త్రమును ధనుస్సుమీద సంధించి "నిలువుడు, నిలువుడు" అని వాళ్ళతో పలుకుచు ఆ ధనుస్సును లాగెను. యుద్ధములో ఆ ధనుస్సును లాగి, రావణుడు చాలా కోపించి, త్రిపురములమీద శంకరుడు ప్రయోగించినట్లు బాణమును ప్రయోగించెను. ఆ బాణము రూపము, గ్రీష్మకాలములో వనమును కాల్చివేయనున్న, వ్యాపించుచున్న దావాగ్నిరూపమువలె ధూమముతోను, జ్వాలామండలముతోను నిండి యుండెను. యుద్ధములో ప్రయోగింపబడి జ్వాలల పంక్తులతో నిండినదై, తననుండియే పుట్టిన క్రూరమృగాలచేత అనుసరించబడిన ఆ బాణము పొదలను, వృక్షాలను భస్మముచేయుచు శీఘ్రముగా వెళ్ళెను. ఆ యముని సైన్యములోని సైనికులు ఆ బాణము తేజస్సుచేత కాల్చబడి, ఇంద్రధ్వజముల వలె పడిపోయిరి. అప్పుడు మంత్రులతో కూడిన ఆ భయంకర పరాక్రమవంతుడైన రావణుడు భూమిని కంపింపచేయుచున్నాడా అన్నట్లు బిగ్గరగా సింహనాదము చేసెను. (38-46)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది ఒకటవ సర్గము సమాప్తము.**

# ఇరువది రెండవ సర్గము

## యమరావణుల మధ్య యుద్ధము. యమదండమును యముడు బ్రహ్మదేవుని ఆజ్ఞచేత ఉపసంహరించుట.

ప్రభువైన యముడు అతని గొప్ప ధ్వనిని విని శత్రువు జయించి నట్లు, తన సైన్యము క్షీణించి నట్లు తెలుసుకొనెను. తన యోధులు చంపబడినట్లు తెలిసికొని యముడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములతో "నా రథమును శీఘ్రముగా తీసికొని రమ్ము" అని సారథితో పలికెను. అపు డా సారథి అతని దివ్యమైన రథమును తీసికొని వచ్చి నిలబడెను. యముడు ఆ మహారథమును ఎక్కెను. ఈ మూడు లోకములను నశింపచేయుచుండు మృత్యుదేవుడు ప్రాసముద్గరములు హస్తములతో ధరించి వచ్చి యముని ఎదుట నిలబడెను. తేజస్సుతో ప్రజ్వలించుచున్నది, అగ్నితో

కూడినది, యముని దివ్యమైన ఆయుధమూ అయిన కాలదండము ఆకారమును ధరించి యముని ప్రక్క నిలబడెను. కాలపాశములు వచ్చి అతని ప్రక్కలయందు ఒకదాని ప్రక్క ఒకటిగా ఎడము లేకుండా నిలచెను. అగ్నిస్పర్శవంటి స్పర్శగల ముద్గరము కూడ శరీరము ధరించి నిలచినది. కోపించి సకలలోకములకు భయమును కలిగించుచున్న ఆ యముణ్ణి చూచి మూడు లోకములు క్షోభ చెందినవి. దేవతలు వణికి పోయిరి. పిదప సారథి అందమైన కాంతి గల అశ్వములను తోలెను. భయంకరమైన ధ్వని గల ఆ రథము రావణుడు ఉన్న చోటికి వెళ్ళెను. మనోవేగము వంటి వేగము గల, ఇంద్రుని అశ్వములవంటి అశ్వములు ముహూర్తకాలములో యముణ్ణి యుద్ధము జరుగుచున్న ప్రదేశమునకు తీసికొనివెళ్ళినవి. మృత్యుదేవతలతో కూడి భయంకరముగా ఉన్న ఆ రథమును చూడగానే రావణుని మంత్రులు పారిపోయిరి. (1-10)

వాళ్ళు అల్పబలము కలవా రగుటచేత సంజ్ఞ కోల్పోయి, భయపీడితులై ఇక్కడ యుద్ధముచేయుటకు సమర్థులము కాము అని పలికి దిక్కులు పట్టి పారిపోయిరి. రావణుడు లోకములకు భయమును కలిగించు ఆ రథమును చూచి కంగారుపడలేదు, భయపడలేదు. యముడు కోపించి రావణుని సమీపించి శక్తులను తోమరములను వర్షించి వాని మర్మస్థానములను ఛేదించెను. పిమ్మట రావణుడు స్వస్థుడై, మేఘము జలమును వర్షించినట్లు యముని రథముమీద బాణములు వర్షించెను. బాణములచేత పీడింపబడిన ఆ రాక్షసుడు వందలకొలది శక్తులు తన విశాలమైన వక్షఃస్థలముమీద పడవేయబడుచుండగా వాటికి ప్రతిక్రియ చేయజాలకపోయెను. శత్రువులను పీడించు యముడు యుద్ధములో అనేకవిధములైన ఆయుధములు ప్రయోగించి ఏడు రోజులపాటు శత్రువును సంజ్ఞ లేనివానిని గాను యుద్ధపరాఙ్ముఖునిగాను చేసెను. వీరుడవైన రామా! జయమును కోరుచున్నవారూ, యుద్ధములనుండి ఎన్నడూ వెనుకకు మరలనివారూ అయిన ఆ యమ-రావణు లిద్దరికీ అప్పుడు చాల వ్యాకులమైన యుద్ధము జరిగెను. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు బ్రహ్మదేవునితో కలసి ఆ యుద్ధరంగమునకు వచ్చిరి. రావణుడు, యముడు యుద్ధము చేయుచుండగా లోకములకు ప్రళయమువలె ఆయెను. (11-19)

రావణుడు కూడ ఇంద్రుని వజ్రాయుధమువంటి కాంతిగల ధనుస్సును చరచి, ఆకాశమునందు అవకాశము లేకుండచేయుచు బాణములు విడచెను. నాలుగు బాణాలతో మృత్యువును, ఏడు బాణాలతో సారథినీ పీడించి, లక్ష బాణాలతో యముని మర్మస్థానములయందు కొట్టెను. అప్పుడు కోపించిన యముని

ముఖమునుండి నిట్టూర్పులతో కలసి జ్వాలామాలలతోను ధూమముతోను కూడిన కోపాగ్ని బయలుదేరెను. దేవదానవుల సన్నిధియందు జరిగిన ఆ ఆశ్చర్యమును చూచి మృత్యు-కాలులు సంతోషించుచు చాల తొందరపడిరి.(20-23)

అప్పుడు మృత్యువు చాలా కోపించి యమునితో - "యుద్ధములో నన్ను ప్రయోగించుము. ఈ దుష్టరాక్షసుణ్ణి చంపివేసెదను. మహారాజా! ఇప్పుడు ఈ రాక్షసుడు ఇంక జీవించకూడదు. ఇది స్వభావసిద్ధమైన మర్యాద(కట్టుబాటు) కదా? హిరణ్యకశిపుడు, నముచి, శంబరుడు, విసంధి, ధూమకేతువు, విరోచనుని కుమారుడైన బలి, దంభు డను దైత్యుడు, మహారాజైన వృత్రుడు, బాణుడు, శాస్త్రవేత్తలైన రాజర్షులు, గంధర్వులు, మహోరగులు, ఋషులు, పన్నగులు, దైత్యులు, యక్షులు, అప్సరసలు, ప్రళయకాలమునందు మహాసముద్రములతో, పర్వతములతో, నదులతో, వృక్షములతో కూడిన భూమీ నాచేత నశింపచేయబడినారు. వీళ్ళూ, ఎదిరింపశక్యముకాని బలవంతులైన ఇంకను ఎందరో వీరులు నేను చూడగానే నశించినారు. ఈ నిశాచరుని మాట చెప్పవలెనా? ధర్మములు తెలిసినవాడా! నన్ను బాగుగా ప్రయోగించుము. నేను వీనిని చంపెదను. ఎంత బలవంతుడైనను నా కంట బడ్డవాడు జీవించడు కదా? కాలుడా! నేను నా బలమును గూర్చి చెప్పుకొనుటలేదు. ఇది స్వభావసిద్ధమైన కట్టుబాటు. నా కంట బడినవాడు ముహూర్తమాత్రము కూడ జీవించడు" అని పలికెను.(24-31)

అతని మాటలు విని ప్రతాపవంతుడైన యమధర్మరాజు "నీవు ఆగుము. నేను వీనిని చంపెదను" అని పలికి కోపముతో ఎఱ్ఱనైన నేత్రములు గల ప్రభువైన ఆతడు, వ్యర్థము కాని కాలదండమును చేతితో కదల్చెను (చేతపట్టెను). ఆ యమదండము ప్రక్కలయందు కాలపాశములు అమర్చబడి ఉండెను. అగ్నితోను, వజ్రముతోను సమానమైన శరీరము దాల్చిన ముద్గరము కూడ దాని ప్రక్కనే ఉండెను. అది చూచినంతమాత్రముననే ప్రాణుల ప్రాణాలను తీసివేయును. దానిని స్పృశించినా, మీద ప్రయోగించినా చెప్పవలెనా! చుట్టూ అగ్నిజ్వాలలతో నిండి ఆ రాక్షసుణ్ణి కాల్చుచున్నదా అన్నట్లున్న ఆ గొప్ప ఆయుధము యమునిచేత గ్రహించబడి ప్రకాశించుచుండెను. పిమ్మట యుద్ధభూమియం దున్నవారు అందరూ ఆ యమదండమునకు భయపడి పారిపోయిరి. దండమును ఎత్తిన యముణ్ణి చూచి దేవతలు అందరూ కూడ క్షోభ చెందిరి.(32-37)

యముడు యమదండముతో రావణుణ్ణి కొట్టదలచినట్లు చూచి బ్రహ్మదేవుడు

ప్రత్యక్షమై అతనితో- "అమితమైన పరాక్రమము గల ఓ వైవస్వతా! నీవు ఈ రాక్షసుణ్ణి ఈ దండముతో చంపవద్దు, చంపవద్దు. ఓ! దేవతాశ్రేష్ఠుడా! నే నీతనికి వరము ఇచ్చినాను కదా? ఆ వరమును, నా మాటను నీవు అసత్య మయ్యేటట్లు చేయవద్దు. దేవతాపురుషుడే అయినా, మానవుడైనా ఎవడైనా నా మాటను అసత్యము చేసినచో అతడు మూడు లోకాలను అసత్యము చేసినట్లే; సందేహము లేదు. భయంకరమూ, మూడు లోకములను భయపెట్టేదీ అయిన ఈ దండమును నీవు కోపించి ప్రయోగించినచో ఇది ఇష్టులు అనిష్టులు అను భేదము లేకుండా ప్రజల నందరినీ సంహరించును. నేను సృష్టించిన, గొప్పకాంతి గల ఈ యమదండము అందరినీ చంపివేయగలదు. ఇది ఏ ప్రాణుల విషయమునందు కూడా వ్యర్థము కాదు. సౌమ్యుడా! దీనిని రావణుని తలమీద ప్రయోగించవద్దు. ఇది పడినచో ఎవ్వడూ, ముహూర్తమాత్రము కూడ జీవించడు కదా! నీ దండముపడిన పిమ్మట ఈ రావణుడు మరణించినా, మరణించకపోయినా కూడ రెండువిధాల నా మాట అసత్యమగును. అందువలన నీకు ఈ లోకాలను రక్షించవలె నను అభిప్రాయ మున్నచో రావణుని మీద ప్రయోగించుటకు ఎత్తిన ఈ దండమును ఉపసంహరించుము. నా మాట సత్యమగునట్లు చేయుము" అని పలికి నివారించెను. (38-46)

ధర్మాత్ముడైన యముడు ఈ మాటలు విని - "ఇదిగో ఈ దండమును ఉపసంహరించుచున్నాను. నీవు మా అందరిపైన అధికారముగలవాడవు కదా? వరములు పొందిఉన్న ఈతనిని నేను చంపజాలకపోయినచో రణరంగములో ఉన్న నేను ఇప్పుడు ఏమి చేయవలెను? అందువలన నేను ఈ రాక్షసునికి కనబడకుండ వెళ్ళిపోయెదను" అని పలికి రథముతో, అశ్వములతో సహా అంతర్ధానము చెందెను. రావణు డీ విధముగా యముణ్ణి జయించి, తన పేరు చాటి, మరల పుష్పకము ఎక్కి యమలోకమునుండి బయలుదేరి వెళ్ళెను. బ్రహ్మ మొదలైన దేవతలతో కూడి యముడు సంతోషముతో స్వర్గమునకు వెళ్ళెను. నారదమహాముని కూడ వెళ్ళెను. (47-51)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది రెండవ సర్గము సమాప్తము.**

# ఇరువది మూడవ సర్గము

## రావణుడు నివాతకవచులతో స్నేహము చేసుకొని, కాలకేయులను వధించి వరుణపుత్రులను ఓడించుట.

రావణుడు దేవతాశ్రేష్ఠుడైన యముణ్ణి జయించి, పిమ్మట తన సహాయులైన మారీచాదులను చేరెను. దెబ్బలచేత శిథిలము చేయబడినవాడై రక్తముచే తడసిన శరీరముగల ఆ రావణుణ్ణి చూచి ఆ రాక్షసులు ఆశ్చర్యపడిరి. అప్పుడు మారీచుడు మొదలైన రాక్షసులు జయజయధ్వానములతో ఆ రావణుని అభినందించిరి. రావణుడు వారికి ధైర్యము చెప్పెను. వారందరూ పుష్పకమును ఎక్కిరి. పిమ్మట రావణుడు రసాతలమునకు వెళ్ళుటకై దైత్యుల, ఉరగుల సముదాయములకు నివాసము, వరుణునిచేత బాగుగా రక్షింపబడినదీ అయిన సముద్రములో ప్రవేశించెను. రావణుడు వాసుకి పాలించుచున్న భోగవతీపురికి వెళ్ళి, నాగులను తన వశము చేసుకొని మణిమయపురమునకు వెళ్ళెను. అక్కడ వరములు పొందిన నివాతకవచులు నివసించుచుండిరి. రావణుడు వాళ్ళదగ్గరకు వెళ్ళి యుద్ధమునకు పిలచెను. బలశాలులైన అక్కడున్న ఆ దైత్యులందరు మంచి పరాక్రమములు గలవారు. అనేకవిధములైన ఆయుధములు గలవారు. ఉత్సాహవంతులు. యుద్ధమునందు అత్యధికమైన మదము ఉన్నవారు. క్రోధావిష్టులైన ఆ రాక్షసులు, దానవులు ఒకరినొకరు శూలములు, త్రిశూలములు, వజ్రాయుధములు, పట్టిశములు, ఖడ్గములు, గొడ్డళ్ళు మొదలైన ఆయుధాలతో బ్రద్దలుకొట్టిరి. వాళ్ళు ఆ విధముగా యుద్ధముచేయుచుండగా కొంచెము ఎక్కువగా సంవత్సరకాలము గడిచెను. ఎవరికీ కూడ జయము కాని, పరాజయము కాని కలగలేదు.(1-9)

ఇంతలో మూడు లోకములకు గతి అయిన, నాశరహితుడైన బ్రహ్మదేవుడు, శ్రేష్ఠమైన విమానము నెక్కి అచటికి వచ్చెను. వృద్ధుడైన బ్రహ్మదేవుడు నివాతకవచులు చేయుచున్న ఆ యుద్ధమును నివారించి స్పష్టమైన అర్థము గల వాక్యము– "సురులు అసురులు కూడ ఈ రావణుణ్ణి యుద్ధములో జయించజాలరు. దానవులూ, దేవతలూ కలసి వచ్చినా కూడ మిమ్ములను ఓడింపజాలరు. మీరు ఈ రావణునితో మైత్రి వహించుట నా కిష్టము. మిత్రులు అన్ని భోగాదులను పంచుకొనుచు కలసి అనుభవించవచ్చును. సందేహము లేదు" అని బోధించెను.(10-13)

పిమ్మట రావణుడు అగ్నిసాక్షికముగా అక్కడ నివాతకవచులతో స్నేహము

చేసికొని చాల సంతోషించెను. అతడు న్యాయానుసారము వాళ్ళనుండి పూజలను అందుకొనుచు ఒక సంవత్సరము అక్కడ నివసించి తన పురమునందు వలెనే సంతోషమును పొందెను. ఆ మణిమయపురమునందు ఆ నివాతకవచులకు అనుగుణముగా ప్రవర్తించుచు నూరు మాయలను నేర్చుకొనెను. వరుణుని పురము కొరకు అన్వేషించుచు రసాతలమునందు సంచరించెను. పిమ్మట కాలకేయుల నివాసమైన అశ్మనగరమునకు వెళ్ళి బలముచేత దృప్తులైన కాలకేయులను చంపి, అప్పుడు శూర్పణఖ భర్తా, తన బావా, బలవంతుడూ, బలముచేత దృప్తుడూ అయిన విద్యుజ్జిహ్వుణ్ణి ఖడ్గముచేత ఛేదించెను. యుద్ధరంగములో నాలుకతో నాకివేయుచున్న ఆ విద్యుజ్జిహ్వుణ్ణి జయించి, ముహూర్తకాలములో నాలుగువందల మంది దైత్యులను చంపెను. (14-19)

పిమ్మట అతడు తెల్లని మేఘమువలె ఉన్న, కైలాసము వలె ప్రకాశించుచున్న దివ్యమైన వరుణుని గృహమును చూచెను. అక్కడ నిలచి పాలను స్రవించుచున్న కామధేనువును చూచెను. ఆ కామధేనువు కార్చుచున్న పాలవలననే క్షీరసముద్రము పుట్టినది. రావణుడు అక్కడ రుద్రుని వాహనమైన మహావృషభమునకు తల్లియైన కామధేనువును చూచెను. ఆ కామధేనువునుండి పుట్టిన క్షీరసముద్రమునుండి చల్లని కిరణములు గలవాడు, రాత్రిని కల్పించువాడు అయిన చంద్రుడు జనించెను. ఆ క్షీరసముద్రమునే ఆశ్రయించుకొని నురుగును భుజించి మహర్షులు జీవించుచుందురు. స్వధను భుజించు పితృదేవతల స్వధ కూడ దీనినుండియే పుట్టినది. లోకమునందు "సురభి" అను పేరుతో ప్రసిద్ధమైన ఆశ్చర్యకరమైన ఆ కామధేనువునకు ప్రదక్షిణము చేసి రావణుడు అనేకవిధములైన సైన్యములు రక్షించుచుండుటచేత భయంకరముగా ఉన్న ఆ భవనములో ప్రవేశించెను. పిమ్మట అతడు అనేక జలధారలతో వ్యాప్తమైన, నిత్యానందముతో కూడిన, శరత్కాలమేఘమువంటి వరుణుని శ్రేష్ఠమైన గృహమును చూచెను. (20-25)

అతడు యుద్ధమునందు సేనాధ్యక్షులను చంపి, వారి ప్రహారములను తిని, పిమ్మట ఆ యోధులతో- "శీఘ్రముగా వెళ్ళి మీ రాజుతో ఇట్లు చెప్పుడు. రావణుడు యుద్ధమును కోరి వచ్చినాడు. అతనికి యుద్ధము ఇమ్ము. నీకు భయములేదనియైనా చెప్పుము; లేదా అంజలి ఘటించి జయించబడినానని ఒప్పుకొనుము" అని పలికెను. ఇంతలో మహాత్ముడైన వరుణుని పుత్రులు, పౌత్రులు, వాళ్ళ బలాధ్యక్షులైన గో-పుష్కరులు కోపముతో బయలుదేరి వచ్చిరి. మంచి పరాక్రమము, సద్గుణములూ గల ఆ వరుణపుత్రపౌత్రులు తమ సైన్యములను వెంటబెట్టుకొని, స్వేచ్ఛానుసారము

సంచరించు, సూర్యకాంతి వంటి కాంతి గల రథములను కూర్చుకొని బయలుదేరిరి. వరుణుని పుత్రులకు, బుద్ధిమంతుడైన రావణునకూ భయంకరమూ, రోమాంచజనకమూ అయిన యుద్ధము జరిగెను. మహాపరాక్రమవంతులైన రావణుని అమాత్యులు ఆ వరుణసైన్యమునంతనూ క్షణకాలములో పడగొట్టిరి. అప్పుడు వరుణుని కుమారులు యుద్ధములో తమ సైన్యములు పడిపోవుటచూచి, బాణములచేత పీడితులై యుద్ధమునుండి విరమించిరి. నేలమీద ఉన్న ఆ వరుణపుత్రులు పుష్పకములో ఉన్న రావణుణ్ణి చూచి శీఘ్రముగా నడచు రథములతో ఆకాశములోనికి వెళ్ళిరి. సమానస్థానములలో ఉన్న ఆ రావణ-వరుణ కుమారులకు దేవదానవులకు వలె, వ్యాకులమైన గొప్ప యుద్ధము జరిగెను. ఆ వరుణకుమారులు అగ్నివంటి బాణములచేత రావణుణ్ణి యుద్ధమునందు విముఖుణ్ణిగా చేసి, సంతోషించుచు, అనేకవిధములైన శబ్దములు చేయుచు అరచిరి.(26-35)

అప్పుడు వీరుడైన మహోదరుడు తమ రాజు పరాభవము చెందుట చూచి, కోపించి, మృత్యుభయమును విడచి, యుద్ధము చేయగోరుచు చూచెను. యుద్ధమునందు వాయువువలె స్వేచ్ఛగా సంచరించగలిగిన ఆ వరుణపుత్రులను మహోదరుడు గదతో కొట్టగా వారు నేలమీద పడిరి. మహోదరుడు వరుణపుత్రుల యోధులను, గుఱ్ఱములను చంపి, రథములు లేక నేలమీద నిలచిన వాళ్ళను చూచి గొప్ప ధ్వనిచేసెను. మహోదరుడు కొట్టివేయగా అశ్వములతోను, శ్రేష్ఠులైన సారథులతోను సహా ఆ వరుణపుత్రుల రథములు నేలమీద కూలినవి. వరుణిని శూరులైన కుమారులు రథములు విడచి, ఆకాశముమీద నిలచి సహజముగా ప్రభావంతు లగుటచేత వ్యథ చెందలేదు. ఆ వరుణపుత్రులు ధనుస్సులు సిద్ధముచేసికొని, మహోదరుణ్ణి భేదించి, కోపించినవారై అందరూ కలసి యుద్ధములో రావణుణ్ణి చుట్టుముట్టిరి. కోపించిన వాళ్ళు ధనుస్సులనుండి బయల్వెడలిన వజ్రాయుధము వంటి చాల భయంకరములైన బాణాలతో అతనిని మేఘములు పర్వతమును వలె చీల్చిరి. అప్పుడు కోపించిన రావణుడు ప్రళయకాలాగ్నివలె విజృంభించి వాళ్ళ మర్మస్థానములయందు భయంకరమైన బాణవర్షమును కురిపించెను. ఎదిరింప శక్యముకాని ఆ రావణుడు స్థిరముగా నిలచి విచిత్రములైన ముసలములను, వందలకొలది భల్లబాణములను, పట్టిశములను శక్తులను, గొప్ప శతఘ్నులను వాళ్ళపై ప్రయోగించెను. ఆ విధముగా చెదరగొట్టబడిన, పాదచారులైన ఆ వీరులు శీఘ్రముగా అతనిమీదికి వచ్చిరి. పిమ్మట ఆ ఆయుధవర్షముచేత నడుచుచు యుద్ధముచేయుచున్న ఆ వరుణపుత్రులు గొప్ప బురదలో చిక్కుకున్న,

అరవైసంవత్సరాల వయస్సుగల ఏనుగులవలె క్షీణించిరి.(37-46)

గొప్పబలము గల ఆ రావణుడు క్షీణించుచున్న, వ్యాకులులైన వరుణపుత్రులను చూచి సంతోషముతో పెద్ద మేఘమువలె ధ్వని చేసెను. పిమ్మట అతడు గొప్ప ధ్వని చేయుచు, చేతికి అందిన ఆయుధములతో జలధారాపాతములచేత మేఘమువలె వరుణకుమారులను కొట్టెను. యుద్ధపరాఙ్ముఖులై నేలమీద పడిన వారినందరినీ వారి మనుష్యులు యుద్ధరంగమునుండి ఇండ్లకు తీసికొనిపోయిరి.(47-49)

అప్పుడు రావణుడు వారితో "వరుణునికి చెప్పుడు" అని పలికెను. ప్రహాసుడను వరుణుని మంత్రి రావణునితో- "నీవు ఎవనిని యుద్ధానికి పిలచుచున్నావో ఆ మహారాజు, జలాధిపతీ అయిన వరుణుడు సంగీతము వినుటకై బ్రహ్మలోకమునకు వెళ్ళినాడు. అందువలన ఓ వీరుడా! రాజు లేనప్పుడు నీవు వ్యర్థముగా పరిశ్రమ చేసి ఏమి ప్రయోజనము? ఇక్కడ ఉన్న వీరులైన వరుణుని పుత్రులను నీవు ఓడించే ఉన్నావు కదా?" అనెను. రావణుడు ఆ మాటలు విని తన పేరు చాటుకొని, సంతోషముతో ధ్వని చేయుచు వరుణలోకమునుండి వెళ్ళిపోయెను. రావణుడు ఏ దారిన వచ్చెనో ఆదారినే మరలి లంకాభిముఖుడై ఆకాశమార్గమున వెళ్ళెను.(50-54)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువదిమూడవ సర్గము సమాప్తము.**

# పదమూడు ప్రక్షిప్తసర్గలలో మొదటిది.

## రావణుడు బలిచక్రవర్తి నివసించు అశ్మనగరమునకు వెళ్ళి అతనితో మాటలాడుట.

పిమ్మట యుద్ధమునందు అత్యధికమైన మదము గల ఆ రాక్షసులు మరల అశ్మనగరములో సంచరించిరి. అక్కడ రావణునకు చాల ప్రకాశించుచున్న ఒక గృహము కనబడెను. వైదూర్యమాణిక్యముల ముఖద్వారములతో నిండి ఆ గృహము ముత్యముల జాలములచే (అల్లికలచే) అలంకరింపబడెను. బంగారు స్తంభములతో నిండిన ఆ గృహమునందు నలుమూలలా అరుగులు ఉండెను. మెట్లు వజ్రములతోను, స్ఫటికములతోను నిర్మింపబడెను. అంతటా చిరుగంటలు కట్టబడెను. అనేకములైన ఆసనములతో ఆ గృహము మహేంద్రభవనమువలె సుందరముగా ఉండెను. ప్రతాపవంతుడైన రావణుడు రమ్యమైన గృహమును చూచి,

"మేరుమందరపర్వతములతో సమానమైన సుందరమైన ఈ భవనము ఎవరిదో"అని అనుకొనుచు "ప్రహస్తా! నీవు శీఘ్రముగా వెళ్ళి శ్రేష్ఠమైన ఈ భవనమును గూర్చి తెలుసుకొనుము" అని అతనిని ఆదేశించెను. ప్రహస్తుడు అతని ఆజ్ఞప్రకారము ఆ గృహశ్రేష్ఠములో ప్రవేశించెను. కాని ఆ ప్రదేశము జనశూన్యమై ఉండుట చూచి మరియొక వాకిలిలో ప్రవేశించెను. ఏడు వాకిళ్ళ లోపలికి వెళ్ళి అతడు జ్వాలను చూచెను. పిమ్మట ఒక పురుషుడు కనబడెను. అతడు సంతోషించి బిగ్గరగా నవ్వెను. ఆ అట్టహాసము వినగానే అతని ఒడలు గగుర్పొడిచెను. ఆ జ్వాలామధ్యమునందు బంగారు మాల ధరించిన పురుషుడు కనబడెను. సూర్యుడు వలె చూడ శక్యముకాని ఆ పురుషుడు సాక్షాత్తు యముడు వలె ఉండెను.(1-8)

ప్రహస్తుడు ఆ విషయమును చూచి తొందరగా బైటకు వచ్చి అది అంతా రావణునకు తెలిపెను. రామా! రావణుడు పుష్పకము నుండి దిగి ఆ గృహములో ప్రవేశించుటకు ప్రయత్నించెను. శిరస్సుపై చంద్రుడ్ని ధరించిన పెద్ద శరీరము గల ఒక భయంకరుడైన పురుషుడు హటాత్తుగా వచ్చి ద్వారమునకు అడ్డముగా రావణుని ఎదుట నిలబడెను. అతని నాలుక అగ్నిజ్వాలవలె ఉండెను. కళ్ళు ఎఱ్ఱగా ఉండెను. దంతములు అందముగా ఉండెను. పెదవులు దొండపండువలె ఎఱ్ఱగా ఉండెను. అతడు చూచుటకు అందముగా ఉండెను. ముక్కు చాలా భయంకరముగా ఉండెను. శంఖము వంటి కంఠము గల అతని దవుడలు చాల పెద్దవిగా ఉండెను. ఇనుప రోకలిని చేతిలో ధరించి ద్వారానికి అడ్డముగా నిలచిన అతని మీసములు చాలా దట్టముగా ఉండెను. ఎముకలు పైకి కనబడుటలేదు. (కండరములతో పుష్టిగా ఉండెను). పెద్ద కోరలతో గగుర్పాటు కలిగించేటట్లు ఉండెను. అతనిని చూడగానే రావణని ఒడలు గగుర్పొడిచెను. గుండె కొట్టుకొనెను. వణకు పుట్టెను.(9-14)

రామా! ప్రతికూలముగా ఉన్న శకునములను చూచి రావణుడు ఆలోచించుచుండెను. అతడు ఆలోచించుచుండగా ఆ పురుషుడు- "రాక్షసుడా! నీవు ఏమి ఆలోచించుచున్నావు? నిఃసంకోచముగా చెప్పుము. ఓ! వీరుడవైన రాక్షసుడా! నీకు నేను యుద్ధరూపమైన ఆతిథ్యము ఇచ్చెదను" అని పలికెను. ఆ పురుషుడు ఇట్లు పలికి మరల రావణునితో - "బలితో కూడ యుద్ధము చేసెదవా? లేక మరొక విధముగా ఆలోచించుచున్నావా?" అని అడిగెను.(15-17)

అది వినగానే రావణునకు మరల గగుర్పాటు కలిగెను. పిదప అతడు ధైర్యము అవలంబించి- "మాటలాడువారిలో శ్రేష్ఠుడా! ఈ గృహములో ఎవరున్నారో

చెప్పుము. అతనితోనే యుద్ధము చేసెదను. లేదా నీవు ఎట్లు తలచెదవో అట్లే చేసెదను" అనెను. ఆ పురుషుడు మరల ఇట్లు పలికెను - "ఈ గృహములో దానవప్రభువు నివసించుచున్నాడు. ఇతడు చాల ఔదార్యవంతుడు, శూరుడు, సత్యమైన పరాక్రమముగలవాడు. ఇతడు వీరుడు. చాల సద్గుణములు గలవాడు. పాశము హస్తమునందున్న యమునివంటివాడు. ఉదయకాలసూర్యుడు వలె తేజస్సు కలవాడు. యుద్ధములో వెనుకకు తిరగనివాడు. ఇతడు పట్టుదల కలవాడు. జయింప శక్యముకానివాడు. జయించువాడు. బలవంతుడు, గుణసముద్రుడు. ప్రియముగా మాటలాడువాడు. దానగుణవంతుడు. గురువు లన్నా, బ్రాహ్మణు లన్నా ఇష్టమున్నవాడు. గొప్ప ధైర్యము గల ఇతడు తొందరపాటు లేక తగు సమయమునకై వేచి ఉండువాడు, సత్యము పలుకువాడు. ఈతడు చూచుటకు చాల సౌమ్యుడు. కార్యసమర్థుడు. సమస్తగుణము లున్నవాడు, శూరుడు. వేదాధ్యయనమునందు ఆసక్తి గలవాడు. ఇతడు నడచును. ఇతడు వీచును. ఇతడు ప్రజ్వలించును. వేడి కలిగించును. అనగా వాయ్వగ్న్యాదుల శక్తి ఇతని కున్నది. ఇతడు దేవతలకుగాని, భూతముల సముదాయములకు గాని, సర్పములకుగాని, పక్షులకుగాని భయపడి ఎరుగడు. అట్టివానితో నీవు యుద్ధముచేయవలెనని కోరుచున్నావు! మహాబలవంతుడవైన రాక్షసరాజా! నీకు బలితో యుద్ధముచేయుట ఇష్టమైనచో లోపలికి వెళ్ళుము. యుద్ధముచేయుము. ఆలస్యము చేయకుము." (18-25)

ఆ మాటలు విని రావణుడు బలి ఉన్నవైపు ప్రవేశించెను. అగ్నితో సమానుడు, సూర్యుడువలె చూడ శక్యము కానివాడు అయిన ఆ దానవాధిపతి రావణుని చూచి బిగ్గరగా నవ్వెను. (26-27)

వివిధరూపములు ధరించగల ఆ బలి చూడగానే రావణుణ్ణి పైకి లేవదీసి తన దగ్గర కూర్చుండబెట్టుకొని- "రావణా! నీకు నేను ఏమి కోరిక తీర్చవలెను? రాక్షసరాజా! నీవు వచ్చిన పని ఏమి? చెప్పుము." అని అడిగెను. బలి మాటలు విని రావణుడు- "పూర్వము నిన్ను విష్ణువు బంధించినా డని వింటిని. నేను నిన్ను బంధనమునుండి విడిపించగలను. సందేహములేదు." అనెను. (28-30)

బలి ఆ మాటలు విని నవ్వి ఇట్లు పలికెను - "రావణా! నీవు అడిగిన దానిని గూర్చి చెప్పెదను, వినుము. నిత్యమూ ద్వారము వద్ద నిలచి ఉన్న మహాబలశాలియైన ఈ పురుషుడు దానవనాయకులను, గొప్పబలము గల ఇతరులను, నీ పూర్వులను, వాళ్ళ పూర్వులను కూడ వశము చేసికొనినాడు. ఈతడే నన్నీవిధముగా బంధించినాడు.

దైవమును అతిక్రమింప శక్యముకాదు. లోకములో ఏ పురుషుడు, ఏమానవుడు ఈ దైవమును వంచింపగలడు? ద్వారమునందు నిలచిన ఆ పురుషుడు సకలభూతములను సంహరించువాడు. కార్యములు చేయువాడు, చేయించువాడు ఇతడే. లోకముల పోషకుడు, ప్రభువు ఇతడే. ఇతడు జరిగిపోయినదానికి, జరగ నున్నదానికి, జరుగుతున్నదానికి ప్రభువు. ఇతడే కలి, ఇతడే కాలము. సకల ప్రాణులను సంహరించువాడు. ఇతనిని గూర్చి నీవు గాని నేను గాని తెలిసికొనజాలము. ఇతడు మూడు లోకములనూ హరించును; సృజించును. ఇతడు స్థావరములు జంగమములు అయిన ప్రాణులను సంహరించును. రావణా! ఆదికాని అంతముకాని లేని ఈ మహేశ్వరుడు సంహరించినదానిని అంతనూ మరల సృజించుచుండును. ఇతడు యాగస్వరూపుడు; దానస్వరూపుడు, హోమస్వరూపుడు. లోకాధీశుడైన ఇతడు సకలజగత్స్వరూపుడు. ఇతడే పోషించువాడు. ఇతడే రక్షించువాడు. సంశయములేదు. ఇట్టి మహాభూతము మరొకటి మూడు లోకములలోనూ లేదు. (31-39)

రావణా! మహాత్ముడైన ఇతడు నన్ను, నిన్ను, ఇంకా చాల కాలము క్రితము ఉన్నవాళ్ళనీ కూడ తాడుకట్టి పశువును నడిపించి నట్లు నడిపించుచుండును. వృత్రుడు, దనువు, శుకుడు, శుంభుడు, నిశుంభుడు, శంభుడు, కాలనేమి, ప్రహ్లాదుని కుమారుడు, కూటుడు, విరోచనుని పుత్రుడు, మృదువు, యమలార్జునులు, కంసుడు, కైటభుడు, మధువు వీరందరూ తపించగలరు; ప్రకాశించగలరు; వీచగలరు; వర్షించగలరు. వాళ్ళందరూ వందలకొలది యజ్ఞములు చేసిరి. అందరూ గొప్ప తపస్సు చేసిరి. వారందరూ చాల మహాత్ములే. అందరూ యోగాభ్యాసము చేసినవారే. వారందరూ కూడ ఐశ్వర్యము పొంది చాల గొప్ప భోగములు అనుభవించినారు. దానములు, యాగములు చేసినారు. అధ్యయనము చేసినారు. వారందరూ తమ పక్షమునకు చెందిన వారిని రక్షించేవారు; శత్రువులను నశింపచేసేవారు. దేవతలున్న లోకాలలో కూడా వారికి సమానమైనది లేదు. వారు శూరులు. ఉత్తమవంశమునందు పుట్టినవారు. సకలశాస్త్రార్థపారంగతులు. సకల విద్యావేత్తలు, యుద్ధమునందు వెనుకకు పోనివారు. మహాత్ములైన వారందరూ దేవతల రాజ్యములను పాలించిరి. యుద్ధములో వేలకొలది దేవతాగణములను జయించిరి. దేవతలకు అపకారము చేయుటయందు ఆసక్తి గలవారు. తమ పక్షమును పాలించువారు, మదించినవారు. భోగాసక్తులు. బాలసూర్యునితో సమానమైన తేజస్సు గలవారు. (40-48)

సర్వసమర్థుడు, సర్వవ్యాపకుడూ, భగవంతుడూ అయిన విష్ణువు దేవతలను

అవమానించువారిని ఉపాయపూర్వకముగా ఎట్లు నశింపచేయవలెనో బాగుగా తెలిసినవాడు. అతడు దేవతలను బాధించువారిని నాశముచేయుటకై అవతారము లెత్తుచుండును. మరల తన స్వరూపముతో ఉండిపోవును. మహాత్ముడైన ఈ దేవుడు ఈ విధముగా బలవంతులు, కామరూపములు గలవారు అయిన దానవప్రభువుల నందరినీ నశింపజేసినాడు. యుద్ధములో జయింప శక్యముకానివారనీ, ఓడింపబడనివారనీ ప్రసిద్ధులైన గొప్ప వ్యక్తులను కూడ దైవబలమునకు లొంగిపోవునట్లు చేసి విష్ణువు తీసికొని పోయినాడు."(49-52)

బలిచక్రవర్తి ఇట్లు పలికి రావణునితో మరల ఇట్లనెను- "గొప్పబలముగల ఓ! వీరుడా! ప్రజ్వలించుచున్న అగ్నివలె ఉన్న ఆ చక్రమును నా వద్దకు తీసికొనిరమ్ము. తరువాత నేను నీకు నా విడుదలకు తిరుగు లేని ఉపాయమును చెప్పెదను. రావణా! ఆపి చేయుము. ఆలసించుకుము."(53, 54)

రామా! గొప్పబలము గల ఆ రాక్షసుడు ఈ మాట విని నవ్వుచు దివ్యమైన ఆ గొప్ప కుండల మున్న చోటికి వెళ్ళెను. బలముచేత గర్వించిన ఆ రావణుడు దానిని సవిలాసంగా పైకి లేప ప్రయత్నించెను. కాని ఏవిధముగానూ కూడ దానిని కదల్చలేకపోయెను. మహాబలవంతుడైన ఆ రావణుడు సిగ్గుపడి దానిని ఎత్తుటకై మరల ప్రయత్నము చేసెను. దివ్యమైన ఆ కుండలమును ఎత్తగానే అతడు రక్తప్రవాహము కారగా నరికిన సాలవృక్షము వలె పడిపోయెను. ఇంతలో పుష్పకవిమానమునుండి రావణుని మంత్రులు "అయ్యో! అయ్యో!" అని బిగ్గరగా అరచిరి.(55-59)

పిమ్మట ముహూర్తకాలములో స్పృహ వచ్చి సిగ్గుతో తలవంచుకొని ఉన్న రావణునితో బలి ఇట్లు పలికెను- "రావణా! రమ్ము; నేను చెప్పుమాటలు వినుము. నీవు ఎత్తిన మణిభూషణమైన ఈ కుండలము మా ముత్తాతగారైన హిరణ్యకశిపుని చెవికి అలంకారముగా ఉండెడిది; చూడుము. గొప్పబలములు గల రావణా! నా ముత్తాతగారు అయిన హిరణ్యకశిపుడు పూర్వము యుద్ధము చేయుచుండగా ఈ కుండలము ఇక్కడ నేలమీద పడినది. రెండవది పర్వతము చరియమీద పడినది. కుండలముల వెనుక కిరీటము వేది దగ్గరపడినది. రావణా! అతనికి కాలము(అవసానకాలము; లేదా యముడు) కాని, మృత్యువుకాని, వ్యాధిగాని, లేదు. హింసించువారు లేరు. పగలుగాని, రాత్రిగాని, సంధ్యాసమయములయందు గాని మరణములేదు. ఎండినదానిచేతగాని, తడిగా ఉన్నదానిచేత గాని ఏ

ఆయుధముచేతగాని, ఏ అస్త్రముచేతగాని మరణము లేదు. రావణా! హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో చాల క్రూరమైన వాదమును చేసెను. అందరికీ పూజ్యుడూ, మహాత్ముడూ, వీరుడూ అయిన ప్రహ్లాదునకూ, ఆ హిరణ్యకశిపునకూ వాదము ఏర్పడగా నృసింహాకారమును ధరించి లోకములకు భయముకలిగించు వీరుడు ఆవిర్భవించెను. భయంకరుడైన ఆ నృసింహుడు చూచిన ప్రతివస్తువును చెల్లా చెదరుచేసి, చేతులతో ఆ హిరణ్యకశిపుణ్ణి ఎత్తి, గోళ్ళతో చంపివేసినాడు. ఇదిగో, ఏ దోషములూ అంటని ఆ వాసుదేవుడే ద్వారపాలకుడై నిలచి ఉన్నాడు. ఆ దేవదేవుణ్ణి గూర్చి చెప్పెదను. నామాటలకు నీ మనస్సులో మంచి గౌరవభావ మున్నచో వినుము. ఏ విష్ణువు కొన్ని వేల సంవత్సరములపాటు వేలకొలది ఇంద్రులను, అయుతములకొలది దేవతలను, వందలకొలది ముఖ్యులైన ఋషులను తన వశములో ఉంచుకొనెనో అట్టి విష్ణువు ద్వారమునందు ఉన్నాడు."(60-71)

బలిచక్రవర్తి మాటలు విని రావణు డిట్లు పలికెను. - "నేను ప్రేత ప్రభువైన యముణ్ణి, మృత్యువును చూచితిని. హస్తమునందు పాశమునుధరించి పెద్దజ్వాలలను కక్కుచు పైకిలేచిన రోమాలు గల అతడు చాలా భయంకరుడు. పెద్ద కోరలు, మెరుపువంటి నాలుక గల అతనికి సర్పములు, తేళ్ళు రోమములుగా ఉండును. ఎఱ్ఱని కళ్ళు, భయంకరమైన వేగముగలవాడు, సూర్యునివలె చూడ శక్యముకానివాడు అయిన అతడు యుద్ధములలో వెనుకకు మరలనివాడు. పాపాత్ములను శిక్షించువాడు. అట్టి యముణ్ణి కూడ నేను జయించితిని. దానవేంద్రా! నేను ఆ విష్ణువునకు ఏమాత్రము భయపడను. కాని నేను అతనిని గుర్తించజాలను. అందుచేత నీవు అతనిని గూర్చి చెప్పుము."(72-76)

రావణుని మాటలు విని విరోచనుని పుత్రుడైన బలి ఇట్లు పలికెను - "ప్రభువు, పాపములను హరించువాడు అయిన ఈ మహావిష్ణువు మూడు లోకములను పోషించువాడు. శ్రీమహావిష్ణువు అంతము లేనివాడు. నల్లనివాడు. జయించు స్వభావము కలవాడు. నరసింహుడు. గొప్పకాంతి గలవాడు. యజ్ఞమునందు నివసించువాడు. మంచి స్థానము గలవాడు. పాశము హస్తమునందు ధరించువాడు. భయము కలిగించువాడు. శ్రీ మహావిష్ణువు పన్నెండుగురు సూర్యులతో సమానుడు. అతిప్రాచీనుడైన(ఆదిలేని) పురుషశ్రేష్ఠుడు. నల్లని మేఘముతో సమానుడు. దేవతల ప్రభువు. దేవతలలో శ్రేష్ఠుడు. ఇతనిచుట్టూ జ్వాలల మాలలు ఉండును. ఇతడు యోగీశ్వరుడు. ఇతనికి భక్తులమీద ప్రేమ అధికము. సమర్థుడైన ఇతడే లోకములను సృజించును; వాటిని రక్షించుచుండును. గొప్పబలము గల ఈ మహావిష్ణువే కాలమై

సంహారము చేయుచున్నాడు. యజ్ఞమూ, యజ్ఞము చేసి పూజింపదగినవాడూ కూడా చక్రాయుధధారియైన మహావిష్ణువే. ఈ మహావిష్ణువే సకలదేవతాస్వరూపుడు; సకల భూతస్వరూపుడు; సకలలోకస్వరూపుడు; సర్వజ్ఞానస్వరూపుడు. ఓ! వీరుడా! అన్ని రూపములూ కూడా గొప్ప రూపము గల ఈ మహావిష్ణువునకు సంబంధించినవే. గొప్ప భుజములు గల ఇతడు బలవంతుడైన దేవుడు. వీరులను చంపగలవాడు. అంతను చూడగలవాడు. మూడులోకములకు గురువు. నాశము లేనివాడు. మోక్షమును కోరు మును లందరూ ఇతనినే ధ్యానించుచుందురు. సకలశరీరములలో ఉన్న ఇతనిని తెలిసికొన్నవానికి పాపములు అంటవు. ఈ మహావిష్ణువును స్మరించుటచేతను, స్తుతించుటచేతను, పూజించుటచేతను అన్నికోరికలను పొందవచ్చును."(77-84)

కంటికి కనబడు రూపముతో ముసలము ధరించి ఉన్న మహావిష్ణువు ఆ విధముగా ఉన్న రావణుణ్ణి చూచి, "ఈ పాపాత్ముణ్ణి ఇప్పుడు చంపకూడదు" అని ఆలోచించుకొని, బ్రహ్మకు ప్రియము చేయవలెనను ఉద్దేశ్యముతో అంతర్ధానము చెందెను. రావణునకు అక్కడ ఆ పురుషుడు కనబడలేదు. అతడు సంతోషముతో ధ్వని చేయుచు ఏ మార్గము ద్వారా లోనికి ప్రవేశించెనో ఆ మార్గమునుండియే వరుణలోకమునుండి బైటకు వచ్చెను.(86-88)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని మొదటి ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# రెండవ ప్రక్షిప్త సర్గము

## రావణుడు సూర్యుని జయించుటకై సూర్యలోకమునకు వెళ్ళుట.

పిమ్మట రావణుడు శ్రేష్ఠమూ, సుందరమూ అయిన మేరుపర్వతశిఖరముమీద ఆ రాత్రి ఉండి ఆలోచించి, సూర్యాశ్వముతో సమానమూ, దివ్యమూ, ఆకాశమునందు విహరించుటకు యోగ్యము అయిన ఆ పుష్పకవిమానమును ఎక్కి, అది అనేకరీతులలో ఎగురునట్లు చేయుచు సూర్యలోకమునకు వెళ్ళెను. అక్కడ సకలతేజఃస్వరూపుడైన మంగళప్రదుడైన సూర్యదేవుణ్ణి చూచెను. ఆ సూర్యదేవుడు శ్రేష్ఠములైన బంగారు బాహుపురులను, రత్నములను, వస్త్రములను అలంకరించుకొని ఉండెను. ఆ సూర్యుని ముఖము సుందరములైన కుండలములతో ప్రకాశించుచు వికసించి

ఉండెను. అతడు బాహుపురులు, కంఠాభరణము అలంకరించుకొని ఎఱ్ఱని వస్త్రములు ధరించి ఉండెను. ఆ సూర్యుడు శరీరమునకు ఎఱ్ఱని మంచి గంధమును పూసికొనెను. వేయి కిరణములతో ప్రకాశించుచుండెను. ఉచ్చైఃశ్రవమును ఎక్కెను. (1-5)

రాక్షసశ్రేష్ఠుడైన ఆ రావణుడు, అద్యంతములూ మధ్యమూ కూడ లేనివాడు, లోకమునకు సాక్షి, జగత్తునకు ప్రభువు అయిన శ్రేష్ఠుడైన ఆ సూర్యదేవుని చూచి అతని తేజోబలముచేత పీడింపబడినవాడై ప్రహస్తునితో- "ప్రహస్తా! నీవు వెళ్ళి నా ఆజ్ఞగా అతనితో చెప్పుము- "రావణుడు యుద్ధానికి వచ్చినాడు; అతనికి యుద్ధమైనా ఇమ్ము; లేదా ఓడిపోయినానని చెప్పుము; ఏదో ఒకపక్షము చేయుము."అని చెప్పి వానిని పంపెను. ప్రహస్తుడు రావణుని ఆజ్ఞప్రకారము సూర్యునివద్దకు వెళ్ళెను. అక్కడ అతనికి పింగలుడు, దండి అను ద్వారపాలకులు కనబడిరి. ప్రహస్తుడు వారిద్దరికీ రావణుని నిశ్చయమును గూర్చి పూర్తిగా తెలిపి అక్కడనే, సూర్యుని తేజస్సు, కిరణములు దహించివేయుచుండగా మౌనముగా నిలబడెను. దండి సూర్యునివద్దకు వెళ్ళి, నమస్కరించి ఆయనకు చెప్పెను. బుద్ధిమంతుడు, రాత్రిని తొలగించువాడు అయిన సూర్యుడు దండినుండి రావణుని వృత్తాంతము విని ఆలోచించి- "దండీ! నీవు వెళ్ళి ఇతనిని జయింపుము; లేదా ఓడిపోయినా నని చెప్పుము. ఈ రాక్షసుని విషయమున కొంచెము కాలము నీకెట్లు ఇష్టమో అట్లు చేయుము" అని చెప్పెను. అతడు సూర్యుని ఆజ్ఞ ప్రకారము వెళ్ళి అతడు చెప్పిన మాటలను మహాత్ముడైన రావణునకు పూర్తిగా వివరించి చెప్పెను. రాక్షసప్రభువైన ఆ రావణుడు దండి మాటలు విని తన జయమును చాటించుకొని వెళ్ళిపోయెను. (6-14)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని రెండవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# మూడవ ప్రక్షిప్త సర్గము

**రావణుడు చంద్రునితో యుద్ధానికి బయలుదేరి వెళ్ళుచు దారిలో మాంధాతతో యుద్ధము చేయుట. పులస్త్యగాలవులు వచ్చి వారి యుద్ధము నిలుపుట.**

పిమ్మట రావణుడు సుందరమైన మేరుపర్వతశిఖరముమీద రాత్రి గడిపి, ఆలోచించి చంద్రలోకమునకు వెళ్ళెను. అప్పుడు ఒక పురుషుడు దివ్యములైన మాలలు ధరించి, అనులేపనము పూసికొని, ప్రధానలైన అప్సరస్త్రీలు సేవించుచుండగా రథ మెక్కి వెళ్ళుచుండెను. రతిచేత అలసి తమ ఒడులలో శయనించి ఉన్న అతనిని ఆ అప్సరఃస్త్రీలు చుంబనములతో మేల్కొలుపుచుండిరి. అట్టి పురుషుణ్ణి రావణుడు చూచెను. అప్పుడు ఇత దెవ్వడా అని అతనికి కుతూహలము కలిగెను. ఇంతలో అతనికి అక్కడ ఒక ఋషి కనబడెను. అతనిని చూచి– దేవర్షీ నీకు స్వాగతము. నీవు తగిన సమయమునందు వచ్చినావు. అప్సరఃస్త్రీలు సేవించగా రథము నెక్కి వెళ్ళుచున్న ఇతడెవరు? సిగ్గులేకుండా వెళ్ళుచున్నాడు. వచ్చిన భయహేతువును గుర్తించకున్నాడు" అని ప్రశ్నించెను.(1–5)

పర్వతుడు రావణుని మాటలు విని – ఇట్లనెను. వత్సా! వినుము; ఉన్నది ఉన్నట్లు చెప్పెదను. ఇతడు లోకాలను జయించినాడు; అనగా ఏ లోకానికైనను వెళ్ళగలిగిన సామర్థ్యమును సంపాదించినవాడు. బ్రహ్మదేవుణ్ణి సంతోషపెట్టినవాడు. ఇప్పుడితడు మోక్షమునకై చాల సుఖకరమైన ఉత్తమస్థానమునకు వెళ్ళుచున్నాడు. రావణా! నీవు తపస్సుచేత లోకాలను జయించినట్లే, సోమపానము చేసిన పుణ్యాత్ముడు ఉత్తమలోకములకు వెళ్ళుదురు; సందేహము లేదు. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! నీవు శూరుడవు. సత్యమైన పరాక్రమము గలవాడవు. బలవంతులు ఇట్టి ధర్మాత్ముల విషయమున కోపించరు" అని చెప్పెను.(6–9)

పిమ్మట గొప్ప తేజస్సూ, పెద్ద ప్రమాణమూ గల ఒక రథము కనబడెను. గీతవాద్యధ్వనులతో కూడిన ఆ రథము దేదీప్యమానముగా ఉండెను. "దేవర్షీ! గొప్ప కాంతితో ప్రకాశించుచున్న ఇతడు మనోహరముగా గానము, నృత్యము చేయుచున్న కింనరులతో ఎక్కడికి వెళ్ళుచున్నాడు?" అని అడుగగా పర్వతుడు – "ఇతడు యుద్ధరంగములో యుద్ధముచేయు శూరుడు. యుద్ధములలో వెనుకకు తిరగనివాడు. ఇతడు యుద్ధము చేయుచుండగా అతని దేహము దెబ్బలచేత తూట్లుపడినది. యుద్ధములలో జయించువాడు, కృతకృత్యుడు శూరుడూ అయన ఇతడు ప్రభువుకొర్కై

తన జీవితమును త్యజించినాడు. యుద్ధములో చాలామందిని చంపి, శత్రువులచేత చంపబడిన ఇతడు ఇంద్రునకు అతిథిగా వెళ్ళుచున్నాడు; లేదా మరెక్కడికో వెళ్ళుచున్నాడు." అని చెప్పెను.(10-14)

ఇంతలో నృత్యము చేయుచు గీతములు పాడుచున్న నరులు సేవించగా వెళ్ళుచున్న ఒక మనుష్యశ్రేష్ఠుడు కనబడెను. అప్పుడు రావణుడు "సూర్యునితో సమానుడైన ఇతడెవరో వెళ్ళుచున్నాడు; ఎవడితడు?" అని మరల ప్రశ్నించెను. రావణుని మాటలు విని పర్వతు డిట్లు చెప్పెను - రాజా! అప్సరఃస్త్రీ సముదాయముతో నిండిన, పూర్తిగా బంగారముతో చేసిన విమానమునందు కనబడుచున్న పూర్ణచంద్రునివంటి ముఖముతో ఉన్న, విచిత్రములైన ఆభరణములు వస్త్రములు ధరించిన ఇతడు సువర్ణుడు అను రాజు. గొప్ప తేజస్సు గల ఇతడు శీఘ్రమైన వాహనముపై వెళ్ళుచున్నాడు."(15-17)

పర్వతుని మాటలు విని రావణుడు - "ఓ! ఋషిశ్రేష్ఠుడా! నీవు చెప్పుము. ఈ రాజులందరూ వెళ్ళుచున్నారు కదా; వీరిలో ఎవడు నేను కోరినచో నాకు ఇప్పుడు యుద్ధాతిథ్యము ఇచ్చును? చెప్పుము. ధర్మములు తెలిసినవాడా! నీవు నాకు తండ్రివంటివాడవు కదా?" అని అడిగెను. "మహారాజా! ఈ రాజులు స్వర్గమును కోరువారే గాని యుద్ధమును కోరువారు కారు. మహాభాగ్యవంతుడా! నీకు యుద్ధమును ఎవ్వడు ఇవ్వగలడో చెప్పెదను. (18-21)

మాంధాత అని ప్రసిద్ధుడైన ఆ రాజు గొప్ప తేజస్సు కలవాడు. ఏడు ద్వీపములకు ప్రభువు. గొప్పవాడు. అతడు నీకు యుద్ధమును ఇవ్వగలడు" అని పర్వతుడు చెప్పెను. పర్వతుని మాటలు విని రావణుడు - "మంచి వ్రతములు కలవాడా! ఆ రాజు ఎక్కడ ఉన్నాడో చెప్పుము. ఆ నరశ్రేష్ఠుడు ఎక్కడ ఉన్నాడో అక్కడికే వెళ్ళెదను" అనెను. రావణుని మాటలు విని ఆ ముని ఇట్లు పలికెను. "యువనాశ్వుని కుమారుడు, రాజులలో శ్రేష్ఠుడూ అయిన మాంధాత అను రాజు సప్తద్వీపములు గల భూమిని జయించి ఇక్కడికి రాగలడు" అని చెప్పెను. ఇంతలో, వరములచేత మూడులోకాలలోను గర్వితుడైన ఆ రావణునకు అయోధ్యాధిపతి, వీరుడు, రాజులలో శ్రేష్ఠుడు, ఏడు ద్వీపములకు ప్రభువు అయిన మాంధాత కనబడెను. అతడు బంగారముతో చేసిన, విచిత్రమైన, ప్రకాశించుచున్న మహేంద్రరథతుల్యమైన రథమునెక్కి వెళ్ళుచుండెను.(22-27)

దివ్యమైన గంధమును పూసుకొని అద్భుతమైన రూపముతో ప్రకాశించుచున్న

ఆ మాంధాతతో రావణుడు - "నాకు యుద్ధము ఇమ్ము" అని పలికెను. రావణుని మాటలు విని మాంధాత - "రాక్షసరాజా! నీకు జీవితము ఇష్టముకానిచో, జీవించవలెనని లేనిచో, యుద్ధము చేయుము" అనెను. మాంధాత మాటలు విని రావణుడు- "వరుణునికి, కుబేరునికి, యమునికీ కూడ భయపడని రావణుడు మనుష్యమాత్రుడవైన నీకు భయపడునా?"అనుచు, కోపముతో మండిపడుచు యుద్ధమునందు చెడ్డ మదము గల రాక్షసులను ఆజ్ఞాపించెను. పిమ్మట యుద్ధములో సమర్థులైన, శూరులైన, దురాత్ముడైన రావణుని అమాత్యులు కోపముతో బాణముల సముదాయములను కురిపించిరి. బలవంతుడైన ఆ మాంధాత గ్రద్దల రెక్కలు కట్టిన, రాళ్ళవలె వాడియైన (గట్టివైన) బాణాలతో ప్రహస్త-శుక - సారణులను, మహోదర-విరూపాక్ష-మారీచ-అకంపనాదులను కొట్టెను. ప్రహస్తుడు మాంధాతపై బాణవర్షములు కురిపించెను. మాంధాత ఆ బాణములను తనవద్దకు రాకుండగానే ఖండించి కుమారస్వామి క్రౌంచపర్వతమును భేదించినట్లు, అతనిని మహావేగము గల ఐదు తోమరములచేత భేదించెను.(28-36)

మాంధాత, యముడు వలె ముద్గరమును అనేకపర్యాయములు త్రిప్పి రావణుని రథముమీదికి చాల వేగముగా విసిరెను. వజ్రమువంటి ఆ ముద్గరము మహావేగముతో పడి శీఘ్రముగా రావణుని ఇంద్రధ్వజమును వలె పడగొట్టెను. అప్పు డా మాంధాత సంతోషముచేత బలము వృద్ధిచెందగా, పరిపూర్ణుడైన చంద్రకిరణముల స్పర్శచేత లవణసముద్రమువలె, ఆనందముతో వృద్ధిచెందెను. ఆ రాక్షససైన్యమంతా హాహాకారములు చేయుచు, చైతన్యవిహీనుడైన రావణుని చుట్టూ నిలబడెను. లంకాధిపతీ, లోకములను ఏడ్పించినవాడూ అయిన రావణుడు చాల సేపటికి స్పృహలోనికి వచ్చి మాంధాత దేహమునకు చాల పీడ కలిగించెను. ఆ రాజు మూర్ఛ చెందుట చూచి మహాబలము గల ఆ రాక్షసులు సంతోషించుచు సింహనాదములు చేయుచు అరచిరి. చంద్రసూర్యులవంటి కాంతిగల, ఎదిరింపశక్యముకాని మాంధాత ముహూర్తకాలములో తేరుకొని, మంత్రులైన రాక్షసుల మన్ననలు పొందుతున్న ఆ రావణుని చూచి, చాల కోపించి, గొప్ప బాణవర్షముచేత రాక్షససైన్యమును పడగొట్టెను. అప్పుడు అతని ధనుష్టంకారధ్వనిచేతను, బాణముల ధ్వనిచేతను ఆ సైన్యము ఎగురగొట్టబడిన సముద్రము వలె చలించెను.(37-45)

నరరాక్షసుల మధ్య ఆ యుద్ధము సంకులముగా, భయంకరముగా జరిగెను. అప్పుడు ధనుస్సులు ఖడ్గములు ధరించి వీరాసనమునందు ఉన్న(వీరులు నిలచు విధమున నిలచిన) వీరులైన ఆ మాంధాతృరావణులు కోపావేశము చెందిరి. గొప్ప

కోపావేశముతో మాంధాత రావణునిమీదా, రావణుడు మాంధాతమీదా బాణవర్షమును కురిపించెను. పరస్పరము పీడించుకొని వాళ్ళు ఇద్దరూ దెబ్బలచేత ఎక్కువగా నలిగిపోయిరి. రావణుడు ధనుస్సుమీద రౌద్రాస్త్రమును సంధించి దానిని విడచెను. మాంధాత ఆగ్నేయాస్త్రముచే దానిని నివారించెను. రావణుడు గాంధర్వాస్త్రమును ప్రయోగించగా మాంధాత దానిని వారుణాస్త్రముచేత కొట్టివేసెను. రావణుడు సకలభూతములకు భయమును కలిగించు బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా మాంధాత గొప్పదైన, దివ్యమైన పాశుపతాస్త్రమును గ్రహించెను. తపస్సుచేసి రుద్రుని వరముచేత పొందబడిన, భయంకరమైన రూపముగల, మూడులోకములకు భయమును వృద్ధి పొందించు గొప్పదైన ఆ అస్త్రమును చూచి స్థావరములు, జంగములు అయిన ప్రాణులు భయపడినవి. అప్పుడు స్థావరజంగమాత్మకములైన మూడు లోకములు కంపించినవి. దేవతలు వణికిపోయిరి. నాగులు అణిగిపోయినవి. మునిశ్రేష్ఠులైన పులస్త్యుడు, గాలవుడు ధ్యానయోగముచేత ఈ విషయమును తెలిసికొని ఆ రాజును నివారించిరి. నిందాపూర్వకములైన వివిధవాక్యములతో రావణుణ్ణి వారించిరి. ఆ మునులు మాంధాతకు రావణునకూ మధ్య స్నేహము నేర్పరిచి, సంతోషించుచు వచ్చిన మార్గముననే వెళ్ళిపోయిరి. (46-55)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని మూడవ ప్రక్షిప్తసర్గము సమాప్తము.**

# నాలుగవ ప్రక్షిప్తసర్గము

## రావణుడు చంద్రునితో యుద్ధముచేయుటకు ప్రారంభించగా బ్రహ్మదేవుడు వారించుట.

ఆ మునులిద్దరూ వెళ్ళిపోయిన పిమ్మట గొప్ప తేజస్సు, బలమూ గల రాక్షసరాజైన రావణుడు పుష్పకమెక్కి, సమస్తగుణములు గల హంసలు నిత్యము నివసించు పదివేల యోజనముల దూరమునందున్న మొదటి వాయుమార్గము దాటి వెళ్ళెను. అంతకంటే పైకి శ్రేష్ఠమైన పదివేల యోజనముల దూరమునందున్న వాయుమార్గమునకు వెళ్ళెను. ఆ వాయుపథమునందు నిత్యము ఆగ్నేయములు, పక్షులు, బ్రాహ్మములు, అను మూడు విధాలైన మేఘములు ఉండును. పిమ్మట, సిద్ధులు మానవంతులైన చారణులు నిత్యము నివసించు ఉత్తమమైన మూడవ వాయుమార్గమును పొందెను. రామా! భూతములూ, వినాయకుడూ నిత్యమూ

నివసించు, పదివేల యోజనముల దూరములో ఉన్న నాల్గవ వాయుమార్గమునకు శీఘ్రముగా వెళ్ళెను. పిమ్మట అతడు పదివేల యోజనముల దూరమునం దున్న ఐదవ వాయుమార్గమునకు వెళ్ళెను. ఆ వాయుమార్గమునందు గంగానదీ, కుముదము మొదలైన దిగ్గజాలూ ఉండును. ఆ దిగ్గజాలు గంగలో క్రీడించుచు, పుణ్యమైన ఆ గంగాజలమును తుంపర్ల రూపమున విడచుచుండును. రామా! ఆ తుంపర్లు సూర్యుని కిరణముల ద్వారా క్రిందికి జారి, గాలికి పల్చబడి, నీరుగను, మంచుగాను వర్షించును. (క్రిందపడును). (1-10)

రామా! ఆ రావణుడు రాక్షసులతో కలసి అక్కడినుండి పదివేల యోజనముల దూరమునందున్న ఆరవ వాయుమార్గమునకు వెళ్ళెను. జ్ఞాతులు, బంధువులు సత్కరించుచుండగా గరుత్మంతుడు నిత్యము అక్కడనే ఉండును. దానిపైన పదివేల యోజనముల దూరమునందు సప్తర్షులు ఉండు ఏడవ వాయుమార్గమునకు వెళ్ళెను. దానిపైన పదివేల యోజనముల దూరము వెళ్ళి ఆకాశగంగ అను ప్రసిద్ధి గల ఆదిత్యమార్గమునందున్న గంగ ఉన్న ఎనిమిదవ వాయుమార్గమును చేరెను. గొప్ప వేగముతో, గొప్ప ధ్వనితో ఆ ఆకాశగంగ వాయువుచేత ధరింపబడి అక్కడ ఉండును. దానిపైన ఎనభైవేల యోజనాల దూరమునందు చంద్రుడున్న స్థానమును గూర్చి చెప్పెదను. అక్కడ నక్షత్రాలతోను, గ్రహాలతోను కలసి చంద్రుడు ఉండును. ఆ చంద్రమండలమునుండి బయల్వెడలిన నూరు లక్షల కిరణములు సకలప్రాణులకు సుఖమును కలిగించుచు లోకాలను ప్రకాశింపచేయుచుండును. (11-17)

అప్పుడు చంద్రుడు దశకంఠుడైన రావణుణ్ణి కాల్చివేయు చున్నట్లు చూచి, శీఘ్రముగా శీతాగ్నిచేత అతనిని కాల్చివేసెను. శీతాగ్నికి భయపడి అతని మంత్రులు దానికి తట్టుకొనలేకపోయిరి. అప్పుడు ప్రహస్తుడు జయశబ్దము పలుకుచు రావణునితో- "రాజా! ఈ శీతము మనలను చంపివేయుచున్నది. ఇక్కడినుండి మరలివెళ్ళిపోయెదము" అనెను. చంద్రుని కిరణముల తాపముచేత ఆ రాక్షసులను భయము ఆవహించెను. రామా! చంద్రుడు అగ్నిస్వరూపుడు, ఇది స్వభావము, రావణుడు ప్రహస్తుని మాటలు విని, కోపముతో నిండినవాడై, ధనుస్సు గ్రహించి, చరచి నారాచబాణములచేత చంద్రుణ్ణి పీడించెను. అప్పుడు బ్రహ్మదేవుడు తొందరగా చంద్రలోకమునకు వచ్చి - "రావణా! ఇక్కడినుండి వెంటనే వెళ్ళిపొమ్ము. చంద్రుణ్ణి పీడించకుము. గొప్ప కాంతి గల ఈ చంద్రుడు లోకహితము చేయుటయందు ఆసక్తికలవాడు. నీకు ఒక మంత్రము ఇచ్చెదను. ప్రాణాపాయస్థితిలో ఈ మంత్రమును జపించువాడు మరణించడు." అని పలికెను. (18-24)

బ్రహ్మదేవుని మాటలు విని రావణుడు చేతులు జోడించి - "లోకములకు నాథుడవైన ఓ! దేవా! గొప్పనియమములు గలవాడా! నీవు అనుగ్రహించినట్లయితే, నాకు మంత్రము ఇవ్వదలచినట్లయితే నాకు ఇమ్ము. మహాభాగ్యవంతుడా! దేవతాప్రభూ! నేను ఆ మంత్రమును జపించి, నీ అనుగ్రహముచేత దేవతలవలనగాని, అసురులవలనగాని, దానవులవలన గాని, పక్షులవలనగాని భయములేనివాడనై, జయింప శక్యముకానివాడను అగుదును. సందేహములేదు. అని పలికెను. రావణుని మాటలు విని బ్రహ్మదేవుడిట్లు పలికెను - "రావణా! ఈ మంత్రమును ప్రాణాపాయసమయమునందు మాత్రమే జపించవలెను; నిత్యమూ జపించకూడదు. మంగళప్రదమైన ఈ మంత్రమును జపమాల (రుద్రాక్షమాల)తోనే జపింపవలెను. రావణా! దీనిని జపించినచో నీకు సిద్ధి లభించును; జపించనిచో లభించదు. ఓ! రాక్షసశ్రేష్ఠుడా! మంత్రము చెప్పెదను వినుము. ఈ మంత్రమును ఉచ్చరించినంతమాత్రముననే నీకు యుద్ధములో జయము లభించగలదు. (25-31)

## మంత్రము

"దేవదేవా! ఈశ్వరా! సురులచేత అసురులచేత నమస్కరింపబడుచున్నవాడా! భూతభవిష్యత్కాలస్వరూపా! మహాదేవా! పాపహరా! పచ్చని నేత్రములు కలవాడా! నీకు నమస్కారము. వ్యాఘ్రచర్మము వస్త్రముగా ధరించినవాడా! నీవు బాలరూపములోను, వృద్ధరూపములోను ఉందువు. దేవా! నీవు పూజింపదగినవాడవు, మూడులోకాలకు ప్రభువైనవాడవు, సర్వసమర్థుడవు. గొప్ప భుజములు కలవాడా! నీవు పాపములను హరించువాడవు. దిక్కులు అంచులుగా కలవాడవు. (అంతటా వ్యాపించినావు). యుగాంతమునందు దహింపచేయు అగ్నివి. గణముల నాయకుడవు. లోకములకు సుఖమిచ్చువాడవు. లోకములను పాలించువాడవు. నీవు మహాభాగ్యశాలివి, గొప్ప శూలము ధరించినవాడవు. పెద్ద కోరలు కలవాడవు. మహేశ్వరుడవు, కాలరూపుడవు, బలరూపుడవు. నల్లని కంఠము, పెద్ద ఉదరము కలవాడవు. దేవతలందరూ నశించినా నిలచువాడవు, తపస్సుకు లక్ష్యమైనవాడవు, జీవులకు పతివి, నాశరహితుడవు, శూలము హస్తమునందున్నవాడవు. ధర్మస్వరూపుడవు. ధ్వజమువంటివాడవు. (లేదా ధ్వజముమీద వృషభమున్నవాడవు). నాయకుడవు, రక్షకుడవు, హరుడవు, హరివి. నీవు జడదారివి, శిరస్సు ముండనము చేయించుకున్న సన్న్యాసివి. జుట్టు ఉన్న వాడవు. దండమును ఆయుధముగా ధరించినవాడవు. గొప్ప కీర్తి కలవాడవు, భూతేశ్వరుడవు, గణాధ్యక్షుడవు, సర్వాత్మస్వరూపుడవు, సర్వమును చూచువాడవు. (32-37)

నీవు అంతటా వ్యాపించి ఉన్నవాడవు, సర్వమును సంహరించు వాడవు, సృష్టికర్తవు, పూజ్యుడవు, నాశరహితుడవు, కమండలువు ధరించువాడవు, ప్రకాశించువాడవు. పినాకమను ధనుస్సు కలవాడవు, ధూర్జటివి. నీవు మాననీయుడవు. ఓంకారము. గొప్పవాడవు. సామవేదప్రతిపాద్యుడవు. మృత్యువు; మృత్యుదూతవు; పరివ్రాజకుడవు, మంచి నియమములు కలవాడవు. నీవు బ్రహ్మచారివి, గృహస్థుడవు. వీణ, పణవము, తూణము అను వాద్యములను మ్రోగించువాడవు. మరణరహితుడవు, సౌందర్యవంతుడవు, బాలసూర్యునితో సమానుడవు. శ్మశానమునందు నివసించువాడవు, భగవంతుడవు, ఉమాపతివి, నిందింపబడనివాడవు, భగుని నేత్రములు పడగొట్టినవాడవు, పూషుని దంతాలు రాల్చినవాడవు. నీవు జ్వరమును హరించువాడవు, చేతిలో పాశ మున్నవాడవు, ప్రళయస్వరూపుడవు (ప్రళయకర్త), కాలస్వరూపుడవు, ఉల్కాముఖుడవు, అగ్నికేతువు, మునివి, ప్రకాశించుచున్నవాడవు, మనుష్యులకు అధిపతివి. (38-42)

ఉన్మాదమును, కంపమును కలిగించువాడవు, సమర్థుడవు, లోకములో శ్రేష్ఠుడవు, వామనుడవు, వామదేవుడవు, ప్రాగ్దక్షిణ్యు డను పేరు గలవాడవు. నీవు భిక్షుకుడవు, భిక్షురూప ధారివి, మూడు జటలు కలవాడవు, జటాధారివి. ఇంద్రుని హస్తము స్తంభింపచేసినవాడవు. వస్తువులను స్తంభింప చేసినవాడవు. ఋతుస్వరూపుడవు, ఋతువులను చేయువాడవు, కాలము, వసంతరూపుడవు, సుందరములైన నేత్రములు కలవాడవు, మహావృక్షములకు సంబంధించినవాడవు, ఐశ్వర్య మిచ్చువాడవు. నిత్యము ఆశ్రితులచేత పూజింపబడినవాడవు. జగత్తును పోషించువాడవు, జగత్తు సృజించువాడవు, పురుషుడవు(జీవుడవు), శాశ్వతుడవు, నిత్యుడవు, ధర్మసాక్షివి, మూడు కళ్ళు కలవాడవు. మూడు మార్గములు కలవాడవు(త్రిలోకసంచారివి), భూతములను చూచువాడవు. త్రినేత్రుడవు, అనేకరూపములు కలవాడవు, పదివేల సూర్యులతో సమానమైన కాంతి గలవాడవు, దేవదేవుడవు, దేవతలను అతిక్రమించినవాడవు, చంద్రునిచే అలంకరించబడిన జటలు గలవాడవు. (43-47)

నీవు నృత్యము చేయువాడవు, లాస్యము చేయువాడవు, పూర్ణచంద్రుని వంటి ముఖముకలవాడవు, బ్రహ్మవేత్తవు, శరణాగతరక్షకుడవు, సకలజీవస్వరూపుడవు. అన్ని వాద్యముల ధ్వని కలవాడవు. సమస్తబంధములనుండి విడిపించువాడవు, మోహము కలిగించువాడవు, బంధము కలిగించువాడవు, సమస్తమును ధరించువాడవు, ఉత్తమవరము లిచ్చువాడవు. నీవు పుష్పదంతుడవు,

విభజించువాడవు, ముఖ్యుడవు, సర్వమును హరించువాడవు. పచ్చని మీసములు కలవాడవు. ధనుస్సును ధరించువాడవు, భయంకరుడవు. భయంకరమైన పరాక్రమము కలవాడవు."(48-50)

నేను చెప్పిన ఈ అష్టోత్తరశతనామస్తోత్రము పుణ్యప్రదము, ఉత్తమమైనది, సకలపాపములను తొలగించునది. పవిత్రము, శత్రువినాశము చేయును."(51)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నాలుగవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# ఐదవ ప్రక్షిప్త సర్గము

## రావణుడు పశ్చిమసముద్రములోని ద్వీపమునకు వెళ్ళుట. కపిలుని చేతిలో పరాభవము పొందుట.

బ్రహ్మదేవుడు రావణునకు ఈ విధముగా వర మిచ్చి బ్రహ్మలోకమునకు వెళ్ళెను. రావణుడు కూడ వరములు పొంది అప్పుడు తిరిగి వెళ్ళిపోయెను. కొంతకాలము పిమ్మట అతడు మంత్రులతో కలసి పశ్చిమసముద్రమునకు వెళ్ళెను. అక్కడ ద్వీపమునందు ఒంటరిగా ఉన్న అగ్నివంటి కాంతి గల ఒక పురుషుడు కనబడెను. అతడు బంగారమువలె ఉండెను. భయంకరమైన ఆకారముతో ప్రళయకాలాగ్నివలె ఉన్న అతడు దేవతలలో దేవేంద్రుడు వలె, గ్రహాలలో సూర్యుడు వలె, శరభమృగములలో సింహమువలె, ఏనుగులలో ఐరావతము వలె, పర్వతములలో మేరుపర్వతమువలె, వృక్షములలో పారిజాతము వలె కనబడుచుండెను. రావణుడు ద్వీపమధ్యమునందున్న ఆ పురుషుణ్ణి చూచి "నాతో యుద్ధానికి రమ్ము" అని పలికెను. అతని దృష్టి గ్రహముల పంక్తివలె వ్యాకులముగా ఉండెను. అతడు దంతములు కొరుకుచుండగా ఆ ధ్వని యంత్రధ్వనివలె ఉండెను. బలవంతుడైన ఆ రావణుడు, అతని మంత్రులు బిగ్గరగా గర్జించిరి. రావణుడు అనేకవిధములుగా గర్జించుచు దీర్ఘములైన భుజములతో, పెద్దకోరలతో వికలముగా, భయంకరుడుగా, అంజనాద్రివలె, మేరుపర్వతమువలె ఉన్న ఆ పురుషునిపై శూల-శక్తి-ఋష్టి-పట్టిశములు ప్రయోగించెను. శంఖము వంటి కంఠము, విశాలమైన వక్షఃస్థలము, కప్పపొట్ట వంటి పొట్ట, సింహము ముఖము వంటి ముఖమూ గల ఆ పురుషుడు కైలాసశిఖరమువలె ఉండెను. భయంకరుడైన అతని అరికాళ్ళు పద్మములవలె ఉండెను. చెలువులు, హస్తపద్మములు ఎఱ్ఱగా ఉండెను. పెద్దదేహముతో గొప్ప ధ్వని

చేయుచున్న అతడు వేగమునందు మనస్సుతోను, వాయువుతోను, సమముగా ఉండెను. నడుమున, అంబులపొదులు కట్టుకొనెను. ఘంటలతో కూడిన చామరములు ధరించెను. అతని చుట్టూ మంటలు మండుచుండెను. చిరుగంటలు మ్రోగుచుండెను. కంఠప్రదేశమునందు వ్రేలాడుచున్న బంగారుపద్మముల మాలతో అతడు ఋగ్వేదము వలె శోభిల్లుచుండెను. పద్మమాలలు అలంకరించుకొనెను. ఆ పురుషుడు పులికి సింహమువలె, ఎద్దుకు ఏనుగువలె, ఏనుగులకు మేరుపర్వతమువలె, నదీవేగములకు సముద్రమువలె ఏమాత్రము చలించక అతనితో – "ఓ! దుర్మతీ! రాక్షసుడా! నీకున్న యుద్ధాసక్తిని పోగొట్టెదను" అని పలికెను. రావణునిలో సకలలోకములకు భయము కలిగించు ఏ వేగముకలదో అట్టి వేలకొలది వేగములు ఆ పురుషుణ్ణి ఆశ్రయించి ఉన్నవి.(1-16)

జగత్తు సిద్ధికి హేతువులైన ధర్మము, తపస్సు ఆ పురుషుని తొడలను ఆశ్రయించి ఉన్నవి. మన్మథుడు గుహ్యాంగమును, విశ్వేదేవతలు కటిప్రదేశమును, మరుత్తులు బస్తిని పార్శ్వములను ఆశ్రయించి ఉండిరి. ఆ పురుషుని నడుమునందు అష్టవసువులు, కుక్షియందు సముద్రాలు, పార్శ్వాదిభాగములందు సకలదిక్కులు, అన్ని సందులయందు వాయువు ఉండెను. భగవంతుడైన రుద్రుడు, పితృదేవతలు వీపుమీద ఉండిరి. బ్రహ్మదేవుడు, పితామహులు హృదయమునం దుండిరి. పవిత్రములైన గోదానములు, భూదానములు, సువర్ణదానములు ఆపురుషుని చంకలోని రోమములను ఆశ్రయించి ఉండెను. హిమవత్పర్వతము, హేమకూటము, మందరము, మేరుపర్వతమూ కూడా ఎముకలుగా అయి ఆ పురుషుణ్ణి ఆశ్రయించికొని ఉండెను. వజ్రాయుధము అతని హస్తముగా అయ్యెను. శరీరమునందు ఆకాశము, మెడ వెనుక భాగమునందు సంధ్యా, మేఘములూ ఉండెను. ధాత, విధాత, విద్యాధరులు మొదలైనవారు అతని బాహువులను ఆశ్రయించిరి. ఆదిశేషుడు, వాసుకి, విశాలాక్షుడు, ఐరావతుడు, కంబలుడు, అశ్వతరుడు, కర్కోటకుడు, ధనంజయుడు, ఘోరమైన విషముగల తక్షకుడు, ఉపతక్షకుడు ఆ పురుషుని గోళ్ళను ఆశ్రయించి, విషమును విడచుటకు సిద్ధముగా ఉండిరి. అగ్ని అతని ముఖమును, రుద్రులు భుజములను ఆశ్రయించి ఉండిరి. అతని రెండు కోరలయందు పక్షములు, మాసములు, ఋతువులు ఉండెను. కుహువు ముక్కులోను, ఛిద్రములలో వాయువులు ఉండెను. సరస్వతీదేవి వీణ అతని కంఠముగాను, అశ్వినీదేవతలు చెవులుగాను, చంద్రసూర్యులు నేత్రములుగాను ఉండిరి. వేదాంగములు, యజ్ఞములు, నక్షత్రములు, మంచి వృత్తములు, వాక్యములు, తేజస్సులు, తపస్సులు, ఆ పురుషుని దేహమును ఆశ్రయించుకొని ఉండెను.(17-29)

ఆ పురుషుడు లీలగా చెయ్యి ఎత్తి పిడికిలి బిగించి మెల్లగా కొట్టగానే ఆ రాక్షసుడు పడిపోయెను. పద్మమాలలు అలంకరించుకొని ఋగ్వేదము వలె ఉన్న పర్వతము వంటి ఆకారము గల ఆ పురుషుడు రావణుడు పడిపోయినట్లు చూచి రాక్షసులను తరిమివేసి తన నివాసమైన పాతాళములోనికి వెళ్ళిపోయెను. రావణుడు లేచి, మంత్రులను పిలచి, - "ప్రహస్తశుకసారణులారా! ఆ పురుషుడు ఎక్కడికి వెళ్ళినాడో వెంటనే చెప్పండి" అని పలికెను. రావణుని మాటలు విని ఆ రాక్షసులు - "దేవదానవుల దర్పమును అణచిన ఆ పురుషుడు ఒక్కడే బిలములో ప్రవేశించినాడు" అని చెప్పిరి. అప్పుడు దుర్మతియైన రావణుడు వేగముగా, గరుత్మంతుడు సర్పమును గ్రహించినట్లు ఖడ్గమును గ్రహించి, శీఘ్రముగా బిలద్వారము సమీపించి, భయములేనివాడై ఆ ద్వారములోనికి ప్రవేశించెను. (30-35)

రావణుడు బిలములో ప్రవేశించి అక్కడ నల్లని కాటుకరాసులవంటి శూరులను చూచెను. వారు బాహుపురులు, బంగారము, రత్నములు అలంకరించుకొని ఎఱ్ఱని మాలలు ధరించి అనులేపనములు పూసికొని ఉండిరి. అక్కడ నృత్యోత్సవము చేసుకొనుచున్న, భయములేని, నిర్మలులైన అగ్నివంటి కాంతి గల మూడుకోట్లమంది మహాత్ములు నృత్యము చేయుచు అతనికి కనబడిరి. భయంకరమైన పరాక్రమము గల రావణుడు క్రీడించుచున్న వాళ్ళను చూచెను. అతడు ఆ కోట్లమంది శూరులను చూచినను భయపడక ద్వారమునందు నిలచెను. ఒకేవిధమైన రంగు, ఒకేవిధమైన వేషము, ఒకేవిధమైన రూపము గల, మహాతేజఃశాలులైన ఆ పురుషులు, అన్ని విధాల తాను వెనుక చూచిన పురుషుని వలెనే ఉండిరి. నాలుగు భుజములు గల, మహోత్సాహవంతులైన ఆ పురుషులను చూడగానే రావణుని ఒడలు గగుర్పొడిచెను. (36-41)

బ్రహ్మనుండి వరములు పొందిన ఆ రావణుడు అక్కడినుండి గొప్ప విలువగల తెల్లనిశయనములు, ఆసనములు ఉన్న గృహముద్వారా శీఘ్రముగా ముందుకు వెళ్ళి అక్కడ శయనముపై ఉన్న ఒక ఉత్తమపురుషుణ్ణి చూచెను. ఆ పురుషుడు అగ్నిచేత కప్పబడినవాడై అక్కడ శయనించి ఉండెను. అక్కడ ఒక దేవి వింజామర చేతిలో గ్రహించి నిలబడి ఉండెను. పతివ్రతా మూడులోకములకు అలంకారమూ అయిన ఆమె దివ్యములైన మాలలు, అనులేపనము, ఆభరణములు, వస్త్రములు ధరించి ఉండెను. త్రిలోకసుందరియైన లక్ష్మీదేవి అక్కడ పద్మములు ధరించి ప్రకాశించుచుండెను. రావణుడు, సింహాసనముపై కూర్చొని ఉన్న, అందమైన చిరునవ్వుగల ఆ సాధ్విని చూచి వెంటనే ఆమెను పట్టుకొనుటకై ప్రవేశించెను. దుర్మతియైన రావణుడు అప్పుడు కాలప్రేరితుడై మన్మథునికి వశుడై, అక్కడ తన

మంత్రులెవ్వరూ సహాయులుగా లేకపోయినను, నిద్రించుచున్న సర్పమును వలె ఆమె హస్తమును పట్టుకొనుటకు నిశ్చయించెను. అప్పుడు అగ్నిచేత ఆవరించబడి నిద్రించుచున్న మహాబాహువైన ఆ దేవుడు, రావణుడు ఆ సాధ్విని గ్రహించ నున్నట్లు తెలుసుకొని, కప్పుకొనిన వస్త్రమును తొలగించి బిగ్గరగా నవ్వెను. (42-49)

రావణుడు ఆ తేజస్సుకు కాలిపోయినవాడై, మొదలు నరికిన చెట్టువలె వెంటనే నేలమీద పడెను. అతడు పడిపోయినట్లు చూచి ఆ పురుషుడు – "రాక్షసశ్రేష్ఠుడా లెమ్ము, నీకింకా ఇప్పుడు మరణము లేదు. నీకు బ్రహ్మదేవుడిచ్చిన వరమును రక్షించవలసియున్నది గాన బ్రతికిపోయినావు. రావణా! నిర్భయముగా వెళ్ళుము. నీకు ఇప్పుడు మరణము లేదు." అనెను. ముహూర్తకాలములో స్పృహ వచ్చిన ఆ రావణుణ్ణి భయము ఆవహించెను. దేవతలను పీడించు, రావణుడు ఆ పురుషుని మాటలు విని గగుర్పాటు చెంది మహాతేజఃశాలియైన అతని– "పరాక్రమవంతుడవు, ప్రళయకాలాగ్నివంటివాడవు అయిన నీవు ఎవ్వరవు? ఓ! దేవా! చెప్పుము. నీవు ఇట్లు ఇక్కడ ఎందుకున్నావు?" అని ప్రశ్నించెను. ఆ దేవుడు దురాత్ముడైన రావణుని మాటలు విని నవ్వుచు, మేఘధ్వని వలె గంభీరమైన వాక్కుతో "రావణా! నేను ఎవరినైతే మాత్రము నీకెందుకు? నిన్ను కొద్దికాలములో నేను చంపనున్నాను" అనెను. రావణుడు ఆ మాటలు విని అంజలి ఘటించి "బ్రహ్మదేవుని మాట ప్రకారము నాకు మరణములేదు. నాతో సమానుడు దేవతలలో కూడా పుట్టలేదు; పుట్టబోడు. తన పరాక్రమముచేత ప్రజాపతి ఇచ్చిన వరమును దాటగలవాడు కూడ పుట్టలేదు, పుట్టబోడు. ఆ వరము విషయమున పరిహారము లేదు. ప్రయత్నము కూడ దుర్బలమే(బలవిహీనమే) అగును. నా వరమును వ్యర్థము చేయగలవాడు మూడు లోకాలలోనూ కూడ లేదు. ఓ! దేవతాశ్రేష్ఠుడా! నాకు మరణములేదు. అందుచేతనే నాకు భయము కలుగలేదు. ప్రభూ! నాకు మరణము వచ్చినను నీచేతనే రావచ్చును. నీవలన నాకు మరణము వచ్చినచో అది శ్లాఘింపదగినది. యశస్కరమూ కూడ అగును." అని పలికెను. (50-60)

పిమ్మట భయంకరమైన పరాక్రమము గల రావణుడు ఆ దేవుని శరీరమునందు స్థావరజంగమాత్మకమైన మూడు లోకముల సముదాయమును చూచెను. ఆదిత్యులు, మరుత్తులు, సాధ్యులు, వసువులు, అశ్వినీదేవతలు, రుద్రులు, పితృదేవతలు, యముడు, కుబేరుడు, సముద్రములు, పర్వతములు, నదులు, వేదములు, విద్యలు, మూడు అగ్నులు, గ్రహములు, నక్షత్రములు, ఆకాశము, సిద్ధులు, గంధర్వులు, చారణులు, వేదవేత్తలైన మహర్షులు, గరుత్మంతుడు, సర్పాలు, ఇంకా మిగిలిన దేవతాసంఘాలు, దైత్యులు,రాక్షసులు, సూక్ష్మరూపములతో, శయనించి ఉన్న ఆ

పురుషుని అవయవాలలో కనబడెను.(61-65)

అప్పుడు ధర్మాత్ముడైన రాముడు మునిశ్రేష్ఠుడైన అగస్త్యుణ్ణి - "ద్వీపమునందున్న ఆపురుషు డెవరు? ఆ మూడుకోట్లమంది జనులు ఎవరు? దైత్యదానవుల దర్పము అడచిన, శయనించి ఉన్న ఆపురుషుడు ఎవరు?" అని ప్రశ్నించెను. రాముని మాటలు విని అగస్త్యుడు- "చెప్పెదను, వినుము. ద్వీపమునందున్న పురుషుడు దేవదేవుడు, సనాతనుడు, భగవంతుడైన కపిలుడు. అక్కడ నృత్యములు చేయుచున్నవారు బుద్ధిమంతుడైన అతనికి సంబంధించిన దేవతలు; వాళ్ళు కపిలు డనే ఆ పురుషునితో సమానమైన తేజస్సు, ప్రభావము కలవారు. రామా! పాపనిశ్చయము గల ఆ రాక్షసుని ఆ పురుషుడు కోపముతో చూడలేదు. అందుచేతనే అతడు భస్మము కాలేదు" అని చెప్పెను. పర్వతమువంటి ఆ రావణుడు శరీరమంతా చెమటకు తడిసిపోగా, నేలమీద పడిపోయెను. ఆ పురుషుడు వానిని సంహరించకుండగా, చాడీలు చెప్పువాడు రహస్యమును భేదించినట్లు (బట్టబైలుచేసినట్లు), మాట లనే బాణాలతో వానిని భేదించెను. రావణుడు, చాలా సేపటికి స్పృహ రాగా తన మంత్రు లున్నచోటికి వచ్చెను.(61-72)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఐదవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# ఇరువది నాలుగవ సర్గము

**రావణుడు అపహరించిన దేవతాకన్యాదులు విలపించుచు వానికి శాపము ఇచ్చుట. రావణుడు శూర్పణఖను ఓదార్చుట. ఆమెను ఖరునితో దండకారణ్యమునకు పంపుట.**

సంతోషముతో తిరిగివచ్చుచున్న దురాత్ముడైన ఆ రావణుడు మార్గమునందు కనబడిన రాజకన్యలను, ఋషికన్యలను, దేవకన్యలను, దానవకన్యలను హరించెను. వానికి సుందరియైన కన్యగాని, స్త్రీగాని కనబడగానే అతడు ఆమె బంధువులను చంపి ఆమెను విమానములో నిర్బంధించెను. ఈ విధముగా అతడు నాగ-రాక్షస-అసుర-మనుష్య-యక్ష-దానవ కన్యలను విమానముమీద ఎక్కించుకొని తీసికొనిపోయెను. ఆ కన్య లందరూ దుఃఖించుచు శోకాగ్నివలన భయమువలన జనించిన, అగ్నిజ్వాలలతో సమానమైన కన్నీటిని విడచిరి. భయముచేత శోకముచేత కన్నీళ్ళు కార్చుచున్న, ఎట్టి దోషములూ లేని ఆ కన్యలచేత,

ఆ విమానము, నదులచేత, సముద్రముల వలె నింపబడెను. ఆ విమానములో ఉన్న వందలకొలది నాగగంధర్వకన్యలు, మహర్షుల కన్యలు, దైత్య-దానవకన్యలు ఏడ్చిరి.(1-6)

పొడవైన జుట్టు, చాల అందమైన శరీరము, పూర్ణచంద్రుని వంటి ముఖము, బలిసిన ఉరోజములు, వజ్రములు పొదిగిన వేదికవంటి నడుము గల ఆ స్త్రీలు దేవతాస్త్రీల వలె ఉండిరి. రథముల ఇరుసుల వలె ఉన్న పిరుదులతో మనోహరముగా ఉన్న చక్కని నడుములు గల ఆ స్త్రీలు శోకదుఃఖములతో కలతచెంది ఉండిరి. వాళ్ల నిట్టూర్పుల గాలులచేత అంతటా ప్రజ్వలింపచేయబడిన పుష్పకము నిరోధింపబడిన అగ్నులు గల అగ్నికుండముల వలె ఉండెను. రావణునికి చిక్కిన యౌవనమధ్యమునం దున్న ఆ స్త్రీలు సింహమువశములో ఉన్న ఆడలేళ్ళ వలె దైన్యము చెందిన ముఖములతో నేత్రములతో శోకాక్రాంత లైరి.(7-10)

వాళ్లలో ఒక స్త్రీ "ఇతడు నన్ను భక్షించివేయునా?" అని అనుకొనుచుండెను. మిక్కిలి దుఃఖించుచు మరొక స్త్రీ "ఇతడు నన్ను చంపివేయునా?" అని అనుకొనుచుండెను. ఈ విధముగా ఆ స్త్రీలందరూ కలసి తల్లులను, తండ్రులను, భర్తలను సోదరులను స్మరించుచు దుఃఖశోకములతో కూడినవారై ఏడ్చిరి. నేను లేకుండా నా పుత్రుడు ఎట్లుండునో కదా! నా తల్లి ఎట్లుండునో కదా! నా సోదరుడు ఎట్లుండునో కదా! అని అనుచు ఆ స్త్రీలు శోకసాగరములో మునిగిరి. భర్త లేకుండా నేనేమి చేయుదును? ఓ! మృత్యుదేవతా! నిన్ను బ్రతిమాలుకొనుచున్నాను. దుఃఖము అనుభవించవలసి ఉన్న నన్ను తీసికొని పొమ్ము. పూర్వజన్మలో నేనెట్టి పాపము చేసి ఉన్నానో కదా! ఈ విధముగా దుఃఖము చెంది శోకసాగరములో పడిన మాకు ఈ దుఃఖమునకు అంతము కనబడుటలేదు. ఛీ! ఈ మనుష్యలోకము ఎంత చెడ్డది. దీనికంటె అధమమైన లోకము లేదు. ఎందుచేతననగా బలవంతుడైన రావణుడు దుర్బలులైన మన భర్తలను ఉదయించుచున్న సూర్యుడు నక్షత్రములను వలె నశింపచేసినాడు. ఏమి ఆశ్చర్యము! ఈ మహాబలవంతుడైన రాక్షసుడు ఇతరులను చంపు ఉపాయము లున్నందుకు సంతోషించుచున్నాడు కాని చెడ్డపనులు చేయుచున్న తనను గూర్చి అసహ్యించుకొనుటలేదు. ఈ దురాత్ముని పరాక్రమము ఇతడు చేసిన తపస్సు మొదలైనవాటికి అన్నివిధాల తగి ఉన్నది. కాని పరస్త్రీ స్పర్శరూపమైన ఈ పని మాత్రము తగినదికాదు. దుర్బుద్ధి అయిన ఈ రాక్షసాధముడు పరభార్యలయందు అభిలాష కలిగి ఉన్నాడు; అందువలన ఇతడు స్త్రీ మూలముననే మరణించగలడు.(11-20)

పతివ్రతలైన ఆ ఉత్తమస్త్రీలు ఇట్లు పలకగానే ఆకాశమునందున్న దుందుభులు మ్రోగెను. పుష్పవర్షము కురిసెను. పతివ్రతలైన ఆ ఉత్తమస్త్రీలు కలిసి ఒక్కమారుగా ఈ విధముగా శపించగానే ఆ రావణుని తేజస్సు అణచివేయబడి నట్లు అతడు కాంతివిహీనుడయ్యెను. అతని మనస్సు చెదిరిపోయినట్లు అయ్యెను. ఆ రాక్షసరాజు ఆ స్త్రీల ఈ విలాపమును వినుచు, రాక్షసుల పూజలు అందికొనుచు లంకాపురములో ప్రవేశించెను. (21-23)

ఇంతలో రావణుని సోదరి, భయంకరురాలు, కామరూపము గలది అయిన శూర్పణఖ వచ్చి అతని పాదములమీద పడెను. అతడు సోదరిని లేవదీసి ఓదార్చుచు, "ఓ! మంగళప్రదురాలా! నీవు నాతో ఏదో తొందరగా చెప్పదలచుచున్నట్లు ఉన్నావు. అది ఏమి?" అని పలికెను. అప్పుడు కన్నీళ్ళతో నిండిన ఎఱ్ఱనైన కండ్లతో ఆమె - "రాజా! బలవంతుడైన నీవు నాకు, బలాత్కారముగా వైధవ్యము కల్పించినావు. నీవు కాలకేయు లని ప్రసిద్ధి చెందిన పలునాలుగు వేలమంది దైత్యులను యుద్ధములో నీ పరాక్రమముచేత చంపివేసినావు. నాయనా! నా ప్రాణాలకంటె కూడ ప్రియుడైన బలవంతుడైన నా భర్త వారిలో ఒకడు. సోదరు డను పేరుతో నా శత్రువై నీవు అతనిని కూడ చంపివేసినావు. రాజా! బంధువైన నీవే స్వయముగా నాకు గొప్ప ఆపద కలగచేసినావు; నాకు నీవే వైధవ్యమును కలిగించినావు. యుద్ధాలలో ఇంటి అల్లుణ్ణి నీవు రక్షించవలెను కదా? అట్టి అల్లుణ్ణి నీవే స్వయముగా చంపికూడ సిగ్గు చెందుట లేదు!" అని పలికెను. (24-30)

సోదరి ఏడ్చుచు పలికిన ఆ మాటలు విని, రావణుడు ఆమెను ఓదార్చి, బ్రతిమాలుచు - చెల్లెలా! ఏడవకుము. నీకు ఏ విధముగానూ భయపడవలసిన పని లేదు. నీకు దాన-మాన-ప్రసాదములచేత ప్రయత్నపూర్వకముగా సంతోషము కలిగించెదను. యుద్ధములో జయమును కోరుచు బాణములను విడచుచు మనస్సు చెదిరి యుద్ధమునందు పొరబడిన నాకు తనవా రెవరో, ఇతరు లెవరో తెలియలేదు. సోదరీ! యుద్ధమునందు దురావేశములో ఉన్న నేను కొట్టే సమయమునందు అల్లుణ్ణి గుర్తించలేదు. అందుచేతనే నీ భర్తను యుద్ధములో చంపి వేసితిని. నీ తల్లి సోదరి కుమారు డగుటచే నీకు భ్రాత అయిన ఈ రాక్షసుడైన ఖరుడు ఎల్లప్పుడు నీవు చెప్పినట్లు చేయుచు అక్కడ ప్రభువుగా ఉండగలడు. ఈ వీరుడు దండకారణ్యమును రక్షించుటకు శీఘ్రముగా వెళ్ళుగాక. మహాబలవంతుడైన దూషణుడు ఇతని సేనాధిపతి కాగలడు. ఈ ఖరుడు అక్కడ ఎల్లప్పుడు నీ మాట ప్రకారము చేయగలడు. ఇతడు ఇచ్ఛానుసారము రూపములు ధరించగల రాక్షసుల నాయకుడై ఉండగలడు" అని

చెప్పి ఆమెను ఓదార్చెను.(31-37)

రావణుడిట్లు పలికి ఖరునకు సైన్యముగా ఉండవలసినదిగా పరాక్రమవంతులైన పదునాలుగువేల మంది రాక్షసులను ఆదేశించెను. ఖరుడు చూచువారికి భయము కలిగించు ఆ రాక్షసులందరితో కూడి, ఏ మాత్రమూ భయము లేనివాడై శీఘ్రముగా దండకారణ్యమునకు వచ్చెను. అతడు అక్కడ శత్రుబాధ లేని రాజ్యమును నెలకొల్పెను. ఆ శూర్పణఖ కూడ ఆ దండకావనమునందు నివసించెను.(38-42)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది నాలుగవ సర్గము సమాప్తము.**

# ఇరువది ఐదవ సర్గము

## మేఘనాదుడు యజ్ఞములు చేసి సఫలత్వము పొందుట. రావణుడు మధువుతో కలిసి దేవలోకమును ఆక్రమించుటకు వెళ్ళుట.

రావణుడు ఖరునకు భయంకరమైన సైన్యము నిచ్చి, సోదరిని ఓదార్చి సంతోషించుచు స్వస్థచిత్తు డయ్యెను. పిమ్మట అతడు అనుచరులతో కలసి నికుంభిల అను ఉత్తమమైన లంక దగ్గర ఉన్న ఉద్యానమునకు వెళ్ళెను. శోభతో వెలుగుచున్న ఆ రావణుడు అక్కడ వందలకొలది యూపస్తంభములతో వ్యాప్తము, అందమైన దేవాలయములతో ప్రకాశించుచున్నదీ అయిన యజ్ఞము జరుగుచుండుట చూచెను. అతడు అక్కడ తన కుమారుడైన భయంకరుడైన మేఘనాదుని చూచెను. అతడు కృష్ణాజినము కట్టుకొని కమండలువు, శిఖ, దండము ధరించి ఉండెను. రావణుడు అతని దగ్గరకు వెళ్ళి బాహువులతో కౌగిలించుకొని "వత్సా! ఇది ఏమి చేయుచున్నావు? యథార్థముగా చెప్పుము" అని అడిగెను.(1-5)

అప్పుడు ద్విజులలో శ్రేష్ఠుడు, గొప్ప తపస్సు గలవాడు అయిన శుక్రుడు యజ్ఞసిద్ధి పరిపూర్ణమగుటకై రాక్షసశ్రేష్ఠుడైన రావణునితో ఇట్లు పలికెను. మౌనవ్రతము పాటించుచున్న యజమానుడైన మేఘనాదుడు మాటలాడినచో యజ్ఞము అసమృద్ధము(అసంపూర్ణము) అగును గాన శుక్రుడు సమాధానము చెప్పెను. రాజా! నేను నీకు ఆ విషయమంతా చెప్పెదను వినుము. నీ పుత్రుడు చాల పెద్దవైన ఏడు యజ్ఞాలు పూర్తిచేసినాడు. అగ్నిష్టోమము, అధికముగా బంగారము

దానమీయవలసిన అశ్వమేధము, రాజసూయము, గోమేధము, వైష్ణవము అను యజ్ఞాలు పూర్తి అయినవి. ఇతరులు ఎవ్వరూ చేయజాలని మహేశ్వరయజ్ఞము పూర్తికాగానే నీ కుమారునకు సాక్షాత్తు మహేశ్వరుడు వరములను ఇచ్చినాడు. స్వేచ్ఛానుసారము నడిచే, ఆకాశములో కూడా సంచరించే దివ్యమూ, స్థిరమూ(దృఢమూ) అయిన రథము, చీకటిని సృష్టించే తామసి అను మాయను వరములుగా ఇచ్చెను. రాక్షసరాజా! యుద్ధములో ఈ మాయను ప్రయోగించినచో సురులు అసురులూ కూడ ఇతని సంచారము తెలిసికొనజాలరు. బాణములతో నిండిన అక్షయములైన అంబులపొదులను, జయింప శక్యము కాని ధనుస్సును, యుద్ధములో శత్రువులను నశింపచేయు బలము గల అస్త్రమునూ కూడా పొందెను. రావణా! నీ కుమారుడు ఈ వరము లన్నీ సంపాదించి, ఈనాడు, యజ్ఞసమాప్తి దివసమునందు, నిన్ను చూడవలె నను కోరికతో ఉన్నాడు."(6-13)

అప్పుడు రావణుడు- "చేసిన ఈ పని మంచిది కాదు; ఎందుచేతననగా మనశత్రువు లైన ఇంద్రాదులను ఆ యా ద్రవ్యములు సమర్పించి పూజించినారు. సౌమ్యుడా! రమ్ము; జరిగిపోయినదానిని మార్పజాలము కదా? మన గృహమునకు వెళ్ళుదము; రమ్ము" అని పలికి, పుత్రునితోను, విభీషణునితోను కలసి వెళ్ళి కన్నీటితో డగ్గుత్తిక చెంది ఉన్న ఆ స్త్రీలందరినీ విమానమునుండి దింపెను.(14-16)

ధర్మాత్ముడైన విభీషణుడు దేవదానవరాక్షసులలో రత్నములైన, సర్వలక్షణసంపన్నలైన ఆ స్త్రీలను చూచి, వాళ్ళ విషయమునందు రావణుని అభిప్రాయము తెలిసికొని ఇట్లు పలికెను- "నీవు కీర్తిని, అర్థమును, కులమునూ నశింపచేసే ఈ విధమైన ప్రవృత్తిని అవలంబించి, మంచిచెడులను తెలిసి ఉండి కూడ ఇష్టము వచ్చినట్లు ప్రాణులను హింసించుచున్నావు. రాజా! నీవు వీరి బంధువులను పీడించి ఈ స్త్రీలను తీసికొనివచ్చినావు. మధువు నిన్ను లెక్కచేయక కుంభీనసిని హరించినాడు'' అని పలికెను. రావణుడు ఇది విని- "ఏమి జరిగినదో, నీవు చెప్పుచున్న మధువు అనే వాడు ఎవడో నాకు అర్థము కాలేదు" అనెను. విభీషణుడు కోపముతో సోదరునితో ఇట్లు పలికెను. "నీవు చేయుచున్న పాపకర్మకు ఎట్టి ఫలము సంప్రాప్తించినదో వినుము- మన మాతామహుడైన సుమాలికి అన్న, మన తల్లికి పెదతండ్రి, మనకు పూజ్యుడూ అయిన మాల్యవంతు డని ప్రసిద్ధి చెందిన బుద్ధిశాలియైన రాక్షసుని కుమార్తెకు కుమార్తె అయిన(దౌహిత్రి) కుంభీనసి ఉన్నది కదా. మన తల్లి సోదరియైన అనల కుమార్తె అయిన ఆ కుంభీనసి సోదరులమైన మనకు అందరికీ వరసకు చెల్లెలు అగును. రాజా! మేఘనాదుడు

యజ్ఞము చేయుచుండగా నేను తపస్సు నిమిత్తము జలములో మునిగి ఉండగా బలవంతుడైన మధువు అను రాక్షసుడు ఆమెను అపహరించినాడు. మహారాజా! ఆ సమయమునందు కుంభకర్ణుడు నిద్రించుచుండెను. అప్పుడు మధువు గౌరవింపదగిన రాక్షసశ్రేష్ఠులైన అమాత్యులను చంపి నీ అంతఃపురములో రక్షింపబడుచున్నా కూడా ఆమెను బలాత్కారముగా అపహరించెను. మహారాజా! ఈ విషయము తెలిసిన తరువాత కూడా మేము క్షమించినాము. అతనిని చంపలేదు. సోదరులు కన్యను ఏనాటికైనను భర్తకు ఇవ్వవలసినదే కదా? దుర్మతివైన నీవు చేయుచున్న పాపకర్మలకు ఫలితముగా ఇది ఈ లోకములో(జన్మలో)నే వచ్చినది అను విషయము తెలుసుకొనుము" అని చెప్పెను. (17-28)

రాక్షసరాజైన రావణుడు విభీషణుని మాటలు విని, తాను చేసిన చెడ్డపనులచేత పీడింపబడి, మరుగుచున్న నీళ్ళు గల సముద్రమువలె అయెను. అపుడు కోపముచేత ఎఱ్ఱనైన నేత్రములు గల రావణుడు - "శీఘ్రముగా నా రథమును సిద్ధముచేయుడు. మన శూరులు సిద్ధమగుగాక. నా సోదరుడైన కుంభకర్ణుడు, ప్రధానులైన రాక్షసులు వివిధములైన ఆయుధము ధరించి వాహనములను ఎక్కెదరుగాక. రావణునికి భయపడక అట్టి దుష్కార్యము చేసిన మధువును ఇప్పుడు యుద్ధములో చంపి, స్నేహితులతో కలిసి యుద్ధానికై దేవలోకమునకు వెళ్ళెదను" అని పలికెను. (29-32)

అప్పుడు శ్రేష్ఠములైన నాలుగువేల అక్షౌహిణుల రాక్షససైన్యము అనేకవిధములైన ఆయుధములు ధరించి యుద్ధమునకు వెడలినది. ఇంద్రజిత్తు కొందరు సైనికులతో సైన్యానికి ముందు వెళ్ళెను. రావణుడు సైన్యమధ్యమునందు, కుంభకర్ణుడు సైన్యానికి వెనుక భాగమునందు ఉండెను. ధర్మాత్ముడైన విభీషణుడు ధర్మము పాటించుచు లంకలోనే ఉండిపోయెను. మిగిలిన మహానుభావులైన రాక్షసులు మధువు నివసించు పురమునకు వెళ్ళిరి. ఆ రాక్షసులందరూ ఆకాశమునందు అవకాశము లేకుండునట్లు చేయుచు, గాడిదలు, ఒంటెలు, గుఱ్ఱములు, ప్రకాశించుచున్న శింశుమారములు(మొసళ్ళు) మహాసర్పములు ఎక్కి వెళ్ళిరి. దేవతలతో వైరము పెట్టుకొని ఉన్న వందలకొలది దైత్యులు కూడ, అక్కడ వెళ్ళుచున్న రావణుని చూచి అతని వెనుకనే వెళ్ళిరి. (33-37)

రావణుడు మధువు నగరమును చూచి ప్రవేశించెను. అక్కడ అతనికి మధువు కనబడలేదు, తన సోదరి కనబడినది. ఆ కుంభీనసి భయపడి అంజలి ఘటించి, రావణుని పాదములను తన శిరస్సుతో స్పృశించి నమస్కరించెను. రాక్షసశ్రేష్ఠుడైన

రావణుడు "భయపడకుము" అని పలుకుచు ఆమెను లేవదీసి "నీకు నే నేమి చేయవలెను?" అని ప్రశ్నించెను. ఆమె ఇట్లు పలికెను - "మానమును సంరక్షించు మహాభుజుడవైన ఓ! రాజా! నీవు నాయందు ప్రసన్నుడ వైనచో ఇప్పుడు నా భర్తను చంపకుము. కులస్త్రీలకు ఈ లోకములో అన్ని భయములలోను వైధవ్యము అనేది గొప్ప వ్యసనము. ఇట్టి భయము మరొకటి లేదు అని అందురు కదా?" ఓ! రాజశ్రేష్ఠుడా! బ్రతిమాలుచున్న నన్ను చూడుము. మహాభాగ్యవంతుడా! "భయపడకుము" అని నీవే పలికినావు కదా? నీ మాట నిలబెట్టుకొనుము."(38-43)

రావణుడు సంతోషించి అక్కడ నిలచి ఉన్న సోదరితో - "నీ భర్త అయిన మధువు ఎక్కడ? నాకు శీఘ్రముగా తెలుపుము. అతనితో కలసి సురలోకమును జయించుటకు వెళ్ళెదను; నీపై ఉన్న కరుణచేతను, స్నేహముచేతను ఆ మధువును చంపుట మానుకొనుచున్నాను." అనెను. కుంభీనసి ఆ మాటలు విని సంతోషించి, నిద్రపోవుచున్న భర్తయైన మధువును మేల్కొలిపి, అతనితో- "ఇదిగో మహాబలశాలియైన నా సోదరుడు రావణుడు వచ్చినాడు, సురలోకమును జయించగోరుచున్న ఇతడు నీ సాహాయ్యము కోరుచున్నాడు. అందువలన ఓ! రాక్షసా! నీవు సపరివారముగా వెళ్ళి ఇతనికి సాహాయ్యము చేయుము. స్నేహము కలవాడు కోరుచున్నప్పుడు వారికి ఉపకరించుట యుక్తము" అని చెప్పెను. మధువు ఆమె మాటలు విని "అట్లే చేసెదను" అని పలికి, న్యాయానుసారముగా రావణుని వద్దకు వచ్చి కలిసికొని, ఆ రాక్షసరాజును యథావిధిగా సత్కరించెను. పరాక్రమవంతుడైన రావణుడు మధువు గృహములో సత్కారములు అందికొని, ఒక రాత్రి అక్కడ ఉండి వెళ్ళుటకు ప్రయాణమాయెను. మహేంద్రునితో సమానుడైన రావణుడు పిమ్మట, కుబేరుని నివాసమైన కైలాసము చేరి అక్కడ సైన్యమును నిలిపెను.(44-52)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది ఐదవ సర్గము సమాప్తము.**

# ఇరువది ఆరవ సర్గము

**రావణుడు రంభను బలాత్కరించుట; నలకూబరుడు రావణుని శపించుట.**

సూర్యుడు అస్తమించుటచే పరాక్రమవంతుడైన ఆ రావణుడు సైన్యముతో అక్కడ నివసించుటకు ఇచ్ఛయించెను. తాము విడిసిన కైలాసపర్వతము వంటి కాంతి గల నిర్మలమైన చంద్రబింబము ఉదయించగానే అనేక విధములైన ఆయుధములు ధరించిన ఆ గొప్ప సైన్యము నిద్రించినది. పర్వతము పైభాగమున కూర్చొనిఉన్న పరాక్రమవంతుడైన రావణుడు చంద్రకిరణములచేత ప్రకాశించబడుచున్న ఆ పర్వతమునందలి భోగ్యవస్తువులను చూచెను. ఆ కైలాసపర్వతమునందున్న వనప్రాంతములు ప్రకాశించుచున్న కర్ణికారవనములతోను, కదంబ-వకుల వృక్షములతోను, వికసించిన పద్మలతలతోను, మందాకినీజలముల తోను, చంపక-అశోక-పునాగ-మందార-చూత-పాటల- లోధ్ర-ప్రియంగు-అర్జున-కేతక-తగర-నారికేల-ప్రియాల-పనస వృక్షములతోను, ఇంకా ఇతర వృక్షములతోను, ప్రకాశించుచుండెను. అట్టి వనప్రాంతములలో మధురమైన కంఠస్వరము గల అనురాగవంతులైన కింనరులు మన్మథపీడితులై తమ ప్రియురాళ్ళతో కూడ మనస్సుకు ఆనందము కలుగునట్లుగా గానము చేయుచుండిరి. విద్యాధరులు మదముచేత మత్తులై, మదముచేత ఎఱ్ఱనైన నేత్రాంతములు కలవారై స్త్రీలను కలసి క్రీడించుచుండిరి; ఆనందించుచుండిరి.(1-8)

కుబేరుని భవనములో గానము చేయుచున్న అప్సరఃస్త్రీసంఘాల మధురధ్వని ఘంటానినాదము వలె వినబడెను. గాలికి కదలుచు పుష్పములు కురియుచున్న, మకరందముతో కూడిన వసంతర్తువు సుగంధము గల వృక్షములు ఆ పర్వతమునకు సువాసన కలిగించుచున్నట్లు ఉండెను. మకరందముతోను, పుప్పొడితోను కలిసిన అత్యధికమైన సువాసతో నిండి సుఖకరముగ ఉన్న గాలి రావణునికి కామోద్రేకము కలిగించుచు వీచుచుండెను. సంగీతము వినబడుచుండుటచేత, పుష్పసమృద్ధిచేత, వాయువు చల్లగా ఉండుటచేత, పర్వతసౌందర్యముచేత, రాత్రి ఆరంభము కాగానే చంద్రుడు ఉదయించుటచేత మహాపరాక్రమవంతుడైన ఆ రావణుడు కామవశుడై మాటిమాటికి నిట్టూర్చుచు చంద్రుని వంక చూచుచుండెను.(9-13)


ఇంతలో అప్సరస్త్రీ లందరిలోను శ్రేష్ఠురాలైన రంభ అక్కడ ప్రకాశించెను (ప్రకాశించుచు కనబడెను). పూర్ణచంద్రుని వంటి ముఖము గల ఆమె దివ్యములైన ఆభరణములు అలంకరించుకొని, శరీరమునకు దివ్యమైన చందనము అలముకొని

కేశపాశములో మందారపుష్పములు ధరించెను. దివ్యములైన పుష్పములు అలంకరించికొని ఉన్న ఆమె అద్భుతమైన రత్యుత్సవమునకు సన్నాహము చేయుచుండెను. రతికై ఆమె సమర్పించు ఉత్తమోపాయనమైన, వడ్డాణముచేత అలంకరింపబడిన బలిసిన జఘనము నేత్రములను మనస్సును ఆకర్షించునదై ఉండెను. ఆ యా ప్రదేశములలో అప్పుడే ఏర్పరచిన తిలకములు ఇంకను తడిగా ఉండెను. ఆరు ఋతువులకు సంబంధించిన పుష్పములతో నిర్మించిన అలంకారములు ధరించెను. కాంతిచేత, శోభచేత, లావణ్యముచేత, కీర్తిచేత ఆమె రెండవ లక్ష్మి వలె ఉండెను. చంద్రునివంటి ముఖము, ధనుస్సువంటి అందమైన కనుబొమ్మలు, ఏనుగుతొండమువంటి తొడలు, చిగుళ్ళవలె కోమలములైన హస్తములు గల ఆ రంభ నీటితో నిండిన మేఘము వంటి కాంతి గల నీలవస్త్రము మేలిముసుగు వేసికొని సైన్యమధ్యములో నడచి వెళ్ళుచుండగా రావణుడు ఆమెను చూచెను. (14-19)

మన్మథబాణములకు వశుడైపోయిన ఆ రావణుడు లేచి అట్లు వెళ్ళుచున్న, సిగ్గుపడుచున్న ఆ రంభ చేయిపట్టుకొని నవ్వుచు ఇట్లనెను - "అందమైన కటిప్రదేశము గలదానా! నీవు ఎక్కడికి వెళ్ళుచున్నావు? నీవు స్వయముగా ఎవనికి భోగసిద్ధిని కూర్చుటకై వెళ్ళుచున్నావు? ఇది నిన్ను అనుభవించనున్న ఎవనికి అభ్యుదయము కలిగే సమయము? పద్మము, కలవ వంటి సుగంధము గల అమృతము వంటి నీ అధరామృతమును, ఆస్వాదించి ఇప్పుడు ఎవడు తృప్తిచెందనున్నాడు? భయస్వభావము గలదానా! బంగారు కుంభముల వలె ఉన్న, బలిసిన, ఎడములేని ఈ నీ కుచములు ఎవని వక్షఃస్థలమును స్పృశించనున్నవి? బంగారు వడ్డాణము అలంకరించి బంగారు చక్రమువలె ఉన్న విశాలమైన, స్వర్ణమువంటి జఘనమును ఎవడు ఆరోహించనున్నాడు? ఇప్పుడు నాకంటె గొప్పవాడు ఎవడున్నాడు? ఇంద్రుడా! విష్ణువా లేక అశ్వినీదేవతలా! ఓ! భయస్వభావము గలదానా! నీవు నన్ను దాటి వెళ్ళుచున్నావు; ఇది మంచి పనికాదు. విశాలమైన కటిప్రదేశము గలదానా, సుందరమైన ఈ శిలాఫలకముమీద విశ్రమించుము. నేను తప్ప ఈ మూడులోకములలో ప్రభువైనవాడు ఎవ్వడూ లేడు. మూడు లోకముల ప్రభువునకు కూడ ప్రభువూ, మూడులోకములకు పాలకుడూ అయిన రావణుడు వంగి నమస్కరించుచు నిన్ను ప్రార్థించుచున్నాడు. నన్ను పొందుము."(20-27)

రంభ ఆ మాటలు విని వణకుచు అంజలి ఘటించి - "నన్ను అనుగ్రహించుము. నీవు ఇట్లు పలుకుట తగదు. నీవు నాకు పూజ్యుడవు కదా? ధర్మానుసారము నేను

నీకు కోడలిని, నిజము చెప్పుచున్నాను. నన్ను ఎవరైనా ఈ విధముగా అవమానింపచూచినచో నువ్వు నన్ను రక్షింపవలసినవాడవు'' అనెను. (28,29)



తనను చూడగానే భయముచేత ఒడలు గగుర్పొడిచి తల వంచి పాదములవైపు చూచుచు నిలచి ఉన్న ఆమెతో రావణుడు– "నీవు నా పుత్రుని భార్యవైతే కదా నాకు కోడలివి అగుదువు" అనెను. ఆ మాట విని రంభ "తప్పక కోడలినే" అని అతనికి బదులు చెప్పెను. "రాక్షసశ్రేష్ఠుడా! నేను ధర్మానుసారము నీకుమారుడైనవాని భార్యను, నీ సోదరుడైన కుబేరునికి ప్రాణములకంటె కూడ ప్రియుడైన పుత్రుడైన నలకూబరుడు మూడు లోకములలో ప్రసిద్ధుడు. నేను లోకపాలుడైన కుబేరుని కుమారుడైన ఆ నలకూబరునితో సంకేతము ఏర్పరుచుకొని ఉన్నాను. అతడు ధర్మమునందు బ్రాహ్మణుడు. పరాక్రమము నందు క్షత్రియుడు. కోపమువచ్చినచో అగ్ని. ఓర్పుచేత భూమివంటివాడు. నేను ఈ అలంకరణము అంతా అతనికోసమే చేసుకొన్నాను. శత్రు సంహారకుడవైన రాజా! ఆతనికి నామీదనే ప్రేమ ఉన్నట్లు, నాకు కూడ అతని మీదనే ప్రేమ ఉన్నది. ఈ సత్యమును గ్రహించి నన్ను విడిచిపెట్టుము. ధర్మాత్ముడైన అతడు ఆతురతతో నాకోసమే ఎదురుచూచుచుండును. ఈ విషయమునందు అతనికి విఘ్నము చేయకుము. నన్ను విడిచిపెట్టుము. రాక్షసశ్రేష్ఠుడా! సత్పురుషులు అనుసరించిన మార్గమును అనుసరించుము. నీవు నాకు గౌరవింపదగినవాడవు. నేను నీకు పాలింపదగినదానను" అని ప్రార్థించెను.(30-37)

ఆమె వినయపూర్వకముగా పలికిన మాటలు విని రావణుడిట్లనెను– "నేను నీ కోడలిని" అని నీవు అన్న ఈ నియమము ఒక్కనికి మాత్రమే భార్యగా ఉండువాళ్ళ విషయమునందు మాత్రమే. అప్సరసలకు భర్త అనేవాడు ఉండడు. ఒక్క స్త్రీని మాత్రమే వివాహమాడుట అనేది కూడా లేదు. ఇది దేవలోకములో దేవతల శాశ్వతమైన ఆచారము"(38, 39)

రావణుడిట్లు పలికి, కామమును అనుభవించుటయందు ఆసక్తుడై ఆమెను

శిలాఫలకముమీద పరుండబెట్టి భోగించెను. పిమ్మట అతడు విడిచి పెట్టివేయగా మాలలు అలంకారములు జారిపోయి ఆ రంభ మహాగజము క్రీడించుటచేత కలిగిపోయిన నదివలె వ్యాకులత్వము చెందెను. ఆమె జుట్టు నలిగి చిక్కుపడిపోయెను. చిగుళ్ళవంటి చేతులు వణకుచుండెను. ఆమె భయముతో గాలికి కదలుచున్న, పుష్పములతో నిండిన లతవలె వణకిపోవుచు, సిగ్గుతో అంజలి ఘటించి, నలకూబరుని దగ్గరకు వెళ్ళి అతని పాదములమీద వ్రాలెను. మహాత్ముడైన నలకూబరుడు అట్టి అవస్థలో ఉన్న ఆమెను చూచి "ఓ! మంగళప్రదురాలా! ఇది ఏమి? నా కాళ్ళమీద పడుచున్నావేమి?" అని ప్రశ్నించెను.(40-44)

వణకిపోవుచున్న ఆమె దోసిలి ఒగ్గి నమస్కరించుచు, నిట్టూర్చుచు జరిగినది అంతా అతనికి తెలిపెను- "దేవా! రావణుడు స్వర్గలోకమునకు వెళ్ళుచు సైన్యముతో కూడ ఈ రాత్రి ఇక్కడ గడిపినాడు. నీ వద్దకు వచ్చుచున్న నన్ను చూచి ఆ రాక్షసుడు అడ్డగించి "నీవు ఎవనిదానవు?" అని ప్రశ్నించినాడు. అతనికి సత్యమైన విషయమును అంతా తెలిపితిని. "ప్రభూ! నేను నీ కోడలిని" అని ప్రార్థించుచున్నను కామమోహములు ఆవేశించిన మనస్సుతో అతడు నామాటలు వినలేదు. అతడు నేను చెప్పిన దేదీ లెక్కచేయక బలాత్కారముగా నన్ను అవమానించినాడు. నీవు నా ఈ అపరాధమును క్షమించుము. స్త్రీబలము పురుషుని బలముతో సమానము కాదు కదా?"(45-50)

నలకూబరుడు ఆ మాటలు విని, ఆమెకు జరిగిన గొప్ప అవమానమును గూర్చి తెలిసికొని చాల కోపించి కొంచెము సేపు ధ్యానము చేసెను. అప్పుడు నలకూబరుడు ముహూర్తకాలములో రావణుడు చేసినపని తెలుసుకొని, కోపముతో కళ్ళు ఎఱ్ఱబడగా, హస్తమునందు జలము గ్రహించెను. అతడు ఉదకము తీసికొని, యథావిధిగా దానినంతను ఆచమనము చేసి, రావణునకు భయంకరమైన శాపమును ఇచ్చెను- "మంగళప్రదురాలా! అతడు కామము లేని నిన్ను బలాత్కరించి అవమానించినాడు గాన ఇటుపై అతడు కామములేని మరొయొక ఏస్త్రీనీ కూడ పొందజాలడు. కామార్తుడైన ఈ రావణుడు కామము లేని స్త్రీని ఎవ్వరినైన అవమానించినచో అప్పుడు ఈతని శిరస్సు ఏడు ముక్కలుగా బ్రద్దలగును"(51-55)

అతడు ప్రజ్వలించుచున్న అగ్నివలె తీవ్రమైన ఆ శాపవాక్యమును ఉచ్చరించగానే దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవృష్టి కురిసెను. లోకములో జరుగుచున్న ప్రవృత్తిని, రాక్షసునికి రానున్న మరణమునూ గూర్చి తెలుసుకొని బ్రహ్మాదేవుడు మొదలైన దేవతలందరు సంతోషించిరి. ఋషులు, పితృదేవతలూ

కూడ గొప్ప సంతోషము పొందిరి. రావణుడు భయంకరమైన ఆ శాపమును గూర్చి విన్నది మొదలు తనపై కోరికలేని స్త్రీలను బలాత్కరించుటకు ఉద్యమించలేదు. రావణుడు అపహరించుకొని వచ్చిన పతివ్రతలైన స్త్రీలందరు తమ మనస్సుకు ఆనందము కలిగించు, నలకూబరు డిచ్చిన శాపమును గూర్చి విని సంతోషించిరి.(56-60)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది ఆరవ సర్గము సమాప్తము.**

# ఇరువది ఏడవ సర్గము

## రావణుడు సైన్యముతో ఇంద్రుని లోకమును ముట్టడించుట. "భవిష్యత్తులో రావణుని చంపెదను" అని విష్ణువు చెప్పుట.

గొప్ప తేజస్సు గల రావణుడు సైన్యవాహనాదులతో కూడినవాడై కైలాసము దాటి ఇంద్రలోకమును చేరెను. ఆ రాక్షససైన్యము నలువైపులనుండి దేవలోకములో ప్రవేశించుచుండగా సముద్రము బ్రద్దలుకొట్టబడినప్పుడు కలిగి నట్లు శబ్దము కలిగెను. రావణుడు వచ్చినట్లు విని ఇంద్రుడు ఆసనమునుండి చలించి అక్కడికి వచ్చి ఉన్న దేవతలందరినీ, ఆదిత్యులనూ, వసువులను, రుద్రులను, సాధ్యులను, మరుత్తులను "దురాత్ముడైన రావణునితో యుద్ధానికి సిద్ధము అవండి" అని ఆజ్ఞాపించెను. యుద్ధమునందు ఇంద్రునితో సమానుడు, మహాబలవంతులు అయిన దేవతలు ఇంద్రుని మాటలు విని యుద్ధమునందు శ్రద్ధగలవారై సిద్ధమైరి.(1-5)

రావణునికి భయపడిన ఆ మహేంద్రుడు దీనుడై విష్ణువువద్దకు వెళ్ళి- "విష్ణూ! రాక్షసుడైన రావణుని విషయమున నేనేమి చేయవలెను? బలవంతుడైన ఆ రాక్షసుడు యుద్ధమునిమిత్తము వచ్చుచున్నాడు. ఇతడు వరములు పొంది ఉండుటచేత మాత్రమే బలవంతుడు గాని మరొక కారణముచేత కాదు. బ్రహ్మదేవుడు చెప్పిన వచనము సత్యము అగునట్లు చేయవలెను కదా? అందువలన, నీ బలమును ఊతగా గొని నేను ఏ విధముగా నముచి-వృత్ర-బలి-నరక-శంబరులను నశింపచేసితినో ఇతని విషయమునందు కూడ అట్లు చేయుము. ఓ! దేవా! ఓ! దేవేశా! ఓ! మధుసూదనా! జంగమస్థావరాత్మకమైన ఈ మూడులోకములలో నీవు తప్ప మరొక గతి, మరొక ఉత్తమస్థానము లేదు కదా? నీవు నారాయణుడవు. లక్ష్మీపతివి. పద్మనాభుడవు. సనాతనుడవు. నీవు ఈ లోకములను నిలబెట్టినావు.

నన్ను దేవేంద్రుని చేసినావు. స్థావరజంగమాత్మకమైన ఈ ప్రపంచకమును నీవే సృజించినావు. ప్రళయకాలమునందు అందరూ నీలోనే ప్రవేశించుచున్నారు. దేవదేవా! చక్రము ధరించి నీవు రావణునితో యుద్ధము చేసెదవో లేదో స్వయముగా యథార్థమును చెప్పుము" అని వేడుకొనెను.(6-13)

ప్రభువైన నారాయణుడు ఇంద్రుని మాటలు విని - "భయపడవలసిన పనిలేదు. నేను చెప్పునది వినుము. వరదానముచేత జయింప శక్యముకాని దుష్టుడైన ఈతనిని సురాసురులు కూడ ఎదిరించి ఓడించజాలరు; చంపజాలరు. బలముచేత దృప్తుడైన, పుత్రసహితుడైన ఈ రాక్షసుడు అన్ని విధములా గొప్ప పని చేయనున్నాడు. ప్రస్తుత స్థితిని పట్టి ఇట్లు కనబడుచున్నది. దేవేంద్రా! "యుద్ధము చేయుము" అని నీవు నన్ను కోరినావు. కాని నేను యుద్ధరంగములో ఆ రావణుణ్ణి ఎదిరించి యుద్ధము చేయను. యుద్ధములో శత్రువును చంపకుండగా విష్ణువు వెనుకకు మరలడు. రావణుణ్ణి వరము రక్షించుచున్నది. అందుచేత ఇప్పుడు ఈ కోరిక సిద్ధించదు. దేవేంద్రా! "ఈరాక్షసుణ్ణి చంపెదను" అని ప్రతిజ్ఞ చేయుచున్నాను. తగిన సమయము చూచి నేనే పరివారసహితుడైన రావణుణ్ణి చంపి దేవతలకు ఆనందము కలిగించెదను. నీకు ఈ యథార్థవిషయమును చెప్పినాను. మహాబలశాలీ! భయపడక, దేవతలతో కలసి రావణునితో యుద్ధము చేయుము" అని పలికెను.(14-21)

పిమ్మట రుద్రులు, ఆదిత్యులు, వసువులు, మరుత్తులు, అశ్వినీదేవతలు యుద్ధసన్నద్ధులై వెంటనే నగరమునుండి రాక్షసులను చుట్టుటకై బయలుదేరిరి. ఇంతలో రాత్రి గడిచిన పిమ్మట, యుద్ధము చేయుచున్న రావణసైన్యము ధ్వని నలుమూలలనుండీ వినవచ్చెను. మహాపరాక్రమవంతులైన వాళ్ళు ఒకరి నొకరు చూచి, యుద్ధసంన్నద్ధులై, సంతోషించుచు, ఎదురెదురుగా యుద్ధరంగమునకు వెళ్ళిరి. అప్పుడు యుద్ధరంగమునందు అనంతమైన ఆ రాక్షససైన్యమును చూడగానే దేవతల సైన్యమునందు సంక్షోభము ఏర్పడెను. పిమ్మట దేవ-దానవ-రాక్షసుల మధ్య అనేకవిధములైన ఆయుధములను ప్రయోగించుటచే వ్యాకులమైన ధ్వని గల, ఘోరమైన యుద్ధము జరిగెను. శూరులు, చూచుటకు భయంకరులూ అయిన, రావణుని సచివులైన మారీచ-ప్రహస్త- మహాపార్శ్వ-మహోదరులు, అకంపన-నికుంభ-శుక-సారణులు, సంహ్రాద- ధూమకేతు-మహాదంష్ట్ర-ఘటోదర-జంబుమాలి-మహాహ్రాద-విరూపాక్షులు, సుప్తఘ్న-యజ్ఞకోప-దుర్ముఖ-దూషణ-ఖరులు, త్రిశిరస్సు కరవీరాక్ష-సూర్యశత్రు- మహాకాయ-అతికాయ-దేవాంతక-నరాంతకులు అను రాక్షసులు యుద్ధములో పాల్గొనిరి.(22-30)

రావణుని మాతామహుని సోదరుడైన గొప్పబలము గల సుమాలి మహాపరాక్రమవంతులైన ఆ రాక్షసు లందరితో కలసి సైన్యములో ప్రవేశించెను. అతడు కోపించి దేవతాసముదాయములను అన్నింటిని, వాడియైన అనేకవిధములైన ఆయుధాలతో, వాయువు మేఘములను వలె, ఒక్కమారుగా ఎగురుగొట్టెను. రామా! రాక్షసులచేత కొట్టబడుచున్న ఆ దేవతాసైన్యము సింహముచేత లేళ్ళవలె నలుదిక్కులకు పారద్రోలబడెను. ఇంతలో సావిత్రు డను పేరు గల శూరుడైన, వసువులలో ఎనిమిదవవాడైన వసువు ఉత్సాహముతో అనేకవిధములైన ఆయుధములను ఎత్తిన సైన్యములతో కూడి యుద్ధరంగములో ప్రవేశించెను. గొప్ప పరాక్రమము గల త్వష్ట, పూష అను ఆదిత్యులు కూడ భయము లేనివారై, సైన్యముతో ఒక్కమారుగా రణరంగమునందు ప్రవేశించిరి. అప్పుడు, రాక్షసుల కున్న కీర్తిని గూర్చి కోపించిన, యుద్ధములందు వెనుకకు తిరగని దేవతలకు రాక్షసులతో యుద్ధము జరిగెను. రాక్షసులందరూ వందలకొలది, వేలకొలది భయంకరములైన ఆయుధములను యుద్ధరంగములో ఉన్న దేవతలపై ప్రయోగించిరి. దేవతలు కూడ గొప్ప బలపరాక్రమములు గల భయంకరులైన రాక్షసులను, యుద్ధరంగమునందు, స్వచ్ఛములైన ఆయుధములచేత యమలోకమునకు పంపిరి. (31-39)

రామా! ఇంతలో సుమాలి అను రాక్షసుడు కోపించి, అనేకవిధములైన ఆయుధములతో ఆ దేవతాసైన్యమును ప్రవేశించెను. అతడు కోపించి, వాయువు మేఘమునువలె, దేవతా సైన్యమునంతనూ వాడిగా ఉన్న అనేకవిధములైన ఆయుధములతో నశింపచేసెను. బాణవర్షములతోను, చాల భయంకరములైన శూలములతోను, ప్రాసలతోను అతడు కొట్టుచుండగా ఆ దేవత లందరూ ఒకచోట కలిసి నిలవజాలకపోయిరి. దేవత లావిధముగా సుమాలిచేత పారద్రోలబడుచుండగా సావిత్రుడు కోపముతో నిలచెను. గొప్ప తేజస్సు గల ఆ సావిత్రుడు తన సైన్యముతో కూడినవాడై యుద్ధములో అవిధముగా కొట్టుచున్న సుమాలిని పరాక్రమముచేత అడ్డగించెను. (40-44)

యుద్ధములో వెనుకకు మరలని ఆ వసు-సుమాలుల మధ్య రోమాంచజనకమైన యుద్ధము జరిగెను. అప్పుడు మహాత్ముడైన వసువు గొప్ప బాణములు ప్రయోగించి ఆ సుమాలివాహనమైన సర్పమును క్షణకాలములో క్రింద పడగొట్టెను. వసువు వందలకొలది బాణములు ప్రయోగించి ఆ సుమాలి రథమును భగ్నముచేసి అతనిని చంపుటకై గదను చేతిలో తీసికొనెను. అతడు మండుచున్న అగ్రభాగము గల, యమదండముతో సమానమైన ఆ గదను సుమాలి శిరస్సు మీద పడవేసెను. ఆ సుమాలి మీద పడుచున్న, కొరవివంటి ఆ గద, ఇంద్రుడు

ప్రయోగించగా, గర్జించుచు పర్వతముమీద పడుచున్న పిడుగువలె ప్రకాశించెను. అప్పుడు యుద్ధరంగమునందు గదాఘాతముచేత భస్మమైపోవుటచే ఆ సుమాలి ఎముకలు గాని, శిరస్సుగాని, మాంసము గాని కనబడలేదు. యుద్ధములో సుమాలి మరణించుటచూచి ఆ రాక్షసులందరూ ఒకరినొకరు పిలచుకొనుచు, కలిసి, నాలుగు వైపులకు పారిపోయిరి. ఆ వసువు తరిమివేయుచుండగా, రాక్షసులు నిలవజాలకపోయిరి.(45-51)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది ఏడవ సర్గము సమాప్తము.**

# ఇరువది ఎనిమిదవ సర్గము

## మేఘనాద-జయంతుల యుద్ధము. పులోముడు జయంతుని మరొక చోటుకి తీసికొనిపోవుట. ఇంద్రరావణయుద్ధము.

అప్పుడు రావణుని కుమారుడు, బలవంతుడూ అయిన మేఘనాదుడు వసువుచేత సుమాలి భస్మముగా చేయబడి చంపబడినట్లు, దేవతలచేత పీడింపబడిన తన సైన్యము పారిపోవుచున్నట్లు చూచి, కోపించి ఆ రాక్షసుల నందరినీ వెనుకకు మరల్చి స్థిరముగా నిలబడెను. అతడు అగ్నివంటి వర్ణము గల, తన ఇష్టము ప్రకారము నడిచే రథము నెక్కి, మండుచున్న అగ్ని వనముల వైపు శీఘ్రముగా వెళ్ళినట్లు ఆ దేవతాసైన్యములవైపు శీఘ్రముగా వెళ్ళెను. అనేకవిధములైన ఆయుధములు ధరించి ప్రవేశించుచున్న అతనిని చూడగానే దేవత లందరూ పారిపోయిరి. యుద్ధముచేయుటకై వచ్చిన ఆ మేఘనాదుని ఎదుట ఎవ్వడూ లేకుండెను. అప్పుడు దేవేంద్రుడు ఆ దేవతలనందరినీ మాటలతో కొట్టి- "దేవతలారా! భయపడవద్దు; పారిపోవద్దు. యుద్ధరంగానికి తిరిగి రండి. ఇదిగో పరాజయము పొందని నా కుమారుడు యుద్ధానికి వచ్చుచున్నాడు." అని చెప్పెను.(1-6)

దేవేంద్రుని కుమారుడైన జయంతుడు ఆశ్చర్యకరమైన రథమునెక్కి, యుద్ధమునకు వచ్చెను. దేవత లందరూ జయంతుని చుట్టూ చేరి యుద్ధరంగమునకు వెళ్ళి రావణుని కుమారుడైన మేఘనాదునిపై ఆయుధములు ప్రయోగించిరి. ఆ దేవరాక్షసులకూ, జయంతమేఘనాదులకు తగిన యుద్ధము జరిగెను. మేఘనాదుడు జయంతుని సారథిగా ఉన్న, మాతలి పుత్రుడైన గోముఖునిపై బంగారముచేత అలంకరించబడిన బాణములు కురిపించెను. శచీపుత్రుడైన జయంతుడు మేఘనాదుని

సారథిని కొట్టగా, మేఘనాదుడు కోపముతో కోపావేశముతో కళ్ళు పెద్దవిచేసి జయంతునిమీద శరవర్షము కురిపించెను. వాడియైన అంచులు ఉన్న వేలకొలది ఆయుధములను శతఘ్నీ-ముసల-ప్రాస-గదా-ఖడ్గ-పరశ్వధములను, పెద్ద పర్వతశిఖరములను దేవతాసైన్యముమీద ప్రయోగించెను.(7-14)

ఆ మేఘనాదుడు శత్రుసైన్యములను సంహరించుచున్నప్పుడు లోకము లన్నీ వ్యథ చెందినవి. దట్టమైన చీకటి అలముకొనెను. జయంతుని చుట్టూ ఉన్న ఆ దేవతాసైన్యము బాణములచేత పీడింపబడినదై అనేకవిధముల అస్వస్థము అయినది. ఆ సైన్యములోనివారు ఎవరు రాక్షసులో, ఎవరు దేవతలో గుర్తించజాలకపోయిరి. ఆ సైన్యమంతా ఇటు అటు తారుమారగుచు అన్ని వైపులా పరుగెత్తెను. చీకటి ఆవరించుటచేత ఏమీ తెలియక దేవతలు దేవతలను, రాక్షసులు రాక్షసులను కొట్టిరి. మరికొందరు దూరముగా పారిపోయిరి.(15-18)

ఇంతలో పరాక్రమవంతుడు, వీరుడు అయిన పులోమ అను దైత్యరాజు వచ్చి జయంతుణ్ణి అక్కడినుండి దూరముగా తీసికొనిపోయెను. శచీదేవి తండ్రియైన ఆ పులోముడు జయంతునకు మాతామహుడు; అందుచే అతడు జయంతుణ్ణి తీసికొనిపోయి సముద్రములో ప్రవేశించెను. జయంతుడు కనబడకపోవుటచే వ్యథ చెందిన దేవతలందరూ సంతోషవిహీనులై పారిపోయిరి. కోపించిన మేఘనాదుడు గొప్ప ధ్వనిచేయుచు, తన సైన్యముతో దేవతలమీదికి పరుగెత్తెను. పుత్రుడైన జయంతుడు కనబడకపోవుటను, దేవతలు పారిపోవుటను చూచి దేవేంద్రుడు మాతలిని "నా రథము తీసికొనిరమ్ము" అని ఆజ్ఞాపించెను. చాల భయంకరమైన దివ్యమైన ఆ మహారథము సిద్ధముగానే ఉండెను. మాతలి మహావేగముతో తోలుకొని రాగా అది వచ్చి నిలచెను. అప్పుడు మెరుపులతో కూడిన, గొప్పబలము గల అధికమైన ధ్వనిగల, గాలికి కదలుచున్న మేఘాలు ఆ రథమునకు ముందు భాగమునందు ధ్వని చేసినవి. దేవేంద్రుడు బయలుదేరగానే గంధర్వులు సావధానచిత్తులై అనేక విధములైన వాద్యములను మ్రోగించిరి. అప్సరఃస్త్రీలు నృత్యము చేసిరి.(19-26)

దేవేంద్రుడు అనేకవిధములైన ఆయుధములు ధరించిన రుద్రులతోను, వసువులతోను, ఆదిత్యులతోను, అశ్వినీదేవతలతోను, మరుద్గణములతోను కలిసి బయలుదేరెను. దేవేంద్రుడు బయలుదేరు సమయమునందు గాలి పరుషముగా వీచెను. సూర్యునికాంతి తగ్గెను. పెద్ద ఉల్కలు(కొరవులవంటి నిప్పుముద్దలు) పడెను. ఇంతలో శూరుడు, ప్రతాపవంతుడూ అయిన రావణుడు విశ్వకర్మ నిర్మించిన

దివ్యమైన రథమును ఎక్కెను. ఆ రథమును పెద్ద శరీరములు గల భయంకరములైన సర్పములు చుట్టుకొని ఉండెను. వాటి శ్వాసవాయువులచే యుద్ధములో మంటలు చెలరేగుచుండెను. ఆ రథము చుట్టూ దైత్యులు, రాక్షసులు చేరిరి. ఆ రాక్షసుడు యుద్ధాభిముఖుడై మహేంద్రునకు ఎదురుగా వెళ్ళెను. అతడు కుమారుడైన మేఘనాదుణ్ణి నివారించి స్వయముగా యుద్ధముచేయుటకు నిలచెను. మేఘనాదుడు యుద్ధరంగమునుండి బైటకు వచ్చి కూర్చుండెను. (27-32)

పిమ్మట మేఘములు వలె, యుద్ధములో శస్త్రములు వర్షించుచున్న దేవతలకు రాక్షసులతో యుద్ధము ప్రారంభమయ్యెను. రామా! ఆ సమయమునందు అనేకవిధములైన ఆయుధములు ధరించిన దుష్టాత్ముడైన కుంభకర్ణుడు ఎవరితో యుద్ధము చేసినాడో తెలియలేదు. కోపావేశముతో అతడు దంతాలచేత, పాదాలచేత, భుజాలచేత, హస్తాలచేత, శక్తులచేత, తోమరములచేత, ముద్గరములచేత, ఏది దొరికితే దానిచేత దేవతలను కొట్టెను. చాల భయంకరులైన రుద్రులు యుద్ధమునందు కలసి వచ్చి యుద్ధముచేయుచున్న ఆ కుంభకర్ణుణ్ణి ఎడతెరిపి లేకుండా ఆయుధాలతో కొట్టిరి. శరీరమంతా ఆయుధములు గ్రుచ్చుకొని రక్తమును స్రవించుచున్న ఆ కుంభకర్ణుడు మెరుపులతో, పిడుగులతో కూడిన మేఘమువలె ప్రకాశించెను. అప్పుడు యుద్ధరంగములో బాగా యుద్ధము చేయుచున్న ఆ రాక్షససైన్యమును అంతనూ మరుద్గణములతో కూడిన రుద్రులు, అనేకవిధములైన ఆయుధములు ప్రయోగించి పారిపోవునట్లు చేసిరి. (33-38)

దెబ్బలు తిన్న కొందరు దేహాలు తెగిపోవుటచే నేలమీద పడి కాళ్ళుచేతులు కొట్టుకొనుచుండిరి. మరికొందరు వాహనాలపై తగుల్కొని అట్లే ఉండి పోయిరి. దేహము బిగిసిపోయిన కొందరు రాక్షసులు బాహువులతో తమ ప్రక్కనున్న రథాలను, ఏనుగులను, గాడిదలను, ఒంటెలను, సర్పాలను, గుఱ్ఱములను, శింశుమారములను, వరాహములను, పిశాచముఖములు గల జంతువులను, పట్టుకొని లేచుచుండగా వాళ్ళను దేవతలు ఆయుధాలచేత ఛేదించివేయుటచేత వాళ్ళు మరణించిరి. ఆ రాక్షసు లందరూ చచ్చి నేలమీద పడిఉండుటచే ఆ యుద్ధభూమి అంతా చిత్తరువులో చిత్రించినట్లు ఉండెను. (39-42)

ఆ రణరంగమునందు రక్త మనే ఉదకప్రవాహముతో, ఆయుధము లనే మొసళ్ళతో కూడి, కాకులతోను, గ్రద్దలతోను నిండిన నది ప్రవహించినది. ఇంతలో ప్రతాపవంతుడైన రావణుడు తన సైన్యమును దేవతలు పడగొట్టుటచూచి, కోపించి, పెరిగిపోవుచున్న ఆ దేవతాసైన్య సముద్రములో వెంటనే ప్రవేశించి, దేవతలను

యుద్ధములో కొట్టుచు చంద్రునిమీదకు వెళ్ళెను. దేవేంద్రుడు గొప్ప ధ్వని గల పెద్ద ధనుస్సును చరచుచు ముందుకు వచ్చెను. దానిని చరచుటవలన కలిగిన ధ్వనికి పది దిక్కులు మారుమ్రోగుచుండెను. ఇంద్రుడు ఆ ధనుస్సును లాగి, రావణుని శిరస్సుమీద అగ్ని-సూర్యుల తేజస్సు వంటి తేజస్సు గల బాణములను ప్రయోగించెను. అట్లే నిశాచరుడు, మహాబాహువు అయిన రావణుడు కూడ ధనుస్సులాగి ప్రయోగించిన బాణాల వర్షములతో ఇంద్రుణ్ణి నింపివేసెను. వాళ్ళిద్దరూ బాణవర్షములు కురిపించుచు యుద్ధముచేయుచుండగా అప్పుడు అంతా అంధకారముచేత నిండిపోవుటచే ఏదీ కనబడలేదు. (43-49)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరువది ఎనిమిది సర్గము సమాప్తము.**

# ఇరువది తొమ్మిదవ సర్గము

**రావణుడు బైటకు పోవుట. అతనిని పట్టుకొనుటకై దేవతలు ప్రయత్నించుట. మేఘనాదుడు మాయాప్రయోగముచేత ఇంద్రుణ్ణి బంధించుట.**

చీకటి ఆవరించిన ఆ సమయమునందు దేవతలు, రాక్షసులు బలముచేత ఉన్మత్తులై ఒకరినొకరు చంపుకొనుచు యుద్ధము చేసిరి. దేవతాసైన్యము యుద్ధమునందు పెద్దదైన రాక్షససైన్యములో, పదవ వంతు మాత్రమే మిగిల్చి, మిగిలిన దానినంతనూ నశింపచేసెను. చీకటిలో జరిగిన ఆ యుద్ధములో ఆ దేవతలూ రాక్షసులూ ఒకరితో ఒకరు యుద్ధము చేయుచు, ఒకరినొకరు గుర్తించలేదు. చీకటి కప్పివేసిన ఆ యుద్ధరంగములో ఇంద్రుడు, రావణుడు, మహాబలవంతుడైన మేఘనాదుడు ఈ ముగ్గురు మాత్రమే మోహము చెందలేదు. రావణుడు క్షణకాలములో తన సైన్యమంతా చంపబడినట్లు చూచి, తీవ్రముగా కోపించి బిగ్గరగా సింహగర్జనము చేసెను. (1-5)

ఎదిరింప శక్యముకాని ఆతడు రథమునందున్న సారథిని - "శత్రువులు పూర్తిగా నశించేవరకు నన్ను వాళ్ళమధ్య నుండి తీసుకొని వెళ్ళుము. నేను ఇప్పుడే, స్వయముగా దేవతల నందరినీ పరాక్రమముచేత అనేకవిధములైన ఆయుధములు నిరంతరము వర్షించి యమలోకమునకు పంపెదను. నేను ఇంద్రుణ్ణి, కుబేరుణ్ణి, వరుణుణ్ణి, యముణ్ణి వధించి దేవతల నందరినీ చంపి ఉన్నతస్థానమును పొందగలను.

భయపడకుము, నా రథమును శీఘ్రముగా నడుపుము. రెండుమార్లు చెప్పుచున్నాను. దేవతలు అంతమయ్యేవరకు నన్ను వాళ్ళ సైన్యములో నడుపుము. మనము ఇప్పుడు నందనవనప్రాంతమునం దున్నాము. ఇప్పుడు నన్ను ఉదయపర్వతమువైపు తీసికొని వెళ్ళుము" అని ఆజ్ఞాపించెను.(6-10)

సారథి రావణుని మాటలు విని మనోవేగము గల గుఱ్ఱములను శత్రువుల మధ్యనుండి నడిపెను. అప్పుడు యుద్ధరంగములో రథమునం దున్న దేవేంద్రుడు ఆ రావణుని నిశ్చయమును తెలిసికొని దేవతలతో – దేవతలారా! నాకు అభిమతమైన మాట చెప్పుచున్నాను. వినండి; రావణుణ్ణి బ్రతికి ఉండగానే పట్టుకొనండి. గొప్పబలము గల ఇతడు, పర్వదినమునందు సముద్రము తరంగములతో పెరిగి విజృంభించి నట్లు విజృంభించి, వాయువేగము వంటి వేగము గల రథముతో తన సైన్యమునుండి వెళ్ళ నున్నాడు. వరదానములవలన భయములేని ఇతనిని చంపుట శక్యము కాదు. అందుచేత వీనిని బంధించెదము. మీరు యుద్ధములో ప్రయత్నపూర్వకముగా సిద్ధముగా ఉండుడు. బలిచక్రవర్తిని బంధించిన పిదప నేను మూడు లోకములను అనుభవించుచున్నట్లు పాపాత్ముడైన వీనిని కూడ బంధించవలె నని కోరుచున్నాను" అని చెప్పెను.(11-16)

రామా! పిమ్మట దేవేంద్రుడు రావణుణ్ణి విడిచి, మరొక ప్రదేశమునకు వెళ్ళి యుద్ధమునందు రాక్షసులకు భయము కలిగించుచు యుద్ధముచేసెను. రావణుడు వెనుకకు మరలకుండా ఉత్తరపార్శ్వమునుండి సైన్యములో ప్రవేశించగా దేవేంద్రుడు దక్షిణపార్శ్వమునుండి ప్రవేశించెను. అప్పుడు నూరు యోజనముల దూరమువరకు సైన్యములోనికి దూసికొనిపోయి రావణుడు దేవతాసైన్యముపై బాణవర్షము కురిపించెను. ఇంద్రుడు తన సైన్యము నశించిపోవుచుండుట చూచి, కంగారుపడకుండగా వెనుకకు తిరిగి వచ్చి రావణుణ్ణి వెనుకకు మరలు నట్లు చేసెను. ఇంతలో ఇంద్రుడు రావణుణ్ణి ఆక్రమించుట చూచిన దానవులు, రాక్షసులు "అయ్యో! చచ్చినాము!" అని అరచిరి.(17-21)

అప్పుడు కోపావేశముతో మేఘనాదుడు రథము నెక్కి, చాలా కోపించి చాల భయంకరమైన ఆ దేవతాసైన్యములో ప్రవేశించెను. ఆతడు పూర్వము శివునినుండి లభించిన మాయను అవలంబించి శీఘ్రముగా సైన్యములో ప్రవేశించెను. ఆ సైన్యము పారిపోయెను. అతడు దేవత లందరినీ విడచి ఇంద్రుని మీదికే పరుగెత్తెను. కాని మహాతేజఃశాలియైన ఇంద్రునకు అతడు కనబడలేదు. కవచము జారిపోయిన

మేఘనాదుడు గొప్ప పరాక్రమము గల దేవతలు కొట్టుచున్నను వారి నేమీ చేయలేదు. లేదా భయపడలేదు. అతడు వచ్చుచున్న మాతలిమీద ఉత్తమములైన బాణములు ప్రయోగించి, మరల దేవేంద్రునిమీద శరవర్షము కురిపించెను. అప్పుడు ఇంద్రుడు రథమును విడచి సారథిని పంపివేసి, ఐరావతమును ఎక్కి మేఘనాదుని కోసము వెదకెను. మాయాబలము గల ఆ మేఘనాదుడు కనబడకుండ, ఆకాశము పైన ఉండి ఇంద్రుణ్ణి మాయచేత కప్పివేసి, బాణాలు ప్రయోగించుచు అతనిమీదికి శీఘ్రముగా వెళ్ళెను. (22-28)

ఇంద్రుడు అలసిపోయినట్లు తెలిసికొని ఆ మేఘనాదుడు అతనిని మాయచేత బంధించి, తన సైన్యము దగ్గరికి తీసుకొనివెళ్ళెను. ఆ యద్ధరంగమునుండి మేఘనాదుడు మహేంద్రుణ్ణి బలాత్కారముగా తీసికొనిపోవుటను చూచి దేవతలు "ఏమగునో కదా?" అని అనుకొనిరి. "అసురుల మాయలను జయించు విద్యలు ఉన్న ఇంద్రుణ్ణి కూడ బలాత్కారముగా తీసికొనిపోయిన, మాయావి, యుద్ధములలో జయము పొందువాడూ అయిన ఇంద్రజిత్తు కనబడుటలేదు" అని అనుకొనిరి. ఇంతలో దేవతాగణము లన్నీ కోపించి, రావణుణ్ణి యుద్ధము నుండి విముఖు డగునట్లు చేసి బాణవర్షములు కురిపించినవి. రావణుడు యుద్ధరంగమునందు ఆదిత్యులను, వసువులను ఎదిరించి, వాళ్ళచే పీడింపబడినవాడై, యుద్ధము చేయజాలకపోయెను. (29-33)

యుద్ధములో దెబ్బలచేత జర్జరుడై వాడిపోయిన తండ్రిని చూచి ఇంద్రజిత్తు పైకి వచ్చి కనబడుచు- "తండ్రీ! మనము వెళ్ళుదము, రమ్ము, యుద్ధము ఆపివేయుము. మనకు విజయము లభించిన దను విషయమును తెలిసికొనుము. మనోవ్యథ తొలగి స్వస్థుడవు అగుము. దేవతాసైన్యమునకు, మూడులోకాలకూ ప్రభువైన ఈ దేవేంద్రుణ్ణి, పరమేశ్వరునివలన లభించిన బలముచేత బంధించినాను. దేవతల దర్పమును భగ్నమును చేసినాను. నీ శత్రువును తేజస్సుచేత నిగ్రహించి మూడు లోకాలను ఇష్టము వచ్చినట్లు అనుభవించుము. ఇప్పు డిక్కక వ్యర్థమైన ఈ శ్రమ నీ కెందుకు? ఇప్పుడు యుద్ధమువలన ప్రయోజనము లేదు" అని చెప్పెను. (34-37)

ఇంద్రజిత్తు మాటలు విని దేవతలు యుద్ధమునుండి విరమించిరి. దేవేంద్రుడు లేని ఆ దేవతలు వెనుకకు వెళ్ళిపోయిరి. అప్పుడు యుద్ధము పూర్తి అయిన పిమ్మట, గొప్ప తేజస్సు గలవాడు, దేవతాశత్రువు, ప్రసిద్ధుడూ అయిన ఆ రావణుడు తన పుత్రుడు పలికిన ప్రియమైన ఆ మాట విని ఆదరపూర్వకముగా అతనితో- "గొప్పబలము, సామర్థ్యము గల ఓ! కుమారా! మన వంశమునకు తగిన

పరాక్రమములచేత నీవు నా వంశమును, కులమును వృద్ధి పొందించినావు. ఎందువలన అనగా నీవు సాటిలేని బలము గల ఈ ఇంద్రుణ్ణి, దేవతలను జయించినావు. నీవు దేవేంద్రుణ్ణి రథమునందు ఎక్కించుకొని సేనాసమేతుడవై అక్కడినుండి నగరమునకు నడుపుము. నేను కూడా సంతోషపూర్వకముగా మంత్రులతో కలిసి వెంటనే నీ వెనుకనే వచ్చుచున్నాను" అని పలికెను. ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి తీసికొని, సైన్యముతోను, వాహనములతోను కూడినవాడై, తన గృహముచేరి యుద్ధము చేసిన రాక్షసులను తమ ఇండ్లకు పంపివేసెను. (38-42)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఇరవది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# ముప్పదవ సర్గము

## బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తుకు వరము ఇచ్చి ఇంద్రుణ్ణి బంధనమునుండి విడిపించుట. ఇంద్రుడు యజ్ఞమును చేసి స్వర్గమునకు వెళ్ళుట.

గొప్పబలము గల దేవేంద్రుడు ఇంద్రజిత్తుచేత జయించబడిన పిమ్మట దేవతలు బ్రహ్మదేవుణ్ణి ముందు ఉంచుకొని లంకకు వెళ్ళిరి. బ్రహ్మదేవుడు అక్కడ పుత్రులతోను సోదరులతోను కలిసి ఉన్న రావణుని వద్దకు వెళ్ళి, ఆకాశమునందు నిలచి, సామపూర్వకముగా- "నాయనా! రావణా! యుద్ధములో నీపుత్రుని పరాక్రమము చూచి సంతోషించినాను. ఇతని పరాక్రమము ఎంతో ఆశ్చర్యకరమైనది. ఇతడు నీతో సమానుడు, లేదా నీకంటే కూడ గొప్పవాడు. నీవు నీ తేజస్సుచేత మూడు లోకములు జయించినావు. ప్రతిజ్ఞ పూర్తిచేసికొన్నావు. నీ విషయమునందు, నీ కుమారుని విషయమునందు సంతోషించుచున్నాను. రావణా! అతిబలవంతుడు, వీర్యవంతుడు అయిన నీ కుమారుడు జగత్తులో "ఇంద్రజిత్తు" అని ప్రసిద్ధి పొందగలడు. ఎవని సహాయముచేత నీవు దేవతలను వశములో ఉంచుకుంటివో అట్టి ఈ రాక్షసుడు తప్పక మహాబలవంతుడుగాను, జయింప శక్యము కానివాడుగాను ఉండగలడు. మహాబాహూ! అందువలన పాకశాసనుడైన మహేంద్రుణ్ణి విడిచిపెట్టుము. ఇతనిని విడిచిపెట్టినందుకు దేవతలు ఏమి ఇవ్వవలెను?" అని పలికెను. (1-7)

అప్పుడు మహాతేజఃశాలీ, యుద్ధములలో జయించువాడూ అయిన ఇంద్రజిత్తు



– "దేవా! ఇతనిని విడువవలెనన్నచో నాకు మరణము లేకుండు నట్లు వరము ఇమ్ము. చతుష్పాజ్జంతువులలోను, ఆకాశమునందు సంచరించేవాటిలోను, గొప్పతేజస్సు గల ఇతరులలోను, వృక్ష–గుల్మ–క్షుప–లతా–తృణ–శిలా పర్వతములలోను అన్ని జంతువులూ కూడా భయకారణ మేర్పడినప్పుడు ఒక దాని కొకటి భయపడుచుండును. అందువలన ఈ లోకములో అందరికీ అందరి వలనా భయము ఉండును" అనెను. అప్పుడు గొప్పతేజస్సు గల బ్రహ్మదేవుడు మేఘనాదునితో – "ఈ భూలోకములో ఏ ప్రాణికీ కూడ ఎన్నటికీ మరణము లేకపోవుట అనేది లేదు కదా? పక్షులకుగాని, చతుష్పాజ్జంతువులకు గాని, గొప్పతేజస్సు గల ఇతర భూతములకు గాని అమరత్వము లేదు" అనెను. మహాబాలశాలియైన మేఘనాదుడు, బ్రహ్మదేవుడు పలికిన ఆ మాటలు విని అక్కడనే ఆ బ్రహ్మదేవునితో– "ఇంద్రుణ్ణి విడువవలె నన్నచో నాకు ఏ సిద్ధి కావలెనో, నాకు ఏది ఇష్టమో వినుము. శత్రుజయమును కోరుచు నిత్యము హవ్యములచేతను, మంత్రములచేతను అగ్నిలో హోమము చేసి నేను యుద్ధములో ప్రవేశించగానే నాకొరకై అగ్నినుండి గుఱ్ఱములతో కూడిన రథము బైటకు వచ్చుగాక. దేవా! నేను రథమునందు ఉన్నంతవరకు నాకు మరణము రాకూడదు. ఇదే నా నిశ్చితమైన వరము. అగ్నిలో సమంత్రకముగా నేను చేయు హోమము పూర్తికాకుండా నేను యుద్ధము చేసినచో అప్పుడు నాకు వినాశము కలుగవచ్చును. దేవా! ప్రతీ పురుషుడూ తపస్సుచేసి అమరత్వమును వరముగా కోరును కదా? నేనుమాత్రము నా పరాక్రమము చూపి అమరత్వమును సంపాదింపకోరుచున్నాను" అని పలికెను. (8–17)

బ్రహ్మదేవుడు "అట్లే అగుగాక" అని పలికెను. ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి విడచిపెట్టగా దేవతలందరూ స్వర్గానికి వెళ్ళిరి. రామా! ఇంతలో ఇంద్రుడు దేవతల కుండవలసిన కాంతి తొలగిపోవుటచేత దీనుడై, చింతాక్రాంతుడై ఏదో ఆలోచనలో మునిగి ఉండెను. (18, 19)

ఈ విధముగా ఉన్న ఇంద్రుణ్ణి చూచి బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను. "ఇంద్రా!

పూర్వము చేయకూడని మహాపాపమును ఎందుకు చేసితివి? దేవేంద్రా! నేను బుద్ధిచేత(ఆలోచించి) అన్ని విధాలా ఒకే రంగు, ఒకే విధమైన భాష, ఒకే విధమైన రూపము గల ప్రజలను సృష్టించితిని. చూచుటకు గాని, లక్షణములలోగాని ప్రజలలో భేద మేమీ లేకుండెను. అప్పుడు నేను ఏకాగ్రచిత్తముతో ఆ ప్రజలను గూర్చి ఆలోచించితిని. నేను అప్పుడు ప్రజల ప్రతి అవయవమునందు ఏది యేది శ్రేష్ఠముగా ఉండునో దానిని తీసి వాటితో, ప్రజలలో విశేషముగా ఉండుటకై ఒక స్త్రీని నిర్మించితిని. అప్పుడు నేను రూపముతోను, గుణములతోను అహల్య అయిన స్త్రీని సృష్టించితిని. "హలము" అనగా రూపములో వికారము. అట్టి వికారములవలన కలిగినది హల్యము. అట్టి హల్యము లేనిదానికి 'అహల్య' అని ప్రసిద్ధి. నేను ఆ స్త్రీకి కూడ 'అహల్య' అనియే పేరు పెట్టితిని. దేవేంద్రా! ఆ స్త్రీని సృజించిన పిమ్మట "ఈమె ఎవని భార్య అయినచో బాగుండును?" అని నాకు ఆలోచన కలిగినది. ఇంద్రా! నీవు అప్పుడు "నేను ఉన్నత స్థానములో ఉన్నాను గాన ఈమె నా భార్యయే కావలెను" అని తలచినావు.(20-27)

నేను ఆమెను చాల సంవత్సరములపాటు మహాత్ముడైన గౌతమునివద్ద న్యాసముగా ఉంచితిని. అతడు ఆమెను తిరిగి నాకు అప్పగించివేసినాడు. అప్పుడు ఆ మహామునిలో ఉన్న గొప్ప మానసిక స్థైర్యమును చూచి, అతని తపఃసిద్ధిని కూడ గుర్తించి ఆమెను అతనికి భార్యగా ఇచ్చితిని. గొప్పబుద్ధి గల, ధర్మాత్ముడైన ఆ గౌతముడు ఆమెతో ఆనందించుచుండెను. ఆమెను గౌతమునకు ఇచ్చివేయుటచేత దేవతలు నిరాశు లయిరి. కామముతో కూడిన మనస్సుగల నీవు కోపించి ఆ మునీశ్వరుని ఆశ్రమమునకు వెళ్ళి అప్పుడు మండుచున్న అగ్నిజ్వాలవలె ఉన్న ఆ అహల్యను చూచితివి. ఆమె లభించలేదను కోపముతో బాధపడుచున్న నీవు కామార్తుడవై అక్కడ ఆమెను చెరచితివి. అప్పుడా మహర్షి నిన్ను ఆ ఆశ్రమములో చూచెను.(28-32)

దేవేంద్రా! అప్పుడు గొప్ప తేజస్సు గల ఆ గౌతముడు నిన్ను శపించినాడు, దానిచేతనే నీవు ఇట్టి దుఃస్థితిని పొందినావు. "ఇంద్రా! నీవు నా భార్యను నిర్భయముగా చెరచినావు. అందుచే నీవు యుద్ధములో నీ శత్రువు చేతిలో పడి బంధింపబడెదవు. ఓ! దుర్బుద్ధీ! నీవు ఇక్కడ ప్రారంభించిన చెడు ప్రవర్తన ఇతర మనుష్యులలో కూడ పుట్టగలదు, సందేహము లేదు. ఇతర మానవులు ఇట్టి చెడ్డపని చేసినప్పుడు చేసినవానికి సగము పాపము, నీకు సగపాపము చెందుచుండును. నీ ఇంద్రపదవి స్థిరముగా ఉండదు. సందేహము లేదు. ఎవ దెవడు ఇంద్రపదవిని అధిష్ఠించునో

అతడు ఆ పదవిలో స్థిరముగా ఉండడు. నేను నీకు ఈ శాపమిచ్చుచున్నాను." అని అత దప్పుడు నీతో అనెను. గొప్ప తపస్సు గల అతడు భార్యను కూడ బాగా జళిపించి – "చెడునడవడిక గలదానా! నా ఆశ్రమమునుండి దూరముగా వెళ్ళిపొమ్ము. రూపయౌవనసంపన్నురాలవైన నీవు చపలచిత్తముతో ప్రవర్తించితివి. అందువలన రూపవంతురాలవు నీవు ఒక్కతివే కాక ఇంకను చాలమంది ఉండగలరు. నీకు ఒక్కదానికే ఉన్న ఏ రూపము మూలమున ఈ పొరపాటు జరిగినదో అట్టి రూపమును ప్రజ లందరూ గూడ పొందగలరు. సంశయము లేదు" అని ఆతను శపించెను. అది మొదలు ప్రజలు చాలవరకు రూపసంపన్నులు అయిరి. అప్పుడు ఆ అహల్య ఆ గౌతమమహామునిని అనుగ్రహింపచేసికొనుచు–(33–41)

"ఓ! బ్రహ్మర్షీ! ఇంద్రుడు నీ రూపము ధరించి వచ్చి నాకు తెలియకపోవుటచే నన్ను అవమానించినాడు. ఇది నాకు తెలిసి జరగలేదు. అందుచేత అనుగ్రహించుము" అనెను. (42)

అహల్య మాటలు విని గౌతము డిట్లు పలికెను – "ఇక్ష్వాకువంశీయులలో గొప్పతేజస్సు గల మహారథుడు పుట్టగలడు. లోకములో రాముడు అను పేరుతో ప్రసిద్ధుడు కాబోవు ఆ మహాబాహువు మనుష్యరూపములో ఉండు విష్ణువే. అతడు ఒక బ్రాహ్మణుని పనిమీద వనమునకు వెళ్ళును. మంగళప్రదురాలా! ఆ రాముణ్ణి చూడగానే నీవు పవిత్రురాలవు కాగలవు. నీవు చేసిన పాపమును తొలగించి నిన్ను పవిత్రురాలిని చేయుటకు అతడు సమర్థుడు. శ్రేష్ఠమైన శరీరవర్ణము గలదానా! ఆ రామునకు ఆతిథ్యము చేసి నా దగ్గరకు రాగలవు. అప్పుడు నాతో కలసి నివసించగలవు." ఆ బ్రహ్మర్షి ఇట్లు పలికి తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను. వేదవేత్తయైన ఆ గౌతముని భార్యయైన ఆ అహల్య చాల గొప్ప తపస్సు చేసెను. (43–47)

ఆ ముని శాపము ఇచ్చుటచేతనే నీకు ఈ ఆపద వచ్చిపడినది. ఓ! మహాబాహూ! నీవు పూర్వము చేసిన దుష్టకార్యమును గుర్తుకు తెచ్చుకొనుము. ఇంద్రా! నీవు ఆ పాపము మూలముననే శత్రువుచేత బంధింపబడినావు. సావధానచిత్తుడవై వెంటనే వైష్ణవయజ్ఞమును (విష్ణుప్రీతికరమైన యజ్ఞమును) చేయుము. దేవేంద్రా! నీవు ఆ యజ్ఞము చేయుటచే పవిత్రుడవై పిమ్మట స్వర్గమునకు వెళ్ళగలవు. నీ పుత్రుడు మహాయుద్ధమునందు మరణించలేదు. అతని మాతామహుడు తీసికొని పోయి మహాసముద్రములో దాచినాడు." మహేంద్రుడు వైష్ణవయజ్ఞము చేసి మరల స్వర్గమును

ఆక్రమించి దేవతల ప్రభువై పాలించెను. రామా! నీకు ఇంద్రజిత్తు బలము చెప్పినాను. అతడు దేవేంద్రుణ్ణి జయించినాడు. అనగా ఇతరుల మాట చెప్పవలెనా!(48-52)

అగస్త్యుని వచనమును విని రాముడు, లక్ష్మణుడు, వానరులు, రాక్షసులూ కూడ "ఎంత ఆశ్చర్యము!" అని పలికిరి. రాముని ప్రక్కనే కూర్చొని ఉన్న విభీషణుడు - "పూర్వ మెన్నడో నేను చూచిన ఆశ్చర్యకరమైన విషయము నాకిపుడు జ్ఞాపకము చేయబడినది." అని పలికెను. రాముడు అగస్త్యునితో - "ఇదంతా సత్యమే; నేను కూడ(విభీషణాదులనుండి) విని ఉన్నాను. అని పలికెను. "రామా! యుద్ధములో పుత్రసహితుడైన దేవతాప్రభువైన ఇంద్రుణ్ణి జయించిన, లోకములను పీడించిన రావణుని జన్మవృత్తాంతము ఇట్టిది." అని అగస్త్యుడు పలికెను.(53-56)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పదవ సర్గము సమాప్తము.**

# ముప్పది ఒకటవ సర్గము

## రావణుడు మాహిష్మతికి వెళ్ళి, అక్కడ కార్తవీర్యార్జునుని కానక నర్మదానదిలో స్నానముచేసి శివుణ్ణి ఆరాధించుట.

అప్పుడు మహాతేజఃశాలి అయిన రాముడు నమస్కరించుచు, ఋషులలో శ్రేష్ఠుడైన అగస్త్యుని ఆశ్చర్యపూర్వకముగా- "పూజ్యుడవైన ఓ! బ్రాహ్మణశ్రేష్ఠుడా! క్రూరుడైన రావణుడు సంచరించు కాలమునందు లోకములలో ఎవరూ శూరులే లేకపోయిరా? రాక్షసరాజైన రావణుణ్ణి ఎదిరించగలిగిన క్షత్రియుడైన రాజ్యపాలకుడు గాని, క్షత్రియేతరుడైన రాజ్యపాలకుడు గాని లేకుండెనా? లేదా రాజు లందరూ హతవీర్యులై, పరాక్రమము కోల్పోయి, శ్రేష్ఠములైన అస్త్రాల జ్ఞానము లేనివారై ఓడిపోయినారా?" అని ప్రశ్నించెను.(1-4)

పూజ్యుడైన అగస్త్యమహాముని రాముని మాటలు విని, నవ్వుచు, బ్రహ్మదేవుడు ఈశ్వరునితో చెప్పి నట్లు అతనికి ఇట్లు పలికెను - "రాజులలో శ్రేష్ఠుడా! మహారాజా! రామా! రావణుడు ఈ విధముగా రాజులను పీడించుచు భూమియందు సంచరించెను. అతడు అమరావతితో సమానమైన మాహిష్మతీపురము చేరెను. ఆ పురమునందు అగ్నిదేవుడు ఎల్లప్పుడు సంనిహితుడై ఉండెడివాడు. శత్రుబాధానివృత్తికొరకై చేయు అభిచారప్రయోగముకోసమై ఆ నగరములో నిత్యము శరములు(రెల్లుగడ్డి) చుట్టూ కప్పిన అగ్నికుండములో అగ్ని ఉండెది. అట్టి ఆ నగరములో ఆ అగ్నితో సమానమైన

ప్రభావము గల అర్జునుడు ఉండెడివాడు. బలశాలి, సమర్థుడూ అయిన కార్తవీర్యార్జునుడు ఆ రోజునే నర్మదలో స్త్రీలతో కలసి విహరించుటకై వెళ్ళెను.(5-9)

ఆ రోజునే రావణుడు అక్కడికి వచ్చెను. రాక్షసరాజైన ఆ రావణుడు అతని అమాత్యులను అడుగుచు-(10)

"రాజైన కార్తవీర్యార్జునుడు ఎక్కడున్నాడో చెప్పుడు. నేను రావణుడను. ఆ రాజుతో యుద్ధము చేయుటకై వచ్చినాను. నేను వచ్చినట్లుగా అతనిని తెలుపుడు" అనెను. రావణుని మాటలు విని మంచి పండితులైన ఆ అమాత్యులు రాజు అక్కడ లే దను విషయమును రావణునకు తెలిపిరి. అర్జునుడు ఎక్కడికో వెళ్ళినట్లు పౌరులవలన తెలిసికొని రావణుడు హిమవత్పర్వతముతో సమానమైన వింధ్యపర్వతమునకు వెళ్ళెను. అతడు ఆకాశములో ప్రవేశించినదా అన్నట్లు, భూమిని చీల్చుకొని వచ్చినదా అన్నట్లు ఉన్న ఆ వింధ్య పర్వతమును చూచెను. అనేక శిఖరములతో, సింహములు నివసించుచున్న గుహలతో ప్రకాశించుచున్న ఆ పర్వతము ఆకాశమును ఒరయుచున్నట్లు ఉండెను.(11-15)

ఆ వింధ్యపర్వతము ఎత్తైన ప్రదేశములనుండి వేగముగా క్రిందికి పడుచున్న జలములతో అట్టహాసము చేయుచున్నట్లు ఉండెను. దేవ-దానవ-గంధర్వులు అప్సరఃస్త్రీలతోను, కింనరులు తమ స్త్రీలతోను అక్కడ క్రీడించుచుండుటచే అది స్వర్గమువలె ఉండెను. చాల ఎత్తైన ఆ పర్వతము స్ఫటికమువంటి శుభ్రమైన జలముతో ప్రవహించుచున్న నదులతో, కదలుచున్న నాలుకలు గల పడగలతో నిలచిన ఆదిశేషుడువలె ఉండెను. పైకి లేచుచున్నట్లు కనబడుచు, అనేక గుహలతో నిండియున్న ఆ పర్వతము హిమవత్పర్వతము వలె ఉండెను. అట్టి వింధ్యగిరిని చూచుచు రావణుడు నర్మదానది దగ్గరకు వెళ్ళెను.(16-18)

పవిత్రమైన ఆ నర్మదానదిలో రాళ్ళు దొర్లుచుండెను. నీరు ప్రవహించుచుండెను. ఆ నది పశ్చిమసముద్రము వైపు ప్రవహించుచుండెను. వేడికి బాధపడుచు దప్పికొన్న మహిషములు, సృమరములు, సింహములు, పులులు, భల్లూకములు, ఉత్తమ గజములు దీనిలో ప్రవేశించి జలమును కలుషము చేయుచుండెను. చక్రవాకములు, కారండవములు, హంసలు, నీటికోళ్ళు, సారసపక్షులు మొదలైన మదించి కూయుచున్న జలపక్షులు అంతటా దీనిని ఆవరించి ఉండెను.(తీరముమీద ఉన్న) వికసించిన(పూవులు నిండిన) వృక్షములే శిరోభూషణముగా ధరించి, చక్రవాకముల జంట లనెడు స్తనములతో, విశాలములైన ఇసుకతిన్నె లనెడు పిరుదులతో,

హంసపంక్తు లనే వడ్డాణముతో, పుప్పొడి అనే అంగరాగము పూసికొని, నీటినురుగు అనే తెల్లని వస్త్రము ధరించి, వికసించిన నల్లకలువలు అనే సుందరములైన నేత్రములతో ఆ నర్మద ఒక సుందరి వలె ఉండెను. నీటిలో ప్రవేశించుటచే సుఖకరమైన స్పర్శను కలిగించుచుండెను. ఇట్లు ఇష్టురాలైన స్త్రీవలె ఉన్న నదులలో శ్రేష్ఠమైన ఆ నర్మదను చూచి, రావణుడు పుష్పకమునుండి దిగి,(యువతిని ఆశ్లేషించినట్లు) ఆ నదిలో ప్రవేశించెను. పిమ్మట ఆ రాక్షసశ్రేష్ఠుడు అనేకమునులచేత సేవించబడిన దాని ఇసుకతిన్నెపై మంత్రులతో కలసి కూర్చుండెను.(19-25)

పిమ్మట ఆ రావణుడు ఈ నదియే గంగ యని నర్మదను శ్లాఘించి, ఆ నదిని చూచినందుకు సంతోషించుచు, విలాసపూర్వకముగా మంత్రులతోను శుకసారణులతోను ఇట్లు పలికెను- "ఈ సూర్యుడు సహస్రకిరణములచేత జగత్తును కనకమయమైనట్లు చేసి, తీవ్రమైన తాపము కలిగించుచు ఆకాశమధ్యము చేరినాడు. నేను ఇక్కడ కూర్చొని ఉన్నానని తెలియగానే ఈ సూర్యుడు చంద్రుడువలె చల్లగా ప్రకాశించుచున్నాడు. గాలి కూడ నాకు భయపడి నర్మదానదీజలముచేత చల్లనై, మంచి సువాసన కలదై, శ్రమను తొలగించుచు, చాలా సావధానమై వీచుచున్నది. మొసళ్ళతోను, మీనములతోను, పక్షులతోను, తరంగము తోను కూడిన సుఖమును వృద్ధిపొందించే నదులలో శ్రేష్ఠమైన ఈ నర్మదానది భయపడుచున్న స్త్రీవలె ఉన్నది. ఇంద్రునితో సమానులైన రాజులు యుద్ధమునందు ఆయుధములచే కొట్టుటచే మీరు(ఎఱ్ఱని)చందనరసము వంటి రక్తముచేత పూయబడిఉన్నారు. అందుచేత మీరు సార్వభౌమము మొదలైన మదించిన దిగ్గజములు గంగలో ప్రవేశించి నట్లు సుఖము నిచ్చే, పవిత్రమైన నర్మదలో దిగి స్నానముచేయుడు. ఈ మహానదిలో స్నానము చేసి పాపవిముక్తులు అవండి, నేను కూడ ఇప్పుడు చంద్రుని వంటి కాంతి గల ఇసుకతిన్నెమీద మెల్లగా శివునకు పుష్పములు సమర్పించి పూజ చేసెదను."(26-33)

రావణుడు చెప్పిన విధముగా ప్రహస్త-శుక-సారణ-మహోదర-ధూమ్రాక్షులు నర్మదానదిలో ప్రవేశించిరి. వామనము, అంజనము, పద్మము మొదలైన దిగ్గజములు గంగానదిని వలె రాక్షసేంద్రు లనే గజములు ఆ నర్మదానదిని కలచివేసెను. పిదప ఆ బలశాలులైన రాక్షసులు నర్మదలో స్నానము చేసి పైకి లేచి వచ్చి రావణుని పూజకొరకై పుష్పములు తీసికొనివచ్చిరి. తెల్లని మేఘమువంటి కాంతి గల మనోహరమైన నర్మదానది ఇసుకతిన్నెమీద ఆ రాక్షసులు ముహూర్తకాలములో పుష్పముల పర్వతమును ఏర్పరచిరి. ఈ విధముగా పుష్పములు

తీసికొని వచ్చిన పిమ్మట రాక్షసరాజైన రావణుడు, మహాగజము గంగలో ప్రవేశించినట్లు, స్నానము చేయుటకై నర్మదలో దిగెను. అతడు ఆ నదిలో స్నానము చేసి, శ్రేష్ఠమైన జపించదగిన మంత్రమును జపించి, ఆ నర్మదాజలమునుండి పైకి లేచెను. తడిసిన వస్త్రము విడచి తెల్లని వస్త్రము ధరించి, అంజలి ఘటించి వెళ్ళుచున్న ఆ రావణుని వెనుకనే మిగిలిన రాక్షసు లందరూ అతని గతికి వశములైన, మనుష్య(రాక్షస) మూర్తి ధరించిన పర్వతముల వలె వెళ్ళిరి. రావణుడు ఏ యే ప్రదేశములకు వెళ్ళేవాడో ఆ యా ప్రదేశములకు(రాక్షసులు) బంగారు శివలింగమును తీసికొని వెళ్ళుచుండిరి.(34-42)

రావణుడు ఆ బంగారు శివలింగమును ఇసుకతో నిర్మించిన తిన్నె మధ్యయందు నిలిపి, దానికి చందనాదిగంధములతోనూ, అమృతగంధములైన పుష్పములతోనూ పూజచేసెను. పిమ్మట రావణుడు సత్పురుషుల పీడలను పోగొట్టువాడు, సర్వోత్తముడు, శ్రేష్ఠుడు, వరములను ఇచ్చువాడూ, చంద్రుణ్ణి శిరోభూషణముగా ధరించినవాడూ అయిన ఆ మహేశ్వరుణ్ణి పూజించి, సామగానము చేసెను. ఆ శివుని ఎదుట హస్తములు చాపి నృత్యము కూడ చేసెను.(43, 44)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది ఒకటవ సర్గము సమాప్తము.**

# ముప్పది రెండవ సర్గము

## కార్తవీర్యార్జునుడు భుజములచేత నర్మదాప్రవాహమును నిలిపివేయగా రావణుడు శివలింగముపై పూజించిన పుష్పములన్నీ కొట్టుకొని పోవుట. రావణుణ్ణి బంధించుట.

భయంకరుడైన ఆ రావణుడు నర్మదానది ఇసుకతిన్నెమీద పుష్పములతో శివపూజ చేయుచున్న ప్రదేశమునకు సమీపమునందే, విజయవంతులలో శ్రేష్ఠుడు, మాహిష్మతీనగర ప్రభువు, సమర్థుడూ అయిన అర్జునుడు నర్మదానదిలో, స్త్రీలతో కలసి జలక్రీడ లాడుచుండెను. అప్పుడు ఆ స్త్రీల మధ్యనున్న కార్తవీర్యార్జునుడు వేయి ఆడఏనుగుల మధ్య నున్న గజేంద్రుడు వలె ప్రకాశించెను. అనేకములైన బాహువులు గల ఆ కార్తవీర్యార్జునుడు తన వేయి బాహువుల గొప్ప బలమును తెలిసికొన దలచి వాటితో నర్మదానదీ ప్రవాహమును అడ్డుకొనెను. నిర్మలమైన ఆ

జలము కార్తవీర్యుని భుజములచేత అడ్డుకొనబడినదై, తీరముమీద పుష్పసమర్పణము చేయుచున్న ఆ రావణుని సమీపించుచు, ప్రవాహమునకు ఎదురుగా ప్రవహింప మొదలిడెను. ఆ నర్మదాజలప్రవాహములో మీనములు, నక్రములు, మకరములు, పుష్పములు, దర్భాస్తరణములు కొట్టుకొని పోవుచుండగా అది వర్షాకాల నదీప్రవాహమువలె ఉండెను. కార్తవీర్యుడు పంపినాడా అన్నట్లు వచ్చిన జలప్రవాహములో రావణుడు చేసిన పుష్పపూజ అంతా కొట్టుకొనిపోయెను. (1-7)

అప్పుడు రావణుడు ఆ నియమమును మధ్యలో వదలివేసి, ప్రతికూలమైన ప్రియురాలు వలె ఉన్న, ఒడ్డుకు (ప్రవాహానికి) ఎదురుగా ప్రవహించుచున్న నర్మదను చూచెను. అతడు పశ్చిమము వైపున సముద్రము పోటువలె ఉన్న పెరిగిపోతూన్న జలవేగమును చూచెను. పిమ్మట ఆ జలము తూర్పు దిక్కునకు ఎగతన్ని విస్తృతమైన ఆకారములో ఉండెను. అక్కడ పక్షులు కూడ బెదురు లేకుండా ఉండెను. ఆవిధముగా అక్కడ వికార మేమీ లేని స్త్రీవలె ఉన్న ఆ నదిని చూచెను. రావణుడు మాటలాడకుండగా, కుడిచేతి వ్రేలితో సంజ్ఞచేసి ఆ జలవేగమునకు కారణమేమో తెలిసికొనుటకై శుకసారణులను ఆదేశించెను. రావణునిచేత ఆజ్ఞాపించబడిన వీరులైన ఆ శుకసారణసోదరులు ఆకాశమధ్యమును పొంది పశ్చిమాభిముఖముగా వెళ్ళిరి. ఆ రాక్షసు లిద్దరూ అర్ధయోజనము దూరము వెళ్ళి, స్త్రీసమేతుడై జలక్రీడలు చేయుచున్న పురుషుణ్ణి చూచిరి. పెద్ద మద్దిచెట్టు వలె ఉన్న ఆ పురుషుని కేశములు నీటికి తడిసి చెదరి ఉండెను. నేత్రముల కొనలు మదముచేత ఎఱ్ఱగా ఉండెను. అతని మనస్సు మదముచేత వ్యాకులముగా ఉండెను. శత్రుసంహారకుడైన ఆ పురుషుడు వేయి బాహువులచేత నదిని అడ్డుకొని, వేయి పాదాలచేత భూమిని ఆక్రమించిన పర్వతము వలె ఉండెను. (8-15)

యువతులైన వేయిమంది శ్రేష్ఠస్త్రీలు చుట్టూ ఉన్న ఆ పురుషుడు మదించిన వేయి ఆడ ఏనుగుల మధ్య ఉన్న మదగజమువలె ఉండెను. ఆశ్చర్యకరుడైన ఆ పురుషుణ్ణి చూచి, శుకసారణులు వెనుకకు మరలి రావణుని వద్దకు వచ్చి- "రాక్షసరాజా! పెద్ద సాలవృక్షము వలె ఉన్న ఇత డెవరో ఆనకట్టవలె నర్మదానదిని అడ్డగించి స్త్రీలను క్రీడింపచేయుచున్నాడు. అతడు వేయి బాహువులతో నీటిని ఆపివేయుటచే ఈ నది సముద్రము ఎదురుతన్ని నీరు వ్యాపించినట్లు నీటిని వ్యాపింపచేయుచున్నది" అని చెప్పిరి. (16-19)

శుకసారణుల మాటలు విన్న రావణుడు "ఇతడే అర్జునుడు" అని అనుచు, యుద్ధముకొరకై ఆసక్తితో వెళ్ళెను. రాక్షసరాజైన ఆ రావణుడు కార్తవీర్యార్జునుని

ఎదురించుటకై వెళ్ళుచుండగా వాయువు తీవ్రమైన ధ్వనిచేయుచు, పరాగముతో నిండి వీచెను. మేఘములు హటాత్తుగా రక్తబిందువులు కురియుచు ఉరిమెను. రావణుడు మహోదర-మహాపార్శ్వ-ధూమ్రాక్ష-శుక-సారణులతో కలిసి అర్జును దున్న చోటికి వెళ్ళెను. బలశాలి, కాటుకవంటి కాంతి గలవాడూ అయిన ఆ రాక్షసుడు అప్పుడు కొంచెము సేపటిలోనే భయంకరమైన ఆ నర్మదాహ్రదమును చేరెను. అప్పుడు రావణుడు చుట్టూ ఆడ ఏనుగులున్న ఏనుగువలె చుట్టూ స్త్రీలు ఉన్న కార్తవీర్యార్జునుణ్ణి చూచెను.(20-24)

బలముచేత దృప్తుడై రోషముచేత ఎఱ్ఱబడిన నేత్రములతో ఆ రావణుడు గంభీరమైన వాక్కుతో అర్జునుని అమాత్యులతో- "అమాత్యులారా! "రావణుడు యుద్ధము చేయుటకై వచ్చినాడు" అని వెంటనే కార్తవీర్యార్జునునకు చెప్పండి" అనెను. కర్తవీర్యార్జునుని మంత్రులు రావణుని మాటలు విని, ఆయుధములతో లేచి రావణునితో- "రావణా! మత్తులో ఉండి స్త్రీలతో కలసి ఉన్న రాజుతో యుద్ధము చేయగోరుచున్నావు. సరియైన యుద్ధసమయమునే గుర్తించితివి. బాగు! బాగు! ఆడ ఏనుగుల మధ్యలో ఉన్న మదించిన ఏనుగుతో పెద్దపులి యుద్ధమునకు వచ్చినట్లు నీవు స్త్రీల ఎదుట ఉన్న రాజుతో యుద్ధానికి వచ్చినావు! బాగు! బాగు! నాయనా! రావణా! ఇప్పుడు ఓపిక పట్టుము. ఈ రాత్రి ఆగుము. నీకు ఆసక్తి ఉన్నచో రేపు అర్జునునితో యుద్ధము చేయుము. యుద్ధమునందు అత్యాసక్తి కలవాడా! నీకు తొందరగా ఉన్నచో నీవు ముందు యుద్ధములో మమ్ములను పడగొట్టి తరువాత అర్జునునితో యుద్ధము చేయవచ్చును" అని పలికిరి.(25-31)

రావణుని అమాత్యులు యుద్ధములో రాజామాత్యులను చంపి, ఆకలికొని ఉన్న వాళ్ళు వాళ్ళని భక్షించివేసిరి. అప్పుడు అర్జునుని అనుచరులు, రావణుని మంత్రులు చేసిన కోలాహలధ్వని నర్మదాతీరమునందు వ్యాపించెను. అర్జునుని అనుచరులు బాణాలతోను, తోమరములతోను, ప్రాసలతోను, త్రిశూలములతోను, వజ్రములతోను రావణుణ్ణి, అతని అనుచరులనూ కూడా పీడించుచు నలువైపుల నుండి శీఘ్రముగా వచ్చిరి. కార్తవీర్యార్జునుని యోధుల వేగము నక్ర-మీన-మకరములతో కూడిన సముద్రము ధ్వని వలె చాల భయంకరముగా ఉండెను. రావణుని అమాత్యులైన ప్రహస్త-శుక-సారణులు కోపించి తమ తేజస్సుతో కార్తవీర్యార్జునుని సైన్యమును సంహరించిరి. భయభ్రాంతులైన కొందరు పురుషులు వెళ్ళి మంత్రిసహితుడై రావణుడు చేసిన ఆ పనినిగూర్చి క్రీడించుచున్న కార్తవీర్యార్జునునకు తెలిపిరి.(32-37)

# ఏబది నాలుగవ సర్గము

## నృగమహారాజు తన పుత్రునకు రాజ్య మిచ్చివేసి దానిలో గొయ్యి త్రవ్వించుకుని శాపమును అనుభవించుట.

పరమార్థము ఎరిగిన లక్ష్మణుడు రాముని మాటలు విని, అంజలి ఘటించి తేజస్సుతో ప్రకాశించుచున్న రాముని- "రామా! ఆ బ్రాహ్మణులు ఇంత చిన్న అపరాధానికి రాజర్షి యైన నృగమహారాజునకు యమదండమువంటి ఇంత గొప్ప శాపము ఇచ్చినారు కదా? పురుషశ్రేష్ఠా! నృగమహారాజు తనకు శాపము తగిలినట్లు తెలిసిన పిమ్మట కోపించిన ఆ ఇద్దరి బ్రాహ్మణులను ఏమనెను?" అని అడిగెను. లక్ష్మణుని మాటలు విని రాముడు మరల పలికెను "సౌమ్యుడా! పూర్వము ఆ రాజు ఏవిధముగా శాపముచేత బాధపడెనో వినుము.(1-4)

ఆ నృగమహారాజు ఆ బ్రాహ్మణు లిద్దరూ వెళ్ళిపోయినట్లు తెలిసికొని చాలా దుఃఖించుచు మంత్రులను, ఆ యా గణముల ముఖ్యులను; పురోహితుణ్ణి పిలిపించి, వాళ్ళతోను, మిగిలిన ప్రకృతు లందరితోను ఇట్లు పలికెను; మీరు సావధానచిత్తులై వినుడు. మంగళప్రదులు, నిందావిహీనులూ, అయిన నారదుడు, పర్వతుడూ నాకు చాల భయంకరమైన విషయము చెప్పి వాయువేగముతో త్రిలోకములకు వెళ్ళిరి. నా కుమారుడైన ఈ వసువును రాజ్యాభిషిక్తుణ్ణి చేయుడు. నాకోసమై శిల్పులచేత స్పర్శసుఖకరముగా ఉండే గొయ్యి నిర్మించబడుగాక. శిల్పులు వర్షబాధ ఉండని ఒక గోతిని, చలివలన బాధ ఉండని మరొక గోతిని, వేడిబాధ లేక స్పర్శసుఖము నిచ్చు వేరొక గోతిని నిర్మింతురుగాక. నేను వాటిలో నివసించి బ్రాహ్మణులవలన వచ్చిన శాపమును క్షీణింపచేసుకుందును. ఆ గోతుల దగ్గర ఫలవృక్షములను, పుష్పములతో నిండిన లతలను నీడనిచ్చే పొదలుగా పెరిగే మొక్కలను నాటించవలెను. గోతులకు అన్ని వైపులా సుందరముగా ఉండునట్లు చేయవలెను. శాపకాలము గడచేవరకు నేను అక్కడ నివసించెదను. నా నివాసమునకు చుట్టూ ఒకటిన్నర యోజనముల దూరము నిత్యము సుగంధపుష్పములు ఉండునట్లు ఏర్పాటు చేయవలెను."(5-12)

నృగమహారాజు ఈ విధముగా ఏర్పాట్లు చేసికొని పుత్రుణ్ణి రాజ్యాభిషిక్తుని చేసి అతనికిట్లు ఉపదేశించెను. "పుత్రా! ధర్మమునందు స్థిరుడవై క్షత్రియధర్మానుసారము ప్రజలను పాలించుము. అలాంటి చిన్న అపరాధానికి కూడ కోపించిన ఆ ఇద్దరు బ్రాహ్మణులూ నాకు ఎట్లు శాపమిచ్చినారో నీవే చూచినావు కదా! నరశ్రేష్ఠా! నా

దక్కడ అనేక సంవత్సరముల పాటు వెదకెను. కాని అది కనబలేదు. పిమ్మట అతడు కనఖల మను ప్రదేశమునకు వెళ్ళి అక్కడ ఒక బ్రాహ్మణుని ఇంటిలో ఆరోగ్యముగా ఉన్న తన ధేనువును చూచెను. దాని దూడ మాత్రము దుర్బలముగా ఉండెను. ఆ బ్రాహ్మణుడు "శబలా! రమ్ము" అని ఆ ఆవును పేరు పెట్టి పిలిచెను. అప్పుడు ఆ గోవు- క్షుధార్తుడైన ఆ బ్రాహ్మణుని స్వరమును గుర్తుపట్టి అగ్నితో సమానుడైన అతడు ముందు నడచుచుండగా అతని వెనుకనే వెళ్ళెను.(క్షుధార్తుడు అనేది ఆ బ్రాహ్మణుని పేరు కూడా కావచ్చును). ఆ గోవును పాలించుచున్న బ్రాహ్మణుడు కూడా శీఘ్రముగా గోవువెంట వెళ్ళెను. తొందరగా వెళ్ళి ఆ ఋషితో "ఇది నా గోవు" అని పలికెను. "నృగమహారాజు ఆ గోవును స్పృశించి నాకు ఇచ్చినాడు" అని చెప్పెను. పండితులైన ఆ బ్రాహ్మణు లిద్దరికీ పెద్ద కలహము జరిగెను.(7-15)

వాళ్ళిద్దరూ పరస్పరమూ కలహించుకొనుచు దానము చేసిన నృగుని దగ్గరికి వెళ్ళిరి. కాని రాజభవనము ద్వారమునందు వారికి నృగుని అనుమతి లభించలేదు. మహాత్ములైన ఆ బ్రాహ్మణోత్తము లిద్దరూ చాలా రాత్రింబవళ్ళు అక్కడ ఉండిరి. చివరికి కోపించిరి. చాల బాధపడిన వారిద్దరూ కోపించి ఘోరమైన తాత్పర్యము గల వాక్యము పలికిరి- "కార్యార్థులై వచ్చినవారికి నీవు దర్శనము ఇచ్చుటలేదు. అందువలన నీవు ఏ ప్రాణులకు కనబడని తొండవు అయ్యెదవుగాక. నీవు తొండవుగా అయి కొన్ని వేల సంవత్సరాలు, కొన్నివందల సంవత్సరాలు దీర్ఘకాలము, గోతిలో పడి ఉండగలవు. విష్ణువు యాదవుల కీర్తిని వృద్ధిపొందించుచు, వాసుదేవుడను పేరుతో మానవుడై ఈ లోకములో పుట్టగలడు. రాజా! అతడు నిన్ను ఈ శాపమునుండి విడిపించగలడు. ఆ కాలానికి నీకు ప్రాయశ్చిత్తము పూర్తి అగును. కలియుగము దగ్గరపడినప్పుడు భూభారము తొలగించుటకై గొప్ప పరాక్రమము గల నరనారాయణులు భూలోకములో పుట్టగలరు."(16-22)

ఆ బ్రాహ్మణు లిద్దరూ ఈవిధముగా శాపమిచ్చి దుర్బలమైన ముసలిదైపోయిన ఆ గోవును మరొక బ్రాహ్మణునికి ఇచ్చివేసిరి. ఈ విధముగా ఆ రాజు చాల దారుణమైన శాపమును అనుభవించుచున్నాడు. పనిమీద వచ్చినవారికి బాధకలిగించుట రాజులకు దోషహేతువగును. అందువలన, పనులున్నవారు వెంటనే నా దర్శనమును పొందుదురుగాక. రాజు బాగా నిర్వహించిన కార్యము ఫలమును పొందును కదా? లక్ష్మణా! అందువలన నీవు వెళ్ళి కార్యార్థులై ఎవరైన వచ్చినారా చూడుము."(23-26)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది మూడవ సర్గము సమాప్తము.**

నీవు నా కర్తవ్యమును గూర్చి శాసించినందుకు సంతోషము కలిగినది. నా దుఃఖము నివర్తించినది. నేను సంతాపము విదిలివేసినాను. చాల అందమైన నీ మాటలచేత నేను బోధింపబడితిని" అనెను.(17-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది రెండవ సర్గము సమాప్తము.**

# ఏబది మూడవ సర్గము

## కార్యార్థు లెవరైనా వేంచియున్నారేమో చూడమని రాముడు లక్ష్మణుణ్ణి ఆదేశించుట.

రాముడు లక్ష్మణుని వాక్యమును విని చాల సంతోషించి ఇట్లు పలికెను- "సౌమ్యుదా! మహాబుద్ధివి, నా మనస్సుకు అనుగుణముగా ప్రవర్తించువాడవూ, అయిన నీవు నా కెట్టి బంధువుగా వున్నావో అట్టి బంధువు లభించుట చాలా కష్టము. విశేషించి ఈ కాలములో ఇంకనూ కష్టము. నా మనస్సులో ఉన్న మాట చెప్పెదను వినుము; విని దాని ప్రకారము చేయుము. నేను పౌరులను చూచి నాలుగు రోజులు అయినది. అది నా మర్మమును ఛేదించుచున్నది.(నా అంతరాత్మ అందుకు చాల బాధపడుచున్నది). పురుషశ్రేష్ఠుదా! వ్యవహారము ఉన్న పురుషులను, స్త్రీలను, (ఎవరి ఎదుట ఆ వ్యవహారము నిర్ణయించవలెనో) ఆ ప్రకృతులను, పురోహితుని, మంత్రులను పిలిపించుము. ప్రతిదినమూ పౌరుల కార్యము చూడని రాజు గాలి, వెలుతురూ లేకుండేటట్లు కప్పివేయబడిన ఘోరనరకములో పడినట్లే; సందేహము లేదు.(1-6)

పూర్వము గొప్ప కీర్తి గల నృగు డనే రాజు ఉండె నని వినుచున్నాము. భూమిని చక్కగా పాలించే అతడు బ్రాహ్మణభక్తుడు; సత్యమే పలుకువాడు. పరిశుద్ధుడు. ఒకప్పుడు ఆ రాజు పుష్కరములయందు, లేగదూడలతో కూడిన, బంగారముచే అలంకరించిన కోట్లకొలది ఆవులను బ్రాహ్మణులకు దానము చేసెను. ఆహితాగ్ని, దరిద్రుడు, ఉంఛవృత్తితో(చేలలో రాలిన ధాన్యపు గింజలు ఏరికొని జీవించుట ఉంఛవృత్తి) జీవించు ఒక బ్రాహ్మణుని గోవు, దాని లేగదూడ ఆ ఆవులతో కలసి (దానము చేసినవాటితో) వెళ్ళిపోయినవి. ఆకలితో బాధపడుచున్న ఆ బ్రాహ్మణుడు కనబడకుండగా పోయిన ఆ ఆవుకొరకై అన్ని రాష్ట్రములలోను అక్క

ఆలోచనతో చాల దైన్యమును పొందెను. అతడు ఆ విధముగా ఆలోచించుచుండగా, చంద్రుడువలె తెల్లగా ఉన్న చాల అద్భుతమైన రాముని భవనము అతని ఎదుట కనబడెను. లక్ష్మణుడు రాజభవనద్వారమువద్ద దిగి, దీనమైన మనస్సుతో, తల వంచుకొని, లోపల ప్రవేశించెను. అతనిని ఎవ్వరూ అడ్డుపెట్టలేదు.(1-5)

రాముడు దీనుడై కన్నీళ్ళతో నిండిన కండ్లతో భూమిని కాల్చివేయుచున్నాడా అన్నట్లు, ఉత్తమమైన ఆసనముమీద కూర్చుండి ఉండెను. లక్ష్మణుడు అట్టి రాముణ్ణి చూచి, దీనమైన మనస్సుతో అతని పాదములు పట్టుకొని, సావధానచిత్తుడై, అంజలి ఘటించి దైన్యముతో కూడిన మాటలతో ఇట్లు పలికెను- "వీరుడా! పూజ్యుడ వైన నీ ఆజ్ఞ ప్రకారము సీతను నీవు చెప్పిన గంగాతీరమునందున్న పవిత్రమైన వాల్మీక్యాశ్రమమునకు తీసుకొని వెళ్ళి పవిత్రమైన నడవడిక గల కీర్తిమంతురాలైన ఆమెను అక్కడ ఆశ్రమప్రాంతమునందు విడచి, నీ సేవకై మరల నీ పాదాల చెంతకు వచ్చినాను. పురుషశ్రేష్ఠుడా! దుఃఖించకుము. కాలగతి ఇలాంటిది. నీవంటి బుద్ధిమంతులైన ఆత్మాభిమానవంతులు దుఃఖించరు కదా? కూడబెట్టినవన్నీ చివరికి నశించవలసినదే. ఎంత ఉన్నతి లభించినా చివరికి క్రింద పడవలసినదే. కలయికలు చివరికి వియోగమునందే ముగియును. ఎంతకాలము జీవించినా చివరికి మరణించవలసినదే. అందువలన పుత్రుల విషయమునందు, భార్య విషయమునందు మిత్రుల విషయమునందు, ధనముల విషయమునందు ఎక్కువగా సంగము చూపకూడదు. వీటితో వియోగము ఏనాటికైనా తప్పదు.(6-12)

రామా! నిన్ను నీవు అదుపులో ఉంచుకొనగలవు. మనస్సును మనస్సుచేత నిగ్రహించుకొనగలవు. సమస్త లోకములనూ కూడ నిగ్రహించగలవు. నీ శోకమును అణుచుకొనగల వను మాట చెప్పవలెనా? రామా! నీవంటి పురుషశ్రేష్ఠులు ఇలాంటి విషయములయందు మోహము చెందరు. నీవు ఇట్లు ఉన్నచో మళ్ళీ ఆ అపవాద వచ్చును. పరగృహములో ఉన్న భార్యను విడిచి పెట్టిన రాముడు ఆమెను గూర్చియే విచారించుచు స్వకర్తవ్యములు మరచినాడు అను అపవాదువచ్చును. రాజా! ఏ అపవాదభయమువలన సీతను విడచినావో అదే అపవాదు మరొక రూపమున నీకు "స్వకర్తవ్యవిముఖుడవై ఉన్నావు" అని పురములో కలుగును. సంశయము లేదు. ఓ! పురుషశ్రేష్ఠుడా! అట్టి నీవు ధైర్యముచేత సావధానచిత్తుడవై దుర్బలమైన ఈ బుద్ధిని విడిచిపెట్టుము. సంతాపము చెందకుము."(13-16)

మహాత్ముడైన లక్ష్మణుని మాటలు విని మిత్రులయందు ప్రేమ గల రాముడు గొప్ప సంతోషముతో- "నరశ్రేష్ఠుడవైన లక్ష్మణా! నీవు చెప్పినది సత్యము. వీరుడా!

కాలము రాజ్యము పాలించి బ్రహ్మలోకమునకు వెళ్ళును. ఏ మాత్రము జయింప శక్యముకాని రాముడు దానాదులతో సమృద్ధములైన యాగాలనూ, అశ్వమేధయాగమునూ చేసి, అనేకపర్యాయములు అనేక రాజవంశములను నిలబెట్టగలడు. రామునకు సీతయందు ఇద్దరు పుత్రులు కలుగుదురు. "మహాతేజఃశాలియైన ఆ దూర్వాసుడు ఇట్లు రాజు వంశమునకు సంబంధించిన గడచినదానిని, రాబోవుదానిని పూర్తిగా చెప్పి ఊరకుండెను.(14-24)

ఆ ముని మౌనము వహించగా దశరథమహారాజు మహాత్ములైన ఆ వసిష్ఠదూర్వాసులకు నమస్కరించి తన నగరమునకు తిరిగి వచ్చెను. పూర్వము అక్కడ ముని పలికిన మాటలు విని నేను వాటిని మనస్సులోనే ఉంచుకొంటిని. అది మరొక విధముగా కాజాలదు. పిమ్మట రాముడు సీతాపుత్రులను అయోధ్యలో కాక మరొక చోట అభిషిక్తులను చేయగలడు; ఇది ముని చెప్పిన విషయము. నరోత్తముడవైన లక్ష్మణా! ఇట్టి స్థితిలో నీవు రాముని విషయమునందు గాని, సీతవిషయమునందు గాని దుఃఖించకుము. ధైర్యముతో ఉండుము."(25-28)

సుమంత్రుడు పలికిన చాల ఆశ్చర్యకరములైన మాటలు విని లక్ష్మణుడు చాల సంతోషించెను. "బాగు బాగు" అని మెచ్చుకొనెను. ఆ సుమంత్రలక్ష్మణులు మార్గమునందు ఈ విధముగా మాటలాడుకొనుచుండగా అంతలో సూర్యుడు అస్తమించెను. అప్పుడు వారు కేశినీనదీతీరమునందు నివసించిరి.(29, 30)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది ఒకటవ సర్గము సమాప్తము.**

# ఏబది రెండవ సర్గము

## అయోధ్యలో రాజభవనములో ప్రవేశించిన లక్ష్మణుడు దుఃఖించుచున్న రాముణ్ణి ఓదార్చుట.

రఘువంశానందకరుడైన లక్ష్మణుడు ఆ రాత్రికి ఆ కేశినీనదీతీరమునందు ఉండి మరునాడు ఉదయముననే లేచి మరల ప్రయాణ మయ్యెను. మహారథుడైన లక్ష్మణుడు మధ్యాహ్నసమయానికి, శ్రేష్ఠములైన వస్తువులతో నిండి సంతోషించిన బాగా పరిపుష్టులైన జనులు నివసించుచున్న అయోధ్యానగరములో ప్రవేశించెను. "వెళ్ళి రాముని పాదాలచెంత చేరిన నేను ఆయనకు ఏమి చెప్పవలెను" అను

వారిద్దరికీ, సవినయముగా నమస్కరించెను. ఆ మునులిద్దరూ దశరథమహారాజును స్వాగతము, ఆసనము, పాద్యము, కందమూలములు ఇచ్చి ఆదరించిరి. అతడు మునులతో కలసి కొంత సేపు అక్కడ ఉండెను. అక్కడ కూర్చొని ఉన్న ఆ మహర్షులు మధ్యాహ్నసమయమునందున చాల మధురములైన ఆ యా కథలు (మాటలు) చెప్పుకొనిరి.(1-6)

పిమ్మట ఒక ప్రసంగములో వినయవంతుడైన రాజు అంజలి ఘటించి అత్రిపుత్రుడైన మహాత్ముడైన ఆ దుర్వాసునితో "పూజ్యుడా! నా వంశము ఎంత కాలము ఉండును? నా రాముని ఆయుర్దాయ మెంత? నా ఇతరపుత్రుల ఆయుర్దాయ మెంత? పూజ్యుడా! రామునకు పుట్టబోవు పుత్రుల ఆయుర్దాయము ఎంత ఉండును? నా వంశము గతిని గూర్చి ఇచ్ఛానుసారము (నీకు చెప్పవలెనని ఉన్నచో) చెప్పుము" అని అడిగెను. దశరథమహారాజు పలికిన మాటలు విని గొప్ప తేజస్సు గల దుర్వాసుడు చెప్పుటకు ఉపక్రమించెను- "రాజా! పూర్వము జరిగిన కథను వినుము. దేవాసురయుద్ధమునందు దేవతలు పీడించగా అసురులు భృగుమహర్షి భార్యను ఆశ్రయించిరి. ఆమె వాళ్ళకు అభయ మిచ్చెను. అప్పుడు వాళ్ళు భయము లేకుండా నివసించిరి. ఆ అసురులను ఆమె ఆ విధముగా చేరదీయుట చూచి కోపించిన విష్ణువు వాడియైన అంచుగల చక్రముతో భృగుమహర్షి భార్య తల నరికివేసెను.(7-13)

భృగుమహర్షి తన భార్యను విష్ణువు చంపివేయుట చూచి, వెంటనే కోపించి శత్రుసంహారకుడైన ఆ విష్ణువును "జనార్దనా! నీవు కోపావేశముతో, చంపకూడని నా భార్యను చంపినావు. అందువలన మనుష్యలోకములో పుట్టి చాల సంవత్సరములు భార్యావియోగము పొందెదవు." అని శపించెను. ఆ భృగువు విష్ణువునకు శాపమిచ్చుటచేత వికారము చెందిన మనస్సుగలవాడై తన ఆత్మతో తనను ధ్యానించుకొని, ఆ శాపముచేత పీడితుడై(పశ్చాత్తాపము చెంది) విష్ణువును పూజించెను. తపస్సుచేత ఆరాధించబడిన భక్తవత్సలుడైన విష్ణువు - "లోకముల హితము చేయుటకై ఈ శాపము నాకు గ్రాహ్యమే" అని పలికెను. రాజోత్తమా! పూర్వజన్మలో ఈ విధముగా శపించబడిన గొప్ప తేజస్సుగల ఆ విష్ణువు ఇప్పుడు నీ పుత్రుడుగా జన్మించాడు. దశరథమహారాజా! రాము డనే పేరుతో మూడు లోకాలలో ప్రసిద్ధుడైన ఆ విష్ణువు(నీ పుత్రుడు) భృగుశాపఫలము కూడ అనుభవించగలడు. రాముడు చాలకాలము అయోధ్యాధిపతిగా ఉండగలడు. ఈతని అనుచరులు కూడ సుఖసమృద్ధులతో తులతూగగలరు. రాముడు పదకొండువేల సంవత్సరముల

కాలము తరువాత నిన్ను, సీతను, భరతశత్రుఘ్నులను కూడ విడచివేయు నని వారు చెప్పిరి. లక్ష్మణా! మీ రాజైన (తండ్రియైన) దశరథమహారాజుతో దుర్వాసుడు పలికిన మాటలలో చెప్పిన విషయము నీకు గాని, భరతునకు గాని చెప్పదగినది కాదు. దుర్వాసుడు నేను, దశరథమహారాజు, వసిష్ఠుడు ఉండగా మా ఎదుట చెప్పినాడు. దుర్వాసమహర్షి మాటలు విని దశరథుడు నాతో- "సుమంత్రా! ఈవిషయమును ఎక్కడా కూడ జనుల సముదాయములో చెప్పకూడదు" అని పలికినాడు.(9-15)

ఓ! సౌమ్యుడా! నేను చాల జాగరూకత వహించి దశరథ మహారాజు చెప్పిన మాటను ఎన్నడూ అసత్యము చేయకూడ దని నా అభిప్రాయము. లక్ష్మణా! నేను నీ ఎదుట ఈ విషయమును చెప్పనే కూడదు. కాని నీకు వినవలె నను శ్రద్ధ ఉన్నచో వినుము. పూర్వము దశరథుడు ఈ విషయము రహస్యము అని చెప్పి ఉన్నా కూడ నేను నీకు చెప్పెదను. ఏ దైవముచేత ఇట్టి శోకముతో కూడిన దుఃఖము కలిగినదో ఆ దైవము దాట శక్యము కాదుకదా? నీవు భరతునకు గాని శత్రుఘ్నునకు గాని చెప్పకూడదు.(శోకము అనగా తలచి తలచి ఏడవడం. దుఃఖం అనగా అనుభవిస్తూన్న కష్టం.) లక్ష్మణుడు గంభీరమైన అర్థము పదములూ గల సుమంత్రుని ఆ గొప్పమాటలు విని "సత్యము చెప్పుము" అని అతనితో పలికెను.(16-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబదవ సర్గము సమాప్తము.**

# ఏబది ఒకటవ సర్గము

## సుమంత్రుడు తాను దుర్వాసుని ద్వారా విన్న భృగుశాపవృత్తాంతమును, రాబోవు కథను చెప్పి లక్ష్మణుని ఓదార్చుట.

**మ**హాత్ముడైన లక్ష్మణుడు అట్లు ప్రేరేపించగా సుమంత్రుడు దుర్వాసుడు చెప్పిన మాటలు చెప్పుటకు ఉపక్రమించెను. పూర్వము అత్రిపుత్రుడైన దుర్వాసమహాముని పవిత్రమైన వసిష్ఠాశ్రమమునందు చాతుర్మాస్యమునకై నివసించెను. గొప్ప తేజస్సూ, యశస్సూ గల నీ తండ్రి పురోహితుడైన వసిష్ఠుని చూచుటకై స్వయముగా ఆ ఆశ్రమమునకు వెళ్ళెను. సూర్యునితో సమానుడైన దుర్వాసుడు తేజస్సుతో మండుచున్నట్లుండెను. ఆ మహాముని వసిష్ఠుని కుడి ప్రక్కన కూర్చొని ఉండెను. దశరథుడు ఆ మునిని చూచి, మునులలో శ్రేష్ఠులైన

పాలించవలెను. మీరు ఈమెను గొప్ప స్నేహముతో చూచెదరుగాక. ఈమె కుటుంబమునందు గౌరవభావమువలన నా మాటవలన మీరు ఈమెను విశేషించి పూజింతురుగాక అని చెప్పి, గొప్పకీర్తి, తపస్సు గల ఆ వాల్మీకి సీతను మాటిమాటికి వారికి, అప్పగించి, శిష్యులతో కలసి తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. (17-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# ఏబదవ సర్గము

## లక్ష్మణసుమంత్రుల సంభాషణము.

సీత ఆశ్రమములో ప్రవేశించుట చూచి లక్ష్మణుడు మనస్సులో గొప్ప దైన్యము చెంది చాల సంతాపమును పొంది, ఆలోచనలో సారథి అయిన సుమంత్రునితో ఇట్లనెను. - "సారథీ! రామునకు సీతావియోగమువలన ఎంతటి దుఃఖము కలిగినదో చూడుము. పరిశుద్ధమైన చరిత్ర గల భార్యయైన సీతను విడచిన రామునకు ఇంతకంటె అధికమైన దుఃఖము మరొకటి ఏదైనా ఉండునా? సారథీ! రామునకు ఈ సీతావియోగము తప్పక దైవమువలననే కలిగినదని తలచెదను. దైవము ఏనాటికీ దాట శక్యముకాదు కదా? ఏ రాముడు కోపము వచ్చినచో గంధర్వులను, దేవతలను, అసురులను, రాక్షసులను సంహరించగలడో అట్టి రాముడు దైవమునకు కట్టుబడి ఉన్నాడు! పూర్వము రాముడు తండ్రి మాటవలన విజనమైన దండకవనమునందు పదునాలుగు సంవత్సరములు నివసించినాడు. పౌరుల మాటలు విని సీతను దూరము పంపివేయుట దానికంటె ఎక్కువ దుఃఖకరము, క్రూరము అని నాకు తోచుచున్నది. సారథీ! సీత విషయములో చెడ్డమాటలు పలికిన పౌరులకు కీర్తిని హరించు ఈ కర్మవలన ఏమి ధర్మము లభించినది?"(1-8)

లక్ష్మణుడు పలికిన అనేకవిధములైన ఈ మాటలు విని బుద్ధిమంతుడైన సుమంత్రుడు శ్రద్ధతో ఇట్లు పలికెను- "లక్ష్మణా! సీత విషయమున నీవు దుఃఖించకుము. పూర్వము నీ తండ్రి సమక్షమున బ్రాహ్మణులు ఈ విషయమును గూర్చి ముచ్చటించి ఉన్నారు. రాముడు తప్పక ఎక్కువ దుఃఖములు కలవాడు, కష్టములు అనుభవించేవాడు అగును. మహాబాహువైన ఇతడు తప్పక ఇష్టజనుల వియోగమును పొందును. మహాత్ముడు, ధర్మాత్ముడూ అయిన రాముడు చాల

ఉన్న అమెను చూడుము. ఓ! పూజ్యుడా! ఈమె మనుష్యస్త్రీ అని అనుకొనుము. ఈమెకు సత్కారము చేయుము. ఈమె అశ్రమసమీపమునకు వచ్చి నిన్ను శరణు జొచ్చినది. రక్షకుణ్ణి కోరుచున్నది. నీవు ఈమెను రక్షించుము."(1-6)

తపస్సుచేత దివ్యదృష్టి సంపాదించిన ధర్మములు తెలిసిన ఆ వాల్మీకి వాళ్ళ మాటలు విని బుద్ధిచేత ఒక నిర్ణయము చేసికొని, సీత ఉన్న చోటికి శీఘ్రముగా వెళ్ళెను. ఆ వాల్మీకి వెంట అయన శిష్యులు కూడా శీఘ్రముగా వెళ్ళిరి. మహాబుద్ధిశాలియైన ఆ వాల్మీకి పూజాద్రవ్యములు తీసికొని ఆ ప్రదేశమునకు కొంచెము దూరము నడచి వెళ్ళి, అందమైన గంగాతీరమును చేరెను. అక్కడ రాముని ప్రియురాలైన భార్యయైన, అనాథవలె ఉన్న సీతను చూచెను. మునిశ్రేష్ఠుడు శోకభారముచేత పీడితురాలైన ఆ సీతను తేజస్సుచేత సంతోషపెట్టుచున్నాడా అన్నట్లు మధురమైన వాక్కు పలికెను– "ఓ! పతివ్రతా! నీవు దశరథుని కోడలివి. రాముని ప్రియురాలైన భార్యవు. జనకమహారాజు కుమార్తెవు. నీకు స్వాగతము. నీవు వచ్చుచున్నట్లు నేను యోగబలముచేత తెలిసికొన్నాను. కారణము లన్నీ నా మనస్సుకు తెలిసినవి. మహాభాగ్యవంతురాలా! నీ విషయము కూడ నాకు యథార్థముగా తెలియును. మూడు లోకములలో ఉన్న సమస్తమూ నాకు తెలియును కదా? ఓ! సీతా! తపస్సువలన లభించిన దివ్యదృష్టిచే నీవు ఏ పాపమూ లేనిదాన వని నేను ఎరుగుదును. ఇప్పుడు నీవు నాదగ్గర ఉన్నావు. నిర్భయముగా ఉండుము. అమ్మా! నా ఆశ్రమానికి దగ్గరనే కొందరు స్త్రీలు తపస్సు చేసికొనుచున్నారు. ఆ తాపసస్త్రీలు నిన్ను, గోవు తన లేగదూడను పాలించి నట్లు, నిత్యమూ పాలించగలరు. ఈ అర్ఘ్యమును స్వీకరించుము. మనోవ్యథను విడచి, పూర్తి నమ్మకముతో నీ స్వగృహమునకు వచ్చినట్లు ఉండుము. దుఃఖించకుము."(7-16)

సీత చాల ఆశ్చర్యకరములైన ఆ వాల్మీకి మాటలు విని శిరస్సుచేత అతని పాదాలకు నమస్కరించి, దోసిలి కట్టి "అట్లే చేసెదను" అని పలికెను. ముందు నడచుచున్న ఆ ముని వెనుకనే సీత అంజలి ఘటించి నడచి వెళ్ళెను. సీతను తీసికొని వచ్చుచున్న ఆ వాల్మీకిని మునిపత్నులు చూచి సంతోషముతో ఆయన దగ్గరకు వచ్చి. "మునిశ్రేష్ఠా! నీకు స్వాగతము. నీవు చాల కాలము తరువాత వచ్చినావు. నీకు అభివాదనము చేయుచున్నాము. ఏమి చేయవలెనో చెప్పుము" అని పలికిరి. ఆ స్త్రీల మాటలు విని వాల్మీకి "బుద్ధిమంతుడైన రాముని భార్యయైన సీత ఇక్కడికి వచ్చినది. ఈమె దశరథుని కోడలు; జనకుని కూతురు; పతివ్రత. ఏ పాపము లేని ఈమెను భర్త పరిత్యజించినాడు. అందుచే నేను ఈమెను నిత్యము

సీత ఇట్లు పలుకుచున్నప్పుడు లక్ష్మణుడు దైన్యముతో నిండిన మనస్సుతో, సీత నిలచిన భూమికి శిరస్సుతో నమస్కరించి, ఏమీ మాటలాడలేకపోయెను. అతడు బిగ్గరగా ఏడ్చుచు ఆమెకు ప్రదక్షిణముచేసి, ముహూర్తకాలము ఆలోచించి, ఆమెతో ఇట్లనెను - "మంగళప్రదురాలా! నీవు నాతో ఏ మనుచున్నావు? దోషము లేనిదానా! నీ రూపమును పూర్వము నేనెన్నడూ చూడలేదు. పాదాలు మాత్రమే చూచితిని. ఇక్కడ ఈ వనమునందు, రాముడు దగ్గర లేని నిన్ను నేనెట్లు చూచెదను?" ఇట్లు పలికి, ఆమెకు నమస్కరించి మరల నావ ఎక్కెను.(19-22)

శోకభారముతో క్రుంగి, దుఃఖముచేత ఏమీ తోచని స్థితిలో ఉన్న ఆ లక్ష్మణుడు గంగ ఆవలి ఒడ్డు చేరి శీఘ్రముగా రథము నెక్కెను. రెండవ ఒడ్డున అనాథురాలు వలె దుఃఖముతో పొరలుచున్న సీతను మాటిమాటికి వెనుకకు తిరిగి చూచుచు లక్ష్మణుడు వెళ్ళెను. దూరముగా ఉన్న రథమును, లక్ష్మణుణ్ణి మాటి మాటికీ చూచి ఆలోచించుచు దిగులుచెందిన ఆ సీతను శోకము ఆవహించెను. కీర్తిమంతురాలైన ఆ సీత దుఃఖభారముచేత క్రుంగిపోయెను. కీర్తిని ధరించిన ఆమెకు నాథుడు కనబడకపోవుటచే దుఃఖావిష్టురాలై, నెమళ్ళ ధ్వనులతో నిండిన ఆ వనమునందు బిగ్గరగా ఏడ్చెను.(23-26)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# నలుబది తొమ్మిదవ సర్గము

## వాల్మీకి మునికుమారుల ద్వారా సీతను గూర్చి విని అక్కడికి వచ్చి, సీతను ఓదార్చి ఆమెను తన ఆశ్రమములోనికి తీసికొని వెళ్ళుట.

**ము**నికుమారులు, అక్కడ ఏడ్చుచున్న సీతను చూచి, పూజ్యుడు, గొప్పబుద్ధిగలవాడు అయిన వాల్మీకి దగ్గరకు పరుగెత్తి వెళ్ళిరి. ఆ మునిపుత్రు లందరూ వాల్మీకి పాదములకు నమస్కరించి అతనికి సీత ఏడ్పును గూర్చి తెలిపిరి - "పూజ్యుడా! ఎవరో మహానుభావుని భార్య అయిన, లక్ష్మీదేవి వలె ఉన్న, పూర్వమెన్నడూ చూడబడని ఈమె చాల వ్యాకులురాలై మోహమువలన ఏడ్చుచున్నది. ఓ! పూజ్యుడా! నదీతీరమునందు మేము ఒక దుఃఖించుచున్న ఉత్తమస్త్రీని చూచినాము. ఆమె అధికమైన దుఃఖావేశముతో బిగ్గరగా ఏడ్చుచున్నది. దుఃఖశోకములకు తగని ఆమె అనాథ వలె ఒంటరిగా దీనురాలై ఉన్నది. ఆకాశమునుండి పడిన దేవత వలె



ప్రభూ! లక్ష్మణా! నేను ఏమి తప్పు పని చేసితి నని మునులకు చెప్పుదును? నన్ను మహాత్ముడైన రాముడు ఏ కారణముచేత విడచినా డని చెప్పుదును? లక్ష్మణా! నేనిప్పుడు గంగాజలములో ప్రాణాలను విడువను. ఎందుచేతననగా (నా గర్భము కూడా నశించినచో) నా భర్త వంశము విచ్ఛిన్నమైపోవును. (1-8)

లక్ష్మణా! రాజాజ్ఞ ప్రకారము చేయుము. దుఃఖమును అనుభవించ వలసిన నన్ను విడచి రాజాజ్ఞను ఆచరించుము. నేను చెప్పు ఈ మాటలు కూడ వినుము. అత్తగార్లందరికీ భేద మేమీ లేకుండా చేతులు జోడించి, పాదములు స్పృశించి నమస్కరించి నట్లు చెప్పవలెను. రాజును కుశల మడిగినట్లు చెప్పుము. లక్ష్మణా! అత్తలందరికి శిరస్సుతో నమస్కరించి నా విషయము చెప్పుము. ధర్మములయందు చాల శ్రద్ధ గల రాజుతో కూడ ఇట్లు చెప్పుము. – రామా! సీత పరిశుద్ధురాలు; గొప్ప భక్తి కలది; నిత్యము నీ హితమును కోరునది అను విషయము నీకు తెలియును. వీరుడా! ప్రజలలో వచ్చిన అపకీర్తినుండి భయపడి నీవు నన్ను త్యజించినావు. లోకాపవాదమువలన నీకు కలిగిన ఈ నిందను తొలగించవలెను. నీవే నా ఉత్తమగతివి కదా?(13)

ధర్మము విషయమున సావధానచిత్తుడైన రాజుతో ఇట్లు చెప్పుము. నీవు పౌరులను నిత్యము సోదరులను చూచుకొన్నట్లు చూచుకొనుము. ఇది (పౌరులను సోదరులను వలె చూచుకొనుట) నీకు గొప్ప ధర్మము. రాజా! పౌరజానపదుల విషయమునందు ధర్మప్రవృత్తిచే లభించు పుణ్యమువలన అత్యధికమైన కీర్తి లభించును కదా? నరశ్రేష్ఠుడవైన రామా! నేను నా శరీరమును గూర్చి విచారించుటలేదు. పౌరుల అపవాదము ఎట్లున్నదో దానిని పట్టియే నేను ప్రవర్తించెదను; నీకు దూరముగా ఉండుటకు సిద్ధముగా ఉన్నాను. స్త్రీకి భర్తయే దేవత; భర్తయే బంధువు, భర్తయే గురువు. అందువలన భర్తకు ఇష్టమైన కార్యమును; విశేషించి ప్రాణాలు అర్పించియైనా చేయవలెను. నా మాటగా రామునితో ఇట్లు చెప్పుము. ఇదే నేను చెప్పదలచిన మాటల సంగ్రహము. నేను గర్భవతినై ఉన్నాను అను విషయమును చూచి వెళ్ళుము."(14-18)

గూర్చి పరిషత్తు మధ్యలో ఉండగా విని, మనస్సులో బాధపడుచు, నాకు ఆజ్ఞ ఇచ్చి ఇంట్లోనికి వెళ్ళిపోయినాడు. దేవీ! ఏ మాటలను మనస్సులో ఉంచుకొని రాజు నీమీద ఉన్న ప్రేమను వెనుకకు నెట్టివేసినాడో ఆ మాటలు నేను నీముందు చెప్పదగినవి కావు. దేవీ! అట్టి నిర్దోషురాల వైన నిన్ను పౌరుల అపవాదమునుండి భయపడిన రాజు నా సంనిధిలో(నా ద్వారా) విడచినాడు. నీవు మరొక విధముగా అనుకొనకుము. నిన్ను రాజాజ్ఞానుసారము ఆశ్రమప్రాంతాలలో విడువలసి ఉన్నది. నీవు కూడ అట్లే కోరుకొన్నావట కదా? గంగాతీరమునందు అదే ఆ కనపడుచున్నది పుణ్యము, సుందరము అయిన బ్రహ్మర్షుల తపోవనము. ఓ! మంగళప్రదురాలా! దుఃఖము చెందకుము. మా తండ్రియైన దశరథమహారాజుకు పరమమిత్రుడు, మునిశ్రేష్ఠుడు, గొప్ప కీర్తి గలవాడూ అయిన వాల్మీకి ఇక్కడనే ఉన్నాడు. "ఓ! దేవీ! ఆ మహాత్ముని పాదముల చెంతకు చేరి, పతివ్రతాధర్మములను ఆచరించుచు నిత్యమూ రాముణ్ణే హృదయమునందు స్మరించుచు నియమపూర్వకముగు ఆహారము భుజించుచు ఇక్కడ నివసించుము. అట్లుచేసినచో నీకు శ్రేయస్సు కాగలదు" అని పలికెను. (8-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది ఏడవ సర్గము సమాప్తము.**

# నలుబది ఎనిమిదవ సర్గము

## సీత దుఃఖావిష్టురాలై రామునకు సందేశము పంపుట. లక్ష్మణుడు వెళ్ళిపోవుట. సీత విలపించుట.

దారుణమైన లక్ష్మణుని మాటలు విని సీత చాలా దుఃఖమును పొంది మూర్ఛిల్లి నేలపై పడిపోయెను. క్షణకాలము స్పృహ తప్పి పడిపోయిన ఆ సీత నేత్రములు కన్నీళ్ళతో నిండగా దీనముగా లక్ష్మణునితో ఇట్లు పలికెను- "లక్ష్మణా! బ్రహ్మదేవుడు నిజముగా నా దేహమును దుఃఖము అనుభవించుటకై సృష్టించినాడు. అందుచేతనే నేనిప్పుడు మూర్తీభవించిన దుఃఖమును చూచుచున్నాను. పరిశుద్ధమైన నడవడిక గల పతివ్రతనైన నన్ను రాజు విడచివేయుచున్నాడు. పూర్వము నేనేమి పాపము చేసినానో! ఎవరికి భార్యావియోగము కలిగించినానో! సౌమ్యుడా! బంధుజనులకు దూరము చేయబడిన నేను ఆశ్రమములో ఎట్లు నివసించగలను? దుఃఖముతో నిండిన నేను కష్టములు ఎవరికి చెప్పుకొందును?

నావ నడిపేవాళ్ళను పిలచెను. "ఇదిగో నావ సిద్ధముగా ఉన్నది" అని నావికులు సవినయముగా చెప్పిరి. గంగను దాట దలచిన లక్ష్మణుడు సుందరమైన ఆ నావలోనికి ఎక్కి సీతను కూడ చాల జాగరూకతతో గంగను దాటించెను.(32, 33)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది అరవ సర్గము సమాప్తము.**

# నలుబది ఏడవ సర్గము

## సీతను గంగానది దాటించిన పిమ్మట లక్ష్మణుడు ఆమెకు పరిత్యాగమును గూర్చి చెప్పుట.

పిమ్మట లక్ష్మణుడు నిషాదుడు తీసికొనివచ్చిన, విశాలమైన, సిద్ధము చేయబడిన నావపై సీతను ముందుగా ఎక్కించి పిదప తాను ఎక్కెను. దుఃఖాక్రాంతుడైన లక్ష్మణుడు "నువ్వు రథముతో ఇక్కడనే ఉండుము" అని సుమంత్రునితో చెప్పి, "నడిపింపుము" అని నావవానితో పలికెను. అప్పుడు లక్ష్మణుడు గంగాతీరమును చేరిన పిమ్మట అంజలి ఘటించి, కన్నీళ్ళు కార్చుచు సీతతో– "దేవీ! బుద్ధిశాలియైన మా అన్నగారు నన్ను ఈ విషయములో లోకాల నిందకు పాలైయే టట్లు చేసినాడు. ఇది నా హృదయములో గొప్ప శల్యముగా ఏర్పడినది. ఈ విధముగా లోకనిందితమైన కార్యమునందు నియోగింపబడుటకంటె నాకు మరణమో, అంతకంటె గొప్పది ఏదైనా ఉన్నచో అదో శ్రేయస్కరము అయి ఉండెడిది. మంగళప్రదురాలా! నా విషయమున దోషమును ఊహించకుము.(నేను దోషిని కాదు)" అని పలుకుచు లక్ష్మణుడు అంజలి ఘటించి నమస్కరించుచు భూమిమీద పడెను. చేతులు జోడించి ఏడ్చుచు తనకు మృత్యువు వచ్చిన బాగుండు నని కోరుకొనుచున్న ఆ లక్ష్మణుని చూచి సీత చాల దిగులు చెంది.(1–7)

"లక్ష్మణా! ఇదేమో నాకు అర్థము అగుటలేదు. అసలు విషయమేమో చెప్పుము. నువ్వు స్వస్థుడవుగా ఉన్నట్లు కూడ కనబడుటలేదు. రాజునకు క్షేమము కద? రాజుమీద ఒట్టు పెట్టి అడుగుచున్నాను. నీకు ఇంత దుఃఖము ఎందుకు కలిగినదో చెప్పుము. నిన్ను ఆజ్ఞాపించుచున్నాను" అనెను. సీత ఈ విధముగా ప్రేరేపించగా లక్ష్మణుడు దైన్యముతో నిండిన మనస్సుతో తల వంచుకొని, డగ్గుత్తికతో– సీతా! రాముడు నీ విషయమై పట్టణాలలోను, పల్లెలలోను వ్యాపించిన లోకాపవాదాన్ని

సోదరుడైన రామునకు అత్తగార్లందరికీ క్షేమము కలుగును కద! పట్టణములందు గ్రామాలలోను ప్రజలు, ఇతర ప్రాణులు సుఖముగా ఉందురా!" అని పలుకుచు దేవతలకు నమస్కారము చేసెను. పిమ్మట లక్ష్మణుడు ఆమె చెప్పు విషయమును గ్రహించి, సీతకు తలవంచి నమస్కరించి, హృదయముశుష్కించుచుండగా, పైకి సంతోషము కనబరచుచు "అంతా మంగళప్రదముగా ఉండును" అని పలికెను.(13-18)

పిమ్మట లక్ష్మణుడు గోమతీతీరమునందున్న ఆశ్రమములో విడిదిచేసి, ప్రాతఃకాలమునందు మరల లేచి సారథితో- "శీఘ్రముగా రథమును సిద్ధము చేయుము. ఇప్పుడా గంగాజలమును, ఈశ్వరుడు శక్తిచేత శిరస్సుమీద ధరించినట్లు, నా శిరస్సుమీద ధరించెదను" అనెను. సారథి మనోవేగముగల అశ్వములను రథములకు కట్టి, వాటిని నడిపి తీసికొని వచ్చి, అంజలి ఘటించి సీతతో "దేవీ! ఎక్కుము" అని పలికెను. సీత సారథి మాట విని రథమును ఎక్కెను. లక్ష్మణుడు, ధీమంతుడైన సుమంత్రుడూ కూడా ఎక్కిరి.(19-22)

విశాలాక్షియైన సీత పాపములను నశింపచేయు గంగను సమీపించెను. దివసములో సగముకాలము ప్రయాణము చేసిన లక్ష్మణుడు గంగాజలమును చూచి దీనుడై బిగ్గరగా ఏడ్చెను. ధర్మములు తెలిసిన సీత లక్ష్మణుడు దుఃఖించుట చూచి చాల భయపడి ఇట్లు పలికెను- "నీవు ఏడ్చుచున్నావు; ఇది ఏమి? లక్ష్మణా! నేను చాలా కాలమునుండి కోరుకొనుచున్న గంగాతీరమును సమీపించిన తరువాత సంతోషించవలసిన సమయమునందు నాకు దిగులు కలిగించుచున్నావేమి? పురుషశ్రేష్ఠుడా! నీవు నిత్యము రామునిదగ్గరనే ఉందువు. రెండు రోజులు ఆయననుండి దూరముగా ఉండుటచేత శోకించుటలేదుకద? లక్ష్మణా! రాముడు నాకు కూడ జీవితముకంటె ఎక్కువ ఇష్టమైనవాడు. అయినా నేను కూడ ఈ విధముగా దుఃఖించుట లేదు. ఈవిధముగా ధైర్యము లేనివాడవు కాకుము. నన్ను గంగ దాటించుము. మునులను చూపుము. పిమ్మట మునులకు వస్త్రములు, ఆభరణములు ఇచ్చెదను. అటుపైన తగు విధముగా మహర్షులకు అభివాదముచేసి, అక్కడ ఒక రాత్రి ఉండి మరల నగరమునకు వెళ్ళెదము. పద్మపత్రముల వంటి నేత్రములు, సింహము వంటి వక్షఃస్థలము, సన్నని నడుమూ గల, ఆనందింపచేసేవాళ్ళలో శ్రేష్ఠుడైన రాముణ్ణి చూడవలె నని నామనస్సు కూడ తొందరపడుచున్నది."(23-31)

లక్ష్మణుడు ఆమె మాటలు విని, సుందరములైన నేత్రములు తుడుచుకొని,

# నలుబది ఆరవ సర్గము

## లక్ష్మణుడు సీతను వనములో విడచుటకై రథముపై బయలుదేరి గంగాతీరము చేరుట.

రాత్రి తెల్లవారినది. మనస్సులో చాల దైన్యముతో ఉన్న లక్ష్మణుడు, వాడిపోయిన ముఖముతో సుమంత్రునితో- "సారథీ! శ్రేష్ఠమైన రథానికి వేగముగల గుఱ్ఱాలను కట్టి సీతకొఱకై మెత్తని అందమైన వస్త్రాదులు పరచిన ఆసనము తయారుచేయుము. ఇది రాజాజ్ఞ. రాముని ఆజ్ఞ ప్రకారము నేను సీతను పుణ్యాత్ములైన మహర్షుల ఆశ్రమానికి తీసుకొని వెళ్ళవలెను. రథమును శీఘ్రముగా తీసికొనిరమ్ము" అని పలికెను. సుమంత్రుడు "అట్లే చేసెదను" అని పలికి, ఉత్తమములైన గుఱ్ఱములు కట్టిన, సుఖకరమైన చక్కని పరుపు పరచిన, మంచి కాంతి గల రథమును తీసుకొని వచ్చి, "ప్రభూ! ఇదిగో, రథము వచ్చినది. ఏమి చేయవలెనో ఆ పని చేయుము" అని లక్ష్మణునితో పలికెను.(1-5)

లక్ష్మణుడు సుమంత్రుని మాటలు విని, రాజప్రాసాదములో ప్రవేశించి సీత దగ్గరకు వెళ్ళి- "దేవీ! నీవు ప్రభువైన రాజును వరమును కోరినా వట. రాజు కూడ అట్లే ఇచ్చెద నని ప్రతిజ్ఞ చేసినా డట. అందుచేత నిన్ను ఆశ్రమమునకు తీసికొని వెళ్ళవలసినదిగా నన్నాజ్ఞాపించినాడు. మన రాజుగారి ఆజ్ఞప్రకారము నేను గంగాతీరమునందున్న పవిత్రములైన ఋష్యాశ్రమములకు శీఘ్రముగా నిన్ను తీసికొనివెళ్ళి అక్కడ మునులు నివసించు అరణ్యమును చేర్చవలసి ఉన్నది" అని ఆమెకు తెలిపెను. సీత మహాత్ముడైన లక్ష్మణుని మాటలు విని చాల సంతోషించి, చాల విలువ గల వస్త్రములు, అనేక విధములైన రత్నాలు తీసికొని వెళ్ళుటకు సిద్ధ మయ్యెను. "నేను ఈ ఆభరణములు, చాల విలువైన వస్త్రాలు, అనేకవిధములైన ధనాలూ కూడ మునిభార్యలకు ఇచ్చెదను" అని సీత పలికెను. లక్ష్మణుడు "సరే! అట్లే చేయుము" అని పలికి సీతను వేగముగల గుఱ్ఱములు కట్టిన రథమును ఎక్కించి, రాముని ఆజ్ఞను స్మరించుచు తీసికొని వెళ్ళెను.(6-12)

అప్పుడు సీత లక్ష్మణునితో ఇట్లు పలికెను. "లక్ష్మణా! నాకు చాల అశుభములు(అపశకునములు) కనబడుచున్నవి. నా(కుడి) కన్ను అదురుచున్నది. శరీరము వణుకుచున్నది. నా హృదయము కూడ అస్వస్థముగా ఉన్నట్లు కనబడుచున్నది. లక్ష్మణా! నాకేమో చాల బెంగగా ఉన్నది. అధైర్యము అధికముగా ఉన్నది. ఈ భూమి అంతా శూన్యముగా ఉన్నట్లు కనబడుచున్నది. వీరుడా! నీ

కూడ విడిచివేసెదను. సీత మాట చెప్పవలెనా? ఈ విధముగా నేను ఎట్లు శోకసముద్రములో పడినానో చూడుడు. ఇంతకంటె అధికమైన దుఃఖమేదీ వచ్చినట్లు నాకు కనబడలేదు.(11-15)

లక్ష్మణా! రేపు ప్రాతఃకాలమునందు నీవు సుమంత్రుడు నడుపు రథమునెక్కి, సీతను ఎక్కించి ఆమెను దేశము చివర విడువుము. గంగకు ఆవతలి ఒడ్డున, తమసాతీరమును ఆనుకొని మహాత్ముడైన వాల్మీకి ఆశ్రమము ఉన్నది. ఇది దేవలోకములోని ఆశ్రమముతో సమాన మైనది. సీతను అక్కడ విజనప్రదేశమునందు విడిచి శీఘ్రముగా రమ్ము. నీకు భద్ర మగుగాక. నేను చెప్పినట్లు చేయుము. సీత విషయములో ఏ విధముగానూ కూడ నాకు అడ్డు చెప్పకూడదు. అందువల్ల, లక్ష్మణా! వెళ్ళుము. ఈ విషయములో మరొక ఆలోచన ఏమీ చేయవద్దు. దీనికి అడ్డు చెప్పినచో నాకు చాల అసంతోషము కలుగును. నా పాదాలమీద, జీవితము మీద ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. నా మాటకు అడ్డు వచ్చి మధ్యలో బ్రతిమాలుటకు మాట్లాడేవారు నా ఇష్టమునకు అడ్డము తగులుటచే ఎప్పటికీ నా అహితులుగా పరిగణింపబడుదురు. మీరు నా ఆజ్ఞలో ఉన్నవారైతే నా మాట మన్నించుడు. సీతను ఇప్పుడు ఇక్కడినుండి తీసికొనిపోవలెను. నా మాట ప్రకారము చేయుము. "నాకు గంగాతీరమునందున్న ఆశ్రమమును చూడవలె నని ఉన్నది" అని ఈమె వెనుక నాతో చెప్పి ఉన్నది. ఈమె కోరిక కూడ తీర్చబడుగాక."(16-23)

సోదరులతో కూడి ఉన్న ధర్మాత్ముడైన ఆ రాముడు ఇట్లు పలుకుచుండగా కన్నీరు అతని కండ్లను కప్పివేసెను. అతడు సోదరులను పంపివేసి తన ఇంటిలో ప్రవేశించెను.(24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది ఐదవ సర్గము సమాప్తము.**

# నలుబది ఐదవ సర్గము

**లోకాపవాదమును గూర్చి సోదరులకు తెలిపి సీతను అరణ్యములో విడిచి రమ్మని రాముడు లక్ష్మణుని ఆదేశించుట.**

మనస్సులో దైన్యము వహించి లక్ష్మణాదులు కూర్చున్న పిమ్మట రాముడు వాడిపోయిన ముఖముతో ఇట్లు పలికెను– "మీకందరికీ క్షేమమగుగాక. నా విషయమునందు, సీత విషయమునందు పౌరులు ఏమి చెప్పుకొనుచున్నారో వినండి. నా అభిప్రాయమునకు విరుద్ధముగా ఆలోచించకండి. పౌరులలోను, జానపదులలోను చాల గొప్ప అపవాదు బయలుదేరినది. నా విషయమున నింద ప్రచారములో ఉన్నది. అది నా మర్మస్థానములను ఛేదించివేయుచున్నది. నేను మహాత్ములైన ఇక్ష్వాకువంశీయుల కులములో పుట్టినాను కదా? సీత కూడ మహాత్ములైన జనకరాజుల వంశములో పుట్టినది.(1–4)

సౌమ్యుడవైన లక్ష్మణా! నిర్జనమైన దండకారణ్యమునుండి రావణుడు సీతను ఎట్లు హరించినాడో, నేను అతనిని ఎట్లు నశింపచేసినానో నీకు తెలియును కదా? "ఈ లంకాపట్టణములో ఉన్న సీతను అయోధ్యకు ఎలా తీసికొని వెళ్ళగలను" అని నాకు ఆ సమయమునందు సీత విషయమున ఆలోచన కలిగినది. లక్ష్మణా! అప్పుడు సీత నమ్మకము కలిగించుటకొరకు నీ ఎదుటనే అగ్నిలో ప్రవేశించినది కదా? దేవతలలో అగ్నిదేవుడూ, ఆకాశములో సంచరించే వాయువు కూడ ఆమె పాపరహితురా లని చెప్పినారు కదా? పూర్వము దేవతల సంనిధిలోను, అందరు ఋషీశ్వరుల సంనిధిలోనూ సూర్యచంద్రులు కూడ సీత పాపము లేనిది అని చెప్పినారు కదా? ఈ విధముగా పరిశుద్ధమైన చరిత్రగల సీతను, దేవతల, గంధర్వుల సంనిధిలో దేవేంద్రుడు నా చేతిలో ఉంచినాడు. కీర్తిమంతురాలైన సీత పరిశుద్ధురా లని నా అంతరాత్మకు కూడా తెలియును. అందువల్లనే నేను సీతను తీసికొని అయోధ్యకు వచ్చినాను.(5–10)

నా హృదయములో ఈ గొప్ప అధర్మచింతా, శోకము కూడ ఉన్నవి. చాల గొప్పదైన పౌరుల అపవాదము, గ్రామ ప్రజల అపవాదము వచ్చినది. ఈ లోకములో ఎవని అపకీర్తి వ్యాపించి ఉండునో అతడు ఆ చెడ్డమాట వ్యాప్తిలో ఉన్నంతవరకు నరకములో పడియుండును. అపకీర్తిని దేవతలు నిందింతురు. కీర్తిని లోకములో అందరూ పూజింతురు. మహాత్ము లందరూ చేయు ప్రయత్నము కీర్తికొరకే. పురుషశ్రేష్ఠులారా! అపవాదుకు భయపడిన నేను నా జీవితమునూ, మిమ్ములను

చూడవలెనని అనుకొనుచున్నాడు. లక్ష్మణుడు, భరతుడు ముందుగానే వెళ్ళినారు" అని చెప్పెను. శత్రుఘ్నుడు అతని మాటలు విని, శ్రేష్ఠమైన ఆసనమునుండి నేలమీదికి దిగి, రాముడున్న వైపుకు నమస్కరించి రాముని దగ్గరకు వెళ్ళెను. అప్పుడు ద్వారపాలకుడు వచ్చి, చేతులు జోడించి నమస్కరించి సోదరు లందరూ వచ్చినట్లు రామునకు తెలిపెను.(6-11)

సోదరులు వచ్చి నట్లు విని రాముడు చింతచేత వ్యాకులములైన ఇంద్రియములు కలవాడై, తల క్రిందికి వంచి, దీనమైన మనస్సుతో, ద్వారపాలకునితో- "నీవు వెంటనే సోదరులను నా దగ్గరకు తీసుకొని రమ్ము. నా జీవితము వాళ్ళమీద ఆధారపడియున్నది. వీళ్ళే నా ప్రియమైన ప్రాణములు" అనెను.(12, 13)

రాజు ఆజ్ఞ పొంది శుక్రునివంటి తేజస్సు గల ఆ రాజకుమారులు నమ్రులై, అంజలులు ఘటించి, సావధానచిత్తులై లోపల ప్రవేశించిరి. ఆ సమయమునందు రాముని ముఖము రాహువు ఆక్రమించిన చంద్రబింబమువలె, సంధ్యాసమయము నందు సూర్యబింబమువలె, శోభావిహీనమైన పద్మమువలె, కాంతి లేక ఉండెను. నేత్రములు కన్నీళ్లతో నిండి ఉండెను. లక్ష్మణాదులు ఇట్టి స్థితిలో ఉన్న రాముణ్ణి చూచి తొందరగా వెళ్ళి శిరస్సులతో పాదాభివందనము చేసి, సావధానచిత్తులై నిలబడిరి. రాముడు కన్నీళ్ళు కార్చెను.(14-17)

గొప్పబలము గల రాముడు వాళ్ళను లేవదీసి, బాహువులతో కౌగలించుకొని, "ఆసనములమీద కూర్చొనుడు" అని చెప్పి తరువాత- "ఓ!రాజులారా! మీరే నా సర్వస్వము. మీరే నా జీవితము. రక్షణాదుల ద్వారా మీరు సంపాదించి ఇచ్చిన రాజ్యమునే నేను పాలించుచున్నాను. మీరు శాస్త్రవిషయములు తెలిసినవారు, మంచి బుద్ధి గలవారు, మీరందరూ కలసి నా కార్యమును నిర్ణయించవలెను" అని పలికెను. రాముడు ఈవిధముగా మాటలాడుచుండగా లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఆలోచనలో మునిగి "రాజు ఇప్పుడు ఏమి చెప్పనున్నాడో కదా!" అని మనస్సులో దిగులు చెందిరి.(18-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది నాలుగవ సర్గము సమాప్తము.**

సహించవలసి ఉండును. రాజు ఎట్లు చేయునో ప్రజలు కూడ అట్లే అతనిని అనుసరించి ప్రవర్తించుచుందురు కదా? రాజా! అన్ని నగరాలలోను, గ్రామాలలోను పౌరులు ఈ విధముగా అనేకవిధములైన మాటలు చెప్పుకొనుచున్నారు."(12-20)

రాముడు అతడు చెప్పిన మాటలు విని, చాలా దుఃఖితుడై "ఇది ఎట్లు? నాకు చెప్పుడు"అని అక్కడనున్న మిత్రుల నందరినీ అడిగెను. వాళ్లందరూ శిరస్సులతో భూమిని స్పృశించి నమస్కరించి, నమ్రులై ఇతడు చెప్పినది నిజమే; అసత్యము కాదు" అని రామునికి బదులు చెప్పిరి. శత్రుసంహారకుడైన రాముడు అప్పుడు వాళ్లందరూ చెప్పిన మాటలు విని ఆ స్నేహితుల నందరినీ పంపివేసెను. (21-23)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది మూడవ సర్గము సమాప్తము.**

# నలుబది నాలుగవ సర్గము

## రాముడు ద్వారపాలకుని పంపి లక్ష్మణభరతశత్రుఘ్నులను పిలిపించుట.

రాముడు మిత్రవర్గమును పంపివేసి తాను చేయవలసిన పని మనస్సులో నిర్ణయించుకొని దగ్గరనే ఉన్న ద్వారపాలకుని, "లక్ష్మణుణ్ణీ, భరతుణ్ణీ, శత్రుఘ్నుణ్ణీ శీఘ్రముగా తీసికొని రమ్ము" అని ఆజ్ఞాపించెను. ద్వారపాలకుడు రాముని మాటలు విని, శిరస్సుపై అంజలి ఘటించి నమస్కరించి లక్ష్మణుని ఇంటికి వెళ్ళి, ఎవ్వరిచేత అడ్డగించబడనివాడై లోనికి ప్రవేశించెను. దోసిలి కట్టి ఆ మహాత్ముడైన లక్ష్మణుణ్ణి "జయ విజయీ భవ" అను మాటలచేత అభినందించి "రాజు నిన్ను చూడదలచుచున్నాడు. ఆలస్యము చేయక శీఘ్రముగా వెళ్ళుము" అని చెప్పెను. లక్ష్మణుడు రాముని ఆజ్ఞ విని "తప్పక అట్లే వెళ్ళెదను" అని పలికి రథమెక్కి శీఘ్రముగా రాముని ఇంటికి వెళ్ళెను. (1-5)

ఆ ద్వారపాలకుడు, లక్ష్మణుడు వెళ్ళుచున్నట్లు చూచి, భరతుని వద్దకు వెళ్ళి, అంజలి ఘటించి అభినందించి, వినయముతో నమ్రుడై - "రాజు నిన్ను చూడగోరుచున్నాడు" అని చెప్పెను. భరతుడు ద్వారపాలకుడు చెప్పిన రాముని ఆజ్ఞను విని వెంటనే ఆసనమునుండి లేచి కాలినడకనే వెళ్ళెను. భరతుడు వెళ్ళుచున్నట్లు చూచి ద్వారపాలకుడు తొందరపడుచు శత్రుఘ్నుని గృహమునకు వెళ్ళి అంజలి ఘటించి నమస్కరించి- "ఓ! రఘుశ్రేష్ఠా! రమ్ము రమ్ము. రాజు నిన్ను

సందర్భములో రాముడు - "భద్రుడా! నగరములోను, దేశములోను ప్రజలు ఏమేమి చెప్పుకొనుచున్నారు? పురములోను, గ్రామాలలోను నివసించు జనులు నన్ను గూర్చి, సీతను గూర్చి, భరతుణ్ణి గూర్చి, లక్ష్మణుణ్ణి గూర్చి ఏమి చెప్పుకొనుచున్నారు? శత్రుఘ్నుణ్ణి గూర్చి, మా తల్లి కైకేయిని గూర్చి ఏమి చెప్పుకొనుచున్నారు? రాజ్యానికి క్రొత్తగా వచ్చిన రాజును గూర్చి ప్రజలు ఏమేమో చెప్పుకొందురు కదా?" అని అడిగెను. (1-6)

రాముని మాటలు విని భద్రుడు నమస్కరించి "రాజా! పౌరులు మంచిగాను, చెడ్డగానుకూడ చెప్పుకొనుచున్నారు. సౌమ్యుడవు, పురుషశ్రేష్ఠుడవూ అయిన "ఓ! రాజా! మనపురములోని ప్రజలు రావణుని వధకు సంబంధించిన ఈ విజయమును గూర్చి ఎక్కువగా మాట్లాడుకొనుచున్నారు." అనెను. భద్రుని మాటలు విని రాముడు - "ఉన్నది ఉన్నట్లుగా పూర్తిగా, అంతా చెప్పుము. పురమునందు నివసించువారు మంచిగాను, చెడ్డగాను ఏమి చెప్పుకొనుచున్నారు? వారు చెప్పుకొనేది విని నేనిపుడు మంచి కార్యములనే చేయుటకు, చెడ్డపనులు చేయకుండుటకు వీలు కలుగును. పట్టణములలోను, గ్రామాలలోను ఉన్న జనులు ఏమి చెప్పుకొనుచున్నారో నీవు విశ్వాసముతో నిర్భయముగా, ఏమాత్రమూ సంకోచములేకుండా చెప్పుము" అని ఆజ్ఞాపించెను. (7-11)

రాముడీ విధముగా పలికిన ఆ మంచిమాటలు విని భద్రుడు అంజలి ఘటించి, సావధానచిత్తుడై, రామునితో ఇట్లు చెప్పెను - "రాజా! పౌరులు నాలుగు వీధుల మొగలలోను, వీధులలోను, వనములలోను, ఉద్యానములలోను కలసి మంచిగాను చెడ్డగాను ఏమి చెప్పుకొనుచున్నారో వినుము. రాముడు సముద్రము మీద ఎవ్వరూ చేయజాలని సేతుబంధనము చేసినాడు. ఇట్టి దానిని పూర్వులెవ్వరూ గాని, దేవతలు గాని, దానవులుగాని విని ఉండరు. ఎదిరింప శక్యముకాని సేనావాహనసహితుడైన రావణుణ్ణి చంపినాడు. వానరులను, భల్లూకములను, రాక్షసులను కూడా వశము చేసికొనినాడు. రాముడు యుద్ధమునందు రావణుణ్ణి చంపి, సీతను తీసికొని, రావణస్పర్శవలన కలిగిన కోపము లెక్కచేయక(విడచి) ఆమెను మరల తన ఇంటికి చేర్చినాడు. అతని హృదయమునందు సీతాసమాగమమువలన ఏమి సుఖము కలుగునో! రావణుడు బలాత్కారముగా ఒడిలో కూర్చుండబెట్టుకొని హరించి, లంకకు తీసికొనిపోయి, అశోకవనమును చేర్చగా రాక్షసుల వశురాలైపోయిన ఆ సీతను గూర్చి రాముడు ఏవగించుకొనకుండగా ఎట్లుండకలుగుచున్నాడో! మన భార్యల విషయమునందు కూడా మనము

ధర్మకార్యములన్నీ పూర్తిచేసికొని అపరాహ్ణమును అంతఃపురములో గడుపుచుండెడివాడు. సీత కూడ పూర్వాహ్ణమునందు చేయవలసిన దేవతాపూజాదులు చేసికొని అందరు అత్తలకు, ఏమీ భేదభావము లేకుండా, సేవ చేసెడిది. పిమ్మట ఆమె విచిత్రమైన ఆభరణములు, వస్త్రములు ధరించి, స్వర్గములో కూర్చుని ఉన్న ఇంద్రుణ్ణి శచీదేవి సమీపించినట్లు రాముని దగ్గరకు వెళ్ళుచుండెడిది. మంగళకరమైన వేషము ధరించి వచ్చిన సీతను చూచి రాముడు చాల సంతోషించి "బాగు బాగు" అని అభినందించెను. (24-30)

దేవతాస్త్రీతో సమానురాలైన సీతను "ఓ! సీతా! నీవలన నాకు సంతానప్రాప్తి అచిరకాలములో కలుగ నున్నది. నీకు ఏమి కోరిక ఉన్నది. నేను నీ ఏ కోరిక తీర్చవలెను?" అని రాముడు అడిగెను. అప్పుడు సీత చిరునవ్వు నవ్వి రామునితో- "రామా! పవిత్రములైన తపోవనములు చూడవలె ననీ, గంగాతీరమునందు నివసించువారు, ఫలమూలములను మాత్రమే భక్షించువారు, ఉగ్రమైన తేజస్సుకలవారూ, అయిన ఋషుల పాదాల దగ్గర ఉండవలెననీ నాకు కోరిక ఉన్నది. మూలఫలములు భుజించు మునీశ్వరుల ఆశ్రమమునందు ఒక్క రాత్రి అయిన నివసింపవలెను అనేదే నా కోరిక" అని చెప్పెను. "సీతా! అట్లే, రేపు తప్పక వెళ్ళెదవు. నమ్మకముతో ఉండుము" అని రాముడు మాట ఇచ్చెను. రాముడు సీతతో ఇట్లు పలికి స్నేహితులతో కలిసి ప్రాసాదమధ్యమునందున్న మరొక కక్షకు వెళ్ళెను. (31-36)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది రెండవ సర్గము సమాప్తము.**

# నలుబది మూడవ సర్గము

## భద్రుడు సీతను గూర్చిన లోకాపవాదమును రామునకు తెలుపుట.

రాజు అక్కడ కూర్చొని ఉండగా అనేకవిధాలైన కథలలో నేర్పరులైన హాస్యము కలుగు నట్లు మాట్లాడేవాళ్ళు అతని చుట్టూ కూర్చుండి సేవించుచుండిరి. విజయుడు, మధుమత్తుడు, కాశ్యపుడు, మంగలుడు, కులుడు, సురాజి, కాలియుడు, భద్రుడు, దంతవక్త్రుడు, సుమాగధుడు వీరందరూ మంచి ఉత్సాహముతో మహాత్ముడైన రామునితో పరిహాసపూర్వకములైన మాటలు చెప్పుచుండిరి. అపుడు మాటల

వాటికి అనేక ఆకారములలో ప్రాకారములు, చుట్టూ శిలాఫలకములు ఉండెను. (10-12)

అక్కడ అశోకవనసమీపమునందు వైడూర్యమణుల వంటి పచ్చిక బీడులు ఉండెను. సమీపమునందున్న వనములు పుష్పించిన వృక్షములతో నిండి యుండెను. అక్కడ పోటీ పడి పెరుగుచున్నవా అన్నట్లు పెద్దవిగా పెరిగిన పుష్పములతో నిండిన వృక్షముల పుష్పములు రాలి విచిత్రవర్ణములుగా ఉన్న శిలాఫలకములు నక్షత్రగణములతో కూడిన ఆకాశము వలె ఉండెను. చక్కగా ఏర్పరుపబడిన ఆ రాముని ఉద్యానము ఇంద్రుని నందనోద్యానము వలె, బ్రహ్మ నిర్మించిన చైత్రరథోద్యానము వలె ఉండెను. రఘువంశీయులకు ఆనందము చేయు రాముడు అనేకవిధములైన ఆసనము లున్న గృహములూ, అక్కడక్కడ లతాగృహములూ ఉన్న విశాలమైన ఆ అశోకవనములో ప్రవేశించి తివాచీ పరచిన, పుష్పసముదాయము చేత అలంకృతమైన, అందమైన ఆకారము గల ఆసనముమీద కూర్చుండెను. (13-17)

రాముడు పరిశుద్ధమైన మైరేయక మను మద్యమును చేతితో తీసికొని ఇంద్రుడు శచీదేవికి త్రాగించినట్లు సీతకు త్రాగించెను. రాముడు భుజించుటకై కింకరులు బాగా శుద్ధిచేసిన మాంసములను, అనేకవిధములైన ఫలములను శీఘ్రముగా తీసికొని వచ్చిరి. కింనరస్త్రీలతో కూడిన, నృత్యసంగీతములయందు నేర్పుగల అప్సరఃస్త్రీలు, ఉరగస్త్రీలు రాముని దగ్గర నృత్యము చేసిరి. మంచి నేర్పుగల, సౌందర్యవతులైన, నృత్యగీతములో ప్రావీణ్యము గల, స్త్రీలు పానమునకు వశలై రాముని దగ్గర నృత్యము చేసిరి. ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడు, ధర్మాత్ముడూ అయిన రాముడు మనస్సు ఆకర్షించు, బాగా అలంకరించుకొనిన ఆ స్త్రీలను నిత్యము క్రీడింపచేసెను. సీతతో కూడ కూర్చున్న రాముడు, తేజస్సుచేత, అరుంధతితో కూర్చున్న వసిష్ఠుడు వలె ప్రకాశించెను. (18-23)

రాముడు ఈవిధముగా సంతోషముతో కూడినవాడై, దేవకన్యతో సమానురాలైన, సీతను ప్రతిదినమునందు, దేవతాపురుషుడు వలె ఆనందింపచేసెను. సీతారాములు చిరకాలము ఈ విధముగా భోగములను అనుభవించుచుండగా ఎల్లప్పుడూ భోగమును అనుభవించుటకు అనువైన, రమ్యమైన శిశిరకాలము గడచెను. ఆ మహాత్ము లిద్దరికీ పదివేల సంవత్సరములు గడచెను. వారిరువురూ, అనేకవిధములైన భోగములను అనుభవించుచుండగా శిశిరర్తువు గడచెను. ధర్మము లన్నీ తెలిసిన రాముడు పూర్వాహ్ణమునందు ధర్మానుసారముగా చేయవలసిన

# నలుబది రెండవ సర్గము

**గర్భవతియైన సీతకు తపోవనమును చూడవలె నను కోరిక ఉదయించుట.**
**ఆ కోరిక తీర్చెద నని రాముడు మాట ఇచ్చుట.**

మహాబాహువైన రాముడు బంగారముచేత అలంకరింపబడిన పుష్పకమును పంపివేసి సంతోషముతో అశోకవనములో ప్రవేశించెను. ఆ అశోకవనము చుట్టూ చందన-అగరు-చూత-పునాగ-రక్తచందన-దేవదారు వృక్షములు ఉండి దాని శోభను ఇనుమడింపచేయుచుండెను. చంపక-అశోక-పునాగ-మధూక-పనస-అసన వృక్షములు, ధూమము లేని అగ్నివంటి కాంతిగల పారిజాతవృక్షములు ప్రకాశవంతము చేయుచుండెను. అది లోధ్ర-నీప-అర్జున వృక్షములతోను, నాగవృక్షములతోను, ఏడాకుల అరటిచెట్లతోను, బండిగురివెంద తీగలతోను, మందారవృక్షములతోను, అరటితోపులతోను, తీగలతోను వ్యాకులమై ఉండెను. ప్రియంగు-కదంబ-వకుల-జంబూ-కోవిదార వృక్షములతో శోభించుచుండెను. ఆ వృక్షములు ఎల్లప్పుడు పుష్పములతో, ఫలములతో నిండి మనోహరములై ఉండెను. దివ్యమైన రసము, గంధమూ గల అవి అంకురములతోను, చిగుళ్ళతోను నిండి ఉండెను. అక్కడ ఉన్న దివ్యములైన చెట్లను శిల్పులు (ఉద్యానసంరక్షకులు), చూచుటకు అందముగా ఉండునట్లు కొమ్మలు మొదలైనవి కత్తిరించి ఏర్పరిచిరి. అవి అందమైన చిగుళ్ళతోను, పుష్పములతోను నిండి మదించిన తుమ్మెదలతో వ్యాకులమై; కోకిలలతోను, శ్రేష్ఠములైన తుమ్మెదలతోను, అనేకవర్ణములు గల పక్షులతోను, శోభించుచుండెను. వందలకొలది చూతవృక్షములు అగ్రభాగములందున్న పూలగుత్తులతో చిత్రవర్ణముగా ఉండెను. అక్కడ కొన్ని చెట్లు బంగారముతో సమానముగాను, మరికొన్ని అగ్నిజ్వాలలతో సమానముగాను, ఇంకను కొన్ని నల్లని కాటుకతో సమానముగాను ప్రకాశించుచుండెను.(1-9)

అక్కడ పరిమళించుచున్న పుష్పములు, అనేకవిధములైన మూలికలు, మంచి ఉదకముతో నిండిన, అనేక ఆకారములు గల దిగుడుబావులూ ఉండెను. ఆ దిగుడుబావుల మెట్లు మాణిక్యములతో నిర్మించిరి. వాటి మధ్య ఉన్న చపటాలు స్ఫటికమాణిక్యములతో నిర్మించిరి. వికసించిన పద్మముల సముదాయము, కలువలు, చక్రవాకపక్షులు వాటిని శోభింపచేయుచుండెను. అవి నీటికాకులు, చిలుకలు, హంసలు, సారసపక్షులు చేయు ధ్వనులతో మారుమ్రోగుచుండెను. తీరములమీద ఉన్న పువ్వులతో విచిత్రవర్ణములైన వృక్షములు వాటి శోభను పెంచుచుండెను.

సంచరించగలను."(1-10)

రాముడు మరల వచ్చిన ఆ పుష్పకవిమానము పలికిన మాటలు విని దానిని చూచి - "ఓ! పుష్పకమా! అట్టివచో నీకు స్వాగతమగుగాక. కుబేరుడు అంగీకరించినాడు గాన నిన్ను ఉపయోగించుకొన్నను మా నడవడికలో తప్పు ఉండదు." అని ఆ పుష్పకమును లాజలతోనూ, పువ్వులతోను, ధూపములతోను, సువాసన ద్రవ్యములతోను పూజించి "నీవు వెళ్ళుము; నేనెప్పుడు స్మరింతునో అప్పుడు రమ్ము. సౌమ్యా! సిద్ధుల సంచారమునందు అడ్డము తగలకుము. యథేష్టముగా దిక్కులయందు సంచరించుచున్న నీకు ఏ అడ్డూ లేకుండుగాక" అని పలికెను. రామునిచేత పూజించి విడువబడిన ఆ పుష్పకము "అట్లే అగుగాక" అని పలికి ఆ ప్రదేశమునుండి తన కిష్టమైన దిక్కునకు వెళ్ళెను.(11-15)

పుణ్యస్వరూపమైన ఆ పుష్పకము అంతర్ధానము చెందిన పిమ్మట భరతుడు అంజలి ఘటించి రామునితో ఇట్లు పలికెను - "ఓ! వీరుడా! దేవతాస్వరూపుడవైన నీవు పరిపాలించుచుండగా మనుష్యభిన్నములైన ప్రాణులు కూడా మాటిమాటికి మాటలాడుచు కనబడుచున్నవి. రామా! నీవు రాజ్యమునకు వచ్చి ఒక మాసము కంటె కొంచెము ఎక్కువ అయినది. మర్త్యులలో అనారోగ్యము లేదు. జీర్ణమైపోయిన (ముసలి) ప్రాణులకు కూడ మృత్యువు వచ్చుటలేదు. స్త్రీలు రోగములు లేని సంతానమును కనుచున్నారు. పురుషులు శరీరసౌష్ఠవముతో ఉన్నారు. పురమునందు నివసించుచున్న జనులు చాల సంతోషముతో ఉన్నారు. మేఘము యుక్తకాలమునందు అమృతము వంటి ఉదకమును వర్షించుచున్నది. వాయువులు కూడ స్పర్శకు సుఖకరములై; మంగళప్రదములై వీచుచున్నవి. నరులకు ప్రభువైన ఓ! రాజా! మాకు చిరకాలము ఇట్టి రాజు ఉండు గాక అని పురములో నివసించువారు, గ్రామనివాసులైన ప్రజలు కూడ అనుచున్నారు." భరతుడు పలికిన మధురములైన ఈ మాటలు విని రాజశ్రేష్ఠుడైన రాముడు చాల సంతోషించెను.(16-22)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబది ఒకటవ సర్గము సమాప్తము.**

అప్పుడు రాముణ్ణి విడచుచున్న వాళ్ళందరూ డగ్గుత్తిక చేత అస్పష్టముగా మాటలాడుచు కన్నీళ్ళతో నిండిన నేత్రములతో మనస్సులు పనిచేయక దుఃఖము చేత ఏమీ తోచని స్థితిలో ఉండిరి. మహాత్ముడైన రాముని అనుగ్రహమును ఈ విధముగా పొందిన ఆ వానరరాక్షసాదు లందరూ, దేహమును విడచిపోవుచున్న జీవుడువలె తమ తమ గృహములకు వెళ్ళిరి. అప్పుడు ఆ రాక్షస-భల్లూక-వానరులు రఘువంశమును వృద్ధి పొందించువాడైన రామునికి నమస్కరించి వియోగదుఃఖముచే కలిగిన కన్నీళ్ళతో నిండిన నేత్రములతో, ప్రవాసమునకు వెళ్ళుచున్నవారు వలె, తమ గృహములకు తిరిగి వెళ్ళిరి.(29-31)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నలుబదవ సర్గము సమాప్తము.**

# నలుబది ఒకటవ సర్గము

## కుబేరుడు పంపగా వచ్చిన పుష్పకమును రాముడు మరల పంపివేయుట. భరతుడు రామరాజ్యములోని అద్భుతప్రభావములను వర్ణించి చెప్పుట.

రాముడు భల్లూక-వానర-రాక్షసులను పంపివేసి, సోదరులతో సుఖవంతుడై ఆనందించెను. అతడు సోదరులతో కూర్చొని ఉండగా అపరాహ్ణసమయమునందు ఆకాశమునుండి మధురమైన వాక్కు వినిపించెను- "సౌమ్యుడా! రామా! నన్ను అనుగ్రహపూర్వకముగా చూడుము. ఓ! ప్రభూ! నేను కుబేరుని భవనమునుండి వచ్చిన పుష్పకమును అని తెలుసుకొనుము. రామా! నీ ఆజ్ఞ ప్రకారము కుబేరుని సేవించుటకై అతని భవనమునకు వెళ్ళితిని. అతడు నాతో- "మహాత్ముడైన రాముడు రావణుణ్ణి యుద్ధములో చంపి నిన్ను జయించుకొనినాడు. దురాత్ముడైన ఆ రావణుడు, అతని పరివారము, పుత్రులు, బంధువులు చంపబడుటచే నేను కూడ సంతోషిస్తున్నాను. పరమాత్ముడైన రాముడు లంకలో నిన్ను జయించుకొనినాడు. అందువలన, ఓ సౌమ్యా! నీవు ఆ రాముణ్ణే మోయుము. నేను నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. నీవు లోకములను అన్నింటినీ నడిపించే ఆ రాముణ్ణి మోయవలె నని నా కోరిక. అందుచేత ఏమాత్రము మనస్తాపము లేక వెళ్ళుము" అని చెప్పెను. నేను మహాత్ముడైన కుబేరుని ఆజ్ఞను అనుసరించి నీవద్దకు వచ్చినాను. ఏ మాత్రము సందేహము లేనివాడవై నన్ను స్వీకరింపుము. కుబేరుని ఆజ్ఞచేత ఏ భూతములూ కూడ నన్ను ఎదిరింపజాలవు. నేను ఇపుడు నీ ఆజ్ఞను అనుసరించి ప్రభావముతో

బాధలు లేనివాడవై వెళ్ళుము" అని పలికెను. రాముని మాటలు విని ఋక్ష-వానర-రాక్షసులు "బాగు బాగు" అని మాటిమాటికీ ఆతనిని ప్రశంసించుచు "మహాబాహో! రామా! నీ బుద్ధి, అద్భుతమైన వీర్యము, గొప్ప మాధుర్యము ఇవి బ్రహ్మయొక్క బుద్ధ్యాదుల వలె స్థిరమైనవి" అని పలికిరి.(9-14)

హనుమంతుడు వంగి నమస్కరించుచు రామునితో- "రాజా! నాకు నీపై నిత్యమూ గొప్ప స్నేహము, స్థిరమైన భక్తి ఉండుగాక. నా భావము మరొకవైపు ఎటూ వెళ్లకుండుగాక. ఓ! వీరుడా! ఈ భూలోకములో నీ చరిత్ర వ్యాప్తిలో ఉండువరకు నా శరీరములో ప్రాణములు ఉండగలవు. సందేహము లేదు. ఓ రఘునందనా! నరశ్రేష్ఠా! రామా! దివ్యమైన నీ చరితమును, కథను అప్సరఃస్త్రీలు నాకు వినిపించుచుందురు గాక. ఓ! ప్రభూ! మహావీరా! నేను నీ చరితామృతమును విని దానిచేత నా బెంగను గాలి మేఘపంక్తిని చెల్లాచెదురు చేసినట్లు, తొలగించుకొనెదను." అని పలికెను.(15-19)

హనుమంతుడు ఇట్లు అనుచుండగా రాముడు సింహాసనమునుండి లేచి అతనిని కౌగిలించుకొని స్నేహపూర్వకముగా- "వానరశ్రేష్ఠా! నీవు కోరిన విధముగా జరుగగలదు. సంశయములేదు. నా కథ లోకములో ఎంతవరకు ప్రచారములో ఉండునో అంతవరకు నీ కీర్తి స్థిరముగా ఉండగలదు. నీ శరీరములో ప్రాణములు ఉండగలవు. ఈ లోకము లున్నంతవరకు నా కథ ఉండగలదు. హనుమంతుడా! నీవు చేసిన ఒక్కొక్క ఉపకారానికి నేను ప్రాణములు ఇచ్చెదను. కాని మిగిలిన ఉపకారాలకు నీకు ఋణపడియే ఉందును. హనుమంతుడా! నీవు నాకు చేసిన ఉపకారము నా శరీరమునందే జీర్ణమైపోవుగాక. నరుడు ఆపదలు వచ్చినప్పుడే ప్రత్యుపకారమునకు తగినవాడగును. అందుచేత నీకు ఏనాటికైన ప్రత్యుపకారము చేసి నీ ఋణము తీర్చుకొనెదను అని నేను అనను" అని పలికెను.(20-24)

పిమ్మట రాముడు తన కంఠమునుండి చంద్రుని వంటి కాంతి గల వైడూర్యము మధ్యమణిగా ఉన్న హారమును తీసి హనుమంతుని మెడలో కట్టెను. వక్షఃస్థలముపై కట్టిన ఆ గొప్ప హారముతో హనుమంతుడు శిఖరముమీద చంద్రుడు ఉన్న మేరుపర్వతము వలె ప్రకాశించెను. గొప్పబలము గల ఆ వానరులు రాముని మాటలు విని లేచి శిరస్సుచేత అతని పాదములకు నమస్కరించి బయలుదేరిరి. రామునిచే గాఢముగా ఆలింగనము చేసికొనిన సుగ్రీవుడు, ధర్మాత్ముడైన విభీషణుడు అందరూ కూడ కన్నీటితో వ్యాకులత్వము చెందిరి.(25-28)

రాక్షసులతోను, గొప్ప బలము గల భల్లూకములతోను సుఖముగా కాలము గడపెను. అన్ని విధాల సంతోషముతో ఉన్న వానరులకు, రాక్షసులకు ఈ విధముగా రెండవదైన శిశిరర్తువుకు సంబంధించిన మాసము సుఖముగా గడచెను. రమ్యమైన అయోధ్యానగరమునందు గొప్ప ఆనందమును అనుభవించుచున్న ఆ వానరాదులకు ఆ కాలము, రాముడు ప్రేమపూర్వకముగా చూపు ఆదరాదులచే సుఖముగా గడచెను.(26-30)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# నలుబదవ సర్గము

## రాముడు సుగ్రీవాదివానరులను, విభీషణాదిరాక్షసులను సన్మానించి వారి వారి దేశములకు పంపుట.

ఆ భల్లూకవానరరాక్షసులు ఆ విధముగా నివసించుచుండగా, రాముడు సుగ్రీవునితో– "సౌమ్యుడా! సురాసురులకు కూడ ఎదిరింపశక్యము కాని కిష్కింధకు వెళ్ళి, అమాత్యసహితుడవై తొలగింపబడిన శత్రుబాధ గల రాజ్యమును పాలించుము. ఓ! మహాబాహూ! అంగదుణ్ణి, హనుమంతుణ్ణి, మహాబలశాలియైన నలుణ్ణీ ప్రేమతో చూచుకొనుము. నీ మామయైన సుషేణుణ్ణి, తార-కుముద-నీల-శతబలి-మైంద-ద్వివిద-గజ-గవాక్ష-శరభులను, ఎదిరింపశక్యము కాని మహాబలశాలియైన భల్లూకరాజు జాంబవంతుణ్ణీ, గంధమాదనుణ్ణీ ప్రేమగా చూచుకొనుము. విక్రమవంతుడైన ఋషభుణ్ణి, సుపాటల-కేసరి-శరభ-శంఖచూడులను, నాకోసమై ప్రాణాలకు తెగించిన మహాత్ముల నందరినీ ప్రేమతో చూచుకొనుము. వీళ్ళకు అప్రియము చేయకుము అని(1-8)

పలికి, మాటిమాటికి అతనిని కౌగిలించుకొనెను– పిమ్మట విభీషణునితో మధురముగా "రాజా! లంకను ధర్మమును అనుసరించి పాలింపుము. నీవు ధర్మము తెలిసినవాడవు అని నేను, నీ పట్టణములోని ప్రజలు, రాక్షసులు, నీ సోదరుడైన కుబేరుడు నమ్ముతున్నాము. నీవు ఎన్నడూ కూడ నీ బుద్ధిని అధర్మముమీద ఉంచకుము. మంచి బుద్ధిగల రాజులే తప్పక భూమిని అనుభవింతురు. రాజా! నీవు నిత్యము సుగ్రీవుణ్ణి నన్నూ స్నేహపూర్వకముగా జ్ఞాపకము ఉంచుకొనుము. ఏ

పంపిరి. భరతలక్ష్మణశత్రుఘ్నులు ఆ రత్నములను తీసికొని తమ నగరమునకు తిరిగి వచ్చిరి. ఆ పురుషశ్రేష్ఠులైన భరతాదులు రమ్యమైన అయోధ్యాపురము చేరి విచిత్రములైన ఆ రత్నములను రామునకు సమర్పించిరి. మహాత్ముడైన రాముడు ఆ కానుక లన్నీ తీసుకొని సంతోషపూర్వకముగా వాటిని తన కార్యము సాధించి పెట్టిన సుగ్రీవునకు ఇచ్చెను. రాముడు విభీషణునకు, ఇతరులకు, ఎవరి సాహాయ్యముచేత తనకు జయము లభించినదో అట్టి రాక్షసులకు వానరులకు కూడ ఇచ్చెను. గొప్ప బలము గల ఆ వానరులు, రాక్షసులు అందరూ కూడ రాముడిచ్చిన రత్నాలను తలలమీదా బాహువులమీదా ధరించిరి.(7-15)

రాముడు హనుమంతుణ్ణీ మహాబాహువైన అంగదుణ్ణీ ఒడిలో కూర్చుండబెట్టుకొని (దగ్గరకు చేరదీసి) సుగ్రీవునితో ఇట్లు పలికెను-(16)

వానరరాజా! ఈ అంగదుడు నీ సుపుత్రుడు. ఈ హనుమంతుడు నీ మంత్రి. నీ ఆలోచనల ప్రకారము ప్రవర్తించు వీరిద్దరూ నా హితమును కూడ కోరువారు. నిన్ను పట్టి వీళ్ళు అనేక విధములైన సత్కారములు పొందతగినవారు. గొప్పకీర్తి గల రాముడు ఇట్లు పలికి, తన శరీరమునుండి అమూల్యములైన ఆభరణములు తీసి అంగదహనుమంతులకు కట్టెను. నరులలో శ్రేష్ఠుడైన రాముడు గొప్ప పరాక్రమముగలవారు, వానరయూథనాయకులు అయిన నీల-నల-కేసరి-కుముద -గంధమాదన-సుషేణ-పనస-మైంద-ద్వివిద-జాంబవంతులను, గవాక్ష-వినత-ధూమ్ర-వలీముఖ-ప్రజంఘ-సంనాద- మహాబల-దరీముఖ-దధిముఖ-ఇంద్రజానులను వేరువేరుగా పలకరించి, నేత్రములతో త్రాగుచున్నాడా అన్నట్లు చూచుచు - "ఓవానరులారా! మీరు నాకు మిత్రులు; నా దేహమువంటివారు; నా సోదరులు; మీరే నన్ను ఆపదనుండి ఉద్ధరించినారు. మీరు ఉత్తమమిత్రులుగా ఉన్న సుగ్రీవుడు ధన్యుడు" అని మధురముగా మృదువైన మాటలు పలికి తగు విధముగా అలంకారములు, అమూల్యములైన వజ్రములు బహూకరించి కౌగిలించుకొనెను.(17-25)

ఆ వానరులు మంచి వాసన గల మధువులను త్రాగుచు పరిశుద్ధములైన మాంసములను, మూలములను, ఫలములను తినుచు నివసించిరి. వాళ్ళు ఈ విధముగా నివసించుచుండగా కొంచెము అధికమైన మాసము గడచెను. కాని రామభక్తిగల వాళ్ళకు మాత్రము ఆ కాలము ముహూర్తమువలె ఉండెను. రాముడు కూడా స్వేచ్ఛారూపధారులైన ఆ వానరులతోను, గొప్ప పరాక్రమము గల

ఓ! మహాబాహూ! మేము సెలవుతీసికొని వెళ్ళుచున్నాము. నీవు ఎల్లప్పుడూ మా హృదయములలో ఉన్నావు. మేము గొప్ప ప్రేమతో ఇక్కడ ఉంటిమి. మహారాజా! నీకు ఎల్లప్పుడూ మా యందు స్నేహభావము ఉందుగాక." అని పలికిరి. "తప్పక అట్లే" అని రాముడు పలుకగా ఆ రాజు లందరూ చాలా సంతోషించుచు, వెళ్ళుటకు సిద్ధమైనవారై, దోసిళ్ళు కట్టి రామునితో వెళ్లెద మని చెప్పి, అతనిచే పూజింపబడినవారై తమ తమ దేశములకు వెళ్ళిరి.(27-32)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# ముప్పది తొమ్మిదవ సర్గము

**రాముడు తన మిత్రులైన వానరాదులకు కానుకలు ఇచ్చుట.**

మహాత్ములైన ఆ రాజులు సంతోషించి, వేలకొలది ఏనుగుల, గుఱ్ఱముల సముదాయములచేత భూమిని కంపింపచేయుచు వెళ్ళిరి. రామునికి సహాయముగా వెళ్ళుటకై, భరతుని ఆజ్ఞచేత ఉత్సాహముతో కూడిన సైన్యములు, వాహనములూ గల అక్షౌహిణులు అక్కడ ఉండెను. బలగర్వముతో ఆ రాజులు - "రామా! యుద్ధములో రావణుడు మా ఎదుట నిలిచి ఉండగా కనబడలేదు.(కనబడినచో ఏమి చేసి ఉండేవారమో!) భరతుడు మమ్ములను పని అంతా అయిపోయిన తరువాత వ్యర్థముగా తీసికొని వచ్చినాడు. ముందు వచ్చినచో రాజులు నిఃసంశయముగా, రాక్షసులను వెంటనే చంపి ఉండేవారు. రామలక్ష్మణుల బాహుపరాక్రమముచేత రక్షింపబడుచు, ఏ భయమూ లేకుండగా సముద్రము ఆవలి ఒడ్డున సుఖముగా యుద్ధముచేసి ఉండేవారము." అనిరి. వేలకొలది రాజులు ఈ కథలను, మరి ఇతరకథలను చెప్పుకొనుచు సంతోషముతో తమ తమ రాజ్యములకు వెళ్ళిరి.(1-6)

ఆ రాజులు ప్రసిద్ధములు, సమృద్ధములు, ఆనందభరితములు, ధన ధాన్య సమృద్ధములు, పరిపూర్ణములు, ధనము గలవి అయిన, తాము విడిచి వచ్చినప్పుడు ఎట్లు ఉండెనో అట్లే ఉన్న తమ రాజ్యములకు వెళ్ళి రామునికి ప్రియము చేయుటకై అనేకవిధములైన రత్నములను కానుకగా పంపిరి. గుఱ్ఱములు, వాహనములు, రత్నములు, మదముచేత తీవ్రముగా ఉన్న ఏనుగులు, ముఖ్యములైన చందనములు, దివ్యములైన అలంకారములు, మణులు, ముత్యములు, పొగడములు, రూపవతులైన దాసీలు, అనేకవిధములైన మేకల గొఱ్ఱెల మందలూ, చాలా రకములైన అనేకరథములు

రత్నములూ తీసికొని లక్ష్మణుడు నీ వెనుక రాగలడు". అని పలికెను.(6-12)

యుధాజిత్తు గమనమును గూర్చి అంగీకరించి "రత్నములు అక్షయమైన ఈ ధనము కూడ నీవద్దనే ఉండుగాక" అని పలికెను. ముందుగా రాముడు యుధాజిత్తునకు ప్రదక్షిణనమస్కారములు చేసెను. పిమ్మట యుధాజిత్తు రామునకు ప్రదక్షిణము చేసి బయలుదేరెను. వృత్రసంహారానంతరము దేవేంద్రుడు విష్ణువుతో కలసి వెళ్ళినట్లు సహాయుడుగా వచ్చిన లక్ష్మణునితో కలసి కేకయదేశరాజు వెళ్ళెను. రాముడు యుధాజిత్తును పంపివేసిన పిమ్మట, తన మిత్రుడు, ఎవరికీ భయపడనివాడూ అయిన కాశిరాజైన ప్రతర్దనుణ్ణి కౌగిలించుకొని- రాజా! నీవు ప్రేమను, గొప్ప స్నేహమును చూపినావు. భరతునితో కలసి రాజ్యపాలనాదికార్యములను నిర్వహించినావు. ఓ కాశిరాజా! అందువలన నీచేత రక్షింపబడుచున్న మంచి ప్రాకారములు, ముఖద్వారములూ ఉన్న సుందరమైన వారణాసికి వెళ్ళుము" అని పలికెను. ధర్మాత్ముడైన రాముడు ఇట్లు పలికి సింహాసనమునుండి లేచి అతనిని గాఢముగా కౌగిలించుకొని అతనిని పంపివేసెను. రాముని ఆజ్ఞపొంది, ఎవరికీ భయపడని ఆ కాశీరాజు, శీఘ్రముగా వారణాసికి వెళ్లెను.(13-20)

రాముడు ఆ కాశీరాజును పంపివేసిన తరువాత మూడువందలమంది రాజులను కలిసికొని నవ్వుచు మధురమైన మాటలతో- "మీ తేజస్సుచే స్నేహమునకు ఎట్టి ఒడుదుడుకులూ లేకుండ రక్షింపబడినది. మీలో ధర్మమూ, సత్యమూ కూడా నిత్యము స్థిరముగా ఉన్నవి. మహాత్ములైన మీ ప్రభావముచేత, తేజస్సుచేతా, దురాత్ముడూ, దుర్బుద్ధి కలవాడు, రాక్షసాధముడూ అయిన రావణుడు చంపబడినాడు. రావణుడు, వాని సైన్యము, వాని పుత్రులు, అమాత్యులు బంధువులు యుద్ధములో మీ తేజస్సుచేతనే చంపబడినారు. నేను కేవలం నిమిత్తము మాత్రమే. అరణ్యమునుండి సీత అపహరించబడినట్లు విని మహాత్ముడైన భరతుడు మిమ్ములను అందరినీ పిలిపించినాడు. యుద్ధోద్యుక్తులై మీరందరూ వచ్చి చాల కాలము గడిచిపోయినది. అందుచేత మీరందరూ తిరిగి వెళ్ళుట మంచిదని అనుకొనుచున్నాను" అని పలికెను.(21-26)

ఆ రాజులు చాలా సంతోషించుచు - "రామా! అదృష్టవశముచేత నీవు విజయము పొందినావు. రాజ్యము నిలిపినావు. అదృష్టవశముచేత శత్రువును ఓడించి సీతను తీసికొనివచ్చినావు. రామా! శత్రువులను సంహరించి విజయవంతుడవైన నిన్ను చూడగల్గుచున్నాము. ఇదియే మా గొప్ప కోరిక. ఇదియే మా గొప్ప సంతోషము. ప్రశంసలకు తగిన రామా! నీవు మమ్ములను ప్రశంసించుచున్నావు. ఇది నీకే తగును. ఇట్టి ప్రశంసలను పలుకుట మే మెరుగము.

నేత్రములతో అందరూ రామునివైపే చూచుచుండిరి.(57-60)

పిమ్మట గొప్ప తేజస్సు గల అగస్త్యుడు రామునితో - "రామా! మాకు దర్శనమిచ్చి మమ్ములను గౌరవించినావు. ఇక మేము వెళ్ళెదము" అని పలికెను. ఇట్లు పలికి అందరూ పూజింపబడినవారై వచ్చినట్లుగానే తిరిగి వెళ్ళిరి.(61)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# ముప్పది ఎనిమిదవ సర్గము

## రాముడు చేసిన సత్కారములు అందుకొని జనకాదులు తమ తమ దేశములకు వెళ్ళుట.

మహాబాహువైన రాముడు ఈ విధముగా ప్రతిదివసమునందు పౌరజానపదులను వారి వారి కర్తవ్యములయందు నియమించుచు ఉండెను. కొన్ని రోజులు గడిచిన పిమ్మట రాముడు అంజలి ఘటించి మిథిలాధిపతి యైన జనకునితో "రాజా! నీవే మాకు అచంచలమైన ఆశ్రయము. నీచేతనే మేము పాలించబడినాము. ఉగ్రమైన నీ తేజస్సుచేతనే నేను రావణుణ్ణి చంపగలిగితిని. ఇక్ష్వాకువంశీయులకూ మిథిలారాజులకూ మధ్య అన్ని ప్రకారములచేతను వియ్యము మొదలైన ప్రేమలు సాటిలేనివిగా ఉన్నవి. అందువలన ఓ రాజా! నేను బహూకరించిన రత్నములు స్వీకరించి నీవు నీ నగరమునకు వెళ్ళుము. నీకు సహాయుడుగా భరతుడు నీ వెనుకనే రాగలడు." అని పలికెను!(1-5)

జనకుడు 'అట్లే' అని ప్రయాణమై రామునితో "రామా! నీ దర్శనము చేతా, నీతిచేతా చాలా సంతోషించినాను. రాజా! నీవు నాకోసమై ఇచ్చిన ఈ రత్నములను, శ్రేష్ఠమైన వస్తువులు, మణులు మొదలైనవాటిని అన్నింటినీ నా ఇద్దరు కుమార్తెలకు ఇచ్చుచున్నాను." అని పలికి శ్రీమంతుడైన జనకుడు సంతోషించిన మనస్సుతో రామునకు అనుజ్ఞ ఇచ్చి మిథిలకు వెళ్ళెను. జనకుడు వెళ్ళిన పిమ్మట రాముడు అంజలి ఘటించి మేనమామయైన కేకయరాజుతో(యుధాజిత్తుతో) వినయపూర్వకముగా- "పురుషశ్రేష్ఠుడవైన ఓ! రాజా! ఈ రాజ్యము, నేను, భరతుడు, లక్ష్మణుడూ కూడ నీమీద ఆధారపడినవాళ్ళము. నీవే మాకు గతివి. రాజా! వృద్ధుడైన రాజు నీ నిమిత్తము తాపము చెందుచుండును. అందువలన నీవు నేడే బయలుదేరి వెళ్ళుట మంచి దని నా అభిప్రాయము. అధికమైన ధనము, అనేకవిధములైన

పద్మాదులను ధరించిన, సర్వదేవతల చేతను నమస్కరింపబడు, శ్రీవత్సమనే పుట్టు మచ్చ గల, ఇంద్రియములకు అధిపతి అయిన, సర్వదేవతలచేత పూజింపబడు, పద్మము నాభియందు ఉన్న, గొప్ప యోగివైన, భక్తులకు అభయమిచ్చు ఆ నారాయణుడవు. నీవు రావణుని సంహరించుటకొరకు మానుషరూపము ధరించినావు. "నేను నారాయణుడను" అని నీవు తనను గూర్చి ఎందుకు తెలుసుకొనుటలేదు? మహాభాగ్యవంతుడైన రామా! మోహము చెందకుము. నిన్ను గూర్చి స్వయముగానే తెలిసికొనుము. నీవు రహస్యములలో పరమరహస్యము అని బ్రహ్మదేవుడే చెప్పినాడు కదా?(44-47)

ఓ! రాక్షససంహారకా! నీవు మూడు గుణములను నియమించువాడవు. మూడు కాలములు (భూత-వర్తమాన-భవిష్యత్తులు) తెలిసినవాడవు. మూడు అడుగులచేత బలిరాజ్యము నంతను హరించినవాడవు. మూడు కాలములందు జరుగు పనులు నడిపించువాడవు. మూడు వేదములచేత ప్రతిపాదించబడువాడవు. పూర్వము మూడు అడుగులచేత మూడులోకాలను ఆక్రమించినావు. బలిని బంధించుటకై దేవేంద్రుని తమ్ముడవుగా అదితిగర్భమునందు పుట్టినావు. నీవు సనాతనుడవైన విష్ణుమూర్తివి కదా? లోకములను అనుగ్రహించుటకే మనుష్యశరీరము దాల్చినావు. దేవతాశ్రేష్ఠుడా! ఈ దేవతాకార్యమును సాధించినావు. పాపాత్ముడైన రావణుణ్ణీ వాని పుత్ర-పరివార-బంధువులనూ చంపినావు. దేవతల అధీశ్వరుడా! దేవతలు, తపోధనులైన ఋషులు అందరూ సంతోషించినారు. నీ అనుగ్రహము వలన సకలజగత్తూ ప్రశాంతముగా ఉన్నది. మహాభాగ్యవంతురాలైన లక్ష్మీదేవి భూతలమునుండి సీతగా ఆవిర్భవించినది. ఓ! ప్రభూ! ఈమె నీకోసమే జనకుని గృహములో జన్మించినది. గొప్ప కీర్తిగల రామా! రావణుడు సీతను తీసికొనివచ్చి తల్లిని వలె ప్రయత్నపూర్వకముగా రక్షించినాడు. ఈ విషయము నంతనూ ఈ విధముగా నీకు చెప్పినాను. నాకీ కథ దీర్ఘజీవియైన నారదమహర్షి చెప్పినాడు. సనత్కుమారుడు రావణునకు ఎట్లు చెప్పెనో అతడు శీఘ్రముగా, అంతా ఆ విధముగానే చేసినాడు. విద్వాంసుడు బ్రాహ్మణసంనిధిలో శ్రాద్ధసమయమునందు దీనిని వినిపించినచో ఆ శ్రాద్ధమునందు ఇచ్చిన అన్నము అక్షయమై పితృదేవతలకు చేరును.(48-56)

పద్మపత్రాక్షుడైన రాముడు, అతని సోదరులూ కూడ దివ్యమైన ఈ కథ విని చాల ఆశ్చర్యము చెందిరి. సుగ్రీవాదివానరులు, విభీషణాది రాక్షసులు, రాజులు, వారి అమాత్యులు, అక్కడికి చేరిన ఇతరులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ధార్మికులైన శూద్రులు, అందరూ కూడ ఆనందపరవశులయిరి. వికసించిన

పారిపోయిరి. (24-26)

రావణుడు బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకమును, ఆ రాక్షసులను కూడ విడచివేసెను. రామా! పుష్పకము వెళ్ళిపోయినది. రాక్షసులు ఎవ్వరూ దగ్గరలేని ఆ రావణుడు చాలా భయంకరమైన రూపము ధరించి అప్పుడు ఆ శ్వేతద్వీపములో ప్రవేశించెను. అతడు అక్కడ ప్రవేశించిన వెంటనే అతనిని అక్కడ ఉన్న స్త్రీలు చూచిరి. ఒక స్త్రీ చిరునవ్వు నవ్వుచు వానిని చేతితో పట్టి లేవదీసి "నీవు ఎందుకు వచ్చినావు? నీవు ఎవ్వడవు? ఎవని పుత్రుడవు? ఎవరు పంపినారు? చెప్పుము" అని అతని రాకను గూర్చి ప్రశ్నించెను. రామా! ఆ మాటలకు కోపించిన రావణుడు - "నేను విశ్రవసుని పుత్రుడనైన రావణు డను రాక్షసుడను. యుద్ధము చేయుటకై ఇక్కడికి వచ్చినాను. కాని ఇక్కడ పురుషు డనెడువా డెవ్వడూ కనబడుటలేదు." అనెను. (27-32)

దురాత్ముడైన రావణుని మాటలు విని ఆ స్త్రీలు అందరూ పకపకా నవ్విరి. ఆ స్త్రీలలో ఒక స్త్రీ కోపముతో వానిని చిన్న పిల్లవానిని వలె అనాయాసముగా పట్టుకొని, నడుము దగ్గర పట్టి సఖురాళ్ళ మధ్య త్రిప్పెను. ఆమె మరొక సఖురాలిని పిలిచి "పది ముఖాలు, ఇరవై చేతులూ ఉన్న కాటుక రంగు పురుగును పట్టుకొన్నాను, చూడుము" అని చెప్పెను. ఒక స్త్రీ చేతినుండి మరొక స్త్రీ చేతిలోనికి విసరుటచే అలసిపోయిన బలవంతుడు, తెలివిగలవాడు అయిన ఆ రావణుడు ఆ విధముగా కొంతసేపు జరిగిన పిమ్మట కోపముతో ఒక స్త్రీ చెయ్యి కరచెను. ఆమె చేతియందు నొప్పిచేత దులిపి ఆ అశుభమైన పురుగును క్రింద పడవేసెను. మరొక స్త్రీ వానిని తీసుకొని ఆకాశమార్గమున ఎగిరెను. అతడు కోపముతో ఆమెను కూడ గోళ్ళతో ఎక్కువగా చీరెను. వెంటనే ఆమె దులిపివేయగా ఆ రాక్షసుడు భయవ్యాకులుడై సముద్రజలమధ్యమునందు పడెను. ఆమె ఈ విధముగా దులిపివేయగా అతడు వజ్రముచేత చీల్చబడిన పర్వతమువలె సముద్రజలములో పడెను. రామా! ఈ విధముగా శ్వేతద్వీపములో నివసించు స్త్రీలు ఆ రావణుడ్ని పట్టుకొని ఇటు అటూ విసిరివేసిరి. (33-41)

గొప్ప తేజస్సు గల నారదుడు అవమానింపబడిన రావణుని వద్దకు వెళ్ళి, చాలా ఆశ్చర్యము ప్రకటించుచు బిగ్గరగా నవ్వి నృత్యము చేసెను. ఓ మహాబాహూ! దురాత్ముడైన రావణుడు ఇందువలననే, నీనుండి మరణము పొందవలె నను కోరికతో సీతను కావలెనని అపహరించినాడు. నీవే శంఖ-చక్ర-గదా-శార్ఙ్గ-



ఆసక్తులై అతనిని గూర్చియే ఆలోచించుచు, అతడే ఉత్తమగతియని నమ్మి అతనిని ఒక్కనినే సేవించుచుందురు. అక్కడి నరులు నారాయణునిమీదనే చిత్తము నిలిపి అతనికే ప్రాణములు సమర్పించి సేవించుచుందురు. ఆ మహాత్ములు శ్వేతద్వీపమునందు నివాసమును (పుణ్యముచేత) సంపాదించుకొనినారు. లోకముల ప్రభువైన ఆ నారాయణుడు శార్ఙ్గమును వంచి గాని, చక్రాయుధము ప్రయోగించిగాని ఎవరిని చంపునో వారికి స్వర్గమునందే నివాసము లభించును. నాయనా! ఆ లోకమును యజ్ఞములచేతగాని, తపస్సులచేతగాని, నియమములచేతగాని, ముఖ్యములైన దానములచేతగాని ఎవ్వరూ అనాయాసముగా పొందజాలరు." (10–17)

దశగ్రీవుడైన రావణుడు నారదుని మాటలు విని చాలా ఆశ్చర్యముచెంది, నేను ఆ నారాయణునితో యుద్ధము చేసెదను. అని చాలాసేపు ఆలోచించి నారదుని అనుమతి గైకొని శ్వేతద్వీపమునకు వెళ్ళెను. నారదుడు కూడ చాలాసేపు ఆలోచించి, వేడుక కలవాడై అత్యాశ్చర్యకరమైన ఆ విషయమును చూడదలచినవాడై శీఘ్రముగా శ్వేతద్వీపమునకు వెళ్ళెను. నారదునకు యుద్ధ మన్న చాలా ఇష్టము. నిత్యమూ పరిహాసము చేయుచుండును. రావణుడు కూడ గొప్ప సింహనాదముచేత పది దిక్కులను చీల్చివేయుచు రాక్షసులతో కలసి అక్కడికి వెళ్ళెను. నారదుడు అచటికి వెళ్ళిన తరువాత గొప్ప కీర్తి గల రావణుడు కూడ దేవతలకు కూడ పొందశక్యము కాని ఆ శ్వేతద్వీపమును చేరుకొనెను. బలవంతుడైన ఆ రావణుని వాహనమైన పుష్పకము, ఆ ద్వీపము తేజస్సుచేత, వాయువేగముచేత కొట్టబడినదై, గాలిచేత ఎరుగగొట్టబడిన మేఘము వలె నిలబడలేకపోయెను.(18–23)

రావణుని మంత్రులైన రాక్షసులు చూడశక్యము కాకుండా ఉన్న ఆ శ్వేతద్వీపమును సమీపించగానే భయపడి వణకిపోవుచు రావణునితో– "రాజా! మాకు స్పృహ తప్పిపోవుచున్నది. ఏమీ తెలియుటలేదు. చైతన్యము తొలగిపోవుచున్నది. ఏ విధముగానూ కూడ నిలిచి యుద్ధము చేయజాలము" అని పలికి ఆ రాక్షసులందరూ

# పదవ ప్రక్షిప్త సర్గము

**నారదుడు చెప్పగా శ్వేతద్వీపమును గూర్చి విని రావణుడు అక్కడివారితో యుద్ధముచేయుటకై వెళ్ళి అక్కడ స్త్రీలచేతిలో అవమానము పొందుట.**

రామా! అటుపిమ్మట బలముచేత గర్వించిన ఆ రావణుడు శూరులైన రాక్షసులు వెంటరాగా, విజయమును కోరుచు భూమిమీద సంచరించుచు దైత్య-దానవ-రాక్షసులలో మంచి బలవంతుడని వినిన ప్రతివానిని యుద్ధానికి పిలిచెను. ఈవిధముగా భూమిపై సంచరించుచు, రావణుడు ఒకనాడు బ్రహ్మలోకమునుండి తిరిగి వచ్చుచున్న నారదుణ్ణి చూచెను. వెళ్ళుచున్న అతడు మేరుపర్వతము పైభాగమునందు రెండవ సూర్యుడువలె ప్రకాశించెను. రావణుడు మనస్సులో సంతోషించుచు అతనిని సమీపించి, అంజలి ఘటించి నమస్కరించి "మహాభాగ్యశాలి వైన నారదా! బ్రహ్మలోకమువరకూ ఉన్న అన్ని లోకములను అనేక పర్యాయములు చూచి ఉన్నావు. ఏ లోకములోని మానవులు అధికబలవంతులు? ఇచ్ఛానుసారము వాళ్ళతో సుఖముగా యుద్ధము చేయగోరుచున్నాను" అని అడిగెను.(1-6)

నారదుడు ముహూర్తకాలము ఆలోచించి బదులు చెప్పెను- "రాజా! క్షీరసముద్రముదగ్గర ఒక మహాద్వీప మున్నది. ఆ ద్వీపములో నివసించు మానవులు చంద్రుడు వలె తెల్లగా ఉందురు. పెద్దశరీరములు గల వారి బలము పరాక్రమము కూడ చాల గొప్పవి. వారి కంఠధ్వని ఉరుములు వలె ఉండును. రాక్షసరాజా! బలమూ, పరాక్రమమూ రెండు సమముగా ఉన్న ఎట్టివారు కావలె నని కోరుచున్నావో అట్టి మానవులను నేను శ్వేతద్వీపములో చూచినాను. పెద్ద దేహప్రమాణము, పెద్ద పరిఘల(కోట గడియలు) వంటి బాహువులూ గల ఆ మానవులు చాల ధైర్య మున్నవారు."(7-9)

నారదుని మాటలు విని రావణుడు మరల ఇట్లడిగెను - "నారదా! మహాబలశాలులు ఆ ద్వీపమునందు ఎట్లు పుట్టుదురు? ఆ మహాత్ములకు శ్వేతద్వీపమునందు నివాసము ఎట్లు లభించినది? సమర్థుడవైన ఓ నారదా! నాకు ఈ విషయము నంతనూ యథార్థముగా చెప్పుము. నీవు ప్రపంచకము నంతను సర్వదా అరచేతిలోని ఉసిరికాయనువలె చూచుచుందువు కదా." రావణుని మాటలు విని నారదుడు తిరిగి పలికెను. "రాక్షసశ్రేష్ఠుడా! ఆ జనులు నిత్యమూ మరొక చింతలేనివారై నారాయణునియందే ఆసక్తి కలిగి ఉందురు. అతనిని ఆరాధించుటలో

రాముడు ఆ కథను విని ఆశ్చర్యముచేత నేత్రములు వికసించగా తల పంకించుచు, గొప్ప ఆశ్చర్యము పొందెను. అప్పుడు ఆ వాక్యములు విన్న రాముడు సంతోషించుచు, ఆశ్చర్యముచేత వికసించిన నేత్రములు గలవాడై "ప్రాచీనకథను చెప్పుము"అని మరల జ్ఞానవంతులలో శ్రేష్ఠుడైన ఆ అగస్త్యమునిని కోరెను. (29,30)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏనిమిదవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# తొమ్మిదవ ప్రక్షిప్తసర్గము

**అగస్త్యుడు నారదుడు చెప్పినట్లుగా ఈ కథను కొనసాగించుట.**

అటు పిమ్మట, గొప్పతేజస్సు, కీర్తి గల అగస్త్యుడు, బ్రహ్మదేవుడు పరమేశ్వరునితో వలె, వినయసంపన్నుడైన రామునితో మరల ఇట్లు పలికెను. గొప్ప తేజస్సుగల, సమర్థుడైన ఆ అగస్త్యుడు సత్యమైన పరాక్రమము గల రామునితో "వినుము" అని పలికి అతనికి మిగిలిన కథను చెప్పెను. మహాబుద్ధిశాలియైన అగస్త్యుడు సంతోషించి మనస్సుతో ఆ కథను తనకు ఇతరులు ఎట్లు చెప్పిరో, తాను ఎట్లు వినెనో అట్లే, జరిగినది జరిగినట్లు రామునకు చెప్పెను– "రామా! దురాత్ముడైన రావణుడు అందుకొరకే సీతను హరించినాడు. ఈ కథను గొప్ప కీర్తి గల నారదుడు పర్వతములలో ఉత్తమమైన మేరుపర్వతముమీద చెప్పినాడు. (1–5)

గొప్ప తేజస్సు గల ఆ నారదుడు సంతోషముతో నవ్వుచు మిగిలిన కథను మహాత్ములైన దేవ–గంధర్వ–సిద్ధ మహర్షులకు మరల చెప్పెను. దేవతలూ, ఋషులూ కూడ ఏ కథను విని ఆనందాశ్రువులు కార్చుచు నారదునితో ఇట్లు అనిరో అట్టి మహాపాపనాశకమైన కథను వినుము. రామా! ఆ ఋష్యాదులు ఇట్లనిరి – "ఎవడు ఈ కథను భక్తిపూర్వకముగా వినిపించునో, ఎవడు వినునో ఆ ఇద్దరూ పుత్రపౌత్రాదిసుఖ మనుభవించి స్వర్గములో పూజింపబడుదురు."(6–9)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొమ్మిదవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

అతనిని దేవతలుగాని, అసురులు గాని, పన్నగులు గాని, చూడజాలరు. అతడు ఎవరిని అనుగ్రహించునో వారు మాత్రమే చూడగలరు. నాయనా! ఆ భగవంతుణ్ణి యజ్ఞఫలములచేత గాని, బాగా చేసిన తపస్సులచేతగాని, దానముచేతగాని, యాగముచేతగాని చూడ శక్యము కాదు. ప్రాణములను ఆ భగవంతునికే సమర్పించి, చిత్తములను అతనియందే నిలిపి ఎల్లప్పుడు అతనినే ఒకే ఒక రక్షకు డని భావించుచు, జ్ఞానముచేత పాపమును కాల్చివేసికొనిన భక్తులు మాత్రమే భగవంతుణ్ణి చూడగలరు. రాక్షసరాజా! నీవు ఆ భగవంతుణ్ణి చూడదలచినచో నీకు అంతా చెప్పెదను; ఇష్టమైనచో వినుము.(10-17)

కృతయుగము గడిచిపోయిన పిమ్మట త్రేతాయుగము ప్రారంభమునందు భగవంతుడు, దేవతల, మనుష్యుల హితము కొరకు రాజదేహము ధరించి పుట్టగలడు. భూలోకములో ఇక్ష్వాకువంశమునందు దశరథమహారాజు పుట్టగలడు. అతనికి మహాతేజఃశాలియైన రాము డను పుత్రుడు జనించును. గొప్ప బుద్ధి, బలము, పరాక్రమము, ధైర్యము గల ఆ మహాబాహువు ఓర్పుచేత భూమితో సమానుడుగా ఉండును. అప్పుడు ప్రభువైన నారాయణుడు యుద్ధరంగంలో శత్రువులకు సూర్యుడువలె చూడ శక్యముకాని రాముడుగా నరరూపమున అవతరించగలడు. ధర్మాత్ముడు, గొప్ప మనస్సుగలవాడు అయిన రామప్రభువు తండ్రి ఆజ్ఞచేత సోదరునితో కలసి విశాలమైన దండకావనములో సంచరించగలడు. లక్ష్మీదేవి సీత అని ప్రసిద్ధిచెందినదై మహాభాగ్యవంతురాలైన ఈ రాముని భార్య కాగలదు. ఈమె భూమినుండి ఆవిర్భవించి జనకుని కుమార్తె అగును. సౌందర్యముచేత లోకములో సాటిలేని, సకలసల్లక్షణ లక్షితురాలైన ఈ సీత చంద్రుణ్ణి కాంతివలె, నిత్యమూ రాముణ్ణి నీడవలె అనుసరించి ఉండును. మంచి శీలము, ఆచారము, సద్గుణములూ గల ఆ సీత గొప్ప ధైర్యము గలదై, సూర్యుని కిరణమువలె, ఆ కిరణముయొక్క మరొక మూర్తి వలె ఉన్నది(ఉండగలదు). రావణా! ఈ విధముగా నీకు, నేను సర్వోత్తముడు, నిత్యుడు, వినాశరహితుడు, దేవదేవుడూ అయిన శ్రీమహావిష్ణువు ప్రభావమును సవిస్తరముగా చెప్పినాను."(18-26)

రామా! మహాబాహువు, ప్రతాపవంతుడూ అయిన రావణుడు ఈ విషయము విని, నీతో వైరము పెట్టుకొనవలె నని కోరుచు మనస్సులో ఆలోచించెను.(27)

శ్రీమంతుడైన ఆ రావణుడు సనత్కుమారుడు చెప్పగా వినిన ఆ మాటలను గూర్చి మాటిమాటికి ఆలోచించి సంతోషించెను. యుద్ధముకొరకై సంచరించెను.(28)

# ఎనిమిదవ ప్రక్షిప్త సర్గము

## సనత్కుమారుడు శ్రీమహావిష్ణువు రాముడుగాను, లక్ష్మి సీతగాను అవతరించగల రని రావణునకు చెప్పుట.

దురాత్ముడైన ఆ రావణుడు ఇట్లు ఆలోచించుచుండగా ఆ మహాముని మరల– "ఓ! మహాబాహూ! యుద్ధములో నీ కిష్టమైనది కాగలదు. సుఖముగా ఉండుము. కొంతకాలము నిరీక్షించుము" అనెను. రావణుడు ఆ మాటలు విని ఆ ఋషితో– "ఆ మహావిష్ణువు లక్షణములేవో పూర్తిగా చెప్పుము" అనెను. రావణుని మాటలు విని ఆ ముని మరల ఇట్లనెను – "రాక్షసశ్రేష్ఠుడా! నీకు అంతా చెప్పెదను వినుము. ఆ శ్రీమహావిష్ణువు అంతటా ఉన్నాడు. సూక్ష్ముడు, స్పష్టముగా ఇంద్రియములకు గోచరుడు కానివాడు. అతిప్రాచీనుడు. స్థావరజంగమాత్మకములైన ఈ మూడు లోకములను అతడు వ్యాపించి ఉన్నాడు. భూమి, స్వర్గము, పాతాళము, పర్వతములు, వనములు, స్థావరములు, నదులు, నగరములు మొదలైన అన్నిటియందు శ్రీమహావిష్ణువే ఉన్నాడు. అతడే ఓంకార సత్యస్వరూపుడు. సావిత్రి, భూమీ కూడ అతడే. భూమిని ధరించే పర్వతములను ధరించు ఆదిశేషుడుగా కూడ అతడు ప్రసిద్ధుడు. పగలు, రాత్రి, రెండు సంధ్యలు, సూర్యుడు, చంద్రుడు, యముడు, కాలము, వాయువు, అగ్ని, బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, ఉదకము–సర్వమూ ఇతడే. వినాశము లేని లోకప్రభువైన, అతిప్రాచీనుడైన ఈ విష్ణువు ఒక్కడే సంసారదుఃఖమును నశింపజేయగలవాడు. అన్నింటినీ ప్రకాశింపచేయును. లోకములను సృజించి, రక్షించి, సంహరించుచుండును. ఈ విధముగా క్రీడించుచుండును. (1–9)

రావణా! లేదా–ఇదంతా చెప్పి ఏమి ప్రయోజనము? ఒక్క మాటలో చెప్పవలెననగా జంగమస్థావరాత్మక మైన ఈ మూడు లోకములను ఈ విష్ణువు వ్యాపించి ఉన్నాడు. కింజల్కముల వలె అరుణవర్ణమైన వస్త్రము ధరించిన నీలోత్పలదళశ్యాముడైన ఆ మహావిష్ణువు వర్షాకాలమునందు ఆకాశమునందున్న మెరుపులతో కూడిన మేఘము వలె ఉండును. శ్రీ మహావిష్ణువు చాల శోభగలవాడు. మేఘమువలె నల్లని శరీరము గల, పద్మములవంటి నేత్రములు గల సర్వసమర్థుడు. వక్షఃస్థలమునందు శ్రీవత్సమను పుట్టుమచ్చ ఉండుటచే మచ్చ ఉన్న చంద్రుడు వలె ఉండును. యుద్ధస్వరూపురాలైన లక్ష్మి(విజయలక్ష్మి) నిత్యమూ అతని శరీరమునందు, మేఘమునందు మెరుపువలె, ఉండి అతని దేహమును ఆవరించి ఉండును.

సృష్టించినాడు. అట్టి ఈ హరిని ఆశ్రయించి పండితులు యజ్ఞములు చేసి దేవత్వమును పొంది అమృతపానము చేయుదురు. అందరిచేత సన్మానింపబడుచు వీరు విష్ణువునే పూజించుచుందురు. పురాణ-వేద-పాంచరాత్రాగమాదులలో చెప్పిన విధముగా జనులు ఈ విష్ణువునే పూజించుచుందురు. నిత్యమూ యోగులు ఇతనిని ధ్యానింతురు. యజ్ఞముల చేత పూజించుచుందురు. దైత్యదానవ రాక్షసులను, దేవతల శత్రువులైన ఇతరులను అందరినీ శ్రీమహావిష్ణువు యుద్ధములో జయించుచుండును. అందరూ పూజించుచున్నదీ ఇతనినే." అని చెప్పెను. (12-17)

రాక్షసరాజైన రావణుడు మహర్షి పలికిన మాటలు విని, మరల వినయపూర్వకముగా- "యుద్ధములో చంపబడిన శత్రువులైన దైత్యదానవరాక్షసులకు ఏ గతి వచ్చును? విష్ణుమూర్తిచేత చంపబడిన వారికి ఏగతి కలుగును?" అని ప్రశ్నించెను. రావణుని మాట విని ఆ మహాముని ఇట్లు బదులు చెప్పెను. దేవతలచేత చంపబడినవాళ్ళు తప్పక స్వర్గమునకు వెళ్ళుదురు. స్వర్గమునుండి భ్రష్టులై మరల భూలోకములో పుట్టుచుందురు. పూర్వము సంపాదించిన పుణ్యపాపములను పట్టి పుట్టుచుందురు. చచ్చుచుందురు. (18-21)

చక్రధారి, మూడు లోకాల ప్రభువూ అయిన ఆ జనార్దనుని చేతిలో మరణించిన రాజు లందరూ ఆ విష్ణువు స్థానమైన వైకుంఠమునకే వెళ్ళుదురు. శ్రీమహావిష్ణువు కోపము కూడ వరముతో సమానము. ఆ రావణుడు సనత్కుమారుని మాటలు విని, సంతోషము, ఆశ్చర్యము కూడ పొంది, నేను హరిని యుద్ధములో ఎదిరించుట ఎట్లు సిద్ధించును?" అని ఆలోచించెను. (22,23)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏడవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# ఏడవ ప్రక్షిప్త సర్గము

## రావణుడు సనత్కుమారుని నుండి శ్రీమహావిష్ణువు మాహాత్మ్యము తెలుసుకొని అతని చేతిలో మరణమెట్లు లభించునా అని ఆలోచించుట.

సోదరులతో కూడిన వీరుడైన రాముడు దివ్యమైన పురాతనమైన ఈ కథను విని గొప్ప ఆశ్చర్యమును పొందెను. రాముడు అగస్త్యుని మాటలు విని – "నీ అనుగ్రహమువలన పుణ్యప్రదమైన ఈ గొప్ప కథను విన్నాను. మునిశ్రేష్ఠుడవైన ఓ! బ్రాహ్మణోత్తమా! వాలిసుగ్రీవుల ఈ దివ్యమైన పుట్టుక ఎట్టిదో కదా అని నేను ఆశ్చర్యముతో నిండి ఉన్నాను. ఓ బ్రహ్మర్షీ! బలముచేత బలవంతు లందరిలోను ఉత్తములైన ఇంద్రసూర్యులు ఇద్దరూ వానరశ్రేష్ఠులుగా పుట్టినారు గాన ఇది ఎంతో ఆశ్చర్యముగా ఉన్నది" అనెను.(1-4)

రాముని మాటలు విని అగస్త్యుడిట్లు పలికెను. "ఓ! మహాబాహూ! పూర్వము ఈ విషయము ఈ విధముగా జరిగినదట. రామా! ప్రాచీనమైన మరొక దివ్యమైన కథ చెప్పెదను; వినుము. పూర్వము రావణుడు సీతను ఎందుకు హరించినాడో చెప్పెదను. సావధానచిత్తముతో వినుము. పూర్వము కృతయుగమునందు రాక్షసరాజైన రావణుడు, బ్రహ్మదేవుని పుత్రుడూ, సర్వసమర్థుడూ అయిన సనత్కుమారుడు ఒక చోట కూర్చొని ఉండగా చూచెను. సూర్యునివంటి దేహముతో తేజస్సుతో ప్రజ్వలించుచున్నట్లు ఉన్న, సత్యము పలుకు ఆ ఋషికి రావణుడు సవినయముగా అంజలి ఘటించి మ్రొక్కి- "ఈ లోకములో దేవతలు ఎవనిని ఆశ్రయించి యుద్ధమునందు శత్రువులను జయించగలుగుచున్నారో అట్టి, దేవతలలో కెల్లా అత్యధికమైన బలముకలవాడు ఎవడు? పూజ్యుడవైన ఓ! మహామునీ! నిత్యమూ ద్విజులు ఎవనిని పూజించుచున్నారు? యోగులు ఎవనిని ధ్యానించుచున్నారు? ఈ విషయమును నాకు సవిస్తరముగా చెప్పుము" అని ప్రశ్నించెను.(5-11)

ధ్యానదృష్టి గల మహాయశఃశాలియైన ఆ సనత్కుమారుడు రావణుని మనస్సులో ఉన్న అభిప్రాయమును తెలుసుకొని "నాయనా! వినుము" అని ఇట్లు చెప్పెను. "శ్రీమహావిష్ణువు ఈ జగత్తుకు అంతకూ ప్రభువు. అతని జన్మను గూర్చి మనకు తెలియదు.(పుట్టుక లేనివాడు). నిత్యము అతనికి సురులు, అసురులూ కూడా నమస్కరించుచుందురు. సర్వసమర్థుడు, జలమునందు శయనించువాడు అయిన ఇతడు సకలపాపములను హరించును. ఇతని నాభినుండి పుట్టిన బ్రహ్మదేవుడు సకల జగత్తుకు అధిపతి. స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తు అంతా ఈ విష్ణువే

నివాసమైనది. దివ్యము, సుందరము అయిన ఆ నగరమును నా ఆజ్ఞచేత విశ్వకర్మ రచించినాడు. అక్కడ పుత్రసహితుడైన వానరశ్రేష్ఠుడైన ఋక్షరజస్సును చూపి, వానరయూథనాయకులను, సామాన్యవానరులను పిలచి, జనుల సభలో అందరికీ నా అభిప్రాయమును తెలిపి, ఇతనిని సింహాసనముమీద కూర్చుండబెట్టి రాజునుగా అభిషిక్తుని చేయుము. ధీమంతుడైన ఈ ఋక్షరజస్సు చూడగానే వాళ్ళందరూ ఈతనికి నిత్యమూ వశులై ఉండగలరు."(46-52)

బ్రహ్మ ఇట్లు చెప్పగా ఆ దూత ఆ వానరనాయకుణ్ణి తీసికొని సుందరమైన ఆ కిష్కింధానగరమునకు వెళ్ళెను. ఆ దూత వాయువేగముతో ఆ కిష్కింధానగరమునకు వెళ్ళి, బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ఆ వానరోత్తముణ్ణి రాజునుగా స్థాపించెను. శ్రీమంతుడైన అతడు రాజ్యాభిషేకవిధానము ప్రకారము అభిషిక్తుడై, పూజింపబడినవాడై, కిరీటధారియై, చక్కగా అలంకరించుకొనెను. అతడు సంతోషించిన మనస్సుతో ఏడు ద్వీపములు, సముద్రములూ గల భూమిమీద ఉన్న వానరు లందరినీ ఆజ్ఞాపించెను(పాలించెను). ఈ విధముగా ఈ ఋక్షరజస్సు వాలిసుగ్రీవులకు తండ్రి. ఇతడే తల్లికూడ. ఈ విషయము నీకు చెప్పితిని. నీకు క్షేమమగుగాక. (53-57)

ఏ విద్వాంసుడు ఈ కథను వినిపించునో, ఎవడు దీనిని వినునో వాళ్ళ మనస్సుకు ఆనందమును వృద్ధిపొందించు కార్యములు సిద్ధించును. రామా! ఈవిషయమునంతనూ నీకు యథార్థముగా, సవిస్తరముగా చెప్పినాను. రాక్షసుల ఉత్పత్తి, వానరుల ఉత్పత్తీ కూడ చెప్పబడినది. (58, 59)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఆరవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

తిరిగి వెళ్ళుచుండెను. ఆ సమయమునందు సంచరించుచున్న సూర్యుడు ఆ స్త్రీ ఏ ప్రదేశమునందు ఉండునో ఆ స్థానమునందే ఉండెను. ఆ దేవతాస్త్రీని వారిద్దరూ ఒకే సమయమునందు చూచిరి. ఆమెను చూచి వారు మన్మథునకు వశులైరి. సర్పముల వలె దేహమునందు అంతటా క్షోభ చెందిన ఆ దేవతా నాయకులు ఇద్దరూ అద్భుతమైన ఆ రూపమును చూచి తమ ధైర్యమును కోల్పోయిరి. అప్పుడు ఆమె విషయమున స్ఖలితమైన వీర్యమును ఇంద్రుడు ఆమె శిరస్సు మీద విడువగా అది ఆమెను చేరకుండా ప్రక్కకు మరలెను. అప్పుడు ఆమె మహాత్ముడైన ఆ దేవేంద్రుని అమోఘమైన వీర్యము నుండి వానరుల ప్రభువు, సర్వసమర్థుడు అయిన వానరుణ్ణి కనెను. ఆ రేతస్సు వాలమునందు పడుటచేత అతడు వాలి అయ్యెను. తన కర్తవ్యమును ఆచరించుచున్న సూర్యుడు మన్మథవశంవదుడై ఆమె కంఠము మీద రేతస్సు ఉంచెను. ఆ సూర్యుడు ఆమెతో ఒక మాట కూడా మాట్లాడలేదు. అతని మన్మథుడు దూరమాయెను. కంఠము మీద పడిన ఆ రేతస్సు సుగ్రీవుడయ్యెను. (31-39)

వీరులు, మహాబలశాలులూ అయిన ఆ వానరనాయకులు ఈ విధముగా పుట్టింపబడిరి. ఇంద్రుడు నాశములేని, మంచి గుణములు గల బంగారుమాలను వానరేంద్రుడైన వాలికి ఇచ్చి స్వర్గమునకు వెళ్ళెను. సూర్యుడు తన కుమారునకు హనుమంతుణ్ణి మిత్రునిగా చూపి, తాను చేయవలసిన పనులు చేయుటకై ఆకాశమునకు వెళ్ళెను.(40, 41)

రాజా! ఆ రాత్రి తెల్లవారి సూర్యుడు ఉదయించగానే ఆ ఋక్షరజస్సు మరల వానరరూపమును పొందెను. అతడు వానరుడిగా మారి, పచ్చని కళ్ళు గల బలవంతులు, స్వేచ్ఛారూపము గలవారు వానరశ్రేష్ఠులూ అయిన తన పుత్రులైన ఆ వానరులను చూచెను. అప్పుడు అతడు వారిద్దరికీ అమృతమువంటి తేనెలు త్రాగించెను. ఋక్షరజస్సు వారిద్దరినీ తీసికొని బ్రహ్మదగ్గరకు వచ్చెను. లోకములకు పితామహుడైన బ్రహ్మదేవుడు పుత్రుడైన ఋక్షరజస్సును చూచి, పుత్రులతో కూడిన అతనిని అనేక విధముల ఓదార్చెను.(42-45)

పిమ్మట దేవదూతతో ఇట్లు పలికెను. "దూతా! నా మాటవలన శుభమైన కిష్కింధాపురమునకు వెళ్ళుము. మంచి గుణములు గల గొప్పదైన, మంగళప్రదమైన ఆ నగరము ఇతనిది. ఆ పురములో అనేకవానరయూథములు నివసించుచున్నవి. అది అనేకరత్నములతోను, కామరూపధారులైన వానరులతోను నిండి ఉన్నది. అది పవిత్రమైనది. పుణ్యము కలది. ప్రవేశింపశక్యము కానిది. నాలుగు వర్ణములకు

ఆ వానరుడు బ్రహ్మదేవునితో ఇట్లు పలికి, సంతోషముతో వెళ్ళెను. బ్రహ్మదేవునితో సమానమైన బలము గల అతడు ఫలపుష్పములతో నిండిన వృక్షసముదాయములలో శీఘ్రముగా సంచరించుచు, వనమునందు ఫలములు భుజించుచు, ఉత్తమమైన మధువు, పుష్పములు, ప్రోగుచేయుచు, ప్రతిదినమునందు కూడా సాయంకాలమునకు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళుచుండెను. ఉత్తమములైన పుష్పములు, ఫలములు తీసికొని వెళ్ళి దేవదేవుడైన బ్రహ్మదేవుని పాదాలవద్ద సమర్పించుచుండెడివాడు.(16-18)

ఈ విధముగా అతడు అత్యధికముగా పర్వతముమీద తిరుగుచుండగా కాలము గడచుచుండెను. రామా! కొంతకాలము గడిచిన పిమ్మట, ఒకనాడు భల్లూకములకు కూడా ప్రభువైన ఆ వానరశ్రేష్ఠుడు దప్పికచేత పీడింపబడెను. అతడు మేరుపర్వతమునందలి ఉత్తరశిఖరమునకు వెళ్ళి అక్కడ అనేకవిధములైన పక్షులచేత ధ్వనింపచేయబడుచున్న, నిర్మలమైన ఉదకము గల సరస్సును చూచెను. అతడు తన జూలు కదల్చుచు దాని తీరమునందు నిలబడి ఆ సరస్సులో తన ప్రతిబింబమును చూచెను. "ఇత డెవడో నా గొప్ప శత్రువు నీటి మధ్య నివసించుచున్నాడు" అని అనుకొనుచు ఆ వానరుడు లోపలనున్న తన రూపమును చూచి, "ఇతడు కోపావేశముగల మనస్సుతో నన్ను అవమానించుచున్నాడు. నిజము. ఇది దుష్టభావము గల ఈ కుమతి నివసించు పుష్కలమైన గృహము" అనుకొనెను.(19-24)

ఆ వానరశ్రేష్ఠుడు ఈ విధముగా ఆలోచించి, వానరసహజమైన చాపలముచేత ఎగిరి ఆ మడుగులోనికి దుమికి, ఎగిరి మరల పైకి లేచెను. రామా! అక్షణమునందే ఆ వానరుడు స్త్రీగా మారిపోయెను. ఆ స్త్రీరూపము మనోహరముగా ఉండెను. ఆమె లావణ్యముతో చక్కగా మంగళప్రదురాలుగా ఉండెను. ఆమె జఘనము విస్తీర్ణముగాను, కనుబొమ్మలు అందముగాను, ముంగురులు, కేశములు నల్లగాను ఉండెను. ఆమె ముఖము చిరునవ్వుతో అలరారుచుండెను. స్తనతటము బలిసి ఉండెను. శుభప్రదమైన ఆమె ఆ సరస్తీరమునందు ఋజువుగా ఉన్న లతవలె ఉండెను. మూడులోకములలోను సుందరి, మనోహరురాలు, అందరి మనస్సులను పీడించేది అయిన ఆమె పద్మములు చేతిలో లేని లక్ష్మివలె, నిర్మలమైన వెన్నెలవలె ఉండెను. అక్కడ దిక్కులను అన్నింటినీ ప్రకాశింపచేయుచున్న ఆ ఉత్తమస్త్రీ సౌందర్యముచేత లక్ష్మివలె, సరస్వతివలె, పార్వతీదేవివలె ఉండెను.(25-30)

ఇంతలో దేవేంద్రుడు బ్రహ్మదేవుని పాదములను సేవించి ఆ మార్గముననే

# ఆరవ ప్రక్షిప్త సర్గము

## బ్రహ్మదేవుని కన్నీటి నుండి ఋక్షరజస్సు అను వానరుడు పుట్టుట. వాలిసుగ్రీవుల జననము.

రాముడు ఇదంతా విని అగస్త్యునితో- "ఋక్షరజస్సు అనునతడు వాలి సుగ్రీవుల తండ్రి కదా? వీళ్ళ తల్లి ఎవరని నీవు చెప్పినావు? వాలిసుగ్రీవులకు ఆ పేర్లు ఎందుకు వచ్చినవి? ఈ విషయమును చెప్పుము. మాకు చాల విన వేడుకగా ఉన్నది" అని పలికెను.(1, 2)

రాముని మాటలు విని అగస్త్యుడిట్లు పలికెను. "రామా! ఈ కథను పూర్వము జరిగిన విధముగా పూర్తిగా వినుము- "నా ఆశ్రమమునకు వచ్చిన నారదుడు చెప్పినాడు. లోకసంచారము చేయుచున్న ఇతడు ఒకనాడు నాకు అతిథిగా వచ్చినాడు. శాస్త్రోక్తప్రకారము న్యాయానుసారముగా పూజింపబడి సుఖముగా కూర్చొని ఉన్న అతనిని నేను వేడుకచేత అడుగగా అతడు "మహర్షీ! వినుము" అని ఉపక్రమించి ఈ కథను చెప్పెను. బంగారము వికారమైన, శోభాయుక్తము, మంగళప్రదమూ, పర్వతశ్రేష్ఠము అయిన మేరుపర్వత మున్నది. దాని మధ్యమశిఖరము దేవతలందరిచేత పూజింపబడుచున్నది. దాని మీద నూరు యోజనముల విస్తారము గల బ్రహ్మ దేవుని రమ్యమైన దివ్యసభ ఉన్నది. పద్మమునుండి పుట్టిన, చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు నిత్యమూ ఆ సభలో ఉండును. బ్రహ్మదేవుడు యోగాభ్యాసము చేయుచుండగా అతని నేత్రముల నుండి జలములు స్రవించెను. అతడు దానిని గ్రహించి చేతితో రాసెను. రామా! ఆ కన్నీటి బిందువును లోక స్రష్టయైన బ్రహ్మదేవుడు నేలమీద ఉంచగానే దానినుండి వానరుడు పుట్టెను.(3-10)

పుట్టీపుట్టగానే అతనిని మంచి మాటలతో బుజ్జగించి బ్రహ్మదేవుడు- "ఓ! వానరశ్రేష్ఠుడా! ఎల్లప్పుడు దేవతలచే అధిష్ఠింపబడిన అతివిశాలమైన ఈ పర్వతమును చూడుము. రమ్యమైన ఈ పర్వతముమీద లభించు అనేకములైన ఫలములు, మూలములు భుజించుచు నిత్యము నాదగ్గర సంచరించుచుండుము. కొంతకాలము ఇక్కడే ఉండుము. తరువాత నీకు శ్రేయస్సు కలుగును." అని చెప్పెను. బ్రహ్మదేవుని మాటలు విని ఆ వానరోత్తముడు దేవదేవుని పాదములకు శిరస్సు వంచి నమస్కరించి, ఆ దేవదేవునితో- "దేవా! నీవు ఆజ్ఞాపించిన విధముగా ప్రవర్తించెదను" అని చెప్పెను.(11-15)

మరికొన్ని స్తుతులను చేసిరి.(1-9)

సూతులు కూడా ఉత్తమములైన స్తుతులతో రాముణ్ణి మేల్కొలిపిరి. రాముడు ఈ విధముగా వందిసూతాదులు చేసిన స్తుతులకు మేల్కొనెను. తెల్లని అచ్ఛాదనవస్త్రముచేత కప్పబడిన ఆ శయనమును విడచి ఆదిశేషశయనమునుండి సర్వపాపహరుడైన నారాయణుడు లేచినట్లు లేచెను. రాముడు లేవగానే చాలమంది మనుష్యులు వినయముతో దోసిళ్ళు కట్టి నమస్కరించి, శుభ్రములైన పాత్రలతో జలమును తీసుకొనివచ్చి అతనిని సమీపించిరి. రాముడు స్నానము చేసి, పవిత్రుడై, తగుకాలమునందు అగ్నిహోమము చేసి, శీఘ్రముగా ఇక్ష్వాకురాజులచేత సేవింపబడి పవిత్రమైన దేవతాగృహమునకు వెళ్ళెను. రాముడు అక్కడ దేవతలను, పితృదేవతలను, బ్రాహ్మణులను యథావిధిగా పూజించి, జనులతో కలసి బైటనున్న వాకిలి దాటి వచ్చెను.(10-14)

పురోహితులు, మహాత్ములైన మంత్రులు, ప్రజ్వలించుచున్న అగ్నులవలె ఉన్న వసిష్ఠాదులు ఆదరపూర్వకముగా అతని దగ్గరకు చేరిరి. అనేకదేశముల ప్రభువులైన మహాత్ములైన క్షత్రియులు కూడ, ఇంద్రుని ప్రక్క దేవతలు కూర్చున్నట్లు రాముని ప్రక్క కూర్చుండిరి. అక్కడ భరతుడు, లక్ష్మణుడు, గొప్పకీర్తి గల శత్రుఘ్నుడు మూడు వేదములు యజ్ఞమును ఉపాసించి నట్లు రాముణ్ణి ఉపాసించిరి. కింకరులు అంజలి ఘటించి నమస్కరించి, వికసించిన ముఖములతో దూరముగా తొలగిరి. ముదితు లను చాలామంది పార్శ్వమునందు ఉండేవాళ్ళు దగ్గర కూర్చుండిరి. గొప్ప పరాక్రమము, తేజస్సూ గల స్వేచ్ఛానుసారము రూపములు ధరించు సుగ్రీవుడు మొదలైన ఇరువది మంది వానరులు రాముని దగ్గర కూర్చుండిరి. నలుగురు రాక్షసులతో కూడిన విభీషణుడు, యక్షుడు కుబేరుని దగ్గర కూర్చున్నట్లు మహాత్ముడైన రాముని దగ్గర కూర్చుండెను. ఆ యా సంఘముల పెద్దలు, నేర్పుగల, సత్కులప్రసూతులైన మానవులు రామునకు శిరస్సు వంచి నమస్కరించి ఉపాసించుచుండిరి. దేవేంద్రుని చుట్టూ ఎల్లప్పుడూ ఋషులు ఉన్నట్లు రాముని చుట్టూ తేజోవంతులూ, ఉత్తములూ అయిన ఋషులు, గొప్ప పరాక్రమము గల రాజులూ, వానరులూ, రాక్షసులూ కూర్చుండి ఉండిరి. కాని రూపసంపదచేత రాముడు దేవేంద్రునికంటె అధికముగా ప్రకాశించుచుండెను. వారందరూ కూర్చొని ఉండగా పురాణములను ఎరిగిన మహాత్ములు వారికి చాలా మధురములు, ధర్మబోధకములూ అయిన ఆ యా కథలు చెప్పుచుండిరి.(15-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది ఏడవ సర్గము సమాప్తము.**

మాటలు విని "అట్లే అగుగాక" అని పలికి వెళ్ళుటకు బయలుదేరిరి. ఆ ఋషు లందరూ ఇట్లు పలికి వచ్చిన విధముననే తిరిగి వెళ్ళిరి.(52-60)

రాముడు ఆశ్చర్యముతో కొంతసేపు ఆ విషయములను గూర్చియే ఆలోచించెను. ఇంతలో సూర్యుడు అస్తాద్రికి వెళ్ళెను. అప్పుడు రాముడు రాజులను, వానరులను వారి వారి విడిదులకు పంపివేసి, యథావిధిగా సంధ్యోపాసనచేసి, రాత్రి కాగానే అంతఃపురములో ప్రవేశించెను.(61, 62)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది ఆరవ సర్గము సమాప్తము.**


# ముప్పది ఏడవ సర్గము

**రాముడు సదస్యులతో కూడి రాజసభను అలంకరించుట.**

ధర్మముచేత ప్రసిద్ధమైన మనస్సుగల , (ధార్మికప్రవృత్తి గల మనస్సు కలవాడుగా ప్రసిద్ధుడైన) రాముడు రాజ్యాభిషిక్తుడైన తరువాత, పౌరుల సంతోషమును వృద్ధి పొందించుచు మొదటి రాత్రి గడిచినది. ఆ రాత్రి తెల్లవారగానే రాజును మేల్కొలుపు సౌమ్యులైన స్తోత్రపాఠకులు ప్రాతఃకాలమునందు రాజప్రాసాదమునకు వచ్చిరి. సుశిక్షితులైన కింనరులవలె మధురకంఠధ్వని గల వాళ్ళందరూ సంతోషవంతులై వీరుడైన రాజును యథావిధిగా స్తుతించిరి- "కౌసల్యకు ఆనందమును వృద్ధిపొందించు, వీరుడవు, సౌమ్యుడవు అయిన రామా! మేల్కొనుము. రాజా! నీవు నిద్రపోవుచున్నచో జగత్తు అంతా నిద్రపోవునుగదా? నీ పరాక్రమము విష్ణువుపరాక్రమము వంటిది. రూపము అశ్వినీదేవతల రూపమువంటిది. నీవు బుద్ధిచేత బృహస్పతితో సమానుడవు. ప్రజాపతివంటివాడవు. నీ ఓర్పు భూమి ఓర్పు వంటిది. నీ తేజస్సు సూర్యుని తేజస్సుతో సమానము. నీ వేగము వాయువుతో తుల్యము. గంభీర్యము సముద్రము గాంభీర్యము వంటిది. నీవు శివుడువలె కదల్ప శక్యము కానివాడవు. నీ వంటి సౌమ్యత్వము చంద్రునిలో మాత్రమే ఉన్నది. మహారాజా! నీవంటి రాజులు పూర్వ మెన్నడూ లేరు. ముమ్ముందు పుట్టరు. నీవు ఎదిరింప శక్యముకాని వాడవు. నిత్యము ధర్మతత్పరుడవు. ప్రజల హితమును కోరువాడవు. పురుషశ్రేష్ఠుడా! నిన్ను కీర్తి, లక్ష్మి విడిచి పెట్టవు. రామా! నీయందు లక్ష్మి, ధర్మము స్థిరముగా నిలచి ఉన్నవి." అని వందులు ఈ స్తుతులను, మధురములైన

అప్రమేయుడైన ఈ హనుమంతుడు వ్యాకరణము అభ్యసించుటకై పెద్ద గ్రంథమును తీసికొని, సూర్యునకు అభిముఖుడై, ఆ సూర్యుణ్ణి అడుగుట కొరకు ఉదయాద్రినుండి అస్తాద్రివరకు ప్రయాణము చేసెను. ఈ హనుమంతుడు పాణిని రచించిన అష్టాధ్యాయి అనే వ్యాకరణసూత్రములతోను, వాటి వ్యాఖ్యతోను, వార్తికముతోను, సంగ్రహముతోను కూడిన మహాభాష్యమును ధరించినాడు. శాస్త్రపాండిత్యములోను ఛందఃశాస్త్రరీతిలోను ఈతనితో సమానుడు ఎవడూ కూడా లేడు. ఇతడు సకల విద్యలలోను, తపశ్చర్యలోను బృహస్పతితో పోటీ చేయుచున్నాడు. తొమ్మిది వ్యాకరణములు ఎరిగిన ఇతడు నీ అనుగ్రహమువలన(రాబోవు కల్పములో) బ్రహ్మదేవుడు కాగలడు. భూమిని ముంచెత్తదలచిన సముద్రానికి వలె, లోకాలను కాల్చివేయదలచిన అగ్నికి వలె, ప్రళయకాలములో యమునకు వలె హనుమంతునికి ఎవ్వడు ఎదుట నిలబడగలడు? రామా! ఈ హనుమంతుడు వలెనే సుగ్రీవుడు, మైందుడు, ద్వివిదుడు, నీలుడు, తారుడు, అంగదుడు, నలుడు, రంభుడు, ఇతర వానరులందరూ కూడ నీకు సాహాయ్యము చేయుటకొరకే దేవతలచేత సృష్టించబడినారు. గజ-గవాక్ష-గవయ-సుదంష్ట్ర-మైంద-జ్యోతిముఖ-నల లనే ఈ భల్లూకములను, వానరనాయకులను నీకొరకే దేవతలు సృష్టించినారు. నీవు ప్రశ్నించిన విషయము లన్నీ చెప్పినాను. బాల్యములో హనుమంతుడు చేసిన పని కూడా చెప్పినాను."(45-51)

అగస్త్యుడు చెప్పిన వృత్తాంతమును విని రాముడు, లక్ష్మణుడు, వానరులు, రాక్షసులు చాల ఆశ్చర్యము పొందిరి. అగస్త్యుడు రామునితో- "రామా! ఈ కథ అంతా విన్నావు కదా. మేము నీ దర్శనము చేసికొన్నాము. మాటలాడినాము. ఇంక వెళ్ళెదము" అని పలికెను. రాముడు ఉగ్రమైన తపఃశక్తి గల అగస్త్యుని మాటలు విని అంజలి ఘటించి నమస్కరించుచు మహర్షితో- "నేడు దేవతలు, పితృదేవతలు, ప్రపితామహులు నా విషయమున సంతోషించినారు. నీ దర్శనమువలననే బంధుసహితులమైన మేము సంతోషించుచున్నాము. నేను విజ్ఞాపన చేయవలసినది ఒకటున్నది. కోరికతో నేను చెప్పుచున్న దానిని మీరు నాకోసమై దయతో చేయవలెను. నేను పౌరులను, జానపదులను వారి వారి కార్యములందు నియమించి వచ్చి సత్పురుషులైన మీ ప్రభావమువలన క్రతువులు చేసెదను. తపోబలసంపన్నులైన మీరు, నాపై నిత్యము అనుగ్రహము చూపుచు, నేను చేయబోవు యజ్ఞములయందు సభ్యులుగా ఉందురుగాక. అందుచేత మీరందరూ కలసి తరచు ఇక్కడికి వచ్చుచుండవలెను" అనెను. కఠిననియమములు పాటించు అగస్త్యాది ఋషులు ఆ



బ్రహ్మచేత చేయబడిన గొప్పబలము గల హనుమంతుడు ఈ విధములైన పనులు చేసెను. అతని శక్తిని గూర్చి తెలిసిన ఋషు లందరూ సహించుచుండిరి. కేసరీ, వాయువూ నిషేధించినా కూడ ఈ హనుమంతుడు బాలు డగుటచే కట్టుబాట్లను అతిక్రమించెను. అప్పుడు భృంగ్వంగిరసవంశీయులైన ఆ ఋషులు కోపించిరి. రామా! కాని, వారు ఎక్కువ కోపము గాని, పగగాని లేనివారై ఇతనిని- "ఓ! వానరా! నీవు ఏ బలమును చూచుకొని మమ్ములను బాధించుచున్నావో ఆ బలము చాలకాలమువరకు, నీకు మా శాపముచేత తెలియకుండుగాక. నీ కీర్తిని ఎప్పుడు స్మరింపచేయుదురో అప్పుడు నీ బలము వృద్ధిపొందును అని శపించిరి. అప్పుడు మహర్షుల వాక్యప్రభావముచే తేజోబలములు అణగిపోగా ఇతడు మెత్తదనము పొంది ఆ ఆశ్రమములలోనే సంచరించెను.(28-35)

తేజస్సుచేత సూర్యునివంటివాడైన ఋక్షరజసు డను సకలవానరరాజు ఉండెను. అతడు వాలిసుగ్రీవుల తండ్రి. వానరరాజైన ఆ ఋక్షరజస్సు చాల కాలము రాజ్యముచేసి మరణించినాడు. అతని మరణానంతరము ఆలోచనలో సమర్థులైన మంత్రులు తండ్రి స్థానములో వాలిని రాజుగాను, వాలిస్థానములో సుగ్రీవుణ్ణి యువరాజుగాను చేసిరి. బాల్యమునుండీ కూడ వాలికి, సుగ్రీవునితో, వాయువునకు అగ్నితోవలె, భేదభావము కాని, కపటముకాని లేని స్నేహము ఉండెను. రామా! అట్టి వాలిసుగ్రీవులకు వైరము కలిగినప్పుడు ఈ హనుమంతుడు శాపము మూలముననే తన బలము తెలియక ఉండెను. వాలిచేత తరుమబడుచున్న సుగ్రీవునికి కూడ హనుమంతునకు ఎంత బలమున్నదో తెలియదు. హనుమంతునకు తన కెంత బల మున్నదో తెలియదు. ఆనాడు ఋషు లిచ్చిన శాపముచేత హరింపబడిన బలము గల(బలజ్ఞానము లేని) ఈ హనుమంతుడు, ఏనుగుచేత బంధింపబడిన సింహామువలె వాలిసుగ్రీవుల యుద్ధమునందు సుగ్రీవునితో నిలచిపోయినాడు; యుద్ధము చేయలేదు. పరాక్రమము, ఉత్సాహము, బుద్ధి, ప్రతాపము, మంచి స్వభావము, మాధుర్యము, ఏది నీతి ఏది కాదు అనే జ్ఞానము, గాంభీర్యము, నేర్పు, గొప్ప బలము, ధైర్యము అనే గుణములచేత హనుమంతునికంటె గొప్పవాడు ఈ లోకములో, ఎవ్వడైనా ఉన్నాడా?(36-44)

నేర్పెదను. దానిచేత ఇతడు మాటలలో నేర్పరి కాగలడు. శాస్త్రజ్ఞానములో ఇతనిని పోలినవాడు ఉండడు" అని వరమిచ్చెను. "పది లక్షల సంవత్సరాలకు కూడ నా పాశముచేతగాని, బలముచేత గాని ఇతనికి మృత్యువు కలగదు" అని వరుణుడు వరమిచ్చెను. యముడు సంతోషించి తన దండమువలన చావు లేకపోవుటను, రోగము కలుగకపోవుటను, యుద్ధములో దిగులు చెందకుండుటను వరముగా ఇచ్చెను. "నా గద యుద్ధములలో ఇతనిని చంపదు" అని పచ్చని ఒక కన్ను గల కుబేరుడు పలికెను. "ఇతడు నా ఆయుధముచేతగాని, నాచేత గాని చంపబడడు" అని శివుడు కూడ అతనికి గొప్ప వరము నిచ్చెను. మహారథుడు, శిల్పులలో శ్రేష్ఠుడు, గొప్ప బుద్ధికలవాడు అయిన విశ్వకర్మ ఈ బాలుణ్ణి చూచి- "నేను తయారుచేసిన అస్త్రములచేతగాని, ఇతరములైన దివ్యాస్త్రములచేతగాని చంపశక్యముకానివాడై ఇతడు దీర్ఘాయుర్దాయవంతుడై చిరకాలము జీవించగలడు" అని వరమిచ్చెను. "మహాత్ముడైన బ్రహ్మదేవుడు కూడ - ఇతడు ఏ బ్రహ్మదండములచేతను చంపబడడు" అని పలికెను.(10-21)

అప్పుడు దేవతలు ఇచ్చిన వరములచేత అలంకరించబడిన ఇతనిని చూచి జగత్తునకు అంతకూ పూజ్యుడైన బ్రహ్మదేవుడు మనస్సులో సంతోషించి వాయువుతో- "ఓ! వాయూ! నీ కుమారుడు హనుమంతుడు శత్రువులకు భయంకరుడు, మిత్రులకు అభయము ఇచ్చువాడు కాగలడు. ఇతడు ఎగురగలవానిలో శ్రేష్ఠుడై ఇష్టము వచ్చిన రూపము ధరించును. ఇష్టానుసారము సంచరించును. ఇష్టానుసారము వెళ్ళును. ఇతని గతిని ఎవ్వరూ అడ్డజాలరు. కీర్తిమంతుడు అగును. ఇతడు యుద్ధములో రావణుని వినాశమునకు హేతువులు, రామునకు ఆనందకరములు, ఆశ్చర్యజనకములు అయిన పనులు చేయగలడు" అని చెప్పెను. బ్రహ్మదేవుడు మొదలైన వారందరూ వాయువుతో ఇట్లు పలికి, అతని అనుమతి తీసికొని వచ్చిన విధముగా వెళ్ళిరి. వాయువు ఆ పుత్రుణ్ణి ఇంటికి తీసికొని వెళ్ళి అతనికి వరములు లభించిన సంగతి అంజనకు తెలిపి వెళ్ళిపోయెను.(22-27)

రామా! ఇతడు వరములు పొంది, వరదానము వలన కలిగిన బలముతోను, సహజబలముతోను కూడినవాడై, సముద్రము వలె తనలో ఉన్న వేగముతో నిండి ఉండెను. అప్పుడు బలముతో నిండిన హనుమంతుడు భయములేనివాడై మహర్షుల ఆశ్రమములలో అపరాధములు చేయుచుండెను. ఇతడు యజ్ఞసాధనములైన స్రుక్కులను, పాత్రలను, అగ్నిహోత్రములను, నారబట్టలను బ్రద్దలుకొట్టి, చీల్చి నశింపచేయుచుండెను. ఏ బ్రహ్మదండమువలనా కూడ మరణము లేకుండునట్లు

# ముప్పది ఆరవ సర్గము

**బ్రహ్మాదిదేవతలు హనుమంతునకు వరములిచ్చుట. ఋషుల శాపముచేత హనుమంతుడు తన బలమును మరిచిపోవుట.**

పుత్రుని వధచేత దుఃఖించుచున్న ఆ వాయువు బ్రహ్మదేవుణ్ణి చూచి ఆ పిల్లవానిని ఎత్తికొని బ్రహ్మదేవుని ఎదుట లేచి నిలబడెను. కుండలములు, శిరోమాలికలు కదలాడగా, బంగారు అలంకారములు ధరించిన ఆ వాయువు బ్రహ్మకు మూడు పర్యాయములు ఉపస్థానము(మంత్ర ముచ్చరించుచు సమీపించుట)చేసి, అతని పాదములమీద పడెను. బ్రహ్మదేవుడు వేదమును ఎరిగిన, వ్రేలాడుచున్న ఆభరణములతో ప్రకాశించుచున్న హస్తముతో ఆ వాయువును పైకి లేవదీసి ఆ శిశువును స్పృశించెను. బ్రహ్మదేవుడు విలాసపూర్వకముగా స్పృశించగానే ఆ శిశువు నీరు చల్లిన సస్యమువలె మరల జీవితమును పొందెను. ప్రాణస్వరూపు డైన వాయువు ఆ శిశువునకు ప్రాణము వచ్చుట చూచి సంతోషించి పూర్వమునందు వలె అన్ని ప్రాణుల శరీరములలో ప్రవేశించి సంచరించెను. వాయునిరోధమునుండి విముక్తులైన ఆ ప్రజలు శీతవాతములనుండి విముక్తులై పద్మములతో నిండిన పద్మలతల వలె సంతోషించిరి.(1-6)

పిదప యశస్సు-వీర్యము, ఐశ్వర్యము-శోభ, జ్ఞానము-వైరాగ్యము అను మూడు జంటలు గలవాడు, త్రిమూర్తులలో శ్రేష్ఠుడూ, దేవతలచేత పూజింపబడినవాడు అయిన బ్రహ్మదేవుడు వాయువునకు ప్రియము చేకూర్చవలె నను కోరికతో దేవతలతో- "ఓ! మహేంద్ర-అగ్ని-వరుణ-మహేశ్వర-కుబేరులారా! మీకందరికీ ఈవిషయము తెలిసినదే; అయినను చెప్పుచున్నాను. నేను చెప్పు హితమును వినండి. ఈ శిశువు మున్ముందు మీ కార్యము సాధించవలసి ఉన్నది. అందువలన, ఈ వాయుదేవుని సంతోషముకొరకు మీ రందరూ ఇతనికి వరము లివ్వండి."(7-9)

పిమ్మట దేవేంద్రుడు ఆనందముతో బంగారు పద్మముల మాలను పైకి చూపి(ఇచ్చి)- "ఇతని దౌడ నేను ప్రయోగించిన వజ్రముతో కొట్టబడినది. అందుచేత ఈ వానరశ్రేష్ఠుని పేరు హనుమంతుడుగా ప్రసిద్ధము కాగలదు. నే నితనికి ఆశ్చర్యకరమైన ఒక గొప్ప వరము నిచ్చెదను. ఇటుపై ఇతడు నా వజ్రముచేత చంపుటకు శక్యముకానివాడుగా అగును" అని వరమిచ్చెను. పూజ్యుడైన, తిమిరవినాశకుడైన సూర్యుడు- "నేను నా తేజస్సులోని నూరవవంతు ఇతనికి ఇచ్చెదను. శాస్త్రాధ్యయనము చేసే శక్తి వచ్చి నప్పుడు ఇతనికి నేను శాస్త్రము

లేకుండెను. ఈ విధముగా మూడు లోకములూ కూడ నరకములో ఉన్నట్లుండెను. పిమ్మట గంధర్వులు, దేవతలు, అసురులు, మనుష్యులు దుఃఖాక్రాంతులై, సుఖమును కోరుచు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళిరి. మహోదరుడు వలె పెద్ద పొట్టలు గల ఆ దేవతలు – "పూజ్యుడవైన బ్రహ్మదేవా! నాలుగు విధములైన ప్రజలను నీవే సృజించితివి. ఈ వాయువును మా ఆయుస్సుకు అధిపతిగా నీవే చేసితివి. సత్తమా! అట్టి ఈ వాయువు మా ప్రాణాలకు అధిపతి అయి ఉండి కూడ, అంతఃపురములో స్త్రీలని నిరోధించి నట్లు మమ్ములను నిరోధించి దుఃఖము కలిగించుచున్నాడు. వాయువుచేత పీడితులమైన మేము నిన్ను శరణు జొచ్చినాము. దుఃఖములను తొలగించువాడా! వాని నిరోధమువల్ల కలిగిన, మా దుఃఖమును తొలిగించుము" అని ప్రార్థించిరి. (50-56)

ప్రజల ప్రభువైన ప్రజాపతి ప్రజలు పలికిన ఈ మాటలు విని, "దీనికొక కారణ మున్నది"అని చెప్పి మరల ఇట్లనెను – "ప్రజలారా! వాయువునకు ఎందుచేత కోపము వచ్చెనో, ఎందుకు అతడు ఈ విధముగా నిరోధించెనో అది అంతా వినుడు. రాహువు మాటలు విని దేవతల ప్రభువైన ఇంద్రుడు నేడు, వాయుదేవుని పుత్రుని పడగొట్టినాడు. అందుచేత అతడు కోపించినాడు. శరీరము లేని వాయువు శరీరమును పాలించుచు దానిలో సంచరించుచుండును. వాయువు లేనిచో శరీరము కట్టెవలె అయిపోవును. వాయువే ప్రాణము. వాయువే సుఖము. ఈ సమస్తజగత్తూ వాయువే. వాయువు విడిచివేసినచో జగత్తుకు సుఖ ముండదు. ఆయుర్దాయస్వరూపు డైన వాయువు జగత్తును ఇప్పుడే విడచినాడు. ప్రాణు లన్నీ ఇప్పుడే ఉచ్ఛ్వాసనిఃశ్వాసములు లేక కట్టెలవలె, గోడలవలె అయిపోయినవి. అందుచేత మనము మనకు అనారోగ్యము కలిగించిన వాయువు ఉన్న చోటికి వెళ్ళుదము. ఆ వాయువును అనుగ్రహింపచేసి కొనకుండగా మనకు ఆరోగ్యము లేదు." పిమ్మట బ్రహ్మదేవుడు దేవ-గంధర్వ-సర్ప-యక్షాదులతోను ఇతర ప్రజ లందరితోను కలసి, మహేంద్రునిచేత కొట్టబడిన తన కుమారుణ్ణి తీసికొని వాయువు వెళ్లి ఉన్న చోటికి వెళ్ళెను. అతడు వాయువు ఒడిలో ఉన్న సూర్యాగ్నిసువర్ణముల కాంతివంటి కాంతి గల అతని కుమారుణ్ణి చూచి జాలిపడెను. (57-65)


**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది ఐదవ సర్గము సమాప్తము.**

అలంకారములు ధరించిన ఎత్తైన బంగారు ఘంటలనాదముతో అట్టహాసము చేయుచున్నట్లున్న గజేంద్రమును ఎక్కి రాహువును ముందు ఉంచుకొని సూర్యుడు, హనుమంతుడూ ఉన్నచోటికి వెళ్ళెను. (33-38)

అప్పుడు రాహువు ఇంద్రుని దాటి అతిశీఘ్రముగా ముందుకువెళ్ళెను. పర్వతశిఖరమువలె ఉన్న, పరుగెత్తుచున్న ఆ రాహువును హనుమంతుడు చూచెను. అప్పుడు హనుమంతుడు సూర్యుణ్ణి విడిచివేసి, రాహువును చూచి ఫలము అనుకొని ఆ రాహువును పట్టుకొనుటకై మరల ఆకాశముమీద ఎగిరెను. సూర్యుణ్ణి విడచి ఆ విధముగా తనమీదికి పరుగెత్తి వచ్చుచున్న హనుమంతుణ్ణి చూచి రాహువు ముఖము వెనుకకు వేసి, వెనుకకు మరలెను. రాహువు తనను ఇంద్రుడు రక్షించవలె నని కోరుచు, భయముతో ఇంద్రా! ఇంద్రా! అని మాటిమాటికి అరచెను. రాహువు అరచుచుండగా ఇంద్రుడు పూర్వపరిచితమైన అతని స్వరమును గుర్తించి, "భయపడకుము; నేను ఇతనిని సంహరించెదను" అని పలికెను. (39-43)

అప్పుడు హనుమంతుడు ఐరావతమును చూచి, ఇది కూడ ఏదో పెద్ద ఫలము అని అనుకొని దానిమీదికి పరుగెత్తెను. ఆ విధముగా ఐరావతమును పట్టుకొనవలె నను ఉద్దేశ్యముతో పరుగెత్తుచున్న ఆ హనుమంతుని రూపము, ఆ ముహూర్తమునందు, భయంకరముగాను, ఇంద్రాగ్నులరూపము వలె తేజోవంతముగాను ఉండెను. ఇంద్రుడు ఎక్కువ కోపములేనివాడై, ఈ విధముగా పరుగెత్తి వచ్చుచున్న ఈతనిని చేతి చివరి భాగముచేత విడచిన వజ్రాయుధముతో కొట్టెను. అప్పుడు ఇతడు ఇంద్రుని వజ్రము దెబ్బకు పర్వతముమీద పడిపోయెను. పడిపోయినప్పుడు ఇతని ఎడమదౌడ విరిగెను. వజ్రము దెబ్బ తగిలి వ్యాకులుడైన హనుమంతుడు పడిపోగానే వాయువు ప్రజలకు కష్టము కలుగువిధముగా ఇంద్రుని మీద కోపించెను. ప్రజలలోపల నివసించు సర్వసమర్థుడైన ఆ వాయువు, తన సంచారమును ఆపివేసి, శిశువైన తన కుమారుణ్ణి తీసికొని ఒక గుహలో ప్రవేశించెను. (44-49)

ప్రజల మలమూత్రస్థానములను అడ్డగించి, గొప్ప బాధ కలిగించెను. సకలభూతములను, ఇంద్రుడు వర్షములను నిరోధించి నట్లు నిరోధించెను. ప్రపంచకమునందు అంతటా ప్రాణుల ఉచ్ఛ్వాసము ఆగిపోయినవి. వాయుప్రకోపమువలన కీళ్ళు పట్టులు తప్పి ప్రాణు లన్నీ కఱ్ఱలు వలె అయిపోయినవి. వాయుప్రకోపమువలన స్వాధ్యాయము, వషట్కారము (దేవతలకు చేయు హవిఃసమర్పణము) ఆగిపోయినవి. క్రియలు అన్నీ నిలచిపోయినవి. ధర్మాచరణము



ప్రోగువలె ఉన్న ఉదయించుచున్న సూర్యుడు కనబడెను. అది ఫల మనుకొని దానియందు ఆసక్తిచేత ఆ శిశువు సూర్యుని దగ్గరకు ఎగిరెను. రెండవ బాలసూర్యునివలె ఉన్న ఆ బాలుడు బాలార్కుణ్ణి గ్రహించు కోరికతో, బాలార్కునికి అభిముఖుడై ఆకాశమధ్యమునందు ఎగిరెను. (19-24)

హనుమంతుడు ఈ విధముగా శైశవమునందు ఎగురుచుండగా దేవ-దానవ-యక్షులు చాలా ఆశ్చర్యము చెందిరి. "అత్యున్నతమైన ఆకాశముమీదికి ఈ వాయుపుత్రుడు ఎంత వేగముగా ఎగురుచున్నాడో అంత వేగము వాయువునకు గాని, గరుత్మంతునికి గాని మనస్సుకు గాని లేదు. "శిశువై ఉండగానే ఇతనికి ఇంత గమనవేగ మున్నచో యౌవనమును, బలమును పొందిన పిమ్మట ఇతని వేగము ఎంత ఉండునో!" అనుకొనుచుండిరి. అప్పుడు వాయువు ఎగురుచున్న తన పుత్రుణ్ణి సూర్యునివలన కలుగు దాహభయమునుండి రక్షించుచు, మంచుగడ్డవలె చల్లగా అయి, ఎగురుచున్న అతని వెనుకనే ఎగురుచు వెళ్ళుచుండెను. ఆ శిశువు తండ్రియైన వాయువు బలమువలనా, బాల్యమువలనా, కొన్నివేల యోజనముల దూరమును అక్రమించుచు, ఆకాశములో సూర్యుని దగ్గరకు వెళ్ళెను. "ఇతడు శిశువు, తప్పొప్పులు తెలియనివాడు. ఇతడు దేవతాకార్యము కూడ చేయవలసిఉన్నది" అని ఆలోచించి సూర్యుడు అతనిని కాల్చలేదు. ఈ హనుమంతుడు సూర్యుని దగ్గరకు ఎగిరిన దివసమునందే రాహువు సూర్యుణ్ణి పట్టుకొనుటకు వచ్చెను. సూర్యుని రథముమీద ఉన్న ఆ రాహువును హనుమంతుడు స్పృశించగానే సూర్యచంద్రులను మ్రింగే ఆ రాహువు కూడ భయపడిపోయెను. (25-32)

రాహువు కోపముతో ఇంద్రభవనమునకు వెళ్ళి కనుబొమ్మలు విరచి దేవతాగణములతో కూడిన ఆ ఇంద్రునితో- "ఇంద్రా! చంద్రసూర్యులను నాకు ఆహారముగా ఇచ్చిన నీవే ఆ ఆహారమును మరొకరికి కూడా ఇచ్చినావు! ఇది ఏమిటి? ఈ రోజున పర్వకాలమునందు సూర్యుణ్ణి పట్టుకొనుటకై నేను వచ్చుసరికి మరొకడు సూర్యుణ్ణి పట్టుకొన్నాడు?" అని అడిగెను. ఆ మాటలు విని ఇంద్రుడు తొందరపడుచు, బంగారుమాల ధరించి ఆసనము విడచి వెంటనే లేచి, కైలాసశిఖరము వంటి కాంతిగల నాలుగు దంతములు గల మదమును స్రవించుచున్న,

అక్షకుమారుని చంపినాడు. బంధమునుండి విముక్తుడై ఇతడు మరల రావణునితో మాటలాడి, అగ్ని భూమిని భస్మము చేసినట్లు లంకను భస్మముచేసెను. యుద్ధములో హనుమంతుడు ఎట్టి పనులు చేసెనో అట్టి పనులు యముడుగాని, ఇంద్రుడుగాని, విష్ణువు గాని కుబేరుడు కాని చేసినట్లు వినబడదు.(1-8)

అతని బాహుబలముచేతనే నేను లంకను, సీతను, లక్ష్మణుణ్ణి, జయమును, రాజ్యమును, మిత్రులను, బంధువులను పొందగల్గితిని. సుగ్రీవుని మిత్రుడైన హనుమంతుడే నాకు లేకున్నచో సీత జాడనైనా తెలిసికొనగలిగినవాడు ఎవడైనా ఉన్నాడా? అప్పుడు వాలిసుగ్రీవులకు వైరము ఏర్పడినప్పుడు ఈ హనుమంతుడు సుగ్రీవునకు ప్రియము చేయవలె నను కోరికతో వాలిని, మొక్కను వలె, ఎందుకు కాల్చివేయలేదు? హనుమంతుడు తన జీవితముతో సమానముగా ఇష్టుడైన సుగ్రీవుడు బాధపడుచుండగా చూచుచు ఊరుకొన్నా దనగా - అతనికి తన బలము ఎంతటిదో తెలియదు అని అనుకొనుచున్నాను. దేవతలచేత పూజింపబడు మహామునీ! హనుమంతునికి సంబంధించిన ఈ విషయము నంతను నాకు సవిస్తరముగా, ఉన్నది ఉన్నట్లు చెప్పుము." అని అడిగెను.(9-13)

అప్పుడు అగస్త్యుడు హేతుయుక్తమైన రాముని మాట విని హనుమంతుని ఎదుటనే ఇట్లు పలికెను- "రామా! హనుమంతుని విషయమునందు నీవు చెప్పినది నిజమే. బలమునందు గాని, బుద్ధియందు గాని ఇతనితో సమానుడు మరొకడు లేడు. రామా! పూర్వము హనుమంతునకు వ్యర్థము కాని శాపము ఇవ్వగల మునులు శాప మిచ్చిరి. ఆ శాపముచేత ఇతడు బలవంతుడే అయినను తనకు ఎంత బల మున్నదో ఎరుగడు. బాల్యములో కూడ ఇతడు ఎంతటి పనిచేసినాడో అది వర్ణింప శక్యము కాదు. ఇతడు అజ్ఞానముచేతనే ఈవిధముగా కూర్చొని ఉన్నాడు. రామా! నీకు వినవలె నని కోరిక ఉన్నచో సావధానచిత్తముతో వినుము; చెప్పెదను.(14-18)

సూర్యుడిచ్చిన వరముచేత సువర్ణమయమైన మేరుపర్వత మున్నది. అక్కడ ఈ హనుమంతుని తండ్రియైన కేసరి రాజ్యమును పాలించుచున్నాడు. అతనికి అంజన అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఇష్టురాలైన భార్య ఉండెను. ఆమెయందు వాయుదేవుడు ఉత్తముడైన పుత్రుణ్ణి పుట్టించెను. అంజన వరిగింజముల్లు వంటి పచ్చని శరీరకాంతి గల ఈ హనుమంతుణ్ణి కనెను. ఉత్తమురా లైన ఆమె పండ్లు తీసికొనివచ్చుటకై దట్టమైన అడవిలో ప్రవేశించెను. తల్లి దగ్గర లేకపోవుటచేతను, ఆకలిచేతను మిక్కిలి పీడింపబడిన శిశువుగా ఉన్న ఈ హనుమంతుడు శరవణములో శిశువుగా ఉన్న కుమారస్వామివలె ఏడ్చెను. అప్పుడు ఆ శిశువునకు జపాపుష్పముల

మనస్సు, వాయువు, గరుత్మంతుడు అను మూడు భూతాలకూ నీకూ మాత్రమే ఉన్నది. సంశయము లేదు. ఓ! వానరశ్రేష్ఠా! నీ బలమెంతటిదో నా కిప్పుడు తెలిసినది. నీతో చిరకాలము అగ్నిసాక్షికముగా, ఘనమైన స్నేహమును కోరుచున్నాను. వానరరాజా! భార్యలు, పుత్రులు, పురము, రాష్ట్రము, భోగములు, అచ్ఛాదనములు, భోజనమూ అన్నీ కూడ మనిద్దరికీ కలసి ఉండగలవు.(34-41)


పిమ్మట ఆ వాలి రావణులు అగ్నిని రగిల్చి, పరస్పరము కౌగిలించుకొని భ్రాతృత్వమును(సోదరస్నేహమును) పొందిరి. పరస్పరము చేతులు కలిపి సంతోషించుచు రెండు సింహములు పర్వతగుహలో ప్రవేశించి నట్లు కిష్కింధలో ప్రవేశించిరి. రావణుడు అక్కడ సుగ్రీవుడు వలె (సోదరుడు వలె) ఒక మాసము ఉండెను. ఇంతలో మూడు లోకములను పీడింపవలె నని కోరిక గల అమాత్యులు అతనిని తీసికొని వెళ్ళిరి. రామా! పూర్వము ఈవిధముగా జరిగినది. వాలి రావణుణ్ణి అవమానించి తరువాత అగ్నిసాక్షికముగా అతనితో మైత్రి చేసికొన్నాడు. రామా! ఈవిధముగా వాలి బలము చాల గొప్పదిగా, సాటిలేనిదిగా ఉండెను. అతనిని కూడా నీవు మిడతను మాడ్చివేసి నట్లు మాడ్చివేసినావు.(42-46)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది నాలుగవ సర్గము సమాప్తము.**

# ముప్పది ఐదవ సర్గము

## రాముడు ప్రశ్నించగా అగస్త్యుడు హనుమంతుని జన్మపరాక్రమాదులను వర్ణించి చెప్పుట.

అప్పుడు రాముడు అగస్త్యుణ్ణి ప్రశ్నించుచు, వినయవంతుడై అంజలి ఘటించి– "మహామునీ! వాలిబలము, రావణుని బలము సాటిలేనిదే. కాని వీళ్ళిద్దరి బలము హనుమంతుని బలముతో సమానము కాదని నా అభిప్రాయము. శౌర్యము, సామర్థ్యము, బలము, ధైర్యము, బుద్ధి, నీతి, యుక్తమైన కార్యమును సాధించుట, పరాక్రమము, ప్రభావము ఇవన్నీ హనుమంతుణ్ణి ఆశ్రయించుకొని ఉన్నవి. మహాబాహువైన ఇతడు సముద్రమును చూడగానే దిగులుచెందిన వానరసేనను చూచి, ఓదార్చి, వంద యోజనముల దూరము దాటినాడు. అప్పు డితడు లంకను ఎదిరించి, అంతఃపురమును చూచి సీతతో మాటలాడి ఆమెను ఓదార్చినాడు. అక్కడ ఒక్క హనుమంతుడే సేనానాయకులైన మంత్రికుమారులను, కింకరులను,



గొప్ప వేగము గల ఆ వాలి సంధ్యాకాలమునందు, పక్షులు ఎగరని సముద్రములను అన్నింటినీ వరుసగా చూచి నమస్కరించెను. దేవతలచేత పూజింపబడుచు, రావణసహితుడై పశ్చిమసముద్రము చేరెను. ఆ సముద్రమునందు స్నానము చేసి, సంధ్యోపాసన చేసి, జపించి రావణుడ్ణి మోసికొనుచు ఉత్తర సముద్రమునకు వెళ్ళెను. ఈ విధముగా శత్రువుతో కూడ ఎగురుచు ఎన్నో వేల యోజనముల దూరము వాయువువలె, మనస్సు వలె వెళ్ళెను. వాలి ఉత్తర సముద్రమునందు సంధ్యోపాసన చేసి రావణుడ్ణి మోసికొనుచూ తూర్పు సముద్రమునకు వెళ్ళెను. అక్కడ కూడ సంధ్యోపాసన చేసి రావణుడ్ణి తీసికొని కిష్కింధవైపు వెళ్ళెను. ఈ విధముగా నాలుగు సముద్రముల వద్ద సంధ్యను ఉపాసించి రావణుడ్ణి మోయుటచేత అలసి కిష్కింధ దగ్గరనున్న ఉద్యానవనమునందు దిగెను. (27-33)

అప్పుడు వాలి రావణుడ్ణి తన చంకనుండి క్రిందకు విడిచి, నవ్వుచు "నీవు ఎక్కడినుండి వచ్చినావు" అని అతనిని అడిగెను. రావణుడు చాల ఆశ్చర్యపడుచు, అసలటచేత కదలిపోవుచున్న చూపులతో ఆ వాలితో- "మహేంద్రునివంటి వానరేంద్రా! నేను రాక్షసరాజునైన రావణుడను. యుద్ధముకొరకై ఇక్కడికి వచ్చినాను. అట్టి నన్ను నీ వీ విధముగా పీడించితివి. నీవు నన్ను పశువువలె పట్టి నాలుగు సముద్రములు త్రిప్పించినావు. ఏమి బలము! ఏమి పరాక్రమము! ఏమి గాంభీర్యము! వీరుడా! ఈవిధముగా అలసట లేకుండా, నన్ను కూడ మోయుచు మరొక ఏ వీరుడు శీఘ్రముగా మహాసముద్రములకు వెళ్ళగలడు! ఓ! వానరరాజా! ఇట్టి గమనము

వాలిని చూడగలవు."(4-10)

రావణుడు ఇట్లు మాట్లాడినందుకు తారుణ్ణి జళిపించి, పుష్పకమెక్కి దక్షిణ సముద్రమునకు వెళ్ళెను. రావణుడు అక్కడ సంధ్యోపాసన చేయుచున్న వాలిని చూచెను. అతడు మేరుపర్వతమువలె ఉండెను. అతని ముఖము లేత సూర్యునివలె ఉండెను. కాటుకవంటి శరీరచ్ఛాయ గల ఆ రావణుడు పుష్పకవిమానమునుండి దిగి వాలిని పట్టుకొనుటకై అడుగులు చప్పుడు కాకుండగా, శీఘ్రముగా వెళ్ళెను. అప్పుడు వాలి కూడ రావణుణ్ణి దైవవశముచేత చూచెను. కాని అతడు వాని చెడ్డ అభిప్రాయము తెలిసికొని కూడ కంగారుపడలేదు. చెవులపిల్లిని చూచి సింహము వలె, సర్పమును చూచి గరుత్మంతునివలె, చెడ్డ అభిప్రాయముతో ఉన్న ఆ రావణుణ్ణి చూచి వాలి ఏమీ లెక్కచేయలేదు.(11-15)

"నన్ను పట్టుకొనవలె నను చెడ్డ సంకల్పముతో వచ్చుచున్న ఈ రావణుణ్ణి చంకలో వ్రేలాడునట్లు ఉంచుకొని, మూడు మహాసముద్రములకు వెళ్ళెదను. శత్రువైన ఈ రావణుడు, గరుత్మంతునికి చిక్కిన సర్పమువలె, నాకు చిక్కి, చేతులూ తొడలూ వస్త్రమూ జార్చి వ్రేలాడుచుండగా జనులు చూచెదరుగాక". ఈ విధముగా ఆలోచించి, వాలి - ఏమీ మాటలాడక, వేదమంత్రములు జపించుచు, పర్వతరాజువలె కదలకుండా ఉండెను. ఒకరి నొకరు పట్టుకొనగోరుచున్న, బలముచేత దృప్తులైన ఆ వాలి - రావణులు ఆ పని సాధించుటకై ప్రయత్నము చేసిరి. వాలి అటువైపు తిరిగి ఉన్నా కూడ అడుగుల చప్పుడును పట్టి ఆ రావణుడు చేతికి అందే టట్లు ఉన్నాడని గ్రహించి పక్షి సర్పమును పట్టుకొని నట్లు అతనిని పట్టుకొనెను.(16-20)

వాలి, తనను పట్టుకొనుటకై వచ్చిన ఆ రావణుణ్ణి పట్టుకొని, చంకలో వ్రేలాడునట్లు చేసికొని వేగముగా అకాశములోనికి ఎగిరెను. మాటిమాటికి గోళ్ళతో గీరుచు బాధించుచున్న ఆ రావణుణ్ణి వాలి వాయువు మేఘమును అపహరించి నట్లు ఎత్తుకొనిపోయెను. వాలి రావణుణ్ణి అపహరించుకొనిపోవుట చూచి అతని మంత్రులైన రాక్షసులు అతనిని విడిపించుటకై అరచుచు వాలిని వెంబడించిరి. రాక్షసులు వెంబడించుచున్న ఆకాశమధ్యమునందున్న ఆ వాలి, మేఘములచేత వెంబడింపబడిన, ఆకాశమునందున్న సూర్యుడువలె ప్రకాశించెను. ఆ రాక్షసశ్రేష్ఠులు వాలిని చేరజాలక అతని బాహువులు, తొడల వేగముచేత అలసిపోయినవారై ఆగిపోయిరి. వాలి వెళ్ళుచుండగా అతని మార్గమునందు పెద్ద పర్వతములు కూడ తప్పుకున్నవి. మాంసశోణితము లున్న, ప్రాణములపై తీపి ఉన్నవాటి మాట చెప్పవలెనా?(21-26)

మరల విడువబడెను. రామా! ఒకడు బలవంతుడు అయితే అతనికంటె బలవంతులు మరికొందరు ఉందురు. అందుచేత తనకు శ్రేయస్సు కోరుకొనువాడు శత్రువు విషయమున అనాదరము చూపకూడదు. రావణుడు కార్తవీర్యార్జునునితో స్నేహము చేసికొని మరల రాజులను హింసించుచు, గర్వముతో భూలోకమునం దంతటా సంచరించెను. (20-23)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది మూడవ సర్గము సమాప్తము.**

# ముప్పది నాలుగవ సర్గము

## రావణుడు వాలినుండి పరాభవము పొంది అతనితో మైత్రి చేసుకొనుట.

అర్జునునిచేత విడువబడిన రాక్షసప్రభువైన రావణుడు, అట్లు నిర్భయుడుగా చేయబడి, దిగులు లేక భూమిమీద అంతటా సంచరించెను. దృప్తుడైన రావణుడు రాక్షసుడైనా, మనుష్యుడైనా ఎవడు గొప్పబలము గలవాడు అని వినునో అతని వద్దకు వెళ్ళి యుద్ధమునకు పిలచుచుండెడివాడు. ఒకనాడు అతడు వాలి పాలించుచున్న కిష్కింధానగరికి వెళ్ళి బంగారు మాల ధరించి వాలిని యుద్ధమునకు పిలచెను. (1-3)

అప్పుడు యద్ధము కావలెనను కోరికతో వచ్చిన ఆతనితో వాలి మంత్రి, తార తండ్రి, సమర్థుడూ అయిన తారు డను వానరుడు ఇట్లు పలికెను- "రాక్షసరాజా! నిన్ను ఎదిరించగల వాలి బైటకు వెళ్ళినాడు. ఇంక నీ ఎదుట నిలవగలిగిన మరొక వానరుడు ఎవడున్నాడు? రావణా! వాలి నాలుగు సముద్రములవద్దా సంధ్యోపాసన చేసి ఈ ముహూర్తకాలమునందే రాగలడు. ముహూర్తకాలము నిలబడుము. ఇక్కడ పడిఉన్న శంఖమువలె తెల్లగా ఉన్న ఎముకల గుట్టలను చూడుము. ఇవి యుద్ధమునకు కోరివచ్చి, వాలి తేజస్సుచేత మరణించినవాళ్ళ ఎముకలు. రాక్షసుడవైన రావణా! నీవు అమృతరసము త్రాగి ఉన్నా కూడ నీవు వాలిని సమీపించితివా, నీ జీవితము అంతటితో ఆఖరు. రావణా! ఇప్పుడు జగదాశ్చర్యకరుడైన ఈ వాలిని చూడుము. ఒక్క ముహూర్తము ఆగుము. ఇటుపై నీకు ముహూర్తకాలము దొరకదు. లేదా - చిత్రమైన ఈ జగత్తును చూచుచు కొంచెము సేపైనా ఆనందించుము. వాలితో యుద్ధానికి తలపడితివా నీకు అవకాశము దొరకదు. లేదా నీకు ఇప్పుడే మరణించవలె నని ఉన్నచో దక్షిణసముద్రమునకు వెళ్ళుము. అక్కడ భూమిపైన ఉన్న అగ్నివలె

ఆ రాజేంద్రుడు పులస్త్యునకు మధుపర్కము, గోవు, పాద్యము, అర్ఘ్యము సమర్పించి సంతోషముతో గద్గదమైన వాక్కుతో– "ఓ! బ్రాహ్మణశ్రేష్ఠుడా! నేడు నేను చూచుటకు శక్యముకాని నిన్ను చూడ గల్గుచున్నాను. అందుచే నేడు ఈ మాహిష్మతీనగరము అమరావతితో సమానమైనదిగా చేయబడినది. దేవా! నేడు నేను దేవతాగణములచేత నమస్కరింపదగిన నీ పాదములకు నమస్కారము చేయుచున్నాను. అందుచేత నాకు కుశలము కలిగినది. నా వ్రతము క్షేమయుక్త మైనది. నా జన్మ సఫల మైనది. నా తపస్సు సఫల మైనది. బ్రాహ్మణోత్తమా! ఇదిగో రాజ్యము, ఇదిగో నా పుత్రులు, ఇదిగో నా భార్య. మేము ఇక్కడ ఉన్నాము. మేమందరమూ నీ కేమి చేయవలెనో, నీ పని ఏమో ఆజ్ఞాపించుము." అని పలికెను.(9-12)

పులస్త్యుడు ఆ హేహయరాజును– "నీ ధర్మము నిర్విఘ్నముగా సాగుచున్నదా? పుత్రులు కుశలముగా ఉన్నారా? అగ్నిహోత్రాదులు చక్కగా జరుగుచున్నవా?" అని ప్రశ్నించి మరల ఇట్లు పలికెను– "ఓ! రాజా! రావణుణ్ణి కూడా జయించిన నీ బలము సాటి లేనిది. సముద్రమూ వాయువూ కూడ ఎవనికి భయపడి, నిశ్చలములై సేవ చేయుచుండునో, అట్టి, యుద్ధములో జయింపశక్యము కాని నా పౌత్రుణ్ణి నీవు యుద్ధములో జయించినావు. నాయనా! నీవు నా మనుమని కీర్తిని త్రాగివేసి "రావణవిజేత' అను పేరు చాటుకొనినావు. నేను యాచించుచున్నాను. నా మాట విని రావణుణ్ణి విడిచి పెట్టుము."(13-16)

రాజశ్రేష్ఠు డైన కార్తవీర్యార్జునుడు పులస్త్యుని ఆజ్ఞను అంగీకరించి, ఏమీ మాటలాడక, సంతోషపూర్వకముగా రావణుణ్ణి విడిచిపెట్టెను. అర్జునుడు దేవతల శత్రువైన ఆ రావణుణ్ణి విడిచిపెట్టి, దివ్యములైన అలంకారములచేత, మాలికలచేత, వస్త్రములచేత అతనిని సత్కరించి "పరస్పరము మనము హింసించుకొనకూడదు" అని అగ్నిసాక్షిగా స్నేహము చేసికొని, బ్రహ్మపుత్రుడైన పులస్త్యునకు ప్రణామముచేసి స్వగృహమునకు వెళ్ళెను. జయింపబడుటచే సిగ్గుపడుచున్న ప్రతాపవంతుడైన రావణునకు అర్జునుడు ఆతిథ్యము చేసి, కౌగలించుకొని పంపివేసెను. పులస్త్యుడు కూడ లంకకు వెళ్ళుటకై వానికి అనుమతి ఇచ్చెను.(17-19)

బ్రహ్మదేవుని కుమారుడు, మునిశ్రేష్ఠుడూ అయిన పులస్త్యుడు రావణుణ్ణి విడిపించి బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయెను. మహాబలశాలియైన రావణుడు ఈ విధముగా కార్తవీర్యునివలన అవమానమును పొందెను. పులస్త్యుని మాటలవలన

కురిపించెను. అప్పుడు శత్రుసంహారకుడైన అర్జునుడు కంగారు పడక ఆ రాక్షసుల ఆయుధములు తన మీద పడకుండగనే శీఘ్రముగా పట్టుకొనెను. పిమ్మట పట్టుకొనుటకు శక్యముకాని ఆ శ్రేష్ఠములైన ఆయుధముల చేతనే రాక్షసులను భేదించి వాయువు మేఘములను ఎగురకొట్టి నట్లు ఎగురకొట్టెను. ఆ విధముగ రాక్షసులను భయపెట్టి రావణుని తీసికొని స్నేహితులతో కలసి నగరములో ప్రవేశించెను. పిమ్మట దేవేంద్రునితో సమానమైన ఆ కార్తవీర్యార్జునుడు, బలిని నిగ్రహించిన దేవేంద్రుడు వలె బ్రాహ్మణులు, పౌరులు, పుష్పములు, అక్షతలూ చల్లుచుండగా తన నగరములో ప్రవేశించెను.(67-73)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ముప్పది రెండవ సర్గము సమాప్తము.**

# ముప్పది మూడవ సర్గము

## పులస్త్యుడు వచ్చి రావణుణ్ణి బంధనమునుండి విడిపించుట.

వాయువును బంధించుట ఎంత ఆశ్చర్యకరమో అంత ఆశ్చర్యకరమైన రావణబంధనమును గూర్చి స్వర్గలోకములో దేవతలు చెప్పగా పులస్త్యుడు వినెను. అప్పుడు మహాధైర్యవంతుడైన ఆ మహర్షి పుత్రప్రేమచేత కంపింపచేయబడినవాడై కార్తవీర్యార్జునుని చూచుటకు వచ్చెను. వాయువుతో సమానమైన గమనము గల ఆ పులస్త్యుడు వాయుమార్గమునందు ప్రయాణముచేసి, మనోవేగముతో మాహిష్మతీనగరమును చేరెను. బ్రహ్మదేవుడు ఇంద్రుని అమరావతిలో ప్రవేశించినట్లు ఆ పులస్త్యుడు అమరావతితో సమానమైన, బలిసి సంతోషముతో ఉన్న జనులతో నిండిన, మాహిష్మతీపురమును ప్రవేశించెను. అప్పుడు అక్కడి జనులు కాలినడకతో వచ్చుచున్న సూర్యుడు వలె చూచుటకు శక్యముకాకుండా ఉన్న ఆ పులస్త్యుణ్ణి చూచి, గుర్తించి, అర్జునునకు తెలిపిరి. కార్తవీర్యార్జునుడు వాళ్ళ మాటలవలన పులస్త్యుడు వచ్చినట్లు తెలుసుకొని, శిరస్సుపై అంజలి ఘటించి ఆయనకు ఎదురేగెను. కార్తవీర్యార్జునుని పురోహితుడు అర్ఘ్యమును మధుపర్కమును తీసికొని, బృహస్పతి దేవేంద్రుని ముందు వెళ్ళినట్లు అతని ముందు వెళ్ళెను. పిమ్మట, ఉదయించుచున్న సూర్యుడు వలె ఉన్న, వచ్చుచున్న ఆ పులస్త్యమహర్షిని చూచి, అర్జునుడు కంగారుపడుచు, ఇంద్రుడు ఈశ్వరునకు నమస్కరించినట్లు అతనికి నమస్కరించెను. (1-8)

అధికముగా కొట్టుకొనిరి.(51-53)

పర్వతములు ఘోరములైన వజ్రాయుధప్రహారములను సహించినట్లు ఆ అర్జునరావణులు ఆ యుద్ధమునందు గదాప్రహారములను సహించిరి. ఉరుములవలన ప్రతిధ్వనులు పుట్టినట్లు వారిద్దరి గదల కుమ్ములాటలచేత అన్ని దిక్కులూ ప్రతిధ్వనించినవి. శత్రువు వక్షఃస్థలముమీద పడవేయబడిన అర్జునుని గద, బాగా ప్రకాశించుచున్న మెరుపువలె, ఆకాశమును బంగారు రంగు గలదానిని చేసెను. అట్లే రావణుడు మాటిమాటికి అర్జునుని వక్షఃస్థలముమీద వేసి కొట్టుచున్న గద మహాపర్వతము మీద పడుచున్న ఉల్కవలె ప్రకాశించెను. కార్తవీర్యార్జునునకు గాని రావణునకు గాని అలసట కలగలేదు. వారిద్దరి మధ్యా జరుగుచున్న యుద్ధము బలి-ఇంద్రుల యుద్ధము వలె హెచ్చుతగ్గులు లేకుండ ఉండెను. రెండు ఆబోతులు కొమ్ములతో వలె, రెండు గజములు దంతాగ్రములచేత వలె, ఆ కార్తవీర్యార్జున-రావణులు పరస్పరము కొట్టుకొనుచు యుద్ధము చేసిరి.(54-59)

అప్పుడు కోపించిన కార్యవీర్యార్జునుడు తన ప్రాణబలమునంతను ఉపయోగించి, ఆ గదను రావణుని విశాలమైన వక్షఃస్థలముమీద విడచెను. ఆ గద వరదానముచేత రక్షింపబడుచున్న ఆ రావణుని వక్షఃస్థలము మీద బలహీనమువలె అయి, పడినవేగానికి రెండు ముక్కలై నేలమీద పడెను. అర్జునుడు ప్రయోగించిన ఆ గద దెబ్బకు రావణుడు బారెడు దూరము వెనుకకు పోయి అరచుచు క్రింద పడిపోయెను. కార్తవీర్యార్జునుడు అప్పుడు రావణుడు వ్యాకులుడై ఉండుట చూచి, వెంటనే ఎగిరి మీదపడి, గరుత్మంతుడు సర్పమును పట్టి నట్లు వానిని పట్టుకొనెను. బలవంతుడైన ఆ కార్తవీర్యార్జునుడు రావణుణ్ణి తన వేయి బాహువులతో బలాత్కారముగా పట్టి నారాయణుడు బలిని బంధించినట్లు వానిని బంధించెను. రావణుడు బంధింపబడుచున్నప్పుడు సిద్ధ-చారణ-దేవతలు "బాగు బాగు"అని అనుచు అర్జునుని శిరస్సుపై పుష్పములు చల్లిరి. పెద్దపులి లేడిని వలె, సింహము ఏనుగునువలె రావణుని పట్టి బంధించి కార్తవీర్యార్జునుడు, సంతోషముతో మాటిమాటికి మేఘమువలె గర్జించెను.(60-66)

ప్రహస్తుడు తెప్పరిల్లి రావణుడు బంధింపబడి ఉండుటచూచి వెంటనే కోపముతో కార్తవీర్యార్జునుని మీదికి వెళ్ళెను. వచ్చిపడుచున్న ఆ రాక్షసుల వేగము వర్షాకాలమునందు సముద్రములో ఏర్పడిన మేఘముల వేగమువలె ఉండెను. "విడుపుము విడుపుము, ఆగుము ఆగుము"అని మాటిమాటికి అరచుచు రాక్షసులు వచ్చిరి. ప్రహస్తుడు అప్పుడు యుద్ధమునందు ముసలములు, శూలములు

అప్పుడా అర్జునుడు "భయపడకుడు"అని స్త్రీలతో చెప్పి గంగాజలమునుండి అంజన మను దిగ్గజము లేచినట్లు ఆ జలమునుండి పైకి లేచెను. అప్పుడు క్రోధముచేత ఎఱ్ఱబడిన నేత్రములు గల కార్తవీర్యార్జును డనే అగ్ని భయంకరమైన ప్రళయకాలాగ్నివలె మండిపడెను. శ్రేష్ఠములైన బంగారు అంగదములు ధరించిన ఆ కార్తవీర్యార్జునుడు గద ధరించి చీకట్లను ఎదిరించుటకు సూర్యుడు వలె ఆ రాక్షసులను ఎదిరించుటకు శీఘ్రముగా వెళ్ళెను. అర్జునుడు బాహువులచేత త్రిప్పబడుచున్న గొప్ప గదను ధరించి గరుత్మంతుని వంటి వేగముతో శీఘ్రముగా వచ్చెను. వింధ్యపర్వతము వలె కదల్ప శక్యము కానివాడైన ప్రహస్తుడు ముసలమును ధరించి వింధ్యపర్వతము సూర్యుని మార్గమును వలె అతని మార్గమును అడ్డుకొనెను. మదముచేత మితిమీరి ఉన్న ఆ ప్రహస్తుడు కోపించి, ఇనుముతో బిగించిన, భయంకరమైన ముసలమును అతనిపై ప్రయోగించుచు యముడు వలె అరచెను. ప్రహస్తుడు విడచిన ఆ ముసలము చివర అశోకపుష్పముల గుత్తి వలె ఎఱ్ఱగా ఉన్న, దహించుచున్న అగ్ని పుట్టెను. అప్పుడు కార్తవీర్యార్జునుడు ఏమాత్రము దిగులు చెందక, శీఘ్రముగా వచ్చి మీద పడుచున్న ముసలమును, గదతో నేర్పుగా తప్పించుకొనెను. (38-45)

అప్పుడు గదాధారియై కార్తవీర్యార్జునుడు ఐదువందల చేతుల పొడవు ఉన్న, పెద్దదైన గదను త్రిప్పుచు వానిమీదికి పరుగెత్తెను. మహావేగముతో ఈ గదచేత కొట్టబడిన ప్రహస్తుడు అప్పుడు ఇంద్రుని వజ్రముచేత కొట్టబడిన పర్వతము వలె పడిపోయెను. ప్రహస్తుడు పడిపోవుట చూడగానే మారీచ-శుక-సారణ-మహోదర-ధూమ్రాక్షులు యుద్ధభూమినుండి పారిపోయిరి.' ప్రహస్తుడు పడిపోయిన పిమ్మట అమాత్యులు పారిపోగా రావణుడు రాజశ్రేష్ఠుడైన కార్తవీర్యార్జునుని మీదికి శీఘ్రముగా వెళ్ళెను. అక్కడ వేయి బాహువు లున్న కార్తవీర్యార్జుననికీ ఇరవై బాహువు లున్న రావణునికీ మధ్య భయంకరమూ, ఆశ్చర్యజనకమూ అయిన యుద్ధము ప్రారంభ మయ్యెను. (46-50)

క్రోధావేశముతో ఉన్న ఆ రావణ-కార్తవీర్యార్జునులు క్షోభ చెందిన రెండు సముద్రములవలె, మొదళ్ళు కదలిన రెండుపర్వతముల వలె, తేజస్సు గల ఇద్దరు సూర్యుల వలె, కాల్చుకొనుచున్న రెండు అగ్నులవలె, ఒక ఆడ ఏనుగు కోసమై పోరాడుచున్న బలముచేత ఉద్ధతములై ఉన్నరెండు గజముల వలె, రెండు ఆబోతులవలె, ఉరుముచున్న రెండు మేఘముల వలె, బలముచేత తీవ్రములుగా ఉన్న రెండు సింహముల వలె, రుద్ర-యముల వలె ఉండిరి. గదలు ధరించి ఒకరి నొకరు

నిమిత్తమై మనస్సులో బాధపడకుము. పుత్రా! దైవము చాలా గొప్పది. ఆ దైవమే నా కీ కష్టము తెచ్చిపెట్టినది. వత్సా! ప్రతిఒక్కడూ కూడ పూర్వజన్మలో చేసిన కర్మల ననుసరించి పొందదగిన ధనాదులను పొందును. వెళ్ళవలసిన స్థానములకు వెళ్ళును. రావలసిన దుఃఖములను గాని సుఖములను గాని అనుభవించును. అందుచే నా కోసమై దుఃఖించకుము." లక్ష్మణా! మహాకీర్తిశాలియైన ఆ నృగమహారాజు పుత్రున కిట్లు బోధించి, చక్కగా ఏర్పరుపబడిన గోతిలో నివసించుటకై వెళ్ళిపోయెను. మహాత్ముడైన ఆ నృగమహారాజు రత్నములచేత అలంకరింపబడిన ఆ పెద్ద గోతిలో ప్రవేశించి, ఆ ఇద్దరు బ్రాహ్మణుల కోపముతో ఇచ్చిన శాపమును అనుభవించుట ప్రారంభించెను.(13-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది నాలుగవ సర్గము సమాప్తము.**

# ఏబది ఐదవ సర్గము

## నిమిచక్రవర్తి వసిష్ఠుడు ఒకరి నొకరు శపించుకొని దేహములు త్యజించుట.

**ల**క్ష్మణా! నృగశాపమును గూర్చిన విశేషములు చెప్పినాను. నీకు శ్రద్ధ ఉన్నచో మరొక కథ చెప్పెదను; వినుము. లక్ష్మణుడు రాముని మాటలు విని "రాజా! ఆశ్చర్యకరములైన కథలు వినుటలో నాకు సంతృప్తి లేదు" అనెను. లక్ష్మణు డిట్లు అనగా, ఇక్ష్వాకుకులమునకు ఆనందకరుడైన రాముడు చాల ధర్మసంమతమైన ఒక కథ చెప్పుటకు ఉపక్రమించెను.(1-3)

"మహాత్ములైన ఇక్ష్వాకుపుత్రులలో పండ్రెండవవాడు, పరాక్రమమునందు, ధర్మమునందూ స్థిరుడూ అయిన నిమి అను రాజు ఉండెను. గొప్ప పరాక్రమము గల ఆ రాజు గౌతమాశ్రమము దగ్గర దేవతాపురమైన అమరావతితో సమానమైన నగరమును నిర్మింపచేసెను. ఆ పట్టణమునకు వైజయంతము అను ప్రసిద్ధమైన చక్కని పేరు పెట్టిరి. మహాయశఃశాలీ రాజర్షీ అయిన నిమి ఆ నగరములో నివాస మేర్పరుచుకొనెను. ఆ మహాపురమును నిర్మించిన పిదప అతనికి - "తండ్రిగారి మనస్సుకు ఆనందము కలిగించుచు ఒక దీర్ఘసత్రము (కొన్ని సంవత్సరముల పాటు చేయవలసిన యజ్ఞము) చేసెదను" అను బుద్ధి కలిగెను. పిమ్మట అతడు తన తండ్రీ, మనుచక్రవర్తి కుమారుడూ అయిన ఇక్ష్వాకువును ఆహ్వానించి, ముందుగా

బ్రహ్మర్షులలో ఉత్తముడైన వసిష్ఠుణ్ణి ఋత్విక్కుగా వరించెను. పిదప నిమి అత్రిని, అంగిరసుని, తపోనిధియైన భృగువునూ కూడ వరించెను. వసిష్ఠుడు రాజర్షులలో శ్రేష్ఠుడైన ఆ నిమితో – "నన్ను ముందుగా ఇంద్రుడు వరించి ఉన్నాడు; సమయానికై వేచి ఉండుము" అని పలికెను. పిదప గొప్ప బ్రాహ్మణుడైన గౌతముడు (వసిష్ఠుని స్థానమును) పూరించెను. గొప్ప తేజస్సుగల వసిష్ఠుడు ఇంద్రుని యజ్ఞమును చేసెను. నిమిమహారాజు, ఆ బ్రాహ్మణులను తీసుకువచ్చి హిమవత్పర్వతము ప్రక్క తన పురము దగ్గర యజ్ఞము చేసెను. ఆ రాజు ఐదువేల సంవత్సరములు ఆ యజ్ఞదీక్ష జరిపించెను.(4-12)

ఇంద్రుని యజ్ఞము పూర్తియైన పిమ్మట పూజ్యుడూ, దోషరహితుడూ అయిన వసిష్ఠమహర్షి హోత అను ఋత్విక్కుగా ఉండుటకు రాజు దగ్గరకి వచ్చి తన స్థానమును గౌతముడు పూరించి నట్లు చూచెను. అప్పుడు బ్రహ్మపుత్రుడైన ఆ వసిష్ఠుడు క్రోధావిష్టుడై రాజును చూచుటకై ముహూర్తకాలము కూర్చుండెను. ఆ రోజున ఆ రాజర్షికి చాల నిద్ర వచ్చెను. ఆ రాజర్షి కనబడకపోవుటచేత మహాత్ముడైన వసిష్ఠునకు కోపము వచ్చెను. "రాజా! నీవు నన్ను అవమానము చేసి మరొకనిని వరించినావు; అందువలన నీ దేహము చైతన్యము లేనిది అగుగాక" అని నిమిని శపించెను. పిదప మేల్కొనిన రాజు ఆ శాపవాక్యమును విని క్రోధావిష్టుడై బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుని- "నేను స్పృహలేకుండా నిద్రపోవుచున్నప్పుడు నీవు కోపావేశముతో రెండవ యమదండము వంటి శాపాగ్నిని ప్రయోగించినావు. బ్రహ్మర్షీ! ఆ కారణముచేత మంచి కాంతి గల నీ దేహము కూడ చైతన్యరహితము కాగలదు; సందేహము లేదు" అని శపించెను. ప్రభావముచేత ఒకరితో ఒకరు సమానులని ప్రసిద్ధులైన ఆ నిమివసిష్ఠులు రోషావేశముచేత ఈ విధముగా ఒకరినొకరు శపించుకొని అప్పుడు వెంటనే దేహములు లేనివారు అయిరి.(13-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది ఐదవ సర్గము సమాప్తము.**

# ఏబది ఆరవ సర్గము

## ఊర్వశి వృత్తాంతము.

శత్రుసంహారకుడైన లక్ష్మణుడు రాముని మాటలు విని, అంజలి ఘటించి- "రామా! దేవతలకు కూడ పూజ్యులైన ఆ వసిష్ఠనిమిచక్రవర్తులు దేహాలను విడిచివేసిన పిమ్మట మరల దేహములను ఎట్లు పొందిరి?" అని ప్రశ్నించెను. లక్ష్మణుని మాటలు విని రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.(1-3)

"ధార్మికులైన ఆ రాజర్షి బ్రహ్మర్షులు పరస్పరశాపముచేత దేహమును విడచి వాయురూపములో ఉన్న మునులుగా అయిరి. శరీరము లేని మహాతేజఃశాలియైన వసిష్ఠమహాముని మరియొక శరీరముకొరకై తండ్రి దగ్గరకు వెళ్ళెను. వాయువుగా అయిన, ధర్మము నెరిగిన ఆ వసిష్ఠుడు ఆ దేవదేవుని పాదాలకు నమస్కరించి బ్రహ్మదేవుని- "పూజ్యుడా! నేను నిమి ఇచ్చిన శాపమువలన దేహమును కోల్పోయి వాయురూపుడను అయిపోయినాను. ప్రభూ! దేహము లేని అందరికీ చాల దుఃఖము కలుగును. దేహములేనివాని అన్ని పనులూ లోపించును. నాకు మరొక దేహము ఉండునట్లు అనుగ్రహించుము" అని ప్రార్థించెను. అప్పుడు బ్రహ్మదేవుడు అతనితో ఇట్లనెను- "గొప్ప కీర్తిగలవాడా! నీవు మిత్రావరుణులవలన కలిగిన తేజస్సులో ప్రవేశించుము. నీవు అక్కడకూడ అయోనిజుడవు అయ్యెదవు. ద్విజశ్రేష్ఠుడా! గొప్ప ధర్మముతో కూడినవాడవై మరల నాకు వశుడవు అగుదువు(నావద్దకు వచ్చెదవు)." అని చెప్పెను.(4-10)

వసిష్ఠుడు బ్రహ్మదేవుని మాటలు విని ఆయనకు ప్రదక్షిణనమస్కారములు చేసి శీఘ్రముగా వరుణుని నివాసమునకు వెళ్లెను. అదే సమయమునందు మిత్రుడు కూడ క్షీరసముద్రమునందు ఉండి దేవతలు పూజించుచుండగా వరుణత్వమును చేయుచుండెను. ఆ సమయమునందే ఊర్వశి అను అప్సరఃస్త్రీ సఖురాళ్ళతో కలసి దైవవశముచేత, ఆ ప్రదేశమునకు వచ్చెను. వరుణుని స్థానమునందు క్రీడించుచున్న, సౌందర్యవతి అయిన ఆ ఊర్వశిని చూడగానే వరుణునకు ఆమె విషయమునందు గొప్ప సంతోషము కలిగెను. ఆ వరుణుడు పద్మపత్రములవంటి నేత్రములు, పూర్ణచంద్రునివంటి ముఖమూ గల ఆ అప్సరసలలో శ్రేష్ఠురాలైన ఊర్వశిని వరించెను. ఆమె అంజలి ఘటించి నిలచి వరుణునితో "దేవతల ప్రభూ! ముందుగా మిత్రుడు నన్ను ప్రత్యక్షముగా వరించి ఉన్నాడు" అని చెప్పెను. మన్మథశరములచేత పీడింపబడిన వరుణుడు "బ్రహ్మదేవుడు నిర్మించిన ఈ కుంభమునందు ఈ తేజస్సును విడచెదను

సుందరీ! నాతో సంగమునకు ఇష్టపడకపోయినను నాపై అనురాగము చూపుము. నా కోరిక తీరును" అనెను.(11-18)

లోక పాలుడైన వరుణుని ఆ మాటలు విని ఊర్వశి చాల సంతోషించి "ప్రభూ! తప్పక ఇది ఇట్లే అగుగాక. నా హృదయము నీమీదనే ఉన్నది. భావము కూడ అధికముగా నీకే. నా దేహము మాత్రమే మిత్రున కివ్వబడినది" అని పలికెను. వరుణుడు ఊర్వశి మాటలు విని చాల ఆశ్చర్యకరముగా ఉన్న, ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమైన కాంతి గల రేతస్సు ఆ కుంభములో విడచెను. ఊర్వశి దేవతయైన మిత్రుడున్న చోటికి వెళ్ళెను. కాని మిత్రుడు చాల కోపించి ఆ ఊర్వశితో- "నిన్ను నేను ముందుగా పిలిచితిని కదా; దుష్టముగా ప్రవర్తించు నీవు ఏ మాత్రము సందేహము లేక భావముచేత మరొక పురుషుణ్ణి ఎందుకు వరించినావు? ఈ చెడ్డ పని చేసినందుకు నా కోపముచేత బాధింపబడిన నీవు మనుష్యలోకమునకు వెళ్ళి అక్కడ కొంత కాలము నివసించగలవు. బుధుని పుత్రుడు, కాశిరాజు అయిన పురూరవు డను రాజర్షి ఉన్నాడు. ఓ! దుర్బుద్ధీ! అతని వద్దకు వెళ్ళుము. అతడు నీకు భర్త కాగలడు" అని పలికెను.(19-25)

పిమ్మట ఆమె శాపదోషముచేత ప్రతిష్ఠాన మను నగరములో ఉన్న, బుధుని ఔరసపుత్రుడైన పురూరవసుణ్ణి పొందెను. అ పురూరవునకు ఊర్వశియందు గొప్ప బలము గల శ్రీమంతుడైన ఆయువు అను పుత్రుడు కలిగెను. ఇంద్రునితో సమానమైన కాంతి గల నహుషుడు అతని పుత్రుడు. ఇంద్రుడు వజ్రముచేత వృత్రుణ్ణి సంహరించిన పిదప తిరుగుచుండగా నహుషుడు లక్ష సంవత్సరముల కాలము ఇంద్రుడై పాలించెను. ఊర్వశి శాపముచేత భూలోకమునకు వెళ్ళి చాల సంవత్సరములు అక్కడ ఉండి, శాపకాలము పూర్తి అవగానే ఇంద్రుని సభకు తిరిగివెళ్ళెను.(26-29)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది ఆరవ సర్గము సమాప్తము.**

# ఏబది ఏడవ సర్గము

## వసిష్ఠుడు క్రొత్త దేహమును పొందుట. నిమి ప్రాణుల నేత్రములమీద నివసించుట.

దివ్యమైన, అద్భుతమైన ఆ కథను విని లక్ష్మణుడు చాలా సంతోషించి రాముని– "రామా! దేవతలకు కూడ పూజ్యులైన ఆ వసిష్ఠనిమిచక్రవర్తులు దేహాలను విడిచివేసిన పిమ్మట మరల దేహములను ఎట్లు పొందిరి?" అని అడిగెను. లక్ష్మణుని మాటలు విని రాముడు మహాత్ముడైన వసిష్ఠుని కథను చెప్పెను– "లక్ష్మణా! మహాత్ముడైన ఆ వరుణుని తేజస్సు నింపిన ఆ కుంభమునందు తేజఃస్వరూపులు, ఋషిశ్రేష్ఠులూ అయిన ఇద్దరు బ్రాహ్మణులు పుట్టిరి. ముందుగా భగవంతుడైన అగస్త్యమహాముని జన్మించెను. "నేను నీ పుత్రుడను కాను" అని మిత్రునితో చెప్పి అతడు అక్కడినుండి వెళ్ళిపోయెను. ఊర్వశి నిమిత్తము స్ఖలితమైన మిత్రుని తేజస్సు పూర్వము ఆ కుంభమునందు ఉంచబడినది. తరువాత వరుణుని తేజస్సు ఉంచబడినది. ఆ కుంభమునుండియే అగస్త్యుడు పుట్టెను. పిమ్మట కొంతకాలానికి మిత్రావరుణులు కారణముగా గల, తేజఃశాలియైన ఇక్ష్వాకువంశీయుల దేవతయైన వసిష్ఠుడు పుట్టెను. సౌమ్యుడా! దోషరహితుడైన ఆ వసిష్ఠుడు పుట్టిన వెంటనే గొప్పతేజస్సుగల ఇక్ష్వాకువు మన వంశము హితముకొరకు ఆయనను పురోహితుణ్ణిగా వరించెను. మహాత్ముడైన వసిష్ఠుని నూతనదేహము ఎట్లు పుట్టినదో చెప్పినాను. నిమి విషయము చెప్పెదను వినుము. (1-9)

బుద్ధిమంతులైన ఆ ఋషీశ్వరు లందరూ ఆ రాజు దేహము లేనివాడయినా దని చూచి అతనికి యోగదీక్ష ఇచ్చిరి. ఆ బ్రాహ్మణోత్తములు పౌరులతోను, భృత్యులతోను కలసి, ఆ రాజు దేహమును సుగంధద్రవ్యములచేత, మాలలచేత, వస్త్రములచేత రక్షించిరి. పిమ్మట యజ్ఞము సమాప్తమైనది. అక్కడ భృగువు – రాజా! నీ విషయమున సంతోషించినాము. నీ మనస్సును మరల ఈ దేహములోనికి తీసికొనివచ్చెదను" అని పలికెను. అప్పుడు దేవత లందరూ చాల సంతోషించి నిమి చిత్తమును– "రాజర్షీ! మేము చాలా సంతోషించినాము. వరమును కోరుకొనుము. నీ చిత్తమును ఎక్కడ ఉంచవలెనో చెప్పుము." అని అడిగిరి. ఆ దేవతల మాటలు విని నిమి చిత్తము – "దేవతాశ్రేష్ఠులారా! నేను సకల ప్రాణుల నేత్రములమీద నివసించెదను గాక" అని పలికెను. అప్పుడు దేవతలందరూ "తప్పక అట్లే, నీవు వాయురూపములో ఉండి సమస్త ప్రాణుల నేత్రములమీద నివసించెదవు" అని

నిమి చిత్తముతో చెప్పిరి. రాజా! నీవు వాయురూపములో సంచరించుచుండగా, ప్రాణు లన్నీ విశ్రాంతికొరకై మాటిమాటికి నీమూలముననే నేత్రములు మూసికొనుచుండును.(10-16)

ఇట్లు పలికి దేవతలందరూ వచ్చిన దోవనే వెళ్ళిపోయిరి. మహాత్ములైన ఋషులు ఆ నిమి దేహమును తీసికొని వచ్చి. నిమికి కుమారుని పుట్టించుటకై ఆ దేహముమీద అరణిని ఉంచి మంత్రములు పఠించుచు, హోమాలు చేయుచు బలముగా మథించిరి. అరణిని మథించగా గొప్ప తపస్సుగల పురుషుడు ఆవిర్భవించెను. మథించుటచేత పుట్టుటచేత 'మిథి' అనీ, జనించుటచేత "జనకుడు" అని అతనికి పేరు వచ్చెను. దేహములేని నిమి నుండి పుట్టుటచేత ఆ పూర్వపురుషునకు 'విదేహరాజు' 'జనకుడు'అను పేర్లు వచ్చెను. గొప్ప పరాక్రమము గల అతనికి ఉన్న 'మిథి' అను ప్రసిద్ధిని పట్టి ఆ 'మిథిలా"నగర మైనది. సౌమ్యుడా! నిమిచక్రవర్తి శాపమువలన వసిష్ఠునకు, వసిష్ఠుని శాపమువలన నిమిచక్రవర్తికి ఎట్లు జన్మలు వచ్చినవో ఆశ్చర్యకరమైన ఈ కథను నేను పూర్తిగా నీకు చెప్పినాను."(17-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది ఏడవ సర్గము సమాప్తము.**

# ఏబది ఎనిమిదవ సర్గము

## శుక్రాచార్యులు యయాతిని శపించుట.

రాముని మాటలు విని లక్ష్మణుడు తేజస్సుతో ప్రజ్వలించుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ మహాత్మునితో- "రాజశ్రేష్ఠా! దేహము లేని వసిష్ఠునికి సంబంధించిన పూర్వము జరిగిన ఈ వృత్తాంతము చాలా అద్భుతము; ఆశ్చర్యకరము. కాని శూరుడైన క్షత్రియుడు, విశేషించి దీక్షలో ఉన్నవాడూ అయిన నిమిచక్రవర్తి మహాత్ముడైన వసిష్ఠుని విషయమున తగు విధముగా ప్రవర్తించలేదు" అనెను.(1-3)

రాముడు లక్ష్మణుని మాటలు విని సకలశాస్త్రములయందు నేర్పుగల ఆ లక్ష్మణునితో- "ఓ! వీరుడా! పురుష లందరిలోను ఓర్పు కనబడదు. లక్ష్మణా! యయాతి సత్త్వగుణానుసారియైన మార్గమును అనుసరించి సహింప శక్యముకాని రోషమును ఎట్లు సహించినాడో సావధానచిత్తుడవై తెలిసికొనుము. నహుషుని పుత్రుడు, పౌరులను చక్కగా పాలించువాడు అయిన యయాతి అనే రాజు ఉండెను. అతనికి భూలోకములో సాటిలేని రూపము గల ఇద్దరు భార్యలు ఉండిరి. వృషపర్వుని

కుమార్తె అయిన శర్మిష్ఠ అనే ఒక దైత్యస్త్రీ రాజర్షియైన ఆ యయాతికి చాలా ప్రేమపాత్రురాలై ఉండెను. శుక్రాచార్యుని పుత్రికయైన దేవయాని యయాతికి రెండవ భార్య. కాని ఆమె ఈ రాజుకు ఇష్టురాలు కాదు. ఆ భార్య లిద్దరికీ రూపవంతులు, సుగుణవంతులూ అయిన ఇద్దరు కుమారులు జనించిరి. శర్మిష్ఠ పూరువును, దేవయాని యదువును కనెను. పూరువు తన సద్గుణములచేతా, తల్లిని పట్టీ కూడ తండ్రికి చాలా ఇష్టుడయ్యెను. అందువలన యదువు దుఃఖావిష్టుడై తల్లితో- "నీవు! దేవతాస్వరూపుడు, అనాయాసముగ కర్మలు సాధించగల వాడూ అయిన శుక్రాచార్యుని కులమునందు పుట్టీ ఈ విధముగా హృదయములో ఉన్న దుఃఖమునూ, సహింపశక్యము కాని అవమానమునూ సహించుచున్నావు! దేవీ! మనమిద్దరమూ కలసి అగ్నిలో ప్రవేశించెదము. రాజును శర్మిష్ఠతో కలసి అనేక రాత్రులు రమించనిమ్ము. నీవు సహించకలిగినచో నాకు అనుమతి ఇమ్ము. నీవు ఓర్పు వహించుము. నేను మాత్రము ఓర్పు వహించజాలను; మరణించెదను. సందేహము లేదు" అనెను.(4-14)

అపుడు, చాల దుఃఖించుచు ఏడ్చుచున్న పుత్రుని మాటలు విని దేవయాని చాలా కోపించి తండ్రిని స్మరించెను. శుక్రాచార్యులు కుమార్తె మనస్సులోని అభిప్రాయమును తెలుసుకొని, వెంటనే ఆమె ఉన్న చోటికి వచ్చెను. సంతోషము లేక ఆలోచనాశక్తి ఉడిగి అస్వస్థురాలుగా ఉన్న కూతురుని చూచి తండ్రి "ఇది ఏమి?"అని అడిగెను. మాటిమాటికి అడుగుచున్న, మనస్సులో మండిపడుచున్న తండ్రియైన ఆ శుక్రాచార్యునితో దేవయాని కోపముతో- "ఓ! మునీశ్వరా! నేను అగ్నిలో గాని, ఉదకములో గాని పడెదను. లేదా తీక్ష్ణమైన విషమును తినెదను; కాని జీవించజాలను. నేను దుఃఖించుచున్నట్లు, అవమానింపబడినట్లు నీవు తెలుసుకొనుట లేదు. బ్రాహ్మణా! చెట్టును అవమానించుటచే ఆ చెట్టును ఆశ్రయించి జీవించు ప్రాణులకు బాధ కలుగును. శుక్రాచార్యా! ఈ రాజర్షి నీయందు అనాదరముచేత నిన్ను తిరస్కరించి నాయందు కూడ అనాదరము చూపుచున్నాడు. నన్ను గౌరవించుటలేదు" అని చెప్పెను. శుక్రాచార్యుడు ఆమె మాటలు విని కోపావిష్టుడై యయాతిని- "ఓ! యయాతీ! దుర్బుద్ధివైన నీవు నన్ను అవమానించుచున్నావు. అందుచే ముసలితనముచేత జీర్ణుడవై శిథిలత్వమును పొందగలవు" అని శపించెను. గొప్పకీర్తిగల బ్రహ్మర్షియైన ఆ శుక్రుడు ఇట్లు శపించి, కుమార్తెను ఓదార్చి, మరల తన ఇంటికి వెళ్ళిపోయెను.(15-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# ఏబది తొమ్మిదవ సర్గము

## యయాతి పూరువునకు తన వార్ధక్యము నిచ్చి అతని యౌవనమును తీసికొనుట.

అప్పుడు యయాతి శుక్రాచార్యుడు కోపించినట్లు తెలిసికొని చాలా దుఃఖితుడై, చాలా ముసలివాడై యదువుతో "పుత్రా! నాకు సాహాయ్యము చేయుటకై ఈ అధికమైన ముసలితనమును నీవు తీసికొనుము. నేను భోగములు అనుభవించెదను. నాకు భోగాలయందు తృప్తి కలుగలేదు; కామములను అనుభవించి పిమ్మట మరల ముసలితనమును తీసికొనెదను" అనెను. ఆ మాట విని యదువు రాజుతో "నీ ప్రియపుత్రుడైన పూరువు నీ ముసలితనమును తీసుకొనుగాక. రాజా! నన్ను రాజకార్యములనుండి, సామీప్యమునుండి దూరముగా ఉంచినావు. రాజా! ఎవరితో కలసి భోజనము చేయుచున్నావో అతడే నీ ముసలితనమును తీసుకొనుగాక" అనెను. (1-5)

రాజు వాని మాటలు విని పిదప పూరువుతో "ఓ మహాబాహూ! నాకు ఉపకారము జరుగుటకై ఈ ముసలితనము నీపైకి తీసుకొనుము" అని పలికెను- యయాతి మాటలు విని పూరువు అంజలి ఘటించి- "ధన్యుడ నైతిని, అనుగ్రహింపబడితిని. నీ ఆజ్ఞను అనుసరించుచున్నాను" అని పలికెను. యయాతి పూరువు పలికిన మాటలు విని గొప్ప ఆనందముతో తన ముసలితనమును అతనికి సంక్రమింపచేసి చాల సంతోషించెను. పిమ్మట యువకుడైన ఆ రాజు వేలకొలది యజ్ఞములు చేసి చాలా వేల సంవత్సరములు రాజ్యము చేసెను. పిమ్మట చాలా కాలానికి రాజు పూరువుతో, "పుత్రా! ముసలితనమును తెమ్ము. నా న్యాసమును తిరిగి ఇచ్చివేయుము. నాయనా! నేను ముసలితనమును న్యాసమునుగా నీపై సంక్రమింప చేసితిని. అందువలన దానిని మరల తీసికొనెదను. వ్యథ చెందకుము. మహాబాహూ! నా ఆజ్ఞను అంగీకరించినందుకు సంతోషించినాను. నేను సంతోషపూర్వకముగా నిన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేసెదను" అని పలికెను. యయాతిమహారాజు పుత్రుడైన పూరువుతో ఇట్లు పలికి యదువును, "దుర్బుద్ధియైన నీవు క్షత్రియరూపములో ఉన్న రాక్షసుడవు. నా ఆజ్ఞను ధిక్కరించినావు. అందువలన నీకు సత్సంతానము లేకపోవుగాక. నీవు పూజ్యుడ నైన తండ్రి నైన నన్ను అవమానించితివి గాన నీకు క్రూరులైన రాక్షసులు, పిశాచములు పుత్రులుగా పుట్టెదరు. ఓ! దుర్మతీ! నీవు ఈ చంద్రవంశములో ఉండవు. నీ వంశము కూడ నీతో

సమానమై చెడ్డది కాగలదు" అని శపించెను.(6-16)

యయాతి యదువును ఇట్లు శపించి రాజ్యమును వృద్ధిపొందించు పూరువును రాజ్యాభిషిక్తుని చేసి ఆదరించి, ఆశ్రమములో ప్రవేశించెను(వానప్రస్థాశ్రమము స్వీకరించెను). తరువాత చాలకాలానికి మరణించిన యయాతి స్వర్గమునకు వెళ్ళెను. గొప్పకీర్తిగల పూరువు కాశిరాజ్యములో ప్రతిష్ఠాన మను ఉత్తమమైన పురమునందు పూర్తిగా ధర్మమార్గము అవలంబించి రాజ్యము చేసెను. రాజవంశమునుండి బహిష్కరింపబడిన యదువు ప్రవేశింపశక్యముకాని క్రౌంచవనమునందు, పురములో వేలకొలది రాక్షసులను పుట్టించెను. ఈ విధముగా యయాతి క్షత్రియధర్మమును పాటించుచు శుక్రాచార్యు డిచ్చిన శాపమును సహించెను. అట్టి శాపమునే నిమి సహించలేదు.(17-21)

సౌమ్యా! నీకు ఈ కథ అంతా చెప్పినాను. పనులున్న వారందరినీ చూచెదము; అట్లు చేయకపోవుటచేత నృగమహారాజునకు కలిగినట్లు దోషము మనకు కలుగకుండుగాక. రాముడిట్లు పలుకుచుండగానే ఆకాశము మీద నక్షత్రములు పల్చబడెను. సూర్యకిరణములచేత ఎఱ్ఱనైన తూర్పుదిక్కు పుష్పరసముచేత ఎఱ్ఱనైన వస్త్రమును కప్పుకొన్నదా అన్నట్లు ప్రకాశించెను.(22,23)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఏబది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# పదకొండవ ప్రక్షిప్త సర్గము

**కార్యార్థియై శునకము ఒకటి రాముని భవనము ద్వారమునకు వచ్చుట.**


తెల్లవారెను. రాజైన రాముడు పూర్వాహ్ణమునందు చేయవలసిన కృత్యములన్నీ చేసికొని బ్రాహ్మణులతోను, ఆ యా సంఘముల ముఖ్యులతోను, పురోహితుడైన వసిష్ఠునితోను, కశ్యప ఋషితోను కలసి, రాజ్యవ్యవహారములను పరిశీలించుటకై ధర్మాసనమునందు ఉండెను. రాముని సభ వ్యవహారజ్ఞానమున్న మంత్రులతోను, ధర్మశాస్త్రాధ్యయనము చేసిన ఇతరులతోను, నీతిని ఎరిగిన సభ్యులతోను, రాజులతోను, మహేంద్రుని సభవలె, యముని సభవలె, వరుణుని సభవలె ప్రకాశించెను. రాముడు లక్ష్మణా! నీవు బైటకు వెళ్ళి కార్యార్థులు ఉన్నచో వారితో మాటలాడుటకు ప్రారంభించుము" అని లక్ష్మణుని ఆదేశించెను.(1-5)

లక్ష్మణుడు రాముని మాటలు విని ద్వారము దగ్గరకు వచ్చి స్వయముగా, వ్యవహారము ఉన్న వాళ్ళను పిలచెను, "ఇప్పుడు నాకు ఇక్కడ వ్యవహారము ఉన్నది" అని అక్కడ ఎవ్వరూ చెప్పలేదు. ఎందుచేత అనగా రాముడు రాజ్యము పాలించుచుండగా ప్రజలకు మనోవ్యథలు గాని, రోగములు గాని లేకుండెను. భూమి పక్వములైన సస్యములతో నిండి సమస్తమైన ఓషధులతో సమృద్ధముగా ఉండెను. అక్కడకు బాలుడుగాని, యువకుడు గాని, మధ్యవయస్కుడు గాని మరణించెడివాడు కాదు. అంతా ధర్మానుసారము పాలింపబడుచుండెను. ఎవరికీ బాధ కలిగింపబడలేదు. రాముడు రాజ్యమును పాలించుచుండగా వ్యవహారము కొరకై వచ్చే వాడు ఎవ్వడూ కూడ లేకుండెను. లక్ష్మణుడు వచ్చి అంజలి ఘటించి రామునకు ఈ విషయము చెప్పెను.(6-10)

రాముడు సంతోషించి లక్ష్మణునితో - "మరల వెళ్ళి నీవు కార్యాపేక్ష ఉన్నవారెవరైనా ఉన్నారా చూచి రమ్ము" అని ఆదేశించెను. నీతిని చక్కగా నిర్వహించుటచే ఎక్కడా కూడ అధర్మ మను మాట లేదు. ఆ కారణమువలనను, రాజభయమువలనను ప్రజలందరూ ఒకరినొకరు రక్షించుచుండిరి. మహాబాహూ! ఇక్కడ ప్రజలు నేను విడచిన బాణముల వలె రక్షించుచుందురు. అయినను నీవు శ్రద్ధాయుక్తుడవై ప్రజలను రక్షించుము" అని రాముడు పలికెను.(11-13)

రాముని మాటలు విని లక్ష్మణుడు రాజప్రాసాదమునుండి బైటకు వచ్చెను. అతనికి అక్కడ ఒక శునకము కనబడెను. లక్ష్మణుడు, మాటిమాటికి అరచుచున్న ఆ శునకమును చూచి దానిని- "ఓ! మహాభాగా! నీకు ఏమి పని ఉన్నది? విశ్వాసముతో కూడిన మనస్సుతో చెప్పుము" అని అడిగెను. లక్ష్మణుని మాటలు విని శునకము- "సర్వప్రాణులకు రక్షకుడైన రామునకు చెప్పవలె నని కోరుచున్నాను" అని బదులు చెప్పెను. లక్ష్మణుడు దాని మాటలు విని ఈ విషయమును రామునకు తెలుపుటకై గృహములోనికి వెళ్ళెను. రామునికి తెలిపి మరల రాజభవనమునుండి వచ్చి "నీకేమైన చెప్పవలసిఉన్నచో రాజుకు చెప్పుము" అని ఆ శునకముతో అనెను.(19)

లక్ష్మణుని మాటలు విని ఆ శునకము "లక్ష్మణా! దేవతాగృహమునందు, ద్విజుల గృహములోను అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వాయువూ ఉందురు. అధమయోనులమైన మేము ఆ గృహములలో ప్రవేశించుటకు యోగ్యులము కాదు. నేను ఈ భవనము ప్రవేశింపజాలను. రాజు మూర్తీభవించిన ధర్మము. సత్యమే



పలుకును. రణరంగములందు సమర్థుడు. సకలప్రాణుల హితమునందు ఆసక్తి కలవాడు. రాముడు సంధి-విగ్రహ-యాన-ఆసన-ద్వైధీభావ-సమాశ్రయణము లను ఆరు గుణముల ప్రయోగము తెలిసినవాడు. అన్నీ తెలిసినవాడు. అన్నీ చూడగలిగినవాడు. రాముడే చంద్రుడు, మృత్యువు, యముడు, కుబేరుడు, అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వరుణుడు. లక్ష్మణా! ఆ రామునితో చెప్పుము. ఆ రాముడే ప్రజాపాలకుడు. లక్ష్మణా! నేను రాముని ఆజ్ఞ లేకుండా లోపలికి వచ్చుటకు ఇష్టపడను" అనెను.(20-25)

లక్ష్మణుడు మంచితనముచేత విసిగికొనక రాజభవనములో ప్రవేశించి- "ప్రభూ! నీ ఆజ్ఞవలన ఏర్పడిన విజ్ఞాపింపదగిన అంశమొకటి ఉన్నది; వినుము. ఒక శునకము కార్యార్థియై వచ్చినది. ద్వారమువద్ద నిలచి ఉన్నది."అని చెప్పెను. లక్ష్మణుని మాటలు విని రాముడు- "కార్యార్థియై వచ్చి ఉన్న దానిని వెంటనే ప్రవేశపెట్టుము" అని లక్ష్మణునితో పలికెను.(26-28)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదకొండవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# పన్నెండవ ప్రక్షిప్త సర్గము

## శునకము విషయమున రాముడు న్యాయనిర్ణయము చేయుట.

రాముని మాటలు విని బుద్ధిమంతుడైన లక్ష్మణుడు తొందరగా ఆ శునకమును పిలుచుకొని వెళ్ళి రామునకు చూపెను. వచ్చిన ఆ శునకమును చూచి రాముడు దానితో- "ఓ! శునకమా! నీవు చెప్పదలచుకున్న విషయము చెప్పుము. నీకేమీ భయము లేదు" అని పలికెను. తల బ్రద్దలై ఉన్న ఆ శునకము అక్కడ ఉన్న రాముణ్ణి చూచి ఇట్లనెను- "సకలభూతముల సృష్టికి హేతువు రాజు. రాజే గొప్ప నాయకుడు. అందరూ నిద్రపోవుచుండగా రాజు మేల్కొని ఉండును. రాజే ప్రజలను పాలించును. రక్షకుడైన రాజే బాగుగా నడపవలసిన నీతిచేత ధర్మమును రక్షించును. రాజు పాలించనిచో ప్రజలు శీఘ్రముగా నశింతురు. రాజే కర్త. రాజే రక్షకుడు. రాజే జగత్తుకు అంతకీ తండ్రి. రాజే కాలము, యాగమూ కూడా. ఈ సర్వజగత్తూ రాజే.(1-6)

ధరించునది కావున ధర్మమని అందురు. ధర్మమే ప్రజలను నిలబెట్టును. స్థావరజంగమాత్మకమైన మూడు లోకాలను నిలబెట్టేది ధర్మమే. శత్రువులను అదుపులో ఉంచుటచేత కూడ ఇది ధర్మము. ధర్మముచేతనే రాజులు ప్రజలను రంజింపచేసిరి. అందుచేత ఇది ధరింపచేయునది అని చెప్పబడినది. అదే ధర్మము అని నిశ్చయము. రాజా! రామా! మరణానంతరము కూడ ఫలము నిచ్చునది ఈ ఉత్తమమైన ధర్మమే. ధర్మమువలన లభించనిది ఏదీ ఉండ దని నా అభిప్రాయము. రామా! దానము, దయ, సత్పురుషులను పూజించుట, వ్యవహారములలో ఋజుత్వము- ఇవి మరణానంతరము, ఇహలోకములోనూ కూడ రక్షించుటవలన "ధర్మము." ఉత్తమనియమపాలకుడవైన రామా! నీవు ప్రమాణాలకు ప్రమాణము. సత్పురుషులచేత ఆచరింపబడిన ధర్మము నీకు బాగా తెలిసినదే. రాజులలో శ్రేష్ఠుడవైన రాజా! నీవు ధర్మాలకు ఉత్తమస్థానము. గుణములకు సముద్రమువంటివాడవు. అజ్ఞానమువలన నేను నీ ముందు ధర్మమును గూర్చి మాటలాడుచున్నాను. శిరస్సు వంచి నమస్కరించుచున్నాను. ఈ విషయమున కోపము చేయకుము."(7-12)

శునకము మాటలు విని రాముడు- "నీకు నేను ఇప్పుడు ఏమి చేయవలెనో నిర్భయముగా చెప్పుము; ఆలస్యము చేయవద్దు" అని దానితో పలికెను. రాముని మాటలు విని శునకము - "ధర్మముచేతనే రాష్ట్రమును పొందవలెను. ధర్మముచేతనే దానిని పాలించవలెను. రామా! ధర్మమువలన సకలభయములను తొలగించు

రాజు రక్షకుడు అగును. ఈ విషయము తెలిసికొని నాకొరకై ఏమి చేయవలెనో వినుము. బ్రాహ్మణులు నివసించు ప్రదేశమునందు నివసించే సర్వార్థసిద్ధు డనే సన్యాసి ఏ కారణము లేకుండగా, అపరాధ మేమీ లేని నన్ను కొట్టినాడు" అని చెప్పెను.(13-16)

ఈ మాటలు విని రాముడు ద్వారపాలకుణ్ణి పంపెను. అతడు సకలశాస్త్రార్థములను ఎరిగిన ఆ బ్రాహ్మణుని తీసికొనివచ్చెను. గొప్ప తేజస్సు గల ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు రాముణ్ణి చూచి "దోషరహితుడవైన రామా! నేను నీకేమి చేయవలెనో చెప్పుము" అని అడిగెను. బ్రాహ్మణుని మాటలు విని రాముడు "బ్రాహ్మణా! నీవు ఈ శునకమును కొట్టినావు. నీకు ఏమి అపకారము చేసిన దని కఱ్ఱతో కొట్టినావు? కోపము ప్రాణాలను హరించే శత్రువు. కోపము మిత్రుడు వలె కనబడు శత్రువు. కోపము చాలా వాడియైన కత్తి. కోపము సమస్తమును నశింపచేయును. తపస్సు చేసినా, యజ్ఞాలు చేసినా, దానాలు చేసినా వాటి నన్నింటినీ కోపము నశింపచేయును. అందువలన కోపమును విడువవలెను. ఇంద్రియములకు గోచరములైన భోగ్యవిషయములను వాటినుండి దూరముచేసి, దుష్టములైన అశ్వముల వలె పరుగెత్తుచున్న ఇంద్రియములకు ధైర్యముతో(మనఃస్థైర్యముతో) సారథ్యము చేయవలెను. మనస్సుచేత, కర్మచేత, వాక్కుచేత, చూపుచేత, తన ఎదుట నడచుచున్న(వ్యవహరించుచున్న) లోకమునకు శ్రేయస్సు చేయవలెను. అట్టివాడు ఎవరినీ ద్వేషించడు. పాపపుణ్యాదులు అతనికి అంటవు. అదుపులో ఉంచుకొనని మనస్సు ఎంత అపకారము చేయునో అంత అపకారము వాడియైన కత్తిగాని, కాలితో త్రొక్కిన సర్పముకాని, నిత్యము కోపముతో ఉన్న శత్రువు గాని చేయజాలరు. తన సహజమైన స్వభావమును కప్పిపెట్టుకోవడానికి ఎంత వినయము నేర్పినా ఆ ప్రకృతి (సహజస్వభావము) మారదు. నిశ్చయముగా ప్రకృత్యనుసారము పనులు చేయుట తప్పదు" అని పలికెను.(17-26)

రాముని మాటలు విని, బ్రాహ్మణుడైన ఆ సర్వార్థసిద్ధుడు రామునితో– "నేను భిక్షకోసమై తిరుగుచుండగా భిక్ష దొరకలేదు. ఆ సమయమున కోపావేశములో ఉన్న నేను ఈ శునకమును కొట్టితిని. వీధిలో ఉన్న ఈ కుక్కను "వెళ్ళుము వెళ్ళుము" అని తోలితిని. అయినను ఇది స్వేచ్ఛగా నడచుచు వీధి చివర అడ్డముగా నిలచినది. రాజరాజేంద్రా! రామా! ఆ సమయమున ఆకలితో క్రోధావేశములో ఉన్న నేను దానిని కొట్టతిని. అపరాధము చేసిన నన్ను శిక్షింపుము. రాజేంద్రా! నీవు శిక్షించినచో నాకింక నరకభయము ఉండదు." అని పలికెను. పిమ్మట రాముడు

సభలో ఉన్న వారందరినీ "ఇప్పుడేమి చేయవలెను? ఇతనికి ఎట్టి శిక్ష ఇవ్వవలెనో చెప్పండి. సరిగా శిక్ష ఇచ్చినప్పుడే ప్రజలు రక్షింపబడుదురు" అని అడిగెను. (27-32)

భృగు-అంగిరస-కుత్స-వసిష్ఠ-కాశ్యపాదులు, ధర్మశాస్త్రాధ్యయనము చేసినవారిలో ప్రముఖులు, మంత్రులు ఆ యా సంఘముల ముఖ్యులు, ధర్మశాస్త్రములలో నిష్ణాతులైన, అక్కడ కలిసిన ఇంకా ఎందరో పండితులూ రామునితో "బ్రాహ్మణుణ్ణి దండించకూడదు అని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు" అని పలికిరి. పిమ్మట ఆ మునులందరూ రామునితో - "రామా! అందరినీ శిక్షించువాడు రాజే కదా? విశేషించి నీవు శాసకుడవు. సనాతనుడైన విష్ణువైన నీవు మూడు లోకాలను శాసించువాడవు" అని పలికిరి. (33-36)

వారందరు ఇట్లు చెప్పిన పిమ్మట శునకము ఇట్లు పలికెను. "రామా! నీవు నా విషయమున అనుగ్రహించినట్లయితే, నాకు వరము ఇవ్వ దలచిన ట్లయితే చెప్పెదను వినుము. వీరుడా! "నీకు ఏమి చేయుదును?" అని నీవు ప్రతిజ్ఞా పూర్వకముగా అందరిలోనూ అడిగితివి కదా? రాజా! ఈ బ్రాహ్మణునకు కులపతిత్వమును ఇమ్ము. మహారాజా! కాలంజరక్షేత్రములో కులపతిత్వమును, దేవాలయ- మఠాద్యాధిపత్యమును, ఇమ్ము."(37-38)

రాముడు అది విని బ్రాహ్మణుని కులపతిగా చేయగా అతడు సంతోషించినవాడై వెళ్ళెను. ఇట్లతడు ఏనుగు నెక్కించి నంతగా గౌరవింపబడెను. అప్పుడు రాముని మంత్రులు ఆశ్చర్యపడుచు - రామా! ఇది ఈతనికి వర మిచ్చినట్లయినది; దండనము కాదు" అనిరి. రాముడు మంత్రుల మాటలు విని వారితో - "మీకు దీనిలోని రహస్యము తెలియదు; ఇందుకు కారణము ఈ శునకమునకు తెలియును" అని పలికెను. (39-41)

రాముడు అడుగగా ఆ శునకము ఇట్లు చెప్పెను - "రామా! నేను అక్కడ కులపతిగా ఉంటిని. దేవతాబ్రాహ్మణుల పూజ జరిగిన పిమ్మట మిగిలిన దానిని మాత్రమే తినుచుండేవాడను. దాసీదాసులకు అన్నాదులు ఇచ్చుచు, శుభమైన బుద్ధితో దేవతాద్రవ్యమును రక్షించుచుంటిని. శీలవినయసంపన్నుడనై సమస్త ప్రాణులయందూ కూడ దయ కలవాడనై ఉండెడివాడను. అట్టి నాకే ఈ ఘోరమైన ఇట్టి అవస్థా, అధమగతీ వచ్చినవి." అంత పవిత్ర జీవితము గడిపిన నాకు ఈ కులపతిత్వము మూలమున ఇట్టి గతి పట్టినదనగా కోపస్వభావుడు, ధర్మమును పరిత్యజించినవాడు, అహితము చేయుటయందు ఆసక్తి కలవాడు, క్రుద్ధుడు,

క్రూరుడు, కఠినుడు, అవిద్వాంసుడు, అధార్మికుడు అయిన ఈ బ్రాహ్మణుడు(కులపతిత్వమును వహించి) వెనుకటి తరాలను ఏడింటిని, రాబోవు తరాలు ఏడింటిని పతితములుగా చేయును.(45-46)

అందువలన ఎట్టి పరిస్థితులలోనూ కూడ కులపతిత్వమును చేయకూడదు. ఎవనిని పుత్ర-పశు-బంధుసహితముగా నరకమునకు పంపవలె నని కోరిక ఉండునో వానికి దేవతలమీద (దేవాలయాలమీద), గోవులమీద, బ్రాహ్మణులమీద అధికార మివ్వవలెను. ఎవడు తానే ఇచ్చిన లేదా తన దగ్గర రక్షణార్థమై ఉంచిన, బ్రాహ్మణధనమును, దేవతాధనమును, స్త్రీధనమును, బాలధనమును హరించునో అతడు ఇష్టులతో కూడ నశించును. రామా! బ్రాహ్మణద్రవ్యమును, దేవతాద్రవ్యమును అపహరించినవాడు వెంటనే అవీచి అను నరకమునందు పడును." దేవతల ధనమునూ, బ్రాహ్మణధనమునూ మనస్సుచేతనైనా ఎవడు కోరుకొనునో ఆ నరాధముడు నిత్యము నరకములో పడును."(47-50)

ఆ మాటలు విని రాముని నేత్రములు ఆశ్చర్యముతో వికసించెను. ఆ శునకము కూడ వచ్చిన చోటికే వెళ్ళిపోయెను. ఆత్మాభిమానము గలది, పూర్వజన్మజ్ఞానము గలది, జాతిమాత్రముచేతనే ద్వేషించబడినది (నీచముగా పరిగణింపబడుచున్నది) అయిన, గొప్ప భాగ్యము గల ఆ శునకము వారణాసిలో ప్రాయోపవేశము చేసి ప్రాణములు విడచెను.(51, 52)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పన్నెండవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# పదమూడవ ప్రక్షిప్త సర్గము

## గ్రద్ధ గుడ్లగూబల వివాదము.

వృక్షములతో ప్రకాశించుచున్న, నదిచేత వ్యాప్తమైన ఒక వనమునందు అనేక కోకిలలచేత ధ్వనింపచేయబడిన, సింహములతోను పెద్దపులులతోను వ్యాప్తమైన, అనేకవిధములైన పక్షులగుంపులతో నిండిన పర్వతశ్రేష్ఠముమీద అనేక సంవత్సరముల నుండి ఒక గ్రద్ధ, ఒక గుడ్లగూబ నివసించుచుండెను. పాపబుద్ధిగల ఆ గ్రద్ధ, గుబ్బగూబ ఇంటిని గూర్చి ఇది నాది అని చెప్పుచు కలహము ప్రారంభించి, "పద్మనేత్రుడైన రాముడు సమస్తలోకమునకు రాజు. ఈ ఇల్లు ఎవరిదో తేల్చుకొనుటకు

ఆ రాముని వద్దకు వెళ్లెదము" అనెను. (1-4)

కోపావిష్ఠములైన ఆ గృధ్రోలూకములు, అమర్షముతో నిశ్చయించుకొని నిర్ణయముకొరకై రాముని వద్దకు వెళ్ళినవి. కలహముచేత వ్యాకులమైన చిత్తములు గల ఆ గృధ్రోలూకములు అప్పుడు పరస్పరద్వేషముతో శీఘ్రముగా రాముని వద్దకు వెళ్ళి అతని పాదములు స్పృశించి నమస్కరించినవి. పిమ్మట ఆ గృధ్రము రాజును చూచి- "నీవు సురాసురులలో ప్రధానుడవు అని నా నమ్మకము. నీవు బృహస్పతికంటె, శుక్రాచార్యునికంటె గొప్పవాడవు. ప్రాణులలో తారతమ్యము తెలిసినవాడవు. కాంతిచేత మరియొక చంద్రునివంటివాడవు. సూర్యుడు వలె నీవు చూడ శక్యము కానివాడవు. గౌరవమునందు హిమవంతుడవు. గాంభీర్యములో సముద్రుడవు. లోకపాలకుడైన యముడవు. రామా! నీవు ఓర్పుచేత భూమితో సమానుడవు. శీఘ్రత్వములో వాయువుతో సమానుడవు. పూజ్యుడవు. అన్ని సంపదలూ ఉన్నవాడవు. కీర్తి గలవాడవు. పట్టుదల గలవాడవు. జయింపశక్యము కానివాడవు. జయించువాడవు. సకలాస్త్రముల విధానము తెలిసినవాడవు. నరశ్రేష్ఠుడవైన రామా! నేను విజ్ఞాపన చేయునది వినుము. మహారాజా! రామా! నేను పూర్వము నిర్మించుకొన్న గృహమును ఈ ఉలూకము బాహుబలముచేత హరించుచున్నది. ఆ విషయమున నీవు రక్షించవలయును" అని పలికెను. (5-12)

గ్రద్ధ ఇట్లు చెప్పిన తరువాత ఉలూకము ఇట్లు పలికెను- "రామా! రాజు చంద్ర-ఇంద్ర-సూర్య-కుబేర-యములవలన పుట్టును. మనుష్యాంశ కొంచెము మాత్రమే ఉండును. కాని నీవు మాత్రము రెండవ నారాయణుడు వలె సకల దేవస్వరూపుడవు. రామా! నీవు నీ సౌమ్యత్వమును బాగుగా పరిశీలించి సమముగా ప్రవర్తింపచేయుదువు. అందువలన నీలో సోమాంశ మున్నది. ప్రజల నాథుడవైన రామా! నీవు క్రోధమునందు, దండమునందు, దానమునందు, పాపభయమును పోగొట్టి ఇంద్రుడు వలె దాతవు, హర్తవు, రక్షకుడవు అయి ఉన్నావు. సకలభూతములచేతను ఎదిరింపశక్యముకాని అగ్నితో సమానమైన తేజస్సుతో లోకములను మిక్కిలి తపింపచేయుచున్నావు. అందువలన సూర్యునితో సమానుడవు. (13-17)

రాజశ్రేష్ఠా! నీవు సాక్షాత్తు కుబేరునితో సమానుడవు లేదా నీవు కుబేరుని కంటె అధికుడవు. కుబేరుని దగ్గర పద్మ ఉన్నట్లు లక్ష్మి నీదగ్గర నిత్యమూ ఉండును. కుబేరుడు చేయు పని నీవు చేయుటచే మాకు నీవు కుబేరుడవు. నీవు స్థావరములు,

జంగమములు అయిన అన్ని భూతములయందు సముడవు. రామా! నీ దృష్టి శత్రువునందు, మిత్రునియందు కూడా సమముగా ఉండును. వ్యవహారములయందు విధ్యనుసారముగా నిత్యమూ ధర్మముచేత శాసనము చేయుదువు. రామా! నీవు ఎవనిమీద కోపింతువో వాని దగ్గరకు మృత్యువు పరుగెత్తి వెళ్ళును. అందుచేత మహాపరాక్రమవంతుడైన నిన్ను "యముడు" అని అందురు. రాజులలో శ్రేష్ఠుడవైన రాజా! నీ మానవత్వము క్రౌర్యము లేక సకలప్రాణులయందు ఓర్పుతో కూడినది. నాథుడు లేని దుర్బలునకు రాజే బలము. అట్టి నీవు కళ్ళు లేనివారికి కన్ను; గతి లేనివారికి గతివి. నీవు మాకు కూడ రక్షకుడవు. ధార్మికుడా! నా మాట వినుము. రాజా! ఈ గ్రద్ద నా ఇంటిలో ప్రవేశించి బాధించుచున్నది. నరశ్రేష్ఠుడవైన దేవా! నీవే మానవులలో శిక్షకుడవు కదా"(18-24)

రాముడు ఇది విని మంత్రులను స్వయముగా పిలచెను. ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, రాష్ట్రవర్ధనుడు, అశోకుడు, ధర్మపాలుడు, గొప్ప బుద్ధిబలము గల సుమంత్రుడు. వీరు దశరథునికి, రామునికి కూడ మంత్రులు. ఈ మహాత్ము లందరూ నీతిమంతులు, సకలశాస్త్రవిశారదులు. సిగ్గు గలవారు. సత్కులమునందు పుట్టినవారు. నీతియందు, ఆలోచనలయందు పండితులు. ధర్మాత్ముడైన రాముడు వారిని పిలిచి పుష్పకమునుండి దిగి ఆ గృధ్రోలూకముల తగవును గూర్చి వాటిని ప్రశ్నించెను– "గృధ్రమా! నీవు ఈ గృహమును నిర్మించుకొని ఎన్నాళ్ళయినది? తెలిసినట్లయితే యథార్థముగా చెప్పుము." ఈ మాటలు విని ఆ గ్రద్ద రామునితో– "రామా! ఈ భూమి అంతా ఉద్భవించిన మానవులచేత ఏనాడు కప్పబడినదో ఆనాటినుండి ఇది నా గృహముగా ఉన్నది" అని చెప్పెను.(25-31)

అప్పుడు గుడ్లగూబ రామునితో – "రాజా! ఈ భూమి వృక్షములతో ఎప్పటినుండి ప్రకాశించుచున్నదో అప్పటినుండి ఇది నాగృహము" అని పలికెను. "వృద్ధులు లేనిది సభకాదు. ధర్మమును చెప్పనివారు వృద్ధులు కారు. సత్యము లేనిది ధర్మము కాదు. కపటముతో కూడినది సత్యము కాదు. ఏ సభ్యులు తెలిసి ఉండి కూడ మాటలాడకుండగా చూచుచు కూర్చుందురో, చెప్పవలసిన మాట చెప్పరో, వాళ్ళందరూ అసత్యము పలుకువారే. కామమువలన గాని, క్రోధమువలనగాని, భయమువలన గాని ఎవడు తెలిసి ఉండి కూడ ప్రశ్నలకు సమాధానములు చెప్పడో వాడు వెయ్యి వరుణపాశములను తనకు తగుల్చుకొనుచున్నాడు. వెయ్యి పాశాలలో ఒక పాశము ఒక సంవత్సరము గడిచిన తరువాత విడచును. అందుచే సత్యము తెలిసినవాడు చక్కగా సత్యమే చెప్పవలెను." ఈ మాట విని మంత్రులు రామునితో– "రామా! ఈ

ఉలూకము మంచిది వలె కనబడుచున్నది; గృధ్రము కాదు. మహారాజా! నీవే నిర్ణయము చేయవలెను. రాజే పరమగతి కదా? ప్రజలందరికి రాజే మూలము. రాజధర్మము చాల ప్రాచీనమైనది. ఏ మానవులకు రాజు శిక్షకుడుగా ఉండునో వాళ్ళు దుర్గతి పొందరు. యమునిచేత విడవబడినవారై పురుషోత్తము లగుదురు" అని పలికిరి.(31-39)

మంత్రుల మాట విని రాముడు ఇట్లు పలికెను – "పురాణములందు చెప్పిన విషయములను చెప్పెదను వినుడు." చంద్ర–సూర్య–నక్షత్ర–పర్వత–మహారణ్యములతో కూడిన ఆకాశము, స్థావరజంగమములతో కూడిన మూడు లోకములూ కూడా సముద్రోదకముతో నిండిపోయెను. అప్పుడు ప్రపంచకము అంతా ఒక్కటిగా అయిపోయి రెండవ మేరుపర్వతమువలె నిద్రపోవుచుండెను. (నిశ్చలముగా ఉండెను). పూర్వము భూమి లక్ష్మితో కలసి విష్ణువు జఠరములో ప్రవేశించెను. గొప్ప తేజస్సుగల, సకల భూతస్వరూపుడైన ఆ విష్ణువు ఆమెను గ్రహించి, సముద్రోదకములో ప్రవేశించి అనేక సంవత్సరముల సముదాయముల పాటు నిద్రించెను. విష్ణువు నిద్రించి ఉండగా బ్రహ్మదేవుడు అతని జఠరములో ప్రవేశించెను. ఆ విష్ణువు జల ప్రవాహమును నిరోధించినట్లు చూచి మహాయోగియైన బ్రహ్మదేవుడు అతని జఠరములో ప్రవేశించెను. విష్ణువు నాభియందు బంగారు పద్మము పుట్టగా దానినుండి మహాప్రభువైన బ్రహ్మదేవుడు బైటకు వచ్చి యోగి అయి ఆలోచించెను. గొప్ప తపస్సు గల బ్రహ్మదేవుడు భూమిని, వాయువును, పర్వతములను, వృక్షములను సృష్టించ దలచినవాడై అందరు ప్రజలను మనుష్యులను, సర్పములను, జరాయుజములను, అండజములను సృష్టించెను.(40-46)

అక్కడ చెవి గులిమినుండి కైటభుడు, మధువు పుట్టిరి. మహావీర్యవంతులు, ఘోరమైన రూపములు గలవారు, ఎదిరింపశక్యముకానివారు అయిన ఆ దానవులు అక్కడ బ్రహ్మదేవుణ్ణి చూచి కోపావేశమును పొందిరి. వాళ్ళిద్దరూ గొప్ప వేగముతో బ్రహ్మమీదికి రాగా అతడు వికృతముగా అరచెను. ఆ శబ్దము వినగానే శివుడు, విష్ణువు అక్కడికి వచ్చిరి. పిమ్మట చక్రముచేత ఆ మధుకైటభులు చంపబడిరి. వాళ్ళ కొవ్వుతో భూమి అంతా అన్నివైపులా నిండిపోయెను. అప్పుడు లోకములను పోషించు విష్ణువు ఆ భూమిని మరల పరిశోధించెను. పరిశుద్ధమైన ఆ భూమిని అన్ని వృక్షములతో నింపెను. అనేక విధములైన ఓషధులు, సమస్తసస్యములూ కూడ మొలచినవి. కొవ్వు(మేదస్సు) వాసనచే భూమికి 'మేదిని' అను పేరు వచ్చినది. అందుచే ఇల్లు గ్రద్దది కాదు, గుడ్లగూబదే అని నా అభిప్రాయము. అందుచేత

పరగృహమును అపహరించిన, పాపము చేసిన ఈ గ్రద్ద దండింపదగినది. చాల దుష్టబుద్ధి గల, పాపమును ఆచరించుచున్న ఇది ఉలూకమును పీడించుచున్నది."(47-54)

ఇంతలో ఆకాశమునుండి బోధించు అశరీరవాక్కు వెలువడినది. "రామా! తపోబలముచేత పూర్వమే కాల్చబడి(పీడింపబడి) ఉన్న ఈ గ్రద్దను చంపకుము. రాజా! ఇతడు కాలగౌతమునిచేత పీడింపబడిన రాజు. ఇతని పేరు బ్రహ్మదత్తుడు. ఇతడు శూరుడు. సత్యవ్రతుడు; పరిశుద్ధుడు. ఒక బ్రాహ్మణుడు ఇతని గృహమునకు వచ్చి "రాజా! నాకు కొంచెము ఎక్కువగా నూరు సంవత్సరములు భోజనము కావలెను" అని కోరెను. బ్రహ్మదత్తమహారాజు గొప్ప కాంతి గల అతనికి స్వయముగా పాద్యమును, అర్ఘ్యమును, భోజనముకొరకై స్నేహపూర్వకమైన ఏర్పాట్లను చేసెను. ఆ మహాత్మున కిచ్చిన ఆహారమున మాంసము మత్స్యములు ఉండెను. అప్పుడు ఆ ముని కోపించి ఇతనికి "రాజా! నీవు గ్రద్దవు అయ్యెదవుగాక" అని దారుణమైన శాపము ఇచ్చెను. ఆ రాజు మునితో "ఇట్లు అనకుము. ధర్మములు తెలిసినవాడా! గొప్ప నియమములు కలవాడా! నా అజ్ఞానమువలన కలిగిన అపరాధమును క్షమించి అనుగ్రహించుము. శాపమునకు అంతమును చేయుము" అని పలికెను. అది అజ్ఞానముచేతనే చేసినట్లు తెలిసికొని ఆ ముని రాజుతో – "ఇక్ష్వాకువంశీయులైన రాజుల కులమునందు రాముడను రాజు పుట్టగలడు. ఓ! నరశ్రేష్ఠుడా! అతడు స్పృశించగానే పాపము లన్నీ తొలగిపోవును." రాముడు ఆ మాటలు విని స్పృశించగా, నరుల ప్రభువు, భూమికి అధిపతీ అయిన ఆ రాజు గ్రద్దరూపమును విడచి దివ్యగంధములను పూసుకొన్న, దివ్యరూపము గల పురుషుడుగా అయి రామునితో "ధర్మములు నెరిగిన రామా! బాగు బాగు. ప్రభూ! నీ అనుగ్రహమువలన నేను ఘోరమైన నరకమునుండి విముక్తుడను అయితిని. నీవు నా శాపానికి అంతము చేసినావు" అని పలికెను.(55-65)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని పదమూడవ ప్రక్షిప్త సర్గము సమాప్తము.**

# అరువదవ సర్గము

## రాముని సభకు ఋషులు వచ్చుట. వారిని సత్కరించి వారి అభీష్టమును పూరించుటకై ప్రతిజ్ఞ చేయుట.

రామలక్ష్మణులు ఈ విధముగా మాటలాడుకొనుచుండగా ఎక్కువ చల్లగా కాని, ఎక్కువ వేడిగా కాని ఉండని వసంతర్తువుకు సంబంధించిన రాత్రి వచ్చినది. తెల్లవారగానే పూర్వాహ్ణకృత్యము లన్నీ పూర్తిచేసికొని రాముడు పౌరుల కార్యములు పరీక్షించుటకై(వినుటకై) దర్శనగృహమును చేరెను. అప్పుడు సుమంత్రుడు వచ్చి రామునితో "రాజా! ఈ మునులు ద్వారము దగ్గర ఆపివేయబడినారు; అక్కడ నిలచి ఉన్నారు. మహారాజా! భార్గవుణ్ణి, చ్యవనుణ్ణి ముందు ఉంచుకొని వచ్చిన ఆ మహర్షులు నీ దర్శనముకొరకు తొందరపడుచు ద్వారపాలాదులను ప్రేరేపించుచున్నారు. నరశ్రేష్ఠుడా! యమునాతీరవాసులైన ఆ ఋషులు సంతోషముతో కనబడుచున్నారు" అని చెప్పెను. ధర్మవేత్తయైన రాముడు సుమంత్రుని మాటలు విని– "భార్గవుడు మొదలైన మహాభాగ్యవంతులైన ఆ బ్రాహ్మణులను ప్రవేశపెట్టుము" అని పలికెను. (1–5)

ద్వారపాలకుడు తల వంచి నమస్కారము చేసి రాజాజ్ఞానుసారము, సమీపింపశక్యము కాని తేజస్సు గల ఆ మునులను ప్రవేశపెట్టెను. అప్పుడు తమ తేజస్సుతో ప్రకాశించుచున్న మహాత్ములైన వందలమంది మునీశ్వరులు రాజభవనములో ప్రవేశించిరి. ఆ ద్విజులు అలంకరించిన కలశలతో సకలతీర్థముల జలమును తీసికొని వచ్చిరి. అధికములైన ఫలములు, మూలములూ కూడ రామునకు సమర్పించిరి. మహాబాహువైన రాముడు ఆ తీర్థోదకములను అనేకవిధములైన ఫలములను, అన్నీ కూడ ప్రీతిపూర్వకముగా గ్రహించి ఆ మహామును లందరితో "ఇవిగో శ్రేష్ఠములైన ఆసనములు. యోగ్యతానుసారముగా కూర్చొనండి" అని పలికెను. ఆ మహర్షులందరూ రాముని మాటలు విని అందమైన బంగారము వికారమైన(అనగా చుట్టూ బంగారు తీగల అల్లికతో అలంకరించబడిన) బృసుల(దర్భాసనముల వంటివి) మీద కూర్చుండిరి. (6–11)

రాముడు అక్కడ కూర్చున్న మునులను చూచి, నియమము పాటించుచు, అంజలి ఘటించి– "మీరు వచ్చిన పని ఏమి? సావధానచిత్తముతో నేను మీకు ఏమి చేయవలెను? కోరిన పనులు చేయగలను. నన్ను మహర్షులు నిస్సంకోచముగా ఆజ్ఞాపించవచ్చును. ఈ నా సమస్తరాజ్యము, హృదయమునందున్న జీవితము,

సర్వమూ కూడ ద్విజులకొరకే. మీకు ఇది సత్యముగా చెప్పుచున్నాను" అని పలికెను. రాముని మాటలు విని యమునాతీరవాసులైన, ఉగ్రతపస్సు గల ఆ మునులు పెద్దగా "బాగు బాగు" అనిరి. ఆ మహాత్ములు గొప్ప సంతోషముతో- "రామా! ఇట్లు పలుకుట ఈ భూలోకములో నీకే తగియున్నది; మరెవ్వరికీ కాదు. రాజా! పూర్వము మహాబలశాలులైన ఎందరో రాజులు ఉండెడివారు. కాని వారెవరూ అడగబోయే కార్యము ఎంత గొప్పదో అని ఆలోచించి ముందు ప్రతిజ్ఞ చేసేవారు కాదు. నీవు మాత్రము వచ్చిన పని ఏదో తెలుసుకొనకుండగానే, బ్రాహ్మణులపై నీకున్న గౌరవముచేత ప్రతిజ్ఞ చేసినావు. అందువలన తప్పక ఈ పని చేయగలవు. ఋషులను మహాభయమునుండి రక్షించుము" అని పలికిరి.(12-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువదవ సర్గము సమాప్తము.**

# అరువది ఒకటవ సర్గము

## మునులు రామునకు మధులవణాసురులను గూర్చి చెప్పి తమకు కలిగిన భయమును తొలగింపుమని రాముణ్ణి వేడుట.

**ఋ**షుల మాటలు విని రాముడు - "మునులారా! ఏమి పనిమీద వచ్చినారు? మీ భయము తొలగిపోవుగాక" అని పలికెను. రాముని మాటలు విని భార్గవుడిట్లు పలికెను- "రాజా! దేశమునకు భయకారణ మేమో వినుము. పూర్వము కృతయుగమునందు చాల గొప్ప బుద్ధిగలవాడూ లోల జ్యేష్ఠపుత్రుడు, దైత్యుడు అయిన మధువు అను మహాసురుడు ఉండెను. ఆ మధువు బ్రాహ్మణపూజకుడు, రక్షకుడు, సద్బుద్ధి కలవాడు. అతనికి ఉత్తమస్వభావవంతులైన దేవతలతో మంచి స్నేహ ముండెను. ఆ మధువు మంచి పరాక్రమము గలవాడు. ధర్మమునందు స్థిరమైన చిత్తము గలవాడు. రుద్రుడు గౌరవముతో అతనికి ఒక అశ్చర్యకరమైన వరము నిచ్చెను.(1-5)

మహాత్ముడైన రుద్రుడు తన శూలమునుండి గొప్ప శక్తి, కాంతి గల మరొక శూలమును పైకి తీసి అతనికి ఇచ్చి ఇట్లు పలికెను- "నీవు నాకు ఆనందము కలిగించు సాటిలేని ధర్మము ఆచరించితివి. ప్రీతితో నీకు ఉత్తమమైన అయుధమును ఇచ్చుచున్నాను. ఓ! మహాసురా! నీవు ఎంతవరకు దేవతల విషయమునందు, బ్రాహ్మణుల విషయమునందు ద్వేషము వహింపవో అంతవరకు ఇది నీదిగా ఉండగలదు. అట్లు కానిచో ఇది అదృశ్యమయిపోవును. నిన్ను ఎవడు నిర్భయుడై

యుద్ధములో ఎదిరించుటకు వచ్చునో వానిని ఈ శూలము భస్మము చేసి మరల నీ చేతితోనికి వచ్చును." మధువు రుద్రునినుండి ఈ విధముగా వరమును పొంది అతనికి నమస్కరించి– "భగవంతుడా! శ్రేష్ఠమైన ఈ శూలము నిత్యమూ నా వంశమునకు చెందినదై ఉండుగాక. నీవు దేవతల ప్రభువు కదా (ఈ వరము నిమ్ము)" అని కోరెను. మహాదేవుడు ఇట్లు పలుకుచున్న ఆ మధువుతో– "ఇది ఇట్లు జరుగదు. నా అనుగ్రహముచేత వెలువడిన నీ శుభమైన వాక్కు వ్యర్థము కాకుండుగాక; అందుచేత ఈ శూలము నీ కుమారుడు ఒక్కని దగ్గర మాత్రము ఉండగలదు. ఈ శూలము ఎంతవరకు నీ కుమారుని చేతిలో ఉండునో అంతవరకు అతనిని ఎవ్వరూ కూడ చంపజాలరు" అని చెప్పెను. (6–14)

అసురులలో శ్రేష్ఠుడైన ఆ మధువు ఈ విధముగా మహాదేవునినుండి అద్భుతమైన చాలా గొప్ప వరమును పొంది, మంచి కాంతిగల ఒక భవనమును నిర్మింపచేసెను. విశ్వావసువునకు అనలయందు జనించిన గొప్ప కాంతి గల కుంభీనసి అను మహాభాగ్యవంతురాలు ఆ మధువు భార్య. ఆ కుంభీనసికి గొప్ప పరాక్రమముగల, భయంకరుడైన లవణు డను పుత్రుడు పుట్టెను. దుష్టబుద్ధియైన అతడు బాల్యమునుండీ కూడ పాపకార్యములనే చేసెను. దుష్టస్వభావము గల ఆ పుత్రుణ్ణి చూచి మధువునకు కోపము, దుఃఖమూ గూడ కలిగెను. కాని అతడు వానిని ఏమీ అనలేదు. అతడు శూలమును లవణునకు అప్పచెప్పి, దానిని గూర్చిన వరమును కూడ అతనికి తెలిపి ఈ లోకమును విడిచి వరుణలోకమునకు వెళ్ళిపోయెను. లవణుడు సహజముగా దుష్టుడగుటచేతను, ఆ శూలము ప్రభావము చేతనూ మూడు లోకములను కూడ పీడించుచున్నాడు. విశేషించి మునులను పీడించుచున్నాడు. రామా! లవణుని ప్రభావము ఇట్టిది. శూలము కూడ అలాంటిది. ఈ విషయమున నీదే తుది నిర్ణయము. నీవే మాకు దిక్కు కదా? వీరుడవైన రామా! భయపీడితులైన ఋషులు పూర్వము చాలామంది రాజులదగ్గరకు వెళ్ళి అభయము యాచించినారు. కాని మాకు ఒక్క రక్షకుడు కూడా లభించలేదు. తండ్రీ! నీవు సైన్యవాహనాదులతో సహా రావణుణ్ణి సంహరించినట్లు విన్నాము. ఈ భూలోకములో రక్షకుడైన మరొక రాజు ఎవ్వడూ కనబడుటలేదు. అందువలన లవణాసురుని నుండి భయముచేత పీడితులమైన మమ్ము రక్షించవలె నని కోరుచున్నాము. రామా! భయమునకు కారణమును నీకు తెలిపినాము. దీనిని నివారించుటకు నీవే సమర్థుడవు. గొప్ప పరాక్రమము గలవాడా! ఈ కోరిక తీర్చుము. (15–24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది ఒకటవ సర్గము సమాప్తము.**

# అరువది రెండవ సర్గము

**లవణాసురుని చంపుటకై శత్రుఘ్నుని ఉత్సాహము తెలుసుకొని, రాముడు అతనిని ఆ కార్యమునకై ఆజ్ఞాపించుట.**

రాముడు ఋషుల మాటలు విని, వారికి నమస్కరించుచు, "ఆ లవణాసురుడు ఎట్టి ఆహారము తినును? ఏవిధముగా ప్రవర్తించుచుండును?" అని ప్రశ్నించెను. రాముని మాటలు విని ఆ ఋషులందరూ ఆ లవణుడు ఎట్లు వృద్ధిపొందెనో తెలిపిరి– "అన్ని ప్రాణులూ కూడ వాని ఆహారమే; విశేషించి మునులు వాని ఆహారము. నిత్యమూ క్రూరముగా ఉండుట వాని ఆచారము. మధువనములో వాని నివాసము. కొన్నివేల సింహములను, పెద్దపులులను, లేళ్ళను, పక్షులను, మనుష్యులను చంపి నిత్యము పగలు భోజనము చేయుచుండును. ప్రళయకాలమునందు నోరు తెరచుకొనిన మృత్యుదేవతవలె మహాబలశాలియైన ఆ లవణుడు, రాత్రులందు ఇతర మృగములను తినుచుండును."(1-5)

రాముడు ఆ మాటలు విని ఆ మునులతో– "ఆ రాక్షసుణ్ణి చంపించెదను. మీరు భయమును విడిచిపెట్టుడు" అని పలికెను. రాముడు ఆ మునులకు ఈ విధముగా ప్రతిజ్ఞ చేసి అక్కడనే ఉన్న సోదరులతో– "లవణుణ్ణి ఏ వీరుడు చంపగలడు? వానిని మహాబాహువైన భరతుని వాటాగా చేయవలెనా, ధీమంతుడైన శత్రుఘ్నుని వాటాగా చేయవలెనా?" అని అడిగెను. రాముని మాటలు విని భరతుడు "నేను వానిని చంపెదను. వానిని నా భాగముగా చేయుము" అని పలికెను. భరతుడు పలికిన ధైర్యశౌర్యాలతో కూడిన ఆ మాట విని శత్రుఘ్నుడు తాను కూర్చున్న బంగారు ఆసనమునుండి లేచి నిలబడి నమస్కరించుచు రాజుతో– "మహాబాహువైన భరతుడు గొప్ప కార్యములు ఇంతకు పూర్వమే చేసినాడు. పూర్వము ఇతడు, నీవు లేని అయోధ్యను నీ రాకను గూర్చి మనస్సులో పరితపించుచు రక్షించినాడు కదా? రాజా! ఇతడు అనేక దుఃఖములు అనుభవించినాడు. గొప్ప కీర్తిగల ఈ భరతుడు నందిగ్రామములో ఫలములు, దుంపలు, తినుచు జటలను నారబట్టలను ధరించి దుఃఖకరములైన శయ్యలమీద శయనించినాడు. ఇట్టి దుఃఖములను అనుభవించిన ఇతడు నేను ఉండగా మరల క్లేశమును పొందకుందుగాక." అనెను.(6-14)

శత్రుఘ్నుని మాటలు విని రాముడు "శత్రుఘ్నా! అట్లే అగుగాక. నా ఆజ్ఞ ప్రకారము చేయుము. నిన్ను మంగళకరమైన మధువు నగరమునందు రాజ్యాభిషిక్తుణ్ణి చేసెదను. మహాబాహూ! భరతుణ్ణి శ్రమపెట్టకూడ దని నీవు భావించినచో నీవు

రాజ్యమును ఏర్పరచుము. నీవు శూరుడవు. విద్యలు నేర్చినవాడవు. రాజ్యమును ఏర్పరుచుటలో కూడ సమర్థుడవు. యమునానదీతీరమునందు నగరమును, సుందరమైన జనపదములను ఏర్పరుపుము. ఒక రాజవంశమును నిర్మూలించి ఆ స్థానమునందు మరొకరిని నియమించనివాడు నరకమునకు వెళ్ళును. నీవు నామాట మన్నించినట్లయితే దుష్టబుద్ధిగల మధుపుత్రుడైన ఆ లవణుణ్ణి చంపి ధర్మానుసారముగా రాజ్యము పాలించుము. ఓ! శూరుడా! నా మాటల మధ్య నీవు మరేమీ చెప్పవద్దు. చిన్నవాడు అన్నగారి ఆజ్ఞ ఆచరించవలెను. ఈ విషయములో సందేహము లేదు. శత్రుఘ్నా! నేను సంకల్పించిన, వసిష్ఠాదిబ్రాహ్మణులు యథాశాస్త్రముగా మంత్రపూర్వకముగా చేయబోవు అభిషేకమును పొందుము" అని ఆదేశించెను. (15-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది రెండవ సర్గము సమాప్తము.**

# అరువది మూడవ సర్గము

## రాముడు శత్రుఘ్నుణ్ణి మధురాజ్యమునందు అభిషిక్తుని చేసి లవణుని శూలమునుండి ఆత్మరక్ష చేసుకొను ఉపాయములు చెప్పుట.

రాముని మాటలు విని పరాక్రమసంపన్నుడైన శత్రుఘ్నుడు చాలా సిగ్గుపడుచు మెల్ల మెల్లగా ఇట్లు పలికెను- "మహారాజా! రామా! ఈ విషయము అధర్మ మని భావించుచున్నాను. పెద్దవాళ్ళు ఉండగా చిన్నవానికి అభిషేకము ఎట్లు జరుగును? పురుషశ్రేష్ఠా! నీ ఆజ్ఞను తప్పక పాటించవలెను. నీ శాసనము తప్పక ఆచరింపదగినది. నీవు చెప్పగా విని ఉన్నాను; శ్రుతులనుండి విని ఉన్నాను; మధ్యముడైన భరతుడు ప్రతిజ్ఞ చేయుచున్నప్పుడు (లవణాసురుణ్ణి చంపెదనని అనుచున్నప్పుడు) నేను మాటలాడుట యుక్తము కాదు. పురుషశ్రేష్ఠుడా! భరతుడు మాటలాడిన పిమ్మట "నేను లవణాసురుణ్ణి చంపెదను" అని నేను ఘోరమైన చెడ్డ మాట పలికినాను. ఆ చెడ్డమాటకు ఫలితముగా ఆ దుర్గతి (అన్నలకంటె ముందు రాజ్యాభిషిక్తుడు అగుట అనే పాపము చేయవలసిన దుఃస్థితి) వచ్చినది. పెద్దవాడు మాటలాడిన పిమ్మట అధర్మసహితము, పరలోకమునకు విరుద్ధమూ అయే రీతిలో చెప్పగూడదు కదా? రామా!(భరతుని మాటకు ఎదురు చెప్పుటచేతనే ఈ శిక్ష లభించినది.)

అందుచేత మళ్ళీ నీకు కూడ ఎదురుచెప్పి మరొక శిక్షకు పాత్రుడను కాకుందును గాక. పురుషశ్రేష్ఠుడవైన రాజా! నేను నీ ఇచ్ఛ ప్రకారము చేసెదను. నీవు నా నిమిత్తమై అధర్మమును తొలగింపుము. చిన్నవాడను అయి ఉండి రాజ్యాభిషిక్తుడను అగుట అనే నేను చేయు అధర్మము నాకు తగలకుండా చేయుము."(1-8)

శూరుడు, మహాత్ముడూ అయిన శత్రుఘ్నుని మాటలు విని రాముడు సంతోషించి, భరతునితోను, లక్ష్మణునితోను "సావధానచిత్తులై అభిషేకసంభారములను తీసికొనిరండి. పురుషశ్రేష్ఠుడైన శత్రుఘ్నునకు ఇప్పుడే రాజ్యాభిషేకము చేసెదను. భరతా! పురోహితుణ్ణి, ఆ యా సంఘాల ప్రముఖులను ఋత్విక్కులను వీరి నందరినీ నా ఆజ్ఞచేత తీసికొనిరండి" అని పలికెను. ఆ మహారథులు రాజు శాసనమును తెలిసికొని, పురోహితుణ్ణి ముందు ఉంచుకొని ఆ విధముగా అభిషేకము ఏర్పాట్లు చేసిరి. రాజులూ, బ్రాహ్మణులూ రాజభవనములో ప్రవేశించిరి. పిమ్మట మహాత్ముడైన శత్రుఘ్నుని అభిషేకము వైభవముతో జరిగెను. శ్రీమంతుడైన శత్రుఘ్నుడు రాజ్యాభిషిక్తుడై, రామునకూ, పురజనులకు కూడ ఇంద్రాదిదేవతలచేత అభిషిక్తుడైన కుమారస్వామివలె, ఆనందము కలిగించుచు, సూర్యుడువలె ప్రకాశించెను. రాముడు శత్రుఘ్నుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేయగా, పౌరులు, అధిక విద్యావంతులైన బ్రాహ్మణులూ కూడ సంతోషించిరి. కౌసల్య, సుమిత్ర, కైకేయి రాజభవనములో ఉన్న ఇతరరాజభార్యలు కూడా అతనికి మంగళము చేసిరి. శత్రుఘ్నుడు రాజ్యాభిషిక్తుడు కాగానే యమునాతీరవాసులైన మహర్షులు "లవణుడు ఇక చచ్చినట్లే" అని అనుకొనిరి.(9-17)

పిమ్మట రాముడు రాజ్యాభిషిక్తుడైన శత్రుఘ్నుణ్ణి ఒడిలో కూర్చుండబెట్టుకొని అతని తేజస్సు పెంచుచు మధురమైన వాక్కును పలికెను- "సౌమ్యుడవైన శత్రుఘ్నా! దివ్యము, శత్రుపురవినాశకము అయిన ఈ బాణమును నీకిచ్చుచున్నాను. ఇది అమోఘ మైనది. దీనితో లవణాసురుణ్ణి చంపగలవు. స్వయముగా ఆవిర్భవించిన శ్రీమహావిష్ణువు మహాసముద్రములో శయనించి ఉన్నప్పుడు ఈ దివ్యమైన శరము సృష్టించబడినది. దీనిని సురులుగాని, అసురులుగాని చూడలేదు. వీరుడా! ఆ కారణముచేత ఈ బాణము ఏప్రాణికీ కూడ కనబడదు. క్రోధావిష్టుడైన విష్ణువు దురాత్ముడైన మధుకైటభులను చంపుటకు, సకలరాక్షసులను నశింపచేయుటకు ఈ శరమును సృజించినాడు. మూడు లోకములను సృష్టింపదలచిన ఆ విష్ణువు దీనిచేత యుద్ధమునందు వాళ్ళిద్దరినీ చంపివేసెను. శ్రీమహావిష్ణువు మధుకైటభులను ఈ శ్రేష్ఠమైన బాణముచేత సంహరించి ప్రాణుల భోగముకొరకై లోకములను

సృష్టించెను. శత్రుఘ్నా! రావణుని చంపదలచిన నేను పూర్వము చాలామంది ప్రాణులకు నాశము కలుగునను భయముచేత ఈ బాణమును ప్రయోగించలేదు. (18-24)

మహాత్ముడైన మహేశ్వరుడు శత్రువినాశనముకొరకై మధువుకు ఉత్తమమైన ఆయుధముగా ఇచ్చిన ఆ గొప్ప శూలమునకు లవణుడు మాటిమాటికి పూజలు చేయుచుండును. దానిని ఇంటిలోనే ఉంచి ఉత్తమమైన ఆహారము సంపాదించుటకై అన్ని దిక్కులకు పోవుచుండును. ఎవ్వడైనా వచ్చి యుద్ధానికి పిలిచినప్పుడు ఈ లవణుడు ఆ శూలమును గ్రహించి భస్మము చేయుచుండును. పురుషశ్రేష్ఠుడవైన శత్రుఘ్నా! నీవు ఆయుధములు ధరించి, ఆయుధము చేతిలో లేని ఆ లవణుడు పురములో ప్రవేశించుటకు పూర్వమే అతని కొరకై ద్వారము వద్ద వేచి ఉండుము. అతడు భవనములో ప్రవేశించుటకు ముందుగానే నీవు యుద్ధానికి పిలుపుము. అప్పుడు వానిని చంపగలవు. మరొక విధముగా చేసినచో అతడు చంప శక్యముకానివా డగును. ఇట్లు చేసినచో నశించగలడు. నీకు ఈ విషయమంతా చెప్పినాను. శూలమును ఎట్లు పరిహరించవలెనో కూడా చెప్పినాను. శ్రీమంతుడైన ఈశ్వరుని కృత్యము(ఆజ్ఞ) దాట శక్యము కాదు కదా?"(25-31)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది మూడవ సర్గము సమాప్తము.**

# అరువది నాలుగవ సర్గము

## రాముని ఆజ్ఞచేత శత్రుఘ్నుడు ముందుగా సైన్యమును పంపి ఒక మాసము తరువాత మధురకు ప్రయాణమై వెళ్ళుట.

రాముడు శత్రుఘ్నునితో ఇట్లు పలికి, మాటి మాటికి ప్రశంసించి, మరల మరొక మాట చెప్పెను - "పురుషశ్రేష్ఠుడా! ఇవిగో నాలుగువేల గుఱ్ఱాలు, రెండు వేల రథాలు, ఒక వంద ఏనుగులు. అమ్మచూపిన అనేక వస్తువులతో ప్రకాశించుచున్న ఆపణముల వీథుల మధ్యలో నటులు నర్తకులు శత్రుఘ్నుని వెనుక వెళ్ళెదరు గాక. శత్రుఘ్నా! సరిపడునంత ధనముతో వాహనములతో కూడిన నీవు మంచి బంగారు నాణెములు లక్ష(లేదా పదిలక్షలు) తీసుకొని వెళ్ళుము. సైన్యమును బాగా పోషించుచు మంచి ఉత్సాహముతోను, సంతోషముతోను ఉండునట్లు చేయుచు, మంచి మాటలతో

రంజింపచేయుచుండుము. బాగా సంతోషపెట్టబడిన సైనికాదులు ఎట్టి ఆపత్సమయాదులలో అండగా నిలచెదరో అట్టి సమయాలలో ధనములు గాని, భార్యలుగాని, బంధువులుగాని నిలబడరు. అందువలన ఉత్సాహవంతులైన భటులతో నిండిన పెద్ద సైన్యమును బయలుదేరతీసి, నీవు ఒక్కడవే ధనుస్సు హస్తమునందు ధరించి మధువు వనమునకు వెళ్ళుము. మధువు పుత్రుడైన లవణునకు నీవు యుద్ధానికి వచ్చుచున్నట్లు తెలియకుండు నట్లు, వానికి శంక కలిగించకుండా (లేదా) నిర్భయముగా వెళ్ళుము. పురుషశ్రేష్ఠుడా! వానికి శంక కలగకుండా వెళ్ళి అడ్డగించి యుద్ధము చేయుటతప్ప మరొక మృత్యూపాయము లేదు. అట్లు కాక అతని దృష్టిలో పడిన వానిని అతడు చంపివేయును. సౌమ్యుడా! గ్రీష్మము గడచి వర్షాకాలము ప్రారంభము కాగానే నీవు లవణాసురుణ్ణి చంపుము; ఆ దుర్మతిని చంపుటకు తగిన కాలము అదే. నీ సైనికులు గ్రీష్మము కొంచెము మిగిలి ఉన్నదనగా గంగాజలమును దాటే టట్లు మహర్షులను ముందు ఉంచుకొని వెళ్ళెదరు గాక. సైన్యము నంతను అక్కడ నదీతీరమునందు నిలిపి, సావధానచిత్తుడవై ధనుస్సు ధరించి శీఘ్రముగా ముందుకు వెళ్ళుము."(1-12)

శత్రుఘ్నుడు రాముని మాటలు విని, మహాబలవంతులైన సేనానాయకులను పిలిపించి, "మీరు ఎక్కడ విడిది చేయవలెనో, ఆ ప్రదేశము నిర్ణయించబడినది. ఇదిగో; అక్కడ ఎవరికీ బాధ కలగకుండగా, పరస్పరవిరోధము లేకుండగా నివసించవలెను" అని ఆజ్ఞాపించెను. సైన్యాధ్యక్షులకు ఆ విధముగా ఆజ్ఞ ఇచ్చి, గొప్ప సైన్యమును బయలుదేరజేసి, కౌసల్యా-సుమిత్రా-కైకేయిలకు నమస్కరించెను. పరిశుద్ధమైన మనస్సు గల శత్రుఘ్నుడు రామునకు ప్రదక్షిణముచేసి శిరస్సు వంచి నమస్కరించి, లక్ష్మణభరతులకు అంజలి ఘటించి నమస్కరించి, పురోహితుడైన వసిష్ఠునకు నమస్కరించి బయలుదేరెను. గొప్పబలము గల శత్రుసంహారకుడైన శత్రుఘ్నుడు రాముని అనుజ్ఞపొంది అతనికి ప్రదక్షిణము చేసి బయలుదేరెను. ఏనుగులతోను, శ్రేష్ఠములైన అశ్వములతోను నిండిన సేనను ముందు పంపివేసి, అనుచరులు సేవింపగా, రాజు దగ్గరనుండి బయలుదేరెను.(13-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది నాలుగవ సర్గము సమాప్తము.**

# అరువది ఐదవ సర్గము

**వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసుడైన కల్మాషపాదుని కథ చెప్పుట.**

శత్రుఘ్నుడు సైన్యము నంతను బయలుదేరదీసి మార్గమునందు ఒక్క మాసము మాత్రమే ఉన్నవాడై అప్పుడు తానొక్కడే తొందరగా ముందుకు వెళ్ళెను. శత్రుఘ్నుడు మార్గమధ్యమునందు రెండురోజులు గడిపి ఉత్తమనివాసమైన, పవిత్రమైన వాల్మీక్యాశ్రమమును చేరెను. మునిశ్రేష్ఠుడైన, వాల్మీకికి నమస్కరించి అంజలి ఘటించి– "పూజ్యుడా! అన్నగారి పనిమీద వచ్చిన నేను ఇక్కడ నివసించ గోరుచున్నాను. రేపు ప్రాతఃకాలమునందు భయంకరమైన పశ్చిమదిక్కువైపు వెళ్ళెదను" అని చెప్పెను. మునిశ్రేష్ఠుడైన వాల్మీకి శత్రుఘ్నుని మాటలు విని ఆ మహాత్మునితో, "గొప్పకీర్తి గలవాడా! నీకు స్వాగతము. ఇది రఘువంశమువారి స్వాశ్రమము వంటిది. నేను ఇచ్చుచున్న ఆసనమును, పాద్యమును, అర్ఘ్యమును నిఃసందేహముగా స్వీకరింపుము" అనెను.(1–6)

శత్రుఘ్నుడు ఆ పూజలు స్వీకరించి ఫలమూలములను భుజించి బాగా తృప్తిచెందెను. అతడు ఆ మహర్షిని "నీ ఆశ్రమసమీపమునందు ఈ యజ్ఞసమృద్ధి ఎవరిది?" అని ప్రశ్నించెను. వాల్మీకి అతని మాటలు విని ఇట్లు పలికెను. "శత్రుఘ్నా! ఇది పూర్వము ఎవరి నివాసముగా ఉండెనో చెప్పెదను; వినుము. సుదాసు దను మీ పూర్వుడైన రాజు ఉండెను. అతని కుమారుడు మిత్రసహుడు. అతడు పరాక్రమశాలి. చాల ధార్మికుడు. ఆ సౌదాసుడు(సుదాసుని పుత్రుడైన మిత్రసహుడు) బాల్యమునుండియే వేటాడుటకు వెళ్ళుచుండెను. శూరుడైన అతడు అధికముగా సంచరించుచున్న ఇద్దరు రాక్షసులను చూచెను. ఆ భయంకరులైన రాక్షసులిద్దరూ పెద్దపులుల రూపములు ధరించి ఎన్నో వేల మృగాలను భక్షించినను తృప్తిచెందక, "చాలును"అను మాట లేక ఉండిరి. ఆ రాక్షసు లిద్దరూ వనములో మృగములు లేకుండా చేయుట చూచి క్రోధావిష్టుడైన ఆ సౌదాసుడు గొప్ప బాణముతో ఒక రాక్షసుడ్ని చంపెను. పురుషశ్రేష్ఠుడైన సౌదాసుడు ఒక రాక్షసుడ్ని చంపి; మనస్తాపమును, కోపమును విడచి, చచ్చిన ఆ రాక్షసుడ్ని చూచెను.(7–14)

చనిపోయిన రాక్షసుని మిత్రుడైన రాక్షసుడు ఈ విధముగా చూచుచున్న సౌదాసుని చూచి చాల విచారించుచు– "పాపిష్ఠుడా! అపరాధము లేని నా మిత్రుడ్ని చంపినావు. అందువలన నేను నీకు ప్రతిక్రియ చేసెదను." అని పలికి అక్కడనే అంతర్ధానము చెందెను. కాలక్రమమున మిత్రసహుడు రాజయ్యెను. ఆ రాజు ఈ

ఆశ్రమము సమీపమునందు అశ్వమేధమహాయజ్ఞమును చేసెను. ఆ యజ్ఞమును వసిష్ఠుడు పరిపాలించెను. అక్కడ ఆ మహాయజ్ఞము అనేక సంవత్సరముల పాటు జరిగెను. గొప్ప శోభతో నడచిన ఆ యజ్ఞము దేవయజ్ఞము వలె ఉండెను. యజ్ఞము పూర్తియైన పిమ్మట ఆ రాక్షసుడు వెనుకటి వైరమును స్మరించుచు, వసిష్ఠుని రూపము ధరించి రాజుతో- "నేడు యజ్ఞము పూర్తి అయినది. నాకు శీఘ్రముగా మాంసముతో కూడిన భోజనమును పెట్టుము. ఈ విషయమున ఆలోచించవద్దు" అని పలికెను. వసిష్ఠరూపములో ఉన్న రాక్షసుని మాటలు విని రాజు వంటలో నేర్పుగల వంటవాళ్ళను- "హవిస్సుగా ఉపయోగింపదగిన మాంసముతో కూడిన భోజనము మధురముగా ఉండేటట్లు, గురువునకు సంతోషము కలిగేటట్లు శీఘ్రముగా తయారుచేయుడు" అని ఆదేశించెను.(15-23)

రాజు ఆజ్ఞ విని, వసిష్ఠుడు మాంసాహారము తినుటయా, అని వంటవాడు కంగారుపడెను. అప్పుడా రాక్షసుడు వంటవాని రూపము ధరించెను. "మధురము, హవిస్సుగా ఉపయోగించేదీ, మాంసయుక్తమూ అయిన అన్న మిదిగో" అని అతడు రాజుకు మనుష్యమాంసమును చూపెను. శత్రుఘ్నా! ఆ రాజు భార్యయైన మదయంతితో కలసి వెళ్ళి, రాక్షసుడు తీసికొని వచ్చిన ఆ మాంససహితమైన భోజనమును వసిష్ఠునకు సమర్పించెను. వసిష్ఠుడు భోజనములో మనుష్యమాంసమున్నట్లు తెలుసుకొని చాల కోపముతో- "రాజా! నీవు నాకు ఈ భోజనము ఇవ్వవలెనని కోరుచున్నావు గాన నీకు ఇదే భోజనము కాగలదు. సందేహము లేదు" అని శపించెను. అప్పుడు సౌదాసుడు క్రోధముతో చేతిలో జలము తీసికొని వసిష్ఠుణ్ణి శపించుటకు ఉద్యమించగా భార్య- "రాజా! పూజ్యుడైన వసిష్ఠమహర్షి మన ప్రభువు. అందువలన దేవతాసమానుడైన మన పురోహితుణ్ణి తిరిగి శపించకూడదు" అనుచు అతనిని నివారించెను. అప్పుడు ధర్మాత్ముడయిన ఆ రాజు క్రోధముతో నిండిన తేజోబలములతో కూడిన ఆ జలమును క్రిందకు విడచి తన పాదములు తడిపెను. అప్పుడు అట్లు చేయుటచే ఆ రాజు పాదములు నల్లగా అయినవి. అది మొదలు గొప్ప కీర్తి గల ఆ సౌదాసమహారాజు కల్మాషపాదుడు (పాదాలలో నలుపు ఉన్నవాడు) అయెను. ఆరాజు ఆ పేరుతోనే ప్రసిద్ధుడయ్యెను.(24-32)

ఆ రాజూ, భార్యా వసిష్ఠునకు మాటిమాటికి నమస్కరించి వసిష్ఠరూపమును ధరించిన ఆ రాక్షసుడు చెప్పిన మాటలు ఆయనకు తెలిపిరి. వసిష్ఠుడు ఆ రాజు మాటలు విని, రాక్షసుడు చేసిన మోసమును తెలిసికొని పురుషశ్రేష్ఠుడైన ఆ రాజుతో

మరల ఇట్లు పలికెను. రోషముతో నిండిన మనస్సుతో నేను పలికిన మాటను మరొక విధముగా చేయుట శక్యము కాదు. కాన నీకొక వరము ఇచ్చెదను. రాజేంద్రా! పన్నెండు సంవత్సరముల కాలము గడవగానే శాపాంతము అగును. నా అనుగ్రహమువలన నీకు, ఆ కాలములో చేసిన అభక్ష్యభక్షణాదికము స్మరణ ఉండదు." శత్రుసంహారకుడైన ఆ రాజు ఆ శాపమును ఈ విధముగా అనుభవించి, మరల రాజ్యమును పొంది ప్రజలను పాలించెను. శత్రుఘ్నా! నీవు అడుగుచున్న ఈ ఆశ్రమసమీపస్థానము కల్మాషపాదుడు యజ్ఞము చేసిన పవిత్రస్థానము. (33-38)

శత్రుఘ్నుడు చాలా దారుణమైన ఆ సౌదాసుని కథ విని, మహర్షికి అభివాదము చేసి పర్ణశాలలో ప్రవేశించెను. (39)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది ఐదవ సర్గము సమాప్తము.**

# అరువది ఆరవ సర్గము

## సీత ఇద్దరు పుత్రులను కనుట. ఈ విషయము విని శత్రుఘ్నుడు సంతోషించుట. అక్కడినుండి యమునాతటమునకు వెళ్ళుట.

శత్రుఘ్నుడు పర్ణశాలలో ప్రవేశించిన రాత్రియందే సీత ఇద్దరు పుత్రులను కనెను. మునికుమారులు అర్ధరాత్రి సమయమునందు వచ్చి సీత ప్రసవించిన దను శుభమైన ప్రియవార్తను వాల్మీకికి చెప్పి- "పూజ్యుడా! రాముని భార్య ఇద్దరు పిల్లలను కన్నది. అందువలన భూతబాధానివారకమైన రక్షావిధానము చేయుము" అనిరి. వాల్మీకి వాళ్ళ మాటలు విని బాలచంద్రులవంటి, గొప్ప కాంతి గల, దేవపుత్రులతో సమానులైన ఆ పిల్లలవద్దకు వెళ్లెను. సంతోషించిన మనస్సుతో ఆ పిల్లలను చూచి, వాళ్ళకు భూతములను, రాక్షసులనూ, నశింపచేయు రక్షను చేసెను. (1-5)

వాల్మీకి కుశముష్టిని లవమును గ్రహించి ఆ శిశువుల కిద్దరికీ భూతములను నశింపచేయు రక్షణ చేసెను. వారిలో ముందు పుట్టినవానికి మంత్రముచేత సంస్కరించిన కుశలతో(కుశముష్టితో అనగా పిడికెడు కుశలతో) సంమార్జనము చేయవలెను. అందుచేత అతని పేరు 'కుశుడు'. వారిలో రెండవవానిని సావధానచిత్తుడుగా ఉండునట్లు చేయుచు, వృద్ధస్త్రీలు లవముచేత (కుశల

మొదళ్లు లవం) తుడవవలెను. వాని పేరు 'లవుడు' అని అనెను. ఆ విధముగా ఈ కవలలు ఇద్దరూ నేను పెట్టిన కుశలవులను పేర్లతో ప్రసిద్ధులు అగుదురు. పుణ్యవతులైన ఆ వృద్ధస్త్రీలు ఆ రక్షను మునిచేతుల నుండి శ్రద్ధాపూర్వకముగా తీసికొని ఆ శిశువులకు రక్ష చేసిరి.(6-10)

శత్రుఘ్నుడు వృద్ధస్త్రీలు ఆ విధముగా రక్ష చేయుటను, వాళ్ళు తన గోత్రము, రాముని పేరు చెప్పుకొనుటను, సీత ఇద్దరు శిశువులను కన్నది అను మాటను అత్యంతప్రియమైన దీని నంతను అర్ధరాత్రియందు వినెను. పర్ణశాలకు వెళ్ళి "తల్లీ అదృష్టవశముచేత సుఖముగా ఉన్నావు" అనెను.(11-12)

అప్పుడు సంతోషించిన ఆ మహాత్ముడైన శత్రుఘ్నునకు వర్షాకాల సంబంధమైన ఆ శ్రావణరాత్రి తొందరగా గడిచిపోయెను. అతడు ప్రాతఃకాలమునందు పూర్వాహ్ణక్రియలు చేసుకొని అంజలి ఘటించి మునివద్ద సెలవు తీసికొని మరల పశ్చిమాభిముఖుడై వెళ్ళెను. శత్రుఘ్నుడు మార్గమునందు ఏడు దివసములు (ఉండి) ప్రయాణము చేసి యమునాతీరము చేరి, పుణ్యకీర్తి గల ఋషీశ్వరుల ఆశ్రమమునందు చ్యవనుడు మొదలైన మునులతో తగు విధములైన సంభాషణలు చేయుచు నివసించెను. అక్కడ కలసి ఉన్న కాంచనాది మునులతో అనేక విధములైన సంభాషణలు చేయుచు ఆ రాత్రిని గడపెను.(13-17)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది ఆరవ సర్గము సమాప్తము.**

# అరువది ఏడవ సర్గము

## చ్యవనుడు శత్రుఘ్నునకు లవణాసురుని శూలమునకు గల శక్తిని చెప్పుచు పూర్వము జరిగిన మాంధాతవధను గూర్చి తెలుపుట.

రాత్రి ప్రారంభమైన పిమ్మట శత్రుఘ్నుడు, భృగువు కుమారుడైన చ్యవనుణ్ణి, లవణుని బలము ఎట్టిది అని ప్రశ్నించెను- "మునీంద్రా! శూలము బలము ఎట్టిది? పూర్వము అతనితో ద్వంద్వయుద్ధమునకు తలపడిన ఎవరెవరిని అతడు ఆ గొప్పశూలముతో చంపినాడు?" అని అడిగెను.(1, 2)

శత్రుఘ్నుని మాటలు విని చ్యవనుడు ఇట్లు బదులు పలికెను- "శత్రుఘ్నుడా! ఇతడు చేసిన పనులు లెక్కింపశక్యముకానివి. ఇక్ష్వాకువంశమునకు చెందిన ఒక

రాజు విషయమున జరిగిన వృత్తాంతమును వినుము. పూర్వము అయోధ్యలో యువనాశ్వుని పుత్రుడైన మహాబలపరాక్రమములు గల, మూడు లోకములలోను ప్రసిద్ధుడైన మాంధాత అనే రాజు ఉండేవాడు. భూమండలాధిపతియైన ఆ రాజు భూమి నంతనూ తన శాసనములోనికి తీసికొనివచ్చి ఇక్కడినుండి దేవలోకమును జయించుటకు ప్రయత్నము చేసెను. మాంధాత దేవలోకమును జయించవలె ననే ఇచ్ఛతో ప్రయత్నము ప్రారంభించగానే ఇంద్రునికీ, మహాత్ములైన దేవతలకీ కూడ తీవ్రమైన భయము కలిగెను. దేవేంద్రునితో అర్ధాసనము, రాజ్యములో సగమూ ఇచ్చెదమని సురగణాలు బ్రతిమాలినను అతడు తన ప్రతిజ్ఞను ఎక్కియే ఉండెను (వదలలేదు).(3-8)

ఇంద్రుడు అతని చెడ్డ ఆలోచనను తెలిసికొని బ్రతిమాలుచు అతనితో- "పురుషశ్రేష్ఠుడా! నీవు మనుష్యలోకములోనే రాజువు కావు. భూలోకమును అంతనూ వశము చేసికొనకుండగానే స్వర్గరాజ్యమును కోరుచున్నావు! ఓ! వీరుడా! ఈ భూమి అంతా పూర్తిగా నీ ఆధీనములో ఉన్నట్లయితే నీవు భృత్యులతోను, సైన్యములతోను, వాహనములతోను వచ్చి ఇక్కడ దేవరాజ్యము చేయుము" అనెను.(9-11)

ఇంద్రుని మాటలు విని మాంధాత-"ఇంద్రా! నా ఆజ్ఞ భూలోకములో ఎక్కడ చెల్లుటలేదు" అని ప్రశ్నించెను. ఇంద్రుడు మాంధాతతో- "దోషములు లేనివాడా! మధువనములో నివసించుచున్న, మధువు కుమారుడైన లవణు డను రాక్షసుడు నీ ఆజ్ఞను చేయుటలేదు" అని చెప్పెను. ఆ రాజు ఇంద్రుని వద్ద సెలవు గైకొని, కొంచెము తల వంచుకొని మరల ఈ లోకమునకు వచ్చెను. మాంధాత మనస్సులో కోపము ఉంచుకొని, లవణాసురుణ్ణి తన వశములో ఉంచుకొనుటకై భృత్య-సైన్య-వాహనములతో కలిసి వచ్చి లవణునితో యుద్ధము కోరుచు అతని వద్దకు దూతను పంపెను. దూత లవణాసురుని వద్దకు వెళ్ళి చాల అప్రియవాక్యములు పలికెను. అతడు అట్లు పలుకుచుండగా రాక్షసుడు వానిని భక్షించివేసెను. ఆ దూత ఆలస్యము చేయుచుండగా మాంధాత కోపముతో రాక్షసుణ్ణి అన్ని వైపులా బాణవర్షముచేత వర్షించెను. ఆ రాక్షసుడు నవ్వి, శూలమును హస్తముతో గ్రహించి, ఆ రాజునూ, అతని పరివారమునూ కూడ చంపుటకై ఆ ఉత్తమమైన ఆయుధమును విడచెను. ప్రజ్వలించుచున్న ఆ శూలము ఆ రాజునూ, అతని భృత్య-సైన్య వాహనములనూ నేలమీద భస్మముచేసి లవణుని చేతిలోనికి చేరెను. చాలా గొప్పవాడైన ఆ మాంధాత అతని సైన్యవాహనములూ కూడ ఈవిధముగా చంపబడినవి. సౌమ్యుడా! శూలమునకున్న శక్తి చాల గొప్పది. ఊహింప శక్యము కానిది.(12-22)

రేపు ప్రాతఃకాలమునందు నీవు శూలాయుధము లేని అతనిని శీఘ్రముగా చంపగలవు. సందేహము లేదు. నీకు జయము నిశ్చితము. నీ పని ఈ విధముగా నెరవేర్చినచో లోకములకు క్షేమము అగును. దురాత్ముడైన లవణునికి సంబంధించిన ఈ విషయమంతా నీకు చెప్పబడినది. నరశ్రేష్ఠుడా! శూలమున కున్న బలము ఘోరమైనది; ఊహింప శక్యముకానిది. ఇంద్రుని ప్రయత్నముచేత ఈ శూలము ద్వారా మాంధాత నశించినాడు. ఓ మహాత్మా! రేపు ప్రాతఃకాలమునందు మాంసము నిమిత్తము శూలము లేకుండగా బయల్వెడలిన లవణాసురుణ్ణి చంపగలవు. నాకీ విషయమునందు సందేహము లేదు."(23-26)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది ఏడవ సర్గము సమాప్తము.**

# అరువది ఎనిమిదవ సర్గము

## లవణాసురుడు బైటకు వెళ్ళినప్పుడు శత్రుఘ్నుడు పురద్వారమునందు నిలచి ఉండుట.

ఆ మునులు కథను చెప్పుచు, జయమును, శుభమునూ కోరుచుండగా మహాత్ముడైన శత్రుఘ్నునకు రాత్రి శీఘ్రముగా గడిచిపోయినది. ఇంతలో తెల్లవారెను. నిర్మలమైన ఆ కాలమునందు వీరుడైన ఆ రాక్షసుడు భక్షింపదగిన ఆహారముచేత ప్రేరితుడై (ఆహారమును సంపాదించుటకై) పట్టణమునుండి బైటకు వెళ్ళెను. ఈ మధ్య సమయములో వీరుడైన శత్రుఘ్నుడు యమునానదిని దాటి ధనుస్సు ధరించి, మధుపురద్వారమునందు నిలచెను. మధ్యాహ్నసమయమున క్రూరకర్ములు చేయు ఆ రాక్షసుడు కొన్నివేల ప్రాణుల భారము మోయుచు అచటికి వచ్చెను.(1-4)

ఆ రాక్షసుడు ద్వారమునందు ఆయుధము ధరించి నిలచిన శత్రుఘ్నుణ్ణి చూచి, "దీనితో ఏమి చేసెదవు?" అని అతనిని అడిగెను. "ఓ! నరాధమా! ఆయుధాలు ధరించిన నీవంటి వాళ్ళను కొన్నివేల మందిని నేను కోపముతో భక్షించి ఉన్నాను. నీవు కాలము ప్రేరేపించగా వచ్చినట్లున్నావు! దుర్మతీ! ఈ ఆహారము నాకు చాలినంతగా లేదు. ఓ పురుషాధమా! నా దగ్గరకు వచ్చి ఇప్పుడు స్వయముగానే నా ముఖములో ప్రవేశించుచున్నావు కదా!" అనెను.(5-7)

లవణుడు ఈ విధముగా మాటలాడుచు మాటిమాటికి నవ్వుచుండగా



మహాపరాక్రమవంతుడైన శత్రుఘ్నుడు కోపముతో కన్నీళ్ళు రాల్చెను. రోషావేశముతో ఉన్న మహాత్ముడైన ఆ శత్రుఘ్నుని సమస్తములైన అవయవములనుండి తేజోమయములైన కిరణములు ప్రసరించినవి. చాల కోపించిన శత్రుఘ్నుడు ఆ రాక్షసునితో - "ఓ! దుర్బుద్ధీ! నీతో ద్వంద్వయుద్ధము చేయవలెనని కోరుచున్నాను. నేను దశరథుని పుత్రుడను. బుద్ధిమంతుడైన రాముని సోదరుడను. శత్రువులను సంహరించు నాపేరు శత్రుఘ్నుడు. నిన్ను చంపుటకై ఇక్కడికి వచ్చినాను. యుద్ధమును కోరుచున్న అట్టి నాకు ఇప్పుడు యుద్ధమును ఇమ్ము. సమస్తప్రాణులకూ కూడ శత్రువైన నీవు ప్రాణాలతో నానుండి బైటపడజాలవు." అని పలికెను. (8-12)

శత్రుఘ్నుని మాటలు విని రాక్షసుడు పరిహాసపూర్వకముగా- "ఓ! దుర్మతీ! దైవవశముచేత వచ్చినావు. పురుషాధమా! నా తల్లి సోదరికి సోదరుడైన రావణు డను రాక్షసుణ్ణి రాముడు స్త్రీనిమిత్తమై చంపినాడు. నేను ఆ రావణకులవినాశమును క్షమించితిని. ప్రధానముగా కేవలము అనాదరభావమునే పురస్కరించుకొని మిమ్ములనందరినీ క్షమించినాను. నేను చాలామందిని చంపివేసితిని. పురుషాధములైన పూర్వము ఉన్నవాళ్ళను, రాబోవువాళ్ళను, మిమ్ములనూ గడ్డిపరకవలె అనాదరము చేసితిని. దుర్మతీ! యుద్ధమును కోరుచున్న నీకు యుద్ధము నిచ్చెదను. నేను ఆయుధము తెచ్చుకొను నంతవరకు క్షణకాలము ఆగుము. నీకు తగిన ఆయుధమును సిద్ధముచేసికొనువరకు ఆగుము." అని పలికెను. వెంటనే శత్రుఘ్నుడు అతనితో - "నేను ఉండగా ప్రాణాలతో ఎక్కడికి వెళ్ళెదవు? స్వయముగా వచ్చిన

శత్రువును బుద్ధిమంతుడు విడువగూడదు. తెలివితక్కువతనముచేత శత్రువునకు అవకాశమును ఇచ్చు మందబుద్ధి నీచుడు వలె చంపివేయబడును. మూడు లోకాలకు, రామునికీ కూడ శత్రువు, పాపాత్ముడవూ అయిన నిన్ను అనేకవిధములైన వాడియైన బాణాలచేత యమలోకమువైపు పంపెదను. అందుచేత చివరిసారిగా ఈ జీవలోకమును చూచుకొనుము." అనెను.(13-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# అరువది తొమ్మిదవ సర్గము

## శత్రుఘ్నలవణాసురుల యుద్ధము. లవణుని సంహారము.

లవణుడు మహాత్ముడైన శత్రుఘ్నుని మాటలు విని చాలా కోపముతో "నిలువుము, నిలువుము" అని పలికి- అరచేతితో అరచేతిని గట్టిగా నలుపుచు, పళ్ళు పటపటలాడించుచు, మాటిమాటికి శత్రుఘ్నుణ్ణి యుద్ధానికి ఆహ్వానించెను. ఈ విధముగా పలుకుచున్న, చూచుటకు భయంకరుడుగా ఉన్న ఆ లవణునితో రాక్షససంహారకుడైన శత్రుఘ్నుడు- "నీవు ఇతరులను జయించిననాటికి శత్రుఘ్నుడు పుట్టలేదు. అందుచేత బాణాల దెబ్బలు తిని యమలోకమునకు వెళ్ళుము. పాపాత్ముడా! యుద్ధమునందు నాచేత చంపబడిన నిన్ను, రాముని చేత చంపబడిన రావణుణ్ణి దేవతలు చూచినట్లు ఋషులు, బ్రాహ్మణులు, విద్వాంసులు చూచెదరు గాక. నిశాచరుడవైన నీవు ఇప్పుడు నా బాణములచే దహింపబడి నేలమీద కూలగా పురమునందు, జనపదమునందు కూడ క్షేమమే కలుగును. నా బాహువునుండి బయల్వెడలిన వజ్రము వంటి అగ్రభాగము గల బాణము, సూర్యునినుండి బయల్వెడలిన కిరణము పద్మములో ప్రవేశించినట్లు, నీ హృదయములో ప్రవేశించును." అని పలికెను.(1-7)

లవణుడు ఆ మాటలు విని కోపావిష్టుడై ఒక పెద్ద చెట్టును శత్రుఘ్నుని వక్షస్థలముమీద పడవేసెను. అతడు దానిని నూరు ముక్కలుగా చేసెను. బలవంతుడైన ఆ రాక్షసుడు ఆ కర్మ వ్యర్థమగుట చూచి, మరల అనేకవృక్షములను గ్రహించి శత్రుఘ్నుని మీదకి విసరెను. తేజస్సుగల శత్రుఘ్నుడు కూడ వచ్చి మీద పడుచున్న అనేకములైన ఆ చెట్లను, ఒక్కొక్కదానిని మూడు బాణాలచేత, నాలుగు బాణాలచేత

ఛేదించెను. పరాక్రమసంపన్నుడైన శత్రుఘ్నుడు రాక్షసుని మీద బాణవర్షము కురిపించెను. కాని ఆ రాక్షసుడు ఏమాత్రము వ్యథ చెందక అట్టహాసము చేయుచు చెట్టు ఎత్తి శత్రుఘ్నుని తలమీద కొట్టెను. అప్పుడు అతడు అవయవములు జారవిడిచి మోహము చెందెను. వీరుడైన శత్రుఘ్నుడు పడిపోగానే ఋషులు, దేవసంఘములు, గంధర్వులు, అప్సరసలు హాహాకారము చేసిరి. దెబ్బ తిని నేలమీద పడిపోయిన ఆ శత్రుఘ్నుని విషయమున అనాదరభావముచేత, ఇంటిలోనికి వెళ్ళుటకు అవకాశము దొరికినను ఆ రాక్షసుడు వెళ్ళలేదు. అతడు నేలమీద పడిపోయినట్లు చూచి కూడ ఆ రాక్షసుడు శూలమును తీసికొనలేదు. అతడు మరణించినా డని అనుకొని ఆహారముకొరకై తెచ్చిన ఆ మృగాదులను పైకి ఎత్తికొనెను.(8-15)

శత్రుఘ్నుడు ముహూర్తకాలములో స్పృహ పొంది, ఋషులచేత పూజింపబడుచు, ఆయుధములు ధరించి మరల పురద్వారమునందు నిలబడెను. పిమ్మట శత్రుఘ్నుడు, దివ్యమూ, అమోఘమూ అయిన ఆ ఉత్తమమైన శరమును బైటకు తీసెను. తేజస్సుతో మండుచున్న భయంకరమైన ఆ బాణము తేజస్సుతో పది దిక్కులను నింపుచుండెను. వజ్రమువంటి , పిడుగువంటి వేగము గల, మేరుమందరపర్వతములతో సమానమైన ఆ శరము అన్ని కణుపులందూ కూడ వంగి ఉండెను. యుద్ధములలో ఎన్నడూ ఓటమి ఎరగని ఆ బాణము రక్త మనే చందనముచే పూయబడి, అందమైన రెక్కలతో పక్షివలె ఉండెను. ఇది దానవనాయకులను, పర్వతములను, అసురులను కూడ చీల్చివేసినది. హటాత్తుగా వచ్చిన ప్రళయకాలాగ్నివలె మండుచున్న ఆ బాణమును చూచి అన్ని ప్రాణులు భయపడినవి. అప్పుడు జగత్తు అంతా అస్వస్థమై బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళెను. దేవతలు, అసురులు, గంధర్వులు, మునులు, అప్సరఃస్త్రీలు అందరూ కూడ భయము చెందిరి.(16-21)

లోకములు నశించునేమో అని దేవతలకు భయము, మోహము కలిగెను. దేవదేవుడు, సర్వసమర్థుడు, వరములను ఇచ్చువాడూ అయిన బ్రహ్మదేవునితో- "పితామహా! లోకవినాశము గాని మహాప్రళయముగాని వచ్చినదా? ఇట్టి దానిని పూర్వ మెన్నడూ చూడలేదు, వినలేదు." అనిరి. లోకములకు పితామహుడు, అభయప్రదుడూ అయిన బ్రహ్మదేవుడు వాళ్ళమాటలు విని ఈ భయమునకు ఏది కారణమో దేవతలకు చెప్పుచు - మధురమైన వాక్కులను పలికెను - "సకలదేవతలారా! వినండి. లవణుని చంపుటకై శత్రుఘ్నుడు యుద్ధములో బాణమును ధరించినాడు. దేవతాశ్రేష్ఠులారా! మనము అందరమూ దీని తేజస్సుచేత ఏమీ తోచకుండా

ఉన్నాము. వత్సలారా! అతిసనాతనమైన ఈ బాణము తేజఃస్వరూపమైనది. లోకములను సృజించిన పురాణపురుషోత్తముడైన మహావిష్ణువు బాణము. దీనిచేతనే భయము ఏర్పడినది. మహాత్ముడైన శ్రీ మహావిష్ణువు మధుకైటభు లను ఇద్దరు దానవులను వధించుటకై ఈ గొప్ప బాణమును సృజించినాడు. తేజోమయమైన ఈ శరమును గూర్చి పూర్తిగా తెలిసినవాడు ఆ విష్ణువు ఒక్కడే. ఇది మహాత్ముడైన ఆ విష్ణువుయొక్క ప్రాచీనమైన రూపమే. ఇక్కడినుండి వెళ్ళి మహాత్ముడూ, వీరుడూ అయిన శత్రుఘ్నునిచేత చంపబడుచున్న రాక్షసోత్తముడైన లవణాసురుణ్ణి చూడండి." అని పలికెను.(22-29)

దేవతలు బ్రహ్మదేవుని మాటలు విని శత్రుఘ్నలవణులు యుద్ధము చేయుచున్న ప్రదేశమునకు వచ్చిరి. బయలుదేరిన ప్రళయకాలాగ్ని వలె ఉన్న, శత్రుఘ్నుని చేతిలోని ఆ దివ్యమైన శరమును అన్ని భూతములు చూచెను. శత్రుఘ్నుడు ఆకాశము నంతా దేవతలు ఆవరించి ఉండుటచూచి, బిగ్గరగా సింహనాదము చేసి, మరల లవణుని వైపు చూచెను. శత్రుఘ్నునిచేత మరల యుద్ధానికై పిలవబడిన లవణుడు కోపముతో యుద్ధమునకు వచ్చెను. శత్రుఘ్నుడు ధనుస్సును ఆకర్ణాంతము లాగి ఆ గొప్ప బాణమును లవణుని విశాలవక్షఃస్థలముమీద విడచెను. దేవతలచేత పూజింపబడిన ఆ దివ్యమైన శరము వాని వక్షఃస్థలమును చీల్చి, రసాతలములో ప్రవేశించి మరల శీఘ్రముగా శత్రుఘ్నుని చేరెను. శత్రుఘ్నుని బాణముచేత బ్రద్దలైపోయిన ఆ లవణాసురుడు వజ్రముచేత కొట్టబడిన పర్వతము వలె నేలపై కూలెను.(30-37)

లవణాసురుడు మరణించగానే దివ్యమైన ఆ గొప్ప శూలము దేవతలు చూచుచుండగా రుద్రునికి వశమయ్యెను. ఉత్తమములైన ధనుర్బాణములు గల శత్రుఘ్నుడు ఒక బాణమును ప్రయోగించుటచే మూడు భయములు తొలగించి చీకటిని తొలగించిన సూర్యునివలె ప్రకాశించెను. అప్పుడు దేవతలు, ఋషులు, పన్నగములు, అప్సరస లందరు - "శత్రుఘ్నా! అదృష్టవశముచేత ఇప్పుడు జయము పొందినావు; అదృష్టవశము చేత అన్ని లోకాలూ కూడ ప్రసన్నములైనవి." అని పలుకుచు శత్రుఘ్నుణ్ణి పూజించిరి.(38-40)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని అరువది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# డెబ్బదవ సర్గము

## శత్రుఘ్నుడు దేవతలనుండి వరములను పొందుట. మధుపురి నిర్మించుట.

లవణుడు చంపబడిన పిమ్మట ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతలు శత్రుసంహారకుడైన శత్రుఘ్నునితో చాల మధురమైన వాక్యమును పలికిరి – "వత్సా! అదృష్టవశముచేత నీవు విజయవంతుడవు అయినావు. అదృష్టవశముచేత లవణుడు చంపబడినాడు. పురుషశ్రేష్ఠుడా! వరము కోరుకొనుము. నీకు విజయము రావలెనను కోరిక గల మేము అందరమూ నీకు వరములు ఇచ్చుటకై వచ్చినాము. మా దర్శనము వ్యర్థము కాదు కదా?" శత్రుఘ్నుడు దేవతల మాటలు విని శిరస్సుపై అంజలి ఘటించి – "రమ్యమూ, మధురమూ అయిన ఈ మధుపురి దేవతానిర్మితమై శీఘ్రముగా రాజధాని అగుగాక. ఇదియే నాకు ప్రధానమైన వరము." అని పలికెను. ఆ దేవతలు మనస్సులో సంతోషించి శత్రుఘ్నునితో – "ఈ మధుపురి నిఃసంశయముగా రమ్యముగా శూరులైన సైనికులతో నిండి ఉండును." అని పలికిరి. ఆ దేవతలు అట్లు పలికి స్వర్గలోకమునకు వెళ్ళిపోయిరి. శత్రుఘ్నుడు కూడ ఆ సైన్యమును తీసికొని వచ్చెను. ఆ సేన శత్రుఘ్ని శాసనమును విని శీఘ్రముగా వచ్చెను. శత్రుఘ్నుడు, శ్రావణమాసమునందు నగరస్థాపనము ప్రారంభించెను. (1-8)

శుభమైన పండ్రెండవ సంవత్సరమునందు శూరులైన సైనికులతో కూడిన ఆ నగరము దివ్యనగరము వలె నిర్మింపబడెను. దేశము కూడ ఏ వైపు నుండీ భయము లేకుండ ఉండెను. పొలములు సస్యములతో నిండి ఉండెను. ఇంద్రుడు కాలమునందు వర్షించుచుండెను. యమునాతీరమునందు అర్ధచంద్రాకారములో నిర్మించిన, శత్రుఘ్నుడు పాలించుచున్న ఆ నగరములోని పురుషులు రోగము లేవీ లేనివారై వీరులుగా ఉండిరి. దానియందు నాలుగు వర్ణములవారు నివసించుచుండిరి. ఉత్తమములైన గృహములతోను, ముంగిళ్ళతోను (లేదా చతుష్పథములతోను) బజారువీథులతోను, అనేకవిధములైన వర్తకవ్యాపారములతోను ఆ నగరము శోభించుచుండెను. పూర్వము లవణాసురుడు తెల్లగా చేసిన మహాభవనమును శత్రుఘ్నుడు అనేకములైన వర్ణములతో అందముగా ఉండునట్లు చేసెను. (9-12)

తాను వచ్చిన పని సఫలము చేసికొనిన, శత్రుఘ్నుడు, సకలైశ్వర్యసమృద్ధమై ఉన్న ఆ నగరమును చూచి చాల సంతోషించెను. ఆ నగరము చుట్టూ ఉద్యానములు, క్రీడాస్థానములు ఉండెను. దేవతలకు, మనుష్యులకు సంబంధించిన అనేక

అలంకరణములు చేయబడెను. అన్ని దిక్కులనుండి వచ్చిన వర్తకులతో నిండిన ఆ నగరము అనేక పుణ్యవస్తువులతో ప్రకాశించుచుండెను. దేవతానగరము వలె ఉండెను. (13-15)

ఆ మధురాపురిని ఏర్పరచిన పిమ్మట పన్నెండవ సంవత్సరము వచ్చిన తరువాత శత్రుఘ్నునకు రామపాదదర్శనము చేసికొనవలె నని బుద్ధి పుట్టినది. రాజైన ఆ శత్రుఘ్నుడు అమరావతి వంటి, అనేకవిధములైన జనులతో నిండిన ఆ మధుపురిని నెలకొల్పి రాముని పాదముల దర్శనము చేసికొనవలె నని సంకల్పించెను.(16, 17)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బదవ సర్గము సమాప్తము.**

# డెబ్బది ఒకటవ సర్గము

## స్వల్పమైన సైన్యము తీసికొని శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరుట.

పంద్రెండవ సంవత్సరములో శత్రుఘ్నుడు చాలా స్వల్పమైన భృత్యగణము, సైన్యము వెంట రాగా రాముడు పాలించుచున్న అయోధ్యకు వెళ్ళుటకు నిశ్చయించెను. అతడు మంత్రులు మొదలైనవారిని, సేనానాయకులను వెనుకకు పంపివేసి కొన్ని శ్రేష్ఠములైన అశ్వములతోను, వంద రథములతోను ముందుకు వెళ్ళెను. అతడు నిర్ణయించుకొనిన ప్రకారము ఏడెనిమిది నివాసములు(మకాములు) చేసి, వాల్మీకి ఆశ్రమము చేరి అక్కడ విడిసెను. వాల్మీకికి అభివాదము చేసి, అతడిచ్చిన పాద్యమును, అర్ఘ్యమును, ఆతిథ్యమును స్వీకరించెను. అక్కడ మునీశ్వరుడు శత్రుఘ్నునకు అనేకవిధములైన, మధురములైన, వేలకొలది కథలు చెప్పెను.(1-5)

వాల్మీకి లవణుని వధకు సంబంధించి ఇట్లు పలికెను – "నీవు లవణాసురుణ్ణి చంపి చాల శక్యము కాని పనిచేసినావు. శత్రుఘ్నా! లవణుడు తనతో యుద్ధము చేసిన గొప్పబలము గల ఎందరో రాజులను వారి సైన్యవాహనాదులతో సహా చంపివేసినాడు. అట్టి పాపాత్ముణ్ణి నీవు అనాయాసముగా చంపివేసినావు. నీ తేజస్సుచేత వానివలన జగత్తుకు భయము శాంతించినది. ఘోరమైన రావణవధ గొప్ప ప్రయత్నముచేత చేయబడినది. కాని చాల గొప్పదైన ఈ పనిని అనాయాసముగా చేసినావు. ఈ లవణుడు చంపబడుటచే దేవతలకు, భూతములకు గొప్ప సంతోషము కలిగినది. జగత్తుకు ప్రియము జరిగినది. శత్రుఘ్నా! ఆ యుద్ధమును పూర్తిగా నేను

ఇంద్రుని సభలో కూర్చుండి చూచితిని. నీ విషయమునందు నాకు కూడా గొప్ప సంతోషము కలిగినది. నీ శిరస్సు వాసన చూచెదను. ఇది ప్రేమకు అత్యుత్తమమైన లక్షణము."(6-12)

వాల్మీకి ఇట్లు పలికి, శత్రుఘ్నుణ్ణి శిరస్సుపై మూర్కొని, అతనికి, అతని అనుచరులకు అతిథ్యము చేసెను. భోజనముచేసి కూర్చున్న శత్రుఘ్నుడు ఉత్తమమైన గీతమాధుర్యము గల రాముని చరితమును ఆ సమయమునందు రచించబడిన విధముగా వినెను. ఆది వీణాతంత్రీలయమునకు అనుగుణముగా ఉండెను. మూడుస్థానములందు మూడు కరణములతో కూడి, సంస్కృతమై, సంగీతశాస్త్రాదిలక్షణములతో ఉండెను. పూర్వము ఎట్లు జరిగెనో అట్లు సత్యములైన ఆ అక్షరములు(మాటలు) విని, పురుషశ్రేష్ఠుడైన శత్రుఘ్నుడు కన్నీళ్ళు కార్చుచు సంజ్ఞ కోల్పోయెను. అతడు ముహూర్తకాలముపాటు స్పృహ కోల్పోయినవాడై, మాటిమాటికి నిట్టూర్చుచు, జరిగిన కథ నంతను ఆ గీతములో అప్పుడు జరుగుచున్నట్లుగా వినెను. రాజు అనుచరులు గూడ ఆ గీతసంపదను విని, తలలు క్రిందికి వంచి, దీనులై "ఎంత ఆశ్చర్యము" అనిరి. అక్కడ నున్న సైనికులు పరస్పరము - "ఇది ఏమిటి? మనము ఎక్కడ ఉన్నాము? స్వప్నము చూచుచున్నామా?" అని మాట్లాడుకొనిరి. "పూర్వము మనము ప్రత్యక్షముగా చూచిన విషయమునే మరల ఈ ఆశ్రమములో వినుచున్నాము. ఇది స్వప్నమా? లేక ఉత్తమమైన సంగీతరచనయా?" అనుకొనుచు- వారు చాల ఆశ్చర్యము చెంది శత్రుఘ్నునితో "ఓ! నరశ్రేష్ఠుడా! నీవు మునిశ్రేష్ఠుడైన వాల్మీకిని బాగుగా(స్పష్టముగా) అడుగుము." అని పలికిరి. కుతూహలముతో కూడిన ఆ సైనికులందరితో శత్రుఘ్ను డిట్లు పలికెను- "మనము ఇక్కడ ఇలాంటి విషయములను గూర్చి అడగకూడదు. ఈ ముని ఆశ్రమములో అనేకములైన విషయములు జరుగుచుండును. కాని మనము కౌతూహలముతో ఈ మహామునిని ప్రశ్నించుట యుక్తము కాదు." శత్రుఘ్నుడు సైనికులతో ఇట్లు పలికి, ఆ మహర్షికి నమస్కరించి, అప్పుడు తన శయనస్థానమునకు వెళ్ళెను.(13-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది ఒకటవ సర్గము సమాప్తము.**

# డెబ్బది రెండవ సర్గము

**శత్రుఘ్నుడు అయోధ్యకు వెళ్ళి రామాదులతో కలిసి ఏడు రోజులు ఉండి మరల మధుపురికి బయలుదేరి వెళ్ళుట.**

అనేకములైన అర్థములు గల రామునికి సంబంధించిన గీతమును గూర్చి ఆలోచించుచు శయనించిన ఆ శత్రుఘ్నునికి అప్పుడు నిద్ర రాలేదు. చాల మధురము, వీణాతంత్రుల లయకు సరిపడునది అయిన ఆ రామచరితగీతధ్వనిని వినుచుండగా శత్రుఘ్నునకు రాత్రి శీఘ్రముగా గడిచిపోయెను. ఆ రాత్రి తెల్లవారిన పిదప శత్రుఘ్నుడు పూర్వాహ్ణక్రమమును పూర్తిచేసుకొని, అంజలి ఘటించి వాల్మీకితో- "పూజ్యుడా! రఘువంశీయులకు ఆనందకరుడైన రాముణ్ణి చూడవలెనని కోరుచున్నాను. గొప్ప తపోనియమము గల ఈ మునుల అనుజ్ఞను, నీ అనుజ్ఞను కోరుచున్నాను." అనెను. వాల్మీకి శత్రుఘ్నుని మాటలు విని అతనిని కౌగిలించుకొని, వెళ్ళుటకు అనుమతి ఇచ్చెను.(1-5)

శత్రుఘ్నుడు వాల్మీకికి నమస్కరించి, మంచి కాంతిగల రథమునెక్కి, రాముని దర్శనమునకై ఆతురతతో శీఘ్రముగా అయోధ్యకు వెళ్ళెను. అతడు రమ్యమైన అయోధ్యకు వెళ్ళి గొప్ప కాంతి గల, రాముడు నివసించు భవనమునకు వెళ్ళెను. అతడు పూర్ణ చంద్రునివంటి ముఖము గల, మంత్రిమధ్యయందు దేవతల మధ్యయందున్న ఇంద్రుడు వలె ఉన్న రాముణ్ణి చూచుచు ప్రవేశించెను. తేజస్సుతో ప్రజ్వలించుచున్నట్లున్న రామునికి నమస్కరించి అంజలి ఘటించి ఇట్లు పలికెను- "మహారాజా! నీవు ఆజ్ఞాపించిన విధముగా అంతా చేసినాను. పాపాత్ముడైన లవణుణ్ణి సంహరించి అతని పురమును నిర్మించితిని. రామా! నీవు లేకుండగా ఈ పన్నెండు సంవత్సరములు గడచినవి. నీవు లేకుండా నేను అక్కడ నివసించుటకు ఇచ్ఛగించను. నీవు నా విషయమున అనుగ్రహింపుము. తల్లి లేని లేగదూడవలె నేను చాలాకాలము దూరముగా ఉండజాలను."(6-12)

ఇట్లు మాట్లాడుచున్న శత్రుఘ్నుణ్ణి రాముడు కౌగిలించుకొని ఇట్లు పలికెను- "శూరుడా! విషాదము చెందకుము. ఇది క్షత్రియులు చేయవలసినది కాదు. ప్రవాసముచేత రాజులు దిగులుచెందరు. ప్రజలను క్షత్రియధర్మానుసారముగా పాలించవలెను కదా? అప్పుడప్పుడు నన్ను చూచుటకై అయోధ్యకు వచ్చుచుండుము. తిరిగి నీ పట్టణమునకు వెళ్ళవచ్చును. నీవు నాకు కూడ ప్రాణములకంటే ఎక్కువ

ఇష్టుడవు, సంశయము లేదు. రాజ్యపాలనము తప్పక చేయదగినది కదా? శత్రుఘ్నా! అందువలన నీవు నా దగ్గర ఒక వారము రోజులు ఉండుము. తరువాత నీ భృత్యులతోను, సైన్యముతోను వాహనములతోను కలసి మధురకు వెళ్ళగలవు." శత్రుఘ్నుడు ధర్మసంమతములు మనోహరములూ అయిన రాముని మాటలు విని దీనమైన వాక్కుతో, "తప్పక అట్లే చేసెదను." అని పలికెను.(13-18)

శత్రుఘ్నుడు రాముని ఆజ్ఞ ప్రకారము ఒక వారము అక్కడ ఉండి వెళ్ళుటకు ప్రయాణమయ్యెను. రాముని వద్ద, భరతుని వద్ద, లక్ష్మణుని వద్ద సెలవు తీసికొని, మహారథము ఎక్కెను. లక్ష్మణుడు, భరతుడు చాలా దూరము వచ్చి సాగనంపగా శత్రుఘ్నుడు, శీఘ్రముగా తన నగరమునకు వెళ్ళెను.(19-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది రెండవ సర్గము సమాప్తము.**

# డెబ్బది మూడవ సర్గము

## ఒక బ్రాహ్మణుడు మరణించిన బాలుడైన పుత్రుణ్ణి తీసుకొని వచ్చి రాజద్వారము వద్ద విలపించుట.

రాముడు శత్రుఘ్నుణ్ణి పంపివేసి రాజ్యమును ధర్మముతో పరిపాలించుచు, సుఖవంతుడై లక్ష్మణ-భరతులతోకూడ సంతోషముగా ఉండెను. కొన్నాళ్ళకు పల్లెటూరుకు చెందిన ఒక వృద్ధబ్రాహ్మణుడు మరణించిన బాలుణ్ణి తీసికొని రాజద్వారము వద్దకు వచ్చెను. ఆ బ్రాహ్మణుడు పుత్రప్రేమతో దుఃఖముతో "పుత్రా! పుత్రా!" అని మాటిమాటికి అనేక విధములైన మాటలతో ఏడ్చుచు- "పుత్రా! నేను పూర్వజన్మలో ఎంత పాపము చేసితినో కదా! ఐదు వేల వర్షముల వయస్సునందు, యౌవనము పొందుటకు పూర్వమే నాకు దుఃఖము కలుగుటకై, అకాలమునందు మృత్యువు వాతపడి మరణించిన, బాలుడైన పుత్రుణ్ణి చూడవలసి వచ్చినది. పుత్రా! కొద్ది రోజులలోనే నేను మరణించెదను; సందేహము లేదు. నిన్ను గురించిన శోకముచేత, నేనూ, నీ తల్లి కూడ మరణించెదము. నేను ఏనాడైనా అసత్యము పలికినట్లుగాని, హింస చేసినట్లు గాని, ఏ ప్రాణులవిషయమునం దైనను పాపము అచరించినట్లు గాని నాకు జ్ఞాపకము లేదు. నా పుత్రుడు తల్లితండ్రులకు చేయవలసిన సేవాదులు, శ్రాద్ధాదులు చేయక మునుపే, బాలుడుగానే, ఏ పాపముచేత

యమలోకమునకు వెళ్ళినాడో కదా!(1-8)

రాముని దేశములో కాలము రానివారికే ఈ విధముగా మృత్యువు వచ్చుచున్నది. ఇట్టి ఘోరము పూర్వ మెన్నడూ నేను చూడలేదు. వినలేదు. దేశములో ఉన్న బాలులకు అకాలమరణము సంప్రాప్తించుచున్నదనగా తప్పక రాముని గొప్ప పాపమేదో ఉండి ఉండును. ఇతరదేశాలలో ఉన్న బాలులకు మృత్యుభయము లేదుకదా? అందువలన రాజా! మరణించిన ఈ బాలుణ్ణి బ్రతికించుము. నేను, నా భార్యకూడా అనాథలము వలె రాజద్వారమునందు మరణించెదము. రామా! పిమ్మట నీవు బ్రహ్మహత్యాపాపముతో సుఖముగా ఉండుము. రాజా! సోదరులతో నీవు చాల కాలము జీవించుము. గొప్పబలము కలవాడా! ఈ రాజ్యములో ఎంతో సుఖముగా ఉన్నాము. బాలుల మరణానికి హేతువైన రాముడు ఇప్పుడు నాథుడుగా వచ్చిన తరువాత, ఇక్ష్వాకురాజులు పాలించిన ఈ దేశము నాథుడు లేనిది అయినది. శాస్త్రవిరుద్ధమైన రీతిలో పాలింపబడిన ప్రజలు రాజు చేసిన దోషాలకు ఆపదలు చెందుదురు. రాజు చరిత్ర మంచిది కానిచో జనులు అకాలమరణము చెందుదురు. లేదా-పురములందు, గ్రామములందు నివసించు జనులు అయుక్తకార్యములు చేయుచున్నప్పుడు, రక్షణము లేనప్పుడు కూడ జనులకు మృత్యుభయము కలుగుచుండును. ఇది తప్పక రాజదోషమే. సందేహము లేదు. అందుచేతనే పురములలోను, గ్రామాలలోను బాలులు మరణించుచున్నారు." అనుచు, ఆ బ్రాహ్మణుడు అనేకవిధములైన మాటలచేత రాజును మాటిమాటికి నిర్బంధించుచు దుఃఖపీడితుడై ఆ పుత్రుణ్ణి కౌగిలించుకొనెను.(9-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది మూడవ సర్గము సమాప్తము.**

# డెబ్బది నాలుగవ సర్గము

**తపస్సు చేయుచున్న శూద్రుడు అధర్మము చేయుటయే బ్రాహ్మణపుత్రుని మరణమునకు హేతువు అని నారదుడు రామునకు తెలుపుట.**

రాముడు దుఃఖముతోను, శోకముతోను కూడిన ఆ బ్రాహ్మణుడు చేసిన దీనమైన ఆ విలాపమునంతనూ విని, దుఃఖముతో కూడినవాడై, మంత్రులను, వసిష్ఠవామదేవులను, సోదరులను, ఆ యా గణప్రముఖులను పిలిపించెను. పిమ్మట వసిష్ఠునితో కలసి ప్రవేశపెట్టబడిన ఎనమండుగురు బ్రాహ్మణులు దేవతుల్యుడైన రాజును "విజయీ భవ" అని పలికి ఆశీర్వదించిరి. మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, జాబాలి, గౌతముడు, నారదుడు – ఈ బ్రాహ్మణోత్తములందరూ ఆసనముల మీద కూర్చుండిరి. వచ్చిన మహర్షులకు రాముడు అంజలి ఘటించి నమస్కరించెను. మంత్రులను, నైగములను తగు విధముగా అనుకూలము చేసికొనెను. వారందరూ కూర్చున్న పిమ్మట రాముడు, "ఈ బ్రాహ్మణుడు మొండి పట్టు పట్టుచున్నాడు." అని ఆ విషయ మంతా చెప్పెను.(1–6)

దీనుడైన రాజు మాటలు విని ఆ ఋషుల సమక్షమునందు నారదుడు శుభమైన వాక్యము పలికెను– "రాజా! బాలునకు అకారమరణ మెట్లు ప్రాప్తించినదో వినుము. విని నీవు ఏమి చేయవలెనో చేయుము. రాజా! పూర్వము కృతయుగములో బ్రాహ్మణులు మాత్రమే తపస్సు చేసుకునేవారు. బ్రాహ్మణులు కానివారు ఏ విధముగానూ కూడ తపస్సు చేసికొనేవారు కారు. ఆ యుగము అజ్ఞానావరణము లేక బ్రాహ్మమయమై ప్రకాశించుచుండెను. అప్పుడు అందరు మృత్యువు లేనివారై త్రికాలజ్ఞానము కలవారై ఉండిరి. తరువాత వచ్చిన దృఢశరీరములు గల మనువంశీయులకు చెందిన త్రేతాయుగములో క్షత్రియులు కూడా బ్రాహ్మణులతో పాటు తపస్సు కలవారు అగుదురు.(7–11)

కృతయుగమునందు వీర్యముచేతా, తపస్సుచేతా కూడా బ్రాహ్మణులు అధికులు. త్రేతాయుగములో మనువంశమునందుపుట్టిన క్షత్రియులు తపోవీర్యములచేత మహాత్ములు. కృతయుగములో బ్రాహ్మణులు మాత్రమే నిత్యనైమిత్తికాది కర్మలే కాక కాయక్లేశరూపమైన తపస్సు కూడా చేసేవారు. అందుచే వాళ్ళే సర్వాధికులు. త్రేతాయుగము వచ్చుసరికి క్షత్రియులు కూడ తపస్సు చేసేవారు. అందుచేత వారు కూడ మహాత్ములే కాని వీరు కృతయుగబ్రాహ్మణుల కంటె తక్కువవారు.

కృతయుగములో బ్రాహ్మణజాతి తపోవీర్యములచేత అధికముగా ఉండెడిది. త్రేతాయుగములో క్షత్రియజాతికి కూడ తపస్సు ఉండుటచేత అప్పుడు ఈ రెండు జాతులూ తపోవీర్యములచేత సమానములైనవి. త్రేతాయుగ బ్రాహ్మణజాతి కూడ కృతయుగబ్రాహ్మణజాతికంటె న్యూనమే. అప్పుడు శాస్త్రనిర్మాతలు బ్రాహ్మణక్షత్రియులలో భేదము అధికముగా లేకపోవుటచేత అందరికీ సంమతమైన చాతుర్వర్ణ్యమును ఏర్పాటు చేసిరి. ధర్మప్రచురమైన, అధర్మావరణము లేని త్రేతాయుగము ప్రకాశించుచుండగా భూమిమీద అధర్మము ఒక పాదము ఉంచెను. అప్పుడు ఆ అధర్మసంబంధముచే వాళ్ళ తేజస్సు కొంచెము తగ్గినది.(12-16)

భూమిమీద అధర్మపాదము ప్రసరించుటచేత అంతకు పూర్వము ఏ కృష్యాదికమును మాంసమును వలె, రజోగుణజన్యమైన మలమును వలె పూర్వులు పరిహరించిరో అట్టి అనృతము (కృష్యాదికము) అధికముగా ప్రచారములోనికి వచ్చెను. అధర్మము ఒక పాదము అనృతమును ప్రవర్తింపజేసి, పిదప పూర్వము(కృతయుగములో) ఉన్న ఆయుర్దాయ ప్రమాణమును కూడా తగ్గించినది. అధర్మము భూమిమీద అనృతమును ప్రసరింపచేసినను లోకము సత్యధర్మములందు ఆసక్తి కలదై శుభకర్మలను మాత్రమే చేసెను. త్రేతాయుగములో బ్రాహ్మణులూ క్షత్రియులూ కూడ తపస్సు చేసిరి. ఇతరజనులు మాత్రము వాళ్ళ శుశ్రూష చేసిరి. వారిలో శుశ్రూషారూపమైన ధర్మము వైశ్యశూద్రుల పరమధర్మముగా ఏర్పడెను. విశేషించి శూద్రులు సమస్తవర్ణముల పూజను చేసిరి. ఓ! రాజశ్రేష్ఠుడా! వైశ్యశూద్రులకు అధర్మము అనృతము సంక్రమించిన పిదప ఈ మధ్యకాలములో అనగా త్రేతా ద్వాపరసంధికాలములో, వెనకటివారికి, అనగా బ్రాహ్మణక్షత్రియులకు, కూడ తేజోహ్రాసము కలిగెను. పిదప రెండవ అధర్మపాదము భూమిమీద దిగెను. అందువలన ఆ యుగమునకు "ద్వాపరము" అను పేరు వచ్చినది.(17-23)

పురుషశ్రేష్ఠుడవైన ఓ! రాజా! ద్వాపర మను పేరు గల ఆ యుగము జరుగుచున్నప్పుడు అధర్మము, అనృతము వృద్ధిపొందెను (పొందును). ఈ ద్వాపరయుగములో తపస్సు వైశ్యులకు కూడ సంక్రమించెను. ఈ విధముగా తపస్సు మూడు యుగములలో క్రమముగా మూడు వర్ణములలో ప్రవేశించెను. రామా! మూడు యుగములందు తపస్సు మూడు వర్ణములవారిలో ఉన్నది. యుగానుసారము శూద్రునకు ధర్మము(తపస్సు) లభ్యము కాదు. రాజులలో శ్రేష్ఠుడవైన రామా! శూద్రుడు తపస్సు చేయకూడదు. కాని కలియుగములో శూద్రునికి కూడ తపస్సు చేయుట ఉండగలదు. రాజా! ద్వాపరయుగమునందు కూడ శూద్రుడు

తపస్సు చేయుట గొప్ప అధర్మము. నీ దేశము ప్రాంతమునందు గొప్ప తపస్సు గల, దుర్బుద్ధియైన శూద్రుడు తపస్సు చేయుచున్నాడు. అందువలననే ఈ బాలుడు మృతిచెందినాడు. దుర్మతియైన ఏ నరుడైనా రాజుయొక్క రాజ్యమునందు గాని, పురమునందుగాని, అధర్మమును గాని, చేయకూడని పని కాని చేసినచో అది అలక్ష్మిని కలిగించును. ఆ రాజు కూడ వెంటనే నరకములలో పడును. సంశయము లేదు. ప్రజలను ధర్మముగా పాలించు రాజునకు అధ్యయనము చేసిన పుణ్యములోను, తపస్సులోను, పుణ్యకార్యములలోను అరవ వంతు చేరును. ఆరవ భాగమును పన్నుగా తీసుకొనుచు ప్రజలను రక్షించనిచో ఎట్లు? పురుషశ్రేష్ఠుడా! నీవు నీ రాజ్యము నంతా వెదకుము. రామా! ఎక్కడ పాపకార్యము జరుగుచున్నదో చూచుటకు ప్రయత్నము చేయుము. ఇట్లు చేసినచో ధర్మమునకు వృద్ధి, మానవులకు ఆయుర్వృద్ధి కలుగును. ఈ బాలుడు కూడ జీవించును."(24-33)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది నాలుగవ సర్గము సమాప్తము.**

# డెబ్బది ఐదవ సర్గము

## రాముడు పుష్పకము నెక్కి తన రాజ్యములో అంతటా తిరుగుచు దక్షిణదిక్కున తపస్సు చేయుచున్న శూద్రుని చూచుట.

అమృతమయము వలె ఉన్న నారదుని మాటలు విని రాముడు సాటిలేని సంతోషము పొందెను. లక్ష్మణునితో- "సౌమ్యా! నీవు వెళ్ళి ఉత్తమవ్రతములు గల ఆ బ్రాహ్మణశ్రేష్ఠుణ్ణి ఓదార్చుము. ఆ బాలుని శరీరమును నూనె తొట్టిలో పెట్టించుము. చాలా శ్రేష్ఠములైన సుగంధద్రవ్యములు, మంచి సువాసనగల తైలములు ఉపయోగించి ఆ బాలుని శరీరము పాడవకుండు నట్లు ఏర్పాటుచేయుము. శుభకర్మగల బాలుని శరీరము రక్షింపబడునట్లుగాను, దీనికి అపదగాని, సంధులు విరుగుట కాని కలగనట్లు చేయుము." అని చెప్పెను.(1-4)

లక్ష్మణునితో ఇట్లు చెప్పి "ఇక్కడికి రమ్ము" అని మనస్సులో పుష్పకమును గూర్చి ఆలోచించెను. ఆ పుష్పకము రాముని అభిప్రాయమును తెలిసికొని ముహూర్తకాలములో రాముని వద్దకు వచ్చి, వంగి నమస్కరించి - "రాజా! ఇదిగో ఇక్కడ ఉన్నాను; మహాబాహూ! నీ వశ్యుడైన కింకరుడనైన నేను వచ్చినాను." అని


పలికెను. ఆ రాజు పుష్పకము పలికిన మధురములైన మాటలు విని, మునులకు నమస్కరించి విమానమును ఎక్కెను. ధనుస్సును, అంబులపొదిని, అందమైన కాంతి గల ఖడ్గమును ధరించి, లక్ష్మణభరతు లిద్దరినీ నగరములో ఉంచి అటు ఇటు వెదకుచు పశ్చిమదిక్కునకు వెళ్ళెను. శ్రీమంతుడైన ఆ రాజు హిమవత్పర్వతముచేత ఆవరింపబడిన ఉత్తర దిక్కునకు శీఘ్రముగా వెళ్ళి అక్కడ కూడ కొంచెము అధర్మమును కూడ చూడనివాడై పిమ్మట పరిశుద్ధమైన ఆచారము గల, అద్దమువలె నిర్మలముగా ఉన్న తూర్పు దిక్కును కూడ చూచెను. (5-11)

ఆ మహారాజు పుష్పకముపై కూర్చొని దక్షిణదిక్కునకు వెళ్ళెను. పిమ్మట శైవలపర్వతమునకు ఉత్తరము ప్రక్క పెద్ద సరస్సును చూచెను. రాముడు, ఆ సరస్సులో క్రిందికి ముఖము ఉండునట్లుగా వ్రేలాడుచున్న గొప్ప తపస్సు చేయుచున్న ఒక మునిని చూచెను. ఉత్తమమైన తపస్సు చేయుచున్న అతనిని సమీపించి, రాజైన రాముడు - "మంచి నియమము కలవాడా! నీవు ధన్యుడవు. తపస్సుచేత వృద్ధుడవైన, దృఢమైన మనఃస్థైర్యము గల ఓ! మునీంద్రా! నీవు ఏ జాతికి చెందినవాడవు? నేను తెలిసికొనవలెనను వేడుకచేత అడుగుచున్నాను. నేను దశరథకుమారుడ నైన రాముడను. నీవు ఎవరూ చేయజాలని తపస్సు చేయుచున్నావు; నీవు వరముగా పొందదలచిన ప్రయోజనము స్వర్గమా లేక మరొకటా? మహామునీ! నీవు ఏ కోరికతో తపస్సు చేయుచున్నావో విన గోరుచున్నాను. నీవు బ్రాహ్మణుడవా, జయింపశక్యముకాని క్షత్రియుడవా? మూడవ వర్ణమువాడవైన వైశ్యుడవా? లేక శూద్రుడవా? నీకు భద్రమగుగాక, సత్యము చెప్పుము." అని అడిగెను. శిరస్సు క్రిందికి వేలాడుచున్నట్లున్న అతడు రాముని మాటలు విని రాజశ్రేష్ఠుడైన ఆ రామునకు తన జాతినీ, తాను దేనినిమిత్తమై తపస్సు చేయుచున్నాడో దానినీ తెలిపెను. (12-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది ఐదవ సర్గము సమాప్తము.**

# డెబ్బది ఆరవ సర్గము

## రాముడు శంబూకుడ్డి వధించుట; దేవతలు ప్రశంసించుట.



**రా**ముని మాటలు విని అతడు తలక్రిందుగానే ఉండి- "గొప్పకీర్తి గల రామా! నేను శూద్రజాతిలో పుట్టినాను. ఈ శరీరముతోనే దేవత్వమును పొందుటకై ఉగ్రమైన తపస్సు చేయుచున్నాను. రామా! నేను అసత్యము చెప్పుటలేదు. దేవలోకమును జయించవలె నను కోరికతో ఉన్నాను. కాకుత్స్థా! నేను శూద్రుడను. నాపేరు శంబూకుడు." అని చెప్పెను. అతడు ఇట్లు చెప్పుచుండుగానే రాముడు ధగధగలాడుచున్న నిర్మలమైన ఖడ్గమును ఒరనుండి తీసి అతని శిరస్సు ఖండించెను. ఆ శూద్రుడు చంపబడిన పిమ్మట, ఇంద్రాగ్నులు మొదలైన దేవతలు "బాగు బాగు"అని రాముడ్డి మాటిమాటికి ప్రశంసించిరి. వాయువు ఎగరగొట్టుకొని రాగా సుగంధము గల దివ్యములైన పుష్పముల వర్షము కురిసెను.(1-6)

దేవతలు చాలా సంతోషించి సత్యపరాక్రముడైన ఆ రామునితో ఇట్లు పలికిరి- "గొప్ప బుద్ధి కలవాడా! దేవా! ఈ దేవతాకార్యమును బాగుగా చేసినావు.(7)

శత్రుసంహారకుడవైన రామా! నీకు ఇష్టమైన వరమును కోరుకొనుము. నీవు ఇట్లు సంహరించుటచేత ఈ శూద్రుడు తపస్సుద్వారా స్వర్గము చేరుట అనునది తప్పినది." (ఇది కొందరు వ్యాఖ్యాతల వ్యాఖ్యానమును పట్టి భావం.)(8)

(మరొక వ్యాఖ్యానము ననుసరించి దీని భావము ఈ క్రింది విధముగా చెప్పవలెను. "రామా! నీవు స్వయముగా సంహరించుటచేత ఇతడు శూద్రుడు కాదు. ఇతని శూద్రత్వము పోయినది. ఇతడు స్వర్గమును పొందగలడు.")

("రాజే స్వయముగా దండించుటచేత అతడు మహాతపస్సుచేత కూడ పొంద శక్యము కాని ఉన్నతస్థానము పొందెను". అని కాళిదాసు వర్ణించెను. రాముడు శంబూకునకు అత్యుత్తమలోకములను ప్రసాదించినట్లు ఉత్తరరామచరిత్రలో భవభూతి వ్రాసినాడు.)

సత్యమైన పరాక్రమము గల రాముడు దేవతల మాటలు విని అంజలి ఘటించి సహస్రాక్షుడైన ఇంద్రునితో- "దేవతలు నా విషయమున ప్రసన్నులైనచో ఆ బ్రాహ్మణపుత్రుడు జీవించుగాక. నాకు చాల ఇష్టమైన ఈ వరము ఇచ్చెదరు గాక. నా అపచారము వలన మృత్యువు ఆ బ్రాహ్మణుని ఒకే పుత్రుడైన ఆ బాలుణ్ణి అకాలమునందే యమలోకమునకు తీసికొనిపోయెను. ఆ బాలుణ్ణి బ్రతికించండి. "నీ కుమారుణ్ణి బ్రతికించెదను." అని నేను ఆ బ్రాహ్మణునికి ప్రతిజ్ఞ చేసి చెప్పితిని. దానిని అసత్యము చేయకుడు. మీకు మంగళమగుగాక." అని ప్రార్థించెను. (9-12)

రాముని మాటలు విని దేవతలలో శ్రేష్ఠులైన ఆ ఇంద్రాదిదేవతలు సంతోషించి- "రామా! నిశ్చింతగా ఉండుము. ఈ దివసమునందే ఆ బాలుడు మరల ప్రాణాలు పొంది తన బంధువులవద్దకు వెళ్ళినాడు. రామా! నీవు ఈ శూద్రుణ్ణి సంహరించిన ముహూర్తమునందే ఆ బాలుడు జీవించినాడు. నరశ్రేష్ఠుడవైన రామా! క్షేమమును పొందుము. నీకు మంగళమగుకాక. మంచిది; మేము వెళ్ళెదము. అగస్త్యుని ఆశ్రమము చూడవలెనని కోరుచున్నాము. గొప్ప కాంతి గల బ్రహ్మర్షియైన ఆ అగస్త్యుని దీక్ష సమాప్తమైనది. జలశయ్యయందు ఆయన శయనించి పన్నెండవ సంవత్సరము గడిచినది. రామా! అందువలన ఆ మునిని అభినందించుటకు మేము వెళ్ళెదము. నీకు మంగళమగుగాక. నీవు కూడ ఉత్తముడైన ఆ ఋషీశ్వరుణ్ణి చూచుటకు వెళ్ళుము." అని పలికిరి. "అట్లే చేసెదను." అని రాముడు దేవతలకు చెప్పి బంగారముచేత అలంకరించబడిన ఆ పుష్పకమును ఎక్కెను. (13-19)

పిమ్మట దేవతలు చాలా విశాలములైన విమానాలపై ఎక్కి వెళ్ళిరి. రాముడు కూడ వారి వెంటనే అగస్త్యాశ్రమమునకు శీఘ్రముగా వెళ్ళెను. తపోనిధీ, ధర్మాత్ముడూ అయిన అగస్త్యుడు వచ్చిన దేవతలను చూచి వారినందరినీ సమముగా గౌరవించెను. దేవతలు అగస్త్యుడు చేసిన పూజలు స్వీకరించి, ఆమహామునిని కూడ పూజించి, అనుచరులతో కలసి సంతోషముగా స్వర్గమునకు వెళ్ళిరి. (20-22)

ఆ దేవతలు వెళ్ళిన పిమ్మట రాముడు పుష్పకమునుండి దిగి ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యునకు నమస్కరించెను. రాముడు తేజస్సుతో ప్రజ్వలించుచున్నాడా అన్నట్లున్న మహాత్ముడైన అగస్త్యునకు నమస్కరించి గొప్ప ఆతిథ్యమును అందికొని కూర్చుండెను. అగస్త్యుడు రామునితో - "నరులలో శ్రేష్ఠుడవైన రామా! భాగ్యవశముచేత వచ్చినావు. నీకు స్వాగతము. రామా! ఉత్తమములైన అనేకగుణములచేత నీవు నాకు బహుమానపాత్రుడవు. పూజించదగిన అతిథివి. నిత్యమూ నా హృదయములో ఉందువు. నీవు శూద్రుని సంహరించుటకై వచ్చినావని దేవతలు చెప్పిరి. నీవు

ధర్మము ఆచరించి బ్రాహ్మణపుత్రుణ్ణి బ్రతికించినావు. రామా! ఈ రాత్రి ఇక్కడ నాదగ్గరనే ఉండుము. నీవు లక్ష్మీసమేతుడవైన నారాయణుడవు. అంతయు నీయందే ప్రతిష్ఠితమై ఉన్నది. (నీవు అంతకూ ఆధారమైనవాడవు). నీవు సకలదేవతలకూ ప్రభువు. నీవు సనాతనపురుషుడవు. రేపు ప్రాతఃకాలమునందు పుష్పకముపై నీ పురమునకు వెళ్ళవచ్చును. రామా! దివ్యమైన ఆకారముతో, తన తేజస్సుతో ప్రకాశించుచున్న దివ్యమైన ఈ ఆభరణము విశ్వకర్మచేత నిర్మించబడినది. రామా! దీనిని స్వీకరించి నాకు ప్రియమును చేయుము. ఒకరు ఇచ్చినదానిని అనుభవించకుండగా మరల మరొకరికి ఇచ్చినచో గొప్ప ఫలము చెప్పబడినది. నీవు చాల గొప్ప ఫలమును కూడ పోషించుటకు సమర్థుడవు కదా! నీవు ఇంద్రునితో సహా దేవతల నందరినీ తరింపచేయ సామర్థ్యము కలవాడవు కదా? రాజా! అందువలన సూర్యుడువలె ప్రకాశించుచున్న, విచిత్రమైన, దివ్యమైన ఈ ఆభరణమును ఇచ్చెదను. యథావిధిగా తీసికొనుము." అని పలికెను. (23-33)

రాముడు క్షత్రియధర్మమును స్మరించుచు మహాత్ముడైన అగస్త్యునితో- "పూజ్యుడవైన బ్రాహ్మణుడా! ప్రతిగ్రహము బ్రాహ్మణునకు విధింపబడినది గాన అతనికి నింద్యము కాదు. కాని క్షత్రియుడు ప్రతిగ్రహించుట ఎట్లు? బ్రాహ్మణోత్తమా! ప్రతిగ్రహము క్షత్రియులకు చాల నింద్యము కదా? విశేషించి బ్రాహ్మణులు ఇచ్చినదానిని ప్రతిగ్రహించుట ఇంకను నింద్యము. అందుచేత నీవే చెప్పుము." అనెను. (34-36)

రాముని మాటలు విని అగస్త్యమహర్షి ఇట్లు చెప్పెను- "రామా! పూర్వము, బ్రహ్మమయమైన కృతయుగమునందు ప్రజలకు రాజు లేకుండెను. దేవతలకు మాత్రమే ఇంద్రు దుండెను. ఆ ప్రజలు రాజుకొరకై బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి ఇట్లు ప్రార్థించిరి- "దేవా! నీవు దేవతలకు రాజుగా ఇంద్రుణ్ణి స్థాపించినావు. లోకాధిపా! మాకు ఒక నరశ్రేష్ఠుణ్ణి రాజుగా ఇమ్ము. అతనికి పూజలు చేసుకొనుచు పాపములు తొలగించుకొని సంచరించెదము. రాజు లేకుండా మేము నివసించలేము. ఇది మా దృఢనిశ్చయము."(37-40)

దేవతలలో శ్రేష్ఠుడైన బ్రహ్మదేవుడు ఇంద్రాదిలోకపాలకులను పిలచి, "మీ తేజస్సులో కొంతభాగము ఇవ్వండి."అని వారందరితో చెప్పగా వాళ్ళు తమ తేజస్సునుండి భాగములు ఇచ్చిరి. అప్పుడు బ్రహ్మదేవుడు తుమ్మెను. దాని నుండి క్షుపుడను రాజు పుట్టెను. బ్రహ్మదేవుడు అతనిలో లోకపాలుల అంశములను సమముగా ఉంచెను. పిమ్మట బ్రహ్మదేవుడు రాజైన ఆ క్షుపుణ్ణి ప్రజలకు ప్రభువుగా

ఇచ్చెను. లోకపాలుల భాగములలో ఇంద్రుని భాగముచేత రాజు భూమిని ఆజ్ఞాపించెను. వరుణుని అంశచేత శరీరములను పోషించెను. కుబేరుని అంశచేత వారికి ధనమును ఇచ్చెను. యముని అంశచేత ప్రజలను శాసించెను. నరులలో శ్రేష్ఠా! ప్రభూ! రామా! ఇంద్రునికి సంబంధించిన భాగముచేత, నన్ను తరింపచేయుటకై దీనిని స్వీకరించుము. నీకు క్షేమమగుగాక." అనెను. (41-46)

రాముడు మహాత్ముడైన ఆ ముని ఇచ్చిన, సూర్యుడు వలె ప్రకాశించుచున్న విచిత్రమైన, దివ్యమైన ఆ ఆభరణమును గ్రహించెను. రాముడు ప్రకాశించుచున్న ఆ ఆభరణమును తీసికొని, పిమ్మట అది ఎట్లు వచ్చినదో తెలిసికొనుటకై- "మహామునీ! అత్యుత్తమమైన ఆకారము గల చాల ఆశ్చర్యకరమైన ఈ ఆభరణము నీకు ఎక్కడ, ఎట్లు లభించినది? ఎవరు తీసికొనివచ్చినారు? మునీంద్రా! గొప్పకీర్తి గలవాడా! వేడుకతో నిన్ను అడుగుచున్నాను. నీవు అనేకములైన ఆశ్చర్యములకు గొప్ప నిధివి కదా?" అని ప్రశ్నించెను. రాముని మాటలు విని ముని ఇట్లు పలికెను. "రామా! పూర్వము త్రేతాయుగములో జరిగిన విషయమును వినుము". (47-51)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది ఆరవ సర్గము సమాప్తము.**

# డెబ్బది ఏడవ సర్గము

## అగస్త్యుడు రామునకు స్వర్గములో ఒక పురుషుడు శవమును భక్షించిన కథ చెప్పుట.

**రా**మా! పూర్వము త్రేతాయుగమునందు చుట్టూ నూరు యోజనముల పరిధిలో మృగాలుకాని, పక్షులుకాని లేని చాల విశాలమైన ఒక స్థానము ఉండెను. మనుష్యులు లేని అరణ్యములో ఒక మూల ఉత్తమమైన తపస్సు చేసికొనుచున్న నేను ఆ అరణ్యమంతా తిరిగి చూచుటకై అక్కడికి వెళ్ళితిని. మంచి రుచి గల ఫలములతోను, దుంపలతోను, సమృద్ధమైన, అనేక రూపములు గల అడవులతో నిండిన అరణ్యము స్వరూపమును వర్ణించి చెప్పుట శక్యముకాదు. ఆ అరణ్యమునకు మధ్యయందు ఒక యోజనము వైశాల్యము గల సరస్సు ఉండెను. దానిలో హంసలు, కారండవములు, చక్రవాకములు విహరించుచుండెను. సుఖకరమైన రుచి గల జలముతో ఆ సరస్సు స్వచ్ఛముగా, శోభాయుక్తమై ఉండెను. పక్షిగణములతో నిండిన అత్యుత్తమమైన ఆ సరస్సు చాల లోతుగా ఉండుటచేత క్షోభింపశక్యముకానిదై ఆశ్చర్యకరముగా నుండెను. ఆ సరస్సు సమీపమున చాల పవిత్రము, ఆశ్చర్యకరము

అయిన గొప్ప ఆశ్రమము ఉండెను. కాని దానిలో మును లెవ్వరూ లేకుండిరి. రామా! నేను ఆ గ్రీష్మరాత్రి అక్కడ నివసించితిని. ప్రాతఃకాలమునందు ప్రొద్దుటనే లేచి, ఆ సరస్సు దగ్గరికి వెళ్ళితిని.(1-7)

అక్కడ సరస్సులో నేనొక చాలా బలిసిన శవమును చూచితిని. దానికి ఎక్కడ చూచినా కూడ మాలిన్యము లేకుండెను. అది చాలా శోభతో ఉండెను. ప్రభూ! రామా! ఇది ఏమైయుండునా అని ఆ విషయమునే ఆలోచించుచు నేను ముహూర్తకాలము ఆ సరస్తీరమునందే నిలచితిని. పిమ్మట ముహూర్తకాలములో చూచుటకు ఆశ్చర్యకరమైన చాలా సుందరమైన, మనోవేగము గల దివ్యమైన విమానమును చూచితిని. దానికి హంసలు కట్టబడెను. ఆ విమానములో ఉన్న స్వర్గనివాసియైన ఒక పురుషుణ్ణి దివ్యములైన అలంకారములు ధరించిన వేయి మంది అప్సరసలు అధికముగా సేవించుచుండిరి. కొందరు అప్సరసలు మధురములైన గీతములు పాడుచుండిరి. కొందరు మృదంగ-వీణా-పణవములను మ్రోగించుచుండిరి. మరికొందరు నృత్యము చేయుచుండిరి. కొందరు అప్సరసలు చంద్రకిరణముల వలె తెల్లగా ఉన్న బంగారు దండములు గల చామరములతో అతని పద్మములవంటి నేత్రములు గల ముఖమును వీచుచుండిరి. అతడు మేరు శిఖరమును సూర్యుడు వలె సింహాసనమును విడచి విమానమునుండి దిగి, నేను చూచుచుండగానే ఆ శవమును భక్షించెను.(8-15)

ఆ స్వర్గనివాసి పిమ్మట బాగా బలసిన ఆ మాంసమును అధికముగా, కావలసినంత తిని, సరస్సులోనికి దిగి, యథావిధిగా ఆచనము చేసి శ్రేష్ఠమైన ఆ విమానమును ఎక్కబోవుచుండెను. విమానమును ఎక్కబోవుతున్న ఆ దేవతాతుల్యుడైన పురుషుణ్ణి చూచి నేను అతనిని- "దేవతాసమానుడవైన ఓ! సౌమ్యుడా! నీ వెవరవు? నీవు నింద్యమైన ఆహారమును తినుచున్నావు! ఇది ఎందువలన? చెప్పుము. దేవతాతుల్యమైన స్థితి, ఇట్టి ఆహారము ఎవరికి ఉండును? చాలా ఆశ్చర్యకరముగా ఉన్నది. దీనిలోని యథార్థమును వినగోరుచున్నాను. నీకు ఈ శవము తగిన భక్ష్య మని నేను భావించను." అని అడిగితిని. రాజా! తెలిసికొనవలెనను వేడుకతో సత్యముగా నేను పలికిన మాటలు విని ఆ స్వర్గనివాసి ఆ విషయము నంతా నాకు ఇట్లు చెప్పెను.(16-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది ఏడవ సర్గము సమాప్తము.**

# డెబ్బది ఎనిమిదవ సర్గము

## శ్వేతుడు తనకు కుత్సితమైన ఆహారము తినవలసివచ్చినందుకు కారణమును అగస్త్యునకు చెప్పుట.

రఘునందనా! రామా! ఆ స్వర్గనివాసి, నేను పలికిన మధురాక్షరములు గల వాక్యమును విని అంజలి ఘటించి ఇట్లు పలికెను- "బ్రహ్మర్షీ! నీవు అడిగిన విధముగా నా సుఖదుఃఖములకు కారణమైన అతిక్రమింప శక్యముకాని పూర్వము జరిగిన విషయమును వినుము. పూర్వము విదర్భదేశరాజైన, గొప్ప కీర్తి, పరాక్రమము గల మూడు లోకాలలోను ప్రసిద్ధుడైన సుదేవుడు నా తండ్రి. ఆయనకు ఇద్దరు స్త్రీలయందు ఇద్దరు పుత్రులు పుట్టిరి. నాపేరు శ్వేతుడు, చిన్నవాని పేరు సురథుడు. మా తండ్రి స్వర్గస్థుడైన పిమ్మట ప్రజలు నన్ను రాజ్యాభిషిక్తుని చేసిరి. నేను సావధానచిత్తుడనై ధర్మసంమతముగా రాజ్యము చేసితిని. నేను రాజ్యము చేయుచు ధర్మముచేత రక్షించుచుండగా వేలకొలది సంవత్సరములు గడచినవి. బ్రాహ్మణోత్తమా! ఏదో ఒక నిమిత్తముచేత (సాముద్రిక-శకునాదులచేత) నా ఆయుర్దాయమును గూర్చి తెలిసికొనుటచే నేను మరణమును గూర్చి ఆలోచించుచు అరణ్యము చేరితిని. నేను సుందరమైన ఈ సరస్తీరమునందు తపస్సు చేసికొనుటకై, మృగములుగాని, పక్షులుగాని లేని, ప్రవేశింప శక్యముకాని ఈ వనములో ప్రవేశించితిని. సోదరుడైన సురథుణ్ణి రాజ్యమునందు రాజునుగా అభిషేకించి ఈ సరస్సువద్ద నేను చాలా కాలము తపస్సు చేసితిని.(1-9)

నేడు మూడువేల సంవత్సరములు మహారణ్యములో కఠినతపస్సుచేసి అత్యుత్తమలోకమైన బ్రహ్మలోకమునకు వెళ్ళితిని. బ్రహ్మలోకములో ఉన్నను నన్ను ఆకలిదప్పికలు బాధించుచుండెను. అందుచేత నా మనస్సు చాలా బాధచెందినది. బ్రహ్మవద్దకు వెళ్ళి - "భగవంతుడా! ఈ బ్రహ్మలోకములో ఆకలిదప్పికలు ఉండవు కదా? కాని నన్ను ఆకలిదప్పికలు వెన్నంటుచున్నవి? ఇది ఏ కర్మఫలము? పితామహా! నేను ఏమి ఆహారము భుజించవలెను? చెప్పుము." అని అడిగితిని. పితామహుడు - "సుదేవపుత్రా! నీకు మధురములైన నీ మాంసాలే ఆహారము. నిత్యము వాటిని భక్షించుము. ఉత్తమమైన తపస్సుచేయుచు నీవు నీ శరీరము బాగా బలియు నట్లు చేసినావు. గొప్ప బుద్ధి గల శ్వేతా! విత్తనము నాటనిదే మొలవదు కదా? నీవు కొంచెము కూడ దానము చేయలేదు. కేవలము తపస్సుమాత్రమే చేసితివి. వత్సా! ఆ కారణముచేతనే నీవు ఆకలిదప్పికలతో బాధపడుచున్నావు. నీవు

ఆహారములచే బాగా పోషింపబడిన, శ్రేష్ఠమైన, అమృతతుల్యమైన స్వదేహమును తినుము. దానితో నీకు జీవననిర్వాహము జరుగును. అగస్త్యమహర్షి ఆ వనమునకు వచ్చినప్పుడు నీ కష్టము తొలగును. ఆ అగస్త్యుడు దేవతాగణములను కూడ తరింపచేయ సమర్థుడు. ఆకలిదప్పికలతో బాధపడుచున్న నీమాట చెప్పవలెనా?" అని చెప్పెను.(10-19)

బ్రాహ్మణోత్తమా! భగవంతుడైన బ్రహ్మదేవుని మాట ప్రకారము నేను నా శరీరమునే కుత్సితమైన ఆహారముగా తినుచున్నాను. నేను అనేక సంవత్సరములపాటు తిన్ననూ ఇది తరుగుటలేదు. నాకు చాల గొప్ప తృప్తి కూడ కలుగుచున్నది. చాల కష్టములో ఉన్న నన్ను ఈ కష్టమునుండి విడిపింపుము. అగస్త్యునకు(నీకు) తప్ప మరెవ్వరికి ఈ పనిచేయుటకు సామర్థ్యము లేదు కదా? ఈ ఆభరణమును ధరించుటకొరకై స్వీకరించుము. నీకు క్షేమమగుగాక. అనుగ్రహించుము. ఓ! బ్రహ్మర్షీ! ఈ బంగారమును, ధనమును, వస్త్రములను, భక్ష్యభోజ్యములను, ఆభరణములను ఇచ్చుచున్నాను. అన్ని కామములను, భోగములను ఇచ్చెదను. నన్ను తరింపచేయుటకు అనుగ్రహించుము."(20-25)

నేను దుఃఖముతో నిండిన ఆ స్వర్గవాసి మాటలు విని అతనిని తరింపచేయుటకై ఉత్తమమైన ఆ ఆభరణమును తీసికొంటిని. నేను సుందరమైన ఆ ఆభరణమును ప్రతిగ్రహించగానే ఆ రాజర్షికి సంబంధించిన వెనుకటి మనుష్యదేహము నశించెను. ఆ శరీరము అదృశ్యము కాగానే ఆ రాజర్షి చాలా సంతోషించి సుఖముగా స్వర్గమునకు వెళ్ళెను. రామా! ఇంద్రునితో సమానుడైన ఆ రాజర్షి ఆ కారణమును పురస్కరించుకొని చూచుటకు చాలా ఆశ్చర్యకరమైన ఈ దివ్యమైన ఆభరణమును నాకు ఇచ్చినాడు.(26-29)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# డెబ్బది తొమ్మిదవ సర్గము

## ఇక్ష్వాకుపుత్రుడైన దండుని రాజ్యము.

**రా**ముడు అగస్త్యుడు చెప్పిన ఆశ్చర్యకరములైన ఆ మాటలు విని, గౌరవమువలనా, ఆశ్చర్యమువలనా మరల– "పూజ్యుడా! విదర్భరాజైన ఆ శ్వేతుడు తపస్సు చేసిన ఘోరమైన ఆ వనము ఎందుచేత మృగపక్షిశూన్యమైనది? ఆ రాజు జనులు లేని శూన్యమైన ఆ వనములో తపస్సుచేయుటకు ఎందుకు వెళ్ళినాడు? ఇందలి సత్యమును తెలుసుకొనగోరుచున్నాను." అని ప్రశ్నించెను. (1–3)

అగస్త్యుడు విన వేడుకతో కూడిన రాముని మాటలు విని ఇట్లు చెప్పెను– "రామా! పూర్వము కృతయుగమునందు ప్రభువైన మనువు పాలకుడుగా ఉండెను. వంశమునకు ఆనందకరుడైన ఇక్ష్వాకువు అతని పుత్రుడు. భూలోకములో ఎవరిచేతను జయింపశక్యము కాని జ్యేష్ఠకుమారుడైన ఆ ఇక్ష్వాకువును రాజ్యాభిషిక్తుని చేసి మనువు "నీవు భూమియందు రాజవంశములను స్థాపించుము." అని అతనితో చెప్పెను. పుత్రుడు అట్లే అని తండ్రికి మాట ఇచ్చెను. పిమ్మట చాల సంతోషించిన మనువు పుత్రునికి– "అత్యున్నతస్వభావము కలవాడా! సంతోషించినాను. నీవు తప్పక చేయగలవు. దండముచేత ప్రజలను రక్షించుము. కారణము లేకుండా దండప్రయోగము చేయకుము. అపరాధుల విషయమున యథాశాస్త్రముగా విధించిన దండము రాజును స్వర్గమునకు తీసికొని వెళ్ళును. పుత్రా! అందుచేత నీవు దండప్రయోగము విషయమున యత్నశీలుడవై ఉండవలెను. ఇట్లు చేయుచున్నచో నీకు ఈ లోకమునందు ధర్మవృద్ధి కలుగును." అని బోధించెను. మనువు కుమారునకు ఈ విధముగా చాలా ఉపదేశించి, యోగమార్గమును అవలంబించి నిత్యమైన స్వర్గలోకములో భోగ్యమైన బ్రహ్మలోకమునకు వెళ్ళెను. (4–11)

మనువు బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయిన పిమ్మట ఇక్ష్వాకువు పుత్రులను ఎట్లు పుట్టించవలెనా అను ఆలోచనలో పడెను. అతడు అనేక విధములైన ఆ యా కర్మలు చేసి దేవపుత్రులవంటి నూరుగురు పుత్రులను కనెను. వాళ్లందరిలోనూ చిన్నవాడు, విద్యాభ్యాసము లేక మూఢుడై అన్నలను లేదా పెద్దలను గౌరవించేవాడు కాదు. "వీని శరీరమునందు తప్పక దండము పడగలదు." అని తెలిసికొన్న తండ్రి అల్పమైన తేజస్సు గల అతనికి దండుడు అని పేరు పెట్టెను. తండ్రి ఈ దండునకు తగిన భయంకరమైన దేశ మేదీ కనబడకపోవుటచేత అతనికి వింధ్యశైవలపర్వతముల మధ్యయందు రాజ్యమిచ్చెను. రామా! ఆ దండుడు పర్వతప్రాంతమునందున్న ఆ

దేశమునకు రాజై అక్కడ సాటిలేని ఒక ఉత్తమమైన పురమును కూడ నెలకొల్పెను. ఆ పురమునకు మధుమంత మను పేరు పెట్టెను. మంచి నియమము గల శు క్రాచార్యుణ్ణి పురోహితుణ్ణి చేసికొనెను. ఈవిధముగా పురోహితునితో కూడి అతడు సంతోషించిన జనులతో నిండిన ఆ రాజ్యమును స్వర్గమునందు దేవేంద్రుడు వలె పాలించెను. శుక్రాచార్యునితో కూడిన మహాత్ముడైన ఇక్ష్వాకుపుత్రుడైన ఆ రాజు స్వర్గమునందు బృహస్పతితో కూడిన ఇంద్రుడువలె రాజ్యమును చేసెను. (12-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని డెబ్బది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# ఎనుబదవ సర్గము

## దండుడు శుక్రాచార్యుని పుత్రిని బలాత్కరించుట.

అగస్త్యమహర్షి రాముని కిట్లు చెప్పి ఈ కథయందే మరొక వాక్యము చెప్పుటకు ప్రారంభించెను- "రామా! పిమ్మట ఆ దండుడు మనోనిగ్రహవంతుడై అనేక అయుతముల సంవత్సరములు శత్రుబాధ లేని రాజ్యమును పాలించెను. పిమ్మట కొంతకాలమునకు ఆ రాజు మనోహరమైన చైత్రమాసములో సుందరమైన శుక్రాచార్యుని ఆశ్రమమునకు వెళ్లెను. అక్కడ ఆ దండుడు వనప్రాంతమునందు సంచరించుచున్న శుక్రాచార్యుని పుత్రికను చూచెను. అత్యుత్తమురాలైన ఆమె భూలోకములో సాటిలేని సౌందర్యముతో ప్రకాశించెను. దుర్బుద్ధి గల అతడు ఆమెను చూచి, మన్మథశరములచేత పీడితుడై, చాల భయపడిన ఆమెను సమీపించి- "అందమైన కటిప్రదేశము గల మంగళప్రదురాలా! నీవు ఎక్కడినుండి వచ్చినావు? నీవు ఎవరి కుమార్తెవు? సుందరమైన ముఖము గలదానా! నేను మన్మథునిచే పీడింపబడి అడుగుచున్నాను." అని అడిగెను. (1-6)

మోహముచే మత్తుడైన ఆ కాముకుడు ఇట్లు మాటలాడుచుండగా శుక్రాచార్యుని కుమార్తె బ్రతిమాలుచు- "మహారాజా! నేను పుణ్యకర్మలు ఆచరించు ప్రకాశవంతుడైన శుక్రాచార్యుని పెద్ద కుమార్తెను. నా పేరు అరజ. నేను ఆశ్రమములో నివసింతును. రాజా! నన్ను బలాత్కారముగా ముట్టుకొనకుము. నేను తండ్రివశములో ఉన్న కన్యను. మహారాజా! నా తండ్రి నీ గురువు. నీవు ఆ మహాత్ముని శిష్యుడవు. మహాతపఃశాలియైన ఆయన కోపించినచో నీకు గొప్ప ఆపద కలిగించును. నావలన నీకేమైన ప్రయోజనమున్నచో, ఓ నరశ్రేష్ఠా! ధర్మసంమతమైన మార్గమును అనుసరించి

గొప్ప తేజస్సు గల మా తండ్రిని కోరుము. అట్లు కానిచో నీకు చాలా భయంకరమైన ఫలము కలుగును. నా తండ్రి క్రోధము వచ్చినచో మూడులోకాలను కూడ కాల్చివేయును కదా! ఓ! రాజా! నీవు యాచించినచో నా తండ్రి నన్ను నీ కివ్వగలడు." అని చెప్పెను.(7-12)

కామవశుడైన ఆ దండుడు మదముచేత ఉన్మత్తుడై, ఇట్లు పలుకుచున్న అరజతో, శిరస్సుపై అంజలి ఘటించి- "అందమైన కటిప్రదేశము గలదానా! కాలము గడిపివేయకుము. నీ మూలమున నా ప్రాణములు పోవుచున్నవి. నిన్ను పొందిన పిమ్మట నాకు మరణము కలిగినను, భయంకరమైన పాపము వచ్చినను విచారము లేదు. ఓ! బాలా! వ్యాకులత చెంది నిన్ను సేవించుచున్న ఈ భక్తుణ్ణి పొందుము." అని పలికి ఆ కన్యను బాహువులతో బలాత్కారముగా పట్టుకొని, ఆమె పెనుగులాడుచుండగా, యథేష్టముగా అనుభవించెను. దండుడు చాలా ఘోరము, దారుణము అయిన ఆ పాపకృత్యము చేసి వెంటనే తన నగరమైన మధుమంతమునకు వెళ్ళెను. అరజ చాలా భయపడి ఏడ్చుచు ఆశ్రమసమీపమునందు దేవతాతుల్యుడైన తండ్రికొరకై నిరీక్షించెను.(13-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబదవ సర్గము సమాప్తము.**

# ఎనుబది ఒకటవ సర్గము

## శుక్రాచార్యుని శాపముచేత దండుడు, వాని రాజ్యము నశించుట.

అనంతమైన తేజస్సు గల శుక్రాచార్యుడు ఈ విషయమును విని, శిష్యసమేతుడై, ఆకలితో బాధపడుచు ముహూర్తకాలములో తన ఆశ్రమమునకు తిరిగి వచ్చెను. అతడు దీనురాలైన అరజను చూచెను. ఆమె శరీరము పరాగముచేత కప్పబడి ఉండెను. ప్రాతఃకాలమునందు గ్రహముచేత (రాహువుచేత లేదా సూర్యునిచేత) కప్పివేయబడిన వెన్నెలవలె కాంతి విహీనురాలై ఉండెను.(1,2)

ఆ శుక్రాచార్యునకు, విశేషించి ఆకలిచేత బాధపడుచున్న వానికి, కోపము కలిగెను. అతడు మూడు లోకాలను కాల్చివేయుచున్నాడా అన్నట్లు శిష్యులతో- "కోపించిన నావలన విపరీతప్రవృత్తి గల వినయహీనుడైన దండునకు అగ్నిశిఖవంటి ఘోరమైన ఎట్టి ఆపద రానున్నదో చూడండి. ప్రజ్వరిల్లుచున్న అగ్నిజ్వాలను స్పృశించినట్లు ఈమెను స్పృశించిన దుర్బుద్ధియైన ఈ దురాత్మునకు

పరివారసమేతముగా వినాశము దాపురించినది. ఇతడు ఇట్టి ఘోరమైన పాపము చేసినాడు గాన ఈ దుర్బుద్ధి పాపకర్మకు ఫలమును పొందగలడు. ఈ రాజు పుత్రసైన్యవాహనములతో సహా ఏడు రోజులలో మరణించగలడు. దుర్మతియైన ఈతని దేశమును నూరు యోజనముల పరిధిలో ఇంద్రుడు గొప్ప పరాగమును కురిపించి కాల్చివేయగలడు. ఇక్కడ ఉన్న జంగమస్థావరాత్మకములైన అన్ని ప్రాణులూ కూడ అంతటా కురియు గొప్ప ధూళివర్షముచేత నశింపగలవు. దండుని దేశము (సరిహద్దు) ఎంతవరకూ ఉన్నదో అంతవరకు ఎత్తుగా ఉన్న(నిలచి ఉన్న) ప్రాణిసముదాయము ఏడు రాత్రులు ధూళివర్షమును పొంది కనబడకుండ పోవును." అని పలికి, క్రోధముచేత, ఎఱ్ఱనైన కళ్ళు గల అతడు "మీరందరు దేశము సరిహద్దులందు నివసించుడు." అని ఆశ్రమనివాసులకు చెప్పెను.(3-12)

శుక్రాచార్యుని మాటలు విని ఆశ్రమములో ఉన్న జనులు ఆ దేశమును విడచి వెలుపల నివసించిరి. శుక్రాచార్యుడు మునులతో ఇట్లు పలికి అరజను ఇట్లు ఆదేశించెను- "ఓ! దుర్బుద్ధికలదానా! నీవు ఈ ఆశ్రమమునందే యోగాభ్యాసనక్తురాలవై నివసించుము. అరజా! యోజనము విశాలమైన చాలా మనోహరమైన ఈ సరస్సును మనోవ్యథ లేవీ లేనిదానవై అనుభవించుము. కాలమునకై వేచి ఉండుము. ఆ రాత్రి నీవద్ద ఏ ప్రాణులు నివసించునో అవి నిత్యము (ఏనాటికీ) ధూళివర్షముచేత చంపబడవు."(13-15)

అరజ చాలా దుఃఖించుచు బ్రహ్మర్షియైన తన తండ్రి ఆజ్ఞను విని "అట్లే చేసెదను." అని పలికెను. శుక్రాచార్యులు ఇట్లు పలికి మరొక చోట నివాస మేర్పరచుకొనెను. ఆ రాజు రాజ్యము కూడ అతని భృత్య-సైన్య-నివాసములతో సహా శుక్రాచార్యులు చెప్పిన విధమున ఏడు రోజులలో భస్మమైపోయెను. రాజా! వింధ్యశైవలపర్వతముల మధ్యనున్న అతని ఈ దండదేశమును, ధర్మసౌఖ్యపరిపూర్ణమైన కృతయుగమునందు అధర్మము జరుగుటచే ఈ బ్రహ్మర్షి ఈవిధముగా శపించెను. కాకుత్స్థా! అది మొదలు దీనికి దండకారణ్యమని పేరు వచ్చినది. ఇక్కడ మునులు నివసించుటచే జనస్థాన మని కూడ పేరు. రామా! నీవు అడిగిన ఈ విషయమునంతనూ నీకు చెప్పినాను. వీరుడా! సంధ్యోపాసన చేయు సమయము దాటిపోవుచున్నది. నలుమూలల ఈ మహర్షులు స్నానములు చేసి, జలపూర్ణకుంభములు దగ్గర ఉంచుకొని సూర్యుణ్ణి ఉపాసించుచున్నారు. ఒకచోట కలిసిన బ్రహ్మవేత్తలు బ్రాహ్మణమును పఠించుచున్నారు. సూర్యుడు అస్తమించినాడు. రామా! వెళ్ళి సంధ్యోపాసన చేయుము."(16-22)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది ఒకటవ సర్గము సమాప్తము.**

# ఎనుబది రెండవ సర్గము

**రాముడు అగస్త్యాశ్రమమునుండి అయోధ్యకు బయలుదేరుట.**

రాముడు అగస్త్యుని మాటలు విని సంధ్యోపాసన చేయుటకు అప్సరస్త్రీ సముదాయములతో నిండి పవిత్రమైన సరస్సుకు వెళ్ళెను. అక్కడ ఆచమనము చేసి, సాయంకాలసంధ్యను ఉపాసించి, మహాత్ముడైన అగస్త్యుని ఆశ్రమములో ప్రవేశించెను. అగస్త్యుడు రాముని భోజనముకొరకై ఉత్తమగుణము లున్న దుంపలు, శాకములు, వరి మొదలైనవాటిని ఏర్పరచెను. రాముడు అమృతముతో సమానమైన ఆ అన్నమును తిని తృప్తుడై సంతోషించి ఆరాత్రి అక్కడే శయనించెను. ప్రాతఃకాలమున తెల్లవారుజామునందే లేచి, ఆహ్నికకృత్యములు చేసికొని, తిరిగి వెళ్ళుటకు అనుజ్ఞ పొందుటకు అగస్త్యుణ్ణి సమీపించెను. అగస్త్యమహర్షికి నమస్కరించి "నేను నా నగరమునకు వెళ్ళుటకు అనుమతిమ్ము. మహాత్ముడ వైన నీ దర్శనము చేత ధన్యుడనైతిని, అనుగ్రహింపబడితిని. మహాత్ములైన మిమ్ములను చూచుటకు, నన్ను నేను పవిత్రము చేసికొనుటకు రాగలను." అని పలికెను.(1-7)

రాముడు ఆ విధముగా అద్భుతమైన ఆలోచన గల వాక్యమును పలుకుచుండగా, ధర్మము నేత్రముగా గల ఆ మహాముని చాలా సంతోషించి – "రామా! శుభములైన అక్షరములు గల ఈ నీ వాక్యము చాలా ఆశ్చర్యకరముగా ఉన్నది. రఘునందనా! నీవే సకలభూతములను పవిత్రము చేయువాడవు. నిన్ను ముహూర్తకాలమైనా ఎవరు చూతురో వారు పవిత్రులై స్వర్గమును పొంది దేవతలచేత పూజింపబడుదురు. ఈ భూలోకములోని ఏప్రాణులు నిన్ను క్రూరదృష్టులతో చూచెదరో వాళ్ళు యమదండముచేత కొట్టబడి వెంటనే నరకములో పడుదురు. నీవు సకలప్రాణులను ఈ విధముగా పవిత్రులను చేయగలవాడవు. రాఘవా! భూలోకములో నిన్నుగూర్చి చెప్పుకొనువారు సిద్ధిని పొందుదురు. నీవు ఎట్టిక్లేశములూ లేనివాడవై మంగళకరమైన, ఎక్కడినుండీ భయములేని మార్గమున వెళ్ళుము. రాజ్యమును ధర్మముచే పరిపాలించుము. నీవే ఈ జగత్తుకు గతివి కదా?" అని పలికెను.(8-13)

రాముడు ఆ మునీశ్వరుడి మాటలు విని పుణ్యశీలము గల అతనికి అంజలి ఘటించి నమస్కరించెను. అగస్త్యమహామునికి, సమస్తమైన ఆ మునీశ్వరులకు నమస్కరించి, బంగారముచేత అలంకరించబడిన పుష్పకమును సావధానచిత్తుడై ఎక్కెను. మునులందరూ వెళ్ళుచున్న మహేంద్రుని వంటి ఆ రాముణ్ణి దేవతలు ఇంద్రుణ్ణి వలె, అన్ని వైపులనుండి ఆశీర్వాదములతో పూజించిరి. పుష్పకములో

సుఖముగా కూర్చున్న రాముడు వర్షకాలమునందు మేఘము దగ్గర ఉన్న చంద్రుడువలె ప్రకాశించెను. అతడు మధ్యాహ్నమయే సరికి అయోధ్యచేరి అక్కడక్కడ పూజింపబడుచు, మధ్య వాకిలిలో దిగెను. పిమ్మట ప్రభువైన రాముడు "నీవు వెళ్ళుము; నీకు క్షేమ మగుగాక" అని పలుకుచు సుందరమైన, స్వేచ్ఛగా ప్రయాణముచేయు పుష్పకవిమానమును పంపివేసి వాకిలి మధ్యయందున్న ద్వారపాలకుని - "శీఘ్రముగా లక్ష్మణ భరతుల దగ్గరకి వెళ్ళి, నేను వచ్చినట్లు చెప్పి నావద్దకు పిలుపుము. ఆలస్యము చేయవద్దు." అని ఆజ్ఞాపించెను.(14-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది రెండవ సర్గము సమాప్తము.**

# ఎనుబది మూడవ సర్గము

## భరతుడు సలహా చెప్పగా రాముడు రాజసూయయాగము చేయు ప్రయత్నమునుండి విరమించుట.

ద్వారపాలకుడు రాముని మాటలు విని, లక్ష్మణభరతులను తీసికొనివచ్చి రామునకు తెలిపెను. రాముడు భరతలక్ష్మణు లిద్దరూ వచ్చినట్లు చూచి, వాళ్ళను కౌగిలించుకొని - "భరతలక్ష్మణులారా! అత్యుత్తమమైన బ్రాహ్మణకార్యమును చేసినట్లే ఇపుడు మరల ధర్మసేతువును, రాజధర్మమునకు సంబంధించిన అత్యుత్తమమర్యాదను చేయవలె నని కోరుచున్నాను. (రాజసూయము చేయు అర్హత రాజుకు మాత్రమే ఉన్నది గాక అది రాజధర్మానికి సంబంధించిన అత్యున్నతమైన పరిధి అని భావము). ఈ ధర్మసేతువు అక్షయము, వ్యయరహితము అని నా అభిప్రాయము. ఇది ధర్మమును పోషించును, సమస్తపాపములను నశింపచేయును. నాకు ఆత్మవంటివారైన మీ ఇద్దరితో కలసి అత్యున్నతమైన రాజసూయము చేయవలెనని కోరుచున్నాను. దానియందు ధర్మము శాశ్వతముగా నిలచి ఉండును. శత్రువినాశకాముడైన మిత్రుడు బాగా నిర్వహించిన ఉత్తమయజ్ఞమైన రాజసూయము చేసి వరుణత్వమును పొందెను. ధర్మము నెరిగిన సోముడు కూడ ధర్మానుసారముగా రాజసూయము చేసి సకలలోకములలో కీర్తిని, శాశ్వతమైన స్థానమును పొందెను. మనకు ఏది శ్రేయస్కరమో మీరు నేడు నాతో ఆలోచించుడు. శ్రద్ధగా ఆలోచించి ఏది హితమో, ఏది మున్ముందు మంచి ఫలము ఇచ్చునో అది చెప్పుడు." అని పలికెను.(1-8)

వాక్యములలో నేర్పరియైన భరతుడు రాముడు పలికిన ఈ మాటలు విని అంజలి ఘటించి ఇట్లు పలికెను- "రాజా! నీయందే ధర్మము ప్రతిష్ఠిత మైనది. నీయందే సమస్తమైన భూమి ప్రతిష్ఠితమైనది. నీయందే కీర్తి ప్రతిష్ఠితమైనది. రాజులందరూ మహాత్ముడవు, లోకములకు నాథుడవూ అయిన నిన్ను, దేవతలు బ్రహ్మదేవునివలె చూచుచున్నారు; నిన్ను మేము ఎట్లు చూచుచున్నామో అట్లు చూచుచున్నారు. గొప్పబలము గల రాజా! రాజులందరు నిన్ను పుత్రులు తండ్రిని చూచినట్లు చూచుచున్నారు. సకల ప్రాణులకీ కూడ నీవు గతివి.(9-12)

రాజా! ఏ యజ్ఞమువలన భూమిమీద ఉన్న రాజవంశము లన్నీ నశించుటకు అవకాశమున్నదో అట్టి యజ్ఞమును, అంత గౌరవపాత్రుడవైన నీవెట్లు చేసెదవు? భూమిమీద పౌరుషవంతులైన పురుషుల కందరికీ దానివలన, అందరికీ కలిగే కోపము కలుగుటచే, వినాశము కలుగును. పురుషశ్రేష్ఠుడా! నువ్వు భూమియందున్న వారిని చంపుట యుక్తము కాదు. వాళ్ళందరు నీ వశమునందే ఉన్నారుకదా?" (13-15)

సత్యమైన పరాక్రమము గల రాముడు భరతుడు పలికిన అమృతమువంటి ఆ మాటలు విని గొప్ప ఆనందము పొందెను. భరతునితో శుభమైన వాక్యమును పలికెను. "దోషము లేనివాడా! ఇప్పుడు నీ మాటలచేత నాకు చాల ఆనందము కలిగినది. పురుషశ్రేష్ఠుడా! నీవు ధర్మసంమతము, భూమికి పాలన హేతువు అయిన ఈ వాక్యమును నిర్భయముగా చెప్పినావు. ధర్మములు తెలిసిన భరతా! నీవు పలికిన మంచి మాటల ప్రకారము నేను క్రతువులలో శ్రేష్ఠమైన ఈ రాజసూయమునుండి నా అభిప్రాయమును నివర్తింపచేయుచున్నాను. బుద్ధిమంతులు లోకపీడా హేతువైన పని చేయగూడదు. చిన్నవారి మంచి మాట గ్రహింపదగినది. అందువలన మంచిదీ, యుక్తియుక్తమూ అయిన నీ మాట వినుచున్నాను."(16-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది మూడవ సర్గము సమాప్తము.**

# ఎనుబది నాలుగవ సర్గము

## లక్ష్మణుడు అశ్వమేధయాగమును గూర్చి చెప్పుచు ఇంద్రవృత్రుల కథను చెప్పుట.

రాముడు, భరతుడు పలికిన మాటలు విని లక్ష్మణుడు రామునితో శుభమైన వాక్యము పలికెను – రామా! అశ్వమేధమహాయజ్ఞము సర్వపాపములను తొలగించును. ఎదిరింపశక్యము కాని పవిత్రత్వమును చేకూర్చు ఆ యజ్ఞము నీకు ఇష్టమగుగాక. మహాత్ముడైన ఇంద్రుని విషయమున పూర్వము జరిగిన కథ ప్రసిద్ధమే కదా? బ్రహ్మహత్యాపాపము తగిలిన ఇంద్రుడు అశ్వమేధముచే పవిత్రుడైనాడు. మహాబాహూ! దేవాసురులు స్నేహముతో ఉంటూన్న పూర్వకాలమునందు లోకములకు ఇష్టుడైన వృత్రు డనే గొప్ప దైత్యుడు ఉండెను. వంద యోజనములు లావు, మూడువందల యోజనముల ఎత్తు ఉన్న అతడు మూడు లోకములనూ కూడ స్నేహానురాగాలతో చూచుచుండెడివాడు. ధర్మములు తెలిసినవాడు, కృతజ్ఞుడు, బుద్ధిశాలీ అయిన అతడు సావధానచిత్తుడై విశాలమైన భూమిని ధర్మముచేత పాలించెను. అతడు శాసించుచున్న కాలమునందు భూమి సమస్తకామములను ఇచ్చెను. పుష్పములు, మూలములు, ఫలములు రసభరితములై ఉండెను. మహాత్ముడైన అతని భూమి దున్నకుండగనే పండుచు సుసమృద్ధమై ఉండెను. అతడు అతివిశాలమైన, ఆశ్చర్యకరమైన అట్టి రాజ్యమును అనుభవించెను.(1–8)

"నేను అత్యుత్తమమైన తపస్సు చేసెదను. తపస్సు చాలా శ్రేయస్కరము. ఇతర సుఖము లన్నీ మోహజనకములు." అని అతనికి అభిప్రాయము కలిగెను. అతడు తన జ్యేష్ఠకుమారుడైన మధురుడు అను ప్రభువును ప్రజలకు అధిపతిగా చేసి సకలదేవతలకు భయము కలుగునట్లు ఉగ్రమైన తపస్సు చేసెను. వృత్రుడు తపస్సుచేయుట చూచి ఇంద్రుడు భయార్తుడై విష్ణువు దగ్గరకు వెళ్ళి ఇట్లు పలికెను– "మహాబాహూ! తపస్సు చేయుచున్న ఆ వృత్రుడు అన్ని లోకాలను జయించినవాడు. ధర్మాత్ముడైన అతడు చాలా బలవంతుడు. నేను అతనిని శాసించజాలను. దేవతల ప్రభువైన ఓ! విష్ణూ! అతడు ఇంకా తపస్సు చేసినచో ఈ లోకము లున్నంతవరకు అతనికి వశములై ఉండును. సురాధీశా! చాల ఉదారస్వభావముగల, మహాబలశాలియైన ఇతనిని ఉపేక్షించుచున్నావు. నీవు కోపించినచో వృత్రుడు క్షణకాలము కూడ ఉండడు కదా. ఇతనిపై నీకు స్నేహభావముకలిగినప్పటినుండి కూడ ఇతడు లోకములకు ప్రభువైనాడు. అట్టి నీవు సావధానచిత్తుడవై లోకములను

అనుగ్రహించుము. నీవు చేసిన రక్షణముచేత జగత్తు అంతా ప్రశాంతముగా, బాధారహితమై ఉండెను కదా? విష్ణూ! దేవత లందరూ నీకొరకు ఎదురుచూచుచున్నారు. గొప్ప వృత్రాసురసంహారముచేసి వారికి సహాయ్యము చేయుము. మహాత్ములైన ఈ దేవతలకు నీవు నిత్యము సాహాయ్యము చేసినావు. ఇతరు లెవరూ ఈ పని చేయజాలరు. గతి లేనివాళ్ళకు నీవు గతివి."(9-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది నాలుగవ సర్గము సమాప్తము.**


# ఎనుబది ఐదవ సర్గము

## ఇంద్రునిలోను, వజ్రాయుధములోను విష్ణుతేజస్సు ప్రవేశించగా ఇంద్రుడు వజ్రాయుధముచేత వృత్రాసురుని సంహరించుట.

రాముడు లక్ష్మణుని మాటలు విని, "వృత్రసంహారమును పూర్తిగా చెప్పుము." అని పలికెను. లక్ష్మణుడు రాముని మాటలు విని మరల దివ్యమైన ఆ కథను చెప్పెను- విష్ణువు ఇంద్రుని మాటలు విని, సకలదేవతల మాటలు విని ఇంద్రాది దేవత లందరితో ఇట్లు పలికెను- "నేను మహాత్ముడైన వృత్రాసురునితో పూర్వము స్నేహముచేత కట్టబడి ఉన్నాను. అందుచే మీకు ప్రియము చేకూర్చుటకై నేను ఆ మహాసురుణ్ణి చంపజాలను. మీకు ఉత్తమమైన సుఖమును తప్పక కల్పించవలెను. అందువలన ఇంద్రుడే అతనిని చంపు ఉపాయము చెప్పెదను. దేవతోత్తములారా! నేను నా స్వరూపమును మూడుగా విభజించెదను. అట్లు చేయుటచే ఇంద్రుడు వృత్రుణ్ణి నిఃసంశయముగా చంపగలడు. ఒక అంశ ఇంద్రుణ్ణి, రెండవది వజ్రాయుధమును, మూడవది భూమినీ పొందును. అప్పుడు ఇంద్రుడు వృత్రుణ్ణి చంపగలడు."(1-7)

విష్ణువు మాటలు విని దేవతలు- "దైత్యసంహారకా! నీవు ఎట్లు చెప్పుచున్నావో అట్లే; సందేహము లేదు. చాలా ఔదార్యము గలవాడా; నీకు క్షేమమగుగాక. వృత్రాసురుని సంహారమును కోరుచున్న మేము వెళ్ళెదము. నీవు నీ తేజస్సును ఇంద్రునిలో ప్రవేశపెట్టుము." అని పలికిరి. పిమ్మట ఇంద్రాదిదేవతలు వృత్రాసురుడున్న మహారణ్యమునకు వెళ్ళిరి. ఆ దేవతలు తపస్సు చేయుచున్న, తేజస్సుతో నిండిన ఆ మహాసురుణ్ణి చూచిరి. అతడు మూడులోకాలను త్రాగుచున్నాడా

అన్నట్లు, ఆకాశమును కాల్చివేయు చున్నాడా అన్నట్లు ఉండెను. ఆ వృత్రాసురుణ్ణి చూడగానే దేవతలు - "ఇతనిని ఎట్లు చంపగలము? మనకు పరాజయము రాకుండుటకు ఉపాయ మేమి?" అని ఆలోచించుచు భయపడిరి. (8-12)



వాళ్ళు అక్కడ ఆ విధముగా ఆలోచించుచుండగా దేవేంద్రుడు వజ్రాయుధమును రెండు చేతులతో పట్టుకొని వృత్రాసురుని శిరస్సుపై ప్రయోగించెను. భయంకరమైన కాలాగ్ని వలె, మండుచున్న గొప్ప అగ్నిజ్వాలవలె వృత్రుని శిరస్సు క్రిందపడుచుండగా జగత్తు భయముచెందెను. గొప్ప కీర్తిగల దేవేంద్రుడు ఆ వృత్రాసురుడు చచ్చుట ఊహించ శక్యముకానిది అని తలచి వెంటనే లోకముల చివరి దేశమునకు వెళ్ళిపోయెను. అతడు పారిపోవుచుండగా వెంటనే అతనిని బ్రహ్మహత్య వెంబడించి అతని అవయవములలో ప్రవేశించెను. అప్పుడు ఇంద్రుడు దుఃఖాక్రాంతుడయ్యెను. శత్రువును చంపి ఇంద్రుడు కనబడకుండ పోయిన పిమ్మట అగ్ని మొదలైన దేవతలు మూడులోకములకు ప్రభువైన విష్ణువును మాటిమాటికి పూజించిరి. (13-17)

"ప్రభూ! నీవే ఉత్తమమైన గతివి. అన్నింటికంటె పూర్వము ఉన్న జగత్పితవు. సకలభూతలరక్షణము కొరకై విష్ణువు అయినావు. దేవతాశ్రేష్ఠుడా! నీవు వృత్రాసురుణ్ణి చంపినావు. బ్రహ్మహత్య ఇంద్రుణ్ణి బాధించుచున్నది. అతనికి దానినుండి విడుదల ఇమ్ము." అని ప్రార్థించిరి. ఆ దేవతల మాటలు విని విష్ణువు- "ఇంద్రుడు నన్నే పూజించినచో నేను అతనిని పవిత్రుని చేసెదను. ఇంద్రుడు పుణ్యమైన అశ్వమేధయాగముచేత నన్నే పూజించినచో ఎట్టి భయమూ లేనివాడై మరల దేవేంద్రత్వమును పొందగలడు." అని పలికెను. దేవతల ప్రభువైన విష్ణువు ఈ విధముగా అమృతమువంటి ఆ వాక్కును దేవతలకు వినిపించి, వాళ్ళు స్తుతించుచుండగా స్వర్గమునకు వెళ్ళెను. (18-22)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది ఐదవ సర్గము సమాప్తము.**

# ఎనుబది ఆరవ సర్గము

**ఇంద్రుడు అశ్వమేధము చేసి బ్రహ్మహత్య నుండి విముక్తుడగుట.**

నరులలో శ్రేష్ఠుడైన ఆ లక్ష్మణుడు అప్పుడు వృత్రాసురవధను పూర్తిగా చెప్పి మిగిలిన కథను ప్రారంభించెను – గొప్ప పరాక్రమము గల వృత్రాసురుణ్ణి సంహరించిన పిదప ఇంద్రుడు బ్రహ్మహత్యాపాపముచేత స్పృహ కోల్పోయెను. అతడు లోకముల చివరికి పోయి సంజ్ఞ కోల్పోయి, చైతన్యరహితుడై కొంతకాలము సర్పమువలె దొర్లుచుండెను. ఇంద్రుడు కనబడకుండ పోగానే జగత్తు దిగులు చెందెను. భూమికూడ తడిలేక, అడవులు ఎండిపోయి పాడుపడినట్లు ఉండెను. చెరువులలోను, నదులలోను నీరు ఎండిపోయి అనావృష్టివలన ప్రాణులకు గొప్ప సంక్షోభము ఏర్పడెను. లోకము ఈ విధముగా క్షీణించుట చూచి దేవతలు దిగులుచెంది పూర్వము విష్ణువు చెప్పిన యజ్ఞమును సమకూర్చిరి. పిమ్మట దేవతలందరు ఉపాధ్యాయులతోను, ఋషులతోను కలసినవారై, భయముచేత మోహితుడైన ఇంద్రుడున్న చోటికి వెళ్ళిరి. వారు బ్రహ్మహత్యచేత ఆవరింపబడిన ఇంద్రుణ్ణి చూచి, దేవతాప్రభువైన అతనిని ముందు ఉంచుకొని అశ్వమేధయాగము చేసిరి. రాజా! పిమ్మట బ్రహ్మహత్యాపాపమునుండి విముక్తికొరకు మహేంద్రుని గొప్ప అశ్వమేధము జరిగెను. (1-9)

యజ్ఞము సమాప్తమైన పిమ్మట ఇంద్రుని బ్రహ్మహత్య వారి వద్దకు వచ్చి, "నాకు ఎక్కడ స్థానము కల్పించెదరు?" అని ప్రశ్నించెను. అప్పుడా దేవతలు సంతోషించి దానితో ఇట్లు పలికిరి. "ఓ! బ్రహ్మహత్యా! నిన్ను నీవే నాలుగు భాగాలుగా విభజించుకొనుము." దుఃఖమును కలిగించు నివాసము గల ఆ బ్రహ్మహత్య దేవతల మాటలు విని, ఆ విధముగా నాలుగు భాగములుగా అయి, మరొక చోట నివాసము కోరెను. నేను ఒక అంశతో నాలుగు వర్షాకాలమాసములలో జలపూర్ణములైన, నదులలో, పాపాత్ముల దర్పమును తొలగించుచు, స్వేచ్ఛగా సంచరించుచు, నివసించెదను. నేను ఒక అంశముచేత ఎల్లప్పుడూ, అన్ని కాలములయందూ కూడ చవటనేలలో నివసించెదను; నా మూడవ అంశముచేత యౌవనవతులైన, దర్పము గల స్త్రీలలో వాళ్ళ దర్పమును తొలగించుచు మూడు దివసములు ఉందును. దేవతాశ్రేష్ఠులారా! నాల్గవ భాగముచేత అపరాధము లేని బ్రాహ్మణులను ఎవరు వంచన పూర్వకముగా చంపుదురో వాళ్ళను ఆశ్రయించి ఉందును." అప్పుడు దేవతలు దానితో – "ఓ! దుర్వసా! (నివసించి కష్టము కలిగించుదానా!) నీవు చెప్పినట్లే అంతా అగుగాక. నీకు ఎట్లు ఇష్టమో అట్లు

చేయుము.” అనిరి.(10-17)

దేవతలు సంతోషించుచు ఇంద్రునకు నమస్కరించిరి. అతడు కూడ పాపము తొలగి బాధలేనివాడు అయ్యెను. ఇంద్రుడు ప్రతిష్ఠితుడు అయిన వెంటనే జగత్తు అంతా ప్రశాంత మయ్యెను. ఇంద్రుడు అద్భుతమైన ఆ అశ్వమేధయాగమును కొనియాడెను. రామా! అశ్వమేధము అనుగ్రహము ఇట్టిది. రాజా! అశ్వమేధయాగము చేయుము.” ఆ రాజు చాలా మనోహరము, ఉత్తమము అయిన లక్ష్మణుని మాట విని సంతోషించెను.(18-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది ఆరవ సర్గము సమాప్తము.**

# ఎనుబది ఏడవ సర్గము

## రాముడు లక్ష్మణునకు ఇలోపాఖ్యానము చెప్పుట.

**ల**క్ష్మణుని మాటలు విని రాముడు నవ్వుచు ఇట్లు పలికెను- “లక్ష్మణా! వృత్రసంహారము గూర్చి అశ్వమేధఫలమును గూర్చి నీవు చెప్పిన దంతా యథార్థమే. సౌమ్యా! పూర్వము కర్దమప్రజాపతి కుమారుడు, చాల ధార్మికుడు, శ్రీమంతుడు అయిన ఇలుడు అను బాహ్లికదేశరాజు ఉండెడివాడు. గొప్పకీర్తిగల ఆ రాజు భూమినంతను తన వశములో ఉంచుకొని ప్రజలను పుత్రులవలె పాలించెను. దేవతలు, మహాధనవంతులైన దైత్యులు, మహాత్ములైన నాగ-రాక్షస-గంధర్వులు, యక్షులూ కూడ భయములో నిత్యము ఇతనిని పూజించుచుండిరి. ఇతనికి రోషము వచ్చినప్పుడు మూడులోకాలూ కూడ భయపడుచుండెడివి. బాహ్లీకదేశప్రభువు, మహాకీర్తిశాలీ అయిన ఆ రాజు ఆ విధముగా ధర్మమునందు, పరాక్రమమునందు స్థిరుడై, చాల ఉదారమైన బుద్ధితో ప్రకాశించుచుండెను.(1-7)

ఆ రాజు భృత్యులతోను, సైన్యముతోను, వాహనములతోను అందమైన అరణ్యమునకు వెళ్ళి, మనోహరమైన చైత్రమాసమునందు వేటాడెను. వందలకొలది వేలకొలది మృగములను చంపెను. కాని అతనికి తృప్తి కలగలేదు. అతడు అనేకవిధములైన మృగముల అయుతము చంపెను. పిదప అతడు మహాసేనుడు జన్మించిన దేశమునకు వెళ్లెను. ఆ ప్రదేశమునందు దేవతల ప్రభువు, ఎదిరింపశక్యముకానివాడూ అయిన శివుడు అనుచరులతో కలసి, పార్వతిని

విహరింపచేయుచుండెను.(8-11)

పరమేశ్వరుడు పార్వతికి ప్రియమును చేయగోరి ఆ పర్వతముపై నున్న సెలయేటిలో స్త్రీరూపమును ధరించి ఉండెను. ఆ వనప్రాంతమునందున్న మగప్రాణులు, పుంలింగముతో ఉన్న చెట్లూ అన్నీకూడ స్త్రీలుగా మారిపోయిరి. అక్కడ ఉన్న ప్రతి వస్తువు స్త్రీసంజ్ఞతో మారిపోయెను. ఇంతలో కర్దమప్రజాపతి కుమారుడైన ఇలమహారాజు, వేలకొలది మృగములను చంపుచు ఆ ప్రదేశమునకు వచ్చెను. లక్ష్మణా! క్రూరమృగములతో, లేళ్ళతో పక్షులతో సహా సమస్తము స్త్రీల రూపములో మారిపోవుటను చూచి, ఇలుడు తాను, అనుచరులూ కూడ అట్లు మారిపోయినట్లు గుర్తించెను. తాను అట్లు అయినందుకు అతనికి చాల దుఃఖము కలిగెను. అది శివుడు చేసిన పని అని తెలుసుకొని భయముచెంది, భృత్యులతోను, సైన్యములతోను వాహనములతోను కూడిన ఆ రాజు జటాజూటధారియైన శివుణ్ణి శరణు పొందెను. పిమ్మట దేవీసమేతుడైన మహేశ్వరుడు నవ్వెను. స్వయముగా వరమును ఇవ్వనున్నవాడై ఇలునితో- "కర్దమపుత్రుడవైన మహాబలశాలివైన రాజర్షీ! లెమ్ము లెమ్ము. పురుషత్వము తప్ప ఏ వరమైనను కోరుకొనుము." అనెను. స్త్రీగా మారిన ఆ రాజు మహాత్ముడైన ఆ శివునిచేత ప్రత్యాఖ్యానింపబడినవాడై, ఆ దేవోత్తమునినుండి మరొక వరమును తీసుకొనలేదు.(12-20)

అప్పుడా రాజు చాల శోకముతో శైలరాజు కుమార్తెయైన పార్వతీదేవికి పరిపూర్ణభక్తిభావముతో నమస్కరించి- "వరము లీయ సమర్థురాలవైన ఓ! దేవీ! నీవు లోకములకు వరములను ఇచ్చెదవు. వ్యర్థముకాని దర్శనము కలదానా! నన్ను సౌమ్యమైన నేత్రములతో చూడుము." అని ప్రార్థించెను. ఆ దేవి ఈశ్వరసంనిధిలో ఆ రాజర్షి మనస్సులో ఉన్న అభిప్రాయము తెలిసికొని- "నీకు శివుడు సగము వరము నిచ్చెను. నేను సగము వరము నిచ్చెదను. అందువలన స్త్రీత్వ - పురుషత్వములలో ఏది కావలెనో దానిలో సగము కోరుకొనుము." అనెను. ఆశ్చర్యకరము, ఉత్తమమూ అయిన దేవి ఇచ్చిన వరమును విని రాజు మనస్సులో సంతోషించుచు- "దేవీ! సౌందర్యములో సాటిలేని నీవు నా విషయమున ప్రసన్నురాలవైనచో ఒక మాసము స్త్రీత్వమును పొంది, మరల ఒక మాసము పురుషుడను అగుదునుగాక." అని కోరెను. ఆ దేవి అతని అభిలాషను తెలుసుకొని- "అట్లే కాగలదు." అని పలికెను. "రాజా! నీవు పురుషుడవుగా ఉన్నప్పుడు స్త్రీత్వమును స్మరించవు. తరువాతి మాసమునందు స్త్రీగా ఉన్నప్పుడు పురుషత్వమును స్మరించవు." అనెను. ఈ విధముగా ఆ ఇలమహారాజు ఒక మాసము పురుషుడుగా అయి మరొక

మాసము మూడులోకములలోను సుందరియైన ఇల అను స్త్రీగా అగుచుండెను. (21-29)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది ఏడవ సర్గము సమాప్తము.**

# ఎనుబది ఎనిమిదవ సర్గము

## ఇలాబుధుల పరస్పరదర్శనము. ఇలాసహచారిణులను కింపురుషి అను పేరుతో పర్వతముమీద నివసింపుడని బుధుడు పంపుట.

రాముడు చెప్పిన ఇలునికి సంబంధించిన కథను విని లక్ష్మణభరతులు చాలా ఆశ్చర్యము చెందిరి. ఆ లక్ష్మణభరతులు మహాత్ముడైన ఆ రాజుకు కలిగిన స్త్రీత్వపుంస్త్వములను గూర్చిన విస్తరమును నమస్కారపూర్వకముగా రాముణ్ణి- "దుర్గతిని చెందిన ఆ రాజు స్త్రీ అయినప్పుడు ఎట్లు ప్రవర్తించెను? పురుషుడు అయినప్పుడు ఎట్లు ప్రవర్తించెను?" అని అడిగిరి. (1-3)

కుతూహలముతో వారు అడిగిన ప్రశ్న విని రాముడు ఆ రాజుకు ఏమి జరిగెనో చెప్పెను- అతడు లోకసుందరియైన స్త్రీగా అయి మొదటి మాసమునందు, పూర్వము తనను అనుసరించి వచ్చిన స్త్రీలుగా మారినవారితో కూడి ఉండెను. పద్మపత్రములవంటి నేత్రములు గల ఆ లోకసుందరి వృక్షములతోను, పొదలతోను లతలతోను వ్యాకులమైన ఆ అరణ్యములో పాదాలతోనే విహరించెను. అప్పుడు ఆ ఇల సమస్తములైన వాహనములను విడచి ఆ పర్వతవివరమునందు అంతటా క్రీడించెను. పిమ్మట ఆ వనప్రదేశమునందు పర్వతమునకు సమీపమునందు అనేక విధములైన పక్షుల సముదాయముతో కూడిన చాల సుందరమైన కాంతి గల సరస్సును, ఆ సరస్సులో చంద్రుని కుమారుడైన బుధుణ్ణి ఆ ఇల చూచెను. అతడు ఉదయించిన పూర్ణచంద్రుడు వలె శరీరముతో ప్రజ్వలించుచుండెను. బుధుడు జలమధ్యమునందు తీవ్రమైన తపస్సు చేయుచుండెను. ఎదిరింపశక్యముకాని కీర్తిని ఇచ్చు అతడు మంచి యౌవనములో ఉండెను. (4-10)

ఆమె ఆశ్చర్యము చెందిన, స్త్రీలుగా మారిన ఆ పూర్వపురుషులతో కలసి ఆ సమస్తమైన సరస్సును క్షోభింపచేసెను. బుధుడు ఆమెను చూడగానే మన్మథబాణములకు వశుడై అప్పుడు మనఃస్థైర్యమును పొందలేదు. అతడు నీటిలో

చలించిపోయెను. మూడు లోకములందలి స్త్రీలకంటె సుందరియైన ఇలను చూచుచు, కామార్తుడై అతడు- "దేవతకంటె అధికురాలైన ఈమె ఎవరో? ఇట్టి రూపముతో శోభించు స్త్రీని దేవతాస్త్రీలలోగాని, నాగస్త్రీలలో గాని, అసురస్త్రీలలోగాని, అప్సరస్త్రీలలోగాని నేను చూడలేదు. ఈమె ఇతరుని భార్య కాకపోయినచో నాకు తగినది అగును." అని ఆలోచించి నీటినుండి ఒడ్డు మీదకి వచ్చెను.(11-15)

అతడు ఆ ఆశ్రమము చేరి ఆ ఉత్తమస్త్రీలను పిలచెను. వాళ్ళుకూడ అతనికి నమస్కరించిరి. ధర్మాత్ముడైన అతడు వాళ్ళను- "త్రిలోకసుందరియైన ఈమె ఎవరి భార్య? ఎందుకు వచ్చినది? అంతా చెప్పండి, ఆలస్యము చేయవద్దు." అని ప్రశ్నించెను. మధురమైన అతని మాటలు విని ఆ స్త్రీలు మధురమైన వాక్కుతో- "ఈమె ఎల్లప్పుడూ మాపై ఆధిపత్యము వహించి ఉన్నది. వివాహము కాని ఈమె మాతో కలసి అరణ్యములలో తిరుగుచుండును." అని చెప్పిరి. అస్పష్టపదములు గల ఆ స్త్రీల వాక్యము విని క్షత్రియుడైన ఆ బుధుడు పవిత్రమైన ఆవర్తని అను విద్యను(తెలియని అర్థమును తెలుసుకొనే శక్తిని కలిగించు మంత్రము) మనస్సులో జపించెను. ఆ మునిశ్రేష్ఠుడు ఆ రాజునకు సంబంధించిన వృత్తాంతమును అంతనూ యథాతథముగా తెలుసుకొని ఆ ఉత్తమస్త్రీలతో- "మీరు ఈ పర్వతము పైభాగమునందు కింపురుషీలుగా అయి నివసించుడు. స్త్రీలలారా! మీరందరూ నిత్యము మూలములతోను, ఆకులతోను, పండ్లతోను జీవనము గడపెదరు. కింపురుషులు అను భర్తలను పొందగలరు" అని పలికెను. ఆ స్త్రీలు బుధుని మాట వినగానే కింపురుషీలుగా అయి ఆ పర్వతము మీదికి వెళ్ళిరి.(16-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# ఎనుబది తొమ్మిదవ సర్గము

**ఇలా - బుధులకు పురూరవుడు అను పుత్రుడు పుట్టుట.**

లక్ష్మణభరతు లిద్దరూ కింపురుషుల ఉత్పత్తిని గూర్చి విని రామునితో "ఇది చాల ఆశ్చర్యకరము" అని పలికిరి. రాముడు మరల ఇలుని కథను చెప్పెను- "బుధుడు ఆ కింనరస్త్రీ లందరు విహరించుట చూచి మంచి సౌందర్యము గల ఆ స్త్రీతో నవ్వుచు- "ఓ! సుందరవదనా! నేను చంద్రుని ప్రియపుత్రుడను. నన్ను

స్నేహపూర్వకమైన దృష్టితో చూచుచు, భక్తితో చేరుము." అనెను. స్వజనులు ఎవరూ లేని ఆ శూన్యప్రదేశమునందు అతని మాటలు విని చాలా అందమైన గొప్ప కాంతి గల అతనితో ఇల- "సౌమ్యుడా! స్వేచ్ఛగా సంచరించు నేను నీకు వశురాలనైతిని. చంద్రపుత్రా! నన్ను ఆజ్ఞాపించుము. నీకు ఎట్లు ఇష్టమో అట్లు చేయుము." అనెను. కాముకుడైన ఆ బుధుడు ఆశ్చర్యకరమైన ఆమె మాట విని సంతోషించి ఆమెతో విహరించెను. సుందరమైన ముఖముగల ఆ ఇలను అధికముగా క్రీడింపచేయుచున్న కాముకుడైన ఆ బుధునకు వైశాఖమాసము ఒక్కక్షణమువలె గడచి పోయెను. (1-8)

మాసము పూర్తిగానే పూర్ణచంద్రుని వంటి ముఖము గల శ్రీమంతుడైన ఇలుడు శయనముమీద మేల్కొనెను. ఆ రాజు అక్కడ సరస్సులో చేతులు పైకి ఎత్తి, ఆధారమేమీ లేకుండా నిలచి తపస్సు చేయుచున్న బుధుణ్ణి చూచి అతనితో- "పూజ్యుడా! అనుచరులతో కలిసి నేను ప్రవేశింప శక్యముకాని పర్వతముమీదికి వచ్చితిని; కాని నా సైన్యము కనబడుటలేదు. నా వాళ్ళందరు ఎక్కడికి పోయినారో తెలియదు." అనెను. (9-11)

స్మృతి కోల్పోయిన ఆ రాజర్షి మాటలు విని బుధుడు మంచి మాటలతో ఓదార్చుచు శుభమైన వాక్యమును పలికెను- "పెద్ద రాళ్ళవానకు నీ అనుచరు లందరూ మరణించినారు. నీవు గాలివానకు భయపడి నా ఆశ్రమమునకు వచ్చి నిద్రించితివి. వీరుడా! ఊరడిల్లుము. నీకు క్షేమమగుగాక. నీవు భయమును, దుఃఖమును విడచి, ఫలమూలములను తినుచు సుఖముగా ఇక్కడ నివసించుము."(12-14)

గొప్ప బుద్ధిగల ఆ రాజు ఆమాటలకు ఊరడిల్లి భృత్యులు నశించుటచే దీనుడై- "నా భృత్యులు లేని నా రాజ్యమును విడిచివేసెదను. బ్రాహ్మణోత్తమా! ఇక్కడ క్షణము ఉండను. నాకు వెళ్ళుటకు అజ్ఞ ఇమ్ము. బ్రాహ్మణా! ధర్మపరుడు, గొప్ప కీర్తి గలవాడు, శశబిందు వను పేరు గలవాడూ అయిన నాజ్యేష్ఠపుత్రుడు రాజ్యమును పొందగలడు. నేను సుఖవంతులైన భృత్యులను, భార్యలను విడచి ఉండజాలను. "ఇక్కడనే ఉండుము' వంటి అశుభవాక్యమును నీవు పలకవద్దు." అని పలికెను. (15-18)

ఆ రాజు అట్లు పలుకుచుండగా బుధుడు అతనిని ఓదార్చి- "నీకు ఇక్కడ నివాసము ఇష్టమగుగాక. మహాబలశాలియైన మహారాజా! నీవు దుఃఖము చెందకుము. ఇక్కడ నీవు ఒక సంవత్సరము ఉన్నచో నీకు హితము చేయించెదను." అని

పలికెను. బుధుడు చెప్పిన మాటలు విని చెప్పిన విధముగా నివసించుటకు ఆరాజు నిశ్చయించుకొనెను. అతడు ఒక మాసము సుందరియైన స్త్రీగా అయి ఆ బుధుణ్ణి రమింపచేసెను. మరొక మాసము పురుషుడుగా అయి ధర్మబుద్ధితో ఉండెను. పిమ్మట సుశ్రోణియైన ఆ ఇల తొమ్మిదవ మాసమునందు బుధుని వలన గొప్ప బలముగల పురూరవసుడు అను పుత్రుణ్ణి కనెను. అతడు పుట్టగానే సుశ్రోణియైన ఆ ఇల తండ్రితో సమానమైన వర్ణము, గొప్ప బలము గల ఆ పుత్రుణ్ణి తండ్రిచేతిలో ఉంచెను. బుద్ధిమంతుడైన బుధుడు సంవత్సరానంతరము పురుషుడైన ఆ ఇలుణ్ణి ధర్మసంబద్ధములైన కథలతో ఆనందింపచేసెను.(19-25)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని ఎనుబది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# తొంబదవ సర్గము

## అశ్వమేధయాగము చేయుటచే ఇలకు పురుషత్వము లభించుట.

రాముడు చెప్పిన ఆ పురూరవుని అద్భుతమైన జన్మను గూర్చి విని లక్ష్మణభరతులు- "నరులలో శ్రేష్ఠుడవైన రామా! బుధునివద్ద సంవత్సరకాలము ఉన్న ఇల పిమ్మట ఏమి చేసినదో చెప్పుము." అని అడిగిరి. రాముడు ఇలునికి సంబంధించిన కథను మరల ఇట్లు చెప్పెను- ఇలుడు పురుషత్వమును పొందిన పిమ్మట గొప్ప బుద్ధి, కీర్తి గల బుధుడు చాల ఉదారస్వభావము గల సంవర్తనుణ్ణి పిలచెను. భృగుపుత్రుడైన చ్యవనుణ్ణి, అరిష్టనేమిమునిని, ఆనందకరుడైన ప్రమోదనుణ్ణి, దుర్వాసమునిని పిలచెను. మాటలలో నేర్పరి, తత్త్వమును ఎరిగినవాడు అయిన బుధుడు వీరినందరినీ పిలిపించి, ధైర్యముచేత సావధానచిత్తులూ, మంచి మనస్సు గలవారూ అయిన వారందరితో- "మహాబాహువైన ఈ రాజు కర్దమప్రజాపతి పుత్రుడైన ఇలుడు. ఇతని విషయమున ఏమి జరిగినదో తెలిసికొనుడు. ఇతనికి శ్రేయస్సు కలుగు నట్లు చేయుడు." అనెను. వారిట్లు మాటలాడుకొనుచుండగనే గొప్ప తేజస్సు గల కర్దముడు మహాత్ములైన బ్రాహ్మణులతో కలసి ఆ ఆశ్రమమునకు వచ్చెను. పులస్త్యుడు, క్రతువు, వషట్కారుడు, గొప్ప తేజస్సు గల ఓంకారుడు ఆశ్రమమునకు వచ్చిరి.(1-9)

పరస్పరము కలియుటచే సంతోషభరితములైన మనస్సులతో వారందరు

ఇలుని హితము కోరుచు వేరువేరుగా ఇట్లు పలికిరి. కర్దముడు పుత్రునకు చాల హితమైన వాక్యమును పలికెను – "బ్రాహ్మణులారా! ఈ రాజునకు ఏది హితమో నా మాటను వినుడు. శివుడు తప్ప మరొక చికిత్స నాకు కనబడుటలేదు. మహాత్ముడైన ఆ శివునకు అశ్వమేధముకంటె ఎక్కువ ప్రియమైన యజ్ఞము లేదు. అందువలన మన మందరము రాజుకొరకై చాలా కష్టమైన ఈ యజ్ఞముచేసెదము." కర్దముని మాటలు విని ఆ బ్రాహ్మణశ్రేష్ఠులు రుద్రుణ్ణి ఆరాధించుటకై ఆ యజ్ఞము చేయవలె నని అంగీకరించిరి. రాజర్షియైన సంవర్తుని శిష్యుడు, శత్రుపురములను జయించినవాడూ అయిన మరుత్తుడు ఆ యజ్ఞము ఏర్పాట్లన్నీ చేసెను. అప్పుడు బుధుని ఆశ్రమము దగ్గర గొప్ప యజ్ఞము జరిగెను. రుద్రుడు చాలా సంతోషించెను. యజ్ఞము సమాప్తమైన పిమ్మట శివుడు సంతోషించి ఇలుని సమక్షమున ఆ బ్రాహ్మణులందరితో చాలా సంతోషముతో– "బ్రాహ్మణోత్తములారా! ఈ అశ్వమేధముచేతను మీ భక్తికిని సంతోషించితిని. ఈ ఇలునికి ఏమి ప్రియము, శుభము చేయవలెను?" అని అడిగెను. శివుడు ఇట్లు పలకగా ఆ బ్రాహ్మణులు సావధానచిత్తులై ఇల పురుషుడు అగునట్లు, ఆయనను అనుగ్రహింపచేసికొనిరి. పిమ్మట గొప్ప తేజస్సు గల ఆ మహాదేవుడు సంతోషించి ఇలకు మరల పురుషత్వమును ఇచ్చి అంతర్ధానము చెందెను.(10–19)

హయమేధము పూర్తి అయి శివుడు అంతర్ధానము చెందిన పిమ్మట దీర్ఘదృష్టి గల ఆ బ్రాహ్మణులందరూ వచ్చినట్లుగానే వెళ్ళిపోయిరి. ఇలుడైతే బాహ్లికదేశమును విడచి మధ్యదేశములో అత్యుత్తమమైన, కీర్తిని ఇచ్చు ప్రతిష్ఠానపురమును నెలకొల్పెను. శత్రుపురములను జయించు రాజర్షి యైన శశబిందువు బాహ్లికదేశమును, కర్దమప్రజాపతి పుత్రుడు, బలశాలీ అయిన ఇలుడు ప్రతిష్ఠానమును పాలించిరి. కొంతకాలమునకు ఇలుడు అత్యుత్తమమైన బ్రహ్మలోకమునకు వెళ్ళెను. పిదప ఇలుని పుత్రుడైన పురూరవుడు ప్రతిష్ఠానమునందు రాజయ్యెను. పురుషశ్రేష్ఠుడా! అశ్వమేధము ప్రభావము ఇటువంటిది. స్త్రీఅయిన వాడు, పురుషుడు అయి, దుర్లభమైన బ్రహ్మలోకమును కూడ పొందెను."(20–24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబదవ సర్గము సమాప్తము.**

# తొంబది ఒకటవ సర్గము

## రాముని ఆజ్ఞచేత అశ్వమేధయాగమునకు ఏర్పాటు జరుగుట.

రాముడు సోదరులిద్దరికీ ఈ వృత్తాంతము చెప్పి లక్ష్మణునితో మరల ధర్మసంమతమైన వాక్యము నిట్లు పలికెను– "లక్ష్మణా! వసిష్ఠునీ, వామదేవునీ, జాబాలినీ, కశ్యపునీ, అశ్వమేధయాగమునందు ఉండవలసిన, అందరికంటే ఉత్తములైన బ్రాహ్మణులను వీరినందరినీ పిలిచి, వీరితో ఆలోచించి మంచి లక్షణము లున్న అశ్వమును నియమపూర్వకముగా విడవదలచుచున్నాను."(1–3)

లక్ష్మణుడు రాముని మాట విని శీఘ్రముగా వెళ్ళి ఆ బ్రాహ్మణుల నందరినీ తీసికొని వచ్చి వారికి రాముణ్ణి చూపెను. ఆ ద్విజులు పాదాభివందనము చేసిన ఆ రాముణ్ణి ఆశీర్వాదములచేత పూజించిరి. రాముడు అంజలి ఘటించి నమస్కరించి ఆ ద్విజోత్తములతో అశ్వమేధమును గూర్చి ధర్మసంమతమైన వాక్యము పలికెను. ఆ బ్రాహ్మణులందరూ కూడ రాముని మాటలు విని, అశ్వమేధముచేత ఆరాధ్యుడైన మహేశ్వరునికి నమస్కరించుచు, అశ్వమేధమును ప్రశంసించిరి.(4–7)

రాముడు ఆ బ్రాహ్మణోత్తములు పలికిన అశ్వమేధమునకు సంబంధించిన, ఆశ్చర్యకరమైన దృష్టితో కూడిన మాటలు విని సంతోషించి, చేయదలచిన కర్మను తెలిసికొని లక్ష్మణునితో ఇట్లు పలికెను – "మహాబాహూ! మహాత్ముడైన సుగ్రీవుని ఆహ్వానించుటకై దూతను పంపుము. "వానరనాయకులతోను వనములో నివసించు వానరాదులతో చాలామందితోను ఈ మహోత్సవమును అనుభవించుటకై రమ్ము" అని ఆహ్వానము పంపుము. సాటిలేని పరాక్రమము గల విభీషణుడు కూడ స్వేచ్ఛగా సంచరించగలిగిన శక్తి గల చాలామంది రాక్షసులతో కలసి ఈ అశ్వమేధమహాయజ్ఞమునకు వచ్చుగాక. నాకు ప్రియము చేయదలచిన, మహాభాగ్యవంతులైన రాజులు కూడ పరివారసహితులై ఈ మహాయజ్ఞమును చూచుటకు వచ్చెదరుగాక. లక్ష్మణా! ఇతరదేశాలలో ఉన్న ధర్మశ్రద్ధ గల ద్విజు లందరినీ కూడ అశ్వమేధయాగమునకు ఆహ్వానించుము. మహాబాహూ! తపస్సే ధనముగా గల ఋషులను, కార్యవశముచేత దేశాంతరములలో ఉన్న భార్యాసహితులైన ద్విజులను, అందరినీ ఆహ్వానించవలెను.(8–14)

తాలములు వాయించుచు దేశసంచారము చేసేవాళ్ళను, నటులను, నర్తకులను కూడా ఆహ్వానించవలెను. నైమిశారణ్యమునందు గోమతీతీరమునందు చాలా పెద్ద

యజ్ఞవాటమును నిర్మించుటకు ఆజ్ఞాపించుము. అది చాల పవిత్రమైన ప్రదేశము కదా? మహాబాహూ! అంతటా కూడ శాంతులు ప్రవర్తించుగాక.(15,16)

లక్ష్మణా! వందలకొలది ధర్మవేత్తలు నైమిషములో అత్యుత్తమమైన ఈ మహాయజ్ఞమును చూచి ధన్యు లగుదురుగాక. ధర్మములు తెలిసినవాడా! ఈ జనులనందరినీ శీఘ్రముగా ఆహ్వానించుము. వీరందరూ యథావిధిగా సత్కరింపబడి సంతోషముతో పరిపుష్టులై తిరిగి వెళ్ళగలరు. ముక్కలు కాని బియ్యమును మోయు వాహనములు ఒక లక్ష, తిలలు, పెసలు మోయు పదివేల వాహనములు ముందు వెళ్ళుగాక. శనగలు, ఉలవలు, మినువులు, లవణము వీటికి తగిన తైలాదికము, అంతకంటె తక్కువ ప్రమాణములలో గంధద్రవ్యములు కూడ వెళ్ళుగాక. భరతుడు చాల కోట్ల వెండినాణెములు, నూరుకోట్లకు మించిన బంగారు నాణెములు తీసికొని, జాగరూకుడై ముందు వెళ్ళుగాక. కావలసిన చోట్ల అంగళ్ళ వీథులు తెరచు వర్తకులు, నటులు, నర్తకులు, వంటవాళ్ళు, వంటలు చేసే స్త్రీలు, నిత్యము యౌవనముతో ఉండు (దృఢకాయులైన) చాలా మంది పురుషులు భరతునితో కలసి వెళ్ళవలెను. గొప్ప కీర్తి గల భరతుడు ఆ యా సంఘముల ముఖ్యులను బాలులను, వృద్ధులను, సావధానచిత్తులైన బ్రాహ్మణులను, కర్మపర్యవేక్షకులను, ధనాగారముల అధ్యక్షులను, ధనాగారములకు సంబంధించిన ఇతర ముఖ్యులను, మన తల్లులను అందరిని, సోదరుల అంతఃపురములను, దీక్షకు ఉపయోగించవలసిన నా భార్య బంగారు ప్రతిమను, ఆయా కర్మలలో దక్షులైన వారిని ముందు ఉంచుకొని ముందుగా వెళ్ళుగాక."(17-25)

ఆ నరశ్రేష్ఠుడు, పరివార సహితులైన రాజులకొరకు మంచి గుడారములను, వారి అనుచరులకొరకు అన్నపానములను, వస్త్రములను ఏర్పాటు చేయించెను. అప్పుడు శత్రుఘ్నునితో కలసి భరతుడు వెళ్ళెను. సుగ్రీవసమేతులైన మహాత్ములైన వానరులు కూడ వెళ్ళిరి. చాలామంది రాక్షసులతోను, స్త్రీలతోను కలసి విభీషణుడు ఉగ్రమైన తపస్సు గల మహాత్ములైన ఋషులకు పూజచేసెను. బ్రాహ్మణోత్తములు వారికి వద్దన చేసిరి.(26-29)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది ఒకటవ సర్గము సమాప్తము.**

# తొంబది రెండవ సర్గము

## రాముని అశ్వమేధయాగములో దాన గౌరవములు బాగా జరుగుట.

రాముడు కావలసిన సామాగ్రి అంతా పూర్తిగా పంపి, మంచి లక్షణములు గల, ప్రధానముగా నల్లగా ఉన్న, అశ్వమును విడచి, లక్ష్మణుణ్ణి ఋత్విక్కులతో కూడ గుఱ్ఱము వెనుక సంచరించుటకు ఆజ్ఞాపించి సైన్యముతో కూడ నైమిషమునకు వెళ్ళెను. అతడు చాలా అద్భుతమైన ఆ యజ్ఞవాటమును చూచి, చాలా సంతోషించి "ఇది చాలా బాగున్నది" అని అనెను. రాజులందరూ నైమిషములో నివసించుచున్న రామునకు కానుకలు తీసికొని వచ్చిరి. రాముడు వారిని మరల సన్మానించెను. రాజులను పూజించుటయందు నియుక్తులైన భరతశత్రుఘ్నులు అన్న పానాదికమును, వస్త్రములను, ఇతరవస్తువులను ఏర్పాటు చేసిరి.(1-5)

సుగ్రీవుడు మొదలైన వానరులు నియమవంతులై బ్రాహ్మణులకు వడ్డన చేసిరి. చాలామంది రాక్షసులతో కూడిన విభీషణుడు చాల సావధానచిత్తుడై ఉగ్రమైన తపస్సు గల ఋషులకు కింకరు దయ్యెను. ఆ నరశ్రేష్ఠుడు, పరివార సహితులైన రాజులకొరకు మంచి గుడారములను, వారి అనుచరులకొరకు అన్నపానములను, వస్త్రములను ఏర్పాటు చేయించెను. ఈ విధముగా ఆ అశ్వమేధయజ్ఞము బాగుగా ఏర్పరుపబడెను. అశ్వసంచారము లక్ష్మణునిచేత రక్షింపబడినదై జరిగెను.(6-9)

ఆ అశ్వమేధయజ్ఞమునందు- "యాచకులు సంతృప్తి చెందే వరకు ఇమ్ము ఇమ్ము" అను మాటలు తప్ప మరి ఏ మాటలు వినబడలేదు. రాముని ఉత్తమమైన యజ్ఞము ఈ విధముగా ఉండెను. ఆ మహాయజ్ఞమునందు యాచకులు తృప్తిచెందువరకు, అనేకములైన బెల్లముతో చేసిన భక్ష్యములు, పటికబెల్లముతో చేసిన భక్ష్యములు అన్నీ ఇవ్వబడెను. యాచకుల పెదవులనుండి మాట బైటకు రాకమునుపే వానరులు, రాక్షసులు వారికి కావలసినవి ఇచ్చుచుండిరి. సంతోషముతో పరిపుష్టి చెందిన జనులతో నిండిన ఆ యజ్ఞములో మలినముగా ఉన్నవాడుగాని, దీనుడు గాని, లేదా చిక్కినవాడు గాని లేడు. అక్కడ ఉన్న చిరంజీవులైన మునులకు, ఇన్ని దానములు చేసిన మరొక యజ్ఞము ఏదీ కూడ స్మృతికి రాలేదు. బంగారము కావలసినవానికి బంగారము, ధనము కావలసినవానికి ధనము, రత్నములు కావలసినవానికి రత్నములు లభించెను. నిరంతరము ఇచ్చివేయుచున్నను, బంగారము, వెండి, రత్నములు, వస్త్రములు రాసులుగా అక్కడ

కనబడుచుండెను.(10–16)

"ఇట్టి యజ్ఞమును మేము పూర్వ మెన్నడూ చూడలేదు. ఇంద్రుని యజ్ఞము గాని, సోముని యజ్ఞము గాని, యముని యజ్ఞముగాని, వరుణుని యజ్ఞముగాని ఇట్లు లేదు." అని మునులు పలికిరి. ఎక్కడ చూచినా వానరులూ, రాక్షసులూ నిలచి ఉండిరి. వారు నిండిన చేతులతో యాచకులకు వస్త్రములు, ధనము, అన్నము ఇచ్చుచుండిరి. రాజశ్రేష్ఠుడైన రాముని యజ్ఞము ఏ మాత్రము దానాదులలో తగ్గుదల లేక ఇదే విధముగా కొంచెము ఎక్కువ సంవత్సరము నడచెను.(17–19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది రెండవ సర్గము సమాప్తము.**

# తొంబది మూడవ సర్గము

## వాల్మీకి రాముని యజ్ఞమునకు వచ్చుట. కుశలవులు రామాయణము గానము చేయుట.

ఈ విధముగా చాలా అశ్చర్యకరమైన ఆ యజ్ఞము జరుగుచుండగా, పూజ్యుడైన వాల్మీకి మహర్షి శిష్యులతో అక్కడికి శీఘ్రముగా వచ్చెను. వాల్మీకి దివ్యమైన, చూచుటకు ఆశ్చర్యకరమైన ఆ యజ్ఞమును చూచి ఋషుల నివాసప్రదేశముల దగ్గర పర్ణశాల నిర్మించెను. వాల్మీకి నివసించుచున్న అందమైన ప్రదేశము దగ్గర అనేక వస్తువులతో నిండిన బండ్లను, మంచి ఫలమూలములను ఉంచిరి. ఆ వాల్మీకిని రాజు, మహాత్ములైన మునులు పూజించిరి. అతడు అక్కడ నివసించెను. (1–4)

అతడు సంతోషించుచున్న శిష్యు లిద్దరితో ఇట్లు పలికెను– "మీరిద్దరూ సావధానచిత్తులై సంతోషముతో రామాయణకావ్యము నంతనూ గానము చేయుడు. ఋషులు నివసించు ప్రదేశములయందు, పవిత్రములైన బ్రాహ్మణగృహములయందు,వీథులలోను, రాజమార్గములయందు, రాజుల ఇండ్లలోను గానము చేయుడు. రాముని గృహద్వారమునందు, అశ్వమేధముచేయుచున్న ప్రదేశమునందు, ఋత్విక్కుల ఎదుట, విశేషించి గానము చేయవలెను. ఇక్కడ పర్వతాగ్రములయందు లభించు మధురములైన, అనేక విధములైన ఫలములను తిని వెళ్ళుడు. వత్సలారా! ఫలములను, పరిశుద్ధములైన

మూలములను భక్షించినచో మీకు శ్రమ కలుగదు; రాగము(కంఠస్వరము) చెడదు. రాజైన రాముడు వినుటకై మిమ్ములను పిలిపించినచో ఋషు లందరూ కూడ అక్కడ కూర్చొని ఉండగా గానము జరుగుగాక. నేను పూర్వము శ్లోకసంఖ్య మొదలైన ప్రమాణములను పట్టి చెప్పినట్లు రోజుకు ఇరవై చొప్పున ఆ రామాయణములోని సర్గలు మధురమైన వాక్కుతో గానము చేయవలెను. ధనమునందు కోరికతో కొంచెము కూడ లోభము చేయకూడదు. నిత్యమూ ఆశ్రమములో ఉండి ఫలమూలములను తినుచుండువారికి ధనమెందుకు? మీరు ఎవరి పుత్రులు అని రాముడు అడిగినట్లయితే "మేము ఈ వాల్మీకి శిష్యులము" అని ఆ రాజుతో చెప్పుడు. చాలా మధురస్వరము పుట్టించు ఈ వీణాతంత్రులను కాని, వేరు వేరు స్వరముల నిష్పత్తికి మూలములైన వీణాశిరస్సు మీద తీగలు బిగించిన స్థానముల మీద గాని నాదవ్యాప్తి కలుగునట్లు చేసి, నిర్భయముగా, మధురముగా గానము చేయుడు. కావ్యమును మొదటినుండీ గానము చేయవలెను. రాజు విషయమున అనాదరభావముతో గానము చేయకూడదు. ధర్మానుసారము రాజు సకలప్రాణులకూ తండ్రి కదా? అందువలన మీరిద్దరూ రేపు ప్రాతఃకాలమునందు, ఉత్సాహముతో సావధానచిత్తులై, వీణాతంత్రుల లయకు సరిపోవునట్లు మధురమైన గేయమును గానము చేయండి."(5-16)

ప్రచేతసుని వంశమునకు చెందిన, మిక్కిలి ఉదారుడైన, గొప్పకీర్తిగల వాల్మీకి ఇట్లు అనేక విధముల ఉపదేశించి మౌనముగా ఉండెను. ఆ ముని ఇట్లు ఉపదేశించగా ఆ సీతాపుత్రులిద్దరూ "అట్లే చేసెదము" అని పలికి వెళ్ళిరి. ఆ బాలురు ఇద్దరూ ఋషి పలికిన అద్భుతములైన ఆ మాటలను, శుక్రుడు చెప్పిన నీతి శాస్త్రమును అశ్వినీదేవతల వలె హృదయములో ఉంచుకొని వేడుకతో, ఆ రాత్రిని సుఖముగా గడిపిరి.(17-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది మూడవ సర్గము సమాప్తము.**

# తొంబది నాలుగవ సర్గము

**కుశలవుల రామాయణ గానమును రాముడు సభలో వినుట.**

రాత్రి తెల్లవారగానే వాళ్ళిద్దరూ స్నానము చేసి, అగ్నిలో హోమము చేసి పూర్వము ఋషి చెప్పిన విధముగా అక్కడ గానము చేసిరి. రాముడు ప్రాచీనులైన సంగీతాచార్యులచేత నిర్మించబడిన, గానముచేత అలంకరింపబడిన, అపూర్వమైన షడ్జాదిస్వరజాతిని (ఆ ముని కుమారులు పాడుచుండగా) వినెను. ద్రుత–మధ్య–విలంబితాది ప్రమాణములతో కూడిన, వీణా తంత్రీలయకు అనుగుణముగా ఉన్న ఆ గీతిని బాలురనుండి విని రాముడు కుతూహలము చెందెను.(1–3)

నరులలో శ్రేష్ఠుడైన రాజు అశ్వమేధయాగము మధ్య మహామునులను, రాజులను, పండితులను, ఆ యా సంఘముల అధ్యక్షులను, పౌరాణికులను, శబ్దశాస్త్రవేత్తలైన వృద్ధులైన బ్రాహ్మణులను, సర్వలక్షణము తెలిసిన వాళ్ళను, గానము వినుటయందు ఆసక్తి గల బ్రాహ్మణోత్తములను, లక్షణశాస్త్రము తెలిసినవాళ్ళను, విశేషించి గాంధర్వశాస్త్రనిపుణులను, పాదములయొక్క సంబంధము తెలిసినవాళ్ళను, ఛందస్సులలో మంచి జ్ఞానము కలవాళ్లను, స్వరముల(అచ్చుల) మాత్రల విశేషములను ఎరిగినవాళ్ళను, జ్యోతిషమునందు పరినిష్ఠితులను, అలంకారశాస్త్రవేత్తలను, కావ్యములలో విశారదులను, అనేకభాషలు తెలిసిన వారిని, పరుల మనస్సులోని భావమును గ్రహించే నేర్పు కలవారినీ, అనేకులైన వర్తకులను, వ్యవహారములందు యుక్తియుక్తముగా మాటలాడగలవారిని, న్యాయశాస్త్రప్రవీణులను, అత్యధిక శాస్త్రజ్ఞానవంతులను, ఛందస్సు తెలిసినవాళ్ళను, పురాణములు తెలిసినవాళ్ళను, వేదపండితులైన ద్విజశ్రేష్ఠులను, చిత్రకళ తెలిసిన వారినీ, వృత్తశాస్త్రమునందు ప్రవేశమున్నవాళ్ళను, గీత–నృత్యములయందు విశారదులను, శాస్త్రజ్ఞులను, నీతియందు నేర్పుగలవారిని, వేదాంతార్థమును విశదీకరించువారినీ– వీరి నందరినీ పిలిపించి, రప్పించి గాయకులైన ఆ బాలురను సభకు పిలిపించెను.(4–10)

ఆ శ్రోత లందరూ మాటలాడుకొనుచుండగా ఆ మునికుమారులిద్దరూ అక్కడ ఆనందమును వృద్ధిపొందించు గానము ప్రారంభించిరి. పిమ్మట మనుష్యులలో దుర్లభమైన మధురమైన గానము ప్రారంభమయ్యెను. ఆ గానసంపదను ఎంత విన్నను శ్రోతలకు తృప్తి కలగలేదు. సమస్తమైన మునులు, గొప్ప తేజస్సు గల రాజులు నేత్రాలతో త్రాగుచున్నారా అన్నట్లు మాటిమాటికి ఆ బాలురను చూచుచుండిరి. సావధానచిత్తులైన వారందరూ ఒకరితో ఒకరు ఇట్లు



అనుకొనుచుండిరి. "ఈ బాలురిద్దరూ బింబమునుండి వెలికి తీసిన బింబమువలె రాముని పోలికతో ఉన్నారు. ఈ బాలురిద్దరూ జటలు, నారబట్టలు ధరించకపోయినచో గానము చేయుచున్న ఈ బాలురకూ రామునకూ భేదమేమీ కనబడదు." పౌరులు, జానపదులు ఇట్లు మాట్లాడుకొనుచుండగా నారదుడు రామకథను వాల్మీకికి చెప్పిన మొదటి సర్గ పూర్తయినది.(11-16)

పిమ్మట ఆ బాలురు రెండవ సర్గ మొదలు ఇరవై సర్గలు గానము చేసిరి. పిమ్మట ఆ ఇరవై సర్గలు విని, రాముడు అపరాహ్ణసమయమునందు సోదరునితో- "లక్ష్మణా! ఆ మహాత్ములిద్దరికీ, శీఘ్రముగా, పద్దెనిమిది వేల బంగారు నాణెములు, వీరికి ఇంకను ఏమైన కావలసినచో దానిని ఇమ్ము."అనెను. లక్ష్మణుడు వెంటనే ఆ బాలురకు వేరు వేరుగా ఇచ్చెను. ఆ గాయకులు లక్ష్మణుడిచ్చుచున్న ఆ బంగారు నాణెములను తీసికొనలేదు. ఆ మహాత్ములు ఈ బంగారము ఎందుకు అని ఆశ్చర్యపడుచు- "వనములో లభించు ఫలమూలములతో జీవించు వనవాసులమైన మేము, వనములో వెండితోను, బంగారముతోను ఏమి చేసికొనెదము?" అనిరి. వారిద్దరూ ఆ విధముగా పలుకుచుండగా శ్రోతలు, రాముడు, అందరూ కూడ ఆశ్చర్యపడిరి.(17-22)

గొప్ప తేజస్సు గల రాముడు ఆ కావ్యము ఎట్లు వచ్చినదో తెలుసుకొనవలె నను కోరికతో ఆ మునికుమారుల నిద్దరినీ- "ఈ కావ్యము ప్రమాణ మెంత? మహాత్ముడైన రచయిత దేశమేది? ఈ గొప్ప కావ్యమును రచించిన మునిశ్రేష్ఠుడు ఎక్కడ ఉన్నాడు?" అని ప్రశ్నించెను. ఇట్లు ప్రశ్నించుచున్న రామునితో ఆ మునికుమారులు - "ఈ కావ్యము రచించిన భగవంతుడైన వాల్మీకి యజ్ఞసమీపమునకు వచ్చి ఉన్నాడు. నీ చరిత్రమును పూర్తిగా వర్ణించిన ఈ కావ్యము ఇరవైనాలుగు వేల శ్లోకాలలో రచింపబడినది. రాజా! మహాత్ముడైన, తపఃశాలియైన వాల్మీకి మహాముని నూరు ఉపాఖ్యానములను, మొదటి సర్గమొదలు ఐదువందల సర్గలను, ఉత్తరకాండతో కూడిన ఆరు కాండలను ఈ కావ్యములో రచించెను. మా ఋషి నీ చరిత్రకు సంబంధించిన ఈ కాండాదులను రచించెను. కావ్యనాయకుని జీవితము ఎంతవరకు ఉండునో అంతవరకు ఉన్న కథ దీనిలో

నిక్షిప్తమై ఉన్నది. మహారథుడవైన రాజా! నీకు వినవలెనను బుద్ధి ఉన్నచో యజ్ఞమధ్యమునందు తీరిక చేసుకొని, తమ్ములతో కలిసి వినుము." అని పలికిరి. (23-29)

రాముడు "తప్పక అట్లే చేసెదము" అనెను. ఆ బాలురిద్దరూ రాముని అనుమతి పొంది, వాల్మీకి ఉన్న స్థానమునకు వెళ్ళిరి. రాముడు కూడ మునులతోను మహాత్ములైన రాజులతోను కలసి ఆ గీతమాధుర్యమును ఆస్వాదించి యజ్ఞశాలకు వెళ్ళెను. ఆ గాయకులైన బాలలు గానము చేసిన కావ్యము తాళలయలకు సరిపడునట్లు ఉండెను. సర్గలలో విభక్తమైన ఆ కావ్యములోని శబ్దములు స్వరములకు అనుకూలముగా ఉండెను. వీణాతంత్రుల లయకు అనుగుణమై మధురమైన వ్యంజనముల (హల్లుల)తో కూడియున్న ఆ కావ్యమును రాముడు వినెను. (30-32)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది నాలుగవ సర్గము సమాప్తము.**

# తొంబది ఐదవ సర్గము

## సీత తన పరిశుద్ధత్వము విషయమున శపథము చేయవలెనని రాముడు అనుట.

రాము డీ విధముగా మునులతోను, రాజులతోను, వానరులతోను కలసి శుభమైన ఆ గీతమును చాల రోజులు వినెను. ఆ గీతమును పట్టి ఆ గాయకులు సీతాపుత్రులే అని తెలుసుకొని రాముడు ఆలోచించి పరిశుద్ధమైన నడవడిక గల దూతలను పిలచి ఆ పరిషత్తు మధ్యలో ఇట్లు పలికెను– "మీరు పూజ్యుడైన వాల్మీకి దగ్గరకు వెళ్ళి నా మాటగా "సీత పరిశుద్ధమైన ప్రవర్తన కలదైనచో, పాపరహిత అయినచో మహాముని అనుజ్ఞ పొంది ఇక్కడ తన శుద్ధిని నిరూపించుకొనుగాక" అని చెప్పుడు. వాల్మీకి అభిప్రాయమును, నమ్మకము కలుగు ప్రమాణమును చూపుటకు అంగీకరించిన సీత అభిప్రాయమును తెలిసికొని శీఘ్రముగా వచ్చి నాకు తెలుపుడు. జనకుని కుమార్తె అయిన సీత రేపు ప్రాతఃకాలము పరిషత్తు మధ్యయందు, నన్ను నిర్దోషినిగా నిరూపించుటకు కూడ శపథము చేయుగాక."(1-6)

రాముడు పలికిన చాలా ఆశ్చర్యకరమైన మాట విని ఆ దూతలు వాల్మీకి ఉన్న ప్రదేశమునకు వెళ్ళి అపరిమితమైన కాంతితో ప్రజ్వలించుచున్న ఆ మహాత్మునకు

నమస్కరించి, రాముడు చెప్పిన మృదుమధురము లైన మాటలు తెలిపిరి. ఆ ముని రాముని దూతల మాటలు విని, రాముని మనస్సులోని అభిప్రాయమును తెలుసుకొని- "ఇట్లే అగుగాక. మీకు క్షేమమగుగాక. సీత రాముడు చెప్పినట్లు చేయగలదు. స్త్రీకి భర్తయే దేవతకదా?" అనెను. రాజదూతలు మునీశ్వరుని మాటలు విని తిరిగి రాముని వద్దకు వచ్చి, ముని పలికిన మాట లన్నీ చెప్పిరి.(7-11)

వాల్మీకి మాటలు విని సంతోషించిన రాముడు అక్కడ వచ్చి ఉన్న ఋషులతోను, రాజులతోను- "శిష్యులతో కూడిన పూజ్యులైన ఋషులు, అనుచరులతో కూడిన రాజులు, చూడదలచినవారు ఎవరైన ఇంకా ఉన్నచో వారూ సీత చేయనున్న శపథమును చూచెదరుగాక." అని పలికెను. మహాత్ముడైన రాముని మాటలు విన్న ఋషిశ్రేష్ఠు లందరూ "బాగు బాగు" అని బిగ్గరగా అనిరి. రాముని మాటలు విని మహాత్ములైన రాజులు కూడా "నరశ్రేష్ఠా! ఇది నీకే తగును; ఇతరు లెవ్వరూ ఇట్లు చేయజాలరు." అని పలుకుచు ప్రశంసించిరి. రాముడు- "శపథము మరునాడు (రేపు) జరుగును" అని నిశ్చయము చేసి ఆ మునులను, రాజులను అందరినీ కూడ పంపివేసెను.(12-17)


**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది ఐదవ సర్గము సమాప్తము.**

# తొంబది ఆరవ సర్గము

## సీత పరిశుద్ధురాలని వాల్మీకి ఘోషించుట.

రాత్రి తెల్లవారగనే మహాతేజఃశాలీ రాజూ అయిన రాముడు యజ్ఞశాలకు వెళ్ళి ఋషు లందరినీ పిలిపించెను. వసిష్ఠ-వామదేవ-జాబాలి-కాశ్యపులు, దీర్ఘమైన తపస్సు గల విశ్వామిత్రుడు, గొప్ప తపస్సు గల దుర్వాసుడు, పులస్త్య-శక్తి-భార్గవ-వామనులు, దీర్ఘాయువైన మార్కండేయుడు, గొప్పకీర్తిగల మౌద్గల్యుడు, గర్గ-చ్యవనులు, ధర్మవేత్తయైన శతానందుడు, తేజఃశాలియైన భరద్వాజుడు, మంచి కాంతి గల అగ్నిపుత్రుడు, నారద-పర్వతులు, గొప్ప యశస్సు గల గౌతముడు, కాత్యాయనసుయజ్ఞులు, తపోనిధియైన అగస్త్యుడు, వీరే కాక గొప్ప నియమములు గల ఇతరమునులు, అందరూ కూడ వేడుకతో వచ్చిరి. గొప్ప పరాక్రమముగల రాక్షసులు, గొప్ప బలము గల వానరులు, ఆ మహాత్ములందరూ వేడుకతో వచ్చిరి. వేలకొలది క్షత్రియులు, శూద్రులు, వైశ్యులు, అనేక దేశములనుండి

వచ్చిన తీవ్రములైన వ్రతము గల జ్ఞాననిష్ఠులు, కర్మనిష్ఠులూ, యోగనిష్ఠులూ అయిన బ్రాహ్మణులు, వీరందరూ కూడ సీతచేయనున్న శపథమును చూచుటకై వచ్చిరి.(1-9)



శిలాప్రతిమలుగా మారిపోయినారా అన్నట్లు నిశ్చలముగా ఉన్న ఆ జనులందరు వచ్చినట్లు విని వాల్మీకి శీఘ్రముగా అక్కడికి వచ్చెను. సీత మనస్సులో రాముణ్ణి స్మరించుచు కన్నీరు కంఠమునందు నిలిపి అంజలి ఘటించి, తలవంచుకొని ఆ ముని వెనుకనే వచ్చెను. బ్రహ్మదేవుని వెనుక శ్రుతి వచ్చుచున్నట్లు వాల్మీకి వెనుక సీత వచ్చుచుండగా చూచి "బాగు బాగు" అను పెద్ద ధ్వని బయలుదేరెను. అప్పుడు దుఃఖమువలన అత్యధికమైన శోకముతో నిండిన మనస్సులతో అక్కడివాళ్ళు అందరూ కోలాహలము చేసిరి. ఆ ప్రేక్షకులలో కొందరు "రామా బాగు బాగు" అనీ, కొందరు "సీతా బాగు బాగు" అనీ, మరికొందరు "సీతారాములారా బాగు బాగు" అనీ అరచిరి.(10-14)

సీతకు సహాయుడుగా ఉన్న మునిశ్రేష్ఠుడైన వాల్మీకి అప్పుడు జనసముదాయము మధ్య నిలచి రామునితో- "రామా! ఉత్తమనియమవంతురాలూ, ధర్మమును ఆచరించేదీ అయిన ఈ సీతను నీవు లోకాపవాదమువలన నా ఆశ్రమముదగ్గర విడచినావు. గొప్ప వ్రతము గల రామా! లోకాపవాదమువలన భయపడిన నీకు ఈ సీత విశ్వాసయోగ్యమైన ప్రమాణమును చూపగలదు. ఆమెకు అనుమతి ఇమ్ము. కవలలైన ఈ ఇద్దరు సీత పుత్రులు. ఈ ఇద్దరూ నీ కుమారులే. నీకు నేను సత్యము చెప్పుచున్నాను. రామా! నేను ప్రచేతసుని పదవ పుత్రుడను.(లేదా ప్రచేతసుని వంశములో పదవవాడను-పదవ తరమునకు చెందినవాడను) నేను ఎప్పుడూ అసత్యము పలికి ఎరుగను. వీరిద్దరూ నీ పుత్రులు. నేను కొన్ని వేల సంవత్సరములు తపస్సు చేసితిని. ఈ సీతలో దోష మున్నట్లయితే నాకు ఆ తపస్సు ఫలితము లభించకుండుగాక. మనస్సుచేత గాని, కర్మచేతగాని, వాక్కుచేతగాని పూర్వము నేను పాపము చేయలేదు. సీత పాపము లేనిది అయిననే నాకు దాని ఫలము లభించుగాక. రామా! సీత ఐదు జ్ఞానేంద్రియములయందు, మనస్సునందూ కూడ పరిశుద్ధురా లని నేను వనమునందలి సెలయేరు దగ్గర గ్రహించితిని. తెలిసికొని ఆమెను కాపాడితిని. పరిశుద్ధమైన సదాచారము గల, పతినే దేవతగా ఆరాధించు

ఈమె లోకాపవాదమునకు భయపడిన నీకు ప్రత్యయమును ఇవ్వగలదు. అందువలన రామా! ప్రియతమురాలైన ఏ సీతను నీవు పరిశుద్ధురా లని తెలిసికూడ లోకాపవాదమునకు భయపడి విడిచివేసినావో అట్టి ఈ సీత పరిశుద్ధమైన భావము గలది అని నేను దివ్యజ్ఞానముచేత తెలిసికొని నీకు తెలుపుచున్నాను." అని పలికెను.(15-24)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది ఆరవ సర్గము సమాప్తము.**

# తొంబది ఏడవ సర్గము

## సీత శపథము చేయుట. రసాతలములో ప్రవేశించుట.

**వా**ల్మీకి మాటలు విని, రాముడు జనుల మధ్యనున్న సీతను చూచి వాల్మీకికి అంజలి ఘటించి నమస్కరించుచు ఇట్లనెను- "ధర్మవేత్తవైన మహానుభావా! నీవు చెప్పినది యథార్థమే. నీవు చెప్పిన దోషరహితములైన మాటలపై నాకైతే పూర్తి నమ్మక మున్నది. పూర్వము దేవతల సమక్షమున సీత విషయమున నమ్మకము ఏర్పడినది. అక్కడ శపథము కూడ చేయబడినది. అందుచేతనే ఇంటికి తీసికొని వచ్చినాను. మహామునీ! లోకాపవాదము బలవత్తరముగా ఉండుటచేత నేను సీతను విడచితిని. ఈమెలో ఏ పాపమూ లేదని తెలిసికూడ నేను లోకభయము చేత త్యజించితిని. అందుకు నన్ను క్షమించుము. ఈ గాయకులిద్దరూ కవలలుగా పుట్టిన నా పుత్రులని నేను ఎరుగుదును. జనుల మధ్య పరిశుద్ధురాలుగా నిర్ణయించబడిన పిమ్మటనే నాకు సీతయందు ప్రేమ కలుగుగాక."(1-5)

రాముని అభిప్రాయము తెలిసికొని మహేంద్రుడు మొదలైన మహాతేజఃశాలులైన దేవతలందరు ఆ సీతాశపథ సమయమునందు అక్కడికి వచ్చిరి. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, విశ్వదేవతలు, మరుద్గణములు, ఈ సమస్తదేవతలు, సాధ్యులు, సమస్తపరమర్షులు, నాగులు, పక్షులు, సిద్ధులు-వీరందరూ కూడ సంతోషముతో కూడిన మనస్సులతో అక్కడికి వచ్చిరి. అందరూ కూడ సీతాశపథమును గూర్చి కంగారుపడుచు వచ్చిరి. దేవతలను, ఋషులను చూచి రాముడు మరల - "దేవతా శ్రేష్ఠులారా! నాకు దోషరహితములైన వాల్మీకి మాటలయందు నమ్మక మున్నది. కాని జనుల మధ్య పరిశుద్ధయైన సీత పై నాకు ప్రేమ కలుగుగాక." అని



పలికెను.(6-10)

పిమ్మట అక్కడ ఉన్న జనసముదాయమునకు, శుభము, పుణ్యము, దివ్యగంధము గలది, మనోహరము అయిన వాయువు ఆనందము కలిగించెను. సమస్త రాష్ట్రములనుండి వచ్చిన మానవులు, పూర్వము కృతయుగమునందు వలె ఊహింపశక్యము కాని ఆశ్చర్యమును చూచినట్లు దానిని సావధానచిత్తులై చూచిరి.(11, 12)

కాషాయవస్త్రమును ధరించి ఉన్న సీత అక్కడికి వచ్చిన అందరినీ చూచి, అంజలి ఘటించి, తలవంచి, క్రిందికి చూచుచు ఇట్లు పలికెను- "నేను రాముణ్ణి తప్ప మరెవ్వనినీ మనసా కూడ స్మరించనిచో భూదేవి నాకు వివరము నిచ్చుగాక. నేను మనోవాక్కాయములచేత రాముణ్ణి మాత్రమే పూజించినట్లయితే నాకు భూదేవి వివరమును ఇచ్చుగాక. నేను ఇప్పుడు చెప్పినది అంతా సత్యమైతే, నేను రాముడు తప్ప మరొకరిని ఎరుగకపోయినచో భూదేవి నాకు వివరము ఇచ్చుగాక."(13-16)

సీత ఆ విధముగా శపథము చేయుచుండగా అత్యుత్తమము, అద్భుతమూ అయిన ఒక దివ్యమైన సింహాసనము భూతలమునుండి పైకి లేచెను. అద్భుతమైన ఆకారముతో ప్రకాశించుచున్న ఆ సింహాసనమును దివ్యములైన రత్నములచే అలంకరింపబడిన, అమితమైన బలము గల సర్పములు తమ శిరస్సులపై

మోయుచుండెను. ఆ సింహాసనమునందున్న భూదేవి సీతను బాహువులతో పట్టుకొని, "వత్సా! రమ్ము" అని స్వాగతముతో ఆమెను అభినందించి సింహాసనముమీద కూర్చుండబెట్టుకొనెను. సింహాసనమునందు కూర్చుండి రసాతలములోనికి ప్రవేశించుచున్న సీతను చూడగానే దివ్యమైన పుష్పవృష్టి అవిచ్ఛిన్నముగా పడెను. (17-20)

"సీతా! నీ శీలము ఎంత గొప్పది! బాగు, బాగు." అని దేవతలు పలికిన సాధువాదము వెంటనే బిగ్గరగా వినబచ్చెను. ఆకాశమునందున్న దేవతలు సీత రసాతలప్రవేశమును చూచి సంతోషించిన మనస్సులతో ఇట్లు అనేక విధములైన మాటలు పలికిరి. యజ్ఞప్రదేశమునం దున్న అందరు మునులకు, రాజులకు, ఉత్తములైన ఇతరజనులకు కూడ ఆశ్చర్యము తగ్గలేదు. ఆకాశమునం దున్నవారిలోను, భూమిమీద ఉన్న స్థావరజంగమములలోను, పెద్దశరీరములు గల దానవులలోను, పాతాలములో ఉన్న నాగనాయకులలోను కొందరు సీత పాతివ్రత్యమునకు సంతోషించి బిగ్గరగా అరచిరి. కొందరు ఆలోచనలో పడిరి. కొందరు కలతచెందిన మనస్సులతో రాముణ్ణి, కొందరు సీతను చూచుచుండిరి. సీత రసాతలములో ప్రవేశించుట చూచి జగత్తు అంతా కలత చెందెను. ముహూర్తకాలముపాటు స్పృహ తప్పినట్లు అయి నిఃశబ్దముగా ఉండిపోయెను. (21-26)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది ఏడవ సర్గము సమాప్తము.**

# తొంబది ఎనిమిదవ సర్గము

## సీతకై రాముని శోకము, బ్రహ్మదేవుడు ఓదార్చి ఉత్తరకాండ శేషమును వినుమని చెప్పుట.

సీత రసాతలములో ప్రవేశించుట చూచి వానరులు దుఃఖముతో అరచిరి. రాముని ప్రక్కనున్న మునులు ఆమెను కొనియాడుచు "బాగు బాగు" అనిరి. రాముడు యజ్ఞదీక్షలో ఉన్నప్పుడు చేతిలో ఉంచుకొనవలసిన పలాశదండమును ఆనుకొని, కన్నీళ్ళచేత నేత్రములు వ్యాకులములు కాగా, తల క్రిందికి వంచి, దీనమైన మనస్సుతో చాల దుఃఖితుడయ్యెను. (1, 2)

రాముడు చాలసేపు దుఃఖించి అధికముగా కన్నీరు కార్చుచు, క్రోధశోకములతో

కూడినవాడై ఇట్లనెను- "రూపము దాల్చిన లక్ష్మివంటి సీత నేను చూచుచుండగానే అదృశ్యురా లగుటచే పూర్వ మెన్నడూ లేని శోకము నా మనస్సులో ప్రవేశించ దలచుచున్నట్లు ఉన్నది. నేను చూడనప్పుడు ఆమెను రాక్షసుడు మహాసముద్రము అవతలి ఒడ్డున లంకకు అపహరించుకొనిపోయినాడు. అక్కడినుండియే నేను తీసుకొనివచ్చితిని, భూమినుండి వేరే చెప్పవలెనా? పూజ్యురాలవైన భూదేవీ! నాకు సీతను తిరిగి ఇచ్చివేయుము. అట్లుకానిచో నేను ఎట్టివాడినో నీకు తెలిసే విధముగా కోపము చూపెదను. నీవు నాకు తప్పక అత్తగారివే. ఎందుచేత ననగా పూర్వము నాగలి దున్నుచున్న జనకుడు నీనుండియే సీతను పైకి తీసినాడు. అందువలన సీతనైనా తిరిగి ఇమ్ము, లేదా నాకు కూడ వివరమును ఇమ్ము. పాతాలములో నైనా, స్వర్గములో నైనా నేను ఆమెతో కలిసియే నివసించెదను. ఆ సీతను నాకు తీసికొని రమ్ము, నేను ఆమెకోసము ఉన్మత్తుడనైతిని. భూమిలో ఉన్న సీతను ఆమె పూర్వ మెట్లు ఉండెడిదో అట్లు ఇవ్వకపోయినచో పర్వతములతోను, అరణ్యములతోను కూడిన నీ స్థితిని తారుమారు చేసెదను. ఈ భూమిని నశింపచేసెదను. అంతా జలమయము అగుగాక."(3-10)

క్రోధశోకములతో కూడిన రాము డీవిధముగా పలుకుచుండగా, దేవగణములతో కూడిన బ్రహ్మదేవుడు రామునితో ఇట్లనెను- "రామా! రామా! ఉత్తమములైన నియమములు కలవాడా! దుఃఖించకుము. నీ పూర్వము స్వరూపమును, ఆలోచనను స్మరించుము. నేను నిన్ను స్మరింపచేయుటలేదు. ఈ క్షణమునందు నీవు వైష్ణవజన్మను గూర్చి స్మరించుము. మాలిన్యము లేనిది, పతివ్రతా అయిన సీత నీ పూర్వరూపమును కోరుచు, నీ ఆశ్రయ మనే తపస్సుయొక్క బలమువలన సుఖముగా నాగలోకమునకు వెళ్ళినది. నీకు మరల ఆమె సంగమము స్వర్గములో కలుగును, సంశయము లేదు. ఈ పరిషత్తు మధ్యలో నేను చెప్పుచున్న మాట వినుము.(11-15)

రామా! నీవు వినిన అన్ని కావ్యములలోను ఉత్తమమైన ఈ కావ్యమే నీకు విపులముగ స్పష్టముగా చెప్పగలదు, సంశయము లేదు. వీరుడా! నీ జన్మ మొదలు నీకు కలిగిన సుఖదుఃఖముల అనుభవమును, రాబోవు వృత్తాంతమునూ అంతనూ కూడ వాల్మీకి ఈ కావ్యములో నిబంధించినాడు. ఈ ఆదికావ్యమంతా నీకే సంబంధించి యున్నది. రాముడు తప్ప కావ్యయశస్సును పొందతగినవాడు మరొకడు లేదు కదా? దివ్యమూ, ఆశ్చర్యకరమూ, సత్యమూ అయిన ఏ వృత్తాంతమునూ దాచని ఈ కావ్యమును పూర్తిగా నేనూ దేవతలూ కలసి విని ఉన్నాము. పురుషశ్రేష్ఠుడ వైన రామా! నీవు ధర్మానుసారముగా, సావధానచిత్తుడవై రామాయణములోని రాబోవు

కథను చెప్పు మిగిలిన భాగమును వినుము. ఈ కావ్యములోని మిగిలిన భాగమునకు ఉత్తరభాగము అని పేరు. గొప్ప తేజస్సు గల రామా! ఉత్తమమైన దానిని ఋషులతో కలసి వినుము. రామా! ఉత్తమమైన ఈ భాగము మరొకరు ఎవరూ వినగూడదు. వీరుడవైన రామా! గొప్ప రాజర్షివైన నీవే(ముందుగా) వినవలెను."(16-22)

ముల్లోకములకు ప్రభువైన బ్రహ్మదేవుడు ఇట్లు పలికి బంధువులతో కూడిన దేవతలతో కూడ కలసి స్వర్గమునకు వెళ్ళిపోయెను. బ్రహ్మలోకమునకు సంబంధించిన మహాతేజఃశాలులైన ఋషులందరూ బ్రహ్మ అనుజ్ఞ తీసుకొని ఉత్తరకథ వినుటకై వెనుకకు తిరిగి వచ్చిరి. రామాయణములోని ఉత్తరభాగమును, రామునికి భవిష్యత్తులో ఏమి జరుగ నున్నదో దానిని వినుటకై తిరిగి వచ్చిరి. గొప్ప తేజస్సు గల రాముడు బ్రహ్మదేవుడు పలికిన శుభమైన వాక్కును విని వాల్మీకితో ఇట్లనెను-(23-25)

(కొన్ని ప్రతులలో ఉన్న అధికపాఠం సీత విశ్వాంతర్గతమైన మహాశక్తి అని బోధించుచున్నది- "ఇంతలో భూమిలోపలినుండి ఒక వాణి వినబడెను. "రామా! నీవు తాపము విడిచిపెట్టుము; ఇందుకు దైవమే కారణము. నీవు సీత కావాలని కోరుచున్నావు. ఇది వృథాపరితాపమే. ఆమె దర్శనము లభించదు. ఆమె మూడు లోకాలను వ్యాపించి ఉన్నది. ఇక్కడ ఉన్న ఆమెను నాగులు పూజించుచుందురు. మానవలోకములో మానవులు పూజించుచుందురు. ఈమె పితృదేవతలకు తృప్తి నిచ్చు స్వధ. స్వర్గములో అమృతమును భుజించు దేవతల తృప్తి ఈమె స్వరూపమే. మహావిష్ణువు దేహమునందు ఈమెయే లక్ష్మిగా ప్రతిష్ఠిత అయి ఉన్నది. స్వర్గములో ఉన్న సిద్ధపురుషుల సిద్ధిగా ప్రతిష్ఠిత అయి ఉన్నది. రామా! సీతను చూడవలెననే ప్రయత్నమును విరమించుకొనుము. సీతను చూడవలె నని ఉన్నచో పుత్రులైన కుశీ(శ)లవులను చూచుకొనుము.") (ఈ దృష్టితో చూస్తే సీతారాములు అప్పుడు ఉండేవారు, ఇప్పుడూ ఉన్నారు; ఎప్పుడూ ఉంటారు. అంతటా ఉన్నారు, ఉంటారు.)

"పూజ్యుడా! బ్రహ్మలోకమునకు చెందిన ఈ ఋషులు నాకు జరగబోవు దానిని వినవలె నను కోరికతో ఉన్నారు. దాని గానము రేపు జరుగుగాక." ఇట్లు నిశ్చయము చేసి, ఆ జనుల నందరినీ పంపివేసి కుశలవులను తీసికొని, పర్ణశాలలోనికి వెళ్ళెను. ఆ సీతను గూర్చిన ఆలోచనతోనే ఆ రాత్రి గడిచిపోయెను.(26-28)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# తొంబది తొమ్మిదవ సర్గము

**సీత రసాతలములో ప్రవేశించిన పిమ్మట రామరాజ్యములోని పరిస్థితులు.**

రాత్రి తెల్లవారిన పిమ్మట రాముడు మహామునులను పిలిపించి "మీరు ఏమాత్రము సంకోచము చెందక గానము చేయండి." అని పుత్రులకు చెప్పెను. మహాత్ములైన మహర్షులు కూర్చున్న పిమ్మట ఆ కుశలవులు జరుగబోవు కథను చెప్పు ఉత్తరకావ్యమును గానము చేసిరి. (1, 2)

సత్యప్రభావముచేత సీత రసాతలములో ప్రవేశించిన పిదప, యజ్ఞము పూర్తియైన తరువాత రాముడు చాల శోకాక్రాంతుడయ్యెను. సీత కనబడకపోవుటచే అతనికి ఈ జగత్తు శూన్యముగా కనబడెను. శోకముచేత తప్పుడై మనఃశాంతిని పొందజాలకపోయెను. (3,4)

రాముడు యథావిధిగా యజ్ఞము పూర్తిచేసుకొని, ఋక్ష–వానర–రాక్షసుల నందరినీ పంపివేసి, బ్రాహ్మణ శ్రేష్ఠులకు ధనదానము చేసి వారిని కూడ పంపివేసి, ఇతర జనులను అందరినీ కూడ పంపివేసి మనస్సులో సీతను గూర్చియే తలచుచు అయోధ్యలో ప్రవేశించెను. (5,6)

ఆ రాజు ఇద్దరు పుత్రులతో కలసి అయోధ్యలో ప్రవేశించెను. అతడు సీతను తప్ప మరెవ్వరినీ భార్యనుగా స్వీకరించలేదు. ప్రతియజ్ఞమునందూ కూడ పత్నీకార్యములు చేయుటకు బంగారు సీత ఉండెను. పదివేల సంవత్సరములు ఎన్నో అశ్వమేధయాగములను, వాటికి పదిరెట్లు, అత్యధికమైన బంగారము దక్షిణగా ఇచ్చిన వాజపేయయాగములను చేసెను. శ్రీమంతుడైన రాముడు అగ్నిష్టోమము, అతిరాత్రము, అధికమైన ధనము గల(ధనవ్యయము జరుగు) గోసవము లను యజ్ఞములు, పరిపూర్ణదక్షిణ లిచ్చిన ఇతర యజ్ఞములు చేసెను. మహాత్ముడైన రాముడు ఈ విధముగా రాజ్యపాలనము చేయుచు, ధర్మమును రక్షించుటకై ప్రయత్నించుచుండగా అతిదీర్ఘమైన కాలము గడచెను. భల్లూకములు, వానరులు, రాక్షసులు కూడ రాముని శాసనములో ఉండిరి. సామంతరాజులు ప్రతిదినమూ కూడ రామునకు ఆనందము కలిగించుచుండిరి. (7–12)

సుభిక్షముగా ఉండునట్లు మేఘము కాలమునందు వర్షించుచుండెను. దిక్కులు నిర్మలములుగా ఉండెను. నగరములు, గ్రామములూ కూడ ఆనందముతో పుష్టిగా ఉన్న జనులతో నిండి ఉండెను. రాముడు రాజ్యమును పాలించుచుండగా ఎవ్వనికీ

అకాలమరణము రాలేదు. ప్రాణులకు వ్యాధులు లేవు. ఎట్టి అనర్థములూ కలుగలేదు.(13, 14)

పుత్రపౌత్రులతో ఆనందించుచున్న కీర్తిమంతురాలైన కౌసల్య చాలకాలమునకు మరణించెను. కీర్తిగల సుమిత్ర, కైకేయీ కూడ అనేకవిధములైన ధర్మములు చేసి కౌసల్యను అనుసరించి వెళ్ళి స్వర్గములో ఉండిరి. మహాభాగ్యవతులైన వారు ముగ్గురూ స్వర్గములో దశరథమహారాజుతో కలసి సంతోషించుచు సకలధర్మములచేత లభించు సౌఖ్యమును అనుభవించిరి. రాముడు ఆ యా సమయములయందు తల్లులందరికీ తృప్తి కలుగుటకై, భేదబుద్ధిలేకుండగా, తపస్సంపన్నులైన బ్రాహ్మణులకు మహాదానము లిచ్చుచుండెను. ధర్మాత్ముడైన రాముడు పితృదేవతలసంతృప్తికొరకై బ్రాహ్మణులకు అనేకములైన మంచి వస్తువులను దానము చేసెను; పూర్తిచేయుటకు చాలా కష్టమైన యజ్ఞములు చేసెను. ఈ విధముగా అతడు యజ్ఞముచేత అనేకవిధములైన ధర్మమును వృద్ధిపొందించుచుండగా, చాల వేల సంవత్సరములు సుఖముగా గడచినవి.(15-20)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని తొంబది తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# నూరవ సర్గము

## భరతుడు రాముని ఆజ్ఞచేత, ఇద్దరు కుమారులతో కలసి గంధర్వదేశమును ఆక్రమించుటకు వెళ్ళుట.

**త**రువాత కొంత కాలానికి కేకయదేశరాజైన యుధాజిత్తు మహాత్ముడైన రాముని వద్దకు తన గురువు, అంగిరసుని పుత్రుడు, గొప్ప తేజస్సు గలవాడు, బ్రహ్మర్షీ అయిన గార్గ్యుణ్ణి పంపెను. ఆ రాజు రామునకు పదివేల అశ్వములను, కంబలములను, రత్నములను, ఉత్తమములైన రంగురంగుల వస్త్రములను, అందమైన ఆభరణములను కానుకగా పంపెను.(1-3)

బుద్ధిమంతుడైన కకుత్స్థవంశీయుడైన రాముడు మహర్షి యైన గార్గ్యుడు వచ్చినట్లు విని, మేనమామయైన అశ్వపతి పంపిన ఆ మహాధనమును గూర్చి విని, తమ్ములతో కలసి క్రోశుదూరము ఎదురువెళ్ళి, ఇంద్రుడు బృహస్పతిని పూజించినట్లు పూజించెను.(4,5)

రాముడు ఆ ఋషిని ఆ విధముగా పూజించి, ఆ ధనము తీసుకొని మేనమామ కుశలమును గూర్చి మాటిమాటికి అడిగి, కూర్చున్న అతనిని ప్రశ్నించుటకు ఉపక్రమించి– “మా మేనమామ ఏమి చెప్పి పంపగా మాటలలో నేర్పుగలవారిలో శ్రేష్ఠుడవైన, పూజ్యుడవైన నీవు, సాక్షాత్తు బృహస్పతి వలె ఇక్కడకు వచ్చినావు?” అని అడిగెను.(6, 7)

మహర్షి రాముని మాటలు విని అద్భుతమైన పెద్ద కార్యమును గూర్చి చెప్పుటకు ఉపక్రమించెను– “గొప్ప బాహుబలము గల నరశ్రేష్ఠుడా! నీ మేనమామయైన యుధాజిత్తు ప్రేమపూర్వకముగా పలికిన మాటలను ఇష్టమైనచో వినుము. “(మా దేశము దగ్గర) సింధునదికి రెండు ప్రక్కలా ఉన్న, గంధర్వనివాసమైన, ఫలమూలములతో ప్రకాశించుచున్న ఈ దేశము చాలా అందమైనది. శైలూషు డనే గంధర్వుని వంశమునకు చెందిన, ఆయుధధారులు, యుద్ధవిశారదులు, గొప్ప బలము గలవారు అయిన, మూడు కోట్లమంది గంధర్వులు ఆ దేశమును రక్షించుచున్నారు. గొప్ప బాహుబలము గల రామా! నీవు ఆ గంధర్వులను, గంధర్వనగరమును జయించి ఆ స్థానమునందు నీకు సంబంధించిన రెండు నగరములను చక్కగా నిర్మించుము. మహాబాహూ! చాలా సుందరమైన ఆ దేశము నీకు ఇష్ట మగుగాక, మరొకరు ఎవరూ దానిని ఆక్రమింపజాలరు. నేను నీకు అహితమును చెప్పను.”(8–13)

రాముడు మేనమామ సందేశమును మహర్షి ద్వారా విని “తప్పక అట్లే చేసెదను.” అని పలికి భరతుని వైపు చూచెను. రాముడు సంతోషించి, అంజలి ఘటించి ఆ బ్రాహ్మణునితో ఇట్లనెను. “బ్రహ్మర్షీ! తక్షుడు, పుష్కలుడు అను భరతపుత్రులైన, వీరులైన ఈ కుమారు లిద్దరూ మా మేనమామచే రక్షింపబడుచు, ధర్మమునందు సావధానచిత్తులై ఆదేశములో సంచరించగలరు. ఈ కుమారులిద్దరూ భరతుణ్ణి ముందు ఉంచుకొని సైన్యముతోను అనుచరులతోను కలసి వెళ్ళి, గంధర్వులను సంహరించి రెండు పట్టణములను విభజించుకొనగలరు. పరమధార్మికుడైన భరతుడు రెండు పురములను నిర్మించి, పుత్రులను అచట నిలిపి, మరల నా వద్దకు రాగలడు.”(14–18)

రాముడు మహర్షితో ఇట్లు పలికి, సైన్యముతోను, అనుచరులతోను కూడిన భరతుణ్ణి ఆదేశించి అప్పుడు ఆ పురద్వయ రాజ్యమునందు ఆ కుమారులిద్దరికీ అభిషేకము చేసెను. భరతుడు అంగిరసుని పుత్రుడైన ఆ గార్గ్యుణ్ణి ముందు ఉంచుకొని, శుభనక్షత్రమునందు సైన్యముతోను కుమారు లిద్దరితోను బయలుదేరెను. దేవతలు కూడ ఎదిరింపజాలని ఆ సైన్యమును కొంతదూరము వరకు రాముడు

అనుసరించి వెళ్ళగా అది ఇంద్రునితో కూడిన సైన్యమువలె నగరమునుండి బయల్వెడలెను. మాంసమును తినే జంతువులు, గొప్ప రాక్షసులు రక్తము త్రాగవలెనను ఇచ్ఛతో భరతుని వెంట వెళ్ళెను. మాంసమును భుజించే క్రూరములైన వేలకొలది భూతసముదాయములు కూడ గంధర్వపుత్రుల మాంసములను తినుటకై భరతుని వెంట వెళ్ళెను. ఎన్నోవేల సింహములు, వ్యాఘ్రములు, అడవిపందులు, ఆకాశము నందు సంచరించు పక్షులూ సేనకు ముందు వెళ్ళినవి. మార్గములో ఒకటిన్నర మాసములు ప్రయాణము చేసి, ఉత్సాహవంతులైన, పుష్టిగా ఉన్న జనులతో నిండిన ఆ సేన, ఏ రోగబాధాదులు లేక కేకయదేశమును చేరెను.(19-25)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూరవ సర్గము సమాప్తము.**

# నూట ఒకటవ సర్గము

## భరతుడు గంధర్వులను సంహరించి, రెండు పురములను నెలకొల్పి, పుత్రులకిచ్చి అయోధ్యకు తిరిగి వచ్చుట.

కేకయదేశరాజైన యుధాజిత్తు గార్గ్యునితో కూడ సైన్యమునకు నాయకుడై భరతుడు వచ్చినట్లు విని చాల సంతోషించెను. యుధాజిత్తు గొప్ప జనసముదాయముతో కలసి బయలుదేరి స్వేచ్ఛారూపధారులైన గంధర్వులమీదికి శీఘ్రముగా వెళ్ళెను. భరతుడు యుధాజిత్తు కలసి, సైన్యముతోను అనుచరులతోను కూడ శీఘ్రముగా గంధర్వనగరము చేరిరి.(1-3)

ఆ గంధర్వులు భరతుడు వచ్చినట్లు విని యుద్ధము చేయవలెనను కోరికతో ఒక చోట చేరి, అన్నివైపులా బిగ్గరగా గర్జించిరి. వ్యాకులము, రోమాంచమును కలిగించేది, చాల భయంకరమూ అయిన యుద్ధము ఏడు రోజులు జరిగెను. కాని ఏ పక్షము వారికీ జయము రాలేదు. ఖడ్గములు, శక్తులు, ధనుస్సులు, అను మొసళ్ళతో, రక్తప్రవాహములతో నిండి మనుష్యుల మృతదేహములు కొట్టుకొని రాగా నదులు అన్ని దిక్కులయందు ప్రారంభమైనవి. భరతుడు కోపించి ఆ గంధర్వులపై చాల భయంకరమైన కాలాగ్న్యస్త్రమైన సంవర్త మను అస్త్రమును ప్రయోగించెను. మహాత్ముడైన ఆ భరతుడు క్షణకాలములో మూడుకోట్ల గంధర్వులను కాలపాశముచేత పట్టి సంవర్తముచేత చీల్చి చంపివేసెను. భరతుడు ఒక్కనిమిషము కాలములో ఎట్టి యుద్ధమును చేసెనో అట్టి ఘోరమైన మరియొక యుద్ధమును దేవతలు కూడ

స్మరించలేదు. (4-9)

వాళ్ళందరినీ సంహరించి భరతుడు సుసమృద్ధములైన రెండు పురములను నిర్మింపచేసెను. భరతుడు గంధర్వదేశములోని తక్షశిల అను పురములో తక్షుణ్ణి, గాంధారదేశమునందు పుష్కలావతపురమునందు పుష్కలుణ్ణి రాజునుగా చేసెను. ఆ పురములు రెండూ ధనములతోను, రత్నములతోను నిండి ఉన్నవి. గుణముల సముదాయములచేత ఒక దానితో ఒకటి పోటీపడు నట్లు నిర్మింపబడినవి. ఆ రెండు నగరములూ కూడ పాపరహితములైన వ్యవహారములచే చాల సుందరములుగా ఉన్నవి. ఉద్యానములతోను, వాహనాలతోను నిండియున్నవి. వేరువేరుగా ఉన్న విశాలమైన విపణివీథులు కలవి. శ్రేష్ఠములైన ఆ రెండు పురములూ కూడ అనేకవస్తుసంపదలతో ప్రకాశించుచున్నవి. అవి ముఖ్యములైన గృహములతోను, అనేకవిమానములతోను కూడినవి. అందమైన విశాలములైన దేవాలయములతోను, తాల-తమాల-తిలక-వకులవృక్షములతోను ప్రకాశించుచున్నవి. (10-15)

భరతుడు ఐదు సంవత్సరములలో ఆ పురములను ఏర్పరచి తిరిగి అయోధ్యకు వచ్చి సాక్షాత్తు మరొక ధర్మము వలె ఉన్న ఆ రామునకు, ఇంద్రుడు బ్రహ్మదేవునకు నమస్కరించునట్లు నమస్కరించి గంధర్వవధను, పురనిర్మాణములను గూర్చి, జరిగినది జరిగినట్లుగా, అతనికి తెలిపెను. రాముడు విని అతని విషయమున సంతోషించెను. (16-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట ఒకటవ సర్గము సమాప్తము.**

# నూట రెండవ సర్గము

## రాముని ఆజ్ఞచే భరతలక్ష్మణులు కారుపథమునందు వేరు వేరు రాజ్యములలో లక్ష్మణ పుత్రులైన అంగద-చంద్రకేతువులను నియమించుట.

భరతుని మాటలు విని సోదరులతో కూడిన రాముడు సంతోషించెను. రాముడు సోదరులతో- "లక్ష్మణా! నీ కుమారులైన ఈ అంగదుడూ, చంద్రకేతువూ కూడ ధర్మము తెలిసినవారు. రాజ్యమునకు తగిన దృఢపరాక్రమము కలవారు. వీరిద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసెదను. ధనుర్ధరులైన వీరిద్దరూ సుఖముగా ఉండుటకు తగిన, అందమైన, జనసంమర్దము లేని దేశమును బాగా ఆలోచించి

నిర్ణయించుడు. సౌమ్యుడా! ఏ దేశమునందు ఇతరరాజులకు బాధకలుగదో, ఆశ్రమములు నశించవో, అట్టి దేశమును, మన అపరాధము ఏమీ ఉండని విధమున అన్వేషించుము." అని చెప్పెను.(1-4)

రాముని మాటలు విని భరతుడు - "ఈ కారుపథదేశము సుందర మైనది, రోగములు లేనిది. అక్కడ మహాత్ముడైన అంగదునకు పురము నిర్మింపబడుగాక. చంద్రకేతువునకు చాల అందమైన, రోగాదులు లేని చంద్రకాంతపురము నిర్మింపబడుగాక." అని చెప్పెను. రాముడు భరతుడు చెప్పినది అంగీకరించి ఆ దేశమును స్వాధీనము చేసుకొని అంగదుని కొరకు ఏర్పాటు చేసెను. అంగదునికొరకై సుందరము, సురక్షితమూ అయిన అంగదీయపురమును నిర్మించెను. మల్లుడైన చంద్రకేతువుకొరకై అమరావతి వలె దివ్యమైన, చంద్రకాంత అని ప్రసిద్ధి పొందిన నగరి మల్లభూమియందు స్థాపింపబడెను. అప్పుడు రామలక్ష్మణభరతులు చాల సంతోషించి వారిద్దరికీ అభిషేకము చేసిరి.(5-10)

రాముడు ఆ కుమారులిద్దరికీ అభిషేకము చేసి అంగదుని పశ్చిమప్రాంతమునకును, చంద్రకేతువును ఉత్తరప్రాంతమునకు పంపెను. లక్ష్మణుడు అంగదుని వెంట వెళ్ళెను. చంద్రకేతువు వెంట భరతుడు వెళ్ళెను. లక్ష్మణుడు అంగదీయములో ఒక సంవత్సరము ఉండి పుత్రుడు ఎవరి చేతా ఎదిరింపశక్యము కానివాడుగా స్థిరపడిన తరువాత అయోధ్యకు తిరిగి వచ్చెను. భరతుడు కూడ అట్లే సంవత్సరముకంటె కొంచెము అధికముగా చంద్రకేతువు దగ్గర ఉండి అయోధ్యకు తిరిగి వచ్చి రాముని పాదములను ఉపాసించెను.(11-14)

రామపాదసేవాతత్పరులైన, చాల ధార్మికులైన లక్ష్మణభరతు లిద్దరూ స్నేహము వలన ఎంతకాలము గడచినను గుర్తించలేదు. ఈ విధముగా వారు ధర్మమార్గతత్పరులై, నిత్యము పౌరుల కార్యములు చూచుటకు ప్రయత్నించుచుండగా పదివేల సంవత్సరములు గడచినవి. ధర్మసాధనమైన అయోధ్యాపురములో నివసించుచు, చాలకాలము గడిపి, పరిపూర్ణములైన మనస్సులతో కూడిన లక్ష్మీసంపన్నులైన ఆ రామలక్ష్మణభరతులు ముగ్గురూ మహాయజ్ఞములో చక్కగా హోమము చేయగా ప్రజ్వరిల్లుచున్న మూడు అగ్నులవలె ప్రకాశించుచుండిరి.(15-17)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట రెండవ సర్గము సమాప్తము.**

# నూట మూడవ సర్గము

**రాముని వద్దకు కాలపురుషుడు వచ్చి ఒక సమయము (షరతు) పెట్టి రామునితో మాటలాడుట.**

రాముడు ఈ విధముగా ధర్మపరుడై ఉంటుండగా, కొంతకాలమునకు కాలపురుషుడు మునిరూపములో రాజద్వారమునకు వచ్చెను. అతడు లక్ష్మణునితో– "నేను ఎంతో ముఖ్యమైన పనిమీద వచ్చినానని రామునితో చెప్పుము. గొప్పబలము కలవాడా! నేను అమితమైన తేజస్సు గల, గొప్పబలము గల మహర్షి(బ్రహ్మదేవుని) దూతను. ఒక పనిమీద రాముణ్ణి చూచుటకై వచ్చినాను." అని పలికెను. లక్ష్మణుడు అతని మాటలు విని తొందరపడుచు వెళ్ళి ఆ ముని వచ్చినట్లు రామునకు తెలిపెను– "గొప్ప కాంతి గలవాడా! రాజధర్మముచేత రెండు లోకములను జయించుము. తపస్సుచేత సూర్యునివంటి కాంతిగల దూత నిన్ను చూచుటకు వచ్చినాడు" అని చెప్పెను. లక్ష్మణుని మాటలు విని రాముడు– "నాయనా! ముందుగానే సత్కరించి ఆ మునిని లోపలికి తీసుకొనిరమ్ము." అని పలికెను. (1-6)

లక్ష్మణుడు "అట్లే చేసెదను" అని పలికి తేజస్సుచేత మండుచున్నాడా అన్నట్లు, కిరణములచేత కాల్చుచున్నాడా అన్నట్లు ఉన్న ఆ మునిని లోపల ప్రవేశపెట్టెను. ఆ ఋషీశ్వరుడు తేజస్సుతో ప్రకాశించుచున్న ఆ రాముణ్ణి సమీపించి మధురమైన వాక్కుతో– "వృద్ధిపొందుము" అని పలికెను. గొప్ప తేజస్సు గల రాముడు ఆ మునీశ్వరునకు అర్ఘ్యము మొదలైన పూజను సావధానచిత్తముతో ఇచ్చి కుశలప్రశ్న వేయుటకు ఆరంభించెను. రాముడు కుశలప్రశ్న చేయగా మాటలాడువారిలో శ్రేష్ఠుడైన ఆ ముని దివ్యమైన బంగారు ఆసనముమీద కూర్చుండెను. (7-10)

పిమ్మట రాముడు అతనితో– "మహామునీ! నీకు స్వాగతము. నీవు ఎవరి దూతగా వచ్చినావో అతని మాటలు వినిపించుము (చెప్పుము)" అనెను. రామునిచేత ప్రేరేపింపబడిన ఆ ముని– "నీవు హితమును కోరినచో ఇది రహస్యమునందే చెప్పదగినది. మునులలో ముఖ్యుడైన మహర్షి వచనమును నీవు మన్నించినచో మన మాటలను ఎవడు వినునో, లేదా మాటలాడుకొనుచున్న మనలను చూచునో అతనిని నీవు చంపవలెను." అని పలికెను. (11-13)

రాముడు అట్లే అని ప్రతిజ్ఞ చేసి లక్ష్మణునితో– "మహాబాహూ! ద్వారపాలకుణ్ణి పంపివేసి ద్వారమునందు నిలచి ఉండుము. లక్ష్మణా! నేనూ ఈ ఋషీ

రహస్యమునందు మాటలాడుకొనుచుండగా ఎవడు చూచునో లేదా వినునో అతనిని చంపివేయవలసి ఉండును." అని పలికి, లక్ష్మణుణ్ణి ద్వారమునందు రక్షకుణ్ణిగా ఉంచి మునితో - "మునీ! ఆ వాక్యమును చెప్పుము, దేనిచేత ఇక్కడకు వచ్చినావో నీ కిష్టమైన ఆ వాక్యమును ఎట్టి శంకా లేకుండా చెప్పుము. నా మనస్సులో కూడ వినవలె నని ఉన్నది.(నేను కూడ ఆవిషయమే ఆలోచించుచున్నాను.)" అనెను.(14-17)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట మూడవ సర్గము సమాప్తము.**

# నూట నాలుగవ సర్గము

## కాలపురుషుని నుండి బ్రహ్మదేవుని సందేశమును విని రాముడు అంగీకరించుట.

రాజా! నేను ఎందుకు వచ్చితినో వినుము. నన్ను బ్రహ్మదేవుడు పంపినాడు. నేను పూర్వావస్థయందు నీవు సంకల్పముచే పుట్టించిన, సకలసంహారకర్తయైన, నీ పుత్రుడైన కాలమును. లోకముల అధిపతి, సర్వసమర్థుడు, భగవంతుడు అయిన బ్రహ్మదేవుడు - "సౌమ్యా! లోకములను రక్షించుటకై నీవు ఒక అంగీకారము చేసి వున్నావు. పూర్వము నీవు మాయాబలముచేత లోకములన్నింటిని స్వయముగానే అదృశ్యములను చేసి మహాసముద్రములో శయనించి ఉండి ముందుగా నన్ను సృష్టించినావు. పిమ్మట నీవు మాయాబలముచేత పెద్ద పడగలు గల, ఉదకనివాసియైన ఆదిశేషుణ్ణి సృష్టించి మహాబలవంతులైన మధుకైటభు లను రెండు గొప్ప ప్రాణులను సృష్టించితివి. వాళ్ళ ఎముకలతో వ్యాప్తమైన ఈ భూమి పర్వతములతో నిండెను. నీ నాభియందు సూర్యునితో సమానమైన దివ్యమైన పద్మమునందు నన్ను సృష్టించి నీవు ప్రజాప్రతిత్వమును పూర్తిగా నాకు అప్పగించినావు. ప్రజాపతిత్వభారమును నీవు నాపై ఉంచగా నేను జగత్పతివైన నిన్ను ఉపాసించి, "నాకు తేజస్సును ఇచ్చినవాడవు. నీవే; సమస్తభూతములను రక్షించుము." అని నిన్ను ప్రార్థించితిని. అప్పుడు నీవు ప్రాణులను రక్షించుటకై సనాతనము, ఎదిరింపశక్యముకానిదీ అయిన ఆ హిరణ్యగర్భస్థితినుండి విష్ణుత్వమును పొందినావు.(1-9)

అదితియందు మహాపరాక్రమశాలియైన పుత్రుడుగా (ఉపేంద్రుడుగా) పుట్టి

సోదరులైన దేవతల పరాక్రమమును వృద్ధిపొందించుచు, పనులు వచ్చినప్పుడు వాళ్ళకి సహాయము చేయుచుందువు. జగత్తులో శ్రేష్ఠుడా! అట్టి నీవు, ప్రజలు రావణునిచేత హింసింపబడుచుండగా, రావణుని సంహరించుటకై మనుష్యజన్మ ఎత్తుటకు సంకల్పించితివి. పదకొండువేల సంవత్సరములు భూలోకములో ఉండెద నని స్వయముగానే నియమము ఏర్పరుచుకొని మానవుడుగా జన్మించితివి. స్వసంకల్పముచేత (దశరథ) పుత్రుడుగా పుట్టిన నీకు మనుష్యులలో పూర్ణాయుర్దాయము పూర్తి అయినది. అందుచేత, నరవరులలో శ్రేష్ఠుడా! ఇక నీవు మా దగ్గరకు తిరిగి వచ్చుటకు కాలము వచ్చినది. మహారాజా! ఇంకను ప్రజలను రక్షించవలెనని నీకున్నచో అక్కడనే ఉండుము. నీకు క్షేమము అగుగాక- రామా! అట్లుకాక సురలోకమును పాలించు అభిలాష ఉన్నచో దేవతలు విష్ణువైన నీ సంరక్షణను పొందినవారై నిర్భయులుగా ఉందురుగాక అని చెప్పినాడు." అని కాలపురుషుడు పలికెను.(10-15)

కాలపురుషుని ద్వారా బ్రహ్మదేవుడు పలికిన మాటలు(పంపిన సందేశమును) విని రాముడు నవ్వుచు ఆ కాలపురుషునితో- "చాలా అద్భుతమైన బ్రహ్మదేవుని మాటలు విని నాకు నీ రాకవలన చాలా సంతోషము కలిగినది. నేను పుట్టినది మూడులోకముల కార్యమును సాధించుటకే. నీకు మంగళ మగుగాక; నేను ఎక్కడినుండి వచ్చినానో అక్కడికే వెళ్ళెదను. కాలపురుషా! నేను నిన్ను గూర్చి ఆలోచించుచుండగానే నీవు వచ్చినావు. ఈ విషయమున నాకు మరియొక ఆలోచన లేదు. బ్రహ్మదేవుడు చెప్పినట్లు నేను అన్ని పనులయందు దేవతల వశములో ఉండవలెను కదా?" అని పలికెను.(16-19)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట నాలుగవ సర్గము సమాప్తము.**

# నూట ఐదవ సర్గము

## దుర్వాసుడు శపించుననే భయముచేత లక్ష్మణుడు రామునికి అతని రాకను గూర్చి చెప్పుట.



ఆ రాముడు కాలపురుషునితో ఈ విధముగా సంభాషణ చేయుచుండగా పూజ్యుడైన దుర్వాసముని రాముని దర్శనము కోరుచు రాజద్వారము వద్దకు వచ్చెను. ఆ మహాముని లక్ష్మణుని సమీపించి - "శీఘ్రముగా నాకు రాముణ్ణి చూపుము; కానిచో నా కార్యము మించిపోవును." అని పలికెను. లక్ష్మణుడు ఆ ముని మాటలు విని, మహాత్ముడైన అతనికి నమస్కరించి- "పూజ్యుడా! ఏమి పనో చెప్పుము. ఏ ప్రయోజనముకై వచ్చినావు? నేను నీకు ఏమి చేయుదును? బ్రాహ్మణా! రాముడు పనితొందరలో ఉన్నాడు. ఒక్క ముహూర్తము నిరీక్షించుము." అనెను. ఆ మునిశ్రేష్ఠుడు ఆ మాట విని కోపావేశము పొంది లక్ష్మణుణ్ణి చూపులతో కాల్చివేయుచున్నాడా అన్నట్లు చూచుచు- "లక్ష్మణా! నన్ను గూర్చి రామునకు ఈ క్షణమునందే తెలుపుము. అట్లు చేయకపోయినచో ఈ దేశమును, నిన్ను, రాముణ్ణి, భరతుణ్ణి, మీ సంతానమును కూడ శపించెదను. నేను నా కోపమును మనస్సులో అణచుకొనజాలను."(1-7)

మహాప్రభావవంతుడైన ఆ మునీశ్వరుని భయంకరమైన ఆ వాక్యమును విని లక్ష్మణుడు ఆ వాక్యము విషయమున చేయవలసిన నిర్ణయమును గూర్చి ఆలోచించెను- "నాకు ఒక్కనికే మరణము వచ్చుగాక, అందరికి వినాశము రాకుండుగాక." అని మనస్సులో నిశ్చయించుకొని లక్ష్మణుడు, రామునకు అతనిని గూర్చి తెలిపెను. రాజైన రాముడు లక్ష్మణుని మాటలు విని, కాలపురుషుణ్ణి పంపివేసి, తొందరపడుచు బైటకు వచ్చి దుర్వాసుణ్ణి చూచెను. రాముడు తేజస్సుతో మండుచున్నాడా అన్నట్లున్న ఆ మునీశ్వరునికి నమస్కరించి అంజలి ఘటించి "ఏమి చేయవలెను?" అని ప్రశ్నించెను. సమర్థుడు, మునిశ్రేష్ఠుడూ అయిన ఆ దుర్వాసుడు రాముని మాటలు విని, రామునితో - "ధర్మమునందు ఆసక్తికలవాడా! వినుము. రామా! నేను

అనశనవ్రతము ప్రారంభించి ఈ నాటికి వెయ్యి సంవత్సరములు పూర్తి అయినవి. అట్టి నేను నీ విచ్చిన భోజనమును, ఎట్లు సిద్ధముగా ఉన్నదో అట్లు, చేయవలె నని కోరుచున్నాను." అనెను.(8-13)

ఆ మాటలు విని రాజైన రాముడు సంతోషించి ఆ దుర్వాసునకు యథాసిద్ధముగా భోజనము పెట్టించెను. ఆ మునిశ్రేష్ఠుడు అమృతమువంటి ఆ అన్నమును భుజించి "రామా చాలా బాగున్నది." అని పలికి తన ఆశ్రమముకు వెళ్ళిపోయెను. దుర్వాసుడు ఆశ్రమమునకు వెళ్ళిన పిమ్మట రాముడు కాలపురుషుని మాటలు స్మరించి దుఃఖాక్రాంతు డయ్యెను. భయంకరముగా కనబడుచున్న ఆ వాక్యమును స్మరించి దుఃఖసంతప్తుడై, దైన్యముతో తలవంచుకొని ఏమీ మాటలాడజాలక పోయెను. మహాకీర్తిమంతుడైన రాముడు పిమ్మట కాలపురుషుడు చెప్పిన మాటలు స్మరించి ఇంక ఏమైనా సోదరాదిపరివార మంతా నశించవలసినదే అని నిర్ణయించుకొని మౌనముగా నుండెను.(14-18)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట ఐదవ సర్గము సమాప్తము.**

# నూట ఆరవ సర్గము

## రామునిచే విడువబడిన లక్ష్మణుడు శరీరముతో స్వర్గమునకు వెళ్ళుట.

**త**ల క్రిందికి వంచి దీనుడై రాహుగ్రస్తుడైన చంద్రుడు వలె ఉన్న రాముణ్ణి చూచి లక్ష్మణుడు సంతోషపూర్వకముగా మధురమైన వాక్యము పలికెను- "మహాబాహూ! నా నిమిత్తము దుఃఖము చెందకుము. పూర్వము చేయబడిన నిర్ణయముచేత కాలగతి ఈ విధముగానే ఉండును గదా? సౌమ్యా! నిఃసందేహముగా నన్ను చంపుము. ప్రతిజ్ఞ పరిపాలించుము. ప్రతిజ్ఞ నిలబెట్టుకొనని నరులు నరకమునకు పోవుదురు."(1-3)

రాముడు లక్ష్మణుని మాటలు విని, చలించిన మనస్సుతో (మనస్సులో దుఃఖించుచు), మంత్రులను పురోహితులను పిలిపించి వారికి దుర్వాసుని రాక, ఆ తాపసుని ప్రతిజ్ఞ మొదలైన వృత్తాంతమును చెప్పెను. ఆ విషయము విన్న మంత్రులు, ఉపాధ్యాయులు అందరూ కూడ మౌనముగా కూర్చుండిరి. గొప్ప తేజస్సుగల వసిష్ఠుడు మాత్రము- "గొప్ప తపస్సు, కీర్తి గల రామా! నీకు రాబోవు భయంకరమైన

ఈ క్షణమును గూర్చి లక్ష్మణునితో నీకు వియోగమును గూర్చి నాకు ముందుగానే తెలియును. ఈ లక్ష్మణుణ్ణి విడిచివేయు కాలము బలవత్తర మైనది. ప్రతిజ్ఞను వ్యర్థము చేయకుము. ప్రతిజ్ఞ నష్టమైనచో ధర్మము నశించును కదా? ధర్మము నశించినచో స్థావరజంగమములతోను, దేవగణఋషిగణములతోను కూడిన మూడులోకములు నశించును, సంశయము లేదు. పురుషశ్రేష్ఠుడా! అట్టి నీవు ఇప్పుడు లక్ష్మణుణ్ణి విడిచిపెట్టుట ద్వారా ముల్లోకములను రక్షించుటవలన జగత్తు స్వస్థముగా ఉండునట్లు చేయుము." అని పలికెను.(4-10)

సభలో కలసినవారందరూ పలికిన ధర్మార్థములకు సంమతమైన ఆ వాక్యమును విని రాముడు పరిషత్తు మధ్యయందు లక్ష్మణునితో- "లక్ష్మణా! ధర్మవైపరీత్యము కాకుండుటకై నిన్ను విడిచివేయుచున్నాను. సత్పురుషులకు త్యాగము విధించినా, వధను విధించినా రెండూ సమానమే." అనెను.(11, 12)

రాము డిట్లు అనగానే లక్ష్మణుడు కన్నీళ్ళతో ఇంద్రియములు వ్యాకులములు కాగా, తన ఇంటికి కూడ వెళ్ళకుండగా, తొందరగా వెళ్ళి పోయెను. లక్ష్మణుడు సరయూనదీతీరమునకు వెళ్ళి ఆచమనము చేసి, అంజలి ఘటించి నమస్కరించి, అన్ని శరీరద్వారములను నిగ్రహించి ఊపిరి బైటకు విడవకుండ కూర్చుండెను. ఉచ్ఛ్వాసనిఃశ్వాసలు లేక యోగసమాధిలో ఉన్న అతనిపై ఇంద్రుడు, అప్సరఃస్త్రీలు, ఋషులు, సకలదేవతలూ కూడ పుష్పములు చల్లిరి. ఇంద్రుడు మనుష్యుల కెవరికీ కనబడని మహాబలశాలి అయిన ఆ లక్ష్మణుణ్ణి సశరీరముగా తీసుకొనివెళ్ళి స్వర్గములో ప్రవేశించెను. అప్పుడు దేవతాముఖ్యు లందరూ విష్ణువు నాల్గవ భాగము వచ్చినట్లు చూచి చాలా సంతోషించి లక్ష్మణుణ్ణి పూజించిరి.(13-17)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట ఆరవ సర్గము సమాప్తము.**

# నూట ఏడవ సర్గము

## పౌరులనందరినీ తనతో పరమధామమునకు తీసికొనివెళ్ళవలె నని రాముడు ఆలోచించుట.

రాముడు లక్ష్మణుణ్ణి విడిచివేసి, దుఃఖశోకములతో బాధపడుచు పురోహితునితోను, మంత్రులతోను, సంఘముఖ్యులతోను – "ధర్మమునందు ఆసక్తిగల వీరుడైన భరతుణ్ణి రాజ్యమునందు అయోధ్యాధిపతిగా అభిషేకించి నేను వనమునకు వెళ్ళెదను. కావలసిన సామాగ్రి తీసికొనిరండి. ఆలస్యము కాకూడదు. నేడే నేను కూడ లక్ష్మణుడు పొందిన గతిని పొందెదను." అని పలికెను.(1-3)

రాముని మాటలు విని సమస్తమైన అమాత్యాది ప్రకృతులు మిక్కిలి చైతన్యవిహీనులు వలె అయి, తలలతో నేలమీద పడిరి. రాముని మాటలు విని భరతుడు నిశ్చేష్టుడయ్యెను. రాజ్యమును నిందించి ఇట్లు పలికెను – "రాజా! రామా! నీవే లేనిచో నేను రాజ్యమును కోరనని సత్యముమీద, స్వర్గసుఖాల మీదా ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. రాజా! వీరుడైన కుశుణ్ణి దక్షిణకోశలదేశమునందు, లవుణ్ణి ఉత్తర కోశలదేశమునందూ, ఈ విధముగా కుశలవు లిద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసి వెళ్ళెదము. శీఘ్రముగా వెళ్ళగల దూతలు శత్రుఘ్నుని వద్దకు వెళ్ళి మన ఈ గమనమును గూర్చి వెంటనే చెప్పెదరుగాక. ఆలస్యము వద్దు."(4-8)

వసిష్ఠుడు భరతుని మాటలు విని, దుఃఖపీడితులై తలలు క్రిందికి వంచి ఉన్న పౌరులను చూచి– "నాయనా! రామా! నేలమీద పడియున్న ఈ ప్రజలను చూడుము. వీరి ఇష్టమేమో తెలిసికొని అది చేయుము. అనిష్టమైన దానిని చేయకుము." అనెను.(9, 10)

రాముడు వసిష్ఠుని మాట ప్రకారము ప్రకృతులను లేవదీసి "నేను ఏమి చేయవలెను?" అని వారినందరినీ అడిగెను. అప్పుడు ఆ ప్రకృతులందరూ రామునితో – "రామా! నీవు ఎక్కడికి వెళ్ళెదవో అక్కడికి మేము నీ వెనుకనే వచ్చెదము. రామా! నీకు పౌరులమైన మాపై ప్రేమ, అత్యధికమైన స్నేహము ఉన్నచో మేము భార్యాపుత్రాదులతో కలసి నీతో సన్మార్గమున వెళ్ళెదము. ప్రభూ! మేము విడిచివేయదగినవారము కాము అని నీకున్నచో, మమ్ములను అందరినీ తపోవనమునకైనా, దుర్గమునకైనా, నదిలోనికైనా, సముద్రములోనికైనా నీతో తీసికొనివెళ్ళుము. రాజా! ఇదే మా గొప్ప సంతోషము. ఇదే మాకు గొప్ప వరము. నిన్ను అనుసరించి వెళ్ళుట మాకు పరమానందము." అని పలికిరి.(11-15)

రాముడు ఆనాడు పౌరుల దృఢభక్తిని, తాను చేసికొన్న కార్య నిర్ణయమును దృష్టిలో పెట్టుకొని "తప్పక అట్లే" అనెను. రాముడు వీరుడైన కుశుణ్ణి దక్షిణకోశలదేశమునకు రాజుగాను, లవుణ్ణి ఉత్తరకోశలదేశ రాజు గాను అభిషేకించెను. మహాత్ములైన ఆ కుశలవులను ఇద్దరినీ ఇట్లు అభిషిక్తులను చేసి ప్రమాణము చేయించెను. పిమ్మట మహాబాహువైన రాముడు రాజ్యాభిషిక్తులైన పుత్రులను ఒడిలో కూర్చుండబెట్టుకొని కౌగిలించుకొని, మాటిమాటికి శిరస్సుపై ఆఘ్రాణించి ముద్దుపెట్టుకొని, వేలకొలది రథములు, అయుతముల (10,000) కొలది ఏనుగులు, పది అశ్వసహస్రములు ధనముగా వారి కిచ్చెను. అనేకములైన రత్నములు, అధికమైన ధనమూ గల, ఉత్సాహవంతులు, దృఢకాయులు అయిన జనులతో కూడిన, ఆ సోదరులైన కుశలవులను వారి పట్టణములకు పంపెను. వీరులైన కుమారుల్ను రాజ్యాభిషిక్తులను చేసి, వారిని తమ రాజధానులకు పంపి, మహాత్ముడైన శత్రుఘ్నునకు దూతలను పంపెను.(16-21)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట ఏడవ సర్గము సమాప్తము.**

# నూట ఎనిమిదవ సర్గము

**పౌరసోదరాదులతో కలిసి పరమధామమునకు వెళ్ళవలె నని రాముడు నిశ్చయించుకొనుట.**

రాముని చే ఆజ్ఞాపించబడిన శీఘ్రగమనము గల ఆ దూతలు శీఘ్రముగా, మార్గమధ్యమునందు ఆగకుండగా మధుపురమునకు వెళ్ళిరి. వాళ్ళు మూడు పగళ్ళు, మూడు రాత్రులు ప్రయాణము చేసి మధుపురము చేరి, జరిగిన విషయమును యథాతథముగా శత్రుఘ్నునకు తెలిపిరి. రాముని ప్రతిజ్ఞను, రాముడు లక్ష్మణుణ్ణి విడిచివేయుటను, కుశలవుల అభిషేకమును, పౌరులు రాముని వెంట వెళ్ళుటకు సంకల్పించుటను తెలిపిరి. "ధీమంతుడైన రాముడు కుశుని కొరకు వింధ్యపర్వతసమీపమునందు కుశావతి అను నగరమును నిర్మించెను. లవుని కొరకు రమ్యమైన పురము నిర్మించబడినది. దానికి శ్రావస్తి అను పేరు ప్రసిద్ధము చేయబడినది. మహారథులైన రాముడు, భరతుడు అయోధ్యను జనశూన్యము చేసి స్వర్గమునకు వెళ్ళుటకు ప్రయత్నము చేయుచున్నారు." ఆ దూతలు మహాత్ముడైన

శత్రుఘ్నునకు దానిని అంతా చెప్పి, "రాజా తొందరపడుము" అని కూడ పలికి విరమించిరి. (1-6)

శత్రుఘ్నుడు చాల భయంకరమైన, వచ్చి పడిన ఆ కులక్షయమును గూర్చి విని, ప్రకృతులను, పురోహితుడైన కాంచనుణ్ణీ పిలిపించి, వారికి జరిగిన అంత విషయమునూ, సోదరులతో పాటు తనకు రానున్న శరీరత్యాగమును తెలిపెను. పిమ్మట వీరుడైన ఆ రాజు పుత్రులను ఇద్దరినీ రాజ్యాభిషిక్తులను చేసెను. సుబాహువు మధురను, శత్రుఘాతి వైదిశనగరమును పొందెను. శత్రుఘ్నుడు మధుపురిలో ఉన్న సైన్యమును, ధనమును రెండు భాగాలుగా చేసి ఇద్దరు కుమారులకు ఇచ్చెను. అతడు సుబాహువును మధుపురియందు, శత్రుఘాతిని వైదిశమునందు స్థాపించి ఒక్క రథముతో అయోధ్యకు వెళ్ళెను. (7-11)

అతడు ప్రజ్వలించుచున్న అగ్నివలె ఉన్న మహాత్ముడైన రాముణ్ణి చూచెను. తెల్లని, సన్నని పట్టుబట్టలు ధరించి ఉన్న ఆ రాముని దగ్గర చాలామంది మునీశ్వరులు కూర్చుండిరి. పిమ్మట శత్రుఘ్నుడు ధర్మముల నెరిగిన ఆ రామునకు అభివాదము చేసి, అంజలి ఘటించి, ఇంద్రియనిగ్రహవంతుడై, ధర్మమును ఆలోచించుచు- "రాజా! రామా! నా కుమారు లిద్దరికి రాజ్యాభిషేకము చేసి వచ్చినాను. ఇప్పుడు నిన్ను అనుసరించి వచ్చుటకు నిశ్చయించుకొని ఉన్నాను. వీరుడా! ఇప్పుడు దీనికి భిన్నముగా ఏమీ చెప్పకుము. నీ ఆజ్ఞ తిరస్కరింపబడుటను, విశేషించి నావంటి వానిచే తిరస్కరింపబడుటను, నేను ఇచ్చగింపను." అని పలికెను. రాముడు శత్రుఘ్నుని ఆ దృఢనిశ్చయమును చూచి "తప్పక అట్లే" అని పలికెను. (12-16)

ఈ మాటలు జరుగుచుండగా స్వేచ్ఛారూపధారులైన వానరులు, భల్లూకములు, రాక్షసులు అనేక మార్గములనుండి గుంపులు గుంపులుగా వచ్చిరి. ఆ వానరులందరు సుగ్రీవుణ్ణి ముందు ఉంచుకొని, స్వర్గగమనాభిముఖుడై ఉన్న రాముణ్ణి చూడవలెనను కోరికతో వచ్చిరి. రాముని క్షయమును గూర్చి తెలిసిన, దేవతల పుత్రులు, ఋషుల పుత్రులు, గంధర్వుల పుత్రులూ అయిన ఆ వానరు లందరూ వచ్చిరి. ఆ వానరరాక్షసు లందరూ రామునకు నమస్కరించి - "రాజా! మేమందరమూ కలసి నీ వెనుకనే వెళ్ళుటకు వచ్చినాము." పురుషోత్తమా! రామా! మేము నీవెంట రాకుండగా నీవు వెళ్ళినచో యమదండము ప్రయోగించి మమ్ములను చంపివేసినట్లు అగును." అని పలికిరి. (17-21)

ఇంతలో మహాబలశాలి అయిన సుగ్రీవుడు కూడ రామునకు యథావిధిగా

నమస్కరించి- "రాజా! నేను వీరుడైన అంగదునకు రాజ్యాభిషేకము చేసి వచ్చినాను. నిన్ను అనుసరించి వెళ్ళుటకు దృఢనిశ్చయముతో ఉన్నాను." అని విన్నవించెను. (22,23)

ఆనందింపచేయువారిలో శ్రేష్ఠుడైన రాముడు ఆ సుగ్రీవుని మాటలు విని, అతని మైత్రీభావమును స్మరించుచు- "మిత్రుడా! సుగ్రీవా! వినుము. నీవు ప్రక్కన లేకుండా నేను స్వర్గలోకమునకుగాని, పరమపదమునకుగాని వెళ్ళను" అనెను. (24,25)

రాముడు వాళ్ళ మాటలు విని, నవ్వుచు, "తప్పక అట్లే" అని అనెను. పిమ్మట రాముడు రాక్షసేంద్రుడైన విభీషణునితో- "రాక్షసరాజా! మహాపరాక్రమవంతుడా! విభీషణా! ప్రజలు ఈ భూమిమీద జీవించి ఉన్నంతకాలము నీవు లంకలో జీవించి ఉండగలవు. సూర్యచంద్రులు ఎంతవరకు ఉందురో, భూమి ఎంతవరకు ఉండునో, నా కథ లోకములో ఎంతవరకు వ్యాప్తిలో ఉండునో అంతవరకు నీవు రాజ్యము చేయుదువుగాక. స్నేహభావమును పురస్కరించుకొని నిన్ను ఆజ్ఞాపించుచున్నాను. నా ఆజ్ఞప్రకారము చేయవలెను. ప్రజలను ధర్మానుసారము రక్షించుము. బదులు చెప్పవద్దు. గొప్పబలము గల విభీషణా! మరొక విషయము చెప్ప గోరుచున్నాను. ఇక్ష్వాకుల కులదేవత, ఇంద్రాదిదేవతలచేత కూడ పూజింపబడువాడు అయిన జగన్నాథుని ఆరాధించుము." అని పలికెను. (26-31)

రాక్షసరాజైన విభీషణుడు రామాజ్ఞను స్మరించుచు రాముని మాటలను "అట్లే చేసెదను" అని స్వీకరించెను. రాముడు విభీషణునితో ఇట్లు పలికి పిదప హనుమంతునితో కూడ - "జీవితమునందు నిశ్చయము చేసికొనిన నీవు నీ ప్రతిజ్ఞను వ్యర్థము చేయకుము." (హనుమంతునకు బ్రహ్మదేవుడు దీర్ఘాయుర్దాయము నిచ్చెను. - "రామాయణకథ లోకములో ప్రచారములో ఉన్నంతవరకు నేను దానిని వినుచుందును గాక." అని కోరగా రాముడు ఆ వరమును ఇచ్చెను. అందుచేత దానిని వ్యర్థము చేయక చిరకాలము జీవించుమని భావము.) హనుమంతుడా! నా కథలు లోకములో ప్రచారములో ఉన్నంతవరకు నీవు సంతోషించుచు, నా మాటను మన్నించి సుఖముగా ఉండుము." అని పలికెను. మహాత్ముడైన రాముని మాటలు విని హనుమంతుడు చాలా సంతోషించుచు- "పవిత్రమైన నీ కథ లోకములో ప్రచారములో ఉన్నంతవరకు నీ ఆజ్ఞను పాలించుచు భూలోకములో ఉండెదను." అనెను. (32-36)

వృద్ధుడు, బ్రహ్మపుత్రుడూ అయిన జాంబవంతునితో కూడ రాముడు అట్లే చెప్పి, మైందద్వివిదులకు కూడ ఆవిధముగానే చెప్పెను. ఈ విధముగా "కలియుగము వచ్చువరకు మీరు జీవించి ఉండుడు." అని జాంబవంతునితో సహా ఐదుగురిని ఆదేశించెను. రాముడు వారితో (విభీషణాదులతో) ఆవిధముగా చెప్పి ఋక్షవానరు లందరితోను "నేను ముందుగానే చెప్పిన విధముగా తప్పక నాతో రండి." అని పలికెను. (37, 38)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట ఎనిమిదవ సర్గము సమాప్తము.**

# నూట తొమ్మిదవ సర్గము

## పరమధామమును చేరుటకై అయోధ్యావాసు లందరూ రామునితో కూడ బయలుదేరుట.

పిమ్మట రాత్రి తెల్లవారగానే విశాలమైన వక్షఃస్థలము, గొప్పకీర్తి, కమలపత్రములవంటి నేత్రములు గల రాముడు పురోహితునితో ఇట్లనెను. "ప్రజ్వలించుచున్న అగ్నిహోత్రాగ్ని బ్రాహ్మణులతో కూడ ముందు వెళ్ళుగాక. శోభించుచున్న వాజపేయచ్ఛత్రము కూడ సాకేతరాజమార్గమునందు వెళ్ళుగాక. (వాజపేయ యాగము చేసినవారు మాత్రమే గౌరవసూచకంగా ధరించు ఛత్రము వాజపేయచ్ఛత్రము.)"(1, 2)

పిమ్మట తేజఃశాలియైన వసిష్ఠుడు మహాప్రస్థానమునకు సంబంధించిన విధిని అంతనూ యథాశాస్త్రముగా, పూర్తిగా చేసెను. రాముడు సూక్ష్మవస్త్రములు ధరించి, పరబ్రహ్మను ధ్యానించుచు, చేతులలో దర్భలు గ్రహించి, సరయూనదికి వెళ్ళెను. మార్గమునందు ఎక్కడా ఏమీ మాటలాడక, నడక తప్ప ఇతర చేష్ట లేవీ లేనివాడై, సుఖదృష్టి లేనివాడై, ప్రకాశించుచున్న సూర్యుడువలె, ఆ గృహమునుండి బయలుదేరెను. అప్పుడు రాముని కుడిప్రక్క పద్మహస్తయైన లక్ష్మి, ఎడమప్రక్క భూదేవి, ఎదుటి భాగమునందు వ్యవసాయశక్తి (సంహారశక్తి) నడచుచుండెను. అనేకవిధములైన బాణములు, పొడవైన ఉత్తమమైన ధనుస్సు, సమస్త ఆయుధము లన్నీ కూడ పురుషరూపము ధరించి రాముని వెనుక వెళ్ళినవి. వేదములు, సర్వరక్షకురాలైన గాయత్రి, ఓంకారము, వషట్కారము అందరూ కూడ

బ్రాహ్మణరూపములలో రాముణ్ణి అనుసరించి వెళ్ళినవి. మహాత్ములైన ఋషులు, సమస్తమైన బ్రాహ్మణులు, తెరవబడిన స్వర్గద్వారములను గూర్చి, ఆ రాముణ్ణి అనుసరించి వెళ్ళిరి. అంతఃపురస్త్రీలు, వృద్ధదాసీలు, బాలదాసీలు, కంచుకులు, కింకరులు రాముని వెనుక వెళ్ళిరి. భరతుడు అంతఃపురముతోను, శత్రుఘ్నునితోను కలసి వెళ్ళెను. వారందరూ అగ్నిహోత్రాగ్నితో కూడిన రాముణ్ణి గతిగా పొంది అతనిని అనుసరించిరి.(3-11)

తమ తమ అగ్నిహోత్రాగ్నులను తీసికొని వచ్చిన ఆ మహాత్ములందరూ, భార్యాపుత్రసహితులై రాముణ్ణి అనుసరించి వెళ్ళిరి. మంత్రులు, పుత్రపశు బంధుసహితులైన భృత్యులు అందరూ కూడ తమ అనుచరులతో కూడ సంతోషముతో రాముని వెనుక వెళ్ళిరి. పిమ్మట సంతోషించుచున్న ఆరోగ్యవంతులైన జనులతో నిండిన ప్రజలందరూ, రాముని గుణములచేత రంజింపచేయబడినవారూ, వెళ్ళుచున్న అతనిని అనుసరించి వెళ్ళిరి. రాముణ్ణి అనుసరించి వచ్చిన స్త్రీలు, పురుషులు, పక్షులు, పశువులు అందరూ కూడ పాపరహితులై ఉత్సాహసంపన్నులై ఉండిరి. వానరులందరు హృష్టులై, స్నానము చేసి ఆనందముతో ఉండిరి. ఆ వానరసముదాయము అంతా కిలకిలాశబ్దము చేయుచు రాముణ్ణి అనుసరించుటకు స్థిరసంకల్పముతో ఉండెను. అక్కడ దీనుడు గాని, సిగ్గుపడుచున్నవాడు గాని, దుఃఖితుడు గాని ఎవ్వడూ కూడ లేకుండెను. సమస్తమూ కూడ హర్షపూర్ణము, ఆనందభరితము అయి ఆశ్చర్యకరముగా ఉండెను. రాముడు వెళ్ళిపోవుచున్నాడని చూచుటకై పల్లెలనుండి వచ్చినవాళ్ళు కూడ అతనిని చూడగానే సంతోషముతో, స్వర్గముకొరకు అతనిని అనుసరించి వెళ్ళిరి. భల్లూకములు, వానరులు, రాక్షసులు, నగరవాసులైన జనులు సావధానచిత్తులై, గొప్పభక్తితో రాముని వెనుకనే వచ్చిరి. నగరములో అదృశ్యములుగా ఉన్న భూతములు కూడ స్వర్గమునకు బయలుదేరిన రాముణ్ణి అనుసరించి వెళ్ళినవి. రాముడు వెళ్ళుచున్నప్పుడు అతనిని చూచిన జంగమములు, స్థావరములూ కూడ అతనిని అనుసరించి వెళ్ళినవి. (రాముని దృష్టి ప్రసరింపగానే స్థావరములైన వృక్షాదులలో కూడ జ్ఞానము ఉద్భవించి అవి కూడా రాముని వెంట వెళ్ళినవి.) అయోధ్యలో, ఊపిరి పీల్చే ఒక్క చాల చిన్న ప్రాణి కూడ మిగలలేదు. తిర్యగ్జంతువులు అన్నీ కూడ రాముణ్ణి అనుసరించి వెళ్ళినవి.(12-22)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట తొమ్మిదవ సర్గము సమాప్తము.**

# నూట పదవ సర్గము

## సోదరసహితుడైన రాముడు తన వైష్ణవతేజస్సులో ప్రవేశించుట, రామునితో వచ్చినవారికందరికీ సంతానక మను లోకము లభించుట.


**రా**ముడు ఒకటిన్నర యోజనముల దూరము వెళ్ళి పుణ్యమైన ఉదకము గల, పశ్చిమాభిముఖుడుగా ఉన్న తనచేత ఆశ్రయించబడిన సరయూనదిని చూచెను. రాజైన రాముడు సుళ్ళతో వ్యాకులమైన జలము గల ఆ నదిని అంతటా పరిశీలించుచు తిరిగి, ప్రజలతో తాను ప్రవేశించుటకు తగిన (స్వర్గప్రాపకమైన) ప్రదేశమునకు వచ్చెను. అప్పుడు సమస్తలోకములకు పితామహుడైన బ్రహ్మదేవుడు బాగుగా అలంకరించుకొనిన మహాత్ములైన సకలదేవతలతో కలసి, దివ్యములైన శతకోటి విమానములు వెంట రాగా, రాముడు స్వర్గమునకు వెళ్ళుటకై వచ్చిన స్థానమునకు వచ్చెను. సహజమైన కాంతి, తేజస్సు గల పుణ్యాత్ములైన దేవతలతో అత్యుత్తమమైన ఆకాశము దివ్యమైన తేజస్సుతో నిండినదై తేజోరూపమైపోయెను. సువాసనతో సుఖప్రదములైన పుణ్యములైన గాలులు వీచెను. దేవతలు కురిపించిన పుష్పవృష్టి మహాప్రవాహము వలె పడెను. వందలకొలది తూర్యముల ధ్వనులతో వ్యాకులమైన, గంధర్వులతోను, అప్సరసలతోను సంకులముగా ఉన్న ఆ సమయమునందు రాముడు సరయూనదీజలము వైపు మెల్లగా నడచెను. (1-7)

అప్పుడు బ్రహ్మదేవుడు ఆకాశమునందు (కొంచెము దగ్గరగా వచ్చి)– "విష్ణూ! రమ్ము. నీకు మంగళమగుగాక. రామా! భాగ్యవశముచేత వచ్చినావు. (8)

మహాబాహూ! దేవతలవంటి సోదరులతో కూడ నీ స్వీయదేహములో ప్రవేశించుము. నీ దేహములలో దేనిలో ప్రవేశించవలెనని కోరెదవో దానిలో ప్రవేశించుము. (9)

గొప్ప తేజస్సు కలవాడా! ఆ వైష్ణవశరీరమును గాని, నిత్యమైన శుద్ధ బ్రహ్మస్వరూపమును గాని ప్రవేశించుము. దేవా! నీవే లోకములకు గతివి. అనాదిసిద్ధముగా ఉన్నదీ, విశాలములైన నేత్రములు గలదీ అయిన మాయ తప్ప మరెవ్వరిచేత నీవు ఊహింప శక్యముకానివాడవు. గొప్ప భూతము; నాశరహితుడవు. జరాశూన్యుడవు; అట్టి నిన్ను ఎవ్వరును తెలిసికొనజాలరు" అని పలికెను. (10-11)

రాముడు, బ్రహ్మదేవుని మాటలు విని, నిశ్చయించుకొని, తమ్ములతో కూడ, సశరీరముగా వైష్ణవతేజస్సులో ప్రవేశించెను. పిమ్మట విష్ణురూపములో విలీనుడై



విష్ణువైపోయిన ఆ రాముణ్ణి దేవతలు, సాధ్యులు, మరుద్గణములు, ఇంద్రుడు, అగ్ని, దివ్యఋషులు, గంధర్వులు, అప్సరసలు, గరుత్మంతులు, నాగులు, యక్షులు, దైత్య-దానవ-రాక్షసులు పూజించిరి. దేవత లందరు - "కల్మషరహితమైన ఈ స్వర్గము అంతా ఇప్పుడు పరిపుష్ట మైనది. సంతోషముతో నిండినది. దీని మనోరథములు పూర్ణమైనవి. బాగు బాగు." అని పలికిరి.(12-15)

పిమ్మట గొప్ప తేజస్సు గల విష్ణువు బ్రహ్మదేవునితో- "ఓ! సువ్రతా! ఈ జనులందరికీ ఉత్తమలోకమును ఇమ్ము!" ఉత్తమమనస్సు గల వీరందరూ నాపై ఉన్న స్నేహముచేత నా వెనుక వచ్చినారు. నా నిమిత్తము దేహములు వదలిన భక్తులు సేవించదగినవారు కదా?" అనెను.(16, 17)

విష్ణువు పలికిన మాట విని లోకగురువు, సమర్థుడు అయిన బ్రహ్మదేవుడు - "నీ వెనుకనే వచ్చిన వీరు సంతానక మను లోకమునకు వెళ్ళగలరు. తిర్యగ్జంతువు కూడా భక్తితో నిన్నే స్మరించుచు ప్రాణాలను విడచిపెట్టినచో అది అన్ని బ్రాహ్మణగుణములూ ఉన్న, బ్రాహ్మలోకమునకు ప్రక్కనే ఉన్న సంతాన లోకములలో నివసించును. దేవతలవలన పుట్టిన వానరులు, భల్లూకములు, అందరూ కూడ తమ తమ ఉత్పత్తికి కారణభూతులైన దేవతలలో లీనమైపోయిరి. వారిలో సుగ్రీవుడు సూర్యమండలములో ప్రవేశించెను. ఇతరులు దేవతలందరూ చూచుచుండగా, తమ తండ్రులను పొందిరి." అని పలికెను.(18-21)

బ్రహ్మదేవుడు ఆ విధముగా పలుకుచుండగా సరయూనదియందలి గోప్రతారక్షేత్రమునకు వచ్చిన జనులు సంతోషముతో నిండిన కన్నీళ్ళతో వ్యాకులులై సరయూనదిలో ప్రవేశించిరి. జలములో దిగి సంతోషపూర్వకముగా ప్రాణాలను విడచిన ప్రతి ఒక్కడూ కూడా మనుష్యదేహమును విడచి విమానమును ఎక్కి వెళ్ళెను. పశుపక్ష్యాదులు కూడ ఆ సరయూనదీజలములో ప్రవేశించి ప్రకాశించుచున్న దేహములతో స్వర్గమునకు వెళ్లెను. (ఆ తిర్యగ్జంతువులు) దివ్యమైన శరీరముతో ప్రకాశించుచున్న దేవతలవలె ఉండెను. సరయూనదీజలములో ప్రవేశించిన స్థావరములు, జంగమములూ కూడ ఆ నీటిలో తడియగానే దేవలోకమును చేరెను. ఆ జలములో ప్రాణాలు విడిచిన భల్లూక-వానర-రాక్షసులు తమ దేహములను ఆ జలమునందు విడచి స్వర్గమును చేరిరి.(22-27)

బ్రహ్మదేవుడు వచ్చినవారినందరినీ స్వర్గలోకములో ఉంచి, సంతోషాతిశయముతో కూడిన దేవతలతో కలసి బ్రహ్మలోకమునకు వెళ్ళెను.(28)

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట పదవ సర్గము సమాప్తము.**

# నూట పదకొండవ సర్గము

## శ్రీమద్రామాయణమాహాత్మ్యము

ఉత్తరభాగసహితమై ఇంత ప్రమాణము గల, ఈ ఆఖ్యానము బ్రహ్మదేవునిచేత పూజించబడినది. రామాయణమను పేరుతో ప్రసిద్ధి పొందిన ఈ ముఖ్యమైన ఆఖ్యానమును వాల్మీకి రచించెను. చరాచరాత్మకములైన మూడు లోకములను వ్యాపించి ఉన్న శ్రీమహావిష్ణువు, పిమ్మట పూర్వమునందు వలె స్వర్గమునందు సంప్రతిష్ఠితుడయ్యెను. ఇది శ్రీమహావిష్ణువు చరిత్ర అగుటవలన స్వర్గలోకములో దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు, సంతోషించుచు నిత్యమూ ఈ రామాయణ మహాకావ్యమును వినుచుందురు. ఈ రామాయణాఖ్యానము ఆయుస్సును వృద్ధిపొందించుచు, సౌభాగ్యమును ఇచ్చును. పాపములను తొలగించును. వేదముతో సమానము. అందుచేత పండితుడు శ్రాద్ధసమయములలో కూడ దీనిని వినిపించవలెను.(1-4)

పుత్రుడు లేని వాడు పుత్రుణ్ణి పొందగలడు. ధనము లేనివాడు ధనమును

పొందును. రామాయణములోని ఒక్క శ్లోకమును చదివినవాడు సకలపాపములనుండి విముక్తు డగును. ప్రతిదినము పాపములు చేయుచున్న మానవుడు కూడ ఒక్క శ్లోకమైన పఠించినచో పాపమునుండి విముక్తు డగును. చదివినవానికి వస్త్రములు, ధేనువు, బంగారము ఇవ్వవలెను. చదువువాడు సంతోషించినచో సమస్తదేవతలు సంతోషింతురు. ఆయుర్వర్ధకమైన ఈ రామాయణ మను అఖ్యానమును పఠించు పురుషుడు పుత్రపౌత్రసహితుడై ఈ లోకములో పూజింపబడును. మరణానంతరము రెండు లోకములలోను పూజించబడును. ప్రాతఃకాలమునందు గాని మధ్యాహ్నమునందుగాని, సాయంకాలమునందుగాని, అపరాహ్ణమునందుగాని సావధానచిత్తుడై రామాయణమును పఠించువాడు ఎన్నటికీ చెడడు.(5-9)

అనేక సంవత్సరములు శూన్యముగా ఉన్న రమ్యమైన అయోధ్య ఋషభు డను రాజు వచ్చిన తరువాత మరల నివాసస్థానము (జనులతో నిండినది) అగును. ఆయుర్వర్ధకమైనది, భవిష్యత్కథతోను ఉత్తరకథతోను కూడినది అయిన ఈ రామాయణమును ప్రచేతసుని పుత్రుడు వాల్మీకి రచించెను. దీనిని బ్రహ్మదేవుడు కూడా ఆమోదించెను. మానవుడు ఒక్క సర్గను వినినా కూడ వెయ్యి అశ్వమేధములు, పదివేల వాజపేయములు చేసిన ఫలమును పొందును. ఈ లోకములో రామాయణమును విన్నవాడు ప్రయాగాది తీర్థములకు, గంగాదినదులకు, నైమిశాద్యరణ్యములకు, కురుక్షేత్రాదులకు యాత్ర చేసినట్లే.(10-13)

సూర్యగ్రహణపుణ్యకాలమునందు కురుక్షేత్రములో పుట్టెడు బంగారము దానము చేసినవాడు, రామాయణము చదివినవాడు, ఇద్దరూ ఈ లోకములో సమానులే. మంచి శ్రద్ధతో రామకథను వినినవాడు సకల పాపములనుండి విముక్తుడై విష్ణులోకమునకు వెళ్ళును. పూర్వము వాల్మీకి రచించిన ఆర్షమైన ఈ ఆదికావ్యమును ఎల్లప్పుడు భక్తితో వినువాడు విష్ణుశరీరమును పొందును. అతని పుత్రులు, భార్యలు, సంపదలు వృద్ధిచెందును. ఈ అత్యుత్తమమైన రామాయణము గాయత్రీస్వరూపము. ఈ సత్యమును తెలిసికొని దీనిని పరిశుద్ధమైన అంతఃకరణముతో పఠించవలెను. రాముని చరిత్రమును నిత్యము భక్తిపూర్వకముగా చదువువాడు, వినువాడు కూడ పాపము లన్నీ తొలగి దీర్ఘాయుర్దాయవంతు డగును. శ్రేయస్సు పొందగోరేవాడు నిత్యము రాముణ్ణి స్మరించవలెను. ప్రతిదినమూ ఈ రామాయణమును బ్రాహ్మణులకు వినిపించవలెను.(14-21)

ఈ రామచరితమును అంతా చదువువాడు మరణానంతరము తప్పక విష్ణులోకమునకు వెళ్ళును; సంశయము లేదు. రామాయణమును పూర్తిగా చదివినవాని

తండ్రి, తాత, ముత్తాత, ముత్తాత తండ్రి, అతని తండ్రీ కూడ విష్ణువును చేరుదురు. సంశయము లేదు.(22, 23)

రాముని చరితము ధర్మార్థకామమోక్షము లను నాలుగుపురుషార్థములను ఇచ్చును. అందువలన మానవుడు నిత్యము ప్రయత్నశీలుడై శ్రేష్ఠమైన ఈ రామాయణమును ఎల్లప్పుడు చదువుచుండవలెను. రామాయణములోని ఒక శ్లోకపాదమును గాని, ఒక్క పదమునైనా గాని భక్తితో వినువాడు బ్రహ్మలోకమునకు వెళ్ళును. నిత్యము బ్రహ్మచేత పూజించబడును.(24, 25)

ఇది ఈ విధముగా పూర్వము జరిగిన ఆఖ్యానము. చదువువారికి, వినువారికి, స్మరించువారికీ కూడ మంగళము అగుగాక. "శ్రీమహావిష్ణువు బలము వృద్ధిపొందుగాక" అని ధృఢవిశ్వాసముతో చాటి చెప్పండి.(26)

**"బలం విష్ణోః ప్రవర్ధతామ్"**

**శ్రీమద్రామాయణమందలి ఉత్తరకాండలోని నూట పదకొండవ సర్గము సమాప్తము.**

# ఉత్తరకాండ సమాప్తము

**యత్కృపాలేశతోఽ ద్యాన్ధ్రాం వాల్మీకీయం వివర్తితమ్,**
**తస్యైవ జానకీజానేః పదయోరిదమర్ప్యతే.**

**దేవతానుగ్రహః పిత్రోస్తతపశ్చాచార్యసత్కృపా,**
**కర్తాస్మద్గ్రన్థజాతస్య కరణం కేవలం వయమ్.**

**శ్రీనందననామసంవత్సర మాఘ కృష్ణ షష్ఠీ. భానువాసరః:03-03-2013**

**శ్రీః శ్రీః శ్రీః**

స్నేహో మే పరమో రాజం స్త్వయి తిష్ఠతు నిత్యదా,
భక్తిశ్చ నియతా వీర భావో నాన్యత్ర గచ్ఛతు.

(ఉత్తరకాండ. సర్గ. 40. 16)

యావద్రామకథా వీర చరిష్యతి మహీతలే,
తావచ్ఛరీరే వత్స్యన్తి మమ ప్రాణా న సంశయః.

(ఉత్తరకాండ. సర్గ. 40. 17)

"రాజా! నాకు నీపై నిత్యమూ గొప్ప స్నేహము, స్థిరమైన భక్తి ఉండుగాక. నా భావము మరొకవైపు ఎటూ వెళ్ళకుండుగాక!

ఓ వీరుడా! ఈ భూలోకములో నీ చరిత్ర వ్యాప్తిలో ఉండునంతవరకూ నా శరీరములో ప్రాణములు ఉండగలవు. సందేహము లేదు."
(వానరులంతా రాముని వద్ద సెలవు తీసుకుని వెళ్ళేటప్పుడు హనుమంతుడు రామునితో అన్న మాటలివి.)

మదఙ్గే జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే,
నరః ప్రత్యుపకారాణామాపత్స్వాయాతి పాత్రతామ్.

(ఉత్తరకాండ. సర్గ. 40. 24)

"హనుమంతుడా! నీవు నాకు చేసిన ఉపకారము నా శరీరమునందే జీర్ణమైపోవుగాక! నరుడు ఆపదలు వచ్చినప్పుడే ప్రత్యుపకారమునకు తగినవాడగును." అందుచేత నీకు ఏనాటికైన ప్రత్యుపకారము చేసి నీ ఋణము తీర్చుకొనెదను అని నేను అనను అని భావము.

(హనుమంతుడితో రాముడన్న మాట ఇది.)



TLP PUBLISHERS

9 788192 771519